7వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు 2020

# గురుదక్షిణ
## (కలశపూడి కథలు)


మధుర వోణి
వెరీ ఫాస్ట్ ఫుడ్ బిస్త్రో
అరవైలో ఇరవై
మల్లిఖార్జునా మాలిక్ కపుర్
ప్రేమకి పెద్దబాల శిక్ష!
థ్యాంక్స్ టు అంబేద్కర్
ఉత్త(మ) టీచరు అవార్డు స్టూడియో
ఫెయిలయిన పిల్లలు పాస్ అయిన టీచరు
ఆడపిల్లలు నిర్భయంగా తిరిగే ఊరు
సగం కుండ
బొబ్బిలి 1876
ఒక శీత కథ
డెత్ సర్టిఫికెట్
మా ఊరి మంత్రిగారి శతకం
ఆటోమీటర్ - ఆటోమేటిక్
భార్య విద్యలో బి.ఏ.
ఖబడ్దార్ మాస్టారి శిష్యుణ్ణి
మీ ఆవిడను కొట్టరా?
పిలుపు
ఇల్లు అమ్మిపెట్టి చూడు
రుచి
సంకల్పం
హాచ్...!
అంత్యక్రియకి ఆహ్వానం
తలుపుల రసీదు
అస్తిత్వం
తైలవర్ణ (వి)చిత్రం
చెత్తకు కరువొచ్చింది
వీడియో గేమ్స్ వండర్ కిడ్స్
తీరం చెమ్మగిల్లింది





www.tana.org

www.tlca.com

సమర్పించువారు

www.tfasnj.org www.vangurifoundation.org www.bharathitheertha.org www.afhdusa.org

# గురుదక్షిణ
## (కలశపూడి కథలు)

కలశపూడి శ్రీనివాస రావు

**GURUDAKSHINA**
**(Kalasapudi Kathalu)** - *COLLECTION OF SHORT STORIES*
**KALASAPUDI SRINIVASA RAO** ©

# గురుదక్షిణ
**(కలశపూడి కథలు)**
**కలశపూడి శ్రీనివాస రావు** ©

**సాహిత్య కలశం ప్రచురణ - 8**

**ఈ-ప్రచురణ** : అక్టోబర్ - 2020

**వెల :** : **₹ 50/- $ 4.99**

డి.టి.పి. &
పేజీ కూర్పు : **ప్రఖ్య ఆర్ట్ ప్రింటర్స్ (ప్రై) లి.**

ప్రచురణ / ప్రతులకు :
**వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా** ప్రచురణ-92
మరియు
**సాహిత్య కలశం**
607, ది లేండ్‌మార్క్, కాప్రా, హైదరాబాద్ - 500 062.
ఈ-మెయిల్ : 56telugu@gmail.com
మొబైల్ +91 88864 25656 / +1 516 859 3010

ముఖ పత్రం : **ప్రఖ్య ఆర్ట్ ప్రింటర్స్ (ప్రై) లి.**

ముద్రణ :
**ప్రఖ్య ఆర్ట్ ప్రింటర్స్ (ప్రై) లి.**
1-8-724/ఎ/31, విజిటెబుల్ మార్కెట్ స్ట్రీట్,
నల్లకుంట, హైదరాబాద్ - 500 044.
సెల్ +91 98852 98329 - print@prakhyaarts.com

7వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు
2020

# కృతజ్ఞతలు

**విశ్లేషణ**

శ్రీ యర్రమనేని హర్షవర్ధన్

హైదరాబాద్.

**ఆవిష్కరణ**

డా॥ ఎ.ఎస్. రామశాస్త్రి

హైదరాబాద్.

**ప్రేరణ**

డా॥ కలశపూడి వసుంధర దేవి

న్యూయార్క్.



జన్మనిచ్చి, కన్నందుకు కష్టలకోర్చి,

ఓర్పునేర్పి, కథలు చెప్పి,

చదువు చెప్పించి, మనిషిగా చేసిన

అమ్మ శ్రీమతి కలశపూడి మహాలక్ష్మికి


నమస్కరిస్తూ....



ఆదర్శ గురువుగా
అందరిచే కొనియాడబడి
తానా వారి గురువందనంలో
గురుదక్షిణ స్వీకర్తగా గౌరవింపబడ్డ

**శ్రీ రావూరి సూర్యనారాయణ**

గారికి నమస్కరిస్తూ....



నాకు విద్యాబుద్ధులు నేర్పిన

ఎందరో గురువులకు ప్రతీకగా

**శ్రీ భళ్ళమూడి నారాయణ రావు**

గారికి నమస్కరిస్తూ...



డబ్బు విషయంలో
నాకు తొలి పాఠం నేర్పిన గురువు,
ఫస్ట్ క్లాస్ నుండి నా తోటి విద్యార్థి,
మంచి వ్యాపార దక్షతగల
శ్రీ కొత్తా సూర్య ప్రకాశరావు (రాజా)
ఆత్మకి నమస్కరిస్తూ...

# ముందుమాట

తల్లి తండ్రి కుటుంబ సభ్యులు ఇరుగు పొరుగు వారు మొదలుకుని బడిలో పాఠాలు చెప్పే అధ్యాపకులు బ్రతుకులో ప్రపంచాన్ని చూపించే ఎందరో మనిషికి గురువుతో సమానం.

ఆధునికత, అభ్యుదయం, అస్తిత్వం వంటి ఆలోచన అసమగ్ర అవగాహన, పోరాట ధోరణుల ఫలితంగా వచ్చిన అగౌరవం, అవహేళన వలన 'గురువు' కుంచించుకుపోయి పాఠాలను చదివించే ఒక యంత్రంగా మారిపోయారు.

గురువుగా తన బాధ్యతను సంతృప్తిగా నిర్వహించే అసలైన గురువులు అరుదై పోయారు.

మనం జీవితంలో బుద్ధి పరంగా అత్యంత వేగంగా ఎదిగే కాలంలో ఎక్కువ భాగం గురువుల సమక్షంలోనే జరుగుతుంది. ఆ కాలంలో గురు శిష్య సంబంధం లేని వారందరూ నా ఉద్దేశ్యంలో తెగిన గాలి పటాల్లా ఎగురుతూ ఉంటారు. తమ భవిష్యత్తుకి తెలిసీ తెలియని అనుభవం లేని పునాదులను వేసుకుంటూ మంచిదో, చెడేదో తెలుసుకోలేని స్థితిలో పెరుగుతూ అసంపూర్ణమైన మనిషిగా తనలో మరియు సమాజంలో అశాంతికి కారణమవుతూ ఇదే జీవితమని గడిపేస్తున్నారు.

అందుచేత నేటి సమాజానికి  గురువు యొక్క అవసరం ఎంత ఉంది. ఆ దిశలో అందర్నీ ఆలోచించమని, గురువుకి గురుస్థానం ఇవ్వమని కోరడానికి చేసిన ఓ చిన్న ప్రయత్నం ఈ గురుదక్షిణ!

**కలశపూడి శ్రీనివాస రావు**

**న్యూయార్క్**

**10 అక్టోబర్ 2020**

# ఈ కథలు ఎందుకు రాశాను?

ప్రతి మనిషి పుట్టుక వెనక కనీసం ఒక కథ ఉంటుంది. కథలు విని పెరుగుతాం. కథలు చదవడం మొదలుపెడతాం. కథలు చెప్పడం నేర్చుకుంటాం. కాని కథలు రాయడం కష్టం. ఎక్కువమందికి కథలు చెప్పడం ఇష్టం. తక్కువ మందికి వినడం ఇష్టం. ఇంకా తక్కువమందికి చదవడం ఇష్టం. అందుచేత కథల పుస్తకాలు తక్కువ అమ్ముడుపోతాయని నాకు తెలుసు. కుర్రా జితేంద్రబాబు గారు ఓల్గాగారి 'సంతులిత' పుస్తకావిష్కరణ సభలో చెప్పినట్టు చట్టాలు చెయ్యలేని పని సాహిత్యం చెయ్యగలదు. అందుకే ఈ కథలన్నీ ఒక సామాజిక బాధ్యతగానే వ్రాశాను. అన్ని కథలలోని పాత్రలు, సంఘటనలు సమాజం నుండి తీసుకొన్నవే. చిన్న మార్పులతో కొన్ని చేర్పులతో వాటిని కథలుగా మలిచాను. జీవితం కల్పనకన్నా రసాత్మకమైనది, భయంకరమైనది కూడా. నాకు తెలిసిన జీవితం బొబ్బిలితో మొదలై, నేను నివసించిన నగరాలు – హైదరాబాద్, పారిస్, న్యూయార్క్, నేను తిరిగిన కొన్ని దేశాలు, పరిచయమున్న ఎందరో దేశస్థుల వల్ల విస్తృతమైనదే అని అనుకుంటాను.

ప్రతి ఒక్కరికి వారివారి ప్రవృత్తి, వృత్తిని బట్టి మనుషులు పరిచయం అవుతారు. ఆ పరిచయాల సమూహమే ఆ వ్యక్తి ప్రపంచం. నేను పుట్టిన ఊరు బొబ్బిలి, భారతదేశం నుండి నేను నివసిస్తున్న ఊరు న్యూయార్క్. అమెరికా సంయుక్త రాష్ట్రాల దాకా సుమారు ఒక లక్షమందితో ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కానీ పరిచయం ఉంది. వీరు ప్రపంచానికి తూర్పున ఆస్ట్రేలియాలో ఉన్న కార్లీన్ రీవ్ నుండి పడమరన కాలిఫోర్నియాలో కూచిభొట్ల ఆనంద్‌గారి దాక, ఉత్తరాన కీవ్, రష్యా నుండి వచ్చిన పెడ్రో వార్మన్ నుండి ప్రపంచంలో అత్యంత దక్షిణాన ఉన్న ఉష్వాయిలో కలిసిన స్తెఫానీ సాంచేజ్ దాక ఉన్నారు. వీరిలో తమ రాత, చేత, మాట ద్వారా నన్ను ఏదో ఒక విధంగా ఎంతో కొంత నా మాట, చేత రాతని ప్రభావితం చేసినవారు చాలామందే ఉన్నారు. వీరు నా ప్రపంచం.

నన్ను 'గాంధి (మోహన్‌దాస్ కరం చంద్) అన్నవారి నుండి, చంపుతాం' అన్నవారి వరకు ఉన్న కొన్ని వేలమంది నా ఆలోచనల్ని సుసంపన్నం చేశారు. అందువల్లే నేను కథలు రాయగలిగాను. నేను రాయలేకపోయిన కథలు ఇంకా చాలా చాలా ఉన్నాయి. ఈ కథలన్నీ మనిషి, మనిషి భవిష్యత్తు ఇంకా బాగుండాలన్న ఆశతో వ్రాసినవే.

ఇంద్రగంటి శ్రీకాంతశర్మ నా నవల 'తూర్పు బడి పడమర గుడి' 1997 ఆంధ్రప్రభ దీపావళి సంచికలో ప్రచురించారు. దానికి వచ్చిన స్పందన వలన అమెరికాలోనే కాదు ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రచురించాలన్న ఆలోచన వచ్చింది. వివిధ పత్రికల్లో నా కథలు 1999 నుండి ప్రచురితమవుతున్నాయి. ఆరేళ్ళ కిందటే ఆచార్య తిరుమల రావు ఈ సంకలనానికి సంకల్పించినా అప్పుడే ఎందుకు ప్రచురించాలన్న ప్రశ్నకి సరియైన జవాబు దొరకక ప్రచురించలేదు. కానీ కథల మాష్టారు, కథానిలయం వ్యవస్థాపకులు అయిన కాళీపట్నం రామారావు గారి 90వ జన్మదిన వేడుకలో ఆయనపై వున్న గౌరవానికి చిహ్నంగా ఈ కలశపూడి కథల పుస్తకాన్ని ఒక సమష్టి కృషిగా ప్రచురిస్తున్నాం.

## ఎవరి వల్ల రాశాను?

చిన్నప్పుడు కథలు చెప్పిన అమ్మ కలశపూడి మహాలక్ష్మి, చెప్పమని అడిగి మరీమరీ చెప్పించుకున్న పిల్లలు భారతి, లక్ష్మణ్, చెప్పడం కాదు వ్రాయమన్న వాళ్ళ అమ్మ కలశపూడి వసుంధర – నేను కథలు రాయడానికి కారకులు.

మొదట్లో నా కథలని విమర్శించి, ప్రచురించి ప్రోత్సహించిన వారిలో ముఖ్యులు కిడంబి రఘునాథ్, వంగూరి చిట్టెన్ రాజు, పెమ్మరాజు వేణుగోపాల రావు, మురళి చందూరి, కిరణ్ ప్రభ, వెల్చేరు నారాయణ రావు, వేమూరి రామనాథం, వేమూరి వెంకటేశ్వర రావు, వేలూరి వెంకటేశ్వర రావు, జంపాల చౌదరి, చెరుకుపల్లి నెహ్రూ, చిట్టి రామకృష్ణమూర్తి, ఎం.వి.ఆర్ శాస్త్రి, రచన

*శాయి గార్లు, 'ఈ మాట', 'సుజన రంజని', 'కౌముది' సంపాదకులు, తానా ఆట సావనీర్ సంపాదకులు, ఆ తరువాయి తెలుగునాట వివిధ పత్రికా సంపాదకులు.*

*కథలని సానపట్టిన స్వర్ణకారులు ఆచార్య జయధీర్ తిరుమల రావు, యర్రంనేని హర్షవర్ధన రావు, అనపర్తి పద్మావతి, మొసలికంటి మల్లిక, వేదుల బాలకామేశ్వరి గార్లు. వీరు ఈ కథలలోని ఆలోచన నుండి అక్షరం దాకా ప్రతీ చిన్న విషయాన్ని వివిధ కోణాలలో పరిశీలించి మెరుగు పెట్టారు.*

*వీరందరికి కృతజ్ఞతలు.*

***ఎవరి కోసం రాశాను?***

*మీ కోసం!*

***కలశపూడి శ్రీనివాస రావు***

న్యూయార్క్

10 అక్టోబర్ 2020

# జీవధారలో తడుస్తూ...

కలశపూడి శ్రీనివాస రావు గారి రచనలు చదివినవారికి దూరాన వున్నదేదో దగ్గరవుతున్నదన్న భావన కలుగుతుంది. బహుశా దూరతీరాల వెంట తిరుగాడే వారికి గాలి, నీరు, వెలుగు, వెన్నెల వంటి ప్రకృతి శక్తులన్నీ తమ వాహికలో, మాధ్యమాలో అనిపిస్తాయేమో! ఫలితంగా కాళిదాసుకు ఒక మేఘం, జాషువాకు ఒక గబ్బిలం రాయబారాలు చేస్తే, ప్రవాస భారతీయులకు ప్రకృతి శక్తులన్నీ సొంత నేలవైపు సాగిపోతున్న దూతలై, తిరుగు ప్రయాణంలో అక్కడి అనుభవాలు మోసుకొస్తున్న గాథలౌతాయి. వారికి ఒక ఎడబాటు భావన వుంటుంది. అందునా కవి హృదయం వున్నవారిలో మరికొంత ఎక్కువ ఉంటుంది.

కలశపూడి శ్రీనివాస రావు గారి రచనలలో మనకు కనిపించేది తన దేశం పట్ల, తన వూరిపట్ల రచయితకున్న నిసర్గమైన అభిమానం. ఇది సంఘ సంస్కరణ భావాల రూపంలో కూడా మనకు దర్శనమిస్తుంది. ఆచరణాత్మకతకు ఆమడ దూరంలో వుండే ఆదర్శాలతో శ్రీనివాసరావు గారికి పనిలేదు. ఉదాహరణకు 'ఆటోమీటర్ – ఆటోమేటిక్' అన్న కథ చూడండి. హైదరాబాద్‌లో ఆటోలో ప్రయాణం చెయ్యాలంటే, మీటర్ చూపించే చార్జికన్నా కొంత అదనంగా ఇవ్వాలి. ఈ సమస్యకు పరిష్కారం కనుగొనే ఉద్దేశంలో విశ్వం అన్న స్టాటిస్టిక్స్ లెక్చరర్ శాస్త్రీయ అవగాహనతో, తన విద్యార్థుల సహాయంతో ఒక ప్రాజెక్టు చేపడతాడు. దీని ఫలితంగా డ్రైవర్లలో మార్పు వస్తుంది. ప్రయాణికుల సమస్య పరిష్కారమవుతుంది. ఈ కథకు కథానాయకుడి నాయకత్వ లక్షణం జీవశక్తి. దీన్ని వెలికితీయడంలో రచయిత కృతార్థుడైనాడని చెప్పవచ్చు.

'మీ ఆవిడను కొట్టరా?' అన్న కథ నాలుగు తరాల స్త్రీల దైన్యాన్ని కథనం చేస్తుంది. జానకమ్మ, ఆమె కోడలు కోమల, వెనుక రెండు తరాలలోని వారు తమతమ భర్తల మూలంగా మాటల పరంగా, మానసికంగా, దైహికంగా హింసను అనుభవించినవాళ్ళే. భావుకుడైన రచయిత దాన్ని తీవ్రమైన విషయంగానే

పరిగణిస్తాడు. అతనిలోని ఈ ప్రతి చర్యను గమనించిన జానకమ్మ అతని కాళ్ళమీద పడి 'తన కొడుక్కి బదులు తనను జైల్లో పెట్టించమని కోరుతుంది'. ఇట్లాంటి ఫలితం రాబట్టడం కథకుడుగా శ్రీనివాస రావుగారు సాధించిన సాఫల్యం. 'మీ ఆవిడను కొట్టరా?' అన్న ప్రశ్నకు సంబంధించి తనలో చెలరేగుతున్న కల్లోలాన్ని రచయిత మనలోకి బదలాయిస్తాడు. దీంతో కథ ముగిసినా, దాని ప్రభావం పాఠకుల మీద పనిచేస్తూనే వుంటుంది.

'తైలవర్ణ (వి)చిత్రం' అన్న కథానిక వర్ణవివక్షను ఒక వర్ణచిత్రం జయించిన ఉదంతం. ఇది పైకి సరదాగా ఉన్నా కళకు వున్న శక్తిని నిరూపించే కథానిక.

ఈ కథానికల్లో ఒక ప్రత్యేకతను సంతరించుకున్నది. 'బొబ్బిలి 1876'. కథానిక ఇలాగే సాగుతుందని భావిస్తున్న పాఠకులు – ఇది కేవలం రచయిత కల అని తెలుసుకోవటంతో, ఒక చారిత్రక ఘట్టం నుంచి వాస్తవికతలోకి – బలవంతంగా – వస్తారు. నిజానికి దీన్ని ఆద్యంతం చారిత్రక కథానికగానే మలిచివుంటే బాగుండేది.

చిన్న కథలో ఒక ప్రధాన సంఘటన, ఒక ముఖ్యమైన అంశం, పరిమితమైన పాత్రలు వుండాలని విమర్శకులు చెప్తారు. ఎంత చిన్న కథ అయినా, అది పూర్తయిన తర్వాత మరేమీ చెప్పవలసింది మిగలలేదన్న భావన పాఠకులకు కలగాలంటారు. దీన్నే సమగ్రత అనీ అనవచ్చు. వీటన్నింటి ఫలితంగా అనుభూతి కూడా కలిగితే అది మరింత మంచికథ అవుతుంది. పై కథలలో ఇవన్నీ కొద్దిపాటి తేడాలతో వున్నాయి.

'నా నృషి కురుతే కావ్యం' అన్నారు అలంకారికులు. అంటే రుషి కానివాడు కావ్యం రాయలేడన్నది వాళ్ళ విశ్వాసం. రుషి కానివాడు సమసమాజ కావ్యాన్ని రచించలేడన్నది శ్రీనివాస రావుగారి విశ్వాసం. విశ్వాసం మాత్రమే కాదు, ఆయన సంకల్పం కూడా అదే. అందుకే ఉద్యమకారుల బాటలో నడుస్తూ శ్రీనివాస రావుగారు మరెన్నో సత్ఫలితాలు సాధించాలని ఆశిస్తున్నాను.

**– డా. అమ్మంగి వేణుగోపాల్**

# సజావైన సంగమం

కథ చెప్పే విద్య అందరికీ పట్టుబడదు. చాలామంది సమకాలిక (ప్రస్తుత) తెలుగుకథకులు కొన్ని ఇతివృత్తాలతో ఇరుక్కుని ఒక పరిధిలోనే తిరుగుతున్నారని – నా పఠనానుభవం.

రాజకీయ / సామాజిక అంశాలనుంచి ఏదేశ పౌరుడు తప్పించుకుపోలేడని ఒక భౌతిక వాస్తవం. సాహిత్యమనేది సాంస్కృతిక కళ. భౌతిక వాస్తవాల్ని ఏకరువు పెడితే – అవి వార్తలు అవుతాయి. అవి కల్పించే మానసిక సంకల్ప వికల్పాల వెలుగునీడల్ని తెలివిగా నిపుణంగా చెపితే అప్పుడు సాహిత్య ప్రయోజనం నెరవేరినట్టు.

కలశపూడి శ్రీనివాస రావు గారి వ్యక్తిత్వంలోని భౌతిక క్రమశిక్షణ, ఆయన ఆలోచనల క్రమశిక్షణ అని నాకర్థమైంది. ఈ క్రమశిక్షణకు అవసరమైన చదువు, లోకపరిశీలనం, పుష్కలంగా గల వ్యక్తి శ్రీనివాస రావు గారు. అదనంగా అత్యవసరంగా, అలవోకగా అబ్బిన విద్య కథన నైపుణ్యం. తెలియడం ఒక యెత్తు. తెలియజెప్పడం ఒక యెత్తు. ఈ రెండింటి సజావైన సంగమం యీ కథల్లో ఇమిడడం విశేషం.

1876 నాటి బొబ్బిలి ఉదంతం చెప్పినా, 'డెత్ సర్టిఫికెట్'లో విషాదా నందాన్ని పిండినా, 'ఖబద్దార్ మాస్టారు శిష్యుణ్ణి' కథలో నాటు తెలుగు రాజకీయాల పునాదుల్ని సమీక్షించినా, ఆటోమీటర్ సక్రమంగా నడిపితే కలిగే లాభం వివరించినా, చివరి కథలో 'అస్థి నిమజ్జన' విషాదం నుంచి మానవీయస్పర్శతో కంటతడి పెట్టించినా, 'పిలుపు' కథలో సందేశ చ్ఛాయలు ప్రసరించినా, శ్రీనివాస రావు గారు సృజనాత్మక కథా రచయితకు విధిగా కావలసిన కథన నైపుణ్యం అప్రయత్నంగా చూపించారు.

శ్రీనివాస రావు గారి మాటల్లో తరుచు సామాజికాంశాల అవకతవకల్ని సరిదిద్దాలనే సందేశస్వామ్యం గాఢంగా తొంగిచూస్తుంది. అయితే – ఆయన వాక్యాల నిగ్రహం, ఆ ఉత్సాహాన్ని ఎంతలో ఉంచాలో అంతలోనే నియంత్రిస్తుంది.

కవిత్వమంటే కథ, నవల; వాటికంటె వ్యాసప్రక్రియ, రచయిత ఉద్దేశాలను బహిరంగంగా బలంగా చెప్పగలవనేది నిర్వివాదం. దేన్ని చెప్పడానికి ఒక రచయిత ఏ ప్రక్రియ ఎంచుకుంటాడనేదే సూక్ష్మమైన సాంస్కృతిక విజ్ఞత.

కలశపూడి శ్రీనివాస రావు గారి కథా రచనల్లో యీ విజ్ఞత సర్వదా అభినందనీయం. ఆయన చేపట్టిన కథనశిల్పం సహజసుందరం.

*– ఇంద్రగంటి శ్రీకాంతశర్మ*

# కథ - వ్యక్తిత్వం

రచయితలకూ రచనలకూ మధ్య సాపత్యం ఉంటుందా? కథల్ని చూసి కథకుడి గుణగణాల్నీ, కథకుణ్ణి చూసి కథ స్వభావాన్నీ అంచనా వేయగలమా?

కలశపూడి శ్రీనివాసరావుగార్ని ఎరిగినవారు, ఆయన కథలని చదవినప్పుడు ఈ ప్రశ్నలకు ఔను అని మాత్రమే జవాబు చెప్పగలరు. శ్రీనివాసరావుగారి కథలు ఆయనలాగే ఉన్నాయి అనిపిస్తుంది. తెలుగన్నా, తెలుగు జనాలన్నా, తెలుగు నేలన్నా ఆయనకున్న ప్రేమ ప్రతి కథలోనూ కనిపిస్తుంది. ప్రజలకు మంచిచేసేవారిపట్ల ఆయన పెంచుకునే ఆత్మీయబంధం, చెడు చేసేవారి మీద అయనకుండే కోపం ఆయన కథల్లో ప్రతిఫలిస్తాయి. తోటిమనుషుల్లో ఉండే నంగరిపింగరితనం మీద ఆయనకుండే చిరాకు, ఆ చిరాకును వ్యక్తం చేయటంలో ఆయనకున్న నిర్మొహమోటం, నిష్కాపట్యం, సమస్యలని పరిష్కరించాలనే ఆరాటం, అసహనం, తనకు మాలిన ధర్మాన్ని నిస్సంకోచంగా, నిరుపేక్షంగా చేయగల తెగింపు కూడా ఈ కథల్లో కనిపిస్తాయి. ఎప్పుడూ నవ్వుతూ ఉండగల నిర్మాలిన్యం, జీవితాన్ని రెండు చేతులా ఆస్వాదించగల ఉత్సాహం, కొంటెతనం కూడా ఈ కథల్లో కనిపిస్తాయి.

తనకు మాలిన మంచిపనులు చేయటానికి వెనుకాడని మంచిమనుషులు ఈ కథల్లో కనిపించడంలో ఆశ్చర్యమేమీ లేదు. స్వంత కుటుంబంలో మనుషులు అనేక కారణాలు చెప్పి వెనక్కితగ్గినా, మరణించిన స్నేహితుడి అస్తికలు అమెరికానుంచి తీసుకు వెళ్ళి గోదావరిలో నిమజ్జనం చేయటానికి ముందుకొచ్చిన సూర్యం (తీరం చెమ్మగిల్లింది). అవినీతిపరులైన ఎమ్మెల్యేలనీ, మంత్రులనీ ఎదిరించి ఆత్మస్థైర్యంతో సమాజం మెప్పుపొంది బ్రతికిన బడిపంతుళ్ళు (మావురి మంత్రిగారి శతకం, ఖబడ్దార్ మాష్టారి శిష్యణ్ణి, అంత్యక్రియకి ఆహ్వానం) ఈ కథల్లో ఉండటం యాదృచ్ఛికం కాదు. మనుషుల్లోమంచివాళ్ళుంటారని, ఆ మంచి మనుషులు మిగతా సమాజాన్ని మంచి దిశగా నడిపించగలరని నమ్మే మనిషి ఈ రచయిత. సమాజంలో సమస్యలకు పరిష్కారాలు ఉన్నాయని, కొద్దిగా కొత్తగా ఆలోచిస్తే ఆ పరిష్కారాలు కనుక్కోవచ్చని, చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే మంచి ఫలితాలు

సాధించవచ్చని ఈ రచయిత నమ్మకం. అలాంటి నమ్మకంలోంచే 'ఆటోమీటర్ – ఆటోమేటిక్కూ', చెత్తకు కరువొచ్చింది లాంటి కథలు వచ్చాయి. లంచగొండితనం వంటి విషయాలపై ఆయనకున్న కోపం 'డెత్ సర్టిఫికెట్' వంటి కథలు వ్రాయించింది. తోటి మనిషికి అవసరమైన సహాయం చేయటానికి ముందు వెనుకలు ఆలోచించననితనం, తగిన సాయం ఉంటే మట్టిలోంచి మాణిక్యాలు వస్తాయన్న నమ్మకం 'తైలవర్ణ (వి)చిత్రం', 'రుచి', 'సంకల్పం' కథల్లో కనిపిస్తుంది. పుట్టిపెరిగిన ప్రాంతాలమీద ఉన్న ప్రేమ, 'బొబ్బిలి 1876' వంటి కథలు వ్రాయిస్తుంది.

ఈ సంకలనంలో ఉన్న కథలలో ప్రత్యేకంగా చెప్పుకోవలసిన కథ – 'మీ ఆవిడను కొట్టరా?' తరతరాలుగా గృహహింస పట్ల, లింగవివక్ష పట్ల మన ఆలోచనావిధానంలో పాతుకుపోయి, మన సంస్కృతిలో భాగమైన అన్యాయపు ధోరణిని, ఆ హింసకు బలిఐనా, దానిని ప్రశ్నించాలన్న ఆలోచనలేని జానకమ్మ ద్వారా రచయిత చెప్పించిన విధం బాగుంది. వస్తుపరంగా, శైలీపరంగా మంచి కథ.

నాకు తెలిసిన శ్రీనివాసరావుగారి వ్యక్తిత్వానికి పొసగని విషయం ఒకటి నాకు ఈ కథల్లో కనిపించటం కూడా ప్రస్తావించాలి. చాలా కథల్లో, మంచి వర్ణనలు కనిపిస్తాయి. ఏ ఉత్తరాంధ్ర రచయిత ప్రభావమో మరి.

శ్రీనివాసరావుగారు ఈ కథలే కాక తూర్పు బడి–పడమర గుడి అనే నవలతో పాటు, మరిన్ని కథలు కూడా వ్రాశారు. ఏ కారణం చేతో ఆయన మొదటిలోజుల్లో రాసిన కథలు కొన్ని ఈ సంకలనంలో లేవు. 1999 తర్వాత వ్రాసిన కథలను మాత్రమే ఎంపిక చేసినట్టున్నారు.

మంచి మనిషి, మంచి మిత్రుల కలశపూడి శ్రీనివాసరావుగారికి అభినందనలతో...

– ***జంపాల చౌదరి,*** మండలైన్

నవంబరు 3, 2014

# అనుభవజ్ఞుల అభిప్రాయాలు

అమెరికాలో మంచి కథకులు చెప్పుకోదగ్గ సంఖ్యలోనే ఉన్నారు. కాని, ఊహించని ఇతి వృత్తాలను ఎన్నుకునే చతురతలోనూ, కథ ఎత్తుగడ, కథ అల్లడం, మాటల పొందిక, ఆఖరికి ముగింపులోనూ కలశపూడి వారి ప్రజ్ఞా పాటవాలు అన్నీ ఒక ఎత్తైతే, కథకి సరిగ్గా అతుక్కునే పేరు ఎలా పెట్టాలో ఆయనకే తెలిసిన అమెరికా రహస్యం. ఈ సంపుటిలో ఏ కథ చదివినా ఇంకోసారి చదవాలనిపిస్తుంది. అందుకే ఆయన మేము నిర్వహించిన ఉత్తమ రచనల పోటీలలో బహుమతులు గెల్చుకున్నారు.

**– *వంగూరి చిట్టెన్ రాజు,*** హ్యూస్టన్

భిన్నమైన వస్తు సంపద కలిగిన కలశపూడి కథలు – హాస్యంతో మొదలై, కళ్ళు చెమ్మగిల్లే కథనంతో ముగుస్తాయి. సామాజిక సమస్యలకు చదివించే సొగసును నింపి, ఆలోచింపజేసే పరిష్కారాల్ని 'ఆటోమేటిక్'గా అందించడం – ఈ కథల్లో దాగిన నైపుణ్యం. 'చెత్తకు కరువొచ్చింది' అని ఆశ్చర్యపడే సమయంలో.. వైద్యులు పునరాలోచనలో పడాల్సిన 'పిలుపు' కూడా వినిపిస్తుంది. 'సంకల్పం' వుంటే ఏదైనా సాధ్యమేనని చాటే ఈ కథలన్నీ చదివిస్తాయే తప్ప, ఏ ఒక్కటీ 'శీత'గా అనిపించదు.

**– *శశిమోహన్,*** హైదరాబాద్

భార్య విద్యలో బి.ఎ. నేటి వ్యవస్థని నవ్యంగా విశ్లేషించిన – అత్యుత్తమ వ్యంగ్య కథ. కథనం ఆసక్తికరం, అద్భుతం.

**– *వసుంధర,*** హైదరాబాద్

కథలు చాలా సున్నితంగా, సూటిగా, చక్కగా ఆలోచించేలా రచించారు.

**– *రాయసం ప్రసన్న,*** హైదరాబాదు

మన చుట్టూ జరుగుతున్న విషయాలు, మనకి తెలిసిన పాత్రలు, వారి మధ్య సంభాషణలు, తనదైన శైలిలో సమస్యలకి పరిష్కారాలు, హాస్యం, చతురత, వ్యంగ్యం....వెరసి సమాజంపై అపార ప్రేమ, పరిస్థితులని చక్కదిద్దాలన్న తపన, ఈ కథలలో మెండుగా కనిపిస్తాయి. ఈ కథలు మొత్తానికి మన సమాజాన్ని అద్దంలో చూపించే ప్రయత్నం.

– ***వసంతలక్ష్మి,*** కువైట్ సిటి

కొత్త పెళ్ళి కూతురి కథైన, చారిత్రక కథైన కథనంలోని కళ, కళకళలాడుతు కదలనివ్వని పట్టుతో చదివిస్తాయి ఈ కథలు.

– ***మహేంద్రవాడ అన్నపూర్ణ,*** పారిస్

కథలు చక్కటి తెలుగుతనాన్ని, వైవిధ్యాన్ని అందిస్తూ హృదయానికి హత్తుకునేలా సాగాయి.

– ***డా. పి.వి. సుబ్బారావు,*** లండన్

పరిశీలనా ధృక్పథంతో ఈ కథలలలో మన చుట్టు జరుగుతున్న విషయాలకు అక్షర రూపం కలిగించారు. ఒక కథలో హిస్టరి మాష్టరు కథానాయకుడైతే, ఇంకొక కథలో స్టాటిస్టిక్స్ మాష్టర్ కథానాయకుడు. మాష్టర్లు పాఠాలు చెప్పడం మాత్రమే కాదు, సమాజాన్ని మార్చగలరు కూడ అని చూపించారు.

– ***వెంకట్ నిమ్మగడ్డ,*** దారుసాలేమ్, టాంజానియా

'సంకల్పం' చదివి నేను చాలా కలవరపడ్డాను. చాలా పకడ్బందీగా చెప్పిన ఈ కథలో శ్రీనివాసరావు గారు పైకి కనిపించేలా ఏర్పాటు చేసిన కథాచక్రంలో ఇరుక్కుపోకుండా పాఠకులు బయటికి రావడానికి కథలోనే ఇంకో దారివుంది. పాఠకులు దాన్ని గమనించకపోతే ఈ కథలో పడి కొట్టుకుపోతారు.

– ***వెల్చేరు నారాయణ రావు,*** అట్లాంటా

# కథల వరస


| | | |
|---|---|---|
| 1. | మధుర వోణి | 1 |
| 2. | వెరీ ఫాస్ట్ ఫుడ్ బిస్త్రో | 9 |
| 3. | అరవైలో ఇరవై | 17 |
| 4. | మల్లిఖార్జునా మాలిక్ కఫుర్ | 21 |
| 5. | ప్రేమకి పెద్దబాల శిక్ష ! | 30 |
| 6. | థ్యాంక్స్ టు అంబేద్కర్ | 58 |
| 7. | ఉత్త(మ) టీచరు అవార్డు స్టూడియో | 66 |
| 8. | ఫెయిలయిన పిల్లలు పాస్ అయిన టీచరు | 71 |
| 9. | ఆడపిల్లలు నిర్భయంగా తిరిగే ఊరు | 83 |
| 10. | సగం కుండ | 92 |
| 11. | బొబ్బిలి 1876 | 103 |
| 12. | ఒక శీత కథ | 116 |
| 13. | డెత్ సర్టిఫికెట్ | 126 |
| 14. | మా ఊరి మంత్రిగారి శతకం | 139 |
| 15. | ఆటోమీటర్ – ఆటోమేటిక్ | 152 |
| 16. | భార్య విద్యలో బి.ఏ. | 162 |
| 17. | ఖబడ్దార్ మాష్టారి శిష్యుణ్ణి | 173 |

| | | |
|---|---|---|
| 18. | మీ ఆవిడను కొట్టరా? | 182 |
| 19. | పిలుపు | 191 |
| 20. | ఇల్లు అమ్మిపెట్టి చూడు | 206 |
| 21. | రుచి | 214 |
| 22. | సంకల్పం | 229 |
| 23. | హాచ్....! | 244 |
| 24. | అంత్యక్రియకి ఆహ్వానం | 251 |
| 25. | తలుపుల రసీదు | 259 |
| 26. | అస్తిత్వం | 265 |
| 27. | తైలవర్ణ (వి)చిత్రం | 271 |
| 28. | చెత్తకు కరువొచ్చింది | 275 |
| 29. | వీడియో గేమ్స్ వండర్ కిడ్స్ | 280 |
| 30. | తీరం చెమ్మగిల్లింది | 291 |

# మధుర వోణి

"మనుమరాలికి కానుక ఇవ్వాలని ఎవరికి ఉండదు? ఉంటుంది. అందరికీ ఉంటుంది. నాకూ ఉంది. పుట్టబోయే ఆ పిల్లకి ఇచ్చే కానుక గురించి, పెట్టే పేరు గురించి వాళ్ళ తల్లితండ్రుల నుంచి చుట్టాలు, బంధువులు, ఆత్మీయులు, గాఢ మిత్రుల వరకూ అందరికీ ఎవరి ఆలోచనలు వారికి ఉన్నాయి. నాకు మాత్రం ఇచ్చే కానుక గురించే ఆలోచన. మా అమ్మమ్మ 1900 సంవత్సరంలో పుట్టింది. నా మనుమరాలు 2020లో పుడుతుంది. నా మానవ సంబంధాల కాల విస్తీర్ణం ఇప్పటికి 120 సంవత్సరాలు. అమెరికాలో నేడు పుట్టే ఆడపిల్లలు 100 ఏళ్ళు బ్రతుకుతారని శాస్త్రజ్ఞుల అంచనా. పుట్టబోయే నా మనుమరాలు 100 ఏళ్ళు బ్రతుకుతుంది. ఆమె ఆలోచనలలో మా జ్ఞాపకాలు అన్నాళ్ళు బ్రతికి ఉంటాయి. ఈమె పుట్టుకతో నా మానవ సంబంధ కాల విస్తీర్ణం మరో వందేళ్ళు పెరుగుతుంది. నాలోని ఒక అంశని తరవాతి తరాలకి అందిస్తుంది. అందుచేత ఇచ్చే కానుక అంత ముఖ్యమైనది కావాలనిపించింది. మా అమ్మమ్మ నన్ను ఎంత ముద్దు చేసేదో అంత ముద్దు చెయ్యాలి. అంతకన్నా ఎక్కువే ముద్దుచెయ్యాలి.

అహంకారం కొద్దీ అలా అంటాం కానీ ప్రేమించడం, ముద్దు చెయ్యడం లాంటివి వాటికవే సంపూర్ణాలు. అవి మనసుని ఆశ్రయించి ఉంటాయి. భౌతికమైన వాటికే చిన్న, పెద్ద, తక్కువ, ఎక్కువ కానీ, అభౌతికమైన వాటికి అవి వర్తించవు. కానీ అభౌతికమైన వాటిని అందిచేవి భౌతికమైనవే. వాటినే కానుకలు అంటాం.

మానసిక పరిపక్వం వచ్చేదాకా మనిషికి మనిషికి మధ్య ఉండే సంబంధాలలో ఈ కానుకల పాత్ర ఉంటుంది. పొత్తిళ్ళలో పాపాయి దగ్గర నుండి పెద్దైన అమ్మాయి దాకా దానికి కావలసిన ముచ్చట నిచ్చే ఒక కానుక ఇవ్వాలి.

అమ్మమ్మని గుర్తుకు తెచ్చే తమ్మెట్లు, మంగళసూత్రాలు, పంచలోహపాత్ర, పూజసామగ్రి, వెండి గ్లాసులాంటి ఎన్నో వస్తువులు గుర్తుకు తెచ్చుకున్నాను. మరచిపోతున్న అమ్మమ్మ జ్ఞాపకాలని తరచి తరచి చూసేలా చేసింది పుట్టబోయే పిల్ల తనదైన జ్ఞాపకాల తొలి బీజం నాలో నాతోనే నాటిస్తూ. సృష్టిలో నాకు ప్రతిదీ ఎంతో వింత. పెరిగే మొక్క చూస్తే వింత, ఎగిరే పక్షిని చూస్తే వింత, మెరిసే మెరుపుని చూస్తే వింత, కురిసే వానని చూస్తే వింత, చక్కిలిగింతలు పెట్టే చినుకు స్పర్శ వింత. ఇలా ప్రకృతిని చూసి పులకించే నాకు తిరిగి రాలేని చోటికి వెళ్ళిపోయిన అమ్మమ్మ జ్ఞాపకాలని రాబోయే మనుమరాలు రప్పించడం ఒక వింత ఆనందాన్ని కలిగించింది. మనిషి మాత్రమే ఇటువంటి ఆనందాలని పొందగలడేమో కదా! డబ్బుతో కొనలేని ఈ ఆనందంలో మునిగితేలుతూ ఉండగానే కొన్ని రోజులు గడిచాయి. పుట్టబోయే పిల్లకి ఏ కానుక ఇవ్వాలో నిశ్చయించలేకపోయాను. ఆలోచిస్తూనే ఉన్నాను. ఆ ఆలోచనల అలలపై తేలుతూ ఆనందపుటంచులని తాకుతూనే ఉన్నాను. ఎవ్వరూ ఇవ్వనిది, ఊహించలేనిది, ప్రత్యేకమైనది, ఇచ్చే నాకు, తీసుకొనే మనుమరాలికి ఆనందాన్ని ఇచ్చే కానుక ఏమై ఉంటుందా అని ఆలోచించాను. ఏమీ తోచలేదు. ముందుకు వెళ్ళడానికి మార్గం తోచకపోతే ఆలోచనలను ఆపి, ఉదయాన్నే వచ్చే మొదటి ఆలోచనని ఆచరించమని సలహా ఇచ్చిన డాక్టర్ రామచంద్ర దాస్ మాట గుర్తుకి వచ్చింది ఒకరోజు.

ఉదయాన్నే లేచీ, లేవని స్థితిలో, కలో నిజమో తెలియని అవస్థలో అమ్మమ్మ వోణీలో కనిపించింది. 'అమ్మమ్మా!' అని పిలిచాను. కళ్ళు విప్పిచూశాను. 2016 కొత్త కేలండరులో ముద్ద నందివర్ధనాలు పూచిన కొమ్మలా మంచుతో కప్పబడి ఉన్న చెట్టు ఫక్కుమని నవ్వుతున్న దృశ్యం. ఆశ్చర్యం. నేను పుట్టేసరికి అమ్మమ్మ

వయస్సు 50 ఏళ్ళు దాటిపోయాయి. అందుచేత చీరలోనే కానీ అమ్మమ్మని మరోలా ఊహించుకోలేను. కానీ మరి 'వోణీలో అమ్మమ్మ' నా ఊహల్లోకి ఎలా వచ్చింది? స్మృతికి అందని కోరికలని, ఊహలని, ఆశలని చూపించే రంగస్థలం కాబోలు కల. విభిన్నమైన ఊహల అనూహ్య మిశ్రమమే కాబోలు కల. అమ్మమ్మ చూపిన ప్రేమని మనసు లోపలి పొరలలో ఎక్కడో దాచింది కాబోలు. ఈ రెండు ప్రేమలు ఒక కోవకి చెందినవి కాబోలు. నాకు మనుమరాలిపై కలిగిన ప్రేమ దానితో అనుసంధానమైంది కాబోలు. దాని ప్రతిధ్వనే ఈ కల కాబోలు. భూత, వర్తమాన, భవిష్యత్‌ల విచిత్రమైన చిత్రం కాబోలు ఈ కల. ఒక మంచి వోణి ఎంచి కొనాలి. ఆ వోణిలో నా మనుమరాలిని చూడాలి. కలలో చూసిన చిత్రాన్ని సాక్షాత్కారం చేసుకోవాలి అని నిశ్చయించుకుని మంచం దిగాను.

పుట్టబోయే పిల్లకి వోణి కానుకగా ఇస్తాను అంటే అందరూ నవ్వారు. అమ్మమ్మ వోణి కల గురించి చెప్పాను. చిన్నప్పుడే పెళ్లైపోయిన అమ్మమ్మ వోణీలు కట్టి ఉండకపోవచ్చు. అమెరికాలో పుట్టి, అమెరికాలో పెరిగే ఆడపిల్ల వోణీలు వేసుకోకపోవచ్చు. అయినా కాకపోయినా, వోణీలో కొత్తదనమేముంది అన్నారు. కాని పైరు పొలాల పచ్చదనం లంగా, జాకెట్టుగా, పేదరాసి పెద్దమ్మ ఆకాశంలో ఆరబోసిన కుంకం రంగులాంటి ఎర్రని ఎరుపు వోణి నా కళ్ళముందు కనిపిస్తుంటే ఇంకో కానుక గురించి ఏలా ఆలోచించగలను?

మావూరు ఫోను చేసి మా చుట్టాలమ్మాయికి వోణి విషయం వివరించి ఒక వోణి కొనమన్నాను. ఆమె ఫక్కున నవ్వి నీ పిచ్చి కానీ, ఆడపిల్లలంతా చూడిదార్లు, పేంట్లు, జీన్సుపేంట్లు, చిరిగిన జీన్స్, కన్నాలున్న జీన్స్, మరీ అభ్యుదయులైన వాళ్లైతే 'నా వళ్ళు నా ఇష్టం' అని నిక్కర్లు వేసుకొని వంటిని పచ్చబొట్లతో కప్పుకుంటున్నారు. అయ్యో, అలా చెయ్యలేకపోతున్నామనుకునే మధ్య వయసున్న ఆడ వాళ్ళు హాఫ్‌సారీ అని పార్టీలకి వేసుకుంటున్నారు. నీ మనుమరాలిని బ్రతిమాలి కట్టించినా అది పురావస్తుశాలలోని నమూనాగా ఉంటుంది. పారిస్ గీరిస్‌లాంటి ఊర్లు తిరుగుతావు. అక్కడ మంచి మంచి

లేటెస్ట్ ఫేషన్ బట్టలుంటాయి అవి కొను. అని నా అభిమతాన్ని మార్చడానికి ఇంటికొచ్చి, తలుపుకొట్టి, బైబిల్ చేతిలో పెట్టి, భయపెట్టి, మతం మార్చుకోమన్న జహోవా విట్నేస్స్ వాళ్ళలా పట్టుదలతో చెప్పుకొచ్చింది.

అంతా విని, నిజమే కానీ, వోణీ కొనాలని పట్టుపట్టాను. అది కూడా బత్తుల తవిటయ్య మనవల దగ్గరే కొనాలన్నాను. ఎందుకంటే నా చిన్నప్పుడు బత్తుల తవిటయ్య చీరల మూటతో మా ఇంటికి వచ్చేవాడు. ముందు వసారాలో అన్నీ పరిచి ఎంచుకోమనేవాడు. ఆ రెండు మూడు గంటల సేపు ఇంట్లో వున్న ఆడవారంతా అక్కడే వుండేవారు. అమ్మమ్మ, అమ్మ, పిన్నమ్మలు, అత్తయ్యలు, వదినలు, అక్కలు రకరకాల చీరెలు తీసుకొనేవారు. పదహారేళ్ళ వయసులో పెళ్ళి కాని వారంతా వోణీలు తీసుకొనేవారు. ఆ చీరలని తరవాత మా మామయ్య మూరలతో కొలిచేవాడు. మేము మా మామయ్యకి సహాయం చేసేవాళ్ళం. మమ్మల్ని నేతలో పొరపాట్లని వెతికి పట్టుకోమనేవాడు. ఈ ట్రైనింగ్ నాకు తరవాత జీవితంలో బాగా ఉపయోగపడింది. అది వేరే కథ. అని చెప్పి, నా కలలో నేను చూసిన చక్కని చేనేత వోణి ఒకటి కొనమని ఆమెకి పురమాయించాను.

తరతరాలుగా బట్టలు నెయ్యడం, బట్టలు అమ్మడం వృత్తిగా ఉన్న సాలెల కుటుంబాలు ఎప్పుడో నేత పని మానేశారుట. బత్తుల తవిటయ్య చనిపోయిన తరువాత కొడుకులు కొన్నాళ్ళు మగ్గాల మీద నేసే వాళ్ళని పట్టుకొని వ్యాపారం నడిపించారుట. ఆ తరవాతి తరం వాళ్ళు రిజర్వేషన్‌లో సీట్ తెచ్చుకొని ఏవో చదువులు చదివి, రిజర్వేషన్‌తో వచ్చిన ఉద్యోగాలు చేసుకుంటున్నారు. అంచేత జరీ అంచు పెట్టి నువ్వు ఊహించినంత అందంగా నేయించడం కుదరదు. అయినా మీ అమెరికా వాళ్ళకేంటో ఈ రాచ్చిప్పలో పచ్చళ్ళులాంటి ముచ్చట్లు అని విసుక్కుంది. పోనీ కింతలి జనార్దనం బట్టల దుకాణంలో ప్రయత్నిస్తావా అని అడిగాను. ఆ రోజుల్లో కింతలి జన్దానం బొంబాయి నుండి బట్టలు తెప్పించేవాడు! అక్కడ చాలా ఖరీదైన బట్టలు దొరికేవి. కింతలి జనార్దనం వయసు మీద పడడంతో బట్టల దుకాణం మూసేశారుట. అతని కొడుకులు

గజాల్లో బట్టని కాక, భూమి అమ్ముతున్నారుట. పైగా నువ్వు అనుకున్నట్టు అవి అంత మంచివి కావు. అతను బొంబాయి మిల్లులో వచ్చే రెండో రకం బట్టని మధ్యవర్తుల ద్వారా కొని మరింత రేట్ వేసి అమ్మేవాడుట. అన్ని తెలివితేటలున్న వాడివి అని అందరూ అంటారేమో గాని నీకు ఇలాంటి విషయాలలో ఎవరెంత చెపితే అంతేనా? నీకందరూ చెప్పేవి నిజాలని, వాళ్ళంతా సత్యహరిశ్చంద్రులని అనుకుంటావు. నిజమేమిటంటే వాళ్ళు చెప్పేవి డైలాగులని, వాళ్ళు స్టేజిమీద నటుల కన్నా గొప్ప నటులని నువ్వు తెలుసుకుని ఉంటే, ఈపాటికి ఎవరెవరికో వచ్చిన ప్రైజులు, అవార్డులు, రివార్డులు నీకే వచ్చేవి. ఆఖరికి నోబెల్ ప్రైజ్ కూడా వచ్చేదేమో, అని నవ్వుతూ అనవలసిన నాలుగూ అంది. ఇక నాకు ఇలాంటి పనులు చెప్పకు ఏదైనా ఒక మంచి కొత్త కానుక కోసం ఆలోచన చెయ్యి. కొత్త తరానికి తగిన ఆలోచన చెయ్యి, అని ప్రోత్సాహకరంగా కొద్దిసేపు చెప్పింది.

తరం నుండి తరం మారాలి. ఒక్కలాగే ఉండిపోకూడదు. కానీ తెగిన గాలిపటాలలా ఏ తరానికాతరమే అని దూరమైపోతే, మన సంస్కృతి వేరు తెగిన చెట్టులా వాడిపోతుంది. మనలోని 'జీవం' కాలంలో ఇంకిపోయి, బ్రతుకు మోడువారి నిస్సారమవుతుంది. కొత్త తరానికి, గడిచిన తరాలకి వారధిగా ఉండేలాంటి ఆలోచనలు కావాలి. అప్పుడే కుటుంబానికి, మానవజాతికి ఒక అర్థం ఉంటుంది అని నా మనసులో మెదిలిన ఈ భావన నా మెదడులో బాగా నాటుకొంది. మనసు మెదడు అనుసంధానమైతే మనిషి మనిషిగా మరో మెట్టు ఎక్కుతాడు.

కొత్తదయి ఉండాలి, కొత్త తరానికై ఉండాలి. కొత్త, పాత తరాల మధ్య వారధై ఉండాలి... ఇలా ఆలోచించడం మొదలుపెట్టాను. రకరకాల కానుకల గురించి ఆలోచించాను. అయినా కానుకగా వోణి కాకుండా మరొకదానికి మనసు ఒప్పడంలేదు. ఈ సమయంలో మాచవరం మాధవయ్యగారు గుర్తుకి వచ్చారు. ఈయన పెద్ద బట్టల వ్యాపారి. ఈయనకి భక్తి ఎక్కువ. దేవుడి మీద భారం వేసి దేశంలో ఎక్కడున్న దేవాలయానికైనా వెళ్ళిపోతారు. వ్యాపారం, భక్తి,

తీర్థయాత్రల సంగమమే ఆయన జీవితం అని చెప్పవచ్చు. అందువలన ఆయనకీ వోణీలో కొత్తదనం గురించి తెలిసి ఉంటుందని ఆయనతో నాకు కావలసిన వోణి గురించి చెప్పాను. విషయం విని ఆయన భక్తిపారవశ్యంలో ఆడపిల్లకి శక్తి ముఖ్యమని కాశ్మీర్‌లో సరస్వతీదేవి నుండి శ్రీలంకలోని శంకరి దేవి వరకు ఉన్న 18 శక్తి పీఠాలకు ఒక వోణి పంపి ఆ దేవతలందరి ఆశీశ్శులతో ఒక వోణి తెప్పించమంటే ఇప్పుడే ఆ పని మీద ఉంటాను అన్నారు. భక్తి బాగా ఉన్నవారికి ఆయన ఇచ్చిన ఆలోచన ఒక వరం. కానీ ఇంత చేసినా పుట్టబోయే పిల్లకి భక్తి ఉంటుందని నమ్మకమేమిటి. భక్తి లేకపోతే ఈ ప్రయాస అనవసరం అని తటపటాయించాను. ఇంతలో ఆయనే మళ్ళీ పోనీ మీకు మధుర మీనాక్షి అమ్మవారి ఆలయం నుండి ప్రసాదంగా ఒక వోణి తెప్పించమంటారా? మీరు ఏప్రిల్ దాకా టైం ఇస్తే మీనాక్షి అమ్మవారి తిరుకల్యాణం నాడు అమ్మవారికి కట్టించి, తెప్పించి ఇస్తాను అన్నారు.

అంత అభిమానంతో సాధారణంగా అందరికీ వీలుకాని రీతిలో వోణి తెప్పిస్తాను అంటే కాదని ఏలా అనగలను. కానీ, దీనిలో ఉన్న కొత్తదనమేమిటి? జవాబులేదు. ఈ వోణి ఎక్కడ కొంటారు? అని అడిగాను. మనం మధుర మీనాక్షమ్మవారి ప్రసాదం అని అనుకొంటే మరెక్కడో ఎందుకండీ? అక్కడే మధురలోనే స్పెషల్‌గా ఆర్డర్ చేయిస్తాను. వందల ఏళ్ళక్రితం గుజరాత్‌లోని సౌరాష్ట్ర ప్రాంతం నుండి వచ్చిన మహా నేతగాళ్ళ వంశంలోని వాళ్ళతోనే నేయిస్తాను. మూడునాలుగువేల దారాల మేళవింపుతో వోణి బట్టని, బోర్డర్ డిజైన్ మనకి కావలసినట్టు చేయిస్తాను.

"మనం డిజైన్ ఇస్తే అదే డిజైన్ చేస్తారా? లేక వాళ్ళ డిజైన్ మాత్రమే చేస్తారా" అడిగాను.

మనమిచ్చిన డిజైన్‌కి తగిన విధంగా నేయడానికి గట్టి అట్టల మీద కన్నాలు కొట్టి మనకి కావలసిన రంగు దారాలని వాటిద్వారా పంపి అంచుని నేస్తారు అన్నారు.

అట్టల మీద డిజైన్ కోసం కన్నాలు కొట్టడం అంటే ఏమిటి? అని అడిగాను.

మీరు తాళపత్రగ్రంథాలని చూశారా అని అడిగారు నేను జవాబిచ్చేలోపునే.

మరేం కాదండి పూర్వం తాటాకులని శుభ్రం చేసి రాయడానికి వీలుగా కోసి వాటి మీద గ్రంథాలని రాసేవారు కదా అల్లాంటిదే, కాకపోతే వెడల్పు ఎక్కువ ఉంటుంది. మన డిజైన్‌కి కావలసిన కన్నాలు కొట్టి దీన్ని మగ్గం ఎక్కిస్తారు. ఆ కన్నాల ద్వారా కావలసిన రంగు దారాలు రావలసిన తీరులో రావడానికి ఏర్పాటు చేస్తారు. అప్పుడు నేత మొదలుపెడతారు అని వివరించారు. మీరొకసారి వచ్చి చూడాలి. మీకు నచ్చిన డిజైన్ పంపండి. నేను పని మొత్తం అయ్యేలా చూస్తాను అన్నారు.

కార్డు, కన్నాలు అంటే ఎప్పుడో వాడిన కంప్యూటర్ పంచ్ కార్డులు గుర్తుకు వచ్చాయి. కన్నం ఉండడం లేదా లేకపోవడం ద్వారా అమెరికాలో ఇదేవిధంలో ప్రతీపేజీలో ఒక పద్ధతిలో ఉన్న కన్నాల ద్వారా జ్యుక్‌బాక్స్‌లో సంగీతం వచ్చే ఏర్పాటు ఉంది. వీటన్నిటికి మూలం జాకార్డ్ కార్డు అని తెలుసుకొని చాలా సంతోషించాను. వెంటనే ఆ మ్యూజిక్ కార్డులు తెప్పించాను. ఇల్లాంటి కార్డు కంప్యూటర్ మీద చెయ్యడానికి కావలసిన సాఫ్ట్‌వేర్ ప్రోగ్రాం కూడా తెప్పించాను. ముందు కొన్ని రాగాలని ఇచ్చే పంచ్ కార్డ్సు తయారు చేశాను. ఆ రాగాల కార్డులని కంప్యూటర్‌లోనే నేతకి వాడితే ఎలాంటి డిజైన్ వస్తుందో చూశాను. ఒక నెలరోజులలో నాకు నచ్చిన డిజైన్ దానివలన వచ్చే రాగం నిశ్చయమైంది. ఈ సమాచారాన్ని మధురైలో నేత పనివారికి పంపించాం. దాని ప్రకారం వారు నేసిన వోణి అందింది. సంగీత సస్వరాలని రంగుల్లోకి మార్చి, ఆ రంగులపోగులతో బట్టను నేసి సంగీతాన్ని కట్టుకొనేందుకు వీలు చేసిన ఈ వోణి చాలా ముచ్చటగా ఉంది.

చూడముచ్చటగా ఉండడమే కాకుండా తమకు నచ్చిన సంగీతాన్ని కట్టుకొనే అవకాశం వచ్చింది. సంగీతం మరోనాలుగు కాలాలపాటు ప్రజల బట్టల రూపంలో నిలబడుతుంది. నేతగాళ్ళకి కొత్తమార్గంలో ఆదాయం వస్తుంది అని

తోచింది. "ఆ డిజైన్ చూసి అందరూ ముచ్చట పడ్డారు. ఎప్పుడూ ఎక్కడా ఇలాంటి బోర్డర్ చూడలేదే అన్నారు. అవును చూసి ఉండరు. ఎందుకంటే ఇది మధువంతి రాగం."

"మేం బోర్డర్ అంటే నువ్వు రాగం అంటావేంటి?" అన్నారు.

"అవును 72 భారతీయ రాగాలలో అతి మధురమైన, మధువంతి రాగంతో చేసిన బోర్డర్" ఇది, అని ఎలా చేసానో వివరించాను.

వోణి చేతిలోకి తీసుకొని అందులో అమర్చిన మైక్రో చిప్ నొక్కాను. మధువంతి రాగం హరిప్రసాద్ చౌరాసియా ఫ్లూట్‌లోంచి ప్రవహించింది.

పుట్టిన పిల్ల పెరిగే దాకా సంగీతాన్ని విని ఆనందిస్తే, పెద్దైన తరువాత సంగీతాన్ని, డిజైన్ని కూడా ఆనందిస్తుంది అన్నారు కొందరు.

"వావ్ ఈ వోణి పేరేంటి మేము తెప్పించుకుంటాం" అన్నారు అందరూ ఆనందంగా.

"ఈ వోణి పేరు మధురవోణి!"

*

**గురువు కావడానికి వయస్సు, అనుభవం, అవసరంలేదు ప్రకృతి సహజంగా వచ్చిన వివేకం చాలని చెప్పడానికి ఉదాహరణ, ఈ కథ వ్రాయడానికి, కథలోని ప్రయోగానికి ప్రేరణ అయిన పసిపిల్ల సహన కొచర్‌లో గురువుకి నమస్కరిస్తూ...**

# వెరీ ఫాస్ట్ ఫుడ్ బిస్ట్రో

**"నే**ను రమణని సార్..." అర్ధరాత్రి మోగిన ఫోను ఎత్తితే అవతల నుండి ఒక గొంతు సంబరాలలోని కోలాహలాన్ని మూడు పదాల్లో లైసెన్సు లేకుండా, ఛార్జీలు లేకుండా, ఎక్స్‌పోర్ట్ చేసింది న్యూయార్క్‌లో ఉన్న నా చెవికి.

"ఏ రమణ? ఎక్కడ నుండి?" అని అడిగాను. ఎంతమంది రమణలో, అందులో ఏ రమణ ఈ రమణ అన్న ధ్వనితో.

"విశాఖపట్నం రమణనండి, డ్రైవర్ రమణని" అన్నాడు అవతల వ్యక్తి, నన్ను మర్చిపోయారా అన్న ఆశ్చర్యాన్ని కప్పుకుని వచ్చాయా మాటలు.

"నెంబరు చెపితే నేను ఫోను చేస్తాను" అన్నాను ఆనవాయితీగా.

"అక్కర్లేదండి. నా సెల్ నుండే చేస్తున్నాను" రోజులు మారిపోయాయన్నది స్పష్టం చేస్తూ.

"చెప్పండి..." అన్నాను.

"నన్ను అండి ఏంటండి? మీ డ్రైవర్ని. రవణ అనండి చాలు" వినయంలో ముంచి తీసిన మాటల్ని తాజాగా పంపాడు.

"ఊ..." అన్నాను ఏం మాట్లాడాలో తెలియక.

"మీరన్నట్టే లక్ష సంపాదించానండి. సంపాదించిన తొలి లక్ష మీకివ్వాలని ఒట్టేసుకొన్నానండి. ఎలా ఇవ్వమంటారండి?" చెవులలోకి ఇంజక్ట్ అయిన ప్రతి

పదం మత్తుమందులా పనిచేసి నా ఆలోచనలన్నీ ఆగిపోయాయి.

రమణంటాడు. డ్రైవర్ నంటాడు. లక్షంటాడు. తనే సంపాదించానంటాడు. పట్టపగలు విన్నా అర్థం కాని విషయం అర్ధరాత్రి నిద్రలేపి చెపితే ఏం అర్థం అవుతుంది. కాని ఈ పరిస్థితిని మేనేజ్ చెయ్యలేకపోతే ఎలా? నా అహ్మదాబాద్ ఐఐఎమ్ డిగ్రీ, మద్రాస్ ఐఐటి ఇంజనీరింగ్ డిగ్రీల పరువుపోదా?!...”

“సంతోషం. నెంబరు చెపితే రేపు ఉదయం చేస్తాను” అన్నాను.

“క్షమించండి. నిద్రలో ఉన్నారా? నేనే రేపు ఉదయం చేస్తాను సార్” అని ఫోను పెట్టేసాడు.

హమ్మయ్య అని పడుకోబోతూంటే “ఎవరుట?” అంది నిద్రమత్తులో, నాకెప్పుడో ఓ ఆపరేషనుకి డాక్టర్‌గా ఇచ్చిన మత్తుమందు మత్తు పోయిన తరవాత, తన మత్తులో పడేసుకొన్న నా అర్థాంగి.

“ఎవరో రమణట?” పడుకో అన్న ధ్వనితో.

“ఏమంటాడు?” మెడికల్ సీటు వచ్చింది కానీ, రాకపోతే పోలీసాఫీసర్ అయ్యుండేది అనుకున్నాను వెయ్యినొక్కోసారి.

“లక్ష ఇస్తాడంట”

“రూపాయలా?”

“రూపాయిలే అనుకుంటాను ఇండియా నుండి కదా”

“సరిగ్గా వినుండవు. ఇమ్మంటున్నాడు కాబోలు”

“ఏమో రేపు ఉదయం ఫోను చేస్తానన్నాడులే” అనేసి, “పడుకో” అన్నాను ఈమారు గట్టిగా పైకే.

“అందరికి ఇండియా వెళ్లడానికి, అక్కడ తిరగడానికి ఖర్చు ఉంటుంది. నీకు వచ్చింతరవాత కూడా ఖర్చుంటుందంటే ఎవరూ నమ్మరు కాని...” అంది

తన థీరీని ప్రూవ్ చేసిన ఇండియన్ సైంటిస్టులా.

నిద్రపోవాలని కళ్ళు మూసుకొన్నాను.

ఫోనులో విన్న గొంతు నెమరు వేసుకోవడం మొదలుపెట్టాను. ఆ గొంతు తాలూకు మనిషిని గుర్తు తెచ్చుకొందామన్న ప్రయత్నంలో మెల్లిమెల్లిగా ఆ మాటలలోని ఆనందాన్ని, ఆవేశాన్ని, ఆతృతనీ పొరలు పొరలుగా తీసి విన్న గొంతు అసలు మూలాన్ని మనస్సులో వినే ప్రయత్నం చేసాను.

కొద్దిపాటి ప్రయత్నంలోనే అర్థం అయింది. ఆ గొంతు మా ఫ్రెండు వాళ్ల డ్రైవర్ రమణదే అని ఖచ్చితంగా గుర్తుపట్టాను. డ్రైవర్ డబ్బు సంపాదించడమేమిటి? నాకు లక్ష ఇవ్వడమేమిటి? అని ఆలోచిస్తూ నిద్రలోకి జారుకున్నాను.

నిద్ర వచ్చీరాని స్థితి. ఇండియాలో ప్రయాణాల విశేషాలు అక్కడక్కడ చెదురుముదురుగా గుర్తుకు వచ్చి పోతున్నాయి. ఇండియా ప్రయాణం పూర్తయి వచ్చిన తరవాత ఆ ప్రయాణాన్ని, విశేషాలని తలుచుకొంటూంటే మరో ఏడాది గడిచిపోతుంది. అన్ని విశేషాలు విషయాలు వుంటాయి మరి. ఈ రమణ విషయం ఎక్కడా దొరకడం లేదు. డ్రైవర్ నాకు లక్ష ఇవ్వడమేమిటి? ఇస్తానన్నది కల కాదు. ఫోను చేసి మరీ చెప్పాడు. సరే రేపు ఫోను చేస్తానన్నాడు కదా అనుకుంటూ నిద్రలోకి జారుకున్నాను.

ఉదయాన్నే ఆరు గంటలకి మెలుకువ వచ్చింది. మెలుకువతో పాటు అప్పటి దాకా తెరలు తెరలుగా వస్తున్న కలల మాలిక తెగిపోకుండా గుర్తు కూడా ఉంది. కాని గుర్తుకు వచ్చిన వాటిలో డబ్బు గురించి డ్రైవరుతో ఏం సంబంధమో తెలియడం లేదు. బెడ్‌రూమ్ లోంచి బయటకు చూసాను. తూర్పున వున్న సూర్యుడు మేఘం వెనుకనుండి వెలుగునిస్తున్నాడు. కాని స్పష్టంగా కనబడలేదు. నా కలలో రమణ విషయంలా.

మొహం కడుక్కొని వచ్చేసరికి కాఫీతో శ్రీమతి సిద్ధం. న్యూయార్క్ నగరంలోనే ఉన్నా చుట్టూచూస్తే, చూడగానే అడవా? అని అనిపించే లాంటిచోట

ఇల్లు కట్టుకున్నాం. కాబట్టి ఉదయం ఎండ ఎక్కువ కాకముందు బయట తూర్పువైపున వసారాలో కూర్చుని దక్షిణంగా ఉన్న న్యూయార్క్ వృక్ష సంపదని ఆనందించడం అలవాటు. అలాగే ఇవ్వాళ కూడా కూర్చున్నాం ఇద్దరం.

నా మెదడు ఆలోచనలు నా కంటే బాగా తెలిసిన శ్రీమతి "ఏం గుర్తు వచ్చింది?" అని అడిగింది.

"కిందటి మారు నేను ఇండియా వెళ్లినప్పుడు మన శ్రీధర్ డ్రైవర్ నన్ను ఓ రెండు రోజులు తిప్పాడు. నా హైస్కూల్ క్లాస్‌మేట్ శ్రీరాములు రకరకాల వ్యాపారాలు చేసి ఏదీ కలిసిరాక ఇక అమెరికానో, ఆస్ట్రేలియానో వెళ్లిపోదామనుకుంటున్నాడు. 'అక్కడ ఏదైనా చేద్దామనుకొంటున్నాను, నీ ఒపీనియన్ ఏమిటి?' అని అడిగాడు, ఇద్దరం కారులో కలిసి వెళుతుంటే. అదేంట్రా అందరూ ఇండియాలో వ్యాపారం బాగుందని ఇక్కడికొస్తుంటే నువ్వు ఇండియా వదిలివెళ్లిపోవడం ఏమిటని మందలించాను.

'నువ్వు ఎన్నయినా చెప్పు ఇక్కడ ఏ వ్యాపారం సరిగ్గా సాగడం లేదు. లాభాలు పెద్దగా లేవు' అన్నాడు.

'నా ఉద్దేశంలో ఇండియా బెస్టు, నేను బిజినెస్ స్కూల్లో ప్రొఫెసర్ని' అని కూడా చెప్పాను.

'అయితే నీ ఉద్దేశంలో ఇండియాలో ఏవి మంచి వ్యాపారాలో చెప్పు' అన్నాడు.

'గుడి, బడి, తిండి ఇవి బ్రహ్మాండమైనవి' అన్నాను.

'గుడి, బడి సరే కాని, తిండి వ్యాపారం చాలా డేంజర్ తెలుసా? కుక్కలతో పడలేం. నేనొకసారి ట్రైచేసా. చాలా నష్టం వచ్చింద'న్నాడు.

'అందరూ తిండి తింటారు కదా. అది వ్యాపార సూత్రాల ప్రకారం నిశ్చయంగా ఉండే వ్యాపారం' అని అన్నాను.

ఇంతలో అప్పుడే వాళ్ళ ఊర్లో తెరిచిన ఓ పెద్ద ఫాస్ట్‌ఫుడ్ జాయింట్‌లో మొదటి రోజు తినాలని, అది వాళ్ళ స్నేహితులదని తీసుకెళ్లాడు శ్రీరాం.

అక్కడ చాలా కోలాహలంగా ఉంది. అంతా అమెరికా పద్ధతి ఏర్పాట్లు. నిజానికి అమెరికాలోని చాలా వాటికంటే బాగానే ఏర్పాటు చేసారు. శ్రీరాం వాళ్ళ స్నేహితులకి నన్ను పరిచయం చేసి నాకు కొంత తినడానికి ఇచ్చి వాళ్లతో మాట్లాడడానికి వెళ్లిపోయాడు. తింటూ చుట్టూ ఉన్నవాళ్లను చూస్తున్నాను.

అందరూ టీనేజర్స్! అందరూ ఇంగ్లీషులోనే కబుర్లు. ఉన్నది ఇండియాలోనేనా అనిపించింది. ఇండియన్స్ అంతా ఉన్నారు కాని ఈ ఫాస్టుఫుడ్ రెస్టారెంట్ అమెరికాలో ఏ ఊర్లోదైనా కావచ్చు.

అంతమంది టీనేజర్ల మధ్య ఒక టేబుల్ దగ్గర వున్న అమ్మాయి నా దృష్టిని ఆకర్షించింది. ఆ అమ్మాయిలో ప్రత్యేకత ఏమీ లేకపోయినా ఆ అమ్మాయితో కూర్చున్న వాళ్ళ వల్ల ఆ అమ్మాయి ప్రత్యేకంగా అనిపించింది. అమ్మాయితో ఆ అమ్మాయి తల్లిదండ్రులు కాబోలు కూర్చున్నారు. వాళ్ల టేబుల్ మీద ఒక చిన్నసైజు ఫ్రెంచ్ ఫ్రైస్, ఓ పెద్ద కోక్ ఉన్నాయి. అదే ముగ్గురూ మౌనంగా తింటూ తాగుతున్నారు. బహుశా ఆ అమ్మాయి బలవంతం మీద తల్లిదండ్రులు అమ్మాయితో పాటు వచ్చి ఉంటారు. ముగ్గురికి కావలసినన్ని కొనుక్కోవటానికి చాలా ఖరీదు అక్కడున్నవన్నీ. అందుచేత ఇలా తక్కువలో సర్దుకొని అందరిలా వాళ్లు కూడా కొత్త ఫాస్టుఫుడ్ రెస్టారెంటులో తింటున్నారు. మధ్యతరగతిలోనో అంతకన్నా దిగువలోనో ఉన్నప్పుడు ఎన్నెన్ని కోరికలు, ఎన్నెన్ని అడ్డంకులు, వాటిని మించిన ఆలోచనలు అని ఆశ్చర్యంగా వాళ్ళవైపే చూస్తూ కూర్చొన్నాను. వాళ్ళు తిని వెళ్లిపోయారు. ఆ ఖాళీ టేబుల్ చూస్తుంటే తళుక్కున ఒక ఆలోచన వచ్చింది. వాళ్లకి ఏం తిన్నాం అన్నది ముఖ్యం కాదు. అక్కడ తినడం ముఖ్యం అన్నది.

ఇంతలో శ్రీరాం వచ్చాడు. మళ్లీ కారెక్కి బయలుదేరాం. కారులో శ్రీరాంతో అన్నాను. వంట వాళ్లతో ఇబ్బందులు ఉంటాయి. వాళ్లు లేకుండానే నడుపు

అన్నాను. వాళ్లు లేకుండా ఎలా? నా ఉద్దేశంలో చాలా మంది పోష్ వాతావరణంలో తినాలని అనుకొంటారు, కాని ఏం తిన్నాం అన్నది వాళ్ళకి ముఖ్యం కాదు. కాబట్టి ఎవరి తిండిని వాళ్ళనే తెచ్చుకోని. నువ్వొక మంచి వాతావరణం, టేబుల్స్, మ్యూజిక్, లైట్లు పెట్టి అక్కడ కూర్చున్నందుకు అరగంటకి మనిషికి ఓ పదిరూపాయలు ఫీజు తీసుకో. ఓ వందమందికి సరిపడే హాలు లాంటిది, మంచి జనసమ్మర్ధం ఉన్న జాగాలో తీసుకో. ఓ నలుగురు మంచి పనివాళ్లని పెట్టి ఆ జాగాని స్టార్ హెూటళ్ళలో ఉన్నంత శుభ్రంగా ఉంచు. మంచినీళ్లు, నేప్‌కిన్లు మాత్రమే ఇవ్వు.

అందమైన చెత్తవేసే డ్రమ్ములు ఏర్పాటు చెయ్యి. ఓ రెండు మైక్రో ఓవెన్సు పెట్టు. ఎవరికి నచ్చినది వాళ్లు తెచ్చుకొని నీకు పది రూపాయలు కట్టి వెంటనే కూర్చొని అక్కడ తిని వెళ్లిపోతారు. ఆర్డరు చెయ్యడం, వెయిట్ చెయ్యడం ఇవేవి ఉండవింక. కాబట్టి వెరిఫాస్టుఫుడ్ రెస్టారెంట్ అనవచ్చు అన్నాను శ్రీరాంతో. వాడు చాలా ప్రశ్నలు వేసి అయితే డబ్బులు సంగతేంటి అన్నాడు.

రోజులు 12 గంటలు తెరిస్తే సగం నిండినా రోజుకి 12,000 రావాలి. పోనీ పదివేలు వేసుకొన్నా నెలకి మూడు లక్షలు. అద్దెలు జీతాలు టేక్సులు అన్నీ కలుపుకొన్నా లక్ష కన్నా ఉండవు నెలకి. కాబట్టి లక్షల్లో లాభాలు అన్నాను ఉత్సాహంగా.

వాడు అదంతా విని సర్లేరా అన్నాడు. నేనూ మరిచిపోయాను ఆ విషయాన్ని" అన్నాను శ్రీమతితో, ఖాళీ కాఫీ కప్పు కింద పెడుతూ. ఇంతలో ఫోను మ్రోగింది.

"హల్లో సార్ రమణని" మళ్లీ అతనే.

"ఆ చెప్పు రమణ"

"ఏం చెప్పమంటారు సార్... మీరిచ్చిన ప్లాన్ బ్రహ్మాండం సార్. మీరు కార్లో శ్రీరాంగారికి చెప్పిందంతా విన్నాను సార్. ఓ రెండు మూడు నెలలు చూసాను సార్. ఆయన ఆ వెరిఫాస్టుఫుడ్ హెూటలు పెట్టలేదు సార్. నేనే ధైర్యం

చేసి బేంకి లోన్ తీసుకొని సిరిపురం జంక్షన్‌లో పెట్టేసాను సార్ నాలుగు నెల్లక్రింద"

"చాలా సంతోషం" అన్నాను, నిజంగానే నమ్మలేకపోతూ.

"మీరన్నట్టే నెలకి రెండు లచ్చలు లాభం వచ్చింది సార్. నాను కూడా డ్రైయివర్ ఉద్యోగంలో వచ్చే ఆరువేల జీతం తీసుకుని పనిచేసాను. మూడు నెలల్లో చేసిన అప్పులన్నీ తీర్చేసాను సార్. మన ఆడిటర్ కుమార్‌గారు ఇవాళ పిల్చి ఇదిగో నీ మొదటి లచ్చ లాభం అని కాగితాల మీద వేసి చూపించి, బేంకులోంచి తీసికోవొచ్చన్నారండి"

"చాలా ఆనందంగా ఉంది రమణ..." అన్నాను. ఇది కలా నిజమా అని నన్ను నేను ప్రశ్నించుకొంటూ మనసులో.

"నానీ యాపారం పెట్టి మీరనట్టు లచ్చలు లచ్చలు డబ్బు సంపాదిస్తే మొదట లచ్చ మీకే ఇయ్యాలనుకొన్నా సార్" అన్నాడు ఆనందంగా.

రమణ నిజాయితీకి పట్టుదలకి, నాకు నోటి మాట రాలేదు.

"గొప్ప అయిడియా సార్.. అసలు వంటలేదు. గోల లేదు. ఏటీనేదు. చక్కగా నీట్గా హాయిగా ఉంచడమే సార్..." చిన్నపిల్లాడిలా ఆనందపడిపోతూ ప్రతి పదం పువ్వులు విసిరినట్లు విసిరి వినిపించాడు.

ఇన్నాళ్ళు ఇంత పెద్ద అమెరికన్ బిజినెస్ స్కూల్లో పాఠాలు చెప్పాను కాని, రమణ చేసిన ప్రయోగం వింటుంటే చెప్పలేనంత ఆనందం కలిగింది. ఇలాంటిది ఎప్పుడూ కలగలేదు.

"సార్ వద్దనకండి సార్, తప్పకుండా ఈ లచ్చ తీసుకోండి సార్. ఇది మీరు తీసుకొంటేనే నేను మిగిలిన లాభం ముట్టగలను సార్" అన్నాడు ప్రాధేయపూర్వకంగా. నా నిశ్శబ్దాన్ని మరోలా అర్థం చేసుకొన్నాడు కాబోలు.

"తప్పకుండా రమణ. తప్పకుండా తీసుకొంటాను. నాకు నువ్వు చేసిన పనికి చాలా ఆనందంగా ఉంది" అన్నాను చెమర్చిన కళ్లతో.

రమణ ఇచ్చిన లక్షతో కృష్ణుడు అర్జునునికి గీతబోధ చేస్తున్న గంధపు చెక్కతో చెక్కిన బొమ్మని కొన్నాను. నా ఆఫీసులో పెట్టుకొన్నాను మిగిలిన అవార్డుల కంటే ఇది చాలా ఆనందం ఇస్తుంది.

*

**ఫస్ట్ ఫారంలో, ఫస్ట్ చేసిన అప్పు ఒక రూపాయి ఇచ్చి డబ్బు విషయంలో నాకు తొలి పాఠం నేర్పిన గురువు, ఫస్ట్ క్లాస్ నుండి నా తోటి విద్యార్థి, మంచి వ్యాపార దక్షతగల శ్రీ కొత్తా సూర్య ప్రకాశరావు (రాజా) ఆత్మకి నమస్కరిస్తూ...**

# అరవైలో ఇరవై

ఇరవై అయిదో ఏటదాకా ఇండియాలో బ్రతికివచ్చి అమెరికాలో మరో ఇరవై అయిదేళ్ళు బ్రతికిన నాకు అమెరికా అయినా ఇండియా అయినా ఒకటే అన్న భావన చాలా గట్టిగా ఉండేది. అమెరికాలో పగలైతే ఇండియాలో రాత్రి ఇండియాలో పగలైతే అమెరికాలో రాత్రి. అని మొదలుపెట్టి అక్కడ ఇక్కడ అని వాదించేవాళ్ళను పట్టించుకునేవాడిని కాదు. అలాంటి నాకు కనువిప్పు కలిగించింది.

"ఇండియాలో ఇరవైలో అరవైలా బ్రతికిన నేను అమెరికాలో అరవైలో ఇరవైలా బ్రతుకుతున్నాను", అన్న వాసా విశాలాక్షిగారి వాక్యం.

వాసా విశాలాక్షిగారు న్యూయార్కులో సంగీతం టీచరు. కర్ణాటక సంగీతానికి చేతులడ్డుపెట్టి ఒక 'కాపు' కాస్తున్నాం అనుకుంటున్న ఎందరో వ్యక్తుల కంటే సంస్థలకంటే ఎక్కువ 'పెద్దకాపు' వాసా విశాలాక్షిగారు. నలభైయేళ్ళగా ఆవిడ న్యూయార్కులో ఉన్నారని గాని ఎంతో సంగీత సేవ చేస్తున్నారని కాని న్యూయార్కులో ఎన్నాళ్ళున్నా మీకు నాకు తెలిసే అవకాశం లేదు. ఎందుకంటే ఆమెను ఏసంఘాలు గుర్తించలేదు. అవార్డులు ఇవ్వలేదు. ఇండియా ఎబ్రాడ్ వంటి న్యూస్ పేపరులో వ్రాయలేదు.

ఆవిడ చేస్తున్న సేవని ఆవిడ ఉనికిని నలుగురికి తెలిసేలా చేసింది ఓ తెల్లవాడు. వాడికి సంగీతం కాని భారతదేశం గురించి కాని ఏమీ తెలీదు. అసలు భారతదేశం అనేది ఉందని కూడా తెలీదు. వాడికి తెలిసిందంతా రోజు ఎలాగో ఒకలాగ డబ్బులు సంపాదించి డ్రగ్స్ తీసుకుని ఆనందోబ్రహ్మ అని

జీవితం గడపడం అలాంటి వాడికి సంగీత విద్వాంసురాలు పూజ చేయకుండా పచ్చి మంచినీళ్ళయినా ముట్టని పరాయివాళ్ళ ఇళ్లల్లో పళ్ళు తప్ప మరేమి తినని ఛాందసురాలైన వాసా వివాలాక్షిగారికి లింకేమిటని ఆశ్చర్యపోకండి. ఉంది!

ప్రతిరోజు ఉదయం పూజచేసుకుని మడిగా వంట వండి భర్తకు పెట్టి తాను తిని పట్టుచీర కట్టుకుని లోపల థెర్మల్ (చలిని తట్టుకునే లొపలి బట్టలు) తొడుక్కుని మఫ్లర్ కట్టుకుని, న్యూయార్కు బస్సులలో సబ్‌వేలలో వెళ్లి అభిరుచి ఉన్న వాళ్ళకు సంగీత పాఠాలు చెప్పడం ఆమె దినచర్యలో భాగం. ఒకరోజు ఆమెను సబ్‌వేలో ఒక తెల్లవాడు అటకాయించి 'మగ్గింగ్' అనే మెన్‌హాటన్ స్టైల్ ముష్టికై ప్రయత్నించాడు. ఇలాంటివి జరుగుతాయని ఆవిడకు తెలుసు. అలాంటివారికి ఇవ్వడానికి వేరుగా ఏప్పుడూ ఒక ఐదు డాలర్లు దాచుకుంటారు. ఆమె మగ్గింగ్ కోసం దాచుకున్న ఐదు డాలర్లు ఇచ్చే అంతలో వాడు ఆమె శృతి పెట్టెను పట్టుకున్నాడు. అప్పుడు శృతి పెట్టె పట్టుకున్న ఆమె చేతిని తాకడంవల్ల మడికి భంగంమై కోపం వచ్చింది ఆమెకు.

"ముష్టి వెధవవు ముష్టి వవెధవలా ఉండక నా మడి మైల చేస్తావా?" అని ఆగ్రహించింది.

ఆమె ఆవేశాన్ని ఆమెగాత్రం అద్భుతంగా అనువదించి పక్కవాడు చచ్చిపోతున్నా పట్టించుకోని జనాన్ని నిలబెట్టింది. గొడవైంది పోలీసులచ్చారు.

"ఓస్ ఇంతేనా" అని వెళ్ళిపోబోయారు పోలీసులు. అలాంటి పోలీసుల్ని ఆపి 'మడి' దాని ప్రాముఖ్యత గట్రా వివరించారు. ఇటువంటి తప్పును అమెరికా ఖండంలో చేసేవారిని వదిలేస్తే ఈ ఖండం అపవిత్రమైపోతుందన్నారు.

"ముష్టివాళ్ళు ముష్టి అడగడం, మనం ఇవ్వడం సనాతన ధర్మం" అని చెప్పారు.

ఆమె చెపుతున్న విషయం కంటే ఎంతసేపైనా వినాలనిపించే ఆమె గొంతు వినడానికి మరిన్ని ప్రశ్నలు వేశారు. పోలీసులు ముచ్చటపడి కేసురాసి నమస్కారం

పెట్టి వెళ్లిపోయారు.

అమెరికాలో క్రైంన్యూస్ ఎక్కువ కాని, అందులో ఇండియన్ పేర్లు తక్కువ. అంచేత మనం ఇక్కడ ఉన్నామని నలుగురికి తెలియదని న్యూయార్కు అంటే 'మెల్టింగ్ పాట్' అని, అది సంస్కృతుల సంగమం అని అందులో ఇవాళ 'మడి' అనే భారతీయ సంస్కృతికి సంబంధించిన విషయం అమెరికాలో క్రైంకి కొత్తకోణాన్ని ఇస్తుందని న్యూయార్కులోని ప్రెస్ విజృంభించింది.

వారు వాసా విశాలాక్షిగారి ఇంటి అడ్రస్ పట్టుకున్నారు. కెమేరాలు వెంట తెచ్చుకున్నారు. ఆమెను వివిధ ప్రశ్నలు వేశారు. ఇది ప్రథమ ఇంటర్యూ అవడం వల్ల ఆమె ఏ సమాధానం చెప్పకుండా మహాగణపతిం.... అంటూ మొదలుపెట్టారు. ఆ తరువాత ఆమె అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పారు. ఆమె జీవిత చరిత్ర అంతా వివరించారు. మగ్గింగ్ పాలబడ్డా మరేమి జరిగినా 'అమెరికా' మాత్రమే నచ్చిందన్నారు. విలేఖర్లు వివరంగా చెప్పమన్నారు. ఎన్నో కారణాలు వివరాలు ఎందుకు ఒక్కటి చాలు అన్నారు ఆమె ఆ సమాధానమే 'అమెరికాలో అరవైలో ఇరవై ఇండియాలో ఇరవైలో అరవై అదెలా' అని ఆశ్చర్యంగా ప్రశ్నించింది. ఇరవైలో ఉన్న జుహీ ఝూన్ ఝూన్ వాలా అనే విలేఖరిణి.

'నాకు ఇరవైయవ ఏట పెళ్ళయింది. నేను వాళ్ళింట కాలు పెట్టిన వేళా విశేషం యేమోకాని నాభర్తకు ఢిల్లీలో ఉద్యోగం వచ్చింది. తుళ్ళుతూ, తేలుతూ తిరుగుతూ సంగీతం ఊపిరిగా బ్రతుకుతున్న మాపల్లెటూరి నుండి ఢిల్లీ వెళ్లిన నాకు అదో పెద్ద జైలులా అనిపించింది.

'వాసా వారింటి అబ్బాయి' అని మానాన్న గారు నన్ను ఒప్పించి పెళ్లి చేశారు. వాసా వారిది సంగీత సాంప్రదాయనికి పెద్దపేరు ఉన్న కుటుంబం. వారి ఇంట ఉన్న సంగీత సాంప్రదాయాన్ని గౌరవించి అటువంటి కుటుంబంలో పుట్టిన ఆయనకు 'ఇంగువ కట్టిన గుడ్డలా' ఎంతో కొంత సంగీతం రాదా అని అనుకున్నాం. అయితే అది మారోజుల్లో పెళ్లి చూపుల్లో పెళ్లికూతురు ప్రశ్నలు అడగలేదు కదా! పెళ్ళయిన తరువాత తెలుసుకుందాం అని వాయిదా వేసాను.

ఢిల్లీ వెళ్లిన తరువాత తెలిసింది అది 'ఇంగువ కట్టిన గుడ్డే' కాని మాఆయన తరంలో అది 'సర్ఫ్' వేసి శుభ్రంగా ఉతికి ఆరేసిన బట్ట అని. ఆయనకు సంగీతం రాకపోతేనేం  నలుగురికి పాఠాలు చెప్పుకుని నా సంగీతాన్ని నిలబెడదాం అనుకున్నాను. కాని కుదిరేది కాదు. రోజూ తెల్లవారుజామున  మూడు గంటలకే లేచి నీళ్ళు పట్టుకోవాలి. ఐదు గంటలకి పాలబూత్ దగ్గరకు వెళ్ళి పాలు తెచ్చుకోవాలి. ఆరు గంటలకి భర్తని లేపి కాఫీ అందించాలి. ఏడు గంటలకి పిల్లల్ని లేపి తయారు చెయ్యాలి. వంట చెయ్యాలి, బస్సెక్కించాలి. భర్తకి టిఫిన్ పెట్టాలి. కేరేజ్ కట్టి ఇయ్యాలి. మార్కెట్‌కి వెళ్ళాలి. ఆ తరువాత ఇంత తిని పడుకుందామంటే కుదరదు కొత్తగా కొన్న టీవి చూడటానికి రోజూ పొరుగు వాళ్ళు వస్తారు. కునికిపాట్ల మధ్య చూస్తూ లేస్తూ ఉండేసరికి పిల్లలు వచ్చేస్తారు. రాత్రి పదిదాకా ఏవేవో పనులు పడుకునేసరికి పదకొండు. మళ్ళీ తెల్లవారుజామున మూడు గంటలకి లేవడం అలా పని చేసి చేసి నా ఇరవైలో అరవైయేళ్ల దానిలా తయారయ్యాను. నాకు నచ్చిన సంగీతానికి కనీసం ఓ గంటైనా రోజులో దొరికేదికాదు. కాని ఇప్పుడు అరవైలలో అమెరికాలో నాకు నచ్చిన సంగీతాన్ని నలుగురికి నేర్పుకొంటున్నాను. అంచేత ఇండియాలో ఇరవైలో అరవైలా బ్రతికిన నేను అమెరికాలో అరవైలో ఇరవైలా బ్రతుకుతున్నాను అన్నారు.

అది TV లో విన్న నాకు అమెరికా జీవితం గురించి కనువిప్పుకలిగింది. అప్పటినుండి నేను చూసిన, విన్న అమెరికా భారతీయ జీవనంలోని అనుభవాలు నా మెదడులో శతపత్రదళ పుష్పంలా వికసించడం మొదలుపెట్టాయి.

*

## సంగీత గురువు శ్రీమతి జ్ఞానం సుబ్రమణ్యం గారికి నమస్కరిస్తూ...

# మల్లిఖార్జునా మాలిక్ కపుర్

**నా** పేరు మల్లిఖార్జునా మాలిక్ కపుర్. నేను మీగైడ్‌ని నేను కన్నడ, తెలుగు, తమిళం, మళయాళం హిందీ ఇంగ్లీషు ఏ భాషలో కావాలంటే ఆ బాషలో చెబుతాను. ఇక నా పరిచయం నాకుటుంబానికి ఎనిమిది వందల ఏండ్ల చరిత్ర ఉంది. మావంశంలో పెద్దకొడుకుగా పుట్టిన ప్రతివాడి పేరుకి మాలిక్ కాపుర్ అని జత చేస్తారు. మాతాత కేదరన్న మాలిక్ కపుర్. మా నాన్న ఈశ్వరప్ప మాలిక్ కపుర్. నాపేరు మల్లికార్జున మాలిక్ కపుర్. నాపెద్ద కొడుకు పేరు నాగన్న మాలిక్ కపుర్. ప్రతి తరంలో పెద్ద కొడుకు ఇక్కడికి వచ్చియాత్రికులకి హలేబీడు దేవాలయాల గైడ్‌గా పనిచేస్తాడు. అతను ఇక్కడి శిల్పాల వివరాలు, చారిత్రక విశేషాలు చెపుతాడు. ఇది మా వంశపారపర్యంగా వృత్తి"

అలా చెబుతూ యాత్రికులందరినీ ఒకసారి కళ్లతో పలకరింపుగా చూశాడు. అతను మాటలతో పల్లకీ చేసి, ఊహల రెక్కలు కట్టి వందల ఏళ్ళు వెనక్కి తీసుకువెళ్ళాడు. హలేబీడు చారిత్రక విశేషాలను మాటలలో చూపించే కనికట్టు మంత్రం అతని సొంతం. పారే నదిలా అతని మాటలు ప్రవహిస్తాయి. కన్నడయాసలో తెలుగు మాటలు పెరుగన్నంలో వేసిన దానిమ్మ గింజల్లా వినడానికి ఎంతో వింతగా ఉన్నాయి. కదలని శిల్పాల మధ్య కదులుతూ సజీవ శిల్పంలా కనిపిస్తున్నాడు మల్లిఖార్జున మల్లిక్ కపూర్

"ఈ గైడు పేరు వింతగాలేదు?"

"ఎంతో పవిత్రంగా, భక్తి శ్రద్ధలతో ఈ దేవాలయం గురించి ఈ శిల్పాల

గురించి చెబుతున్నాడు.”

“ఇక్కడి చరిత్ర తను రాసినంత సాధికారంతో వివరిస్తున్నాడు.”

“ ఆ అలాగే చూస్తూ ఉండండి, చివరన బాగా డబ్బులాగుతాడు.”

“మీరు మరీను, ఈ శిథిలాల్లో దాగిఉన్న కళను మన కళ్ళముందుకి తీసుకువచ్చి మరీ చూపిస్తున్నాడు. ఒక వంద ఎక్కువ తీసుకుంటే తప్పేమిటి?”

ఇలా రకరకాలు మాట్లాడుకుంటూ అతని వెంట నడుస్తున్నారు. గుంపు మధ్యలో ఉన్న ఒక కుర్రాడు  ఈ మాటలు వింటున్నాడు. అతనికి చరిత్ర అంటే బాగా ఇష్టం ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. పరుగులాంటి నడకతో ముందుకి వెళ్ళి గైడ్‌ని ఆపి,

“మీరు ఈ దేవాలయం గురించి ఎక్కడ చదువుకున్నారు.” అని అడిగాడు. ఎవర్కైనా ఏదైనా తెలియాలంటే ఎక్కడో ఒకచోట ఎవరో ఒకరు రాసింది చదవాలని మాత్రమే తెలిసిన కుర్రాడు.

“అప్పుడప్పుడు ఎవరో ఒకరు ఇలాంటి ప్రశ్న అడుగుతుంటారు. దీనికి సమాధానం చెప్పాల్సిందే చెప్పమంటారా”.

“చెప్పు చెప్పు” అన్నారు చాలామంది

“ఎనిమిది వందల ఏళ్ళ క్రితం ద్వార సముద్ర అని పిలువబడే ఈ ఊరికి వచ్చిన శిల్పుల కుటుంబాలలో మాది ఒకటి” అని మొదలుపెట్టాడు.

“ముస్లింలు దేవాలయాలను కూల్చివేయడానికి వచ్చారు కాని కట్టడానికి వచ్చినట్టు ఎక్కడా చదవలేదే” అన్నాడు ఒకతను మెల్లిగా

“మేం ముస్లింలమని మీకెవరు చెప్పారు?. అన్నాడు మల్లిఖార్జున మాలిక్ కాఫుర్.

అందరూ తెల్లబోయి చూస్తూ ఉండిపోయారు.

భారతదేశంలో ఉన్న ముస్లింలందరూ ఎప్పుడో ఒకప్పుడు ఎలాగో ఒకలాగ ఇష్టపడో, కష్టపడో ముస్లింల కత్తి కింద మెడపెట్టి మతం పుచ్చుకున్నవాళ్లే" అని ధృడంగా అంటూ ఆగాడు.

"అయ్యో" ..... అన్న శబ్ధం అసంకల్పితంగా చాలామంది నోట వెలువడింది.

వందలయేళ్ళ వెనుక కత్తి ఎత్తి మామతంలో కలుస్తావా? లేక దీనికి బలి అవుతావా? అని అడిగితే ఏం చేస్తాం.

ముస్లిం రాజుల సిపాయిల కౄరత్వాన్ని కళ్ళముందు చూస్తున్న వాళ్ళలా నిశ్చలంగా ఉండిపోయారు.

"మా పూర్వీకులలో ఒకాయన ఈ దేవాలయ ప్రధాన శిల్పి. ఈ దేవాలయాల్లో శిల్పాలని మా కుటుంబ సభ్యులే చెక్కారు. మావంశస్థులు సుమారు మూడు వందలయేళ్ళపాటు హోయసల రాజుల ఆస్థాన శిల్పులు. ఈ దేవాలయాల గోడలమీద, బయట లోపల ఆనాటి వైభవాన్ని శిల్పాలలో చెక్కారు. ఏనుగులు వాటిపై మనుషులు వాటికి ఉన్న అలంకారాలు గుర్రాలు, రకరకాలు పురాణాలలోని వింత జంతువులు, పువ్వుల గుత్తులను, లతలను, ఆ శిల్పులు రాళ్ళమీద చెక్కారు. ఆనాటి శిల్పకళా వైభవానికి ఈ శిల్పాలు సాక్ష్యాలు. ఈ ఊరిని అప్పుడు ద్వార సముద్ర అనేవారు. బహమనీ సుల్తానులు రెండుసార్లు ఈ పట్టణాన్ని నాశనం చేయడానికి ప్రయత్నించి ఎన్నో విగ్రహాలను, శిల్పాలను ధ్వంసం చేశారు. అందుకే దీనికి హలేబీడు అనే పేరు వచ్చింది. హలేబీడు అంటే కన్నడ భాషలో 'పాతపట్నం' అని అర్ధం. భారత భూభాగంపై వెయ్యేళ్ళుసాగిన ముస్లింల దాడులలో, దాష్టికంలో, పాలనలో సుమారు అరవైవేల దేవాలయాల్ని కూల్చివేశారు. వాటికోసం 'బ్లాక్‌డే' (నిరసన నినాదాలు) లని పాటించాలంటే మరో నూట అరవైయేళ్ళు ప్రతిరోజూ భారతదేశంలో 'బ్లాక్‌డేలే' పాటించాలి" ఆవేశం ఏమీ లేకుండా చరిత్ర పాఠాన్ని అప్పచెప్తున్నట్టు చెప్పాడు.

వింటున్నవాళ్ళు పరిసరాలను మరిచిపోయి వింటున్నారు. తరువాత ఏమి

చెపుతాడో అన్న కుతూహలంతో చెవులు రిక్కించి వింటున్నారు.

వందల ఏళ్ళ పూర్వం మాత్రమే ఎక్కడో, ఎప్పుడో, ఎవరో విగ్రహారాధన పట్ల విశ్వాసంలేని ముస్లింలు దేవాలయాలను, విగ్రహాలను కూల్చివేశారని అనుకోకండి. ప్రపంచంలో అతిపెద్ద బహమియాన్ బుద్ధ విగ్రహాలను ఆఫ్ఘనిస్థాన్‌లో ఆ దేశప్రభుత్వం మార్చి 2001లో ధ్వంసం చేసింది. ఇది ఏ ఒక వ్యక్తో టెర్రరిస్టులో చేసింది కాదు. ముస్లిం మతం పేరిట నాలుగు వందలమంది ముస్లిం మత గురువుల నిర్ణయంతో జరిగింది. జపాన్, శ్రీలంక, స్విట్జర్‌లాండ్, చైనా దేశాలను, అంతర్జాతీయ సంస్థల అభ్యర్థనలను తోసిపుచ్చి మరీ కూల్చారు. ఒక యుద్ధం చేసినట్టు కొన్నిరోజులపాటు పేలుళ్ళతో బుద్ధ విగ్రహాలని కూల్చివేశారు. నడుస్తున్న చరిత్ర తెలుసుకోండి" అని ఆగాడు.

'ఇంత అన్యాయం జరిగిందా ఇంకా జరుగుతున్నదా?' అనే ఒక చిన్న నిప్పురవ్వలాంటి ఆలోచన వింటున్న వారి మెదడులో పడింది.

"అవును... అవును.." అని మెల్లగా అంటున్న వాళ్ళ గొంతులు వినబడుతున్నై.

"ఇక హొయిసలేశ్వరి ఆలయానికి వెళదాం రండి" అన్నాడు గైడ్ మల్లిఖార్జున మాలిక్ కాఫుర్ ఇలాంటి వారిని ఎందరినో చూశాను. 'నిద్రపోతున్న సమాజంలో నిజాల్ని తెలుసుకోలేని మనుషులు వీళ్ళు' అని ఒకజాలి చూపు చూసి ముందుకు కదిలాడు.

"నీ పేరు మీ కుటుంబంలో ప్రతి పెద్దకొడుక్కి పెట్టుకుంటారని దానికేదో కథ ఉంటుందని ఉందనిపిస్తోంది అవునా?" అని అడిగాడు ఒకతను.

"ఉంది, మా పూర్వికులపై కత్తి ఎత్తి ముస్లిం మతంలోకి బలవంతంగా చేర్పించిన వాడిపేరు మాలిక్ కాఫుర్ ఆపేరుని మర్చిపోకూడదని మా కుటుంబాలు వందలఏళ్ళ శ్రమతో నిర్మించిన కట్టడాలను ధ్వంసం చేసిన విషయం తరతరాలవారికి తెలియాలని మా కుటుంబపెద్దలు ఒక పద్ధతి ఏర్పరచారు. ఒక

తరంనుండి ఇంకోతరానికి ఈ శిల్పాల విశేషాలను ఆనాటి ముస్లిం రాజుల ఘాతుకాన్ని వివరించడానికి మా వంశంలోని పెద్దకొడుకుకి బాధ్యత అప్పగించారు” అన్నాడు జవాబుగా.

“పోయిన శిల్ప సంపదపోగా ఇంకా ఇన్ని అద్భుత శిల్పాలు మిగిలి ఉన్నాయి. ఇక్కడున్న ప్రతి శిల్పం, కట్టడం మా శిల్పులు ఎన్నో ఏళ్ళ నిరంతర శ్రమతో తమ జీవితాలను ధారపోసి నిర్మించినవే” అంటూ దారిలో కనిపించిన శిల్పాల దగ్గర ఆగుతూ ఒక్కోదాని గురించి వివరిస్తూ ముందుకు వెళుతున్నాడు.

“ఈ శిల్పం ఇలా క్రింద పడి ఉందేమిటి?” అని అడిగింది ఒక సందర్శకురాలు.

అందరూ శిల్పం చుట్టూ చేరారు. అది ఒక స్త్రీ శిల్పం అని దూరం నుండే తెలుస్తుంది. ఒక చేయి మట్టిలో కూరుకుపోయి మరో చేయిగాలిలోకి లేచి ఉంది. ఆ శిల్పం చాలా అందంగా ఉంది. కాని మొహం వక్షోజాలు శిథిలమైపోయాయి. మిగిలిన శిల్పాల్లో లేని అందం ఈ శిల్పంలో కనిపిస్తోంది.

“ఇది ఒక ముఖ్యమైన శిల్పం దీనికి ఒక కథ ఉంది. ఇందులో నేటి జీవితానికి ఉపయోగపడే విషయం దాగి ఉన్నది. సాధారణంగా దీని గురించి ఎప్పుడూ చెప్పలేదు. ఒకవేళ నేను చెప్పినా మీరు వినలేరు. విన్నా మీకు నచ్చదు. అందుచేత నేను చెప్పను” అన్నాడు.

“ముస్లింలు ఈ విగ్రహాన్ని పాడుచేయడంలో అంత విశేషం ఏమి ఉంటుంది?” అని అడిగాడు. ఒక అరవై సంవత్సరాల వ్యక్తి.

“నిజానికి ఈ విగ్రహాన్ని ముస్లింలు పాడుచేయలేదు. దీని కథ వేరు తొందరపడి తెలియకుండా ముస్లింలే అన్నిటికీ కారణం అని నిర్ణయించుకోకండి. కడివెడు పాలలో విషం చుక్కలా, కోటిమంది ప్రజల మధ్య ఒక రాక్షసుడిలాంటివాడు చాలు జాతికి మచ్చ తేవడానికి అలాంటి వారు అన్ని తరాలలో మన స్వార్థంతో మానవ సమాజ పురోగతికి అడ్డుపడుతూనే ఉంటారు. అలాంటి వారు సమాజ

పరిణామ ప్రవాహంలో కొట్టుకుపోతుంటారు. ఢిల్లీ సింహాసనంపై కూర్చున్న ఎంతో మంది హిందూ, ముస్లిం రాజులు చరిత్రలో కొట్టుకుపోలేదు. కాని వేల సంవత్సరాలు క్రింద పుట్టి తమ కవిత్వంతో, ఆలోచనలతో మనిషి అభివృద్ధికి దోహదం చేసిన ఎంత మంది మేధావులు ఇంకా వారి రచనల ద్వారా మన ఆలోచనల్లో సజీవంగా లేరు? వాల్మీకి, వ్యాసుడు ప్లేటో, అరిస్టాటిల్, కన్ఫ్యూజియస్, బుద్ధుడు... ఇలా ఎంతోమంది.

నిశ్శబ్ధం.

"ఎటో వెళ్ళి పోతున్నాను కదా!" అన్నాడు అందరినీ చూస్తూ

"లేదు, అవును, అలాంటిదే" మెల్లిగా, ఫరవాలేదన్నట్టుగా తలకరు తలోమాట అన్నారు.

"ఇక హొయలేశ్వరి దేవాలయంలోకి వెళదామా" అన్నాడు.

"మరి ఈ నేలపై పడిఉన్న శిల్పం కథో?" అడిగింది వయసు పైబడిన ఆయన పక్కనున్న ఆమె.

"సమయం ఉంటే దేవాలయం చూసిన తరువాత చెబుతాను" అన్నాడు మల్లిఖార్జున మాలిక్ కాఫుర్.

ఆ ఉదంతం చెప్పడం దాటేస్తున్నాడని వారికి అర్థం అయింది అందుకే కాదు కాదు ఇప్పుడే...ఇప్పుడే అన్నాయి కొన్ని గొంతులు.

"ఇక్కడ పెద్దవాళ్ళే ఎక్కువ మంది ఉన్నారు. ఈ నాట్యసుందరి శిల్పం గురించి చెప్పడం అంత మంచిది కాదేమో అనిపిస్తున్నది వీలైనంత వరకూ పెద్ద వాళ్లు ఉన్నప్పుడు ఈశిల్పం గురించి చెప్పాలనిపించదు." అని గైడ్ మల్లిఖార్జున మాలిక్ కాఫుర్ గుంపులో ఉన్న అందరినీ చూసి అన్నాడు.

"చెప్పాలి.... చెప్పాలి...."

"ఎక్కువ మంది యాభై పైబడ్డవాళ్ళే అందుకే వద్దంటున్నాను. సరే! మీరంతా

అడుగుతునన్నారు కనుక చెప్పక తప్పదు” అన్నాడు గైడ్

దూరంగా సముద్ర పక్షి అరుపు. గాలి జోరుగా వీస్తున్న శబ్దం. గైడ్ గొంతు సవరించుకున్నాడు. చెప్పడం మొదలుపెట్టాడు. “మా పూర్వీకులలో అందరూ శిల్పులే అయినా ఒక్కొక్కరూ ఒక్కోరకమైన శిల్పాలను మాత్రమే చెక్కేవారు. జక్కప్ప అనే ఒక శిల్పి ఈ గోడలపై ఉన్న శిల్పబాలికలను చెక్కేవాడట” అని వివిధ నృత్యభంగిమలలో ఉన్న శిలా బాలికల బొమ్మల్ని ఒక్కొక్కటి చూపించాడు.

అందరూ ముఖ ద్వారం వైపు నడుస్తున్నారు. ఒక్కొక్క శిలా బాలిక వెనకటి దానికంటే మరింత అదంగా ఉంది. నాట్యపరమైన వివరాలకు మించి శరీరంలో ప్రతి అంగం అమిత సుందరంగా కనిపిస్తుంది. ప్రతిమల్లో జీవకళ ఉట్టిపడుతున్నది.

“ఇలా వీటిని చెక్కి, చెక్కి ఆ కళలో మంచి నైపుణ్యం సంపాదించాడట జక్కప్ప. ఇలా గోడలమీద శిలాబాలికలను నేలమీద నిలిచి నాట్యం చేస్తున్నాయా అన్నట్లు ఉండే అలాంటి మరికొన్ని శిల్పాలను చెక్కడానికి పూనుకున్నాడట. అతి పెద్ద ఉలి, రకరకాల సైజుల్లో ఉలులు, సుత్తి వంటి పనిముట్ల దగ్గర్నుండి అతిచిన్ని ఉలి, వేలిగోరు వంటి సున్నితమైన ఉలి, సూది మొనలాంటి ఉలి పలు వరుసల మొనలున్న ఉలి, ఇలా ఒక్కొక్కపనికీ కావాల్సిన ప్రత్యేక పనిముట్లతో వాటిని ఉపయోగించే నైపుణ్యంతో రాతిని చెక్కుతూ తన ఊహల్లోని అందాలను ఆవిష్కరించసాగాడు. అందరూ ఆశ్చర్యంతో ప్రతిరోజూ అతని పనితనాన్ని చూస్తూ అతనిని ఉత్సాహపరిచేవారట. మేను సున్నితత్వాన్ని రాతిలో తేవడానికి గరుకుగా ఉండే ఆకుల్ని పసరుల్ని ఉపయోగించి కొత్త కొత్త ప్రయోగాలతో రాత్రింబవళ్లు శ్రమించాడట. తోటి శిల్పులు ఈ శిల్పాన్ని చూసి జక్కప్పని ఎంతగానో మెచ్చుకునేవారట. జీవం ఒక్కటే తక్కువకాని మనిషిని మరిపించేంత అందంగా చెక్కావని పొగిడారట. ఆ శిల్పాన్ని మలచడంలో చివరి భాగంగా ఆ శిల్పం మోముపై చిరునవ్వు సున్నితంగా చెక్కాడట. చిరునవ్వు చెక్కడం పూర్తయ్యేసరికి ఉన్నట్టుండి శిల్పానికి జీవకళ వచ్చిందట ఎన్నో ఏళ్ళు పెంచిన బిడ్డ పెద్దదై, అందంగా కళ్ళ ముందు కదులుతుంటే తండ్రికి కలిగే సంతోషం కంటే ఎన్నో రెట్ల

ఎక్కువ సంతోషంతో శిల్పి జక్కప్ప ఈ శిల్పాన్ని ఆలింగనం చేసుకోబోయాడట...” చెపుతున్న గైడ్ గొంతు మధ్యలో ఏదో అడ్డుపడ్డట్టు ఒక్కసారి ఆగిపోయింది.

“అప్పుడేమయింది” ఉత్సుకతను ఆపుకోలేనివారు అడిగారు.

కొన్ని క్షణాల నిశ్శబ్దం తరువాత తేరుకున్నాడు గైడ్

“ఉలి దెబ్బలు మాత్రమే గుర్తుంచుకున్న శిల్పం, శిల్పిని శత్రువుగా చూసిందట కాని అహోరాత్రాలు కంటికిరెప్పలా చూసుకుని, ప్రేమతో ఉన్నదంతాపెట్టి, పెంచిన తల్లిదండ్రులపై కొందరు ఎదిగిన పిల్లలు తెలియక ద్వేషం పెంచుకుంటారు. అలానే చిన్నప్పటి నుంచి పెట్టిన ఆంక్షలు, కొట్టిన దెబ్బలు మాత్రమే గుర్తుంచుకుని కొట్టికొట్టి పెంచారని కొందరు పిల్లలు ఎదురు తిరిగినట్టు ఆశిల్పం శిల్పిపై ఎదురుతిరిగిందట. ఒక్కసారి ప్రతీకారం తీర్చుకోవాలనే కసితో ఉన్నట్టుండి అతనిమీద పడిందట ఆశిల్పం బరువుకి శిల్పి నేలమీద పడ్డాడట ఐదున్నర అడుగుల ఎత్తున్న ఆ శిల్పం అమాంతం శిల్పిమీద పడిందట” చెప్పడం ఆపి గుంపులో ఉన్నవారిని చూశాడు.

వారిలో చాలామంది మొహాలు పాలిపోయి ఉన్నాయి. ఏడుపొక్కటే తక్కువగా ఉన్నది కొద్దిమందికి.

“మరి ఆశిల్పి ఏమయ్యాడు?” ఓకుర్రాడు అడిగాడు.

“మీద పడ్డ శిల్పం బరువుకి ఊపిరాడకో, ఎదురుతిరిగిన తన తనయని చూసి మనసు చెదిరో, ప్రేమతో మలిచిన బిడ్డ కోపానికి తట్టుకోలేకనో.. ఆ పిడికెడు గుండె ఆగిపోయిందట” అని ఆగాడు గైడ్.

అటువంటి అనుభవానికి గురైన తల్లిదండ్రుల వదనాల్లో విషాదం...

కలలకు ప్రతిరూపాలుగా జన్మించిన పిల్లల్ని పెంచి పెద్దచేయడం, ఉన్నతమైన వ్యక్తిత్వంతో తీర్చిదిద్దడం – రాతిని శిల్పంగా మలచడంలాంటిదే. ఆ రకంగా తల్లిదండ్రులు శిల్పుల వంటివారే. ఆకథవిన్న చాలామందిలో కనపడని

సంఘర్షణ.

జక్కప్ప ఉదతం వారిని కలిచివేసింది. అడుగులు బరువెక్కాయి.

గైడ్ మరో శిల్పం గురించి చెప్పడానికి యాంత్రికంగా కదిలాడు.

ఊహించని అనుభవం ఎదురైన తల్లిదండ్రులు అచేతనమయ్యారు. తాము పెంచి పెద్దచేసిన పిల్లలు తమని ద్వేషించి ఎదిరించి వెళ్లిపోయిన వారిలో బాధ మరొకసారి గుండెల్లో కలుక్కుమంది. వెక్కివెక్కి వస్తున్న గుక్క ఆపుకున్నారు కొందరు.

వందలేళ్ళ కిందట చనిపోయిన శిల్పి జక్కప్పకు అశ్రు నివాళి అర్పించారు. నేటి జక్కప్పలు!

*

**తల్లిదండ్రులు పిల్లల్ని ఎలా పెంచుతారో అన్న విషయాన్ని కళ్లకు కట్టినట్టు చెప్పిన గురువు శ్రీ కప్పగంతులా రామశర్మ గారికి నమస్కరిస్తూ...**

# ప్రేమకి పెద్దబాల శిక్ష !

"ప్రేమ అన్న మాటవిన్నప్పుడల్లా సత్తెప్ప గుర్తుకొస్తాడు. సత్తెప్ప గుర్తొచ్చినప్పుడల్లా నాకళ్ళు చెమ్మగిల్లుతాయి. హృదయం ద్రవిస్తుంది. మనసు ఆర్ధతతో తన్ను తాను మరచిపోతుంది. ఎన్నేళ్ళైనా సరే సత్తెప్పని మొదటిసారి కలిసిన క్షణాలు కళ్ళముందు కదులుతాయి." అన్నారు. కళ్లజోడు తీసి చెమ్మగిల్లి కళ్లు ఒత్తుకుని మా మాష్టారు.

నేను ప్రేమిస్తున్న రమణిని తీసుకువెళ్ళి మాష్టారుకి పరిచయం చేసి పెళ్లి చేసుకొంటాం అని చెప్పాను. దానికి సమాధానంగా మాష్టారు అన్నది నాకూ రమణికి అర్థం కాలేదు.

"చాలా సంతోషం మీరిద్దరూ ప్రేమించుకొంటున్నాం అని చెప్పినందుకు. అమ్మాయి ఏమి చదువుకుంది? ఏఊరు?" అని అడిగారు.

"నాతోనే బీ.టెక్ చేసింది. వీళ్ళది హైదరాబాదు" అని చెప్పాను.

మాష్టారు రమణితో నా చిన్నప్పటి విశేషాలు. నా గురించి ఆయనకున్న అభిప్రాయాలు చెప్పారు. రమణి కూడా మాష్టారుతో చక్కగా మాట్లాడింది. మాష్టారితోపాటు టిఫిన్, కాఫీ పూర్తిచేసి

"ఇక వెళ్లొస్తాం" అన్నాను

"మంచిది" అని మాష్టారు మాతోపాటు గుమ్మందాకా వచ్చారు.

"మాష్టారూ...మీరు సత్తెప్ప గురించి పూర్తిగా చెప్పకుండానే..." అంది

రమణి కుతుహలంతో....

"సత్తెప్ప ఒక స్నేహితుడు. విశిష్టమైన వ్యక్తిత్వం గల స్నేహితుడు" అన్నారు. జవాబుగా.

"మీరు ప్రేమగురించి ఏదో చెప్పాలని మొదలుపెట్టి ఆపేసినట్లనిపించింది. అందుకని అడిగాను" అంది రమణి.

"నిజమే ప్రేమించుకొంటున్నాం అనుకున్నవాళ్ళంతా సత్తెప్ప జీవితం నుండి తెలుసుకోవలసినది చాలా ఉందేమో అనిపిస్తుంటుంది"

"ఏ విషయంలో" అంది రమణి

"ప్రేమ తత్వంతో జీవించిన అనుభవం" అన్నారు మాష్టారు చిరునవ్వుతో

"కొంచెం వివరంగా.. చెప్పండి, ప్లీజ్" అన్నది

"అదో పెద్ద కథ ఇలా గుమ్మం దగ్గర నిలబడి చెప్పే విషయంకాదు. మరోసారి..." మమ్మల్ని సాగనంపాలన్న ఉద్దేశ్యంతో అన్నారు.

"మాకేం తొందరలేదు" అని నావైపు కళ్ళతో నీకూ తొందరలేదు సుమా అని చెప్పి, మాష్టారితో "సత్తెప్ప గురించి చెప్పండి మాష్టారు" అంది పట్టువదలని రమణి

"సరే నేను ఈవెనింగ్ వాక్‌కి వెళుతున్నాను. నాతో రండి" అన్నారు మాష్టారు. సత్తెప్ప గురించి చెప్తాను అన్న ధోరణితో.

ఐదు నిముషాల నడకతో ఊరి పొలిమేరదాటాం. అక్కడ నుండి మాష్టారిప్రక్కనే అటొకరం ఇటొకరం నడవసాగాం. విశాలమైన పచ్చని పొలాలను, అస్తమిస్తున్న ఎర్రని సూర్యుణ్ణి రకరకాల రంగుల ఛాయలతో సుందరంగా ఉన్న ఆకాశాన్ని చూస్తూ నిదానంగా నడుస్తూ చెప్పడం మొదలుపెట్టారు మాష్టారు.

"చాలు చాలోయ్, చాలు నీ ఇంగ్లీషు. ఆపి ఎవరొచ్చారో చూడు. విచ్చుకొన్న

పువ్వులు మీదపడ్డంత హాయినిచ్చే స్వరంతో నవ్వు రెక్కలు కట్టుకొచ్చి ఎగిరిమీద వాలాయి. ఆ పదాలు నామీద. స్కూల్ సెలవల్లో ఇంగ్లీషు నేర్చుకోవాలని పైకే గట్టిగా చదువుతున్న "ది హిందూ" న్యూస్ పేపర్లోంచి తల బయటపెట్టి చూశాను.

ఎదురుగా ఉన్నది, ఆ మాటలన్నది మాములు మనిషి కాదు. మనం రోజూ చూసే వేషం కాదు. ఓ పాతికేళ్ళ వయసున్న వ్యక్తి. నిక్కరు దానిమీద టీషర్టు తలమీద ఏదో వస్తువు దాని నుండి చెవులకు అమర్చిన వైర్లు భుజానికో వింత సంచీతో ఉన్నాడు. ఆరోజుల్లో అలాంటివి నేను చూడటం అదే మొదటిసారి. అవి బెల్ బాటం ఫ్యాంటు రోజులు. తెలుగు మాట్లాడుతున్నాడు కాబట్టి తెలుగువాడు అనుకోవాలి కాని విదేశీయుడో, విదేశాలనుండి వచ్చినవాడో అయ్యుంటాడని అనుకొన్నాను.

"ఎవరండీ మీరు?" అన్నాను న్యూస్‌పేపరు మడతపెట్టి ప్రక్కనపెడుతూ.

"ఎవరేంటోయ్, నేను సత్తెప్పని. నీ ఫ్రెండ్ కిష్టప్ప అన్న సత్తెప్పని. మాకిష్టప్ప నాగురించి నీకు చెప్పలేదా?" చాలా చనువుతో కూడిన అధికారం చేసే మందలింపు స్వరంతో.

కిష్టప్ప నా క్లాస్‌మేట్. మా ఊరికి దగ్గరలో ఉన్న పల్లెటూరి నుండి వస్తాడు. నాకు మంచి స్నేహితుడు.

"లేదండి..." అన్నాను. మాటలకి తడుముకొంటూ.

"పోన్లే నీకు చెప్పకపోయినా పరవాలేదు. నాకు చెప్పాడు. నీ గురించి నీకు ఇంగ్లీషు మాట్లాడాలని చాలా సరదా ఉందని" అంటూ వచ్చి నాభుజం మీద చేయివేసి" అందుకే వచ్చాను. ఇక్కడే ఉండి సరదాగా నీతో ఇంగ్లీషు మాట్లాడదామని"

"అంటే మా ఇంట్లోనా?" అన్నాను గాభరాగా.

"అవును ఇక్కడే ఉండి నీతో...?"

“అదికాదండి.... మావాళ్లు...” మా ఇంట్లో ఈయన ఉండడానికి మా వాళ్ళు ఒప్పుకుంటారా? అన్న భయంతో కూడిన అనుమానంతో

“వచ్చి ఇంతసేపయ్యింది కాఫీ, టీ లాంటివేవీ లేవేంటి?”

“మా అమ్మ...” ఏం చెప్పాలో తెలియక

“ఉన్నారా?” అంటూ ఇంట్లోకి వెళ్ళిపోయాడు. వెంట నేను భయం భయంగా వెళ్ళాను.

వంటింట్లో అమ్మని కలిసి, పరిచయం చేసుకుని, పీట వేసుకుని కూర్చొని నన్ను కూడా ప్రక్కన కూర్చోమని అన్నాడు.

“అత్తయ్యగారు! మా ఇద్దరికీ కాఫీ ఇయ్యండి. అది తాగిన తరువాత ఇద్దరం ఇంగ్లీషులో మాట్లాడుకొంటాం” అన్నాడు.

సత్తెప్ప తీరుకి ఆశ్చర్యపోతున్న అమ్మ మేం ఇంగ్లీషులో మాట్లాడుకొంటాం అని వినగానే చాలా ఆనందంగా “అలాగేబాబు” అంది.

అమ్మని బుట్టలో వేసుకుని అమ్మచేత ప్రేమతో కాఫీ కలిపించుకుని, కబుర్లు చెబుతూ చిన్న గ్లాసుడు కాఫీని అరగంటసేపు తాగిన సత్తెప్పని చూసి ఆశ్చర్యపోయాను. నోట మాటరాలేదు. అతను, అమ్మ మాట్లాడుకొంటున్న. మాటలే విన్నాను. ఏమాత్రం కొత్త, మొహమాటం లేకుండా ఇది తన ఇల్లే అయినట్లు తిరిగేస్తున్నాడు సత్తెప్ప మా ఇంట్లో. నాకోసం ఇతను ఎందుకువచ్చాడని? నన్ను మావాళ్ళు దెబ్బలాడుతారని అనుకొంటున్న నాకు, సత్తెప్ప ఒక వింత వ్యక్తిలా కనిపించాడు.

“ఇంక పదవోయి ఇంగ్లీషులో మాట్లాడుకొందాం” పీటమీద నుండి లేచి నన్ను లేపి. భుజంమీద చెయ్యివేసి ముందు వసారాలోకి దారితీసాడు.

ముందు వసారాలో ఉన్న బల్లమీద మఠం వేసుకుని కూర్చొని ఇంగ్లీషులో మాట్లాడాడు. నాకు ఒక్కముక్క అర్థం కాలేదు.

"ఎంటోయ్, అలా తెల్లబోకు తెల్లవాడి ఇంగ్లీషు ఇలాగే ఉంటుంది మరి. ఒకటి రెండు రోజుల్లో నీకు బాగానే అర్థం అవుతుంది." అని భుజం తట్టి తెలుగులో చెప్పాడు.

"మరి మా ఇంగ్లీషు మాష్టారు క్లాసులో మాట్లాడితే...."

"ఇక్కడే ఇంగ్లీషు నేర్చుకొని, ఇక్కడ వాళ్ళతో, ఇక్కడికిక్కడే మాట్లాడితే ఇక్కడి ఇంగ్లీషు తెలుగులాగానే బాగానే అర్థంఅవుతుందోయ్" అన్నాడు నవ్వుతూ.

"మరి మీరెక్కడ నేర్చుకున్నారు" అని అడిగాను.

"ప్రపంచం నేర్పిందోయ్. షిప్‌ల మీద ప్రపంచం అంతా తిరిగాను. మనం వెళ్ళని దేశం అంటే షిప్ వెళ్ళలేని దేశం అన్నమాట" అన్నాడు. తలపైకి ఎగురవేస్తూ చేతిని గాల్లో ప్రంచపటంలా తిప్పుతూ.

"అబ్బా షిప్‌లలో ప్రపంచం అంతా తిరిగారా?" ఆశ్చర్యాన్ని అక్షరం అక్షరంలో చొప్పించి అన్నాను.

"మరేంటనుకున్నావ్ సత్తెప్పంటే సీన్ అల్ అప్పా! అన్నీ చూసాడని అర్థం" కళ్లు మూసుకుని తలమెల్లిగా ఊపుతూ.

"మీరేం చదువుకున్నారండి?" కుతూహలంగా అడిగాను.

"బ్రతుకు జీవితమోయి! జీవితం మీలా పుస్తకాలు కాదు టెంత్ పరీక్ష మూడోసారి కూడా పోయినప్పుడు పోర్టులో పనిచేస్తున్న మాపెద్దన్న 'ఇక నీకు చదువబ్బదురా' అని మర్చెంట్ నేవిషిప్‌లో ఉద్యోగం వేయించాడు.

"చదువుకోకపోతే మరి అంత మంచి ఉద్యోగం..."

"నేను చేసే ఉద్యోగానికి కావాల్సింది చదువకాదోయ్. కండ బలం" ఒళ్ళంచి పనిచేయడం, రాత్రిపగలనకా కష్టపడటం. మనం పూర్వం ఊర్లో పెద్ద బాక్సర్లవోయ్" అన్నాడు. గర్వంగా రెండు చేతులతో గాల్లో బాక్సింగ్ చేస్తూ.

ఇంతలో మానాన్నగారు ఇంటికి వచ్చారు. ఆయన్ని కూడా పరిచయం చేసుకుని తన గురించి వివరంగా చెప్పుకుని "మీవాడికి ఇంగ్లీషు అంటే ఇష్టం. నాకు ఇంగ్లీషు మాట్లాడ్డం సరదా. ఇక్కడ నాతో ఇంగ్లీషులో మాట్లాడేవారెవరూ లేరు. అందుకని మీ ఇంటికి వచ్చేశానండి" అని చెప్పాడు.

ఆయన సంతోషించి, "రాత్రిభోజనం చేసి వెళ్ళండి" అన్నారు.

"లేదండి, ఓ నాలుగైదురోజులు ఉండి వెళతా" అన్నాడు, ఎన్నోఏళ్ళ పరిచయం ఉన్న వ్యక్తిలా. నాన్నగారి మీద ఇతని ప్రవర్తన ఎటువంటి ప్రభావం చూపిందోకాని అలాగే మీఇష్టం అన్నారు.

"మీకంటే చిన్నవాడిని నన్ను నువ్వు అనేయండి." అన్నాడు వినయంగా నాన్నగారు నవ్వుతూ మాట్లాడడం మొదలుపెట్టారు. అక్కడక్కడ తెలుగులో ఇంకేవో భాషల పదాలు కలిపి తన షిప్ ప్రయాణాల గురించి చాలా ఆసక్తికరంగా చెప్పాడు.

నేను "అహ..ఉహూ...అలాగా....అబ్బో...అమ్మో...ఉ, బాబోయ్.. అమ్మోయ్" లాంటి శబ్దాలతో వినడంలో పొద్దుపోయింది. రాజులు పోయినా, రాజ్యాలు పోయినా మాఊరి కోటగుమ్మం దగ్గర గంటలు కొట్టడం పోలేదు. ఖాసావాళ్ల వంశపారపర్యంగా వచ్చిన వృత్తిగా వాళ్ల కుటుంబంలో వ్యక్తి గంటలు కొడతాడు. రాత్రి రెండు గంటలు మోగగా విన్నాం. ఇక నిద్రపోదాం అనుకున్నాం.

రాత్రి పగలన్న భేధం లేకుండా ఐదురోజులు గడిచిపోయాయి. నాకు ఇంగ్లీషు మాట్లాడటం అంత బాగా రాకపోయినా ఇంగ్లీషులో మాట్లాడటం అంటే ఉన్న భయం పోయింది. సత్తెప్ప ఎంత దగ్గరైపోయాడంటే, 'మీరు', 'సత్తెప్పగారు' అని ఆయన్ని పిల్చే నేను సహజంగానే సత్తెప్ప అనడం జరిగిపోయింది. దానికి సత్తెప్ప ప్రోత్సాహమే కారణం.

వెళ్లేముందు తన వాక్‌మెన్ ఇచ్చి వెళ్లిపోయాడు. ఇంకా ఏమైనా కావాలంటే తీసుకోమని తన సంచి చూపించాడు. వెళ్లిన తరువాత రోజూ గుర్తువచ్చేవాడు.

రోజులో ఒక్కసారైనా ఇంట్లోవాళ్లు కూడా ఏదో ఒక విషయంలో సత్తెప్పని గుర్తుచేసుకునేవారు. ఒకసారి అతను ప్రేమించడం మొదలుపెడితే చుట్టూ ఉన్న వాళ్లంతా అతన్ని ప్రేమించవల్సిందే అని అనిపిస్తుంది. అప్పుడు తెలీలేదుకాని ఈ సత్తెకాలపు మనిషి, సత్తెప్ప నూటికి నూరుపాళ్ళు మనుషుల్ని ప్రేమించే మనిషి.

కిష్టప్పని అడిగి సత్తెప్ప వివరాలు తెలుసుకునేవాడిని. మళ్ళీ షిప్‌మీదకి ఎటో వెళ్ళాడని, తిరిగి వచ్చాడని ఉద్యోగాలకోసం వెతుకుతున్నాడని. మరోసారి కలకత్తా వెళ్ళాడని ఇలా వింటూ ఉండేవాడిని. అప్పుడప్పుడు ఇంటికి వచ్చేవాడట. నేను పై చదువులకి పట్నం వెళ్లి పోయాను. తరువాత సత్తెప్ప మనసులో తరచూ మెదులుతున్నా వివరాలు కనుక్కోవడానికి కిష్టప్ప దగ్గరలో లేడు. వాళ్ల మేనమామ పనిచేస్తున్న బాణిబీహార్‌లో చదువుకొనేందుకు భువనేశ్వరం వెళ్లిపోయాడట. ఏళ్లు గడిచిపోయాయి. సత్తెప్ప గురించి దాదాపుగా మరచిపోయినా, సత్తెప్ప నూరిపోసిన ధైర్యం, నాలో కలిగించిన చైతన్యం, నన్ను వెన్నంటి ఎంతో దూరం నడిపించింది. చిన్న ఊర్లో ఉపాధ్యాయుడిగా చేరాను. అతను నేర్పిన పాఠాలు ఎంతో ఉపయోగపడ్డాయి. నాకే కాదు నాతోటి ఉపాధ్యాయులకు కూడా.

స్వార్థపరులైన రాజకీయ నాయకుల చుట్టూ ఉండే ఆకతాయి మూక తెలివితక్కువ చర్యల బారిపడ్డ బాధ్యులయ్యే ఉపాధ్యాయులందరి తరుపునా వకాల్తా తీసుకొని నేను ఉన్నతాధికారులతో ఇంగ్లీషులో వాదించి, వొప్పించి. తప్పుడు ఆర్డరులని సరిదిద్దించే పనిలో తరచు హైదరాబాద్ వెళుతుంటాను.

అలాంటి ఒకానొక రైలు ప్రయాణంలో సత్తెప్ప కలిసాడు. కౌగిలించుకున్నాడు. ప్రక్కనే కూర్చోబెట్టుకొన్నాడు. భుజంమీద చెయ్యేసి మాట్లాడడం మొదలుపెట్టాడు. ఎన్నెన్నో విషయాలు, అన్నీ మాట్లాడుకొంటున్నాం.

“పెళ్ళైందా?” అన్నాడు.

“అయ్యింది. ఒక అమ్మాయి కూడా” అన్నాను సిగ్గుసిగ్గుగా. ఇరవై ఏళ్ళ క్రితం మొదటిసారి కలిసిన పన్నెండేళ్ళ కుర్రాడినని గుర్తురావడంతో

"వెరిగుడ్.... వెరిగుడ్..." అని వీపుమీద చరిచాడు.

"మరి నీకు సత్తెప్ప" అన్నాను. కొద్దిసేపు మౌనం తర్వాత

"ప్రేమరుచి తెలిసిన వాడికి పెళ్ళి ముఖ్యం కాదనేమో, అవదేమో..." అన్నాడు చిరునవ్వుతో

"అర్థం కాలేదు" అన్నాను.

"ఎప్పుడైనా తేనె తుట్టిలోంచి వచ్చిన తేనె రుచి చూశావా?"

"రుచి చూశాను" అన్నాను జవాబుగా

"తనివితీరా ఆతేనె త్రాగిన తరువాత భోజనం చెయ్యాలనిపిస్తుందా?"

"............." ఆలోచనలో పడ్డాను.

"నాకైతే అనిపించదు. ఆకలైనా ఎన్ని పిండి వంటలున్నా ఆ తేనెపట్టు ఒకట్టైనా ఉండాలి. దానితోనే భోజనం మొదలుపెట్టాలనిపిస్తుంది" అన్నాడు అవునా కాదా అన్న ప్రశ్నని అడక్కుండానే అడుగుతున్నట్టు.

అప్పటిదాకా పరిసరాలను గమనించని నేను చుట్టూ చూశాను. మా చుట్టూ ఉన్న నలుగురు కూడా మాటలాపి మమ్మల్నే చూస్తున్నట్లు, మామాటలే వింటున్నట్లు గమనించాను. నేను కూర్చొన్న చోటులోకి కొంచెం ఇబ్బందిగా కదిలాను. ఏం మాట్లాడాలో తెలియక.

ఇంతలో అందులో ఒక యువకుడు లేచి నన్ను దాటి సత్తెప్ప ఎదురుగా ఖాళీగా ఉన్నజాగాలో కూర్చొని ముందుకువంగి సత్తెప్పవైపు చూస్తూ

"సార్, నేను మనుషులెందుకు ప్రేమించుకొంటున్నారన్న విషయంపై రీసెర్చి చేస్తున్నానండి ఈ విషయంలో అమెరికాలో న్యూయార్కులో యూనివర్సిటీలో ప్రొఫెసర్ ఆర్థర్ ఏరన్ స్టూడెంట్‌ని. మీరు ఇంతకుముందు చెప్పింది. వివరంగా చెప్పండి" అన్నాడు.

సత్తెప్ప ఒక్కసారి తలఎత్తి ఆ కుర్రాడిని చూసాడు.

జీన్‌పాంట్, టీషర్టు ఐపాడ్ హెడ్‌ఫోన్స్‌తో అమెరికా వేషంలో ఉన్నాడు. నేను చూశాను. నాకు ఇరవై ఏళ్ళ క్రిందటి సత్తెప్ప గుర్తొచ్చాడు.

"చూడవోయ్ దేన్నైనా తెలుసుకోవాలంటే  అనుభవించాలోయ్ సీసాలో తేనె బిరడాపెట్టి బయటనుండి ఎంత చూసినా రుచి తెలుసుకోగలవా?" అన్నాడూ మూర్తీభవించిన గురువు కంఠంతో.

"అందరికీ అనుభవం అందకపోయినా అనుభవించినవాళ్ళ అనుభవాలను తెలుసుకొని అవకాశం కోసం ఎదురు చూడొచ్చు కదండీ" అన్నాడు. ఆకుర్రాడు

సత్తెప్ప చిర్నవ్వు నవ్వాడు. దాన్ని ప్రోత్సాహంగా తీసుకొని ఆ యువకుడు మరింత ముందుకు జరిగి

"మీరు ప్రేమలో ఎలా పడ్డారుసార్" అని అడిగాడు.

పరవళ్ళు తొక్కుతూ పారే నదిలా ఉండే సత్తెప్ప నిశ్చలమైన సరస్సులా మారిపోయాడు. మౌనంగా మిగిలిన నలుగురు అతనివైపే చూస్తున్నాం. రైలువెళు తున్న శబ్దం తప్ప మరే శబ్దంలేదు మామధ్య.

"నేను ప్రేమలో పడలేదు నీళ్ళలో పడ్డాను." అని మొదలుపెట్టాడు సత్తెప్ప. "నేను షిప్‌లో పనిచేసే రోజుల్లో ఒకసారి మా షిప్ గల్ఫ్ ఆఫ్ మెక్సికో నుండి గేల్వెష్టన్ హార్బర్  వెళుతున్నది. నేను డెక్ తుడుస్తున్నాను. అప్పటికే రెండు షిఫ్టులు వరసగా పనిచేసి ఉన్నాను అలసట, ఆకలి, నిద్ర అయినా తప్పలేదు. డ్యూటి ఎండ, వేడిగాలి ఇంతలో ఏం జరిగిందో తెలీదు. తెలివి వచ్చేసరికి హాస్పటల్ బెడ్‌మీద ఉన్నాను. ప్రక్కనే మా ధర్డింజనీరు. షిప్పింగ్ ఏజెంట్ ఉన్నారు. నేను హార్బర్ నీళ్ళలో పడిపోయానని, నేను సేఫ్టీ జాగ్రత్తలేవీ తీసుకోకపోవడం వల్ల వాళ్లకి వెతకడం కష్టం అయింది. దొరికేటప్పటికే స్పృహలో లేనని, కాలు విరిగిందని, చాలా రక్తంపోయిందని, అదృష్టవశాత్తు పెద్ద చేపలేవి పసిగట్టకపోవడం వల్ల వీళ్లకి దొరికానని కెప్టెన్ ఆస్పత్రిలో చేర్చమని చెప్పారని చెప్పారు. నువ్వు ప్రేమ

గురించి అడిగితే ఈ సోదంతా ఎందుకు చెప్పాననుకొంటున్నావా?" అన్నాడు. ఆ కుర్రాడిని ఉద్దేశిస్తూ.

"............."

"మా ఇంజనీరు ఏజెంట్ వెళ్లిపోయారు. కొద్దిసేపుండి. కుడికాలు కదపలేకపోయాను. నొప్పిలేదుకాని బెడ్‌కి అటూ ఇటూ రకరకాల మెషిన్‌లు బేగ్‌లు, నాచేతికి సెలైన్ లైన్, గది నిశ్శబ్దంగా ఉంది. మెషిన్‌లు చేసే శబ్దాలు తప్పించి. జరిగినవేవీ గుర్తులేవు. ఐదు ఆరు గంటల అబ్జర్వేషన్ డెక్ నుండి సముద్రాన్ని చూస్తుంటే కలిగే స్తబ్దతలాంటి భావన, అంతే! అలాంటి సమయంలో ఎప్పుడోకాని కనిపించని మెరుపు మెరవడం. అది అది చూడడం గొప్ప అదృష్టం సాదారణంగా సముద్రం మీద మెరుపులు భూమి మీదలా రావు. మేఘాలవెనక కాంతి కోలాహలం వింతవింత రంగులలో కాంతిని చిమ్ముతూ ఉంటుంది. ఎప్పుడో కాని పెళ్లుమన్న శబ్దంతో ఆకాశం నుంచి దూకి నీటి మీద పడి నీటి నుండి ఎగిరి ఆకాశానికి వెళుతున్న భ్రాంతి కలిగించే లాంటి మెరుపు కనిపించదు. అలాంటిది ఒకసారి చూసాను. అలాంటిదే మళ్ళీ జరిగింది. హాస్పిటల్‌బెడ్ మీద పడుకున్న నాకళ్ళముందు తెల్లని తెలుపుతో మెరిసిపోతున్న గౌన్ తలమీదటోపీ చేతిలో ట్రే తో నాగది గుమ్మంలో ప్రత్యక్షమైంది ఓ నర్సు, మెరుపులా. ఇరవై ఐదేళ్ళు ఉంటుందేమో. చిరునవ్వుతో పలకరరించింది. ఏవేవో మందులిచ్చింది. వేసుకొన్నాను. చార్టులో ఏదో రాసుకుంది. ఇక వెళుతుందేమో అన్న క్షణంలో ఇంకా ఉంటే బాగుంటుందనిపించింది. నా మనసు గ్రహించినట్లు బెడ్ ప్రక్కన స్టూల్‌మీద వచ్చికూర్చుంది. నా వివరాలు అడిగింది. చెప్పాను తన పేరు మరియా అని చెప్పింది. నేను సుమారు ఆరువారాల నుండి ఎనిమిది వారాలు హాస్పిటల్‌లో ఉండాల్సి ఉంటుందని చెప్పింది. రోజు మూడు పూటలా వస్తానని చెప్పింది. ఆమె ఉన్నంతసేపూ నేను నా పరిస్థితి అంతా మరచిపోయాను. వెళతానన్నప్పుడు నేనూ బై అన్నాను. కాని ఆమె వెళ్ళిందగ్గర్నుండి మళ్ళీ ఎప్పుడొస్తుందా అని ఎదురుచూశాను". అని ఒక నిమిషం ఆగాడు. అటుఇటు కదిలాడు. మేం ఎవ్వరం

ఏం మాట్లాడలేదు. మళ్ళీ తనే మొదలుపెట్టాడు.

“ఆడ గుంటలు మనకి కొత్తకాదు ఎన్నో దేశాలు తిరిగాను. ఎంతోమందిని చూశాను. వాళ్లతో పడుకున్నాను. ఉదయం లేచిన తరువాత వాళ్ళెవరో నేనెవరో మరచిపోయాను మరియాకు వాళ్లకి పెద్ద బేధం ఉంది. మరియా వెళ్లినా ప్రక్కనే ఉన్న భావన. మరియా వచ్చినప్పుడల్లా కొత్త ఉత్సాహం ఉండేది. వేసవికాలంలో ఎక్కడో పడుతున్న వర్షం చల్లదనాన్ని తీసుకొచ్చే గాలిలా వచ్చేది. భోగి పండుగనాటి తెల్లవారుఝామున బోగిమంట ప్రక్కన కూర్చుంటే ఆ మంట ఇచ్చే వెచ్చదనాన్ని గుర్తుకు తెప్పించేది. ప్రక్కన కూర్చుంటే రోజూ ఓ పదిహేను నిముషాలు ఏవేవో కబురులు చెప్పేది. చెప్పించుకునేది. ప్రక్కనే కూర్చుని ఒంటిమీద చెయ్యివెయ్యకుండా ఆడది ఎంతో ఆనందాన్ని ఇవ్వగలదని నాకు అప్పుడు తెలిసింది. ఇంక ఒకటి రెండు రోజులలో వెళిపోతాననగా ‘ఐ లవ్ యు’ అన్నాను, ఆమెతో. ‘నేను నిన్ను ప్రేమిస్తున్నాను’ అంది.”

“మరి పెళ్లి ఎప్పుడు?” అన్నాను, ఆనందంతో

“కుదరదు” అంది

“ఎందుకు” అన్నాను ఆతృతగా

“నేను అన్నింటిని విడిచిపెట్టిన నన్ ని కనుక అంది” నవ్వుతూ మొదటిసారి మెడలో శిలువ చూసినప్పుడు క్రిష్టియన్ అని అనుకొన్నాను. అయితేనేం అనుకొన్నాను కాని నన్ అని అనుకోలేదు.

ప్రక్కనే కూర్చొని నా చేతిలో చెయ్యివేసి మెత్తగా వత్తి “పెళ్లి చేసుకోకపోయినా ప్రేమిస్తాను” అంది.

“వీలవుతుందా?” అన్నాను.

“అవుతుంది. జీసస్ అందరిని ప్రేమించమన్నాడు.” అంది ప్రేమగా.

అర్థంకాక ఆమె మొహంలోకి చూస్తూ ఉంటే తనే “దేవుడంటే ప్రేమ” అని అంది.

ఒక ముద్దు లేకుండా ఒక కౌగిలింత లేకుండా ఇన్నాళ్ళు ఇంత హాయిని ఎలా ఇచ్చిందా? అని ఆశ్చర్యపోయాను. శరీరంతో సంబంధంలేనిది, దానికంటే మించి ఎంతోకాలం ఉండే ఆనందాన్ని ఆ రెండు నెలల్లో ప్రతిరోజూ అందించింది. ఏమీ ఆశించకుండా ఎన్నో సేవలు చేసింది. బుజ్జగించేది, లాలించేది. మొదటి చూపు నుండి ఆమె నా కోసమే ఉన్నాది అన్న భావన కలిగింది. మరియా ప్రేమదేవతకు మనిషి రూపం అనిపిస్తుంటుంది. అన్నాడు కళ్ళనుండి జారుతున్న ధారని చేత్తో మెల్లగా తుడుచుకుంటూ.

కొంత సేపయ్యాక తేరుకుని "ప్రేమంటే తెలియని నాచేత అక్షరాలు దిద్దించి ప్రేమతో మరో మనిషిని చేసింది. జీవితాంతం గుర్తుంచుకునే ఆనందాన్ని అందించింది." అన్నాడు మెల్లిగా.

"తరువాత " అన్నాడు ఆ యువకుడు

"ఇండియా వచ్చేశాను. నాకు జరిగిన సర్జరీవల్ల మళ్ళీ షిప్ఎక్కే అవకాశం పోయింది. ఇక్కడే ఉద్యోగం వెతుక్కొన్నాను. ప్రపంచం అంతా తిరిగాక, తిరగడం అలవాటు అయిన నాకు ఒక ఊరు జైలులా, ఉద్యోగం గుదిబండలా అనిపించాయి. అందుకే ఒక ఊర్లో ఉద్యోగంలో స్థిరంగా ఉండలేకపోయాను. ప్రస్తుతం ఓ షిప్పింగ్ కంపెనీ వాళ్ల దగ్గర ఓ చిన్న ఉద్యోగం. ఒక దినపత్రిక వాళ్ళకి రోజుకో రూమి ప్రేమ కవిత తెలుగులోకి అనువాదం చెయ్యడం నా పనులు" అన్నాడు చూస్తూ.

"పెళ్లి...." అన్నాను నేను. నన్ను ముందు అడిగిన ప్రశ్నకు ఎదురు ప్రశ్నగా.

"పెళ్ళి... చేసుకోమంది మరియా ఎవరినైనా ఓమంచి అమ్మాయిని చూసి. చేసుకుంటాను నిన్ను ప్రేమిస్తూ అన్నాను. ప్రేమ మనసుకి సంకెళ్లు వెయ్యద్దు. అహంకారానికి సంకెళ్ళు వేస్తుంది. అహంకారం తగ్గితే ప్రేమించడం సులభం ప్రేమ ఉన్నచోట అహంకారం ఉండదు. భగవంతుడిచ్చిన నిండు జీవితాన్ని వృధా చెయ్యకుండా చక్కగా జీవితాన్ని ప్రేమించు. నిన్ను ప్రేమించేవారితో జీవితం పంచుకో" అంది.

నేను తిరిగి వచ్చాక ఇక దేశాలు పట్టి తిరగనని విన్న తరువాత మా అమ్మ కూడా పెళ్లి చేసుకోమంది. మా ఊర్లోనే మా దూరపు చుట్టాల వాళ్ళ అమ్మాయి దవనం అనే ఆమెకు నేనంటే చాలా ఇష్టం అని చెప్పింది.

దవనాన్ని వాళ్ళింటికెళ్లి ఒకసారి చూశాను. అందంగానే ఉంటుంది. చదువుకొంది. కాని మరియాతో పోలిస్తే ఏమాత్రం నప్పలేదు. ఓ నెలరోజులు ఆలోచించాను. మరియా నన్ను బుజ్జగించి దవనాన్ని మరోసారి దవనంలా మాత్రమే చూడమన్నట్లు తోచింది. ఆ తరువాత దవనంతో పరిచయం పెరిగింది. నాగురించి నాకు తెలిసిందంతా వివరంగా దవనానికి చెప్పాను. మరియా గురించి కూడా. అయినా సరే ఇష్టమే అంది. మరో ఆరు నెలలు అలాగే గడిచాయి. దవనానికి ప్రేమంటే ఉన్న భావన చాలా తేలికైనది. తనకు కావలసింది పెళ్లి, సంసారం, పిల్లలు, బట్టలు, నగలు నలుగురితో గొప్ప అలాంటివే. సినిమాల ప్రభావం చాలా ఎక్కువ. ఒకసారి నిజమైన ప్రేమ రుచి చూసిన నాకు తనతో బ్రతుకులో అవి దొరకవని తెలిసిపోయింది. అయినా మనిషిగా దవనాన్ని ప్రేమించడం మొదలుపెట్టాను. అందమైన దవనానికి ప్రేమగంధం బొత్తిగా లేదు. బాహ్య సౌందర్యంతో మెరిసిపోయే దవనానికి అంతఃసౌందర్యలో మరియాతో పోలిస్తే ఆవగింజైనా లేదు. తనకి మంచి ఉద్యోగం, సంపాదన  ఉన్న మగాడు కావాలి అదే ఆమెకు చెప్పాను. అవును అని ఒప్పుకుంది. ఆరెండు నాకు లేవు. ఉన్నవాడిని చూసుకోమన్నాను. దవనంమీద ప్రేమతోనే అలా చెప్పాను. నా నాలికమీద ఉన్న పుట్టుమచ్చ ప్రభావమో ఏమోకాని రెండు నెలలు తిరకుండా ఒక వారం రోజుల్లో పెళ్లికోసం వచ్చిన ఎన్నారై కుర్రాడితో పెళ్లై అమెరికా వెళ్లిపోయింది. ఆనందంగా వీడ్కోలు ఇచ్చాను. హాయిగా బైబై చెప్పింది.

"ఆ తరువాత..." అన్నాడు. ఎదురు బెర్తు మీద కూర్చొన్న ఎగ్జిక్యూటివ్.

"ఏముంది మామూలే ఉద్యోగం. లైబ్రరి నుండి మంచి పుస్తకాలు తెచ్చుకుని చదవడం ఈ అలవాటు హాస్పిటల్‌లో ఉన్నప్పుడు మరియా నేర్పింది. అదే అలవాటు అలా ఇప్పటికీ ఉంది. ఆ లైబ్రరీలో పనిచేసే లిల్లీ అన్న ఆంగ్లో

ఇండియన్ అమ్మాయితో పరిచయం. బాగా చదువుకొన్నది. నేనెలాంటి పుస్తకాలు చదివితే బాగుంటుందో చెప్పేది. తీసిపెట్టి ఉంచేది. ఇద్దరి మధ్య ఆకర్షణలేదు కాని పరిచయం గట్టిపడింది. ఓ ఏడాదిలో షేక్స్పియర్‌ని బాగా చదివింది. ప్రేమ గురించి మంచి అవగాహన ఉన్నది. పాశ్చాత్య తత్వవేత్తలు, శాస్త్రతవేత్తలు, మతప్రవక్తలు మనిషి గురించి, మానవ సంబంధాల గురించి విషయాలని నాకు వివరంగా తెలియజెప్పేది. అన్ని విధాల ఒకరికొకరం సరిపోతాం అనుకొన్నాను. పెళ్లి దాకా ఆలోచించాం. పెళ్ళికి తను చెప్పిన రెండు కండీషన్‌లలో ఒకదానికి నాకు మనసు రాలేదు. రెండోదానికి తాహతులేదు. అలా నేను లిల్లీ ఒకటి కాలేకపోయాం"

"ఏం కండీషన్‌లు పెట్టింది ఆమె." అడిగాడు యువకుడు "మొదటిది మతం మార్చుకుని నేనుక్రిస్టియన్ అవడం రెండోది ఇంగ్లండ్‌లో ఉద్యోగానికి వెళ్లడం...." అన్నాడు పేలవంగా నవ్వుతూ అలా నిచ్చెన ఎక్కలేదు మా ప్రేమ.

"అయ్యో ...." అన్నాడు అప్పటిదాకా శ్రద్ధగా వింటున్న మరో శ్రోత.

"అవును నేను అయ్యో..అనే అనుకొన్నాను లిల్లీతో గడిపిన ప్రతిరోజూ మనిషి మమత, ప్రేమ, ఇలా ఎన్నెన్నో విషయాలు నాకు తెలియనివి చెప్పేది. నన్ను నిజంగానే ఉత్తేజపరిచేది."

"ఇంత తెలుసుకున్న మీరు ఎదుటి మనిషిని చూడగానే పూర్తిగా చదివెయ్యగలరేమో కదా! " అన్నాడు. ఆ యువకుడు

"అది నిజమే, అని నేను కూడా ముందు అనుకొన్నాను. కాని నాకు తెలిసింది తక్కువ, నేను ఎదుటివాళ్ళలో చదవగలిగింది మరింత తక్కువ అని తర్వాత తెలిసింది.

"అది ఎలా?" అని అడిగాడు ఆ యువకుడు.

"విశాఖపట్నంకి వచ్చి కొత్త ఉద్యోగం వెతుకుకొన్నాను. నేను కొత్తగా అద్దెకు దిగిన వాళ్లింటి అమ్మాయి రోజాని చూశాను. ఆమెని పూర్తిగా

తెలుసుకున్నాను. అనుకొన్నాను మొదటి పరిచయంలోనే. నాకు అన్ని విధాల సరిపోతుందనుకున్నాను. ఈ విషయం వాళ్ళ నాన్నగారితో చెప్పాను సూటిగా వాళ్లింట్లో దిగిన మొదటి వారంలోనే ఆయన చాలా సంతోషించారు. కాని మా అమ్మాయి వయసు ముప్పై అన్నారు. సంతోషం, నావయసు కూడా ముప్పైయే అన్నాను. ఆయన ఆనందించారు. రోజాతో నా పరిచయం చాలా స్పీడుగా సాగింది. వాళ్ల వాళ్ళు పెళ్ళి ప్రయత్నాలు మొదలుపెట్టారు. మావాళ్లు చాలా సంతోషించారు. రోజాకి కోపం ఉందని తెలుసు. అందమైన గులాబికి ముళ్లు ఉండడం సహజం దాన్ని సున్నితంగా తప్పించుకోవాలి కాని ముల్లు ఉందని పువ్వు ఒదులుకోం అనుకొన్నాను. కాని పెళ్లికి ముందు రోజే మాఅమ్మ, చెల్లెలి విషయంలో పెద్ద గొడవ జరిగింది. సర్ది చెప్పబోయాను. విరుచుకుపడింది. రోజా అహంకారం విశ్వరూపం చూశాను. హడలిపోయాను. ఎంత తెలివైనది. ఎంత ప్రేమించింది అలాంటి ఈమెలో ఇంత అహంకారం ఎలా సాధ్యం అని ఆశ్చర్యపోయాను."

ఆ పెళ్లి జరిగుండదని అందరం అనుకొన్నాను. మౌనంగా ఉన్నాం.

"ప్రేమ పరమపద సోపానపటంలో అహంకారం పెద్ద పాము" అన్నాడు. సత్తెప్ప ఓ వేదాంతిలా.

చాలాసేపు ఎవ్వరం ఏం మాట్లాడలేదు. రైలు పరుగెడుతున్నది. మోగుతున్న సెల్ ఫోన్‌లను కాని వచ్చిపోయే మనుషులను కాని పట్టించుకోకుండా అందరం సత్తెప్ప చెప్పిన విషయాలనే తలచుకొంటున్నాం. తరచి తరచి అతని మాటల్లోని భావాల గురించే ఆలోచిస్తున్నాం. ఎవరి మటుకు వారే.

"అంత మరీ సీరియస్సయిపోయారే!" అన్నాడు. సతత్తెప్ప గలగలా నవ్వుతూ "బ్రతుకు అందమైన ఉదయంలాంటిది. ఎంత దూరం నుండి చూస్తే అంత అందంగా ఉంటుంది. అందుకే చందమామ అంత అందంగా ఉంటాడు. కాని మైక్రోస్కోపులాంటి తగిన సాధన ఉంటే జీవితాన్ని ఎంతో దగ్గరగా సూక్ష్మంగా శోధించి చూస్తే ఆ ప్రపంచమే వేరు దాని అందమే వేరు అన్నాడు. చీరప్ మేన్"

అని వంగి అమెరికాలో చదువుకుంటున్న యువకుడి భుజం తడుతూ.

"లిల్లీగారు అలాంటి కండీషన్లు పెట్టకుండా ఉండాల్సింది. అన్నాడు అయ్యో అన్న పదాన్ని అన్ని పదాలలో ఇమిడ్చి.

"లిల్లీ తప్పేంలేదు. నిజంగానే ప్రేమించింది. కాకపోతే తనకోసం ప్రేమించింది. తనకు కావాల్సినవి కోరింది. నేను ఇవ్వగలిగితే పెళ్లి చేసుకునేది. కాని నేను మతం పుచ్చుకున్నా ఇంగ్లండ్‌లో ఉద్యోగం నాకు రాదు. తనకి కావాల్సినవి ఇవ్వగలిగినవాడు దొరుకుతాడు. అతనితో సుఖపడగలదు." అన్నాడు ఏదో కష్టమైన కెమిస్ట్రీ సమీకరణం వివరిస్తున్న టీచర్లా.

ప్రేమించిన అమ్మాయి చెయ్యి జారిపోతుందే అని ఇతనికి బాధలేదా? అన్న ఆలోచన మాఅందరిలో రకరకాలుగా వచ్చింది.

ఏ కండీషన్లు పెట్టకపోయినా నా అంతట నేనే ఉన్నతికి దూరం అవ్వవలసి వచ్చింది. అని వేదాంతిలా ఒక నవ్వు నవ్వాడు సత్తెప్ప.

ఉలిక్కిపడి అతనివైపు చూసాం

"ఉన్నతి అంటే ...." అర్థంకాక వివరంగా చెప్పమని అడిగాడు. అమెరికాలో చదువకుంటున్న యువకుడు, మాందరికంటే ముందుగా తేరుకుని.

"ఉన్నతి అంటే ఉన్నతి షా ఒక రోజు బొంబాయి జింఖానా దగ్గర బస్సు కోసం ఎదురు చూస్తున్నాను. బస్సు వచ్చింది. కాని ఎక్కబోయే లోపల నా ముందు బస్సు ఎక్కడానికి ప్రయత్నిస్తున్న యువతి బస్సురాడ్ పట్టుకోలేక వెనక్కి పడబోయింది. నేను రెండు చేతులతో పట్టి నిలబెట్టాను. అలా మొదలయింది ఉన్నతితో నా పరిచయం.

ఎంత మంది మనుషుల మధ్య కూర్చున్నా నా షిప్పు ప్రయాణం అనుభవాలను ఆమెకు చెపుతూ ఉంటే చుట్టూ సంద్రపునీళ్ళే ఉన్నట్టు తోచేది. నా ఆరేళ్ళ షిప్పు ప్రయాణం అనుభవాలను ఆరు నెలల్లో మా మధ్య కబుర్లలో

నెమరు వేసుకున్నాను. నా షిప్పు ప్రయాణం అనుభవాలని ఆమెతో పంచుకొని ఇంటికి తిరిగి బస్సులో వస్తుంటే విమానంలో ఎగిరి ఇంటికి వస్తున్న భావన కలిగేది. నేను ఆకాశంలో తెల్ల మబ్బుల మీద తేలి ఆడిన భావన కలిగింది. అన్నం నీరు తరువాత మనిషిని బ్రతికించడానికి కావలసిన శక్తి ఆమె, ఆమెకు తెలియకుండానే నాకు ఇచ్చింది. ఈ విషయం తెలిసి తెలియని స్థితి నుండి తెలుసుకునే స్థితికి వచ్చేసరికి ఆరునెలలు పట్టింది. మా ఇద్దరికీ. ఈ ఆరు నెలల్లో నా గురించి ఆమెకి తెలిసింది. చాలా ఉంది. కాని ఆమె గురించి నాకు తెలిసింది చాలా తక్కువ. ఆమె బాగా చదువుకున్నది. ఉద్యోగం, పెళ్లి, సంసారం వంటి వాటి మీద ఆశ లేదని సమాజం బాగుండాల్న కోరికతో ప్రథం సంస్థ అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా బొంబాయి మురికివాడలలో పెరుగుతున్న పిల్లలకి చదువు చెపుతుంది రోజూ. ఆమె గురించి ఇంతే తెలుసు ఆమె అంటే నాకు గౌరవం. నేనంటే ఆమెకు గౌరవం అంతే. కాని ఒకరోజు ఎర్రటి ఎండలో ఒక్కసారి ఒక చల్లగాలి వచ్చి తాకినట్టు.

"................." ఆశ్చర్యంలో నేను ఉన్నతిని చూస్తూ ఉండి పోయేను. నేను నాగతం గురించి చెపుతూ మరియా గురించి కూడా చెప్పాను. అయినా సరే ఇలా ఏలా అన్నది అని అనిపించింది.

"బహుశా ఈ ప్రశ్న వచ్చిందంటేనే ప్రేమ ఉన్నదని తెలుస్తున్నది" అంది.

"ఎలా? " అన్నాను అనాలోచితంగా.

"వెన్నెల ఉన్నప్పుడే కదా, రాత్రి మన నీడ ఉన్నదా అన్న ప్రశ్న వస్తుంది." అంది రాగయుక్తంగా

"కాని.......మనం.....ఒకరినొకరం...." ఏం అనాలో తెలీక మాటలు తడబడ్డాయి.

"ఒకరినొకరు తెలుసుకోవాలి. అర్థం చేసుకోవాలి. అంతేనా... రేపు మా ఇంటికి రండి మావాళ్ళందరినీ పరిచయం చేస్తాను." అని నవ్వుతూ ఆహ్వానించింది.

"కాని నన్ను ......మీరు...." వాక్యం పూర్తి కాకుండానే

"మిమ్మల్ని నేను బాగానే అర్థం చేసుకున్నాను. అహంకారం కొంచెమైనా లేని మీమాట, చేత, చూపు ప్రేమతో నిండి ఉంది. ఎప్పుడూ ప్రేమగా చూసే ఆ కళ్ళు....." ఏదో అంటున్నది, కాని మనసు మరియా అని తలుచుకున్నది. కృతజ్ఞతా భావంతో.

మర్నాడు వాళ్ళింటికి తీసుకెళ్ళింది. జింఖానా నుండి బస్సులో హిరానందాని దాకా వెళ్ళాం. నాకు తెలిసిన బొంబాయికి హిరానందాని చాలా బేధం ఉంది. హిరానంద ఎత్తైన భవనాలతో, చక్కనైన పార్కులతో, యురోపియన్ దేశాల్లో మా షిప్పులు ఆగినప్పుడు చూసిన పట్టణాల తీరులో ఉంది. అక్కడ వాతావరణం అంతా ఇండియన్ వాతావరణం కంటే విదేశీ వాతావరణమే ఎక్కువగా అనిపిస్తుంది. చూడగానే ఇది చాలా ఆస్తిపరులు ఉండే ప్రదేశమనిపిస్తుంది. ఆ పరిసరాలను ఆశ్చర్యంతో చూస్తూ ఒక ఎత్తైన 28 అంతస్థుల భవనంలోకి వెళ్ళాను ఉన్నతి షా వెనుక. లిఫ్ట్ కోసం చక్కనైన గ్రానైట్ గోడలతో పాలరాతి గచ్చుతో ఉన్నచోట నిలబడ్డం.

"మీ ఇల్లు, అదే అపార్టమెంట్ ఇక్కడా?" అన్నాను కొంత ఆశ్చర్యంగా

"అవును. మేముండేది ఈ బిల్డింగ్ లోనే ఏం అలాఅడుగుతున్నారు?" అంది.

ఇంతలో లిఫ్ట్ వచ్చింది. మేము మాతోపాటే మరికొంతమంది లిఫ్ట్‌లోకి వెళ్ళాము. మేము ఇద్దరం 28 అంతస్థుల్లో బయటికి వచ్చాము. తలుపు తెరుచుకోగానే వారి ఇంటి హాలులోకి వచ్చాము. అక్కడ అప్పటికే కొద్దిమంది సోఫాల్లో కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నారు. మమ్మల్ని చూసి పలకరించారు. ఉన్నతి షా వాళ్ళ నాన్నగారిని పరిచయం చేసింది. ఆయన బొంబాయిలో హైకోర్టు జడ్జిట మిగిలిన వారి కుటుంబ సభ్యులని, మిత్రులని పరిచయం చేసింది. వాళ్ళందరూ ప్రొఫెసర్లు, డాక్టర్లు, న్యాయవాదులు. వాళ్ళ మాటతీరులో బాగా చదువుకున్నారని తెలుస్తుంది.

అక్కడున్న రెండు గంటల సేపు నాకు మాట్లాడటానికి మాట రాలేదు. ఉన్నతి షా కొద్దిగా డబ్బున్న మనిషని అనుకొన్నాను కాని, నాకంటే మరీ ఇంత ఎత్తులో ఉన్న మనిషి అని అనుకోలేదు. నా చదువు గురించి వాళ్ళు అడిగినప్పుడు, నేను హై స్కూల్ కూడా పాస్ కాలేదని తెలిసి అందరూ ఒక్కసారి నావైపు తేరిపారి చూశారు.

ఉన్నతి షా వెంటనే కాని ఈయన చాలా అనుభవం ఉన్న మనిషి అని అక్కడున్న వారందరి గురించి చెప్పడానికి ప్రయత్నించింది.

ఈ సంఘటన అయిన వారం రోజులదాకా ఆమెని కలవలేక పోయాను. ఈవారం రోజులలో ఆమెకి నేను తగిన వాడిన కాదన్న నిశ్చయానికి వచ్చాను. ఆదే ఆమె కలిసినప్పుడు చెప్పాను. ప్రేమలో ఇలాంటి బేధాలు ఉండకూడదన్నది. నిజమే ప్రేమకి లేవు. కాని పెళ్ళిలో కావాలి. ఎంతో కొంత సమానత్వం లేకుంటే అసమానత అడ్డుగోడలని. అపోహలని, అనర్ధాలను కలిగిస్తుందని చెప్పాను. ఆమె పేరుకి తగ్గట్టే ఉన్నతమైన వ్యక్తిత్వం కలది. డబ్బున్నా సమాజానికి సేవచెయ్యాలన్న తపన ఉన్నది. ఆ తపనలో ప్రేమపెళ్ళి సంసారం వంటి విషయాలని పట్టించుకోకుండా పనిచేస్తున్నది, సామాన్యురాలిగా. నాలాంటి సామాన్యుడు ఇప్పుడు సరిపోతాడేమో కాని ఈ స్థితిలో ఉన్న ఆమెభావాలు కొన్నాళ్ళ తరువాత మారచ్చు అయితే ఈ ప్రేమ ఆమె మెడకి గుదిబండైపోతుంది. అలా కాకుండా ఆమెకి నచ్చినవాడు, చదువు ఆస్తి సమానంగా ఉన్నవాడు దొరికితే ఎమార్పులు వచ్చినా వాటికి తగినట్టుగా మారగలరు. మా ప్రేమకూడా నిలుపుకోగలం. ప్రేమకి పరమావధి పెళ్లి కానక్కరలేదు. ప్రేమ ప్రేమలా పదిలంగా ఉండచ్చు అని ఒప్పించాను. ఇప్పటికీ అలాగే ఉన్నాం. అప్పుడప్పుడు కలుస్తాం. కబురులు చెప్పుకుంటాం”

ఆశ్చర్యంతో అందరం ఒకరి మొహాలు ఒకరం చూసుకొన్నాం.

“మీరు ఆమెని పెళ్లి చేసుకోవలసింది. ఆస్తి అంతస్తు ప్రేమకి అడ్డుకావు కదా” తేరుకుని నేనే అన్నాను.

"అందమైన పాలరాతి విగ్రహం లాంటి ఆమె ప్రక్కన ఒట్టి మట్టి బొమ్మలాంటి నన్ను ఆమె భర్తగా ఊహించుకోలేకపోయాను." నవ్వుతూ గాలిలోకి చూస్తూ అన్నాడు. అప్పుడు ఆమె అతని కళ్లముందు ఉన్నదన్నది నా కన్పించింది.

"ఇన్ని సార్లు ప్రేమలో విఫలమైన మీకు ప్రేమంటే విరక్తి కలగలేదా" అని అడిగాడు ప్రేమమీద రిసెర్చ్ చేస్తున్న విద్యార్థి

"లేదు ఎందుకంటే నిజమైన ప్రేమకి విఫలం లేదోయి మరియా ఇంకా నన్ను ప్రేమిస్తూనే ఉంటుంది. నేను మరియాను ప్రేమిస్తూనే ఉంటాను. అలాగే దవనం, లిల్లీ, రోజా ఉన్నతి.... ప్రేమ ఇద్దరి మనుషులను కలిపేది మాత్రమే కాదు. ఒక మనిషిని బ్రతికించగలదు కూడా ప్రేమకి అంత శక్తి ఉంది.

"నేను నాకు అనుభవంలోకిరాని వాటి గురించి మాట్లాడను" అన్నాడు సత్తెప్ప

"చెప్పండి... చెప్పండి... నా రిసెర్చ్ టాపిక్‌లో ఈ విషయం ఇప్పటిదాకా రాలేదు. అన్నాడు ప్రేమ మీద పరిశోధన చేస్తున్న విద్యార్థి మిగిలినవాళ్ళు శ్రద్ధగా వినడానికి సిద్ధం అన్నట్లు సత్తెప్పవైపు చూశారు.

వాళ్ళందరూ సత్తెప్పచెప్పేవి వినడానికి చూపుతున్న ఆసక్తి చూస్తూ ఉంటే చాలా ఆనందంగా కొంచెం గర్వంగా ఉంది నాకు.

సత్తెప్ప మాట్లాడటం మొదలుపెట్టాడు. అందరికి సత్తెప్ప మాటలే చెవులలో వినబడుతున్నై. రైలు నడుస్తూనే ఉంది. కాని రైలుశబ్దం ఎవ్వరి చెవులలో పడటంలేదు.

"ఉన్నతి షాని పెళ్ళి చేసుకోలేనని చెప్పాను. కాని చెప్పిన నాటి నుండి నామనసు నాలో లేదు. కొండమీద నుండి జారి లోయవైపు పడిపోతున్న భావన, నడి సముద్రంలో పడి ఒడ్డు తెలియక, ఈతరాక మునిగి తేలుతున్నట్టనిపించేది. నాకు తెలియకుండానే తనని నన్ను ప్రేమించేలా చేశాను. తెలియక చేసినా తప్పు

నాదే అనిపించింది. ఇక నుంచి ఎవ్వరితో నా పరిచయం ప్రేమ దాకా రానివ్వకూడదని నిశ్చయించుకున్నాను. ఇలా నాలో నేనే మాట్లాడుకుంటూ నాగతాన్ని నెమరు వేసుకున్నాను. ఇప్పటిదాకా నేను ప్రేమించిన, నన్ను ప్రేమించిన అందరిలో ఎంతో కొంత స్వార్థం ఉందనిపించింది. ప్రేమ అన్నది ఒత్తిమాట. మనిషి స్వార్థానికి ఎన్నో పేర్లు, అందులో ప్రేమ ఒకటి అనిపించింది. మరియా, దవనం, లిల్లీ, రోజా, ఉన్నతి వీరందరినీ నేను ఇష్టపడ్డాను. కావాలని అనుకొన్నాను. ఒక్క ఉన్నతిని తప్ప మిగిలినవాళ్లు నాకు సరిపోతారు. అని అనుకున్నాను. వీరిలో ఏ ఒక్కరితో శారీరక సంబంధంలేదు. మనసిచ్చి పుచ్చుకోవడం నా ప్రమేయం లేకుండానే జరిగిపోయింది. ఒక్కొక్కరూ ఒక్కొక్కలా నన్ను ప్రేరేపించి ఉత్తేజపరిచారు. ఉన్నతమైన భావనాశక్తి కలిగించి బతుకుమీద తీపిని పెంచారు. బతకడానికి గాలి నీరు తిండి తరువాత కావలసిన అతి ముఖ్యమైన దాన్ని ఇచ్చారని విరితను కలిసాక తెలిసింది." అని ఆగి కొద్దిసేపు మౌనంగా ఉన్నాడు సత్తెప్ప.

అతని ఆలోచనలకి అంతరాయం కలిగించకూడదని, మేమెవ్వరం మాట్లాడలేదు.

"ఒకరోజు బస్‌స్టాప్‌లో బస్సుకోసం ఎదురు చూస్తూ కూర్చున్నాను. న్యూస్ పేపర్ చదువుతున్నాను. ఉన్నట్టుండి నామీద ఏదో భారమైంది పడింది. పేపర్ వదిలి చూస్తే పక్కన కూర్చొని ఉన్న ఒక స్త్రీ సొమ్మసిల్లి నా మీద పడింది. నాభుజం మీద నుండి జారి ఒళ్ళో వాలింది. చుట్టూ ఉన్నవాళ్ళు చూశారు. కాని పట్టించుకోలేదు. నేను రెండు చేతులతో ఆమెను పట్టి లేపి కూర్చోబెట్టె ప్రయత్నం చేశాను. కాని ఆమెకు స్పృహ రాలేదు. చుట్టూ ఉన్న వారి సాయంతో ఒక టాక్సీలో ఆమెను దగ్గరలో ఉన్న హాస్పిటల్‌కి తీసుకువెళ్లాను. డాక్టర్లు చేసిన ప్రథమ చికిత్సతో స్పృహలోకి వచ్చింది. ఆమె వివరాలు అడిగారు. ఆమె చెప్పలేదు. నన్ను అడిగారు. ఆమె సంచిలో ఉన్న కాగితాలు తీసి చూశాను. ఆమె ఒక కాన్సర్ పేషెంట్ వయసు 25 ఏళ్ళు పేరు విరిత వాట్టంవార్. ఆరోజు

ట్రీట్‌మెంట్‌కోసం దూరంలో ఉన్న హాస్పిటల్‌కి వెళ్ళవలసిన అపాయిట్‌మెంట్ ఉంది. డాక్టర్లు నన్ను ఆమె భర్త అనుకొని ఆమెకు వచ్చిన కాన్సర్ ప్రమాదకరమైనదని, శ్రద్ధగా ట్రీట్మెంట్ ఇప్పించాలని లేకపోతే 6 నెలల కంటే ఎక్కువ బ్రతకదని గట్టిగా చెప్పారు. ఆమెను వెంటనే అడ్మిట్ చెయ్యాలన్నారు. ఆమె ఏమి మాట్లాడలేదు. నేను సరేఅన్నాను. హాస్పిటల్‌వాళ్లు వాళ్ళ ఏర్పాటులో వాళ్ళున్నారు.

"మీవాళ్లెవరూ లేరా?" అని అడిగాను ఆమెని మొదటిసారి. లేరన్నట్టు తల అడ్డంగా ఊపింది.

"మరి పెళ్ళి...."

అయ్యిందన్నట్టు కళ్ళతో చెప్పింది తలని కొద్దిగా కదిలించి

"మీ భర్త..."

సమాధానం చెప్పకుండా గాలిలోకి చూసింది.

"మీకున్న జబ్బు గురించి మీకు తెలుసా..." అన్నాడు మెల్లిగా

తెలుసన్నట్లు తలతిప్పింది గడియారంలో లోలకంలా.

డాక్టర్లు వచ్చారు అడ్మిట్ చేశారు. మేమిచ్చే ట్రీట్మెంట్ పనిచేయాలంటే, ప్రతీవారం రావాలి. శ్రద్ధగా మందులు వేసుకోవాలి, మంచి ఆహారం తీసుకోవాలి. విశ్రాంతి తీసుకోవాలి. ఇవన్నీ మీరు ఆమెకి ఇవ్వాలి అని నాతో గట్టిగా చెప్పి. ఆమె వైద్యం మొదలుపెట్టి నన్ను పక్కన ఉండమని వెళ్లిపోయారు.

"మరి ట్రీట్మెంట్ చేయించుకోండి శ్రద్ధగా " అన్నాను.

వద్దు అన్నట్లు తల కదలికతో చెప్పింది.

"ఎందుకని " కొద్దిగా ఆశ్చర్యంతో కొద్దిగా కోపంతో గట్టిగా అడిగాను.

"నాకు బ్రతకాలని లేదు" అంది నిశ్చలమైన గొంతుతో ఒంటిలో ఉన్న శక్తినంతా కూడ దీసుకుని. అలా పరిచయమైంది విరిత.

ఆమె కాలేజీలో చదువుకొనే రోజుల్లో కమ్యూనిష్టులవైపు ఆకర్షించబడిందని, అందులో అంత ఎక్కువ చదువులేని ఒకతనితో ప్రేమలో పడిందని పెళ్లి కూడా అయిందని సరైన ఆర్జన లేని భర్త కట్నం లేకుంగా వచ్చిందని సాధించే అత్తగారు, ప్రేమపెళ్లి చేసుకుందని పట్టించుకోని తల్లిదండ్రులు ఇది ఆమె సంసారం కాన్సర్ జబ్బురాకముందు దాకా ఒక న్యూస్ పేపర్‌లో సబ్ ఎడిటర్ ఉద్యోగం రోజుకు పన్నెండు గంటలు పని ఇంట్లో వంటపనులు, అత్తగారికి సేవలు సింగిల్ బెడ్‌రూం ఇంట్లో అత్తా ఆడపడుచు మరిది వచ్చేపోయే చుట్టాలతో ఇది ఆమె యవ్వనం తొలిరోజులలో జీవితం. ఆమెకు కాన్సర్ వచ్చినందుకు ఎవ్వరూ బాధ పడలేదు. అందరూ సంతోషించారు. కట్నంతో మళ్ళీ పెళ్లి చేసుకోవచ్చని భర్త, అత్తగారు. తమ కుటుంబ పరువుతీసి తమని తలవంచుకునేలా చేస్తున్న కూతురు కాన్సర్‌తో త్వరలో చనిపోతుందని తెలిసి కొంత ఊరట చెందారు తల్లిదండ్రులు, అన్నదమ్ములు. ఈ చెరనుండి బయటపడటానికి ఇది మంచి మార్గం అని విరిత అందరి కంటే ఎక్కువ ఆనందపడింది. ఈ విషయాన్ని చాలా ఆనందంగా చెప్పింది అందరికి. కాని ఆమెతో పనిచేసిన ఒక సబ్ ఎడిటర్ బలవంతంగా ట్రీట్మెంట్‌కి తీసుకొస్తుందట ఆమెకి వీలైనప్పుడు.

అదివిన్న నాకు నోటమాటరాలేదు. ఆమె తోటివాళ్ళు ఎంతమందో పెళ్లి కావాలని పండు వెన్నెల లాంటి వయసులో పెళ్ళి పల్లకినెక్కి ఊరేగాలని ఊహలతో ఉవ్విళూరుతారు. ఈమె పాడె పైకెక్కి చితిమంటలలో కాలి పోవాలని కోరుకోవడం అన్న ఆలోచన వొళ్ళు జలదరింపచేసింది. మనది కాకపోయినా ఎదురుగా ఇల్లు కాలిపోతుంటే పరుగు పరుగునవెళ్ళి నిప్పునార్పాలనిపిస్తుంది. సహజంగా నాకు అలాంటి భావనే కలిగింది, ఎదురుగా హాస్పిటల్ మంచంమీద కూర్చున్న విరితను చూస్తుంటే.

హాస్పిటల్‌లో ఒక రోజంతా గడిపాను ఆమె బెడ్‌పక్కన. నేను హాస్పిటల్‌లో గడిపిన రోజులు గుర్తుకు వచ్చాయి. మరియా ఇక్కడ ఉండి ఉంటే విరిత త్వరలో కోలుకుంటుంది అని అనిపించింది. మరియా అంత శ్రద్ధతో ఈమెను ఏనర్సు

చూస్తుంది? ఈమెకి బ్రతకడానికి ఆశ ఎవరు కల్పిస్తారు? అలా సాగాయి నాఆలోచనలు. ఒక్కసారిగా నేనే ఎందుకు ఆపని చేయకూడదు? అన్న ప్రశ్న వచ్చింది చిరునవ్వుతో మరియా కనిపించింది. అంతే, అప్పటినుండి ఒక ఆరునెలలపాటు ఆమెను బలవంతంగా మొదటిలో, కొద్దిపాటి సహకారంతో తరువాత రానురాను పూర్తి సహకారంతో ఆమెకి ట్రీట్మెంట్ దగ్గరుండి జరిపించాను.

మా అంచనాలకు మించి ఈమె కోలుకున్నది. ఇక కాన్సర్ వల్ల ఈమెకి ఏ ప్రమాదం లేదు మేమిచ్చిన ట్రీట్మెంట్ కంటే మీరిచ్చిన ప్రేమ ఆమెని బతికించింది. అన్నారు డాక్టర్లు.

నాకు తెలియకుండానే ఆమెని ప్రేమించాను. మనిషిగా అవసరంలో ఉన్న సాటి మనిషిగా. ఆమె కోలుకోవడం మనిషిగా నాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది.

ఒకరోజు హాస్పిటల్ నుంచి ఇంటికి వెళ్ళడానికి ఎప్పటిలాగే చెయ్యి పట్టుకుని రోడ్డు దాటించాను. కాని ఆరోజు ఎప్పటిలాగే చెయ్యి విడవకుండా టాక్సీ ఎక్కేదాకా పట్టుకొని టాక్సీ ఎక్కగానే,

'నాకు బ్రతకాలని ఉంది. నా చెయ్యి విడవొద్దు' అని నాచెయ్యి పట్టుకొని కూర్చుంది. ఏవేవో కబుర్లు చెప్పింది. పెళ్లిఅన్నమాట తప్పించి అన్ని మాట్లాడింది. నాప్రేమే తనని బ్రతికిందిచింది అంది తెలిసీ తెలియని కాలేజీ రోజుల్లో ప్రేమ అని అనుకొన్నదానిలో లేనిదంతా ఇప్పుడు పొందానని అని తన్మయత్వంలో అంది. మరియా నన్ను ప్రేమించినట్లే నేను ఆమెను ప్రేమించాను. ఆమె వయసులో చాలా చిన్నది. ఇక ఆరోగ్యం బాగుపడ్డది కనుక తన జీవితాన్ని కూడా సరిదిద్దుకోవచ్చుని ఆమె ఇంకా ఇంకా చాలా చెప్పి ఆమెని ఆమె జీవితాన్ని ఒక మంచిబాటలో నడిపించాలని అనుకొని చిరునవ్వుతో ఆమెను ఆగిన టాక్సీలోంచి దిగమని చెయ్యి చూపించాను. నాచెయ్యిపట్టుకునే టాక్సీలోంచి దిగింది. టాక్సీ దిగి ఇంటివైపు  వెళుతూ ఉంటే వెనకనుంచి ఒకకారు వచ్చి ఆమెను గుద్దింది.

ఇద్దరం రోడ్డుమీద పడ్డాం ఒకరిచేతిలో ఇంకొకరి చెయ్యితో రోడ్డుమీద పడ్డ ఆమె, ఇకలేవలేదు. ప్రేమ, విషాదం నా జీవితంలో కొత్తకాదు. ఆడదాన్ని ప్రేమించడంలో ఉన్న కొన్ని కోణాలని నాకు మరియా, దవనం, లిల్లీ, రోజా, ఉన్నతి, విరిత తెరిచి చూపారు. ప్రేమ అన్న మెత్తని ఉలితో బండరాయిలాంటి నన్ను చెక్కి, నాలోని నిజమైన మానవుడిని చూపించారు.

ఎవరి ఆలోచనల్లో వారున్నారు. వాతావరణాన్ని మార్చడానికాబోలు అమెరికాలో ప్రేమమీద రీసెర్చ్ చేస్తున్న అతను,

"ప్రేమ మనిషి మనుగడకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. కాబట్టి ప్రకృతి పరిణామంలో ఒక భాగంగా ప్రేమ ఎదుగుతూ వచ్చింది. మీరేమంటారు" అన్నాడు.

"ఇద్దరు మనుషుల మధ్య ఒకరికొకరు హాయిని ఇచ్చుకోవడానికి కలిసి జీవించడానికి, దానివలన ఒక సమాజం ఏర్పడడానికి ఒక స్త్రీ పురుషుడి మధ్య ఆకర్షణ కలిగి సంతానోత్పత్తి జరిగి మానవజాతి జాతి అభివృద్ధి అవ్వడానికి ప్రేమ చాలా అవసరం. అన్నాడు ప్రేమమీద రీసెర్చ్ చేస్తున్న అతను.

"ప్రేమ విషయంపైకి మీసైన్స్‌ని తీసుకురాకండి" అన్నాడు సత్తెప్ప.

మరి ఆవిషయంమీద చర్చ ముందుకు వెళ్ళలేదు.

ప్రస్తుతం నేను హాయిగా ఉన్నాను. రోజూ ఉద్యోగం వీలున్నప్పుడల్లా రూమీ, సూఫీ కవితలు వింటూ చర్చించుకుంటూ" అని ఆగి, నా వైపు తిరిగి చెప్పడం మరిచి పోయాను. ఇప్పుడు నేను హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్నాను. హైదరాబాద్ వచ్చి ఆరునెలలయింది.

"మరో నమ్మలేని పరిచయం. విరిత చనిపోయిన తర్వాత బొంబాయిలో ఉద్యోగం వదిలేసి" హైదరాబాద్ వస్తున్నాను. కోణార్క్ రైలులో. నా సీటు కోసం వెతుక్కుంటూ ఉంటే ఓ అమ్మాయి ఎదురుగా వచ్చి

"మీరు హైదరాబాద్ కేనా అని అడిగింది తెలుగులో

"అవును" అన్నాను.

"నేను ఒంటరిగా వెళుతున్నాను. నా సీటు చుట్టూ ఉన్న కుర్రాళ్లు అల్లరి చేస్తున్నారు. హైదరాబాద్ దాకా నాతో కూడా ఉండి కొంచెం సహాయం చేస్తారా ప్లీజ్ తొందరగా."

"అలాగే" అన్నాను.

"నాపేరు రుహీ మిమ్మల్ని వాళ్లు నాభర్తగా అనుకునేలా ప్రవర్తించండి. ప్లీజ్" అంది.

మౌనంగా ఆమె వెనుక నడిచాను. ఆమె ప్రక్కనే సామానుపెట్టి కూర్చున్నాను. ఆమె తెలుగులో మాట్లాడ్డం మొదలుపెట్టింది. ఇద్దరం మాట్లాడుకొంటున్నది అర్థంకాక మిగిలిన యువకులు మౌనంగా ఉండిపోయారు. టికెట్ కలెక్టర్ వచ్చినప్పుడు ఆమె రిజర్వేషన్ వేరు వేరుగా చేయించడం వల్ల విడిగా వచ్చాయని ప్రక్కప్రక్క బెర్తులు ఇమ్మని బ్రతిమాలింది. ఇచ్చాడు. రాత్రంతా ఏ గొడవాలేకుండా ప్రయాణం సాగిపోయింది. హైదరాబాద్‌లో స్టేషన్‌లో దిగిన తరువాత నాపేరు అడిగింది. చెప్పాను. ఎక్కడుంటారు అని అడిగింది. కొత్త ఉద్యోగంలో చేరడానికి వచ్చాను, ముందు హోటల్‌కి వెళ్ళాలని చెప్పాను.

మీకు అభ్యంతరం లేకుంటే మా ఇంటికి రండి అని పిలిచింది. ఆమెతో వెళ్ళాను. వాళ్ళ ఇల్లు పెద్ద పాతబడిపోయిన హవేలి. చుట్టూ సంరక్షణలేని తోట. ఇంట్లో ముసలి తల్లిదండ్రులు. ఆస్తి కోర్టులో ఉందిట. ఆ ఇంట్లో ఉండటానికి మాత్రమే వీలుందిట. తల్లిదండ్రులకు పరిచయం చేసింది. జరిగిందంతా చెప్పింది. వాళ్లు ఉర్దూలో ధన్యవాదాలు చెప్పారు.

ఆఫీసుకు వెళ్లి వచ్చాను. సాయంత్రం ఇల్లు చూసుకునేందుకు వెళతానని చెప్పాను. మీకు ఇల్లు దొరికేదాకా ఉండమని చెప్పింది. తరువాత మెల్లిగా మీకభ్యంతరం లేకుంటే ఒక్కడే ఒక గది శుభ్రంచేసి ఇస్తాను చాయ్, నాస్తా,

ఖానాతో కలిపి మీకు తోచింది ఇవ్వండి. మాకూ సహాయంగా ఉంటుంది. చెప్పలేక చెప్పినట్లు చెప్పింది. అలానే అని వాళ్లింట్లోనే మేడమీద గదిలో ఉండిపోయాను.

రూహి చదువుకున్నది. పెళ్ళైందికాని భర్త ఈమెని వదిలి మరో ఆమెను చేసుకుని ఆమెతో దుబాయ్ వెళ్ళి పోయాడు. ఉద్యోగం చేసుకుంటున్నది. తన కాళ్ళమీద తను నిలబడటం నేర్చుకుంది. ఊర్దూ కవిత్వంపై బాగా పట్టు ఉన్నది. ఎవరి కథలు వాళ్ళు చెప్పుకొన్నాం జరిగిపోయిన జీవితాన్ని వెనక్కి తిరిగి చూసుకుని నవ్వుకున్నాం.

రుహిని తలచుకొన్నా, రూహితో ఉన్నా హాయిగా ఉంటుంది. నేను వేరుగా ఒక మనిషిని అని అనిపించదు. ఈ ప్రకృతిలో ఒక భాగాన్ని అన్న భావన కలుగుతుంది. ఒక మహాసముద్రంపై ప్రయాణంచేసి వచ్చి మట్టి మీద కాలుపెట్టి నిలకడగా నిలబడినట్లుంది. అలల లేని నదిలా మనసంతా ప్రశాంతంగా ఉంటుంది. అందుకే పెళ్ళి, సంసారం, పిల్లలు, హోదాలు, భేషజాలు లేని ఒక సహజీవనం ఇద్దరికీ సరియైనది తెలుసుకున్నాం అలాగే గడుపుతున్నాం. రోజూ సాయంత్రం భోజనం తరువాత డాబా మీద రుహి నాకు కవి రూహి కవిత్వం చదివి వినిపిస్తుంది. రుమీ 13వ శతాబ్దపు ముస్లిం పర్షియన్ కవి తత్వవేత్త. ఖురాన్‌లో ప్రేమ గురించి సూటిగా ఏమీ లేకపోయినా సుఫీ తత్వవేత్తలందరూ ప్రేమకి పెద్దపీట వేశారు. మేము ఇద్దరం నిద్రవచ్చేదాకా ఆ కవితల గురించి కవిత్వాన్ని గురించి మాట్లాడుకొంటాం నేను సాధారణంగా డాబామీదే పడుకొంటాను. నక్షత్రాల క్రింద. ఎప్పుడూ షిప్‌లో డెక్‌మీద ఆకాశం క్రింద పడుకున్నట్లు, మరియా ప్రేమవెన్నల నామీద కురుస్తుంది. రాత్రంతా! అంతకన్నా ఇంకేం కావాలి? అన్నాడు చిద్విలాసంగా మమ్మల్ని అందర్ని చూస్తూ.

తనే లేచి శిల్పాల్లా కూర్చొన్న మమ్మల్ని తట్టి లైటార్పి "ఇక పడుకోండి" అన్నాడు సాదరంగా.

ఆ రాత్రి రైల్లో మా ఎవ్వరికీ నిద్రపట్టలేదు. ప్రేమతత్వం దాని తీరు తెన్నులు ఆలోచనలు సముద్రంలో అలలలా అలా వస్తూనే ఉన్నాయి. ఉదయం రైలు దిగి ప్లాట్‌ఫారం మీద సత్తెప్పకి కృతజ్ఞతలు చెప్పాం, మాకు ప్రేమ గురించి తెలియని విషయాలను ఎన్నో తెలుసుకునేలా చేసినందుకు. అప్పటినుండే జీవితంలో నాకు ప్రేమ నిజమైన అవగాహన వచ్చింది. అందుకే సత్తెప్ప ప్రేమకి పెద్దబాలశిక్ష అంటాను. " అని ఆపారు మాష్టారు.

వెనక్కి తిరిగి నడవడం మొదలుపెట్టారు. ఆయనతోపాటు తిరుగుతూ మేం ఇద్దరం ఒకరినొకరు చూసుకొన్నాం. మన ప్రేమ సంగతేంటి అన్నట్లు కళ్ళు ప్రశ్నించుకున్నాయి. కాలమే జవాబు చెప్పాలని రెప్పలు కళ్లని గట్టిగా అదుముకొన్నాయి.

*

**అనుభవాలను ఆహ్వానించడానికి,**
**ఆస్వాదించడానికి, ఆనందించడానికి కావలసిన**
**ఆలోచనలకు తొలి బీజం వేసిన గురువు - కర్రి**
**వెంకప్ప గారికి నమస్కరిస్తూ...**

# థ్యాంక్స్ టు అంబేద్కర్

**"అం**బేద్కర్ గురించి తెలియకుండా మాట్లాడుతున్నారు." అన్నాడు గట్టిగా, ఆవేశపూరితంగా మార్కండేయశర్మ. అప్పటిదాకా హాలులో రకరకాల స్థాయిలో వేర్వేరు గుంపులలో సాగుతున్న చర్చలు ఈ మాటలతో ఒక్క కుదుపుతో ఆగిన బస్సులా ఆగిపోయాయి.

దీపావళిరోజు బయట మంచుపడుతున్న న్యూయార్కు వాతావరణంలో దీపావళినాడు మంచు పడటం ఆశ్చర్యం కాని మంచుపడుతున్నా మా ఇంటికి సుమారు పిలిచిన వారందరూ రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ ఆనందం ఇచ్చిన శక్తితో వచ్చినవాళ్ళకు కావలసిన ద్రవ, ఘన పదార్థాలను అందిస్తూ అందరి మధ్యా తిరుగుతున్నాను. వచ్చిన వాళ్ళలో అతిచిన్న ఉద్యోగం చేస్తున్న వాళ్ళనుంచి పెద్ద కంపెనీలు నడుపుతూ గణనీయంగా గడించినవాళ్ళు ఉన్నారు. ఇవాళ విశేషం ఏమిటంటే డబ్బు బంగారం గురించీ కాకుండా ఇండియాలో వాళ్ళవాళ్ళ ఊళ్ల గురించి, తెలుగుభాష గురించి చర్చలు చిన్నచిన్న గుంపులలో జరుగుతున్నాయి. అందరి ఉద్దేశ్యం ఒకటే ఇండియా అమెరికా అయిపోవాలని! అందరూ హాయిగా బతకాలని!!

చాలామంది అనుకునేది ఏమిటంటే ఇండియన్ బుర్ర చాలా గొప్పదని ప్రపంచమంతా గుర్తించాలని. తెలివితక్కువ తెల్లవాళ్ళు ఇది గుర్తించి వేదాలు రామాయణ, మహాభారతాలు చదవాలని అలా మొదలైన కబుర్లు, వాడివాడి మాటలను వేడివేడిగా వాడి తమతమ తెలుగుభాషా పరిజ్ఞానాన్ని, వాదనా పటిమను,

తర్కసామర్థ్యాన్ని చమత్కార ప్రతిభను చూపిస్తూ నీకంటే ఒక ఆకు ఎక్కువే చదివాను తెలుసా అని చెప్పకనే చెపుతూ కోలాహలంగా వాదించుకుంటున్నారు.

గాంధీ అంతగొప్పవాడు ప్రపంచంలో పుట్టలేదని ఒకరంటే, అంత మొండివాడు ఇంక మరెవరూ లేరని కొంతమంది... అసలు దేశంలో అన్ని సమస్యలకు ముస్లింలు కారణమని కొందరు, ఈ కాషాయం వాళ్ళు దేశాన్ని వెయ్యేళ్ళు వెనక్కి తీసుకొని వెళుతున్నారని మరికొందరు. తెలుగు చచ్చిపోతున్నదని కొందరు. లేదు, లేదు ప్రభుత్వ విధానాలవల్ల కొన్ని కోట్ల నిరక్ష్యరాస్యులున్నారని. వాళ్ళవల్ల తెలుగు మరికొన్ని వందల ఏళ్ళు బతికే ఉంటుందని మరికొందరు... రిజర్వేషన్ వల్ల దేశం పాడైపోతుందని ఒకరు వాదిస్తే. బ్రాహ్మణులే తరతరాలు తెలివంతా దాచేసుకుని మిగిలినవాళ్ళను తొక్కేశారని మరికొంతమంది.... మరో పదేళ్ళలో రిజర్వేషన్ వల్ల సీట్లు తెచ్చుకుని, ఉద్యోగాలు తెచ్చుకుని అధికారంలోకి వచ్చిన కొత్తబ్రాహ్మణులు మిగిలినవాళ్ళని అణద్రొక్కేస్తారేమోనని మరికొందరు. ఇలా రకరకాల విషయాలను ఒకరిమీద ఒకరు పోటీపడి వాదించుకోవడం హాల్లో వాతావరణం, డైనింగ్ టేబుల్ మీద ఉన్న పదార్థాల కంటే వేడిగా ఉంది.

అన్నింటికంటే ఎక్కువగా గట్టిగా వాదించుకుంటున్న విషయం కులాలమీద. ఇది జోరుగా సాగుతున్నదని దూరం నుంచి వింటున్న నాకు తెలుస్తున్నది. వాళ్ళకి కావలసినవి అందించడానికి వెళ్ళి వస్తున్నప్పుడు విన్న మాటలవ్ల కొన్ని విషయాలు స్పష్టంగా తెలుస్తున్నాయి. నరకాసురుడు దళితుడని, కృష్ణుడు, సత్యభామ అగ్రవర్ణస్తులని అంచేత నరకాసురవధని దీపావళిగా జరపడం దళితులకి అవమానమని వచ్చిన వార్తలని చదివినవాళ్ళు ఈ కులచర్చని మొదలుపెట్టారు. వచ్చిన యాభై అరవై మందిలో కులచర్చలో పాల్గొన్నవాళ్ళ సంఖ్యే ఎక్కువ.

కులపిచ్చి, కులగజ్జి, కులతామర, కులమేహం, కులపోటుకి అమెరికా వాళ్లు ఇంకా ఏమందూ కనిపిట్టలేదు. ఆయేర్వేదం, యునానీలలో ఉన్నా అది బ్రాహ్మలది, ముస్లింలది కాబట్టి వాడకూడదు. అంచేత ఇంకా చాలామంది ఈ కులరోగాలతో బాధపడుతున్నారు.

ఇప్పటికి మూడుసార్లు భోజనానికి పిలుపు వచ్చినా వాదించుకోవడంలో మునిగిపోయిన వాళ్ళు ఒక్కరూ కదలలేదు. వీళ్ళ వాదనలను ఆపించి హాలులో వాతావరణాన్ని చల్లబరిచి, వేడివేడి భోజనానికి పంపవలసిన బాధ్యత హోస్టుగా ఉంది. గత పది నిముషాలుగా ఈవిషయమే ఆలోచిస్తున్నాను. అదిగో అప్పుడు–

"అంబేద్కర్ గురించి తెలియకుండా మాట్లాడుతున్నారు." అన్నాడు గట్టిగా ఆవేశపూరితంగా మార్కండేయ శర్మ అప్పటిదాకా హాలులో రకరకాల స్థాయిలలో వేర్వేరు గుంపులలో సాగుతున్న చర్చలు ఈ మాటలతో ఒక్క కుదుపుతో ఆగిన బస్సులా ఆగిపోయారు.

అప్పుడు నా మెదడులో మేలుకొన్న జ్ఞాపకం మెరుపులా మెరిసింది. వెంటనే,

"థాంక్స్ టూ అంబేద్కర్" అన్నాను గట్టిగా, అందరివైపూ చూస్తూ.

"ఎందుకూ?" సుమారుగా అందరూ ఆశ్చర్యంతో.

"ఎందుకంటే అంబేద్కర్ వల్లే నేను ఇక్కడ ఉన్నాను. నేను ఇక్కడ ఉండబట్టే మీ అందరికీ ఇవాళ లంచ్ ఇవ్వగలుగుతున్నాను. అంచేత ఒక విధంగా ఇవాళ లంచ్‌కి మీరందరూ అంబేద్కర్‌కి కృతజ్ఞతలు చెప్పుకోవాలి అన్నాను." నాకు చిన్నప్పుడు బాగా పరిచయమున్న క్రైస్తవ మిషనరీభాష యాసలో.

"మీరు కాని క్రిస్టియన్....చర్చి...." మాంసాహారం చూస్తున్న శాఖాహారిలా నన్ను చూస్తూ అడిగింది ఒకావిడ.

"అవునండీ, నేను చర్చి వీధిలో పుట్టాను. చర్చి ఎదుటే పెరిగాను. చర్చి స్కూలులో చదివాను." అన్నాను.

అందరు నిశ్శబ్దంగా విన్నారు, ఆ మాటలని

అప్పటిదాకా జరిగిన వాదనలు అందరూ మర్చిపోయారు. వాళ్ళు ఇప్పటిదాకా వాదించుకున్న వాదనలలో అన్న మాటలలో వాళ్ళని ఇంటికి పిలిచిన నన్ను తప్పుగా ఏమైనా అన్నారా అన్న మీమాంసలో పడ్డట్టున్నారు.

ఇదే అదను అనుకొని మళ్ళీ అందరికీ భోజనానికి పదమన్నాను. అందరూ లేవబోతూ ఉంటే కుతూహలానికి మారుపేరైన కొంటె కోణంగి కోమలి

"థాంక్స్ టూ అంబేద్కర్ అని ఆయనలాగే మమ్మల్ని తప్పుత్రోవ పట్టించి భోజనానికి పంపుతారా? వీల్లేదు. ఎందుకలా అన్నారో కాని, దాని వెనుక కథేంటో చెప్పాలి" అంది

"అంబేద్కర్ కథ చెప్పాలి" అన్నారు అందరూ కోరస్‌గా

"మీరందరూ ప్లేట్లలో భోజనం తెచ్చుకుని తింటూ ఉంటే నేను చెపుతాను." అన్నాను. అందరూ గబగబావెళ్ళి భోజనం తెచ్చుకోవడంలో మునిగిపోయారు. అందరూ మళ్ళీ ఎవరికుర్చీలో వాళ్ళు కూర్చొని,

"చెప్పండి" అన్నారు కోరస్‌గా.

మా కుటుంబాలలో పుట్టిన తరువాత స్కూలుకు వెళ్ళడం ఎంత సహజమో, స్కూల్లో చదువైన తరువాత రైల్వే ఉద్యోగానికి వెళ్ళడం అంతే సహజం అంచేత డిగ్రీ అవ్వగానే నేను ఒక రైల్వే ఉద్యోగం ఇంటర్వ్యూకి వెళ్ళాను. నన్ను ఇంటర్వ్యూ చెయ్యడానికి అయిదుగురు కూర్చుని ఉన్నారు. నన్ను ఎగాదిగా చూసి ఎదురుగా ఉన్న చిన్న కుర్చీలో కూర్చోమన్నారు. ముందు ఏవేవో ప్రశ్నలు వేశారు. అవి అన్నీ త్రీ ఇడియట్స్ సినిమాలోలా నా చదువుకి కాని ఉద్యోగానికి కాని ఏమీ సంబంధం లేనివి. నేను సమాధానాలు చెపుతున్నాను. ఇలా పాసింజరు రైలులా సాగుతున్న నారైల్వే ఉద్యోగం ఇంటర్వ్యూ,

"ఇండియన్ కాంస్టిట్యూషన్ రాసిందెవరు?" అన్న ప్రశ్న వేసి ఎక్స్‌ప్రెస్ రైలుని లూప్‌లైన్‌కి షంటింగ్ చేసిన స్టేషన్ మాష్టరులా ఒక చిరునవ్వుతో చెప్పు చూద్దాం అన్నట్టు చూశాడు ఒకతను.

"ఇండియన్ కాంస్టిట్యూషన్ ఒక నవలో నాటకమో కాదు. ఒకతను వ్రాయడానికి" అని ఆగాను.

ప్రశ్న అడిగిన ఆయన గాబరాగా కుర్చీలో కదిలాడు. ఇంటర్వ్యూకి చెయ్యడానికి కూర్చున్న మిగిలినవాళ్ళు బిగుసుకపోయారు. నావైపే అందరి దృష్టి. నాకు రాకపోతే ఈ ఉద్యోగం ఎవరికి ఇస్తారు, అన్న ధీమా నాకు ముందు నుంచీ ఉంది దాని బలం వల్లే నామాటలు తాపీగా ధృఢంగా వస్తున్నాయి.

"బహుశా భీమ్‌రావు అంబేద్కర్ వ్రాసాడని నేను అంటాను అనుకొన్నారు కాబోలు" అన్నాను. అది సరైన జవాబు కాదన్నట్టు ఊపుతూ.

"1946లో మన కాంస్టిట్యూషన్ నిర్మాణం కోసం 299 మందితో కాంస్టిట్యూషన్ ఆఫ్ అసెంబ్లీ ఏర్పడింది. అందులో 17 కమిటీలున్నాయి. ఆ 17 కమిటీల్లో కాంస్టిట్యూషనల్ డ్రాఫ్టింగ్ కమిటి ఒకటి. ఈ కమిటికి మాత్రమే డా. అంబేద్కర్ చైర్మన్ ఈ కమిటీ రెండేళ్ళ పదకొండు నెలల పదిహేడు రోజులు పనిచేసి రాజ్యాంగాన్ని రూపొందించింది. ఈ కమిటీ పనితీరు మీద ఎన్నో విమర్శలొచ్చాయి. నత్త మీద అంబేద్కర్ కూర్చుని ఉంటే నెహ్రూ కొరడాతో కొడుతున్న శంకర్ వీక్లీ కార్టున్ ఆయన పనితీరుకి చమత్కారం" అంటూ నాకు తెలిసిన విషయాలన్నింటినీ ఒక వడగళ్ళవానలా కురింపించాను. ఒక్కసారి చెప్పడం ఆపి వాళ్ల మొహాల్లోకి చూశాను.

నిశ్శబ్ధం.

వాళ్ల సీరియస్‌నెస్ చూసి నన్ను ఇకలే, వెళ్ళు చేసిన ఇంటర్వ్యూ చాలని అంటారు అని అలా అనలేదు. అంతాలేచి నించున్నారు. బెరుకు బెరుకుగా నిలుచున్న వాళ్ళు "సర్.... సర్...' అంటున్నారు.

ఎవరినా? అని వెనక్కి తిరిగి చూస్తే ఒక పెద్దాయన నిలుచున్నారు. పంచెకట్టుకుని, పైన ఖద్దర్ చొక్కాతో చాలా హుందాగా కనిపించారు. నేను కూడా మర్యాదకోసం లేచి నిలుచున్నాను.

"నీ పేరేమిటి?" అని అడిగారు

చెప్పాను

"ఏఊరు?"

చెప్పాను.

"ఏం చదివావు?"

చెప్పాను

"ఈ ఇంటర్వ్యూకి ఎందుకు వచ్చావు?"

"ఉద్యోగం కావాలని?"

"ఉద్యోగానికి ఎందుకువచ్చావు?"

"డబ్బులు... జీతం కోసం...." అన్నాను నిశ్చయంగా. ఇంటర్వ్యూ చేస్తున్న వాళ్ళు ఏమీ మాట్లాడటం లేదు. లేచి నిలబడే ఉన్నారు. అంటే ఈ ప్రశ్నలు వేస్తున్న ఆయన వీళ్ళపై అధికారి అయిఉంటారని తోచింది.

"జీతం కోసం అయితే ఈ ఉద్యోగానికి ఎందుకు అప్లై చేశావు. ఇంతకన్నామంచిది, ఎక్కువజీతం వచ్చే ఆపరేటింగ్ ఉద్యోగానికి ఎందుకు అప్లై చెయ్యలేదు." అన్నారు.

"నేను అప్లై చేసినప్పుడు కమర్షియల్ పోస్టులు అడ్వర్‌టైజ్ చేశారు సర్" అన్నాను. అప్పటికి నాకు తెలియకుండానే నామాటలలో వినయం ఉల్లిపొర కాగితంలా ప్రతీమాటను చుట్టుకుని వస్తున్నది.

"సరే, ఇతన్ని ఆపరేటింగ్ పోస్టు కోసం కంటి పరీక్షకు పంపండి" అని ఇంటర్వ్యూ చేస్తున్నవాళ్లకి చెప్పారు.

"ఎస్ సార్ " అన్నారు అందరూ ఒక్కసారి.

"థాంక్స్ సర్" అన్నాను. నేను ఆయనకి నమస్కారం కూడా పెడుతూ.

ఈ ఉద్యోగంవస్తే నీకు పాస్ పంపుతారు. అది తీసకొని జాయిన్ అవడానికి రమ్మంటారు. జాయిన్ అవకముందే వచ్చి నన్ను కలువు" కదలబోయారు.

"మీరు, మీపేరు...." ఇంతకీ మీరెవరు, మిమ్మల్ని ఎలా కలవాలి అన్న భావనతో

"నేను రైల్వే సర్వీస్ కమీషన్ చైర్మన్‌ని" అన్నారు.

"తప్పకుండా వచ్చి కలుస్తాను" అన్నాను.

అని చెప్పటం ఆపాను. మా ఇంట్లో భోజనం చేస్తున్న అందరివైపూ చూశాను.

"ఉద్యోగం వచ్చిందా? రైల్వేపాస్ వచ్చిందా? ఆయన్ని కలిసారా? రైల్వే ఉద్యోగంలో జాయిన్ అయ్యారా?" భోజనం మధ్యలో ఆపి అడిగారు కుతూహలం ఆపుకోలేనివాళ్ళు.

"ఉద్యోగం వచ్చింది. వచ్చిన మూడు నెలలకి పాస్ కూడా వచ్చింది. ఆపాస్ పట్టుకుని ఆయన్ని కలవడానికి వెళ్లాను. దొరకలేదు. మూడుసార్లు ప్రయత్నించాను. ఈలోగా ఎమ్మెస్సీ కూడా అయిపోయింది.

మరి రైల్వే ఉద్యోగం? ఆతృతగా అడిగారు.

"అమెరికాలో పిహెచ్‌డి అడ్మిషన్ స్కాలర్‌షిప్‌తో సహా వచ్చింది. అమెరికా వచ్చేశాను. ఓ ఇరవైఏళ్ల కిందట" అన్నాను. నేను కూడా జ్ఞాపకాల్లోంచి బయటపడుతూ

"అయితే అంబేద్కర్‌కు థ్యాంక్స్ ఎందుకు" అని అడిగారు ఒక ప్రొఫెసర్‌గారు. ప్రతి మెదడూ ఒక్కొవిధంగా పనిచేస్తుంది. అని నిరూపించడానికన్నట్టు

"రాజ్యాంగం ప్రశ్నేలేకుంటే, అంబేద్కర్ జవాబులేదు. అంబేద్కర్ జవాబు లేకపోతే ఇంటర్వ్యూ మాములుగా అయ్యేది. ఇంటర్వ్యూ మాములుగా అయితే సర్వీస్ కమిషన్ ఛైర్మన్ ఆగేవారు కాదు. సర్వీస్ కమిషన్ ఛైర్మన్ ఆగకపోతే నన్ను వచ్చి కలవమని చెప్పేవారు కాదు. ఆయన్ని కలవడానికి అన్న కండీషన్ లేకపోతే ఆ ఉద్యోగంలో జాయిన్ అయిపోయ్యేవాడిని. ఆ ఉద్యోగంలో జాయిన్ అయితే

ఇక అమెరికా రావడం ఉండేదికాదు. అమెరికా రాకపోతే మిమ్మల్ని కలిసే భాగ్యం ఉండేదికాదు. మిమ్మల్ని కలిసే భాగ్యం లేకపోతే, ఇవాళ మీతో కలిసి భోజనం చేసే అవకాశం ఉండేదికాదు." అని ఆగి అందరివైపు చూసి నవ్వుతూ,

"అంచేత అంబేద్కర్‌కి థ్యాంక్స్ చెప్పుకోవాలి" అన్నాను.

*

**నా బ్రతుకు రైలు పారిస్ వెళ్ళడానికి**
**పరోక్షంగా పచ్చ జెండా ఉపిన**
**శ్రీ కందాళం సుబ్రహ్మణ్య తిలక్,**
**రైల్వే సర్వీస్ కమీషన్ ఛైర్మన్,**
**గారికి నమస్కరిస్తూ...**

# ఉత్త(మ) టీచరు అవార్డు స్టూడియో

**నే**ను ఫోటో స్టూడియో పెట్టి ఒక ఏడాది దాటింది. పెద్ద పేరు రాలేదు. డబ్బులు రాలేదు. ఇక అది మూసేసి మరేదైనా వ్యాపారం పెట్టుకొందామా అని ఆలోచిస్తున్న రోజులవి. ఒకరోజు స్టూడియోలో ఒక్కడిని కూర్చొని కొత్త వ్యాపారాల కోసం ఆలోచిస్తున్నప్పుడు ఒక ఆవిడ వచ్చింది. ఆమె మా ఊరి దగ్గరలో ఉన్న ఒక పల్లెటూరిలో టీచరు. ఆమె రాక నన్ను నా ఫోటో స్టూడియో దశను మార్చేసింది.

ఆలోచన, అవకాశం, ఆదాయం, అభివృద్ధి అంతస్తూ ఒకదాని తరువాత ఒకటి వచ్చి మీద పడ్డాయి. అవకాశాలు శాఖోపశాఖలుగా విస్తరించి వృక్షంలా పెరిగి నన్ను నా స్టూడియోను నిలబెట్టాయి. ఇప్పుడు నేను మరే ఫోటోలు తీయను. ఒక్క టీచర్లను తప్ప అదెలా జరిగిందంటే

"ఫోటోలు తీస్తావా?" అని అడిగింది. ఆ టీచర్ స్టూడియోలోకి అడుగు పెడుతూ,

"తీస్తాను మేడమ్" అన్నాను.

"అమ్మయ్యా" అని నా ఎదురుగా ఉన్న కుర్చీలో ఆమె కూర్చుంది.

"లోపలికి రండి మేడం" అన్నాను. నేను లేచి నిలబడుతూ

"ఫోటోలు తీయవలసింది ఇక్కడకాదు"

"మరెక్కడ మేడం?"

"స్కూల్లో......."

"పిల్లలకా....ఏం ఫంక్షన్ మేడం?" అన్నాను. ఒక పాస్‌పోర్ట్ కానందుకు సంతోషిస్తూ

"ఫంక్షన్‌కాదు ఒక పథకం..."

"ఏం పథకం మేడం?" అన్నాను. గవర్నమెంట్ డబ్బులు అన్న ఆశతో. పథకాలలో చాలా ఫోటోలు ఉంటాయి. అన్న ఉద్దేశ్యంతో లోలోపల నాలో ఆనందం ఒక్కసారి ఉప్పెనలా ఎగిసింది.

"ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డు"

"ఒక్క అవార్డు ఫంక్షనా?" అని తక్కువ డబ్బులన్న నిరుత్సాహంతో

"ఏ రోజు మేడం?" అని అడిగాను. నేను ఏ రోజైనా ఖాళీయేగాని

"ఒకరోజు కాదు ఒక వారం రోజులు కావచ్చు..."

"ఎప్పటి నుండి మేడం?"

"వచ్చే సోమవారం నుండి మా స్కూల్లో... ఉదయానే ఎనిమిది గంటలకు వచ్చితీస్తూ ఉండాలి."

"ఎన్ని ఫోటోలు మేడం?" ఎంత బేరమో అంచనా వేయాలని

"పెద్ద అల్బం కావాలి....పెళ్ళి అల్బంలా. ఎన్ని ఫోటోలు నాకు తెలియదు. రోజువారి లెక్కన రోజుకింత అని అనేసుకుందాం ఏటంటావ్?"

"పై ఊరు కదా మేడం.... మరి ఫోటో ప్రింట్లు, ఆల్బం...' అని నసిగాను.

"రానుపోను ఖర్చుకాక, ప్రింటుకెంత ఆల్బమ్ ఎంత ముందే ఒక మాట అనీసుకుందాం...."

"అలాగే మేడం ...." అన్నాను ఆనందంగా.

రోజు కింత, ప్రింటు కింత, ఆల్బం ఇంత అని ఒకమాట అనుకున్నాం.

టీచరుగారు వెళ్ళిన దగ్గరనుండి రాత్రి పడుకునే లోపల కనీసం పదిసార్లైనా టీచర్ పనికి ఎంత వస్తుందో లెక్కలు పెట్టుకున్నాను. ఒక వారం రోజుల పనికి రెండు నెలల ఆదాయం. ఆరాత్రి నాకు నిద్రపట్టలేదు. నిజంగా అన్నంతా ఇస్తుందా. అన్న అనుమానం అప్పుడప్పుడూ తొంగిచూసి ఇదంతా కలా అని అనిపించింది.

మర్నాడు ఉదయాన్నే టీచరుగారి స్కూలు ఉన్న ఊరికి వెళ్లాను. అప్పటినుంచి ఒక వారం రోజులపాటు ఉదయాన్నే స్కూలుకి వెళ్ళాను. ఆ టీచరమ్మ పాఠాలు చెబుతున్నట్టు , పిల్లల చేత అక్షరాలు దిద్దిస్తున్నట్టు, పిల్లలని ఆడిస్తున్నట్టు, పాటలు పాడిస్తున్నట్టు, వాళ్ళతో డ్రిల్లు చేయిస్తున్నట్టు పిల్లకి మధ్యాహ్నం భోజనం పెడుతున్నటట్టు, ప్రేయర్ చేస్తున్నట్టు, పరీక్ష పెడుతున్నట్టు ఇలా ఎన్నోరకాలుగా టీచరమ్మని స్కూల్లో కొన్నివందల ఫోటోలు తీశాను. ఆమెకి నచ్చినవి ఒక రెండువందల ఫోటోలు. ఒక ఆల్బంగా తయారుచేసి ఇచ్చాను. ఆవిడ ఇవ్వవలసిన డబ్బు పూర్తిగా ఇచ్చినప్పుడు ఆడబ్బును చూసి నా కళ్ళని నేనే నమ్మలేక పోయాను. నిజమైన రూపాయలు. అలా మైమరచి నిలిచిపోయిన నన్ను చూసి

“నాకు ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డు వచ్చినప్పుడు నువ్వే వచ్చి వీడియో తీయాలి” అని ఆమె అంది. అల్బమ్‌చూసి మురిసిపోతూ.

“అలాగే మేడం” అన్నాను. గాలిలో తేలిపోతూ.

మేడంగారు అన్నట్లే ఆమెకి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా అవార్డు వచ్చినది. ఫంక్షన్ అయింది. మేడమ్‌గారే కారుపెట్టి టీచర్లని కొంతమందిని తన క్లాసు పిల్లల్ని, నన్ను తీసుకువెళ్ళారు. జిల్లా ఎడిషన్‌లో ఆమె అవార్డు తీసుకొంటున్న ఫోటోపడింది. అదినేను తీసిన ఫోటో నాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఆనందమే కాక చాలా డబ్బు కూడా వచ్చింది. ఖర్చులు, అప్పులు పోనూ కొంత మిగిలింది. కూడాను. మిగిలిన డబ్బులు చూసుకుని మా ఆవిడను పిల్లల్ని ట్రిప్‌కి తీసుకుని వెళ్ళాలని ప్లాన్ చేశాను.

కాని టీచర్‌గారు ఫోన్‌చేసి ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు వచ్చినందుకు ఊర్లోవాళ్ళు సన్మానం చేస్తున్నారని వచ్చి ఆసన్మానం కూడా కవర్ చేయమన్నారు.

నా ఫామిలీ ప్రోగ్రాం మానుకొని, టీచర్‌గారి సన్మాన సభలో ఫోటోలు తీయడానికి వెళ్ళాను. ఇలా మేడంగారు నాకిచ్చేదే చాలా డబ్బు అని అనుకొన్నాను. అంత తీసుకోకుండా ఉండాల్సింది. ఇంకోసారి టీచర్‌గారి దగ్గర తక్కువే తీసుకోవాలని అనుకొన్నాను. అదే విషయం మా స్నేహితులతో అంటే ఆమె ఊర్లో రాజకీయ నాయకులకి సన్మానం చేసినందుకు భోజనాలకు ఇచ్చినదానిముందు నాకిచ్చింది తక్కువే అని తెలిసి ముందు ఆశ్చర్యం వేసింది తర్వాత నా మనసు కుదుటపడింది. అక్కడితో అయిపోలేదు. మేడంగారి సన్మాన సభకి వచ్చిన వారందరితో ఫోటోలు తీయించుకున్నారు. వారందరి చేతా ఆమె సన్మానం ఫోటోలు కొనిపించారు.

టీచర్‌గారి ఫోటోలు తీసిన తరువాత మరే ఫోటోలూ తియ్యాలన్నా అణా కాణి కోసం చిల్లర బేరాల్లా అనిపించి ఫోటోలు తియ్యాలనిపించలేదు.

మేడంగారి అవార్డు కోసం నేను చేసిన పని డబ్బేకాదు. తృప్తిని కూడా ఇచ్చింది. అదే మేడంగారికి చెప్పి ఇంకా ఇలాంటి పార్టీలు చూపించమని అడిగాను మరెవరో ఎందుకు, నాకే ఇంకా స్టేట్ అవార్డు, కేంద్ర అవార్డు రావాలి. ఇంకా చాలా ఫోటోలు, వీడియోలు కావాలని ఇంకెవరికీ చెయ్యవద్దని చెప్పారు. మేడంగారు చెప్పినట్లే తరువాతి రెండు నెలల్లో మేడమ్‌గారి సేవలను చూపించే లాంటి ఫోటోలు ఎనెన్నో తీశాను. ఆల్బమ్ చేశాను. మేడంగారితో పాటే ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు ఫంక్షన్‌కి హైదరాబాద్ వెళ్ళాను. ఢిల్లీకి వెళ్ళాను.

స్కూల్‌కి రోజూ రాని, వచ్చినా కాలుమీద కాలు వేసుకుని నోరువిప్పని టీచర్‌ని కూడా ఒక గొప్ప ఉత్తమ టీచర్‌గా ఎలా ఫోటోలలో వీడియోలలో చూపించాలో నాకు తెలిసి పోయింది. జిల్లా , రాష్ట్ర, దేశ స్థాయిలో అవార్డు, అవార్డుకి కావాల్సిన ఫోటోలు, ఆల్బమ్ వచ్చిన ప్రతిమారు. ఊర్లో జిల్లాల్లో ఏర్పాటు చేయించుకున్న సన్మానాలు, పేపర్లలలో వచ్చిన వార్తలు, శుభాకాంక్షలు తెలిపే ప్రకటనలు, అన్ని కలిపి ఒక మంచి పాకేజిలా తోచింది. ఇదే ఆలోచన ఒక మిత్రుడితో చెప్పాను. వాడువిని ఆశ్చర్యపోయి,

"తప్పురా, అలా లేనిది ఉన్నట్టు చూపకూడదు" అన్నాడు.

అలా అయితే, కథ వాళ్ళది కాదు, మాటవాళ్లదికాదు, ఒంటి రంగు వాళ్లదికాదు, వంటిమీద వేసుకున్న బట్టలు వాళ్లవి కాదు, జుట్టువాళ్లదికాదు, ముఖానికి ఉన్న మీసంవాళ్లదికాదు, డైరెక్టర్లు చెప్పినట్లు నటిస్తారు. డాన్స్‌మాష్టర్ చెప్పినట్లు స్టెప్స్ వేస్తారు. ఫైట్లకి మరెవరినో పెట్టి చేయిస్తారు. మరి అలాంటి వాళ్లకి బోల్డు డబ్బులిచ్చి గొప్పగా రాసి అవార్డులు ఇవ్వగాలేనిది. మా మేడంకి ఎందుకివ్వకూడదని వాదించాను.

ఇప్పుడు నా ఫోటో స్టూడియోలో టీచర్స్ అవార్డు ఫోటోలు వాటికి సంబంధించిన కార్యక్రమాలకు మాత్రమే ఫోటోలు తీస్తాను. ఎవరి అర్హతను బట్టి వారికి అవార్డు పేకేజీలు, రేట్ల వివరాలు ఉన్నాయ్ రామోజీ ఫిలింసిటీకి డబ్బులు పట్టుకెళ్ళి సినిమా రీళ్ళ డబ్బాలు పట్టుకొని బయటికి రావచ్చుంటారు. అలా నాస్టూడియోలోకి డబ్బులు పట్టుకొని వచ్చి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పట్టుకున్న ఫోటోతో బయటికి రావచ్చు. ఇప్పటి వరకూ నాస్టూడియో ద్వారా 20మంది టీచర్లు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకొన్నారు. గట్టిగా ప్రయత్నిస్తే ప్రభుత్వం నాకే ఈ అవార్డు ఇచ్చే పథకం ఔట్ సోర్సింగ్ చేయవచ్చు. మా జిల్లాలోని 34 మండల టీచర్లందరికీ అందుబాటులో ఉండాలని మరో రెండు బ్రాంచి స్టూడియోలు త్వరలోనే ప్రారంభిస్తున్నాను. నా స్టూడియోపేరు ఉత్త(మ) టీచరు అవార్డు స్టూడియో.

*

**వృత్తిపరంగా, సామాజికంగా, కుటుంబపరంగా,**
**ఎన్నో కష్టనష్టాలకుకొర్చి పల్లెటూళ్ళలో**
**ఉపాధ్యాయులుగా, ఉపాధ్యాయినిలుగా పనిచేస్తున్న**
**గురువులందరకి నమస్కరిస్తూ...**

# ఫెయిలయిన పిల్లలు పాస్ అయిన టీచరు

**"ఐ**దో క్లాసు పిల్లలందరూ ఫెయిల్ అయ్యారంట!"

"నిజమా?!" ఊరు ఊరంతా ఇదేమాట

విషాదంకాని ఈవిషాదవార్త అందరికీ తెలిసేవేళకి సూర్యుడు పడమటి దిక్కున అంతర్ధాన మవుతున్నాడు. ఆశ్చర్యపడేవారిసంఖ్య పెరుగుతున్నకొద్దీ పరీక్ష తప్పిన పిల్లల తల్లిదండ్రుల ఆగ్రహం రెట్టింపవుతోంది. అది గ్రామం ఊరి పెద్దల వద్ద మొదలై.... ఇంకా పిల్లలు పుట్టని కొత్త జంటలకూ పాకిపోయింది. పిల్లలంతా ఐదోక్లాస్ తప్పడం ఊరికి జరిగిన అవమానమేనని అందరి బుర్రల్లో బలంగా నాటుకుపోయింది. ఎందుకంటే ఐదోక్లాస్ దాకా రావడమంటే ఈ ఊరిలో గొప్పే వారికది పీజీతో సమానం. ఐదుపాసై ఊరిలో ఆరోక్లాస్‌లో చేరాలంటే విదేశాల్లో చదువుకునేందుకు వెళ్ళినట్టే. ఐదుపాసై హీరోలు కావాల్సిన పిల్లలు, జీరోలై మిగలడం ఊరు జీర్ణించుకోలేక పోతోంది.

ఎందుకిలా జరిగిందో బేరీజు వేసుకోలేక ఫిఫ్త్‌క్లాస్ టీచర్ ఒకపక్క మధనపడి పోతోంది. పిల్లలంతా బాగా చదివేవారే ఒక్కరు కూడా పాస్ అవ్వలేదంటే... ఏం జరిగి ఉంటుందో అర్థంకాక ఓ నిర్ణయానికి రాలేక అయోమయంలో ఖాళీ కడుపుతో నడుంవాల్చింది. మరోపక్క ఎప్పుడు తెల్లారుతుందా? అని గ్రామస్థులంతా కళ్ళల్లో వత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నారు. వాటి వెలుగు, ఇంటి చూరు దాటకపోయినా, కంటిమీద కునుకు దూరం చేస్తోంది. ఇవేవీ పట్టని వీధికుక్కలు అప్పుడప్పుడు. తమ ఉనికిని చాటుకుంటున్నాయి. తుఫాను ముందు ప్రశాంతతలా

ఆ గ్రామం నిద్ర నటిస్తోంది.

అది వెనకబడిన జిల్లాల్లో ఒక చిన్న ఊరు. పాఠశాల ఉంది. అందులో ఆ ఊరిలోని మాల మాదిగల పిల్లలే ఎక్కువమంది. బ్రాహ్మణ, రెడ్డి, కమ్మవంటి కులాలవారు ఎవ్వరూ ఆ ఊరిలో మిగలలేదు. మిగిలిన కాపు, నాయుడు వంటి కులాల వాళ్ళు తమ పిల్లల్ని ఈ బడికి పంపరు అగ్రవర్ణాలవారు తమని అణచి వేస్తున్నారని ఆగ్రహిస్తారు కాని, తమ పిల్లలు కింది కులాల వారితో కలిసి చదువుకునే కొద్దిపాటి సమానత్వాన్ని అనుగ్రహించరు. తమ కులపువాడు పెట్టిన ఇంగ్లీష్ కాన్వెంట్‌కి పిల్లల్ని డ్రెస్, బూటు, టై కట్టి అమెరికానో, ఇంగ్లాండో పంపడంలో భాగంగా పంపుతారు. అందుచేత ఆ బడినిండా మాలమాదిగల పిల్లలే ఉంటారు.

ఆ బడిలో ఉన్నది ముగ్గురే టీచర్లు. స్ట్రెంత్ లేదన్న వీక్ పాయింట్‌తోనే సెన్స్‌లేని గవర్నమెంట్ పల్లెల్లో బడులను మూసివేస్తున్నది. అలా పొరుగూర్లలో మూతవేయబడ్డ సింగిల్ టీచర్ స్కూళ్ళనుండి వచ్చారు, ఈ ముగ్గురు టీచర్లు. ఆ ముగ్గురిలో రిజర్వేషన్, రాజకీయ చెంచాగిరి ఉన్న అతను హెడ్‌మాష్టర్. ఈ ముగ్గురు, వారితో వచ్చిన పిల్లలతో పాటు ఈ స్కూల్‌లో ఇప్పుడు ఐదు తరగతులలో మొత్తం 28 మంది పిల్లలు మాత్రమే ఉన్నారు. ఐదో తరగతిలో 15 మంది పిల్లలున్నారు. మిగిలనవాళ్ళు ఒకటి నుండి నాలుగుదాకా ఉన్న తరగతుల్లో ఉన్నారు. నాలుగు తరగతులను ఒక మగ టీచర్‌కి ఇచ్చారు. ఐదో తరగతి వాళ్ళందరిని ఒక ఆడ టీచర్‌కి ఇచ్చారు.

స్కూల్‌కి ఉన్న రెండు గదులలో ఒకగదిలో హెడ్‌మాష్టర్ కూర్చుంటాడు. అదే స్టాఫ్‌రూమ్, రికార్డ్‌రూం, స్కూల్లో ఉండాల్సిన ఏ రూమైనా అదే, దున్నపోతుమీద వర్షం పడితే లేచి పక్కకు జరుగుతుందేమోకాని, ఈ హెడ్‌మాష్టర్ ఏమి జరిగినా కొద్దిగానైనా పట్టించుకోడు. ఉదయం స్కూల్‌కి రావడం, కుర్చీలో కూర్చోవడం దగ్గర్నుండి వంచిన తల ఎత్తకుండా స్కూల్‌టైం అయ్యేదాకా తన పని తాను చూసుకుటాడు. తన పని అంటే తనునడుపుతున్న వందకి 3 రూపాయల వడ్డీ

వ్యాపారం. అది నూటికి ఏడాదికి లెక్కకడితే 36 శాతం వడ్డీ. ఈ ఏడాదిలో ఐదోతరగతి వాళ్ళు పాస్ అయ్యి వెళ్ళిపోతే వచ్చే ఏడడాదికి ఈస్కూల్‌కూడా మూసేస్తారు. అప్పుడు హెడ్‌మాస్టర్‌తో సహా అందరూ మరో ఊరికి బదిలీ అవుతారు. మళ్ళీ ఆఊర్లో కూడా హెడ్‌మాస్టర్ తన వడ్డీ వ్యాపారం నడుపుకోవచ్చు. కాబట్టి ఈ స్కూల్ మూతబడటం ఆయన వ్యాపారానికి ఎంతో ఉపయోగం ఆ రోజు కోసమే ఎదురు చూస్తున్నాడు, ఆయన.

రెండో గది ఐదో తరగతిలో వాళ్ళకి ఇచ్చారు. ఆడ టీచర్, ఐదో తరగతి పిల్లలు అందులో ఉంటారు. ఆ రెండు గదులకి ఉన్న నాలుగు వరండాలలో నాలుగు తరగతులు నడుస్తాయి. నాలుగు తరగతులకు పాఠాలు చెప్పే మాష్టారు రెండు వరండాలు కలిసేచోట కుర్చీ వేసుకుని రెండు వైపులా తల తిప్పుతూ రెండు తలల బ్రహ్మలాగ రెండు తరగతులకు ఇద్దరు టీచర్లు ఉన్నారన్న భ్రమని కలిగిస్తాడు. మిగిలిన రెండు వరండాలు కలిసేచోట మరో కుర్చీవేసుకుని అక్కడ కూడా రోజులో కొంచెం సేపు కూర్చుని నాలుగు తరగతులను నడుపుతాడు.

సగానికి సగం నిరక్ష్యరాస్యులు ఉన్న మనదేశంలో అక్ష్యరాస్యులైన ప్రతి ఒక్కరు నిరక్ష్యరాస్యులైన మరొకరికి అక్షరాలు నేర్పితే ఆనిరక్ష్యరాస్యత వెంటనే పోతుందనే సూత్రాన్ని మా మాష్టారు అమలు చేయడానికి ప్రయత్నిస్తుంటారు. అందులో భాగంగానే పెద్ద తరగతిపిల్లలు కింద తరగతి పిల్లలకు పాఠాలు చెబుతారు. ఈ విధంగా టీచర్ల కొరతకి సులభమైన మార్గాన్ని కనుక్కొని ఆచరిస్తున్నందుకు ఆయన్ని అభినందించాలి. పిల్లలు సరిగ్గా పాఠాలు చెప్పకపోతే? అని ఎవరైనా అడిగితే 'చదువు వచ్చినా రాకున్నా పోయేదేమిటి? ప్రతి ఏడాది పిల్లల్ని ఐదో తరగతి దాకా పాస్ చెయ్యాలి కదా' అని సమాధానం ఇస్తాడు ఆ టీచర్

ఐదోతరగతి పూర్తిగా అన్ని సబ్జెక్టులు చెప్పే ఆవిడ తన క్లాస్‌లో ఉన్న పిల్లలకి ఒకటవ క్లాస్ టీచర్‌గా పాఠాలు చెప్పింది. వాళ్ళు ప్రతి ఏడాది పాసైన క్లాసులకు వెళుతుంటే, వాళ్ళతోపాటే వాళ్ల క్లాస్ టీచర్ వెళ్ళింది. అలా పిల్లలందరికీ

ఈ ఐదేళ్ళుగా ఆమే టీచర్. వాళ్లకు ఆమెంటే ఇష్టం. ఆమెకి కూడా ఈ పిల్లలంటే ఇష్టమే. నాలుగేళ్ళు పిల్లలంతా చక్కగా చదివి పాస్ అయ్యారు. మంచి మార్కులు తెచ్చుకున్నారు కూడా. ఐదో తరగతిలో కూడా బాగానే పాఠాలు చదువుకున్నారన్న పేరు ఉంది. మరి ఆఖరి పరీక్షలలో పిల్లందరూ ఎందుకు తప్పారు?

ఎప్పటి మాదిరిగానే ఆరోజు కూడా బడిగంట కొట్టారు. పిల్లలు పరుగు పరుగున వచ్చారు. పిల్లల వెనక వారి తల్లిదండ్రులు  కూడా వచ్చారు. స్కూలు, స్కూలు చుట్టూ ఉన్న కొద్దిపాటి ఆవరణ, స్కూలు ముందున్న రోడ్డు మనుషులతో నిండిపోయింది. వాతావరణంలోని గాలి వారి మాటలతో నిండిపోయింది. గాలీ, నేలా ఎటుచూసినా 'ఇరుకు' భావనని కలిగిస్తున్నాయి. పిల్లల్ని స్కూల్లోకి పంపడానికి టీచర్లు ప్రయత్నిస్తున్నా వాళ్లు వెళ్ళడంలేదు. వచ్చిన తల్లిదండ్రులు తమపిల్లలందరూ పరీక్షలో తప్పినందుకు  తప్పు స్కూల్‌దేనని, వెంటనే మార్కులు వేసి పాస్ చెయ్యమని అరుస్తున్నారు.

హెడ్‌మాష్టారు వారికి సర్దిచెపుతున్నారు.

"అందరి పిల్లలకు సున్నా మార్కులు ఎలా వస్తాయండీ"

"ఏడాది పొడుగునా స్కూలుకి పంపితే గాడిదలు కాయించారా?"

"మావంటే అంత సులకనా?"

"మా పిల్లలకు చదువులు చట్టుబండలు వద్దా"

"మా కులపోడే పాఠాలు చెపితే మాకింత అన్యాయం జరుగుతుందా?"

ఇలా రకరకాల ప్రశ్నలు, విరుపులు, చరుపులు, మెరుపులాంటి మాటలతో తల్లిదండ్రులు స్కూలుమీద దండయాత్ర చేస్తున్నారు.

పిల్లలంతా సినిమా షూటింగ్ చూస్తున్నంత ఆనందంగా చూస్తున్నారు.

"మీ పిల్లలు ఆపెద్ద పరీక్షలో ఒక్క ప్రశ్నకి సరైన సమాధానం రాయలేదు. జవాబులకు బదులు అక్షరాలు, అంకెలు, సినిమాపేర్లు , సినిమా పాటలు,

మాటలు రాశారు. మార్కులు ఎలా వస్తాయి.?" అంటూ హెడ్‌మాష్టారు గట్టిగా గదమాయించినట్టు అడిగాడు.

ఆ మాటలు విన్న ఐదో క్లాస్ పిల్లలంతా కిసుక్కున నవ్వారు.

"మేం నమ్మం... మేనమ్మం" అంటూ తల్లిదండ్రులు గట్టిగా అరిచారు.

"మేడం....ఐదో క్లాస్ వాళ్ళ పేపర్లు తీసుకురండి" అని ఎవరిమీద చూపించలేని కోపాన్ని ఆ టీచర్‌మీద చూపిస్తూ గట్టిగా అరిచాడు.

"ఆ టీచర్‌ని తీసెయ్యండి"

"కొత్త టీచర్‌ని వెయ్యండి"

"మా ఊరు, మా పిల్లలంటే అంత లోకువా?" అని తల్లిదండ్రులు ఒకర్నొకరు తోసుకుని ముందుకు వస్తూ అరుస్తున్నారు.

పిల్లలు బిక్కమొహం వేసుకుని చూస్తున్నారు.

'ఐదేళ్ళుగా తను పాఠాలు చెప్పిచక్కగా తీర్చిదిద్దిన పిల్లలు ఆఖరి పరీక్షలో ఎందుకిలా చేశారో? ప్రేమాభిమానంతో వాళ్ళకి చదువు చెబితే చివరికి ఇదా ఫలితం? ఎన్నో ప్రశ్నలతో, అయోమయస్థితిలో ఉన్న టీచర్ టీచర్ పిల్లల జవాబు పత్రాల్ని తెచ్చి హెడ్‌మాష్టారుకి ఇచ్చింది. ఆయన ఒక పేపర్ తెరిచి తల్లిదండ్రులకు చూపిస్తూ "ఇదుగో చూడండి" అంటూ తనకున్న బలాన్నంతా అరుపులో చూపించాడు.

"అందులో ఏటుంటేమాకేటి? మా పిల్లలకు మార్కులు ఇవ్వాల. ఆళ్ళు పరీక్షలు పాస్ అవ్వాల. అంతే!" అన్నారు ఒక్కసారి.

"మార్కులు రాకపోతేనేం? పిల్లలందర్నీ పాస్ చేస్తాం" అని అప్పటిదాకా మౌనంగా ఉన్న ఒకటి నుంచి నాలుగు తరగతుల టీచర్ గొంతు విప్పాడు. రాజకీయ నాయకులు ప్రజలకు సర్దిచెప్పి తీరులో నవ్వుతూ, అందర్నీ చూస్తూ

ఈ సమాధానంతో క్రమంగా శాంతిస్తున్న తల్లిదండ్రులు మళ్ళా "చెప్పండి

మా పిల్లలు పై చదువులకు వెళ్ళద్దా?" అంటూ ప్రశ్నించారు.

ఇంతలో పిల్లల వైపునుండి కలకలం మొదలైంది.

"మేం పాస్ కాం" గట్టిగా ఒకే కంఠంతో అంటూ "మళ్ళీ ఐదో తరగతి అ టీచర్‌తోనే చదువుతాం" అన్నారు. ఉత్సాహంగా.

ఇది విన్న టీచర్లు తల్లిదండ్రులు ఆశ్చర్యంతో పిల్లల వైపు చూవారు.

తల్లిదండ్రులు గబాగబా తమ పిల్లల దగ్గరికి వచ్చి కొట్టేవాళ్ళు కొడుతూ, తిట్టేవాళ్ళు తిడుతూ "ఇదేం పొయ్యేకాలం? ఆళ్లు పాస్ చేస్తామంటే మళ్ళీ ఐదో తరగతి చదువుతామంటారు." అంటూ కేకలేస్తున్నారు. పిల్లలు భయం భయంగా చూస్తున్నారు. టీచర్లు కొత్తపాఠం వింటున్న పిల్లల్లా మొహం పెట్టారు. అంకెలు లెక్కలు వడ్డీలు, మొత్తంలో సతమతమయ్యే హెడ్‌మాష్టర్ తనకి తెలియని భాష వింటున్న వాడిలా చూస్తుండిపోయాడు.

ఇంతలో నీళ్ళమీద నడుస్తున్న సాధువులా ఆ ఊరి ప్రెసిడెంట్ సారయ్య అక్కడికి వచ్చాడు.

"ఏటెందుకు, ఇంతమంది మీటింగ్ ఎట్టారు?" అని తనను అడక్కుండా, తన దగ్గరకు రాకుండా ఇంతమంది స్కూల్లో కలవడం తనకు పరువు తక్కువ అన్న మాట అనకుండా అదే భావం వచ్చేటట్టు అన్నాడు.

"మరేటి నేదు దద్దా ... పిల్లలందరిని ఫెయిల్ చేసినది ఈ మేడంగారు." అని ఆమె వైపుచేయిపెట్టి చూపించారు.

"ఏటి నన్నడకుండా ఫెయిల్ చేసినారా మేడంగారు? అన్నీ మీరే చేసేస్తే మరి నేనెందుకు?" అని తన రాజ్యంలో తన అధికారాన్ని ధిక్కరించిన మనిషిని అడిగిన రాజులా అడిగాడు. ప్రెసిడెంట్ సారయ్య.

లెక్క తన చెయ్యి దాటిపోతోందనుకున్న హెడ్‌మాష్టర్ కలగజేసుకుని "అదికాదు పిల్లలు పరీక్ష సరిగా రాయలేదు. మార్కులే సరిగ్గా రాలేదు. ఫెయిల్

అయ్యారు.” అన్నాడు ప్రెసిడెంట్‌ని శాంతపరుస్తూ.

ఏటి మా పిల్లలు సరిగ్గా రాయకపోతే ఫెయిల్ చేసేస్తారా? కొన్ని మార్కులు ఎగస్ట్రా ఏసి పాస్ చెయ్యాలికాని చట్ట ప్రకారం మా పిల్లలు తక్కువ వచ్చినా పాస్ అవ్వాలి. తరతరాల నుండి...” అని రాజకీయ ప్రసంగం ఇచ్చే తీరులో మొదలుపెట్టాడు.

“పిల్లలు ఏ కొంచెం రాసినా పాస్ చేసేవాళ్ళమే...” నాలుగు తరగతులు నిర్వహిస్తున్న రెండు తలల టీచరు ప్రెసిడెంట్‌కి సర్దిచెప్పడానికి ప్రయత్నించాడు.

“అంటే ఏటి? మా పిల్లలు ఫెయిల్ అవ్వాలని పరీక్షలు రాసారా?” అని సూటిగా అడిగాడు ప్రెసిడెంట్ సారయ్య .

“అవును ఈ పిల్లలందరూ ఏడాదిలో అన్ని పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకున్నారు. పెద్ద పరీక్షల్లో ఒక్క ప్రశ్నకీ జవాబు రాయలేదు.” అని తన పిల్లలు ఫెయిల్ అయ్యారని బాధనంతటిని గొంతులో నొక్కిపెడుతూ అన్నది వాళ్ల టీచర్

“మరి మీకు వాళ్ళు పాసయ్యే పిల్లలే అని తెలుసు కదా పాస్ చేయండి” అన్నాడు ప్రెసిడెంట్ సారయ్య

“అలా చేయడానికి పవర్స్ లేవు. మాపై అధికారి ఎం.ఇ.ఓ. గారు మాత్రమే ఆ పని చెయ్యగలరు.” అన్నాడు హెడ్‌మాష్టర్.

“ఆరినే పిలిచి పిల్లల్ని పాస్ చెయ్యండి” అన్నారు తల్లిదండ్రులు కోరస్‌గా

“ఇవాళే వారిని కలిసి ఈసమస్యను పరిష్కరించమంటాం” అని అందరికీ చెప్పాడు హెడ్‌మాష్టర్.

“ఇక అందరూ ఇళ్ళకు వెళ్ళండి” అన్నారు రెండో మాష్టారు.

“పాస్‌కాం... పాస్‌కాం ఫెయిల్....అవుతాం” అని స్లోగన్‌లు ఇచ్చుకుంటూ, నవ్వుకుంటూ పరుగులు తీశారు.

మర్నాడు ఎం.ఇ.ఓ. అంటే మండల విధ్యాధికారి స్కూల్‌కి వచ్చారు. అతను టీచర్లకి పైఅధికారి. జిల్లా విద్యాధికారి కింది అధికారి. పిల్లలు వాళ్ళ తల్లిదండ్రులు, ఊరి ప్రెసిడెంటు వచ్చారు. ఆ మీటింగ్‌కి ప్రెసిడెంట్ పెద్దరికం వహించాడు. ఎం.ఇ.ఓ. విషయం తెలుసుకున్నాడు. తన ఇరవైఏళ్ల సర్వీసులో ఇలాంటి పేచీ తను చూడలేదన్నాడు.

"పరీక్ష ఎందుకు ఫెయిల్ అయ్యార్రా?" అని పిల్లలవైపు తిరిగి నవ్వుతూ అడిగాడు ఎంఇఓ

"పాసైతే పైక్లాస్‌కి, పైఊరికి వెళ్లాలి. అందుకే తప్పాం. ఫెయిల్ అయితే ఈ ఊర్లోనే ఉంటాం ఈ స్కూల్లోనే ఉంటాం ఈ టీచర్‌కాడే చదువుకుంటాం" అని సూటిగా, ఆనందంగా అసలు విషయం బయటపెట్టారు పిల్లలు.

ఈ టీచర్ దగ్గరే ఉండాలని పిల్లలు ఫెయిలయ్యేరని అప్పుడు అర్ధమైంది అందరికి.

"వీళ్ళని పాస్ చేసినా స్కూల్‌కి వెళ్ళమంటున్నారు. ఈ స్కూల్‌ని అప్పర్ ప్రైమరీ స్కూల్‌గా చేసి ఈ టీచర్‌ని ప్రమోట్ చేసి వీళ్లని పాస్ చెయ్యడం ఈ సమస్యకి పరిష్కారం" అన్నాడు ఎంఈఓ

"అలా చెయ్యండి... అలా చెయ్యండి" అన్నారు పిల్లలంతా ఉత్సాహంగా

ఇలా చేస్తే ఇక స్కూల్ మూసేయడం జరగదు. తను మరొఊరు వెళ్ళడం కుదరదు. అని ఆలోచించాడు. హెడ్‌మాష్టర్.

స్కూల్ పెద్దదయితే ఫండ్స్ వస్తాయి. అని ఆలోచించాడు ప్రెసిడెంట్

పిల్లల్ని పైఊరికి పంపనక్కరలేదు అనుకున్నారు తల్లిదండ్రులు.

మళ్ళీ ఈ టీచర్ దగ్గరే చదువకోవచ్చు అని సంతోషించారు పిల్లలు.

అలా చెయ్యడం ఎంత కష్టమో, ఎన్ని పనులు చెయ్యాలో వివరిస్తూ "అలా చెయ్యడం కుదరదు, నాదగ్గర ఆస్థాయి అధికారాలు లేవు" అని చెప్పాడు

ఎం.ఇ.ఓ.

ఈ తగువు జిల్లా విద్యాధికారి వద్దకు చేరింది. అంతా విని అగ్గిమీద గుగ్గిలమయ్యారు అతను. స్కూలుకు వచ్చారు. ఇంత చిన్న విషయాన్ని నాదాకా తీసుకొస్తారా? అంటూ ఎం.ఇ.ఓని, హెడ్‌మాష్టర్‌ని, పిల్లలకి పాఠాలు చెప్పిన టీచర్ని గట్టిగా తిట్టాడు. టీచరే పిల్లల చేత ఇలా చేయించిందని టీచర్‌కి పనిష్మెంట్ పోస్టింగ్ ఇస్తానన్నాడు. అదివిన్న పిల్లలంతా డి.ఇ.ఓ. డీఓజీ అంటూ కేకలు వేశారు. పిల్లలంతా తనని అలా అనడంతో కోపంతో ఊగిపోతూ వారిమీద విరుచుకుపడ్డాడు. ప్రెసిడెంట్ ఏదో చెప్పబోతుంటే "మీరు కలగజేసుకోకండి" అని కసిరాడు.

"వీళ్లని పాస్ చేసి ఈ ఊర్లో స్కూల్‌ని మూసేయండి" అనా ఆజ్ఞ జారీచేసి కోపంతో కారెక్కి వెళ్ళిపోయాడు.

డి.ఇ.ఓ. తన కులపువాడే కాబట్టి తను చెయ్యగలిగిందేమీ లేదని గ్రహించాడు ప్రెసిడెంట్ సారయ్య,

ఈ వివరాలన్నీ సేకరించిన ఆ ఊరిలో ఉన్న ఒకచిన్న విలేఖరి అన్ని పేపర్లకి వార్తలా పంపించాడు.

ఓ పత్రికా కార్యాలయంలో జిల్లా ఎడిషన్ వార్తలన్నీ చూస్తున్న సబ్ ఎడిటర్ పొరపాటున ఈ వార్తను మెయిన్ ఎడిషన్‌కు పంపించాడు. మెయిన్ ఎడిషన్‌లొ ఒక సబ్ ఎడిటర్ ఆలోచించి, 'డి.ఇ.ఓతో ఢీకొట్టిన పిల్లలు' అనే హెడ్డింగ్ పెట్టి ఎడిటర్‌కి చూంపించాడు. విద్యమీద వార్తలు మెయిన్ ఎడిషన్‌లో తక్కువగా వస్తున్నాయని గమనించిన ఎడిటర్ ఈ వార్తను మెయిన్ ఎడిషన్‌లో వెయ్యమన్నాడు. అలా ఆ వార్త రాష్ట్రమంతా తెలిసింది.

ఈ వార్తను చదివిన విద్యాశాఖ కార్యదర్శి హైదరాబాద్ నుండి జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేశాడు. ఆ వార్తను చదివే అవకాశం కలెక్టర్‌కు ఇవ్వకుండానే, విడమర్చి చదివి మరీ వినిపించాడు. మన డి.ఇ.ఓని డిఓజి అని ఒకచిన్న

పల్లెటూర్లొ పిల్లలు అంటున్నారంటే నీ అడ్మినిస్ట్రేషన్ ఎలా ఉందో తెలుస్తోందంటూ సూచన లాంటి వార్నింగ్ ఇచ్చాడు. విషయం తెలుసుకుని పరిష్కారం కోసం డిస్కస్ చేయడానికి ఫోన్ చెయ్యమన్నాడు. కలెక్టర్ డి.ఇ.ఓకి ఫోన్‌చేసి వెంటనే రమ్మన్నాడు.

"సారీ సార్ నేను రాలేను బిజీగా ఉన్నాను" అని చెప్పి తప్పించుకోవడానికి ప్రయత్నించాడు.

"కుదరదు వెంటనే రావాలి. ఇవాళ న్యూస్ పేపర్లో వచ్చిన వార్త మీద యాక్షన్ తీసుకోవాలి" అన్నాడు.

"ఓ.. అదా..నేను ఆల్రెడీ స్కూల్ క్లోజ్ చెయ్యమని ఆర్డర్స్ ఇచ్చేశాను సార్" మీకెందుకీ గొడవ' అని అర్థం వచ్చే గొంతుతో.

"విద్యా సెక్రటరీ..." అంటూ చెప్పబోతున్న కలెక్టర్ మాటల్ని మధ్యలో అడ్డుకుంటూ

"మన ఎం.పీగారు ఈ ఊర్లలో కొత్త స్కూళ్ళు వద్దన్నారు సార్. అంచేత మరి మనం, నేను చెప్పినట్టే చెయ్యడం మంచిది. ఇది ఎం.పీగారి విషయం, జాగ్రత్త" అన్నాడు డి.ఇ.ఓ.

"ఆహా.. అలాగా.. సరే ఆలోచిద్దాం" అని ఫోన్ పెట్టేసి, ఆదరాబాదరాగా ఆఫీసుకు వచ్చి చిందరవందరగా ఉన్న ఫైల్స్‌ని పక్కకి తోసివేసి తన కింద సిబ్బందిలో నలుగుర్ని పిలిచి విషయం చర్చించాడు. వాళ్ళుకూడా డి.ఇ.ఓ చెప్పిందే చెప్పారు.

కలెక్టర్ వెంటనే విద్యాశాఖ కార్యదర్శికి ఫోన్ చేశాడు. డి.ఇ.ఓ చెప్పాడు.

"కలెక్టర్ పదవిని దేశంలో ప్రభుత్వ పాలనకి ఉక్కుస్థభంతో పోల్చారు, బ్రిటిష్ వాళ్ళు. ఆ పదవిలో ఉన్న వ్యక్తికి ఉక్కుకున్నంత శక్తి ఉండాలన్నారు. మెరుగైన పాలన దేశమంతా ఉండాలన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ పట్టుదలవల్ల

మనకి ఈ కలెక్టర్ పదవి దేశంలో నిలబడింది. నిజాం ప్రభుత్వాన్ని గడగడలాడించింది. మెడలు వంచి భారతదేశంలో విలీనం చేసిన సర్దార్ పటేల్ కున్నంత ధైర్యం లేకపోయినా కనీసం ఒక ఎం.పీకి భయపడకుండా తీసుకోవాల్సిన నిర్ణయం తీసుకో" అంటూ విద్యాశాఖ కార్యదర్శి హితబోధ చేశాడు.

మర్నాడు డి.ఇ.ఓను వెంటతీసుకుని వార్తల్లో వచ్చిన స్కూల్‌కు వెళ్ళారు. కలెక్టర్. పిల్లల్ని పిలిపించాడు. ప్రెసిడెంట్ సారయ్యతో సహా పెద్దలంతా వచ్చారు.

ముందుగా పిల్లలతో మాట్లాడారు కలెక్టర్. పిల్లలు చెబుతున్నది వింటున్న కలెక్టర్‌ని ఆపబోతున్న ప్రెసిడెంట్ సారయ్యను. వారించి మొత్తం విన్నారు.

"సారయ్య గారు... ప్రజలు మిమ్మల్ని ఎన్నుకున్నది వాళ్ళ ప్రతినిధిగా ఉండటానికి ఇవాళ నేను వాళ్ల దగ్గరికి వచ్చి వాళ్లతో మాట్లాడుతుంటే మీరు చెప్పవలసినది ఏమీలేదు. మీరు ఒకపౌరుడిగా ఏదైనా చెప్పాలనుకుంటే వింటాను." అని అందరూ రాజకీయ నాయకులకు వినబడాలన్నంత గట్టిగా, ఘాటుగా చెప్పారు.

అక్కడున్న వారందరికీ కలెక్టర్ మీద గౌరవం పెరిగింది.

"ప్రేమ, గౌరవం, భక్తి, ఒకస్థాయి దాటితే అవి ఇచ్చే శక్తి చాలా గొప్పది. ఈ పిల్లలకు వాళ్ళ టీచర్ మీద ప్రేమ, గౌరవం, భక్తి వీళ్ళకు అంత శక్తిని ఇచ్చాయి. ఉద్దేశపూర్వకంగా పరీక్షల్లో తప్పి ఈ టీచర్‌తోనే ఉండాలని వీళ్ళందరూ చేసిన పని ఏ కోణం నుంచి చూసినా గొప్పదే. వీళ్ళ కోరికపై, ఈస్కూల్‌ని అప్పర్ ప్రైమరీ స్కూల్‌గా చేస్తున్నాము. వాళ్ళు కోరిన టీచర్‌నే ఈ పిల్లల క్లాస్ టీచర్‌గా వేస్తున్నాము. ఈ పిల్లల శ్రద్ధను చూస్తుంటే నాకు చాలాసంతోషంగా ఉంది. వీళ్ళకి మంచి చదువు చెప్పడానికి మరో ఇద్దరు టీచర్లని ఈ స్కూల్‌కి పంపుతాం" అని కలెక్టర్ ప్రకటించారు.

పాఠశాల ఐదు నుంచి ఏడుకి పెరగడం పిల్లలంతా ఎగిరి గంతులు వేశారు. చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు.

మంచి మనసున్న కలెక్టర్‌ని చూసినందుకు ఊరి పెద్దలంతా లేచి నిలబడి తమ గౌరవాన్ని చాటుకున్నారు.

ప్రెసిడెంట్ సారయ్యకు ఏమీ పాలుపోక బి-ఫారం అందని రాజకీయ నాయకుడిలా మొహం పెట్టాడు.

స్కూలు మూతపడనందుకు హెడ్‌మాష్టర్ మొహంలో నెత్తురు చుక్క లేదు.

"పిల్లలు ప్రేమ, గౌరవం, భక్తి సంపాదించుకోవడమే కాదు, దానిని చక్కగా నిలబెట్టుకోండి. ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి. అంటూ ఫిఫ్త్‌క్లాస్ టీచర్‌వైపు ప్రశంసాపూర్వకంగా చూశారు కలెక్టర్.

*

**వృత్తిపరంగా, సామాజికంగా, కుటుంబపరంగా, ఎన్నో కష్టనష్టాలకుకొర్చి పల్లెటూళ్ళలో ఉపాధ్యాయులుగా, ఉపాధ్యాయినిలుగా పనిచేస్తున్న గురువులందరకి నమస్కరిస్తూ...**

# ఆడపిల్లలు నిర్భయంగా తిరిగే ఊరు

**"మా** ఊరులో అర్ధరాత్రి ఆడపిల్లలు నిర్భయంగా తిరగగలరు" అన్నాడు మాపక్కనే కూర్చున్న వ్యక్తి ఎదురుగా ఉన్న ఆవిడతో.

ఆవిడ తన కూతురు ఒక్కర్తె హైదరాబాద్ వెళ్తుంటే ఆమెను సాగనంపుదామని వచ్చి రైలు ఎక్కింది. ఆ అమ్మాయిని పక్కనే ఉన్న తోటి ప్రయాణికులందరికి పరిచయం చేసి, ఆ అమ్మాయిని క్షేమంగా చేరేలా చూడమని అడుగుతోంది.

"నిజమా" అందరం ఆశ్చర్యపోయాం.

"ఇలా చెబితే నమ్మలేరుకాని జరిగింది చెబితే నమ్మకుండా ఉండలేరు." అని ఆగాడు.

మేము అంతా జరిగిందో ఏమిటో చెప్పమని అడుగుతాం అన్న ధీమాతో రెండు కాళ్లు ఎత్తి మఠం వేసుకుని బెర్త్‌మీద వెనక్కి జారబడి నేను సిద్ధం అన్నట్లు అందరివైపూ చూశాడు ఆ వ్యక్తి.

రైలు కదలబోయింది. సాగనంపడానికి వచ్చిన తల్లి ఆదరాబాదరగా రైలు దిగింది. రైలు కదిలింది. మాలో కుతూహలం, నాటిన విత్తనంలో మొలక మొలిచినట్లు బైటికి వచ్చింది. మాలో అందరికంటే వయసులో చిన్నవాడు,

"మీ ఊరిలో ఏం జరిగిందో చెప్పండి ప్లీజ్" అన్నాడు.

అందరం అతనివైపే చూస్తున్నాం.

సుమారు 30ఏళ్ళ వయసు, విదేశీయుడా అనిపించేంతటి తెల్లని రంగు. కొద్దిగా మాసిన బట్టలు. తైలసంస్కారం లేని తల. మెరిసే కళ్ళు. తీక్షణమైన చూపు. సాధారణ ప్రయాణీకుడిలానే ఉన్నాడు. కాని ఏదో ప్రత్యేకత కలిగినవాడనిపిస్తాడు. మొదటిచూపులోనే

"మా ఊరి ఎమ్.ఎల్.ఏ. కొడుకు ఒక బ్రాహ్మణ అమ్మాయిని వాళ్ల ఇంటికే వెళ్లి రేప్ చేశాడు.

నిశ్శబ్దం.

"ఇప్పుడు మీరు ఎలాగా ఉన్నారో అలాగే బలహీనవర్గమైన బ్రాహ్మలు నిశ్శబ్దంగానే ఉన్నారు. రెడ్లు, కమ్మలు, రకరకాల బిసిలు, కాపులు, అందరూ మనకెందుకు అని, కొంతమంది బాపన్లకు కావాల్సిందే అని ఊర్కొన్నారు. ఎమ్.ఎల్.ఏ. మనవాడు ఆడు చేసినా, చెప్పినా మన మీద కుల వివక్ష కేసు పెడతారని భయపడ్డారు. 'ఎమ్.ఎల్.ఏ. మనోడు' 'ఆడు ఏది చేస్తే అది రైట్' అన్న ధోరణి ఊరుకొన్నారు.

కాని ఆ అమ్మాయి ఊరుకోలేదు. పోలిస్ స్టేషన్‌కు వెళ్ళింది. కంప్లైంట్ ఇస్తానంది, రాసుకోమంది.

రైటర్ నేను రాసిన ప్రయోజనం లేదు. నలుగురికి తెలియకముందే ఇంటికెల్లిపో తల్లి అని బుజ్జగించి వెనక్కి వెళ్ళిపొమ్మని నచ్చచెప్పాడు.

ఆ అమ్మాయి కంప్లైంట్ రాస్తే కాని వెళ్లను అని ఆఫీసులోనే కూర్చుంది. ఒక ఆడ పోలీసువచ్చి పోలిస్‌స్టేషన్ నుండి ఈడ్చుకోని వెళ్ళి రోడ్డుమీద నిలబెట్టింది. ఆ అమ్మాయి పోలిస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న చెట్టుకింద కూర్చుంది. మర్నాటి కల్లా ఊరందరికీ ఎమ్.ఎల్.ఏ కొడుకు ఈ అమ్మాయిపై అత్యాచారం చేసాడని

తెల్సిపోయింది.

అతికొద్దిమందికి మాత్రమే ఎదుటివాళ్ళకి అన్యాయం చేయాలని ఉంటుంది.

చాలామందికి ఎదుటివారికి అన్యాయం చేయాలని ఉండదు. అంతేకాదు చాలామందికి ఎదుటివారికి సహాయం చెయ్యాలని కూడా ఉండదు. అందుకే అమ్మాయికి సహాయం చేయడానికి ఎవ్వరూ ముందుకురాలేదు. ఆ అమ్మాయి దగ్గరకు వచ్చినవాళ్ళు ఆమెను ఇంటికి వెళ్ళిపొమ్మని చెప్పారు. స్కూల్‌వెళ్ళే పిల్లలు తల్లిదండ్రులను ఈ అమ్మాయికి ఏమైందని అడిగారు. పెద్దలు పూర్తి వివరాలు చెప్పలేదు. కాని వాళ్లు చెప్పినదానిలో ఈపిల్లకు అన్యాయం జరిగిందని అర్థమయింది.

చాలామంది పిల్లలు ఆమె దగ్గరకు వచ్చారు. చెట్టుకింద ఎందుకు కూర్చున్నావంటూ అడిగారు. ఈ ఊరి ఎమ్.ఎల్.ఏ. కొడుకు నామీదపడి చెరిచాడు.వాడు తప్పు చేశాడు. వాడికి శిక్షపడనిదే ఇక్కడ నుండి కదలను నేను అని చెప్పింది.

పిల్లలకి విషయం పూర్తిగా తెలియలేదు. కాని ఆమెకు కావాల్సిన నీరు, పాలు, పళ్ళు తమతమ ఇళ్ల నుంచి తెచ్చిఇచ్చారు. న్యూస్‌పేపర్ రిపోర్టర్లు విషయం తెలిసినా రాస్తే ఎమ్.ఎల్.ఏ. తమని ఏమి చేస్తాడో అన్న భయంతో రాయలేదు. ప్రతిరోజూ ఆమె పోలీస్ స్టేషన్‌కు వెళ్లడం, కంప్లైంట్ రాయమని అడగటం, ఒక ఆడపోలిస్ ఈమెను బయటికి తీసుకొని రావడం జరుగుతూనే ఉంది.

మూడోనాడు ఒక రెడ్ల అమ్మాయి ఈమెతోపాటు పోలీస్ స్టేషన్‌కి వెళ్లి నాపై కూడా ఎమ్.ఎల్.ఏ. కొడుకు అత్యాచారం చేశాడు అని చెప్పింది. పోలీస్ కంప్లైంట్ రాయడానికి ఒప్పుకోలేదు. బ్రాహ్మల అమ్మాయితోపాటు రెడ్ల అమ్మాయి కూడా చెట్టుకిందకు చేరింది. రెడ్ల అమ్మాయి మెడకు ఒక గట్టి ప్లాస్టిక్ తాడు కట్టుకుని కూర్చుంది. ఆ అమ్మాయి తాలూకు వాళ్లు వచ్చి ఆ అమ్మాయిని లాక్కొని వెళ్లబోయారు. ఆమె తన మెడకు ఉన్న తాడుని గట్టిగాలాగి ఉరిపోసుకుంటానని

స్పష్టంగా చెప్పింది. దాంతో వాళ్లు వెనక్కి తగ్గారు.

ఊరిలో అందరూ ఈ విషయమే మాట్లాడుకోసాగారు. ఊరిలో వేడి పుట్టింది. పట్నంలో ఉన్న ఎమ్.ఎల్.ఏకి ఈ విషయం తెలిసింది. కొడుకు చేసినపని కొత్తకాదు. ఎమ్.ఎల్.ఏ రాజకీయాల్లోకి రావడానికి కారణం ఇరవైఏళ్ల క్రిందట ఊరి నాయుడి కూతురిని చెరచడమే ఆ కేసులో నాయుడి ఎగస్పార్టీ వాళ్ల సాయంతో కేసు లేకుండా చేసుకున్నాడు. ఇతని సాహసం చూసి ప్రతిపక్షం వాళు ్ల ఇతనిని అతని కులం నాయకుడికి పోటిగా నిలబెట్టారు.

తరువాత కాంగ్రెస్ మెంబరు అయ్యాడు. పార్టీ అభ్యర్థులకు ఎస్సీల ఓట్లు గుత్తకి అమ్మి డబ్బుచేసుకుని పెద్దవాడై రాజకీయాలలో స్థిరపడ్డాడు. కాబట్టి ఎమ్.ఎల్.ఏ ఇదో తప్పుగా అనుకోలేదు. హైదరాబాద్‌లో ఉన్న కొడుకుకి పోన్‌చేసి ఊర్లో గొడవ ఉంది అది తగ్గేదాకా ఊళ్లోకి వెళ్లదని చెప్పాడు.

అది జరిగిన మూడోనాడు ఒక ఎస్సీ అమ్మాయి పోలిస్ స్టేషన్‌కు వెళ్లి ఈ ఊరి ఎమ్.ఎల్.ఏ కొడుకు తనపై కూడా అత్యాచారం చేశాడని కంప్లైంట్ తీసుకోమని అడిగింది. ఈ విషయం డిస్ట్రిక్ట్ ఎస్పీకి దాకా వెళ్లింది.

'దమ్ములేక దాక్కొన్న ఎమ్.ఎల్.ఏ. కొడుకు' టైటిల్స్‌తో టెక్ట్స్ మెసేజ్‌లు సెల్‌ఫోన్ ద్వారా ఆ ఊరి నుండి కొన్ని వెళ్లాయి. హైదరాబాద్‌లో ఒక పేపర్ వాళ్లు ఈ విషయాన్ని, ఈజిప్టులో సెల్‌ఫోన్ ద్వారా విప్లవ సందేశాలు పంపినట్లు, అంటూ ఒక న్యూస్ ఐటం రాశారు.

ఎమ్.ఎల్.ఏ. కొడుకు ఏ బార్‌కి వెళ్ళినా 'దమ్ములేని ఎమ్.ఎల్.ఏ. కొడుకు దాక్కొన్నాడు.' అన్నమాట ఎవరో ఒకరు అనడం మొదలుపెట్టారు. ఎమ్.ఎల్.ఏ కొడుకు కోపం పట్టలేక ఊరికివెళ్లి తనమీద కంప్లైంట్ ఇస్తానన్న ముగ్గురిని నరికిపారేస్తానని బారులో శపథం లాంటిది చేసి కారు ఎక్కి ఆ ఊరికి బయలుదేరాడు.

మర్నాడు ఉదయం ఊరు చేరాడు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లి అక్కడున్న ఎస్ఐతో 'ఆ ముగ్గురు ఆడగుంటలను నోరుమూసుకుని ఇళ్లకి వెళ్లమని అడుగుతాను. వెళ్లకపోతే చంపేస్తాను. మీరు ఎవ్వరు బయటకు రాకండి మాట్లాకండి.'

అని ఇన్ఫర్ఫేషన్ లాంటి బెదిరింపుతో మాట మొదలుపెట్టాడు.

"కాని సార్..." అవాక్కైన ఎసై అంటుండగా

ఎస్ఐ. కాలర్ పట్టుకుని

"నా కొడకా మరొక్క మాటంటే గుమ్మలక్ష్మిపురంకు ట్రాన్సఫర్ అయిపోతావ్" అన్నాడు, ఎమ్.ఎల్.ఏ. కొడుకు.

ఇంతలో ప్రతిరోజూ కంప్లైంట్ తీసుకోమని అడగటానికి వచ్చినట్లే ఆ ముగ్గురు అమ్మాయిలు పోలీస్‌స్టేషన్‌లోకి వచ్చారు. ఎస్ఐ. కాలర్ పట్టుకుని బెదిరిస్తున్న ఎమ్.ఎల్.ఏ. కొడుకుని చూసారు. పక్కనే ఉన్న పోలీసుల రైల్ఫ్‌లో ఉన్న కత్తిని తలొకటి తీసుకున్నారు.

"ఒరేయ్...." అంటూ అరుస్తూ ముగ్గురూ ఎమ్.ఎల్.ఏ. కొడుకువైపు దూసుకుపోయారు.

ఆ అరుపులకి గాభరాపడిన ఎస్ఐ. కాలర్ వదలకుండా పట్టుకుని దూసుకొస్తున్న అమ్మాయిల వైపు తిరిగాడు. అప్పటికే దగ్గరకు వచ్చిన అమ్మాయిలు తమ చేతిలోని కత్తితో ఎమ్.ఎల్.ఏ. కొడుకుని కసిదీరా పొడిచారు.

మళ్లీ మళ్లీ పొడిచారు.

ఇంతలో ఎమ్.ఎల్.ఏ. కొడుకుకి ఎవరివైపు కాలు విసరాలో తెలియలేదు.

ఇంతలో ఎమ్.ఎల్.ఏ. కొడుకు చేతిలో పట్టుకున్న ఎస్ఐ. కాలర్‌కి స్వాతంత్ర్యం వచ్చింది.

ఎమ్.ఎల్.ఏ. కొడుకు ముగ్గురి ఆడపిల్లల కాళ్లదగ్గర పడ్డాడు. వాళ్లు ముగ్గురు మాత్రం ఇంకా ఇంకా పొడుస్తూనే ఉన్నారు. పొడిచిపొడిచి అలసిపోయి పక్కనే కూలబడిపోయారు.

ఎమ్.ఎల్.ఏ. కొడుకు మాంసపు ముద్దలా పడివున్నాడు. పోలీస్‌స్టేషన్‌లో అతని రక్తం పారుతుంది. అమ్మాయిల రక్తం చల్లబడింది.

పోలీస్ స్టేషన్ చుట్టూ జనం పోగయ్యారు.

పిల్లలు పరుగు పరుగున వచ్చి ముగ్గురు అమ్మాయిలను కౌగిలించుకున్నారు.

దీన్ని చూస్తున్న ఊరు అవాక్కయింది.

గాలికి కదులుతున్న వందలఏళ్ల చెట్ల ఆకులు ఊరి వాళ్లకి వందల ఏళ్ల అనుభవాన్ని ఏ భాషలో చెప్పినా ఒకటేనేమో. చెట్టుకూడా ఇలానే అనుకుంది. కాబోలు ఆకులు కదలడం ఆగిపోయింది.

చెపుతున్న అతను చెప్పడం ఆపాడు.

అప్పటిదాకా మేము కూడా ఆ ఊరిలో, ఆ పోలీస్ స్టేషన్ దగ్గర గుమికూడుతున్న జనంలో ఒకరిలా ఆ దృశ్యాన్ని చూస్తూ ఉండిపోయాం.

అతను ఆపగానే రైలులో ఉన్నామని స్పృహలోకి వచ్చాం.

అతనివైపు చూశాం. అతను మాకు ఒక మనిషిలా కాక ఒక అశరీరవాణిలా అనిపించాడు. మనం చూసే ప్రపంచమంతా ఒకటికాదు. ఒక్కొక్క వ్యక్తికీ ఒక్కో ప్రపంచం ఉంటుంది.

గుడ్డివాళ్లు మనకి తెలిసిన ప్రపంచంలో ఏమీ చూడకుండా ఎలా జీవితం అంత గడిపిస్తారో, మనం కూడా మన పక్కవారి ప్రపంచాన్ని తెలుసుకోకుండా జీవితమంతా గడిపేస్తాం. ఇప్పుడే వచ్చిన కొత్త ప్రపంచపు స్పృహతో అనిపించింది నాకు.

"తరువాత ఏమైంది అండీ?" ఒంటరిగా ప్రయాణం చేస్తున్న అమ్మాయి అంది.

అతను ఇంతకుముందు చెప్పిన గొంతుతో ఆ ఊరిలో జరిగిన సంఘటనని మాకళ్ల ముందు ఆవిష్కరిస్తున్న ఇంద్రజాలికుడిలా మళ్లీ మొదలుపెట్టాడు.

ఎస్.ఐ. తేరుకుని పై అధికారులకి ఫోన్‌చేసి జరిగిన సంగతి చెప్పాడు. ఆఫీసర్లు హుటాహుటిన వచ్చారు. ఎమ్.ఎల్.ఏ. కూడా వచ్చాడు. విషయం తెలుసుకుని నిర్ఘాంతపోయాడు.

వచ్చి ఓటు అడగక పోయినా ఓటు వేసే ఊరు, తనకొడుకుని పట్టపగలు పోలీసుస్టేషనులో ఆడది పొడిచి పొడిచి చంపిందంటే ....

ఇక ఆలోచించలేకపోయాడు. కుర్చీలో కూలబడిపోయాడు.

పెద్ద పోలీసు ఆఫీసరు పారిపోకుండా అక్కడే ఉన్న అమ్మాయిలను పట్టుకుని అరెస్ట్ చెయ్యమని కిందవారిమీద అరిచాడు.

ఎమ్.ఎల్.ఏ. ఆపని వద్దన్నట్టు చెయ్యి చూపించి తనకొడుకుని వాడి కారులోకి తీసుకెళ్లమన్నాడు.

"శవాన్నా సార్?" అడిగారు ఆఫీసర్లు

"కాదు నా కొడుకుని..."

నా కొడుకుని ఎవరూ చంపలేదు కారు ఆక్సిడెంట్ అయింది. అంతే" అని నిలబడి పోలీస్ స్టేషన్‌లో ఉన్న కేలండర్ తారీఖు చూశాడు.

**మార్చి 8 తారీకు**

ఆ కాలెండర్ కాగితాన్ని చింపి నలిపి పారేశాడు. ఎమ్.ఎల్.ఏ.

"ఈరోజు మీ స్టేషన్ ఏమీ జరుగలేదు. ఎమ్.ఎల్.ఏ వెళ్లి తన కారులో కూర్చున్నాడు.

"ఎస్ స్సర్" అంటూ ఆఫీసర్లు తమకి అందిన ఆదేశాన్ని అమలు పరిచారు.

ముగ్గురమ్మాయిలను వెళ్లిపొమ్మన్నారు.

ఊరి జనాన్ని కూడా మీరెవ్వరూ ఏమీ చూడలేదు. పొండి పొండి అని పంపేశారు.

"ఆరోజు నుంచి ఆ ఊరిలో అమ్మాయిలు అర్ధరాత్రి కూడా నిర్భయంగా తిరుగుతున్నారు." అని ఆగాడు.

ఆ ఊరి దృశ్యాలను మా కళ్లముందు మేఘాలలా తేలుతున్నాయి.

"ఆ ఊరు ఎక్కడుందండీ" అప్రయత్నంగా నానోట్లోంచి మాట బయట పడింది, ఒక్కసారి ఆ ఊరు చూడాలన్న ఆతృత పెరిగిపోవడంతో.

"మీతో నన్ను కూడా ఈరైల్లో తీసుకువెళ్లండి చూపి...." మాటలు మధ్యలో ఆగిపోయాయి.

"ఏయ్ దిగుదిగు ఎన్నిసార్లు చెప్పాలి, రైలు ఎక్కద్దని" అప్పుడే వచ్చి టి.టి.ఇ. ఇతన్ని గట్టిగా కసిరాడు.

భయం భయంగా అతను లేచి నిలబడ్డాడు. ఇతనికి సహాయంగా నేను మాట్లాడదామని నోరువిప్పబోయాను, టి.టి.ఇ. నన్ను కూర్చోమని చేత్తో చేపుతూ...

"ఇతనో పిచ్చివాడండీ, ఏదో కథ చెబుతాడు ఊరు వెళ్లాలంటాడు...."

"నేను చెప్పేది కథ కాదు బ్రాహ్మణ అమ్మాయి నాచెల్లెలు నేను పిచ్చివాణ్ణి కాదు. నాకొచ్చిన మార్కులకి అమెరికాలో కార్నిగీమెలోన్ యూనివర్‌సిటీలో స్కాలర్‌షిప్‌తో సహా సీటు వచ్చింది. ఇప్పుడే ఇండియా వచ్చాను. మా ఊరు వెళ్లాలి. మా చెల్లిని కలువాలి..." ఉక్రోషంతో, ఆవేశంతో మనిషి మొత్తం కదిలిపోతూ అంటున్న అతనిని టి.టి.ఇ. రెక్క పుచ్చుకుని లాగి తలుపు దగ్గరకు తీసుకువెళ్లాడు.

"బతుకుమీద ఆశతో మనిషిని చంపేస్తున్నారు. మనిషి బతికి ఉన్న ఊరిలో అర్ధరాత్రికూడా ఆడపిల్లలు నిర్భయంగా తిరగ్గలరు" వెనక్కి వెనక్కి తిరిగి గట్టిగా అందరికీ వినపడేలా అరుస్తున్నాడు.

రాబోతున్న స్టేషన్‌కోసం రైలువేగం తగ్గింది. రైలు స్టేషన్‌లో అగింది. అతన్ని రైలులోంచి దింపేశాడు టి.టి.ఇ.

మాకెవ్వరికీ మెదడు పనిచెయ్యడం లేదు. వేగం పుంజుకొంటున్న రైలు లోంచి ఎవరో నన్ను గబుక్కున వెనక నుండి రైలు బయటికి తోసేసినట్టు అనిపించింది. రైలుకదిలింది.

"అర్ధరాత్రి ఆడపిల్లలు నిర్భయంగా తిరిగే ఊరు మీరు చూస్తే నాకూ చెప్పండి. ఆ ఊరికి నేను వెళ్లాలి. అక్కడ మా చెల్లి ఉందిట." అని అరుస్తూ రైలువెంట పరుగెడుతున్నాడు అతను.

*

**వృత్తిపరంగా, సామాజికంగా, కుటుంబపరంగా, ఎన్నో కష్టనష్టాలకుకోర్చి పల్లెటూళ్ళలో ఉపాధ్యాయులుగా, ఉపాధ్యాయినిలుగా పనిచేస్తున్న గురువులందరకి నమస్కరిస్తూ...**

# సగం కుండ

"వేగావతి స్త్రీ స్వాతంత్ర్యం కోసం పాటుపడుతున్న సంఘసేవకురాలు. సమాజసేవే ఆమె జీవితంలో వున్న ముఖ్యమైన అంశం. కాలేజీ రోజులనుండి సమాజసేవలో ఉంటూ లేజీ అన్న పదానికి దూరంగా ఉంది. ఆమె వ్యాసాలు వ్రాసింది. కథలు వ్రాసింది. కవితలు వ్రాసింది. రేడియోలో, టీవీలో ఉపన్యాసాలు ఇచ్చింది. దాదాపు రోజూ ఏదో ఒక వేదిక మీద ఉపన్యాసం ఇస్తూ వుంటుంది. పత్రికలలో, పేపర్లలో ఆమె రచనలు, ఫోటోలు తరచూ వస్తూనే వుంటాయి. స్త్రీవాదం ఆమె ఊపిరి. 'నరనరాన, అణువణువున, నా రక్తంలో కణకణాన స్త్రీవాదం నిండివున్న నిండుకుండ లాంటి స్త్రీవాదిని' అని ఆమే ఒకసారి టీవీ కార్యక్రమాలలో ప్రకటించుకుంది. తన గురించి తానే చెప్పుకుంది, ఆమె స్త్రీ స్వాతంత్రం కొరకు అడుగడుగునా శ్రమిస్తుంది. ఒక వారపత్రికలో ఆవిడ స్త్రీల కోసం ఒక శీర్షిక నడుపుతుంది. స్త్రీలకు ఎవరికి ఏ కష్టం వచ్చినా ఆమెకు వ్రాస్తే జవాబు ఇస్తుంది. ఆ శీర్షిక పేరు 'నేను– నా ఇష్టం.'

ఉదయం వరండాలో కూర్చొని నిన్న వచ్చిన ఉత్తరాలను ఒక వరుసలో చదువుతోంది. అప్పుడే పెళ్ళైన ఓ ఇరవైమూడేళ్ళ యువతి రాసిన సుదీర్ఘ ఉత్తరం. సంక్షిప్తంగా దాంట్లో ఉన్నదేమిటంటే ....

'వేగావతిగారూ, నేను మీ వీరాభిమానిని స్కూలు రోజులనుండి మీరు వ్రాస్తున్న ప్రతిదీ చదువుతున్నాను. నా శరీరం, నా బట్టలు, నా హక్కు, నా ఇష్టం అని మా నాన్నతో వాదించి, మా పాతకాలపు అమ్మను సాధించి, నాకు నచ్చిన

అన్ని రకాల బట్టలు వేసుకొని తిరిగాను. డబ్బుకోసం చదివే చదువులు చదవనని తెగేసి చెప్పాను. బి.ఏ. చేసి జెండర్ ఈక్వాలిటీ (లింగ సమానత్వం)లో యూరప్‌లో డిప్లొమా చెయ్యాలనుకున్నాను. ఖర్చు ఎంతైనా సరే నాకు ఆస్తిలో రావాల్సిన వాటాలో జమచేసుకోమని మా నాన్నకి చెప్పాను. 'ఇంటిలోని బంగారంలో, భూమిలో, సగం నాది, సగం మా అన్నది అన్నానని' అని ఆశ్చర్యపోయే అమ్మానాన్నలకి మీరు వ్రాసిన వ్యాసాలు చూపించి ఒప్పించాను. యూరప్ వెళ్ళాను. నాకిష్టమైన కోర్సు చేశాను'.

'తిరిగి ఇండియా వచ్చి ఏవేవో ఉద్యోగాలలో చేరాను. రెండు మూడు చేసిన తర్వాత నా స్వాతంత్ర్యం కోల్పోయిన భావన వచ్చింది. అప్పుడే ఒక ఎన్జీఓ మొదలుపెట్టాను. మీలానే స్త్రీ స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నాను. కాలేజీ అమ్మాయిలకు, ఆఫీస్‌లో మహిళా ఉద్యోగులకు వారి స్వాతంత్ర్యాన్ని ఎలా నిలుపుకోవాలో తెలియచెపుతున్నాను. అప్పుడే స్త్రీవాద రచయిత 'వనిత' (వంకాయల నిత్య తరుణ్) నా భావాలకు ఆకర్షితుడై నన్ను ప్రేమించి పెళ్ళిచేసుకున్నాడు. విదేశాలలో కొద్దిమంది వ్రాసుకున్నట్టు మేం కూడా పెళ్ళికి ముందు, పెళ్ళి తర్వాత ఎలాంటి నియమాలు పాటించాలో ఒక ఎగ్రిమెంటు వ్రాసుకున్నాం. అన్ని పనులలో, అన్ని విషయాలలో ఇద్దరం సరిసమానంగా మా బాధ్యతలను వ్రాసుకున్నట్లే రెండేళ్ళు నిర్వర్తించాం. గర్భం దాల్చడం ఆడదానికి మాత్రమే ప్రకృతి చేసిన అన్యాయం, శాస్త్రజ్ఞులు పరిశోధనలు చేసి మొగవారు కూడా గర్భం దాల్చే ఏర్పాటు చేయాలని వ్యాసాలు వ్రాసి, వాదించి తనకంటూ ఒక ప్రత్యేకతని తెచ్చుకున్న 'వనిత' రాను రాను మారిపోతున్నాడు'.

'వివాదాలతో విడగొట్టే వాదాల పంథా సరైంది కాదేమో, ఆలుమగల మధ్య వచ్చే సమస్యలకి పరిష్కారాలు ఇచ్చే విధానాల కోసం వెదుకుదాం అని మొదలుపెట్టాడు. కాలేజీ అమ్మాయిలని వారి హక్కులకోసం పోరాడమని రెచ్చగొట్టడం కంటే పనిమనిషి సంఘాలని పెట్టి వాళ్ళకు కొంత శిక్షణ యిచ్చి వాళ్ళ ఆదాయం పెంచే మార్గం మంచిదని అతని ఆలోచన. అతను స్త్రీ వాదాన్ని

ప్రక్కన పెట్టడమే కాకుండా రోజురోజుకీ అతను నా స్వేచ్ఛని ప్రశ్నిస్తున్నాడనిపిస్తుంది. అందుకని ముందుగానే మేలుకొని విడాకులు ఇవ్వాలని అనుకొంటున్నాను. మీ సలహా నాకు తెలిసిందే అయినా ఒక్కసారి మిమ్మల్ని అడిగి...' అని ఆపింది.

ఎంతమందిని చూడలేదు పెళ్ళి అయ్యేదాకా ప్రేమ కబుర్లు చెప్పి పెళ్ళి అయిన తర్వాత నుండి మామూలు మగాడిలా ఆంక్షలు పెట్టి ఆడదాని స్వాతంత్ర్యాన్ని అణచివేసే మగాళ్ళని. వాళ్ళకోవలోకి చెందినవాడే మరొకడు అని అనుకొంటూ ఉత్తరాలను టేబుల్‌పైన పెట్టి ...

"కమలా కాఫీ" అని గట్టిగా కేక వేసింది. కాఫీ తాగి ఈ ఉత్తరానికి జవాబివ్వాలని అనుకుంది. ఈ ఉత్తరాన్ని ప్రక్కన పెట్టింది. మరికొన్ని ఉత్తరాల చదవడం మొదలుపెట్టింది. కాఫీ రాలేదు. బిఉత్తరాల్లోంచి తల తిప్పి వంటింటివైపు చూసింది కమల, కనబడలేదు.

"కమలా ఎన్నిసార్లు చెప్పాలి నీకు, అడగ్గానే కాఫీ తెమ్మని" అరిచింది.

వంటింటి వెనక చప్టా దగ్గర గిన్నెలు తోముతున్న కమల మొగుడు రావుడు పరిగెత్తుకుంటూ వచ్చి 'కమల పనిలో వుంది' అని చెప్పాడు.

"ఏం పనిలో ఉంది?"

"మీ బెడ్‌రూంలో బట్టలు సర్దుతోంది" అన్నాడు.

"కిందకి తగలడి కాఫీ ఇవ్వమను"

పనిమనిషి కమల మొగుడు రావుడు పురుషాధిక్యతకు ప్రతీకగా కనిపిస్తాడు వేగావతికి.

కమల మీద అధికారం చెలాయిస్తాడు. తాగుతాడు, తిడతాడు, కొడతాడు. ఇది తెలుసుకొన్న కొత్తలో వేగావతి కోపంతో ఊగిపోయి వాడిని కొట్టినంత పనిచేసింది. కమలకి వాడితో విడాకులు ఇప్పిస్తానంది. కమల ససేమిరా ఒప్పుకోలేదు. కమల మీద కోపం వచ్చింది వేగావతికి. కానీ తలలో నాలుకలా

ఇంట్లో పనిచేసుకుని పోయే కమలని వదులుకోలేకపోయింది. పురుషాహంకారాన్ని సహించలేని తన ఇంట్లోనే తన పనిమనిషి భర్త వాడి పెళ్ళాం మీద అధిక్యత చూపడం తను చూస్తూ ఊరుకోలేదు. వాడికి తగిన శిక్ష వెయ్యాలి అనుకొంది. నీ మొగుడుకి కూడా మన ఇంట్లో పని యిప్పిస్తానంది వేగావతి కమలతో.

"సాన సంతోషం. అమ్మగారి మనసు వెన్న" అంది కమల ఆనందంతో.

"ఏం పనో అడగలేదేం?" అంది వేగావతి.

"ఏ పనైనా సరే అమ్మగారు" అన్నాడు ఆనందంగా రావుడు.

"అమ్మగారి దయవల్ల నాకు ఇక్కడే పని అయితే కమల రోజంతా నా కళ్ళ ముందే

ఉంటుంది. దాన్ని చూసుకుంటూ ఎంత పనైనా చేసేస్తానమ్మగారు" అన్నాడు రావుడు.

"అంట్లు తోమాలి" అన్నది వేగావతి.

"బమ్మాండంగా చేస్తాను".

"అదేటమ్మగారు? అంట్లపనికి నేనులేనా? తోటపని చెప్పండి. పై పనులు చెప్పండి" అంది నసుగుతూ కమల.

"లేదు. అంట్లే తోమాలి. అంతేకాదు బట్టలు ఉతకాలి, ఇల్లు తుడవాలి"–అన్నది వేగావతి పురుషాధిక్యతను గెలిచానన్న భావంతో.

"శా...నువ్వూరుకోవే... నానా పనులన్నీ సిటికలో సేస్తాను....నా కళ్ళ ముందు నువ్వు సిలకలా తిరుగుతూ ఉండే ..." – అన్నాడు అతనికేదో గొప్ప పదవి దొరికినట్టు.

అలా రావుడు అంట్లు తోముతూ, బట్టలుతుకుతూ, ఇల్లు తుడుస్తూ, కమల ఇంటిలోని మిగిలిన పనులు చేస్తూండగా కుదిరినప్పుడల్లా సరసాలాడుతూ హాయిగా

గడిపేస్తుంటారు.

కమల వచ్చి కాఫీ ఇచ్చింది. కాఫీ తాగుతూ వుంటే ఫోన్ వచ్చింది.

"ఇది విన్నావా?" అంది బాధతో కూడిన గాభరాతో ఫోన్ చేసిన స్నేహితురాలు కాంతి.

"ఏమిటి?"

"మంగ భర్త సుబ్బారావు నిన్న రాత్రి చనిపోయాడుట"

"ఆ! అదేం? గుండులా చక్కగా ఆరోగ్యంగా..."

"అతని ఆరోగ్యానికేం? హిమాలయాలకు కూడా వెళ్ళి వచ్చాడు క్రిందటి నెలే"

"మరి..."

"మంగ చనిపోయిందన్న బాధతో అయ్యుండాలి".

"క్యాన్సరే కాని అది పోయినప్పుడే నేననుకున్నాను. అతను ఎంతోకాలం బతకడని. కాని ఇంత హఠాత్తుగా పోతాడనుకోలేదు సుమీ)" అంది వేగావతి నవ్వుతూ.

"నువ్వెందుకలా అనుకున్నావ్?"

"ఉదయం లేచిన దగ్గర్నుంచి పడుకునే దాకా పెళ్ళాం అన్ని పనులు చేస్తూ ఉంటే హాయిగా బతికిన మొగాడు, పెళ్ళాం పోతే కాలు చేయి విరిగినట్లు విలవిలలాడిపోతారు. అది తట్టుకోలేక కాబోలు, పోయాడు..."

"ఛా... అలా కాదే. పెళ్ళికి ముందు నుండీ అదంటే అతనికి ఎంతో ఇది. దానితోనే అతని బతుకు అన్నట్టు ముప్పై ఏళ్ళు సంసారం చేశాడు. ముభావంగా ఉండే అతను రెండేళ్ళ కిందట మీ ఆయన పోయినప్పుడు 'అదృష్టవంతుడు, ఆమెకంటే ముందే పోయాడు' అన్నాడు."

"భార్య కంటే ముందు పోవడంలో అదృష్టం ఏమున్నది?"

"భార్యను ప్రేమించినవాడికి, ముప్పై ఏళ్ళు కలిసి బ్రతికినవాడికి ఆలోటు భరించడం కష్టమే కదే!"

"నేను నమ్మను".

"మా ఆయనలా తన డబ్బు గొడవలోనో, మీ ఆయనలా రీసెర్చిలోనో తనది అని వుండే వాడు కాదు మంగ భర్త. నీ కెన్నిసార్లు చెప్పినా అర్థంకాదు.... అతను దాన్ని ఎంతలా ప్రేమించాడో..."

"ఒక్కసారైనా దాన్ని ప్రేమించానని చెప్పాడా?"

"పెదవి విప్పి చెప్పకపోయినా దాన్ని మొదటిచూపు నుంచి చివరిచూపు దాకా గుండెల్లో దాచుకున్నాడు..."

"దానికెప్పుడైనా స్వతంత్రంగా మాట్లాడే అవకాశం ఇచ్చాడా?" అంది వేగావతి అలా చెప్పుకుపోతున్న కాంతి మాటలకి అడ్డువచ్చి.

"నువ్వలా అడుగుతావని నాకు తెలుసు. కానీ, అది చీకూ చింతా లేకుండా హాయిగా బ్రతికింది. అనవసరమైన స్ట్రెస్సు గిస్సు లేకుండా వున్నన్నాళ్ళు ఆరోగ్యంగా బ్రతికింది. దానికి నీలా నాలా సుగరు, బీపీ లేవు. ఎలా వచ్చిందో కానీ దానికి కేన్సరు వచ్చింది. దానికి కేన్సరని తెలిసిన నాటినుండి పోయేదాకా పసిపిల్లని చూసుకున్నట్టు చూసుకున్నాడు –ఇప్పుడివన్నీ ఎందుకు? దాని పిల్లలు రామ, రత్న ఎంతో బాధలో వుంటారు. మనం వాళ్ళ పక్కన ఉండాలి. నేను, మా ఆయన వెంటనే వస్తున్నాం. మనం కలిసి వెళ్దాం మంగా వాళ్ళింటికి" ఫోన్ పెట్టేసింది కాంతి.

తనకి డయాబెటిస్ అని పంచదార లేకుండా ఏళ్ళ తరబడి తాగిన కాఫీలోని చేదంతా ఒక్కసారి నోట్లోకి వచ్చినట్టు అనిపించింది వేగావతికి. ఆ చేదు ఆమెను గతంలోకి తీసుకెళ్ళింది.

కాంతి, మంగ–వేగావతికి చిన్నప్పటి స్నేహితురాళ్ళు. చదువులు, పెళ్ళిళు ళ్ళ అయి సంసారంలో స్థిరపడినా చిన్నప్పటి లాగే స్నేహితురాళ్ళుగా ఉంటున్నారు పట్టణంలో. వేగావతి సీతానగరం అగ్రహారంలో పుట్టింది. తల్లిదండ్రులు పెట్టిన పేరు వేదవతి. పల్లెటూళ్ళో స్కూల్లో అన్ని తరగతులూ చక్కగా చదివింది. ప్రతిక్లాస్‌లో ఫస్ట్ వచ్చేది.

కనబడిన ప్రతి పుస్తకం విడిచిపెట్టకుండా చదివేది. స్త్రీవాద రచనలవైపు ఆకర్షించబడింది. తరతరాల వారసత్వంలో వచ్చిందో, తాను చదివిన పుస్తకాల్లోంచి వచ్చిందో ఏమో కానీ వేదవతికి ఆలోచనలన్నిటిలో తనకి తాను మాత్రమే ముఖ్యం. పెద్ద మనిషి అయ్యేదాకా తమ పల్లెటూరిలో తాను ఎక్కడికి వెళ్ళినా అడ్డుచెప్పని అమ్మానాన్న 'ఆడపిల్లవి అలా తిరగకూడదు' అనడంతో వేదవతి ఆలోచనలు ఒక్కసారిగా ఎదురుతిరగడం మొదలుపెట్టాయి.

తండ్రి చెప్పే ప్రతిమాటా అంక్షగా తోచేది. పురుషాధిక్యతకి ప్రతీకగా అనిపించేది. తల్లి చెప్పే ప్రతి మాట పితృస్వామ్యంలో అణిగివున్న ఆడదాని మాటలా తోచేది. అగ్రహారంలో పుట్టినందుకేమో అన్నట్టు ఆగ్రహం వచ్చింది. వయసు పెరుగుతున్న కొద్దీ, అన్నింటి మీదా ఆగ్రహం పెరిగింది. పద్దెనిమిదేళు ళ్ళ రాగానే మొట్టమొదట ఛాందసాన్ని ఎదిరించడానికి చేసినపని తన పేరు మార్చుకోవడం. వేదవతి పేరు ఛాందసాన్ని సూచిస్తోందని, తన వూరి దగ్గరలో వున్న వేగావతి నది పేరుని అమ్మా నాన్నలతో దెబ్బలాడి తన పేరుగా మార్చుకుంది.

అప్పటి నుండి ఇప్పటిదాకా ప్రతిదాన్నీ ఎదిరిస్తూనే బ్రతికింది. కాలంగడిచేకొద్దివయసులో వున్నపుడు ఆడామగకి మధ్య ప్రేమ సహజం అనుకుంది కానీ, కాలంగడుసున్నకొద్ది అది ఒట్టి శారీరక ఆకర్షణ అని కొట్టి పారేసేది. ఆడది మగాడికి ఏ విషయంలోనూ తక్కువ కాదు. పైగా చాలా విషయాల్లో ఎక్కువే అనే సిద్ధాంతాన్ని నమ్ముతుంది. పదేపదే ప్రచారం కూడా చేస్తుంది. 'తన స్నేహితురాలైన మంగ అమాయకురాలని, పాతకాలం మనిషని, దాని మొగుడు సుబ్బారావు పురుషాధిక్యతకి లొంగిపోయి గుడ్డిగా అతడు తనను

ప్రేమిస్తున్నాడు అని నమ్మి సంసారం చేస్తున్నదనీ' పదేపదే వాదించేది.

'ఆయన ఏం చేసినా నా మంచి కోసమే చేస్తారే, నన్ను చీమ కుట్టినా భరించలేరు. విలవిలలాడిపోతారు. నీకేం తెలుసు...!' అనేది మంగ సగం సిగ్గు, సగం ఆనందం నిండిన గొంతుతో.

'అవును, ఉదయం లేచిన దగ్గర నుండి ప్రతిదీ అందిస్తూ, అన్ని పనులు చేసిపెడుతూ అణిగిమణిగి ఉండేదాన్ని బుట్టలో వేసుకునేందుకు ఏవైనా చేస్తాడు మగవాడు...' అని తను అన్నమాట ఇంకా గుర్తుంది.

'నేను చెయ్యగలిగింది నేను చేస్తాను. ఆయన చెయ్యగలిగింది ఆయన చేస్తారు' మంగ.

'కాని ఇంటిపని దగ్గరికి వచ్చేసరికి నువ్వే చెయ్యాలి. నువ్వే ముందుండాలి. నువ్వు స్కూల్లో ఉద్యోగం చెయ్యాలి. డబ్బు సంపాదించాలి. అతను చెప్పిన తీరులో ఖర్చుపెట్టాలి. అక్కడనుంచి అంతా అతని ఇష్టమే...'

'అందరి భార్యాభర్తల మధ్య సంబంధాలని పడికట్టు పదాలతో, రంగు కళ్ళద్దాలతో చూడొద్దే' గతం ఒక్కసారిగా దూసుకొచ్చింది.

.....

కాంతి, ఆమె భర్త వచ్చి వేగావతిని కారు లో తీసుకెళ్ళారు. మంగ చనిపోయిన వెంటనే మంగ మొగుడు చనిపోవడం వేగావతి ఆలోచనలలో కొత్త తలుపు తెరిచింది. మంగ సంసారం, మంగ మాటలు పదేపదే గుర్తుకొస్తున్నాయి. పల్లెటూళ్ళో హైస్కూల్ చదువు పూర్తికాగానే, దగ్గరలో ఉన్న టౌన్‌లో కాలేజీ చదువుకి తాము ముగ్గురూ రోజూ బస్సులో కలిసి వచ్చేవారు. దారంతా కబుర్లు చెప్పుకునేవారు. మంగ చిన్నప్పటినుండి నెమ్మదస్తురాలు. వేగావతికి పూర్తిగా భిన్నం. మంగకి వాదనలు, తగువులు, గొడవలు, అసలు పడేవికావు. ఏదైనా వాదించడం మొదలుపెడితే 'నీ యిష్టం నీది' అని ఒక్క ముక్కలో వాదనలని ఆపేసేది. ఏ పనికైనా 'మా నాన్నగారితో చెప్పాలే'– అనేది. 'నీ స్వాతంత్ర్యాన్ని

మీ నాన్న అణచేస్తున్నాడే' – అని వివరించబోతే, 'నువ్వేన్నైనా చెప్పు, నాన్న నా మంచికోసమే ఏదైనా అంటారు. చేస్తారు. చిన్నప్పుడు ఎలా ముద్దు చేసారో, ఇప్పుడు కూడా అలానే తీర్చి దిద్దాలని అనుకుంటారు.' అనేది. 'నిన్ను మార్చడం నా వల్లకాదే' అంటే నవ్వేసేది. మనస్తత్వాలు ఎలా ఉన్నా, వాళ్ళ స్నేహం వాళ్ళ పెళ్ళిళ్ళు అయిన తర్వాత కూడా కొనసాగింది.

పెళ్ళైన కొత్తలో మంగ సిగ్గు పడుతూ 'మా ఆయన్ని అడగాలి' అంటూ వుంటే,

'మరీ అంత అణిగిమణిగి ఉండక్కర్లేదే' అంటే.

'మొగుడులాంటి భార్య, భార్యలాంటి మొగుడు హాయిగా బతకడానికి బాగుండదే' అనేది.

ఏళ్ళు గడిచాయి. పిల్లలు పుట్టారు. వాళ్ళ పెళ్ళిళ్ళు అయ్యాయి. సంసారాన్ని ఆస్వాదిస్తూ ఆనందించడంలో తలమునకలవుతున్న మంగని చూసి 'ఇలా ఎలా ఉండగలవే' అని అడిగితే 'సంగీతానికి మనని మనం ఇచ్చుకుంటేనే ఆ సంగీతం ఇచ్చే ఆనందం ఎలాంటిదో, సంసారం కూడా అంతేనే'–అని చిన్నపిల్లలకి పాఠాలు చెప్పినట్టు చెప్పింది. "నీకు జీవితంలో ఇల్లు, పిల్లలు, మొగుడు తప్ప ఇంకేమీ అక్కర్లేదే" అంటే 'అమ్మలాంటి ఇల్లు, ఆప్యాయాన్ని పంచుకునే పిల్లలు, ప్రేమించే మొగుడు ఉన్న నాకు ఇంకేం కావాలే?' అని ఎదురు ప్రశ్న వేసింది.

ఇదిలా ఎలా మాట్లాడగలుగుతోందోనని అని కాంతితో అంటే –

'మంగ మొగుడిలా ప్రేమించే భర్త వస్తే నేనూ అలానే అంటాను' అనేది కాంతి.

'ఒక మొగాడు అంతగా ఒక ఆడదాన్ని ప్రేమిస్తాడా' – అని పదేపదే ప్రశ్నించుకుంది. రకరకాల సమాధానాలు తోచాయి. తరచి తరచి ఆలోచించడం మొదలుపెట్టింది. చనిపోయిన మంగ మాటలు, అట్టే మాట్లాడని మంగ మొగుడి

చూపులు, చేతలు తనకి తెలియని కొత్తభాష అన్న స్పృహ కలిగింది – అందులోని అక్షరాలూ, గుణింతాలూ బోధపడుతున్నాయి.

సృష్టిలో ఆడ, మగ వేర్వేరు జాతులు కావని, ఒకే జాతిలోని అర్ధ భాగాలని స్ఫురించింది. స్త్రీ పురుషుల ఐక్యంలో సంపూర్ణత్వం, ఆ సంపూర్ణత్వంలో సమస్థితి అర్థమయ్యింది. తనలోని అహంకార మూలాలు తనకి కనిపించాయి. మంగ, మంగ భర్త మానసికంగా ఎంతో ఎత్తులో కనిపించారు. తనకి తెలిసిన ఎన్నో కుటుంబాలలో అటువంటి ఎత్తులు ఎక్కడానికి ఆతృత పడుతున్న మరెందరో స్త్రీ పురుషులు కనిపించారు. వీరి మధ్యలో తాను, అందరిలోనూ చైతన్యం. చుట్టూ అంతా చైతన్యం. ఈ కోణం నుంచి సమాజం ఒక ప్రవాహంలా ఉంది. మనుషులు వస్తూ ఉంటారు. పోతూ ఉంటారు. ఆచార వ్యవహారాలు మారుతూ ఉంటాయి. నిన్న మంచిది అన్నది నేడు మంచిది కాకపోవచ్చు. రేపటి మంచిని మనిషి ఈనాడే అంచనా వేయలేకపోవచ్చు. వేలవేల సంవత్సరాల మానవ చరిత్రలో ఒక తరం అతి చిన్నదని తోచింది.

వేగవతి, కాంతి–మంగ ఇల్లు చేరారు. మంగ పిల్లల్ని ఓదార్చారు. రోజంతా అక్కడే ఉండి జరగవలసిన పనులని జరిపించారు.

ఇంటికి వచ్చి మంగ ఫోటో చూస్తూ మౌనంగా కూర్చొంది, వేగవతి.

.....

మర్నాడు ఉదయాన్నే వేగావతి రోజూ లాగే లేచి ఇంట్లో పైన ఉన్న బెడ్‌రూమ్ నుండి దిగి కిందికి వచ్చింది. ఆమె వచ్చిన అలికిడి విని కమల కాఫీ కలపడానికి వంటింట్లోకి వెళ్ళబోతే వేగావతి కమలని ఆపి –

'కమలా... కాఫీపొడి, పాలు, పంచదార ఎక్కడ ఉన్నాయో, చూపించు చాలంది'

ఆశ్చర్యపోతున్న కమల వేగావతి వెనుక వంటింట్లోకి వెళ్ళి ఎక్కడెక్కడ ఏమేవి

ఉంటాయో చూపించింది.

కాఫీ కలుపుకొని తీసుకొచ్చి వరండాలో కూర్చుని నిన్నటి ఉత్తరాలకి జవాబులివ్వడం మొదలుపెట్టింది వేగావతి. తన భర్త 'వనిత'లో మార్పు భరించలేక విడాకులిద్దామనుకుంటున్న భార్య ఉత్తరానికి జవాబు రాసింది.

'మీ పరిస్థితి నాకర్థమయింది. ప్రస్తుతం మీరున్న ఆలోచనా ధోరణిలో మీకు విడాకులు తీసుకోవడమన్న ఆలోచన సహజమే! మీరు ఈ దాంపత్య జీవితాన్ని మరో కోణంలో చూడండి. జీవితం నిండుకుండ అనుకుంటే, సగం కుండ, కుండకాదు, మీ శ్రేయోభిలాషిణి – వేదవతి.

*

**వృత్తిపరంగా, సామాజికంగా, కుటుంబపరంగా, ఎన్నో కష్టనష్టాలకుకొర్చి పల్లెటూళ్ళలో ఉపాధ్యాయులుగా, ఉపాధ్యాయినిలుగా పనిచేస్తున్న గురువులందరకి నమస్కరిస్తూ...**

# బొబ్బిలి 1876

**శు**క్రవారం 22వ తారీఖు, డిసెంబరు 1876. నెలగంటు పెట్టి కొద్ది రోజులు అయింది. వేణుగోపాలాచార్యులు బొబ్బిలి పురవీధులలో గుర్రపు బండిలో ప్రయాణిస్తున్నారు. నులివెచ్చని సూర్యకిరణాలు చెంపలను తాకుతుండగా, పిల్లతెమ్మెరలు తాము తీసుకువచ్చిన పూల పరిమళాలను నాసికాపుటాలకి అందించి పోతున్నాయి.

వేణుగోపాలాచార్యులు ఇరవై ఐదేళ్ళ యువకుడు. మిస మిసలాడుతున్న వయసు. కొలనుపై పడ్డ ఉదయభానుడి కిరణాలు మెరిసి విరజిమ్మే కాంతిలో స్నానించాడా అన్నట్లనిపించే మేని ఛాయ. తగిన వ్యాయామం వల్ల రాణింపు పొందిన శరీరం, మెరుపుల కాంతిలో ముంచి తియ్యబడ్డాయా అన్నటువంటి కళ్ళు, విశాలమైన ఫాలభాగం, పాశ్చాత్య పద్ధతిలో దువ్వబడ్డ జుత్తు 'ఉన్నతాధికారి సుమా!' అనిపించే వేషధారణ.

***

పాలకొండలో పుట్టారు వేణుగోపాలాచార్యులు. చెన్నపురి వెళ్ళి అక్కడ పట్టభద్రుడై, లండన్లో బారెట్లా పూర్తి చేసారు. లండన్ ప్రముఖ న్యాయవాది సర్ కేస్ వెంట అమెరికా, యూరోప్‌లోని వివిధ దేశాలు వ్యాజములపై తిరిగి అతి చిన్న వయసులోనే విశేషమైన అనుభవాలను, పరిజ్ఞానాన్ని సంపాదించారు. వారు ప్రస్తుతం నిజాంవారి వ్యాజ్య వ్యవహారంపై స్వదేశానికి వచ్చారు. హైదరాబాద్‌లో ఆ పని పూర్తి చేసుకుని, తిరిగి లండన్ వెళ్ళే ముందు బంధువులను చూడాలనిపించి రెండు రోజుల క్రితం బొబ్బిలి వచ్చారు.

"మీ అమ్మ పెళ్ళిలో జరిగిన గొడవల వలన మీ బామ్మగారికి, మీ నాన్నగారికి మేమంటే గిట్టక మీ అమ్మని, మిమ్మల్ని పంపకపోయినా మమ్మల్ని చూడడానికి వచ్చావా నాయనా, మీ అమ్మని చూసినట్లే వుందిరా" అని కన్నీళ్ళు పెట్టుకున్న అమ్మమ్మ ఇల్లు కదలనివ్వలేదు వేణుగోపాలాచార్యులని.

కచేరి సావిట్లో ఏర్పర్చిన కుర్చీల్లో పెద్దలంతా కూర్చుని ఉన్నారు. వేణుగోపాలాచార్యులు అందరికీ నమస్కారం చేశారు. పెద్ద మేనమామ అక్కడున్న ఒక్కొక్కర్ని పరిచయం చేశారు. కుశల ప్రశ్నలైన తరవాత, రాణీవారు రేపు ఉదయం కొత్త కోటలో వారితో సమావేశానికి మిమ్మల్ని ఆహ్వానిస్తున్నారు. దయజేయ ప్రార్థన, అని వచ్చిన పెద్దలు చెప్పారు.

ఈ హఠాత్పరిణామానికి ఆశ్చర్యపోయారు వేణుగోపాలాచార్యులు. ఆయన ఊరికి వచ్చినట్లు కోటలోని వారికి తెలియడంలో ఆశ్చర్యం లేదు. ఎందుకంటే నాటికి బొబ్బిలి జనాభా సుమారు పదమూడు వేలు. వేణుగోపాలాచార్యుల మేనమామలు వేదాంత, వైద్య విషయాలలో ఊరిలో అందరికీ తలమానికం. అందుచేత 'ఎందుకు?' 'రాను', 'కుదరదు' అనడానికి వీలులేదు. దేవిడీ నుండి రమ్మని కబురొచ్చిందంటే వెళ్ళవలసిందే. తాను లెక్కచెయ్యకపోయినా తన మేనమామల వలన తప్పదు. ఏదో వ్యాజ్య సంబంధమైన విషయం అయ్యింటుంది. ఒకవైపు నైజాం వ్యవహారాల్లో తలదూర్చి, మరోవైపు జమీందార్ల విషయాలలో కలగజేసుకుంటే ఏమవుతుందో? ఇంటికి వచ్చి ఆహ్వానిస్తున్న వ్యక్తుల్ని ఇంకోలా పంపలేరు కదా. 'సరే' అని నిన్న సాయంత్రం వేణుగోపాలాచార్యులు ఆ ఆహ్వానానికి సమ్మతి తెలిపారు.

***

గుర్రపు బండి ఆగిన కుదుపుకి వేణుగోపాలాచార్యులు ఆలోచనలలోంచి తేరుకున్నారు.

"బాబు, ఇదే బొబ్బిలి కొత్త కోట" అని రౌతు లచ్చన్న అన్నాడు. అక్కడ దేవిడీ ముందున్న సేవకులు బండి ద్వారం తెరిచి వినయంగా నిలబడ్డారు.

"రాణీ చెల్లాయమ్మగారి మందిరానికి వెళ్ళాలి కదా, ఇక్కడే ఆపేశావేం?" అన్నారు వేణుగోపాలాచార్యులు. రౌతు లచ్చన్న సమాధానం ఇచ్చే లోపలే –

"శ్రీ వేణుగోపాలాచార్యుల వారికి వందనములు, మేము బొబ్బిలి ఆస్థానం దివాను పదవిలో వుండి రాణీ లక్ష్మీ చెల్లాయమ్మ బహదూర్ వారి సేవ చేసుకుంటున్నవారము" అని ఆరడుగుల పోతపోసిన పంచలోహ విగ్రహం వంటి దేహంతో, పట్టు వస్త్రాలంకృతుడై ఎత్తయిన తలపాగాతో, వజ్రం వంటి మెరుపున్న చూపుతో, పండు మీసాలతో, దండిగా కండపుష్టి కలిగిన బలమైన బాహువులని ఎత్తి అరచేతులని దగ్గరికి చేర్చి గౌరవప్రదమైన రీతిలో నమస్కరిస్తూ ఎదురుగా నిలుచున్నారు దివాను రాజా ఇనుగంటి సీతారామస్వామి. వేణుగోపాలాచార్యులు ప్రతి నమస్కారం చేశారు.

పరివారంలోని యువతులు వేణుగోపాలాచార్యులపై పూలు జల్లారు. సమావేశానికని రప్పించి ఈ పూలు జల్లడమేమిటి అని కొంత ఆశ్చర్యం అనిపించింది. కించిత్తు ఆలోచనలో కూడా పడ్డారు వేణుగోపాలాచార్యులు. సరే ఎందుకు పిలిపించారో? ఏమంటారో? ఏం వినాలో? దీనంతటి పర్యవసాన-మేమిటో? అంతా ఆయోమయంగా ఉంది వేణుగోపాలాచార్యుల వారికి. అదే సమయంలో ఖాసా అప్పారావు గోడమీద ఉన్న గడియారం వైపు తీక్షణంగా చూస్తున్నాడు. ఆ గడియారం ప్రస్తుతం రాణీగా వున్న లక్ష్మీ చెల్లాయమ్మగారి భర్త సీతారామకృష్ణ రాయడప్ప రంగారావు బహదూర్ వారికి 'ఏజెంట్ టు ద గవర్నర్' అయిన రీడ్ దొరవారు బహుమానంగా ఇచ్చినది. దాని ప్రకారమే ఊరంతటికీ వినబడేటట్లు గంటలు కొడతారు. సరిగ్గా పది అయింది. ఖాసా అప్పారావు పది గంటలు కొడుతున్నాడు. కదులుతున్న కాలాన్ని చూడ్డానికి ఆగినట్లు ఎవ్వరూ కదలలేదు. గంటలు కొట్టడం పూర్తయింది.

"దయజేయండి" అంటూ దివాను వేణుగోపాలాచార్యుల్ని దేవిడీలోంచి లోనికి తీసుకెళ్ళారు.

"దీనినే కొత్త కోట అంటారు. 1872లో, అంటే నాలుగేళ్ళ క్రిందట, మహారాణివారే దీనిని కట్టించారు. దాన ధర్మాలతో, ప్రజారంజకంగా పాలిస్తున్నారు. ఈ సంవత్సరం బ్రిటీష్ ప్రభుత్వంవారు వీరిని 'రాణీ'గా గుర్తించారు. బొబ్బిలి సంస్థానం 227 చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో ఉంది. 152 గ్రామాలు, 52 అగ్రహారాలు... " అంటూ వివరాలు చెప్తున్నారు. ఈ సమావేశానికి గల ముఖ్య

ఉద్దేశమేమిటి అన్న ఆలోచనలోనే వున్నారు వేణుగోపాలాచార్యులు.

***

"అయ్యా, ఇదే లక్ష్మీ చెల్లాయమ్మగారి ఆస్థాన కార్యాలయం. ఇటువైపు తిరిగితే వున్నది ప్రత్యేకాహ్వానితులకై కేటాయించిన సభా మందిరం" అన్న దివానుగారి మాటలతో ఆలోచనలలో నుండి బయటపడి పరిసరాలను పరికించారు వేణుగోపాలాచార్యులు. విశాలమైన వసారా, ఎత్తయిన స్తంభాలు, చుట్టూ చిన్న చిన్న పూలమొక్కలు. మంచి పోషణ వలన కాబోలు చక్కగా పూశాయి తెల్లని నందివర్ధనం పూలు. అప్పుడే తెరిచిన చిన్న పిల్లల కళ్ళలా ఉన్నాయి. దేవకాంచనం పువ్వులు, పొగడలు సిగ్గుతో సోలినట్లున్నాయి. అంగారు అదిమిన సుందరీమణుల సునయనాలపై నుండి దృష్టి తమవైపుకు తిప్పుకునే నుదిటిపై సింధూరంలా ఎర్రగా మందారాలు. సాయంత్రపు పడమర ఆకాశం ముక్క కోసి తీసుకొచ్చి తివాచీగా పరిచినట్లున్నాయి కనకాంబరం పొదలు.

విశాలమైన భవంతి. ప్రతి ద్వారం వద్ద పరిచారికలు. గంధ, చందన పరిమళాలు ఆ పరిసరాలను గుబాళిస్తున్నాయి. ప్రపంచంలోకెల్లా చెప్పుకోదగ్గ లండన్‌లోని బకింగ్‌హామ్ పాలెస్ కన్నా, బొబ్బిలి కోటలోని 'పచ్చదనం' వేణుగోపాలాచార్యులకి ముచ్చట గొలిపింది. ఎంతైనా రాజవంశీయులు! ఈ కులీనుల కళా దృష్టి, విలాసం, సంపదని అనుభవించే తీరు పాశ్చాత్యులకి ఎన్ని వందల ఏళ్ళయినా అబ్బుతుందా అనిపించింది.

దివాన్‌గారు వేణుగోపాలాచార్యులను ఒక పెద్ద విశాలమైన సభామందిరం లోకి తీసుకువెళ్ళి సుఖాశీనులను చేశారు. ఇంతలో పురప్రముఖులు, ఆస్థాన ఆంగ్ల అధ్యాపకులైన మిస్టర్ రస్సెల్ తదితరులు వచ్చి ఆశీనులయ్యారు, పలకరింపు లయ్యాయి. పరిచారికలు పెద్ద పళ్ళారంలో రకరకాల వెండి కుప్పెలలో ఏమేమో తెచ్చి ఎదురుగా ఉన్న మేజాపైన పెట్టారు.

"అయ్యా! మీరు పాశ్చాత్య పద్ధతిలో ఏదైనా తీసుకున్న ఎడల సమావేశానికి సిద్ధం అవ్వచ్చు" అన్నారు దివాన్.

ఆ పళ్ళారాల వైపు చూసారు వేణుగోపాలాచార్యులు. వేడిపాలు, మూడు

రకాల కాఫీ పానీయాలు, టీ పానీయము, బెల్లపు పొడి, అంతటా లభ్యం కాని ఖరీదైన చక్కెర, వాటి పక్కనే చైనా కుప్పెలు ఉన్నాయి.

"కొద్దిగా టీ మాత్రం చాలు" అన్నారు వేణుగోపాలాచార్యులు.

ఒక పరిచారిక వెనువెంటనే టీ తయారుచేయగా, మరో పరిచారిక బహు వినయమైన భంగిమలో చైనా కుప్పెలో అందించింది.

వేణుగోపాలాచార్యులకు ఎదురుగా కొద్ది దూరంలో పది పదిహేను అడుగుల పొడవున్న అడ్డు తెర వుంది. చెక్కపై సన్నజాజి తీగెల్ని చెక్కిన అందమైన అడ్డు తెర అది. అది చందనంతో చేసినదని, పరిసరాల్లో పరిమళిస్తున్న చందనపు వాసన తెలుపుతున్నది. తెర వెనుక కలకలం మొదలయ్యింది.

"మహారాణి లక్ష్మీ చెల్లాయమ్మ బహదూర్ వారు విచ్చేస్తున్నారహో!" అన్న స్త్రీ కంఠ సముదాయంతో వాతావరణం ఒక్కసారిగా మారుమ్రోగింది.

వేణుగోపాలాచార్యులవారు లేచి నిలబడాలో, కదలకుండా కూర్చోవాలో తెలియని స్థితిలో వుండగా దివాన్ గారు అందించిన చెయ్యిని పట్టుకుని లేచి నిలబడ్డారు. చందనపు తెర వెనుక సద్దు మణిగింది. దివాన్‌గారు పరిచయ వాక్యాలు పలికారు.

"శ్రీ వేణుగోపాలాచార్యుల వారికి వందనములు" తంత్రులు మీటగా వచ్చిన ఓ వాయిద్య విశేషం నుండి వెలువడ్డ స్వరాలు వీనులవిందుగా ఉన్నాయి.

"రాణి లక్ష్మీ చెల్లాయమ్మ బహదూర్ వారికి వందనములు" అన్నారు వేణుగోపాలాచార్యులు తేరుకొని.

"అతి తక్కువ వ్యవధిలో మా ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసినందుకు కృతజ్ఞతలు" అన్నారు రాణి.

ఆ తెర చిన్న చిన్న సందులలోంచి ఆమె కనిపించ కూడదన్నట్లు దానిపై నేత వస్త్రం అటువైపు నుండి కప్పినట్లు తోస్తుంది. ఆమె గొంతు ఆనంద, కుతూహల సమ్మేళన రాగంలా మెల్లమెల్లగా మొదలయ్యింది. పిదప గంభీర అధికార స్వరంతో

మేళవించినట్లు అనిపించింది వేణుగోపాలా చార్యులుకి. "మీరు పాలకొండ వాసులని, లండన్‌లో బారిట్లా పూర్తి చేసారని, ప్రముఖ ఆంగ్ల న్యాయవాది సర్ కేన్‌తో పనిచేస్తున్నారని విని చాలా ఆనందించాం. మీ ప్రతిభకు మేమెంతో గర్వపడుతున్నాం" అని ఆమె అన్నారు.

"మీ అభిమానానికి కృతజ్ఞతలు" అన్నారు వేణుగోపాలాచార్యులు.

"బొబ్బిలి సంస్థానంలో విద్య, వైజ్ఞానికాభివృద్ధికై ఉన్నత విద్యావంతులు, విశేష ప్రపంచానుభవజ్ఞులు అయిన మీ సలహాలని పొందడం ఈ సమావేశం ఏర్పాటు చెయ్యడంలో ముఖ్యోద్దేశం. బొబ్బిలి సంస్థానంలో దేనికీ లోటు లేకపోయినా, వ్యవసాయ వాణిజ్య రంగాల్లో అభివృద్ధి తృప్తికరంగా ఉన్నా, విద్య, వైద్య, విజ్ఞాన రంగాల్లో ప్రపంచంలోని అభివృద్ధిని మీ ద్వారా తెలుసుకోవాలని కోరుతున్నాం. వీలైతే బొబ్బిలి విద్యా వ్యవస్థని పటిష్టం చేసి ప్రపంచ మేధావి వర్గంతో పోటీ పడగల విద్యావంతుల్ని తీర్చిదిద్దాలని ఆకాంక్షిస్తున్నాం. ఇది మా ఆకాంక్షే కాదు. శ్రీశ్రీశ్రీ మహారాజశ్రీ సీతారామకృష్ణ రాయడప్ప రంగారావు బహదూర్..." గొంతు గద్గదమైపోయింది. తారాస్థాయికి చేరబోతున్న ఒక కమ్మని రాగప్రవాహం జీరపోయి ఆగిపోయింది.

"స్వర్గస్థులైన... మా... మహారాజా... వారు" నీటితో నిండా నిండిన చేదతో, లోతైన నూతిలో నుండి నీళ్ళు తోడుతున్నప్పుడు తుళ్ళిపడుతున్నట్లు తొణికిసలాడుతున్న కంఠంతో భక్తిప్రపత్తులు, వాత్సల్యాభిమానాలు ఒకదానితో ఒకటి పోటీ పడుతున్న రీతిలో దివాన్‌వారు చెప్పడం మొదలుపెట్టారు. "గొప్ప ఆశయాలతో సదుద్దేశాలతో బొబ్బిలి సంస్థాన పరిపాలన ప్రారంభించారు. అనతికాలంలోనే, జనవరి 11 తారీఖు 1857న బొబ్బిలి, విజయనగరాల మధ్య ఒక చక్కనైన ఒడంబడిక ఏర్పడింది" అని ఆగి, "బొబ్బిలి యుద్ధం ఓ దుర్దినం. వందేళ్ళ పిదప దానికి తగిన ముగింపు ఏర్పాటు చేశారు మా మహారాజా వారు" అని మౌనంగా ఆగిపోయారు.

"అవును... బొబ్బిలి జమీందారి చరిత్రలో ఆ యుద్ధం ఒక దుర్దినం" అన్నారు వేణుగోపాలాచార్యులు దివానుతో ఏకీభవిస్తూ. నిశ్శబ్దం ఆవరించింది.

బొబ్బిలి సంస్థానంపై లండన్‌లో తాను చదివిన పుస్తకాలలోని బొబ్బిలి యుద్ధం వివరాలను గుర్తుకు తెచ్చుకున్నారు వేణుగోపాలాచార్యులు.

***

గురువారం, 24 తారీఖు, జనవరి 1757 సూర్యోదయ సమయాన బొబ్బిలి కోట ముట్టడి మొదలైంది. ఆ ముట్టడిలో కేవలం రెండు వందల ఏభైమంది సైనికులు మాత్రమే వున్న బొబ్బిలి జమీందారు గోపాలకృష్ణ రంగారావు బహదూర్ అతి పరాక్రమంతో మర ఫిరంగులతో ఉన్న శత్రువులను ఎదుర్కొన్నారు. ఘోరమైన పోరాటం జరిగింది. ఓడిపోతామని తెలిసి, చనిపోవడం తప్పదని తెలుసుకున్నవారై తమ ఆడవారు, పిల్లలు శత్రుసేన బారిన పడరాదని ఆలోచించి, వారిని చంపించమని ఆజ్ఞాపించారు. పారిపోతున్న వారిని, పసిపిల్లలని కూడా విడువలేదు. తామూ ఆత్మహత్య చేసుకున్నారు. జమీందారు మాట వినకుండా వారి కుమారుడు పసివాడైన వెంకట రంగారావుని రక్షించి, స్మశానంగా మారిన కోట నుంచి దాటించేందుకు ప్రయత్నించాడు ఒక సేవకుడు. కానీ పిల్లాడితో సహా దొరికిపోయి బుస్సీ వద్దకు తీసుకు రాబడ్డాడు. బుస్సీ ఆ పిల్లవాడిని తరవాత బొబ్బిలి జమీందారుగా నియమించాడు. ఆ పిదప మూడవ రోజు రాత్రి చీకటిలో తన గుడారంలో నిద్రపోతున్న విజయరామరాజుని 32 కత్తిపోట్లతో తాంద్ర పాపారాయుడు, అతని అనుచరుడు చంపివేశారు. శత్రువుని చంపిన ఆనందంతో వారు వేసిన కేకలకి గుమికూడిన సైనికులు వారిని కాల్చిచంపారు.

***

తేరుకున్న దివాన్‌గారు మళ్ళీ మాట్లాడటం మొదలుపెట్టారు.

“మహారాజా శ్రీ సీతారామకృష్ణ రాయడప్ప రంగారావు బహదూర్ అత్యంత క్రమశిక్షణతో బొబ్బిలి జమిందారీ పరిపాలనలో స్వర్ణయుగం అనదగ్గదిగా 1802 నుండి 1830 వరకు పరిపాలనా సాగించారు. బొబ్బిలిలో ప్రపథమంగా ఆంగ్లేయ పద్ధతిలో ఒక పాఠశాల నెలకొల్పారు. బ్రిటీష్ వారిపై పితూరీలు లేవదీసిన కంబారా వెంకటరాయుడిని పట్టి బ్రిటీష్ ప్రత్యేక కమిషనర్ మిస్టర్ రస్సెల్‌కు అప్పగించారు. అది డబ్బుకోసం కాదు, బ్రిటీష్ సామ్రాజ్యంపై తమకున్న భక్తికి నిదర్శనం అని చెప్పారు. వారు ఎన్నో ఊర్లని కొని, వేలంలో సంపాదించి బొబ్బిలి

సంస్థానాన్ని విస్తరింపజేశారు. ఎన్నో అగ్రహారాలను దానం చేశారు. చెరువులు తవ్వించారు. ఎంతో వ్యయంతో 1855లో ఫూల్‌బాగ్ తోటని ఏర్పరిచారు.

ఇంతేకాక చుట్టుపక్కల జమీందారులకు ఆర్థిక సహాయం చేసి ఆదుకుని వారి వారి జమీందారీలను నిలబెట్టారు. పిల్లలు లేక పిఠాపురం జమీందారు సూర్యారావు బహదూర్ మూడవ కొడుకుని పెంచుకున్నారు. మా మహారాణి వారు ఆ సాంప్రదాయంలోనే బొబ్బిలి జమీందారీని నడిపించుకు వస్తున్నారు" అన్నారు దివాను.

"అవును విన్నాను. బెంగాల్ కరువులో తమ జమిందారీ నుండి 40 వేల బస్తాల ధాన్యం పంపారని కూడా విన్నాను. క్రిందటి సంవత్సరం ఘనత వహించిన ప్రిన్స్ ఆఫ్ వేల్స్ మద్రాస్ వచ్చినప్పుడు వీరిని పొగిడారని, మెడల్ ఆఫ్ ఆనర్ ఇచ్చారని లండన్ పత్రికలో చదివాను" రాణివారున్నవైపు చేయి చూపిస్తూ, "వీరికి రాణీ అన్న బిరుదు ఇచ్చారని కూడా తెలుసు. విదేశాలలో ఉన్నా కూడా మన ప్రాంతపు వార్తలని తప్పకుండా చదువుతాను. రాణీవారు అందరి జమిందారులవలె కాక బహుగొప్ప మనసుతో ప్రజోపకరమైన ఎన్నో మంచి పనులు చేస్తున్నందుకు వీరిపై నాకు ఎనలేని గౌరవం" అన్నారు వేణుగోపాలా చార్యులు.

"మీ గౌరవానికి సంతోషం. వివిధ దేశాలు తిరిగి వివిధ రీతులు గమనించిన మీరు – మా కుమారులు, బొబ్బిలి సంస్థానపు పదిహేనవ రాజు, త్వరలో ఈ రాజ్య పరిపాలనను చేపట్టబోతున్న కుమార రాజాశ్వేతాచలపతి వేంకట రంగారావు బహదూర్ తన హయాంలో ఏయే కార్యక్రమాలు నిర్వర్తిస్తే బావుంటుందో తెలిపే అభిప్రాయాలను కోరుతున్నాం" అన్నారు రాణీగారు.

"నేను మహారాజా వారి కాలం నుండి వీరి సేవలో వున్నవాడిని. ముదుసలిని అయ్యాను. కాలంలో మార్పు వస్తున్నది. మీ వంటి యువకులు, ప్రపంచానుభవం వున్నవాళ్ళు తగిన ప్రణాళికలను సూచించాలి" అన్నారు దివాన్‌గారు.

"విద్య అన్ని రంగాలకు కేంద్రం. అందుచేత విద్యకై విశాఖపట్నం వెళు తున్న ఇక్కడి విద్యార్థులకు కనీసం మిడిల్‌స్కూల్ వరకైనా బొబ్బిలిలో వుండాలి. ఇప్పుడున్న పాఠశాలలను ఆ మేరకు అభివృద్ధి చేయండి. ఉత్తర అమెరికా ఖండంలో

వలే భరతఖండంలో కూడా బ్రిటీషువారి పాలన ఎంతో కాలం వుండదు. మీవంటి జమీందార్లందరు ముక్తకంఠంతో 'వెళ్ళిపోండి' అంటే వారు వెళ్ళి పోవలసిందే?" అన్నారు వేణుగోపాలాచార్యులు.

పిడుగు వదిలి వెళ్ళే నిశ్శబ్దం ఆవరించింది. బయట గాలికి కదలిన ఆకుల చప్పుడు మాత్రమే వినిపిస్తున్నది.

బ్రిటిషువారి పాలన ఎంతో కాలం వుండదు అన్న మాట శ్రోతలందరినీ భయభ్రాంతులను చేసింది. ముఖాలు పాలిపోయి తళుకులేని తదియ చంద్రునిలా విలవిల్లాడుతున్నాయి. తెరవెనుక రాణిగారి హావభావాలు తెలియవు. కానీ వున్నట్టుండి ఏర్పడ్డ నిశ్శబ్దం వేణుగోపాలాచార్యుల్ని చకితుడిని చేసింది.

బ్రిటీషు వారికి దాసోహం అని, వారి మోచేతి నీరు త్రాగడానికి కూడా సిద్ధపడే సంస్థానంలో అటువంటి మాటలనడం మరణశిక్షని కోరడమే. పూర్తిగా వికసించని మానవ మేధకు, మనిషి తన ఆంతరంగిక ఆధ్యాత్మిక అవసరాలకు సృష్టించుకున్న దేవుడు అనవసరం అన్నంత దానికంటే ప్రమాదకరమైన విషయం. ఇది గ్రహించిన వేణుగోపాలాచార్యులు వెంటనే. "ఇది రాజద్రోహపు దృష్టితో అన్నమాట కాదు. లండన్ సభలలో అక్కడక్కడ వినబడుతున్నదే. అదేవిధంగా, మీరు కూడా మీ సంస్థానంలోని మేధావులను పిలిపించి, మత, సామాజిక, శాస్త్ర సభలను జరిపించి, విషయ మీమాంస చేయించమని కోరుతున్నాను" అన్నారు. ఈ వాక్యంతో శ్రోతలందరికి నీట మునుగుతున్న వాడికి ఒక చిన్న ఆసరా దొరికినట్లయింది.

"మీరేమంటారు మిస్టర్ రస్సెల్?" అన్నారు ఆయన వైపు తిరిగి వేణుగోపాలాచార్యులు,

వేణుగోపాలాచార్యులు మిడిల్ స్కూల్ పెట్టమని రాణీవారికి సూచించగానే, మిడిల్ స్కూల్ వస్తే తాను హెడ్‌మాస్టర్ అవ్వచ్చునని, స్థిరమైన జీవనోపాధి లభిస్తుందని, ఆర్థికస్తోమత వస్తుందని, దాని వలన తాను మనసుపడ్డ మేరితో వివాహానికి తన తండ్రిని ఒప్పించగలనని, ఊహలలో తేలిన 23 ఏళ్ళ మిష్టర్ రసెల్ అవకాశాన్ని జారవిడుచుకోకుండా –

"అవును, ఘనత వహించిన బ్రిటిష్ చక్రవర్తిణి విక్టోరియా తమ రాజ్యంలో ప్రజల ఉన్నతి కోరుతారు. భారతీయులను విద్యావంతులుగా, విజ్ఞానవంతులుగా చేయడానికే ఎన్నో కష్టనష్టాల కోర్చి ఈ దేశం వచ్చినవారు. ఆ లక్ష్యంలో భాగమే అవుతుంది మిడిల్ స్కూల్ పెట్టడం" అని సంభాషణను మళ్లించారు.

వేణుగోపాలాచార్యుల వారు మిష్టర్ రస్సెల్‌ను ఖండించానూ లేదు, సమర్థించనూ లేదు.

"మీ ఆలోచనలు మాకు వింతగానూ, ఆకర్షణీయంగానూ ఉన్నాయి" అన్నారు రాణీగారు.

"మీరు ప్రముఖ న్యాయవాది సర్ కేస్ శిష్యులు, సర్ కేస్ గ్రేట్ బ్రిటన్ రాజకీయాలలో ముఖ్యులైన బెంజమెన్ డిస్రయిలీ గారి మిత్రులు కూడానూ. అందువలన లండన్ మహానగర ప్రముఖుల సాంగత్యం, అమెరికా దేశస్థుల పరిచయం, వాటి వలన వీరి ఆలోచనా సరళి క్రొత్త రీతులలో సాగడం సహజమే మరి" అన్నారు దివాను గారు.

"వీటితో పాటు మీరు ఆధునిక విజ్ఞానశాస్త్రాలకు కూడా తగిన స్థానాన్ని కల్పించాలి. మీ సంస్థానంలో కుల విద్య చాలు అనుకుంటున్న వివిధ కులాలవారు, తాము అధికులమని భావించి, మీరు పెట్టిన పాఠశాలలకు వచ్చే మిగిలిన కులస్థులతో చదవరాదనుకుని విద్యా విహీనులవుతున్న వెలమలు, మీ సంస్థాన అభివృద్ధి పథకాలకు కళంకం తెస్తున్నారని నా ఉద్దేశ్యం. ఈ విషయంలో రాణీవారు శ్రద్ధ తీసుకోవాలి అని నా మనవి" అన్నారు వేణుగోపాలాచార్యులు.

"అవును ఈ విషయం మాకూ చింత కలిగిస్తున్నది. దివానుగారు ఈ విషయంపై సమగ్రమైన ఆలోచన గావించి, తగిన ఉత్తర్వులను జారీ చేయడానికి సిద్ధం చేయించండి" అన్నారు రాణిగారు.

"చిత్తం మహారాణీ" అన్నారు దివాను.

"వేణుగోపాలాచార్యులవారు, మా ప్రజల ఆరోగ్యం కూడా మాకు చాలా ముఖ్యం. ఈ విషయంలో మీ సలహా ఏదైనా ఉంటే వినాలని కోరుతున్నాం" అన్నారు రాణి.

"తప్పకుండా మనవి చేస్తాను మహారాణీ. ప్రముఖ వైద్యురాలు డాక్టర్ సోఫియా జక్స్ బ్లాక్ రెండు సంవత్సరాల క్రిందట స్త్రీలకై ప్రత్యేక కళాశాలను 'లండన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ ఫర్ విమెన్' పేరిట స్థాపించారు. మీ సంస్థానం నుంచి కూడా కొందరిని అటువంటి విద్యకు పంపి ప్రోత్సాహమిస్తే మీకు, మీ ప్రజలకు మహోపకారం జరుగుతుంది కూడానూ" అన్నారు వేణుగోపాలా చార్యుల వారు.

"నిజమే, అనుభవజ్ఞురాలైన మంత్రసాని పురుళ్ళ గంగమ్మ మన సంస్థానంలో చాలాకాలం పాటు పనిచేస్తున్నా, ఆధునిక వైద్య విజ్ఞానం ఉన్న ఒక వైద్యురాలి ఆవశ్యకత ఎంతైనా ఉంది. దివాన్‌గారూ, ఈ విషయంలో మన సంస్థానం ఏం చెయ్యగలదు?" అన్న ప్రశ్నకు –

"చిత్తం మహారాణీ తప్పక చర్యలు చేపడతాం" అన్నారు దివాన్ గారు.

"ఈ సమావేశం బొబ్బిలిలో రాబోవు కాలంలో అభ్యుదయానికి నాందిగా భావిస్తున్నాం. మీ సూచనలను మా సంస్థానం ఎప్పుడు ఆనందంగా ఆహ్వానిస్తుంది. మీరు విద్యా, వృత్తి వ్యవహారాలలోనే కాక వైవాహిక విషయంలో కూడా కొన్ని తరాల ముందుగా వున్నారని తెలిసింది. మీ ఆధునికతకు అభినందనలు" అన్నారు రాణీగారు ఆనందాన్ని, అభిమానాన్ని మేళవించిన గొంతుతో.

"అంటే..." తడబడుతూ అన్నారు వేణుగోపాలాచార్యులు.

"వచ్చే నెల 16వ తారీఖునాడు మీరు హైదరాబాద్ నగరంలో నిజాం వారి ఆస్థాన పర్షియన్ కవి కుమార్తె నహిత్‌ను వివాహమాడబోతున్నారని తెలుసు. ఆ వివాహ మహోత్సవానికి రావలసిందిగా కోరుతున్న నిజాం వారి ఆహ్వానం పాలకొండ జమీందారుతో సహా మాకూ అందింది. శుభాకాంక్షలు" అన్నారు రాణి.

'ఈ వార్త ఇంత వరకు చేరిందా' అని నిశ్చేష్టులైనారు వేణుగోపాలా చార్యులు. ఇంతలో ఇద్దరు యువతులు ఒక వెండి పళ్లెములో రెండు ముఖమల్ సంచులతో ముందు నిలుచున్నారు.

"మీ వివాహానికి మా తరఫున ఒక ప్రతినిధి హాజరవుతారు. మీకు మీ కాబోయే సతీమణికి మా వ్యక్తిగత బహుమానంగా ఈ బంగారు ఆభరణాలని స్వీకరించండి. ఆమెకు మా ఆస్థాన ఆహ్వానాన్ని అందించండి" అన్నారు రాణీగారు.

"అలాగే మహారాణీ, అలాగే మహా..."

***

"వేణు, వేణు లే! లే! ఎవరా మహారాణీ? నేను తప్ప నీకందరూ కలలోకి వస్తారు. లే! నేను ఆఫీసుకు వెళ్ళాలి" అన్న మాటలు వినిపించాయి.

కళ్ళు తెరిచి చూశాను. కొత్తకోట, భవంతి, దివానుగారు... లేరు. ఎదురుగా మా ఆవిడ ఫుల్‌సూట్లో గదిలో అటు ఇటు తిరుగుతూ తన బేగ్ సర్దుకొంటున్నది.

చుట్టూ చూశాను. ఆ బెడ్‌రూమ్... అద్దాల కిటికీ. కిటికీలోంచి చూస్తే శాన్‌ఫ్రాన్సిస్కో గోల్డెన్ గేట్ బ్రిడ్జి – అర్థమైంది. నేను అమెరికాలో, కాలిఫోర్నియా రాష్ట్రంలో, శాన్ ఫ్రాన్సిస్కో నగరంలో మా ఇంట్లో వున్నానన్నమాట.

"ఇది బొబ్బిలి రాణిగారి కోట.. కాదన్నమాట..." మెల్లిగా నా మాట నాకు వినబడింది.

"ఇది మనిల్లే... రాణీలు, గీణీలు కలలో ఉంటారు కానీ, లే– ఉదయం ఎనిమిది గంటలైంది. పెసరట్టు బ్రేక్ఫాష్టు. టేబుల్ మీదుంది. ఇవాళ మీ ఛైర్మన్‌తో లంచ్ అన్నావు. అందుకు నీ లంచ్ పేక్ చెయ్యలేదు" అంది మా ఆవిడ. మా పిల్లలిద్దరు స్కూల్‌కు వెళ్లడానికి తయారైవచ్చారు.

"ఎందుకమ్మా నాన్నని నిద్రలేపావు. హాయిగా బొబ్బిలి జమీందారులతో బ్రేక్ఫాస్టు చేసి, పారిస్ ప్రొఫెసర్లతో లంచ్ చేసి, సాయంత్రానికి శాన్‌ఫ్రాన్సిస్కోలో మనింటికి డిన్నర్‌కు వచ్చేవారుగా?" అంది నా పదిహేనేళ్ళ కూతురు.

"అసలేం జరిగిందంటే..." అంటున్నాను బెడ్లోంచి లేవడానికి ప్రయత్నం చేస్తూ. ఇంతలో –

"అసలూ లేదు, స్పెషలూ లేదు హన్నా. ఇంకా నిద్రలేవలేదా? అందుకే అర్ధరాత్రి దాకా ఆ బొబ్బిలి జమీందార్ల పుస్తకాలు చదవొద్దన్నానా!" అన్నాడు మా పదేళ్లవాడు.

ఆ రోజు శుక్రవారం 22 తారీఖు, డిసెంబర్ 2000.

*

**బొబ్బిలి యుద్ధం గురించి చెప్పలేని పాఠాన్ని**
**చదవమని ప్రోత్సహించిన**
**శ్రీ కోడూరి శ్రీరామ మూర్తి**
**గురువు గారికి నమస్కరిస్తూ...**

# ఒక శీత కథ

**‘అ**వునే అమ్మమ్మా, నాకు శీతగా ఉందే’ అప్పారావు ఫోనులో అంటున్న మాటలు విన్న సరిత ఆశ్చర్యపోయింది.

తరవాత భర్త మాటలేవీ వినిపించలేదామెకు. బెడ్‌రూమ్‌లో కూర్చున్నది ఉన్నట్టుండి లేచి లివింగ్ రూమ్‌లోకి వెళ్ళిపోయింది. ఆలోచిస్తున్న కొద్దీ బాధ కలిగింది. బాధ కొద్దిసేపటికి దు:ఖంగా మారింది. దు:ఖం మరికొంత సేపటికి సన్నని ఏడుపుగా మారింది. సన్నని ఏడుపు, బయట పెట్టలేని బాధ ఒక్కసారిగా కట్టలు తెంచుకోగా బావురుమంది. అది అప్పారావుకి వినిపించింది.

“సరితా!” అంటూ పరుగులాంటి నడకతో సరిత దగ్గరికి వచ్చాడు. ప్రక్కనే ఆగి చేతుల్లో మొహం పెట్టుకుని ఏడుస్తున్న సరిత తలమీద చెయ్యి వేసాడు.

“ఏమయ్యింది సరితా?” అంటూ గాభరాగా అడిగాడు. సరిత ఏడుపు ఆపలేదు, తగ్గించలేదు, కనీసం అప్పారావు వచ్చాడన్న విషయాన్ని గుర్తించలేదు. సరితకి ఎలాంటి కష్టం వచ్చినా ఆదుకోగలనని, అసలు ఎలాంటి కష్టాలు రానివ్వనని, జీవితమంతా సరితని సుఖపెట్టేస్తానన్న అతి గాఢ నమ్మకంతో నెల రోజుల క్రిందట న్యూయార్క్ మహానగరంలో కొత్త కాపురం మొదలుపెట్టాడు అప్పారావు. క్షణం ఖాళీ దొరికితే చాలు... పెళ్ళిచూపులు, వెంటనే సరితతో పెళ్ళి, హనీమూన్, పదహారు రోజుల పండగ, ఒక జీవితానికి మించి చేసుకున్న బాసలు గుర్తుకొస్తూనే ఉన్నాయి. ఇంకా ఇంకా క్షణం ఖాళీ లేకుండా గడిపిన మూడు వారాల ఇండియా ప్రయాణం, గాలిలో–నిజంగానే తేలిపోతూ, వెళ్ళినప్పటి కంటే అతి తేలికగా కొత్త పెళ్ళికూతురితో న్యూయార్క్‌లో దిగడం... లాంటివి కమ్ముకొచ్చే శ్రావణ మేఘాల్లా అప్పారావుని ఉబ్బితబ్బిబ్బు చేస్తున్నాయి.

సరిత ఏడవడం, ఏడుస్తున్నప్పుడు తను దగ్గరకు వస్తే సినిమాల్లో మాదిరి కాకపోయినా కనీసం తనకి తోచిన విధంగా 'అప్పారావూ అనో, మరో ముద్దు పేరుతోనో, లేకపోతే 'నాకో కష్టం వచ్చిందిరా!' అని అల్ట్రామోడ్రన్‌గానైనా అని ఉంటే అప్పారావుకి అసలేమీ కష్టం అనిపించకపోయి ఉండేది. అలాంటిదేమీ కాక, అసలే విషయం తెలియక గాభరా పడుతున్న తన ఉనికిని కూడా గుర్తించకపోవడంతో అప్పారావుకి ఆశ్చర్యం, బాధ, అవమానం అన్నీ ఒక్కసారిగా ముసురుకొచ్చాయి.

'ఏమయ్యింది సరితా?' 'ఏమయ్యింది సరితా?' అని యాంత్రికంగా అడిగాడు, బుర్రలోని ఆలోచనలకు సంబంధం లేనట్టు.

"నన్ను ఎందుకు పెళ్ళి చేసుకున్నారు?" అంది సరిత చివాలున తలెత్తి, అప్పారావు మొహంలోకి సూటిగా చూస్తూ.

ఎన్నో వందల వందల ప్రశ్నలకి చాలా ఏళ్ళుగా చక్కనైన సమాధానాలు చెప్పి చెప్పి, వ్రాసి వ్రాసి, అన్ని పరీక్షలలో ఉత్తమ స్థానాన్ని పొంది, ఐఐటి, ఐఐఎం, ఎంఐటీల డిగ్రీలను చేజిక్కించుకొని ఐబిఎంలో అతి మంచి ఉద్యోగంలో ఉన్నాడు అప్పారావు. పెళ్ళికి పెట్టించుకున్న మెహందీ ఇంకా చెరిగిపోని భార్య, తాను అమితంగా ప్రేమిస్తున్న భార్య అడిగిన అతి చిన్న ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోయాడు. తనకున్న క్వాలిఫికేషన్లన్నీ మరిచిపోయి, పద్యం మరిచిపోయిన బడి పిల్లాడిలా, స్టేజ్ మీద డైలాగు, యాక్షన్, రెండూ మరిచిపోయిన ఎన్నారై నటుడిలా – సరిత ముందు నిలబడ్డాడు. సరిత చివాలున తలెత్తినప్పుడు ఆమె తలమీద నుండి జారిపోయిన చెయ్యి తనది కాదన్నట్లు, దానికి మరే పని చెప్పక పోవడం వల్ల అది అప్పారావు కుడి భుజం నుండి వ్రేలాడుతున్నది.

'అవును ఎందుకు పెళ్ళి చేసుకున్నాను?' అని తనలో తాను అనుకున్నాడు. అందరూ పెళ్ళి చేసుకుంటారు. అమ్మా, నాన్నా చేసుకోమన్నారు. రూమ్మేట్లందరూ పెళ్ళి చేసుకుని వెళ్ళిపోయారు. పెళ్లికంటేనే బాస్ నెలరోజులు సెలవిచ్చారు. పెళ్ళి చేసుకోకుండా వెనక్కి ఎలా వెళతాను? అసలు మనుషులు పెళ్లి ఎందుకు చేసుకుంటారు? ఇలాంటి ప్రశ్నలు బుర్రలోకి వస్తున్నాయి. కానీ అప్పారావు చదువుకున్న చదువుకానీ, పెరిగిన వాతావరణం కానీ, పనికిరాని పైపైన మాటలు,

సినిమా కబుర్లు, క్రికెట్ స్కోరులు మాత్రమే మాటలాడుకునే స్నేహితులు కానీ, లెక్కలేనన్ని పుస్తకాల్లో చదివిన చదువు కానీ, సాంకేతిక విజ్ఞానం, పుస్తకాల పరిజ్ఞానం కానీ – ఈ ప్రశ్నకి కావలసిన సమాధానం ఇవ్వలేకపోయాయి. సమాధానం కాదుకదా, కనీసం, నువ్వు ఆలోచిస్తే సమాధానం ఇవ్వగలవు సుమా అన్న ధైర్యాన్ని కూడా ఇవ్వలేకపోయాయి.

తెలుగు పరీక్షకి వెళితే తెలియని భాషలోని ప్రశ్నపత్రం అందుకున్న కుర్రాడిలా బిక్కమొహంతో గత పది నిముషాలుగా ఉన్నచోటే అలా నిలబడి ఉన్నాడు. కాళ్ళపీకు మొదలయింది. సరిత సోఫాలో కూర్చొని ఉంది. కాబట్టి ఎంత సేపయినా అలా ఉండగలదన్న విషయం తోచింది అప్పారావుకి. దానితో మరింత నీరసం వచ్చి అక్కడికక్కడే సరిగ్గా సరిత కాళ్ల దగ్గిర కూలబడిపోయాడు. అది సరితకి నచ్చలేదు. లేచి వెళ్ళిపోవాలనుకుంది. కానీ లేవాలంటే కాళ్ళదగ్గరే కూర్చున్న అప్పారావుకి కాళ్ళు తగలకుండా లేవడం కుదరదని అలానే కూర్చుంది. ఆడదాని కాలితో మొగాడిని తల దగ్గరైనా తన్నవచ్చునని, ఇంకా చెప్పాలంటే అది తెలుగువారి సంప్రదాయమని సరితకు తెలీదు. సత్యభామవంటి పురాణ పతివ్రతల గురించి వినడం కానీ, చదవడం కానీ చెయ్యలేదు. స్త్రీవాదాలు, సమాన హక్కుల గురించి కూడా ఏమీ చదివిందికాదు. కానీ 'నా మొగుడు నా స్వంతం' అన్నది మాత్రం బాగా తెలుసుకున్నది. అది వాళ్ళ నాయినమ్మ పెళ్ళినాటి సాయంత్రం శోభనానికి ముందు బాగా నూరిపోసిన విషయం.

సరిత కూడా అప్పారావులాగే బాగా చదువుకుంది. ఉద్యోగం చేసే ఉద్దేశ్యం కూడా ఉన్నదే. వాళ్ళిద్దరు చదివిన చదువు ప్రస్తుత పరిస్థితిలో వారికి ఏమాత్రం ఉపయోగపడకుండా పోయింది.

"ఆ సీతనే పెళ్ళి చేసుకోక, నన్నెందుకు పెళ్ళి చేసుకున్నారు?" అని రెట్టించి మరీ అడిగింది, తను అడిగిన ప్రశ్నకి అప్పారావు సమాధానం చెప్పలేక పోవడంతో ఉన్నట్టుండి మళ్ళీ ఉక్రోషం వచ్చి ఇక ఆపుకోలేక.

అసలే ముందడిగిన ప్రశ్నకే జవాబు ఇవ్వలేకపోయి, మెదడంతా ఏ ఆలోచనా లేక నాని ముద్దయిన కర్రమొద్దులా ఉన్న అప్పారావుకి ఈ ప్రశ్న మరింత ఆశ్చర్యాన్నీ,

ఆందోళననీ కలిగించింది. కొద్దిగా కదలి, వెనక్కి వంగి, సరిత మొహం వైపు బెరుకుగా చూస్తూ,

"సీతెవరు?" అన్నాడు.

"అవునే అమ్మమ్మా నాకు సీతగా ఉందే" అని అప్పారావు గొంతుని అనుకరిస్తూ తనలోని బాధని దిగమింగుకొంటూ ఒక వింత గొంతుతో వెక్కిరింత, కోపం, అసహనం కలబోసి ఆ ఐదు పదాలని ఐదు బాణాల్లా అప్పారావుపైకి వదిలింది.

అది వినగానే సరిత అలకకి, కోపానికి కారణం తెలిసిపోయింది అప్పారావుకి. సెకండ్లలో అప్పారావు మొహం ఒక్కసారి మబ్బు వీడిన ఆకాశంలా, రిమోట్ నొక్కితే ఆన్ అయిన టీవీలా, భళ్ళుమని తెల్లవారిన ఉదయంలా, తెలుగు మొహం, మాటకోసం వాచిపోయిన తొలి తెలుగు ఎన్నారైకి మరో తెలుగువాడు కనిపించినప్పటిలా వెలిగిపోయింది. కానీ సరిత మొహం – వీధిలో తెలుగువాడు ఉన్నచోట ఒక తెలుగువాడికి మరో తెలుగువాడు కనబడితే అటు ఇటు చూసినట్లు అప్పారావు మొహంవైపు కాక వేరే వైపునకు మొహం తిప్పుకొంది.

సమస్య తేలిపోయిన ఆనందాతిరేకాన, అప్పారావు తనలో తాను మురిసిపోయి నవ్వుకుంటూ – "ఓస్సంతేనా సరితా? మరి చెప్పవేమి? నల్లగా అవుపించినవన్నీ నీళ్ళు, తెల్లగా అవుపించినవన్నీ పాలు కావు సరితా. మావైపు 'శీతగా ఉంది' అంటే చలవ, అంటే చల్లగా, అలాగే కొంచెం వంట్లో బాగుండకపోవడం. నువ్వనుకుంటూ అపోహ పడ్డట్టు 'సీత' కాదు. జాగ్రత్తగా వినాలి. నలతగా ఉన్నదానికంటే కొంచెం తక్కువగా ఉంటే శీత చేసింది అంటాం. అయినా హైదరాబాదులో పుట్టి పెరిగిన నీకు ఇలాంటి మాటలు తెలీవు కదా. గొంతేవిటిరా అలా ఉంది అని అమ్మమ్మ అడిగితే 'శీతగా ఉంది' అని చెప్పాను. ఆవిడకి అలా చెపితేనే అర్థం అవుతుంది. ఏవీలేదని చెపితే ఊరుకోదు. ఏదో దాచానని అనుకుంటుంది. ఇంకా చెప్పాలంటే దీని ఆపోజిట్టేంటంటే 'కాక' చెయ్యడం. అంటే వేడి చేయడం..." అంటూ ఆనందంగా చెప్పుకు పోతున్నాడు.

"ఐనో తెలుగు. మా 'సెయింటాన్స్'లో నేను తెలుగు ఫస్టు. ఎట్లయినా కాకమ్మ కబుర్లు చెప్పి నన్ను ఫూల్ చెయ్యలేరు" అంది రోషంగా.

"అది కాదు సరితా, విను, మావైపు భాషలో కొన్ని నీకు తెలియని పదాలు ఉంటూ ఉంటాయి. కొన్ని పదాల వాడుక వేరుగా ఉంటుంది. అంత సులభంగా పట్టుబడవు, తెలుగు తెలిసినా..."

"పట్టుబడ్డవాళ్ళు ఇలాంటి కట్టు కథలే చెప్తారు..."

"కథలు కాదు నిజం. ముమ్మాటికీ నిజం. కావాలంటే ఎవరినైనా అడుగు, నామాట మీద నమ్మకం లేకపోతే..." అంటూ ఫోన్ అందించాడు. ఫోన్ మెమరీలో ఉన్న మొదటి నెంబరుకి ఫోను చేసి, కోపం అంతా ఆపుకొని గొంతు సవరించుకొని చాలా సౌమ్యంగా –

"హల్లో, అనుపమా ఎలా ఉన్నారు"

"అచ్ఛా, బహుతచ్ఛా.. మీరు..."

"తెలుగులో ఒక డౌట్, మీకు 'శీతగా ఉంది' అంటే మీనింగ్ తెలుసా."

"సీతగా ఉండడం, రాముడుగా ఉండడం ఏమిటి?"

"అయితే మీకు తెలీదా?" అప్పారావు చెప్పింది నిజమేనేమోనని క్షణకాలం పాటు నమ్మిన సరితకి ఆ సమాధానంతో ఒక్కసారిగా నీరసం ఆవరించింది.

ఫోను పక్కనే పడేసి, బెడ్‌రూమ్‌కి వెళ్ళిపోయి తలుపు వేసుకుంది. అప్పారావు ఫోను తీసుకొని దయల్చెయ్యడం మొదలు పెట్టాడు. ఒకరి తరువాత మరొకరు తమకి తెలియదని చెప్పారు. రాత్రి పదకొండు గంటలయింది. ఇంక ఫోను చెయ్యడం ఆపేసాడు. అమెరికాలో ప్రచురించబడే, తెలుగుజ్యోతి, తానా పత్రిక, అమెరికా భారతి లాంటి తెలుగు పత్రికల వాళ్ళకి ఈ–మెయిల్ పంపించాడు. మర్నాటి ఉదయంకల్లా ఆ పత్రికల సంపాదకులలో ఎవరో ఒకరు సరియైన సమాధానం ఇస్తారని ఉదయం లేవగానే సరితకు చూపించి ప్రసన్నం చేసుకోగలనని అనుకుంటూ హాల్లో సోఫాలోనే నిద్రపోయాడు.

తెలుగుభాష మీద కానీ, తెలుగు పత్రికల మీద కానీ ఏ మాత్రం అభిమానం కానీ, అవగాహన కానీ లేని సగటు తెలుగువాడికి ఇవాళ వాటి సహాయంతో తన కాపురంలో లేచిన గొడవకి పరిష్కారం దొరుకుతుందని ఆశించవలసిన పరిస్థితి రావడం ఎంత విచిత్రం!

***

అన్ని రోజులలాగే ఆరోజూ తెల్లవారింది. రాత్రంతా పరిపరి విధాల ఆలోచించిన సరిత నిరాశతో నిద్రలేచింది. రాత్రంతా రకరకాల ఆలోచనలు. అమెరికా సంబంధం కావాలని అమ్మా, నాన్నా పడ్డ ఆరాటం, నిజంగా వచ్చి, తనకు నచ్చి, తనని మెచ్చుకున్నారని చెప్పినప్పటి ఆనందం పదేపదే గుర్తుకొచ్చాయి.

'జాగ్రత్త మోసపోగలరు' అని, వీళ్ళకి 'ఇలా అయ్యింది', వాళ్ళకి 'అలా అయ్యింది' అంటూ మోసపోయినవాళ్ళ వివరాలు పూసగుచ్చినట్టు చెప్పిన వాళ్ళ మాటలు గుర్తుకొచ్చాయి. మా ఫ్రెండు వాళ్ళ ఫ్రెండు వాళ్ళ తోడల్లుడి రెండో అమ్మాయికి అమెరికా సంబంధం వచ్చింది. అమెరికా సంబంధం అని ఎగిరి ఎగిరి మరీ పెళ్ళి చేశారు. ఏవయ్యిందీ? తీరా చూస్తే ఆ పెళ్ళికొడుకు ప్రబద్ధుడికి వేరే పెళ్ళి ఎప్పుడో అయిపోయి అమెరికాలో పెళ్ళాం ఉందిట. 'నాకు జాలీ, అంత:కరణ ఉన్నాయి కాబట్టి, నీకు అమెరికాలో స్థిరపడడానికి కావలసిన ఏర్పాట్లేవో చేస్తాను' అని హనీమూన్ అయిన తరువాత చెప్పాడుట... ఇలాంటివి విన్నప్పుడు సగం నిజం, సగం కల్పితం. చెప్పిన వాళ్ళు చూసారా? అని అనుకుంది.

అప్పారావు అలాంటివాడు కాదని మొదటి చూపులోనే మొదటి పరిచయంలోనే తనకున్న పరిశీలనా శక్తి అంతటిని వాడి పరిశీలించానని అనుకుంది. కానీ ఇప్పుడు ఇలా ఎవరో సీతతో అప్పారావుకి సంబంధం ఉందని తెలిసి అప్పారావు తనని మోసం చేసాడని రాత్రంతా బాధపడింది. అందరూ చెప్తున్నా వినకుండా, జాగ్రత్తగా ఆలోచించకుండా అప్పారావు మంచివాడని నమ్మి తనని తానే మోసం చేసుకున్నానని పదే పదే అనుకుంది. ఇక తన జీవితం తను చూసుకోవాలి. మోసపోయి, జీవితాంతం కాంప్రమైజ్ అయిపోయి బ్రతక్కూడదు. తనకున్న డిగ్రీలకు మంచి ఉద్యోగమే వస్తుంది. ఇండియా వెళ్ళిపోయి

**గురుదక్షిణ**

విడాకులు తీసుకోవాలని సరిత ఒక నిశ్చయానికి వచ్చేసింది.

***

నిన్న రాత్రి తనవైపు ఉపయోగించే మాటలకి అర్థం తెలియక తనకెవరో సీతతో సంబంధం ఉందని, తెలుగు తెలియక చాలా అనుమానాలకి పోయింది. ఇవాళ ఎవరో ఒకరు ఈ–మెయిల్లో 'శీత చెయ్యడం' గురించి వివరంగా వ్రాసి పంపుతారు. అది చదివి తప్పని తెలుసుకుని సినిమాలో హీరోయిన్‌లా వెనక్కి వచ్చి 'అప్రావ్' అని తనని కౌగిలించుకుంటుంది. అమ్మమ్మ ఈ విషయం వింటే 'వెర్రి నాగమ్మ' అని నిన్ను ముద్దుగా అంటుందని సరితకు చెప్పాలి. ఈ నాగమ్మ ఎవరని అంటుందేమో, 'శీత'కోసం ఒక రాత్రంతా తగువైపోయింది. అమ్మో... మరోసారి ఇలా వద్దు. అసలు సరితకి తెలుగు లాంగ్వేజ్ బాగా నేర్పాలి. అప్పుడే ఇలాంటివి చెప్పాలి. లేకపోతే ఎంజాయ్ చెయ్యలేదు సరికదా అనుమానాలు పెరిగిపోతాయి.

ఇవాళ సరితని బాగా తిప్పాలి, చాలా దూరం కొత్త కారులో తీసుకెళ్ళాలి. సరితకి ఐస్‌క్రీం అంటే చాలా ఇష్టం కదా. మంచి ఐస్‌క్రీంలు తినిపించాలి. అసలు సరిత ఎప్పుడూ తినని 'జింజర్ ఐస్‌క్రీం' తినిపించాలి. ముందు అసలు పేరు చెప్పకూడదు. చెపితే అల్లం ఐస్‌క్రీమా అంటూ తిననే తినదు. కానీ తిన్న తరువాత 'ఎంత బావుందో' అని తనన్న తరువాత చెపితే ఎంత ఆశ్చర్యపోతుందో అనుకుంటూ ఎంతో ఆశతో మేలుకున్నాడు.

కళ్ళు తెరవగానే ఎదురుగా సరిత నిలబడి ఉంది. ఆనందంగా "సరితా" అని అంటూ లేవబోయాడు.

"నాకేం చెప్పొద్దు. నా జీవితం నేను చూసుకొంటాను. మోసపోయి, కాంప్రమైజ్ అయిపోయి బతకను. నాకున్న డిగ్రీలకు మంచి ఉద్యోగమే వస్తుంది. ఇండియా వెళ్ళిపోతాను. విడాకులు తీసుకొంటాను" అని పురోహితుడు పెళ్ళి మంత్రాలు చెప్పినట్లు తనలో తాను అనుకొన్న మాటలని తాపీగా చెప్పింది.

ఉత్సాహంతో లేవబోతున్న వాడు కాస్తా నోట మాట రాక అలా కదలిక లేకుండా ఉండిపోయాడు.

"నేను కేబ్ తీసుకుని గుడికి వెళ్ళి వస్తాను. నాకు ఇండియా వెళ్ళడానికి టిక్కెట్టు కొను" అని గిరుక్కున తిరిగి బాత్‌రూమ్‌లోకి వెళ్ళిపోయింది.

సరిత మాటలు విని ఒక్కసారి మళ్ళీ సోఫాలోకి ఒరిగిపోయాడు.

***

గుడిలో సరిత పదే పదే ప్రదక్షిణాలు చేసింది. మంత్రాలు వింటున్నది కానీ ప్రార్థన చెయ్యడానికి శ్లోకాలు కానీ, పద్యాలు కానీ రావు. 'దేవుడా, దేవుడా నేను మోసపోయాను, నన్ను రక్షించు' అని పదే పదే అనుకోవడం తప్పించి మరేం చెయ్యాలో తోచలేదు సరితకు. చివరకు గుడిలో ఒక స్తంభానికి ఆనుకుని కూర్చొంది. ఎదురుగా ఒక వయసు మళ్ళినావిడ గట్టిగా ప్రార్థన చేసుకుంటోంది. రాత్రంతా నిద్ర లేకపోవడం వల్ల సరితకు మగతగా ఉంది. పూజార్ల మంత్రాలు, గుడి గంటలు, భక్తుల ప్రార్థనలు అన్నీ కలిసిపోయి వినిపించడం తాపీగా తగ్గిపోయాయి.

"అమ్మ, అమ్మా..." అని కదుపుతూ, ఎవరో లేపుతూంటే కళ్ళు తెరిచి చూసిన సరితకు ఎదురుగా ఇద్దరు ముగ్గురు కొత్తవాళ్ళు కనిపించారు. ఇంతకుముందు చూసిన వయసు మళ్ళినావిడ రెండు చేతులతో లేపుతోంది. ఎవరో మంచినీళ్ళు అందించారు.

"పరవాలేదా?", "మంచిగానే ఉందా?", "బిడ్డకి భుకారైందా?" అని రకరకాలుగా గుడికి వచ్చిన భక్తులు అడుగుతున్నారు. ఇంకెవరో వేడి కాఫీ తెచ్చారు. సరితని స్తంభానికి ఆన్చి కూర్చోపెట్టారు.

"ఫరవాలేదు, నేను చూసుకుంటాను" అని చుట్టూ ఉన్నవాళ్ళకి చెప్పి, "ఏమ్మా, శీతగా ఉందా?" అని అడిగింది ఆ వయసు మళ్ళినావిడ.

అర్ధరాత్రి కారుమబ్బులు కమ్మిన ఆకాశంలో మెరుపు విరిసి, అది ఫెళ్ళున విరిగి, నేలపైకి దూకి, తనను తాకిన భావన కలిగింది సరితకు. జవాబు ఇవ్వకుండా ఆమెనే అలా చూస్తూ ఉండిపోయింది.

"నీళ్ళోసుకున్నావా అమ్మా" ఆమె మళ్ళీ అడిగింది.

సరితకు అర్థం కాలేదు.

"తెలుగొచ్చా..." అని సంశయంగా అడిగింది.

'వచ్చు' అన్నట్లు తలూపింది, తేరుకుంటున్న సరిత.

"మీ ఆయన వచ్చారామ్మా?" అంది కాఫీ గ్లాసు అందిస్తూ, రాలేదు అన్నట్టు తల ఊపింది. కొద్దిగా కాఫీ తాగింది, తేరుకుంది.

"శీతగా ఉందా అంటే ఏమిటండీ?" అని అడిగింది మెల్లిగా.

"మరేంలేదమ్మా, వంట్లో కాసింత బాగుండగకపోతే మావైపు అలా అంటాం. అంతే" అంది ఆమె.

"నిజమా" అని తనలో తాను అనుకున్నట్టు అంది పైకి.

"అంతేనమ్మా, మా విజీనగరం వైపు అలాగే అంటాం". మెడలో ఉన్న మంగళసూత్రం వైపు చూస్తూ "కొత్తగా పెళ్ళైనట్టుందికదా, నీళ్ళోసుకుంటే ఇలానే ఉంటుంది. మరేం గాభరా పడక్కర్లేదు. మంచిదే. తొమ్మిది నెలల్లో పండంటి పాపాయి పుడుతుంది. నీళ్లోసుకుని పుట్టింటికెళ్ళాలి. మరి మీకు ఈ పద్ధతులెలా తెలుస్తాయి. మీవాళ్ళెవరూ లేకపోతే నేనున్నానమ్మా. మొహమాటపడకు..." అంటూ చెప్పుకుపోతోంది.

అప్పారావుని సరిగా అర్థం చేసుకోనందుకు, పైగా ఎన్నో మాటలు అన్నందుకు సరిత పశ్చాత్తాప పడింది. అప్పారావు ఎలా ఉన్నాడో? వెంటనే ఇంటికి వెళ్ళాలనిపించింది. అప్పారావుని కౌగిలించుకుని, సారీ చెప్పాలనుకుంది. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"మా అబ్బాయి వస్తాడు, మా కార్లో మీ ఇంటి దగ్గర దింపమంటాను. వాడికి మీ ఇంటికి ఎలా వెళ్ళాలో చెప్పమ్మా" అన్నది ఆవిడ.

సరితకు ఎగిరి అప్పారావు ముందు వాలాలని ఉంది. లేచి నిలబడింది. ఆమెతో కలిసి బయటికి వచ్చి వాళ్ళ కారెక్కి ఎలా వెళ్ళాలో చెప్పింది. పెద్దావిడ ఏవో మాట్లాడుతూనే ఉంది. సరిత "ఆ.. ఉ.." అని సమాధానాలు ఇస్తూనే

ఉంది. కానీ మనసంతా అప్పారావు మీదే ఉంది. సారీ ఎలా చెప్పాలా అని ఆలోచిస్తోంది. అలా కాదు  ఇలా, ఇలా కాదు అలా అని పదే పదే అనుకుంటూ ఇల్లు చేరింది.

తాళం తీసుకుని ఇంటిలో అడుగు పెట్టింది. సోఫాలో విచారంగా కళ్ళు మూసుకుని పడుకుని ఉన్న అప్పారావు దగ్గరకు వెళ్ళింది. నుదుటి మీద చెయ్యి వేసింది. అప్పారావు లేచి కూర్చోబోయాడు.

“శీతగా ఉందా?” అని ప్రేమగా అడిగింది.

అప్పారావు అయోమయంగా సరితవైపు చూసాడు. లాలనగా రెండు చేతుల్లోకి అప్పారావు మొహాన్ని తీసుకుంది.

“సారీ” అంది అప్పారావు మొహాన్ని దగ్గరకు తీసుకుంటూ ముద్దుగా.

“అయితే నువ్వు వెళ్ళిపోవడం లేదా!” అన్నాడు ఆశ్చర్యం ఆనందం ఒక్కసారి ముంచెత్తేస్తూంటే.

“వెళతాను” అంది నిశ్చయమైన గొంతుతో.

“సరితా” అన్నాడు మళ్ళీ ఆశ్చర్యం బాధ కలిసిన గొంతుతో అయోమయంగా.

“వెళతాను, నీళ్లోసుకున్న తరువాత” అంది గోముగా.

అందమైన పదాల పొత్తులోని తియ్యనైన భావనలా ఒకరిలో ఒకరు కలసిపోయారు.

*

**న్యూయార్క్ జీవతంలో తెలుగువారికి**
**గురువు వంటి**
**శ్రీ చెరుకుపల్లి నెహ్రూ గారికి,**
**ప్రేరణ ఇచ్చిన శ్రీమతి గరకపాటి సీత గారికి**
**నమస్కరిస్తూ...**

# డెత్ సర్టిఫికెట్

**ఇం**టిల్లిపాదీ ఒక్కసారి భోరుమని ఏడ్చారు. ఆ ఇంటి నుండి అప్పుడే ఒక ఆత్మ ఆనంద, అమృత, అనిర్వచనీయ లోకాలకు పయనించింది. అప్పటిదాకా రాగద్వేషాలకి, నవరసాలకి అనుక్షణం స్పందించే కోటానుకోట్ల కణాల నిరంతర కార్యక్రమాల కర్మాగారం నిర్జీవమై, కట్టై, 'శవం' అయిపోయింది ఆ ఇంట. డాక్టర్ వేదాంతిలా వేరే కేసుకి వెళ్లిపోయారు. చుట్టుప్రక్కల ఇళ్లల్లో మనుషులు ఏడుపులు విని పరుగెత్తుకు వచ్చారు. పెరటి సాలలో ఉన్న ఆవు కళ్ళనుండి నీళ్ళు కారుతున్నాయి. 'అంబా' అని అనువదించలేని భాషలో పదే పదే అరచింది. చావు మబ్బు మెల్లగా కమ్ముకుంటున్నది ఆ ఇంటిపైన.

"కావల్సింది కానియ్యండి"

"మహానుభావుడు మరికలేడు."

"గొప్ప మనసున్న మనిషి"

"అయినవాళ్ళకి అన్యాయం చేసిపోయాడు."

"గొప్ప భోగి, మారాజు"

"ఛ! గొప్ప యోగండి"

ఇటువంటి అనాలోచిత, అసందర్భ, అవాకులు, చెవాకులతో కాలం ముల్లుని ఆగిపోకుండా ఉంచడానికా అన్నట్లు అడపా తడపా మాటలు వినిపిస్తున్నాయి.

"చెయ్యాల్సిన పనులను కానియ్యండి" ఏ పనీ చేయకూడదని నిశ్చయించుకున్న వాళ్ళు అప్పుడప్పుడు అంటూనే ఉన్నారు. చెయ్యవలసిన పనులు చెయ్యాలని తెలిసిన వాళ్ళందరకు, ఆ పనులు చెయ్యడానికి డబ్బులవుతాయని తెలుసు. అది చాలా అవుతుందని కూడా తెలుసు. ఆ ఖర్చే మిగిలిన వాళ్ళని చెయ్యమని ప్రోత్సహించడానికి కారణం. ఎవరు ఖర్చు పెట్టడానికి ముందుకు వస్తారో వాళ్ళకి సలహా ఇవ్వడానికి, సహాయం చెయ్యడానికి అందరూ సిద్ధపడుతున్నారు. ఇటువంటి సమయాల్లో ఖర్చు పెట్టడానికి ముందుకు వచ్చే ఒక్క మనిషి అందరి ముందు శవంగా పడుకుని ఉన్నాడు. ఖర్చు పెట్టవలసిన బాధ్యత ఉన్న ఇద్దరు కొడుకుల్లో పెద్దవాడు పట్నంలో ఉన్నాడు. రెండవవాడు నిరుద్యోగి, ఏడుస్తూ తల్లితో పాటు శవం పక్కనే ఉన్నాడు. తండ్రి పోయిన బాధతో కూతురు, ఖర్చు పెట్టాల్సి వస్తుందేమో అన్న భయంతో పొరుగూరిలో తాలూకాఫీసులో గుమస్తాగా ఉన్న అల్లుడు అక్కడే ఉన్నారు.

జీవులు ఖర్చు లేకుండా పుట్టి, ఖర్చు లేకుండా చనిపోవడం ప్రకృతిలో సహజం. అటువంటి సహజమైన కార్యక్రమాన్ని నేటి నాగరిక సమాజంలో మనిషి తన తెలివి తేటలతో ఖర్చు తప్పని కార్యక్రమంగా మార్చాడు. ఖర్చు ఉన్న చోట లాభం కూడా ఉంటుంది. ఇలాంటి ఖర్చులో లాభం పొందే వ్యక్తి లింగమూర్తి. ఏ విధంగా తెలుసుకుంటాడో కానీ, ఆ చుట్టు ప్రక్కల ఊర్లలో ఏ వ్యక్తి చనిపోయినా, ప్రాణం పోయిన గంటలోపే శవం ఉన్న ఇంటిముందు వాలతాడు. పరిస్థితి గమనించి రంగంలోకి దూకుతాడు. అటువంటి లింగమూర్తి స్కూటర్ చప్పుడు ఆ ఇంటిముందు ఆగగానే అక్కడ ఉన్నవాళ్ళు 'అమ్మయ్యా' అన్న మాట నోటితో అనకపోయినా వాళ్ళ కళ్ళలో కనిపించింది.

లింగమూర్తి సరాసరి శవం దగ్గరకి వెళ్ళి ఒక నమస్కారం చేసాడు. చనిపోయిన ఆయన భార్యని గుర్తించి ఆమెతో "అమ్మా, మహానుభావులు ఆయన. ఏ పుణ్యలోకాలకో పయనం అయ్యారు. అంత్యక్రియలని అశ్రద్ధ చేయరాదు. ఆ పూచీ నాది" అని ఆమె అంగీకారం కోసం అడిగినట్లు కాకుండా అడిగి, ఆమె అంగీకారపు చూపులని వెతికి పట్టి అంత్యక్రియల బాధ్యతని అవలీలగా భుజం మీద వేసుకున్నాడు లింగమూర్తి.

వెంటనే రెండో కొడుకుని లేపి బయటకు తీసుకెళ్ళి పెద్ద కొడుకు, మిగిలిన చుట్టాలందరి ఎడ్రస్‌లు తీసుకున్నాడు. వారందరికి రమ్మనమని టెలిగ్రాములు ఇమ్మని ఒక అసిస్టెంటుని పిలిచి పురమాయించాడు. ఇంకో అసిస్టెంటుని పిలిచి ఇక్కడే ఉండి ఆ ఇంట్లో వాళ్ళకి, ఆ ఇంటికి వచ్చిన వాళ్ళకి కావలసిన కాఫీ, టీ అవసరాలని చూడమని ఆర్డరు వేసాడు. వాళ్ళకి కావలసిన డబ్బులు ఇచ్చి స్కూటర్ ఎక్కి వెళ్ళిపోయాడు.

* * *

ఐదురోడ్ల జంక్షన్‌లో టీ కొట్లో ఒక డబుల్ స్పెషల్ టీకి ఆర్డర్ ఇచ్చి కూర్చున్నాడు లింగమూర్తి. అక్కడే చెల్లా చెదురుగా ఉన్న లింగమూర్తి అసిస్టెంట్లు అతని చుట్టూ చేరారు. ఒకడివైపు చూసి – "ఒరేయ్, బంద వీధిలో ఒక శవానికి సాయంత్రం నాలిగింటికి శవ దహనం. కావలసిన సామాను, ఏర్పాట్లు చూడు. కాంట్రాక్టు మాట్లాడ్డం అవ్వలేదు కాని పని మొదలుపెట్టాలి. అంతా అరువులా ఉంది చూడబోతే, జాగ్రత్త".

మరొకడివైపు చూసి "ఎక్కడున్నా సరే వీఏఓని వెతికి పట్టుకో. డెత్ సర్టిఫికెట్ ఫారం నింపించి, సంతకాలు పెట్టించి, మునిసిపాలిటీ ఆఫీసులో స్వయంగా ఇచ్చి మరీ నా దగ్గరకు మూడు మూడున్నర మధ్య రమ్మను" అన్నాడు. అప్పుడే వచ్చిన వేడి టీ తాగుతూ, ఆ టీకొట్టునే ఆఫీసు చేసుకుని, చెయ్యాల్సిన పనులను పురమాయిస్తూ, రావాల్సిన డబ్బులు లెక్కపెట్టుకుంటూ, ఒక రెండు గంటలపాటు తన వ్యాపారాన్ని కొనసాగించాడు లింగమూర్తి. తరవాత తద్దినం భోజనానికి ఇంకో ఇంటికి వెళ్ళాడు. అక్కడ సుష్టుగా భోజనం చేసి పనులెలా జరుగుతున్నాయో చూడడానికి ఉదయం పనులు పురమాయించిన బంద వీధి ఇంటికి వచ్చాడు.

* * *

మధ్యాహ్నం అయ్యింది. అప్పటికి ఆ ఇంట్లో శవం ఉందని ఆ వీధి మొదలులోనే తెలిసేలా వచ్చేపోయే జనం, ఏడ్పులు, అంత్యక్రియకై శవాన్ని తీసుకుపోవడానికి చెయ్యబడుతున్న పాడె ఏర్పాటుతో ఆ వీధికి చావుకళ వచ్చేసింది. అప్పటికే వీఏఓ వినయంగా ఒక పెద్ద కాగితాన్ని నింపించి, శవం అయి వాకిట్లో

పడుకుని ఉన్న వ్యక్తి, ఆ వ్యక్తి అని చెప్పబడుతున్న వ్యక్తేనని, నిజంగానే చనిపోయాడని పూర్తిగా నిశ్చయించుకొని సంతకాలు తీసుకొని వెళ్లాడు.

పై ఊర్ల నుండి రావాల్సిన చుట్టాలు ఒక్కొక్కరే వస్తున్నారు. సరిగ్గా మూడుగంటలకి పెద్ద కొడుకు, భార్యా పిల్లలిద్దరితో వచ్చాడు. కొద్దిసేపు అతన్ని కుటుంబ సభ్యులతో గడపనిచ్చి, లింగమూర్తి అతన్ని వ్యవహారం మాట్లాడటానికి ప్రక్కకు తీసుకువెళ్లాడు. జరగవలసిన కార్యక్రమం, ఖర్చు వివరాలు తెలిపాడు. అంత్యక్రియలకెంత, మొదటి మాసికం దాకా ఎంత, మొదటి తద్దినం దాకా అయితే ఎంత, ఇంతేకాక ఈ పనులన్నీ ఏ తరహాలో చేస్తే ఎంతవుతుందో, రాజమండ్రి వెళితే ఎంతవుతుంది. కాశీదాకా అయితే ఎంత ఆ ధరలు, కార్యక్రమం వివరాలు విని పెద్ద కొడుకు “ఇంత ఖర్చా? ఇంత పనా?” ఆశ్చర్యం, బాధ, ఖర్చు వలన వచ్చిన భయం కలిసిన గొంతుతో అన్నాడు.

“మీరేం కంగారు పడవద్దు. ఈ ఖర్చంతా అన్నదమ్ములిద్దరు పంచుకోవాలి” అన్నాడు లింగమూర్తి.

“మా తమ్ముడికి ఇంకా ఉద్యోగం లేదు. నా దగ్గర అంత డబ్బు లేదు” అన్నాడు పెద్దకొడుకు.

“మరేం ఫరవాలేదు. ఈ ఇల్లు మీదే కదా? మీ నాన్నగారి పెన్షను, బేంక్ ఎకౌంట్లు ఉన్నాయి కదా. మీరు ‘ఊ’ అనండి చాలు అంతా నేను చూసుకుంటాను. ఈ ఊర్లోనే జరిపించేద్దాం. పెద్ద కొడుకుగా మీరు నిలబడితే చాలు. డబ్బు విషయంలో ఇబ్బంది ఏమీ రాకుండా, చెడ్డపేరు రాకుండా, భేష్ పెద్దకొడుకు చెయ్యవలసినదంతా శాస్త్ర ప్రకారం జరిపించాడన్న పేరొచ్చేలా నడిపించే బాధ్యత నాది” అని ఈ వృత్తిలోని తన అనుభవాన్ని అంతా ప్రదర్శించి ధైర్యం చెప్పి చివరగా “ఏమంటారు?” అని అడిగాడు లింగమూర్తి పెద్ద కొడుకుని. “సరే. అలాగే కానీయండి” అన్నాడు పెద్ద కొడుకు.

ఆ రోజు కార్యక్రమం అంతా లింగమూర్తి పద్ధతి ప్రకారం జరిపించాడు. సాయంత్రం వెళ్ళిపోయే ముందు ఎంతో కొంత డబ్బు ఇమ్మని అడిగాడు. కట్టు బట్టలతో రైలు ఛార్జీలతో మాత్రమే బయలుదేరానని పెద్దకొడుకు; ఇంట్లో ఎంత

ఉందో తెలీదని రెండో కొడుకు; మొత్తం మీద తన దగ్గర డబ్బు లేదని, తండ్రి బతికి ఉన్నవాళ్ళు ఇలాంటి ఖర్చులు పెట్టకూడదు కాబట్టి సహాయం చెయ్యడం లేదని అల్లుడు, అదే విషయాన్ని రకరకాల వంకలతో దగ్గర బంధువులు చెప్పారు.

"మరేం ఫరవాలేదు, తరవాత చూసుకొందాం" అని లింగమూర్తి వెళ్ళిపోయాడు.

* * *

ఆ రాత్రి నుండే ఆర్థిక పరమైన ఆలోచనలు, లెక్కలు అందరి బుర్రల్లో చోటు చేసుకున్నాయి. మర్నాడు తల్లి చెప్పగా అందరు సమష్టిగా తెలుసుకున్నది ఏమిటంటే గత ఏడాదిగా ఆ ఇంట్లో తండ్రి జబ్బే కానీ, నిలవ డబ్బేమీ లేదని ఆఖరి 500 రూపాయలు కూడా నిన్న తెల్లవారు ఝామురు నుండి ఆయిన వైద్యం ఖర్చుతో తండ్రి ప్రాణంతో పాటు ఇల్లు విడిచిపెట్టి పోయాయని. అయితే ఆస్తి మాటేమిటి? పింఛన్ మాటేమిటి? బేంక్ ఎకౌంట్ల సంగతేమిటి?

ఆయనకున్న డబ్బంతా ఆయన పింఛన్ ఎకౌంటు. ఒక ఫిక్సుడు ఎకౌంటు. ఇవి కాక ఇల్లు. అంతే, అప్పుల సంగతి ఏమీ తెలీదు అప్పుడే. నికరంగా వీటి నుండి వచ్చే డబ్బెంత అన్నది అంచనా వెయ్యడంలో అందరి బుర్రలు పనిచేస్తున్నాయి. మర్నాడు ఉదయాన్నే లింగమూర్తి వచ్చి విషయం తెలుసుకుని బ్యాంక్ పనులు ఎలా చెయ్యాలో వివరంగా చెప్పాడు. ఇంట్లో కావలసిన వస్తువులు ఉన్నాయో లేవో కనుక్కున్నాడు. ఇంట్లో మనుషులు చాలా మంది ఉన్నా విస్తర్ల దగ్గర కూర్చోడానికే కానీ వండి వడ్డించడానికి ఎవరూ ముందుకు రారని, వంటమనిషిని కూడా ఏర్పాటు చేసి వెళ్ళాడు.

* * *

వివరాలు కనుక్కోడానికి పదో గంటకల్లా కొడుకులిద్దరు బేంక్‌కి వెళ్లారు. 'అయ్యో' ఆయన పోయారా. అయితే ఆ ఎకౌంట్లు కూడా డెడ్డే. రెండు మూడు నెలల నుండి కనిపించకపోతే ఊరు వెళ్లారనుకున్నాం. ఆయన పేరున ఉన్న పింఛన్, ఫిక్సుడ్ ఎకౌంట్లలో నుండి డబ్బులు తీసి ఆ ఎకౌంట్లు క్లోజ్ చెయ్యాలంటే, ముందు ఆయన 'డెత్ సర్టిఫికెట్' మునిసిపల్ ఆఫీసు నుండి, మీ అమ్మగారి

పేరగానీ, మీలో ఎవరి పేరగానీ 'లీగల్ హేర్ సర్టిఫికెట్' మండలాఫీసు నుండి తీసుకొచ్చి కొన్ని కాగితాలు నింపాలి. అవి మీరు ఎంత త్వరగా తీసుకు రాగలిగితే ఆ ఎకౌంట్లకు అంత త్వరగా జీవం పోసిన వారవుతారు. అని చెప్తూ ఆయన ఎకౌంటున్న లెడ్జర్ పుస్తకాన్ని తెరిచి చూసి, 'బాలెన్సు పదివేలు దాటిపోయిందే. అయితే ఫైలు పై ఆఫీసుకు పంపాలి. అంటే కనీసం మరో పదిరోజులవుతుంది ఆ బాలన్సు మీ కందేసరికి. ఇదికాక, మీ అమ్మగారికి రావల్సిన పెన్షన్ ఏర్పాట్లకి ఆ తరవాత మరో నెల, రెండు నెలలు పడుతుంది. మరి మీ ప్రయత్నాలు మీరు చేసి ఆ సర్టిఫికెట్లతో రండి" అని సానుభూతితో చెప్పారు బేంకు వాళ్లు.

అన్నదమ్ములిద్దరు ఆలోచనలో పడ్డారు. అంతా కలిపి ఐదు వందల కంటే ఎక్కువలేదు చేతిలో, అదీ తిరుగు ప్రయాణపు ఖర్చులకు గట్రా అని రైలెక్కే ముందు తోటి గుమస్తా దగ్గర చేబదులు తీసుకువచ్చింది. కర్మ చెయ్యాలి. అది ఖర్చుతో కూడుకొన్నది. అది కాక ఇంటినిండా జనం. వాళ్లందరికి వంటలు గట్రా. చాలా ఖర్చే. బ్యాంకులో పదివేలకి పైనే ఉందికాని అది ఎప్పుడు వస్తుంది? మరిప్పుడెలాగ?

* * *

'ఎలా?' అన్న ప్రశ్నకి సమాధానం మర్నాడు లింగమూర్తి ఇచ్చాడు.

"కర్మకి పన్నెండు వేలు. మీ పై ఖర్చుకి ఒక మూడు వేలు. మొత్తం పదిహేను వేలు. తక్షణం మీకు నూటికి నెలకి మూడు రూపాయల వడ్డీతో హామీ పత్రం లేకుండానే ఇప్పిస్తాను. మీ డబ్బులు రాగానే వడ్డీతో సహా వెంటనే తీర్చెయ్యండి. ఎంత తొందరగా తీరిస్తే మీకు అంత వడ్డీ మిగులు. ఆ తరవాత ప్రతీ నెల మాసికానికి ఐదు వందలు ఇవ్వండి. ఆఖరిగా మొదటి తద్దినం ఖర్చుకు మూడు వేలు జాగ్రత్త చేసి ఉంచండి. ప్రాణం చెప్పా పెట్టకుండా ఎప్పుడు పడితే అప్పుడు పోవచ్చు కానీ తద్దినం మాత్రం ఎప్పుడు వచ్చేది ఏడాది ముందు నుండే తెలుస్తుంది. అప్పు ఏర్పాటుకి మీరు సరే అంటే సరి. అన్ని ఏర్పాట్లు, దక్షిణతో సహా నేను చూసుకుంటాను. 'కాదు' అంటారూ, మీరు భారం వహించి డబ్బు ఏర్పాటు చేసుకోండి. నేను నిలబడి పని నడిపిస్తాను. ఏ విషయం ఆలోచించుకొని

రేపుదయానికల్లా నిశ్చయం చేయండి” అని లింగమూర్తి చెప్పాడు.

అంతా విని ఏమీ మాట్లాడని వాళ్ళ మొహంలో మొహం పెట్టి “కాదంటారూ, లేదా ఇంతకన్నా తక్కువలో కానిచ్చేద్దాం అంటారు. అది ఎంతో చెప్పండి. దానికి తగ్గట్టు ఎలా చెయ్యాలో చెప్తాను. రెండూ కాదంటారు మరొకర్ని చూసుకోండి. నిన్నటి ఖర్చు, ఫీజు మొత్తం మూడు వేలు ఇప్పించండి, నేను వెంటనే వెళ్ళాలి. వెలంవారి వీధిలో క్రిందికి దించ మీదను పెట్ట అన్నట్లు కేసొకటుందని కబురొచ్చింది” అని పక్కా వ్యాపారంగా చెప్పాడు.

మరోలా చెయ్యడానికి ముందుకు రాలేదు ఎవ్వరూ. ఆ ఖర్చులకు సరిపడ డబ్బు ఎవ్వరి దగ్గరా లేదు. అన్ని ఖర్చులు పెట్టుకుంటాననంటున్నాడు. పైగా ఇంటి ఖర్చుకు డబ్బు ఇస్తాననంటున్నాడు, ఇంకేం కావాలి. బేంకులో డబ్బు తొందరలోనే వస్తే, పెద్దగా వడ్డీ కూడా అవ్వదు. చేతిలో డబ్బు పడుతుంది, ప్రస్తుతం పని జరుగుతుంది అని అందరు ప్రోత్సహించడంతో అన్నదమ్ములిద్దరు ‘సరే’ అన్నారు.

“అన్నట్టు డెత్ సర్టిఫికెట్‌కి అప్లికేషన్ విఏఓ గారిచేత నింపించాను. అది ఇప్పుడు మునిసిపల్ ఆఫీసులో ఉంది. దాన్ని కదిలించే ప్రయత్నాలు చేసుకోండి” అని చెప్పి వెళ్ళిపోయాడు లింగమూర్తి.

* * *

వడ్డీరేటు ఎక్కువే అయినా ఆ సర్టిఫికెట్లు వెంటనే తెస్తే ఎక్కువ వడ్డీ కట్టుకోనక్కర్లేదు. బేంక్‌లో డబ్బులు బైటికి వస్తే ఈ ఖర్చులతో పాటు మన రైలు ఛార్జీలు కూడా తీసుకోవచ్చని సలహా ఇచ్చాడో మేనమామ.

అలా మొదలయ్యింది ‘డెత్ సర్టిఫికెట్’ వేట. మునిసిపల్ ఆఫీసుకు వెళ్లారు. పద్ధతి తెలుసుకున్నారు. విఏఓ నింపి ఇచ్చిన ‘ఫారం 10’లోని వివరాలను నిర్ధారణ పరచి, ఆ ఫారంలో నమోదు చెయ్యబడ్డ వ్యక్తి నిజంగానే మరణించాడని ధ్రువపరచి, జనన మరణ రికార్డులో నమోదు చేసి, ‘ఫలానా వ్యక్తి చనిపోయాడని అన్ని ఆధారాల ద్వారా ధ్రువపరచడమైనది’ అని ఒక సర్టిఫికెట్ తయారు చేసి దాన్ని మరో మునిసిపల్ ఉద్యోగి చేత తనిఖీ చేయించి, కమీషనర్ వారి దివ్య సముఖాన

పెట్టి, దానిపై వారి సంతకం పెట్టించి, రబ్బరు స్టాంపు, సీలు వేస్తే కాని అది 'డెత్ సర్టిఫికెట్' అవ్వదు. అప్పుడు అర్జీ పెట్టుకున్న వారికి అందిస్తారు.

అలా సంపాదించుకొన్న 'డెత్ సర్టిఫికెట్'తో పాటు చనిపోయిన వ్యక్తి ఆస్తి వారసత్వానికి చనిపోయిన వ్యక్తి కుటుంబంలో ఎవరి పేరన 'లీగల్ హెర్ సర్టిఫికెట్' కావాలో నిర్ణయించుకుని, అట్టివారి పేరున ఆ సర్టిఫికెట్ ఇమ్మని కోరుతూ మైనార్టీ తీరిన కుటుంబ సభ్యులంతా సంతకాలు పెట్టి ఎమ్మార్వో గారి ఆఫీసులో దరఖాస్తు పెట్టుకోవాలి. ఎమ్మార్వో చనిపోయిన వ్యక్తి ఆస్తి వివరాలన్నీ వెలికి తీసి, పరిశీలించి, ఆ ఆస్తులన్నింటికి ఈ దిగువన వ్రాయబడ్డ వ్యక్తి లేదా వ్యక్తులు లీగల్ హెర్‌లు అని మరో సర్టిఫికెట్ ఇస్తారు. ఈ పనులు అవ్వడానికి ఎవరో ఒకరు ప్రతీరోజూ ఆఫీసు చుట్టూ తిరగాలి. ఈ విషయం అర్థం కావడానికే వాళ్ళకి వారంరోజులు పట్టింది.

కర్మ అంతా అయిపోయిన నాటి సాయంత్రం ఆ ఊరిలోని వడ్డీ వ్యాపారి ఇంటికి వచ్చి, "బాబు, తమరి నాన్నగారు ఈ ఇంటిని నాకు తనఖా పెట్టి తమ సెల్లి పెళ్ళికి చేసిన అప్పు విషయం తమకు గుర్తుందనుకుంటాను" అన్నాడు.

"అవును తెలుసు" అన్నాడు పెద్ద కొడుకు.

"కానీ ఆ అప్పు తీరలేదని తెలుసనుకుంటాను"

"తెలీదండీ... అంతా నాన్నగారే చూసుకుంటూ ఉండేవారు కదా"

"నిజమే. పెద్ద మనిషి. మాటంటే మాటే. ప్రతీనెలా సొమ్ము తెచ్చి మరీ ఇచ్చేవోరు. ఆరోగ్యం బాగాలేక ఆరు మాసాలుగా వడ్డీ కూడా కట్టలేదు. నేను నాలుగు సుట్లు వొచ్చి చూసాను. డబ్బులు అడగనేక ఎల్లిపోయాను. ఇంతలో ఇలా అయిపోనాది. డబ్బుతో యవ్వారం కదా. పైగా వడ్డీ కూడా రావడం లేదు. మరి మీరు ఈ అప్పు సెల్లు పెట్టాలనుకుంటున్నారో నేదో తెలీదు. మీకా ఇప్పుడు చాలా డబ్బు ఖర్చై ఉంటది. అవసరం కూడా ఉంటది. నాకా నాలుగేళ్ళ నుండి డబ్బు ఈ ఇంటిలో ఇరుక్కుపోనాది. అంచేత అందరి అవసరాలు తీరాలంటే ఈ ఇల్లు వేలం వేసేసి, వచ్చిన డబ్బులో నా వడ్డీ, అసలు పోగా మిగిలినది మీరు

తీసుకుంటే బాగుంటది. మీరేటంటారు?" అని ఆగాడు.

వడ్డీ వ్యాపారి ఎంత సాధారణంగా అన్నా, ఈ మాటలు వడగళ్ళ వానలా కురిసాయి. బాధ ఎక్కువై పోయినప్పుడు భాష తక్కువైపోయినా ఘోషంతా ఒకటి రెండు అక్షరాలలో మాత్రమే వెలికి వస్తుంది కాబోలు.

"ఆ..." అని మాత్రమే ఆగిపోయాడు పెద్దకొడుకు.

"గాభరానేదు. నేను రేపే వేలం వేస్తాననడం లేదు. తమరు మళ్ళీ మాసికాలకి ఎలాగో రావాలికదా. అంచేత మాసికం అయిన తరవాతే ఆ పని కానిద్దాం" అన్నాడు వడ్డీవ్యాపారి.

పెద్దకొడుకు తేరుకుని, "అమ్మతో మాట్లాడి చెప్తాను" అన్నాడు.

ఇంటిని వరద ముంచెయ్యడానికి వస్తున్నప్పుడు చేతులడ్డు పెట్టి ఆపలేనని తెలుసుకున్న వాడిలా "అమ్మా" అని భయంతో వణికిపోతున్న గొంతుతో పిలుస్తూ ఇంట్లోకి వెళ్ళాడు. తల్లికి విషయం వివరించాడు. 'వేలం' మాట విన్న వెంటనే–

"నాకవేం తెలీదురా, నాకవేం తెలీదురా. ఈ ఇల్లు నిలపరా! ఈ ఇంట్లోనే నన్ను కూడా పోనీరా నాయనా?" అంటూ తండ్రిపోయినప్పుడు కూడా ఏడవనంత గట్టిగా బావురుమంది.

బొటాబొటి జీతంలో ఇద్దరు పిల్లలు, భార్యతో పట్నంలో గొర్రెతోకలాంటి గుమస్తాగిరితో, చిన్న వాటాలో అద్దెకుంటూ దారిద్ర్య రేఖ మీద గారడీ వాడిలా అడుగులు వేస్తున్న ఆ ఇంటి పెద్దకొడుకు ఈ పరిస్థితులలో ఏమని ఓదార్చగలడు. ఆ ఇంటిలో సగం వాటా తనకి కూడా ఉందన్న ఆశతో పడుకున్నప్పుడు చంద్రుణ్ణి చూడడానికి చిన్నది, చుక్కల్ని చూడడానికి పెద్దది అయిన పెంకుటింటి కన్నాలలో కనబడే నక్షత్రం లాంటి ఆశ ఉల్కలా తెగి పడినప్పుడు, పట్టుకుంటే చెయ్యి కాలుతుందన్న జ్ఞానం ముందుకి వెళ్ళనీయకుండా, కోల్పోతున్నానన్న స్పృహ నిలవనియ్యని పరిస్థితిలో ఉండి, తనని తానే ఓదార్చుకోలేని వాడు మరొకర్ని ఎలా ఓదార్చగలడు.

తల్లి ఏడుపు విని పక్కింటిలో ఉన్న లెక్కల మేస్టారు "ఏమైంది ఏమైంది" అని పరిగెట్టుకుంటూ వచ్చి వాకిట్లో వడ్డీ వ్యాపారిని చూడగానే విషయం అర్థమైంది కాబోలు ఆ ప్రశ్న ఆపేసారు. ఇంట్లోకి వెళ్ళి పెద్దకొడుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. నోటి లెక్కలు వేసి, నిట్టూర్చారు. కొద్దిసేపు ఆలోచించి "చూడవోయ్, ఇక ఈ ఇంట్లో ఉండవలసింది మీ తమ్ముడు, మీ అమ్మగారే కదా. అంచేత ఒక గది, వరండా అద్దెకు ఇస్తే ఆ సొమ్ము, మీ అమ్మకు వచ్చే పింఛన్‌తో మీ తమ్ముడికి ఒక ఉద్యోగం వచ్చేదాకా వడ్డీ కట్టడానికి సరిపోతుంది. ఆ తరవాత ఒక పద్ధతి ప్రకారం మొత్తం అప్పే తీర్చెయ్యవచ్చు. ఇలా అయితే ఇల్లు దక్కుతుంది" అన్నారు.

ఈ మాటలతో తల్లికి, కొడుకుకి కొంత ఊరట కలిగింది.

లెక్కల మాష్టారు, పెద్ద కొడుకూ వడ్డీ వ్యాపారికి ఈ విషయం చెప్పి వేలం వెయ్యవద్దని కోరారు. అంతా విని "మాష్టారు ఇన్ని లంకెలతో యాపారం సాగదండి. ఈ ఖాతాలో ఇప్పటికే సానా డబ్బు ఇరుక్కుపోయిందండి. నెలరోజులలో కొంత మొత్తం చేతిలో పడాలి. ఆపై ప్రతీ నెలా వడ్డీతో పాటు అసలులో కనీసం ఐదు వందలైనా కట్టాలి. అది మీకు కుదరకపోతే నెల రోజులలో ఈ ఇల్లు వేలం వెయ్యక తప్పదు. మరి మీరే ఆలోచించుకుని చెప్పండి" ఇదే ఆఖరి మాట అన్నట్లు అని వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి చాలా సేపు మాష్టారితో అన్నదమ్ములిద్దరు ఆలోచించారు. మాసికం నాటికి లింగమూర్తికి, వడ్డీ వ్యాపారికి డబ్బు ఇవ్వాలి. బేంక్ ఎకౌంటులలో ఉన్న డబ్బంతా చేతికి వస్తేకానీ ఇల్లు నిలబడదు. ఆ డబ్బు చేతికి అందాలి అంటే 'డెత్ సర్టిఫికెట్', 'లీగల్ హెర్ సర్టిఫికెట్' రావాలి.

* * *

ఈ తిరుగుడు పని నిరుద్యోగి అయిన రెండో కొడుక్కి అప్పజెప్పి అందరూ వెళ్ళిపోయారు.

'డెత్ సర్టిఫికెట్ కోసమా, కన్సర్న్డ్ క్లర్కు సీట్‌లో లేరండి'

'ఎప్పుడొస్తారో తెలీదండి. రేపు ట్రై చెయ్యండి.'

'మీరొస్తారని ఆయన మరే పనులు పెట్టుకోకుండా మీ కోసం ఎదురు చూడమన్నారు కాదు, ఇంకాను?'

'పది గంటలకి వస్తారేమో అంటే, పది గంటలకే వచ్చేస్తారా? ఏ ఊరుసార్ మన్ది?'

'చాలాసార్లు వచ్చాను, వచ్చాను అని చెప్పుకుందికి అదేమైనా పెద్ద క్వాలిఫికేషనా అంట?'

'చూసారా ఇక్కడెన్ని ఫైల్సున్నాయో, మరి పని చేస్తున్నామా? లేదా?'

'ఎప్పుడిస్తామా? మీ ఫైలు పని పూర్తి అయిన వెంటనే పువ్వుల్లో పెట్టి మీ డెత్ సర్టిఫికెట్ మీకిచ్చేస్తాం'

'ఇక వెళ్లండి. మీరిలా వచ్చి మమ్మల్ని డిస్టర్బ్ చేస్తుంటే మరి మేం పనిచేసేది ఎట్టాంట!'

'ఒక వారం రోజులలో రండి'

'నేను చెయ్యవలసింది అయిపోయింది, కమీషనర్ గారు కేంపెళ్ళారు. రేపు రండి'

'బేడ్‌లక్కండి. వచ్చారు కానీ ఇప్పుడే బయటకు వెళ్ళారు'

'రేపురండి. నేను సంతకాలు చేయించేస్తాను'

'రమ్మంటే చేతులూపుకుని వచ్చేస్తారు. మీకు పనులెలా జరిపించుకోవాలో తెలీదా?'

ఇలాంటి జవాబులు విని విని విసిగిన రెండో కొడుకు ఇంక ఆవేశం ఆపుకోలేక ఒక రోజు, "నాకు తెలుసండి, నాకు చాలా విషయాలు తెలుసు. ఎన్ని రోజులు ఇలా తిరిగినా మా నాన్నగారి డెత్ సర్టిఫికెట్ మామూలుగా రాదు. ఇక్కడ డబ్బు ఇవ్వందే ఏ పనీ జరగదు. కానీ ఇవ్వడానికి కావాల్సిన డబ్బులేదు. ఊర్లో ఇక అప్పు పుట్టడం లేదు. అందుకే ఇలా మీ ఆఫీసు చుట్టూ తిరుగుతున్నాం. ఇంకో రెండు రోజులలో మీరిచ్చే డెత్ సర్టిఫికెట్ వస్తేకానీ మా ఇల్లు నిలబడదు.

ఆపై మాకు రోజు కూడా గడవదండి" అన్నాడు.

ఆఫీసులో చుట్టూ ఉన్న అందరు నోట మాట రాక వారి వారి సీట్లలో కదలలేక అతుక్కుపోయినట్లు కూర్చున్నారు. అప్పుడే అక్కడికి వచ్చిన మునిసిపల్ కౌన్సిలర్ గుమ్మంలోనే ఆగిపోయాడు.

"మీరివ్వవలసిన ఓ కాగితంపై రేపటి మా బ్రతుకు రెపరెపలాడుతూ రోడ్డు ప్రక్క విస్తరాకులా పడి ఉందని మీకు తెలుసా? రోజూ ఆఫీసుకొచ్చి మీరు కదపని ఈ కాగితాలతో మనుషుల బ్రతుకులు ఆధారపడి ఉన్నాయండి. మీరు మనుషులమని అనుకుంటే దయచేసి వాటితో ఆడుకోకండి" అని అందరివైపు ఒక్కసారి చూసి, నిరాశతో వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు.

రెండోనాడు ఉదయం పెద్దకొడుకు, కొద్దిమంది దగ్గరవాళ్ళు మాసికానికి వచ్చారు. రావలసిన డెత్ సర్టిఫికెట్ రాలేదు. కానీ ఇవ్వవలసిన డబ్బుకి పెట్టిన గడువు రేపటితో తీరిపోతుంది. ఇక ఎల్లుండి ఇల్లు వేలం వెయ్యక తప్పదన్న విషయం అందరికీ అర్థం అయ్యింది. మాసికం జరుగుతోంది. ఇల్లు శ్మశానంలా ఉంది. తల్లి, ఇద్దరు కొడుకుల గుండెలు ఎంతకీ రాని వర్షానికి ఎదురుచూసి ఎండిపోయి, బీటలు వారడానికి సిద్ధంగా ఉన్న నేలలా ఉన్నాయి. వరదలో కొట్టుకుపోతున్నవాళ్ళకి చెయ్యందిస్తే మనం కూడా కొట్టుకుపోతామేమోనన్న భయంతో ఒడ్డున నిలబడ్డవాళ్ళలా భయం భయంగా అంటీముట్టనట్టు ఆచితూచి మాట్లాడక తప్పనప్పుడు మాత్రమే మాట్లాడుతున్నారు మిగతావారంతా.

మధ్యాహ్నం రెండు గంటలయింది. అందరి భోజనాలు అయ్యాయి. మర్నాడు వేలం. ఈ ఇంట్లో అది ఆఖరి భోజనం అన్న బాధతో తల్లీకొడుకులకి ముద్ద దిగలేదు. చేతులు కడుక్కుని లేచారు. వచ్చినవాళ్ళు 'హమ్మయ్య, ఇక వెళ్ళవచ్చు' అని గుండెలమీద భారం ఏదో దిగిన వాళ్ళలా వెళుతున్న వాళ్ళని సాగనంపడానికి అన్నదమ్ములిద్దరూ వసారాలోకి వచ్చారు.

"అయ్యా రేపెలాగో ఇల్లు వేలం వేస్తారు. అది అవగానే నాకు రావలసిన డబ్బు వడ్డీతో ఇప్పించెయ్యండి" అని లింగమూర్తి ఖచ్చితంగా చెప్పేశాడు.

అప్పుడే గుమ్మంలో అడుగుపెడ్తున్న కౌన్సిలర్ రెండో కొడుకుని గుర్తుపట్టాడు. ఆ కౌన్సిలర్ సరాసరి రెండో కొడుకు దగ్గరికి వచ్చి "ఇదిగోనండి, మీరు అప్లికేషన్ పెట్టుకున్న మీ నాన్నగారి డెత్ సర్టిఫికెట్" అని అందించి–

"ఇన్నాళ్ళు ఆలస్యం అయినందుకు నేను ఎమ్మార్వో గారితో మాట్లాడాను. మీ 'లీగల్ హేర్ సర్టిఫికెట్' గురించి. అది కూడా మీకు ఒక్క నాలుగు రోజుల్లోనే ఇచ్చేస్తామన్నారు. వెంటనే వెళ్ళి అర్జీ పెట్టుకోండి" అని చెప్పి వెళ్ళిపోయాడు.

ఆ డెత్ సర్టిఫికెట్‌తో బ్యాంక్‌లో ఉన్న డబ్బుకు జీవం వస్తుంది. అప్పుడు ఆ డబ్బు చేతికి వస్తుంది. దానితో అప్పులు తీరుతాయి. ఇల్లు వేలం వెయ్యక్కర్లేదు.

చేతిలో ఉన్న డెత్ సర్టిఫికెట్‌ను చూస్తూ ఆశ్చర్యం, ఆనందం ఆపుకోలేని రెండో కొడుకు "అమ్మా, డెత్ సర్టిఫికెట్ వచ్చేసిందమ్మా" అని గట్టిగా ఇంట్లో వున్న తల్లికి వినబడేలా అరిచాడు. డెత్ సర్టిఫికెట్ వచ్చిందన్న విషయం విన్న ఆ ఇంటిల్లపాది మొహంలో ఆనందాశ్చర్యాలు కనిపించాయి.

*

*(ఈ కల్పిత కథ మున్సిపల్ కమీషనర్ ఆఫీసులో క్లర్కుల నుండి కమీషనర్ దాకా, వారి పైనున్న అధికారులనుండి ప్రభుత్వ కేబినెట్ నడుపుతున్న ముఖ్యమంత్రి దాకా అందరిని ఉద్దేశించి రాసినది. ఇందులో పాత్రలు అన్ని ఊర్లలో ప్రతిరోజూ కనిపించేవే. డెత్ సర్టిఫికెట్ రావడం బర్త్ సర్టిఫికెట్ రావడం కంటే ఆనందం కలిగించే విషయంగా మార్చిన వారందరికీ జోహార్లు.)*

**వృత్తిపరంగా, సామాజికంగా, కుటుంబపరంగా, ఎన్నో కష్టనష్టాలకుకోర్చి పల్లెటూళ్ళలో ఉపాధ్యాయులుగా, ఉపాధ్యాయినిలుగా పనిచేస్తున్న గురువులందరకి నమస్కరిస్తూ...**

# మా ఊరి మంత్రిగారి శతకం

ప్రయోగాలు చేసీ చేసీ అంతిమ ఫలితం కోసం ఎదురుచూస్తున్న శాస్త్రవేత్త మనఃస్థితిలా ఉంది ఉదయం నుంచి నా పరిస్థితి. సాధారణంగా ఒక శాస్త్రవేత్త ఎదురుచూసే ప్రయోగ ఫలితాలు నిజానికి జీవన్మరణ సమస్యలు కావు. అవి ప్రచురించడానికి వీలయ్యే ఫలితాలు, వాటి ప్రచురణ వల్ల వాళ్ళకు వచ్చేది పేరు ప్రతిష్టలు, పదవులు, కొద్దిపాటి ఆర్థిక ప్రయోజనాలు మాత్రమే. కాని నేను చేసిన ప్రయోగానికి ఫలితం నా చావు కావచ్చు. ఈ రిస్కు తెలిసే చేశాను.

***

నేను మా ఊరిలో సోషల్ మాస్టారిని. చరిత్ర పాఠాలు 30 ఏళ్ళుగా చెప్తున్నాను. రిటైర్ అయ్యి రెండేళ్ళు అయ్యింది. రిటైర్ అయిన కొత్తలో ఏమీ తోచలేదు, కాని కొద్ది వారాలలో ఖాళీగా ఉండడం అలవాటయిపోయింది. 'మీ విశ్రాంత జీవితాన్ని అవిశ్రాంతంగా ఆనందించండి' అన్న ప్రకటనకి సరిపోయేలా ఉండేది నా దినచర్య. ఉదయాన్నే లేవడం, కాఫీ తాగి నలుగురు స్నేహితులతో కలిసి మార్నింగ్‌వాక్‌కి వెళ్ళడం, పేపర్ చదవడం, నచ్చిన పుస్తకం చదవడం, భోజనం, నిద్ర, సాయంత్రం తోటలో పని, షికారు, అప్పుడప్పుడు సినిమా చూడడం, రాత్రి భోజనం తరవాత టీవీ చూడడం, నిద్రపోవడం... అలా సాగిపోతున్న నా జీవితంలో ఒకరోజు రాత్రి టీవీ ఆపి నిద్ర పోవడానికి సిద్ధమవుతుంటే దబదబమని తలుపు చప్పుడైంది. కాలింగ్‌బెల్ ఉన్నా ఇలా రాత్రి తలుపు కొట్టేవాళ్ళు ఎవరై ఉంటారా అని ఆశ్చర్యపోతూ బయట లైట్ వేసి తలుపు తీశాను. ఎదురుగా ఒక వయసు మళ్ళిన పల్లెటూరి మనిషి.

"దప్పికగా ఉంది బాబు, కాసిన్ని నీళ్ళు పోస్తారా?" దీనంగా అడిగాడు.

"సరే" అన్నాను, గుమ్మానికి ఆనుకుని ఉన్న అరుగు మీద కూర్చోమని చేత్తో సైగ చేస్తూ. అతను కూర్చున్నాడు. నేను లోపలికి వెళ్ళి నీళ్లు తెచ్చి ఇచ్చాను. తాగి, రెండు చేతులతో దణ్ణం పెట్టి.

"శానా అలిసిపోనాను బాబు. ఈ రేతిరికి ఈడే ఈ అరుగుమీద తొంగుని ఎవకల మా వూరు ఎల్లిపోతాను బాబూ" అని అభ్యర్థించాడు. అతన్ని తేరిపారి చూసాను. వయసు చెప్పడం కష్టం. ముసిలివాడు. బాగా అలసిపోయినట్లు ఉన్నాడు. దగ్గర్లో ఏదో పల్లెటూరి నుండి వచ్చుంటాడు, ఆఖరి బస్సు అందుకోలేకపోయి ఉంటాడు. అరుగు మీద పడుకొంటే నాకు వచ్చిన నష్టము కాని, కష్టము కాని ఏమీలేదు.

"సరే. ఏమైనా తిన్నావా" అని అడిగాను.

"నేదు బాబు" అన్నాడు.

లోపలికి వెళ్లి రెండు అరటి పళ్ళు ఒక గ్లాసుడు మజ్జిగ తెచ్చి అతని ముందు పెట్టాను. అతను వాటిని ముట్టలేదు. తినమని గట్టిగా చెప్పి నువ్వు తింటే కాని కదలను అన్నట్టు ఎదురుగా ఉన్న అరుగు మీద కూర్చున్నాను.

రెండు నిముషాల తరవాత...

"సాన పొద్దుపోనాది మీకు...." అన్నాడు నా నిద్ర తన వల్ల చెడినందుకు కొద్దిగా బాధపడుతూ.

"నువ్వు తినడం పూర్తి అయితే వెళతాను" అన్నాను తొందరగా తినమని సూచిస్తూ.

"నా మనసేటి బాగోనేదు బాబు. తమరెల్లి తొంగొండి బాబు" అన్నాడు.

వెంటనే లేచి వెళ్లిపోదామనుకొన్నాను కాని, కష్టంలో ఉన్నానని చెప్పిన మనిషిని ఊరడించకుండా వెళ్ళిపోవాలనిపించలేదు.

"ఏమయింది?" అని అడిగాను సానుభూతితో.

"ఏటి సెప్పను బాబు, మా తాతముత్తాతలు కూలినాలి సేసుకొని పుస్కరానికొక ఎకరం పొలం కొని రైతులయ్యేరు. నా కాడికొచ్చేపాటికి పదెకరాల పొలంతో సిన్న యవసాయదారుడిగా నిలబడినాను. ఒక్కగానొక్క కొడుక్కి సదువు సెప్పించి ఉజ్యోగస్తుడ్ని సెయ్యాలనుకొన్నాను బాబు. సదువు మీద శానా ఆశ పెట్టుకొని నా కొడుక్కి కాలేజి దాక పొలం తాకట్టు మీద తాకట్టెట్టి సదివించాను బాబు. సదువై రెండేళ్ళయింది ఉజ్జోగం రానేదు బాబు. అప్పులోల్లకి నా కొడుక్కి ఉజ్జోగం వస్తుందని ఆస పోయింది. పొలం అమ్మి బాకీ తీర్చమన్నారు. మనూర్లో ఉన్న మంత్రి గారు మా కులపోడే. ఆయన కాడ కెళ్ళి, కాళ్ళ మీద పడి, నా కొడుక్కి ఏదో ఒక ఉజ్జోగం ఏయించమని బతిమాలుకొన్నాను. లచ్చ రూపాయలు లంచమియ్యమన్నారు బాబు. నానేడనుంచి తేవాల అన్నాను. పొలం అమ్మేయ్యమన్నారు. తాతల కాడి నుంచి వస్తున్న పొలం, కాని ఒక్కసారి నా కొడుక్కి ఉజ్జోగం వస్తే, ఆడు ఆడి పిల్లలైనా నాలా మట్టిపిసుక్కో నక్కర్లేదని పొలం అమ్మడానికే ఒప్పుకున్నాను. నీకే కష్టం వద్దు అని మంత్రిగారే తన మడుసులతో నా పొలం కొనిపిచ్చి అప్పులు తీరగా లచ్చ మిగిలిందని తీసుకొన్నారు. ఉద్యోగం రేపొస్తాది, మాపొస్తాదని ఆర్నెల్లు తిప్పారు బాబు. ఇయాల నాను, నా కొడుకు ఎల్లి 'బాబూ సచ్చిపోతున్నాం. ఏదో ఒక దారి సూపండి' అని బతిమాలినాం. "ప్రయత్నించాం, పనికాలేదు, ఇక మరి రాకు అనేసేరు బాబు. మరి లచ్చ ఇచ్చినాను కదా బాబు అంతే ఎవురికిచ్చినావురా అని కసిరి పొమ్మన్నారు. ఇది నాయం కాదని అంటే, నాకు నాయం చెప్తావురా, లంజాకొడకా లచ్చ లేదు గిచ్చ లేదు నీ దిక్కున్నకాడ సెప్పుకో అని బయటకు తోసేసేరు. నా మొహం సూడలేక నా కొడుకెటో ఎల్లిపోయాడు బాబు. పొలం పోయే, కొడుక్కి ఉజ్యోగం రానేదు. మాకిక బతుకు నేదు. మంత్రి మా కులపోడు. మాకుజ్జోగం ఎందుకు రాదని ఇగ్రవీగాను బాబు మొదటికాడ్నించి. నాకు... నాను..." అని ఇక మాట రాక ఆగిపోయాడు.

"అయ్యో..." అని అన్నాను కొంతసేపు పోయాక. కాని నా మాట నాకే వినిపించలేదు.

"మా కులపోడే కాని మా సెడ్డ అన్నేయాలు సేస్తున్నాడు బాబు ఈ మంత్రి

గోరు. తమలాంటి వోళ్ళు గాంధీతాతలా మాలాంటి సదువు రానోళ్ళని ఆదుకోవాలి బాబు" అన్నాడు దీనంగా. ఒక్కొక్క మాట గుండె లోతుల్లోంచి వచ్చినట్టు ఉంది.

ఒక్కసారిగా నాకూ గాంధీ మహాత్ముడికి పోలికేమిటి అని అనిపించింది. నాకు గాంధీకి పోలిక లేకపోయినా, గాంధీ సినిమాలో బ్రిటీష్ వాళ్ళ కోసం చంపారణ్‌లో నీలిమందు (ఇండిగో) పంట వేసి నష్టపోయిన ముసలి రైతుకి, నా ముందున్న రైతుకి తేడా లేదనిపించింది. బ్రిటీష్ భూస్వాముల నుండి చంపారణ్‌లో రైతుల్ని కాపాడమని గాంధీని కోరిన తీరులో వుంది ఈ ముసలి రైతు ఆవేదన.

తినమని అతన్ని మరీ బలవంత పెట్టలేక, లోపలికెళ్లి తలుపేసుకొన్నాను. పక్క మీద పడుకొని నిద్ర పోవడానికి ప్రయత్నించినా నిద్ర పట్టలేదు. గాంధీ సినిమాలో ముసలి రైతు దృశ్యం కళ్ళముందు మెదులుతూనే ఉంది. ఎప్పుడో తెల్లవారు ఝామున నిద్ర పట్టింది. ఒక్క సారిగా గాంధీ సినిమాలో చంపారణ్‌లోని ముసలి రైతుతో 'ఏది వీలైతే అది చేస్తాను' అన్న గాంధీ మాట నన్ను తట్టి లేపినట్టయ్యింది. లేచి చూస్తే తెల్లవారిపోయింది. అతను లేచి వెళ్ళిపోయాడేమో అనుకున్నాను. గబగబా లేచి ఇంటి ముందు అరుగు మీద పడుకొన్న ముసలి రైతుతో 'ఏది వీలైతే అది చేస్తాను' అన్న మాట చెప్పాలని అనిపించింది. వెంటనే పరుగులాంటి నడకతో వెళ్ళాను. అతను ఇంకా అక్కడే పడుకొని నిద్రపోతున్నాడు. హమ్మయ్య, అతనికి చెప్పాలన్న మాట చెప్పగలుగుతానని అనిపించి, ఆనందం వేసింది. చప్పట్లు కొట్టి అతన్ని లేపడానికి ప్రయత్నించాను. మంచి నిద్రపోతున్నాడేమో, లేవలేదు. లోపలికి వెళ్లడానికి వెనుతిరుగుతుంటే నిన్న రాత్రి ఇచ్చిన పళ్లు, మజ్జిగ కనిపించాయి. చేతితో తట్టి లేపబోయాను. అతని శరీరం చల్లగా తగిలింది. ఒళ్ళు ఝల్లుమంది. ఒక్కసారి వెనక్కి జరిగి పక్కనున్న స్తంభాన్ని ఆనుకొని మెల్లిగా అరుగుమీద చతికిలపడ్డాను.

'మా కులపోడే కాని మాసెడ్డ అన్నేయాలు సేస్తున్నాడు బాబు ఈ మంత్రిగోరు. తమలాంటి వాళ్లు గాంధీ తాతలా మాలాంటి సదువు రానోళ్ళని ఆదుకోవాలి బాబు' అన్న మాటలు గుర్తొచ్చాయి. 'ఏది వీలైతే అది చేస్తాను' అన్న మాటలు నాలో నేనే పదేపదే అనుకొన్నాను.

***

మా ఊరి మంత్రి న్యూస్ పేపర్లలో రాసిన, సినిమాల్లో చూపించిన రాజకీయ నాయకుడి లక్షణాలన్నీ కలిగున్నవాడే. అతన్ని ఎదిరించడం మాట అలా ఉంచి, కనీసం ఎదురుపడి మాట్లాడడం కూడా నావల్ల కాదే. అది జరిగే పనికాదు. హిస్టరీ మాస్టారిగా పాఠం చెప్పడం తప్ప గట్టిగా నలుగురితో మాట్లాడడం కూడా రాదు. నాకు ఆ మంత్రి చిన్ననాటి నుంచి మా ఊరిలో అందరికి బాగా పరిచయం వున్నవాడే. స్కూల్లో ఇతనికీ పాఠాలు చెప్పినవాడినే. నాకు తెలిసినంత వరకు అతను ఒక అనాథ... ఆ రోజుల్లో మా వూరిలో ఉన్న ఒకే ఒక్క కాంపౌండర్ ఇంటి పక్కన పాకలో ఉండేవాడు. ఆ కాంపౌండర్ దయవల్ల, కొద్దిగా చదువుకొన్నాడు. అతని వల్లే రాజకీయాల్లో ప్రవేశించాడు. కొన్నేళ్ళ తరవాత అతని మీదే పోటీ చేసి గెలిచి రాజకీయాల్లో నిలదొక్కుకున్నాడు. ఎక్కడైనా కనిపించినప్పుడు 'నమస్కారం మాస్టారు' అంటాడు. నా రిటైర్మెంటు ఫంక్షన్‌కి ముఖ్యఅతిథిగా వచ్చాడు. తాను దండలు వేయించుకొని, నాకో దండవేసి వెళ్ళిపోయాడు. అంతకుమించి అతని రాజకీయ జీవితం గురించి నాకు తెలియదు.

***

పోలీసులు వచ్చారు. వివరాలు తీసుకొని శవాన్ని తీసుకెళ్ళిపోయారు. నాలో అలజడి మొదలయింది. ఒక్కొక్కసారి నా ఆలోచనలు తుఫానులా నన్ను చుట్టుముడుతున్నాయి. ఆకలి, నిద్ర సరిగ్గా లేవు. మార్నింగ్ వాక్‌కి కూడా వెళ్ళలేకపోతున్నాను. ఇంట్లో, బయటా నాలోని అలజడిని గమనించారు. చనిపోయిన ముసలివాడి గురించి మరిచిపోమన్నారు మిత్రులు. 'అతడి ఆఖరి మాటలు నన్ను వెంటాడుతున్నాయి. ఏదో ఒకటి చేస్తే కాని మనశ్శాంతి ఉండదని'. అన్నాను. 'ముఖ్యమంత్రికే ఈ మంత్రంటే భయం. ఇతడు తన వాళ్ళందరికీ పదవులు కట్టబెట్టి జిల్లాని తన గుప్పిట్లో పెట్టుకొన్నాడు. నీలాంటి సామాన్యులు అతని దగ్గరికి కూడా వెళ్ళలేరు. అలాంటి వాడిని ఎదిరించి ఈ బీదాబిక్కీ జనానికి ఏదో చేద్దామని కిందా మీదా పడకు' అని నచ్చచెప్పారు. అయినా రాజీపడలేకపోయాను.

***

**గురుదక్షిణ**

నేను ఏమీ చెయ్యలేకపోయినా మంత్రి గురించి పూర్తిగా తెలుసుకోవాలన్న కోరిక పెరిగింది. నాకు తెలిసిన వాళ్ళందరిని అతని గురించి తెలిసింది చెప్పమన్నాను. వాళ్ళు చెప్పినవన్నీ ఒక పుస్తకంలో రాసుకోవడం మొదలుపెట్టాను. అతని వల్ల ఎవరెవరు ఎలా మోసపోయారో, ఎలా డబ్బులు చేసుకున్నారో, కాంట్రాక్టు తెప్పించుకున్నారో, బదిలీలు చేయించుకున్నారో, ఉద్యోగాలు సంపాదించుకున్నారో, పోలీసు కేసుల్లోంచి ఎలా బయటపడ్డారో, బ్యాంకు లోన్లు ఎలా మంజూరు చేయించుకున్నారో, ఇళ్ళ స్థలాలు చేజిక్కించుకున్నారో... కొంత మంది స్వంత అనుభవాలు, మరికొంతమంది విన్న విషయాలు నాకు చెప్పారు. తెలుసుకుంటున్నకొద్దీ ఆ మంత్రి గురించి ఇంకా ఇంకా తెలుసుకోవాలని పించింది. అతను అరకొరగా చేస్తున్న మంచిపనులు అతడి అన్యాయాల చీకటి కొండల మీద అక్కడక్కడ చిరు దీపాల్లా మెరుస్తున్నాయి. పైపైన చూసేవాళ్ళకి ఇతను చేస్తున్నదంతా ప్రజా సేవలాగే ఉంటుంది. మధ్యతరగతి వాళ్ళ అవసరాలు తీరుస్తానంటూ వీలైనంత రాబట్టుకుంటాడు, బాగా డబ్బున్న వాళ్ళతో పూర్తి వ్యాపార పరంగా వాటా వ్యవహారం నడుపుతాడు. బాగా నష్టపోయే వాళ్ళంతా చిన్నాచితకా వాళ్ళే. చిన్న చిన్న చలిచీమలు కూడబలుక్కొని పెద్ద పెద్ద పాముల పనిపడతాయని చదివాను కాని, ఈరోజుల్లో అది జరగడం లేదు.

అడవిలో పులి తన ఆహారమైన లేడి కోసం పరిగెత్తాలి. లేడి తన తిండి తను తింటూ, పులికి అందనంత వేగంగా పరిగెత్తాలి. లేడి కంటే వేగంగా పరిగెత్తకపోతే పులి ఆహారం దొరకక ఆకలితో చచ్చిపోతుంది. పులికందనంత వేగంగా పరిగెత్తకపోతే లేడి పులికి దొరికి చచ్చిపోతుంది. ఇది అన్ని జంతువులకి వర్తిస్తుంది. ఇందులో రిజర్వేషన్స్ లేవు. ఇది అడవి న్యాయం. అయినా సరే అడవిలో పులులు, లేళ్ళు ఒక సమతూకంలో ఉంటాయి. ఎందుకంటే ఆకలి కడుపుకి కావలసిన దాని కోసం మాత్రమే జంతువులు వేటాడుతాయి.

కాని మనుషులకలా కాదు. రేపటికి దాచుకోవాలి. కొడుకులకి, మనవలకి తరతరాల వాళ్ళకి దాచిపెట్టాలి. అందుకోసం వీలైనంత, వీలైనచోటంతా, వీలైన వాళ్ళందరి దగ్గర, అవకాశాలు సృష్టించి మరీ దోచుకోవాలి. ఈ డబ్బు వేటలో అందరూ అందరికీ ఆహారమే. ఏ ధర్మానికి కట్టుబడక తన స్వార్థానికి మాత్రమే

బ్రతుకుతున్న వాళ్ళకి – ఒక ధర్మానికి కట్టుబడ్డ వాళ్ళని దోచుకోవడం చాలా సులభం. మావూరి మంత్రి ఈ కోవకి చెందినవాడు. నోట్ల కోసం, ఓట్లకోసం మాత్రమే బ్రతుకుతున్న మనిషి. వాటి కోసం అనుక్షణం సంపాదించడమే అతని ధ్యేయం. అందుచేత, తన కులస్థులైనా, మరో కులస్తులైనా, తరతమ భేదాలు లేకుండా ఎవరినైనా ఎలాగైనా దోచుకోగలడు. ఇవన్నీ నాతో మాట్లాడిన వాళ్ళందరికి అనుభవంలో వున్న విషయమే. కాని సమాజం ఈ విషయం తెలియనట్టు ప్రవర్తిస్తుంది. మంత్రిగారు ఎంతో ప్రజాసేవ చేస్తున్నాడని అంటారు.

మా జిల్లాకి మంత్రి వచ్చినప్పుడల్లా ఏదో ఒక ఊరిలో ఎవరో ఒకరు ఆయనకు సన్మానం చేస్తుంటారు. మా జిల్లా ఎడిషన్‌లో మంత్రి ఫోటోలతో, బిరుదులతో, పొగడ్తలతో వార్తల్లో కనిపిస్తుంటాడు.

అతనిని ఎదిరించే బలం, బలగం నాకు లేదు. అలాగని మరణించిన ముసలి రైతుకి నా మనసులో నేను ఇచ్చిన మాట మరిచిపోలేక పోతున్నాను. ఆ మాట నన్ను వెంటాడుతున్నది. మా ఊరి మంత్రి తన ప్రజలని చెప్పుకొంటున్న వాళ్ళనే పదవి చాటున మోసం చేసి పెద్దమనిషిగా సమాజంలో తిరుగుతున్నాడన్నది నిజం. ఈ నిజాన్ని నిజంగా నిజమని ప్రజలని నమ్మించగలనా? వందల ఏళ్ళ క్రిందట పాలించిన రాజుల చరిత్రల్ని, ఎన్నో ఏళ్ళు వేలమంది విద్యార్థులకి పాఠాలుగా చెప్పాను. ఎదురుగా బ్రతికే ఉన్న బలమైనవాడి గురించి, వాడి నిజమైన హీన చరిత్రని ఈ ప్రజలకి ఎలా చెప్పాలి? ఇలాంటి ఆలోచనలతో సతమతమవుతున్న నన్ను పాత పేపర్లు కొనుక్కొనే వాడి కేక వాస్తవంలోకి తీసుకొచ్చింది. నా దృష్టి వాడి సైకిల్‌కి కట్టి ఉన్న పేపర్ల మీద పడ్డది.

“కిలో ఎంత?” అని అడిగాను.

“నాలుగు రూపాయలు”

“ఎన్ని కిలోలున్నై నీ దగ్గర?” అన్నాను.

“నా దగ్గర ఎన్ని వుంటే ఏంటండి? మీ దగ్గర ఎన్ని నెలల పేపర్లున్నాయో చెప్పండి. ఎన్ని కిలోలుంటాయో నేను చెప్తాను” అన్నాడు, ఇంత చిన్న విషయం తెలీదా అన్నట్లు.

"నీ దగ్గర ఉన్న పేపర్లు కొనాలని అడుగుతున్నాను. నా దగ్గర అమ్మడానికి పేపర్లు లేవు"

"నా దగ్గర మా సేటు కొంటాడు. మీరు కొనడం ఏమిటండి?"

"నాకు పాత పేపర్లు కావాలి. ఎన్ని నెలల క్రిందటివి ఉన్నా నాకు కావాలి. అమ్ముతావా?"

"ఉన్నాయండి. కిలోకి రెండు రూపాయలు ఎక్కువ ఇస్తే ఇస్తానండి"

"సరే" అన్నాను. అతని దగ్గర ఉన్న పేపర్లన్నీ కొన్నాను. ఒక వారం రోజులలో మరిన్ని పాత పేపర్లు తెచ్చి అమ్మాడు.

ప్రతీ పేపర్లో మావూరి మంత్రి గారి గురించి రాసినవి, ఆయన అన్న మాటలు వెతికి, వాటిని కట్ చేసి ఒక వరసలో పెట్టాను. రెండు వారాల్లో అన్ని పేపర్లలో ఉన్న మంత్రి విశేషాలని, హామీలని, వాగ్దానాలని ఒక పద్ధతిలో ఏర్పాటు చేసాను. వీటి వల్ల అతడి గురించి ఇంకా బాగా తెలిసింది. ఏ రోజు వార్తలు ఆ రోజే చదవడానికి, వినడానికి బాగుంటాయి. వెనక్కి వెళ్ళి ఆయన చెప్పిన మాటలని, ఇచ్చిన హామీలని, వాగ్దానాలని ఒక వరసలో పెట్టి చూస్తే మంత్రి ఎంత తెలివి తక్కువగా మాట్లాడాడో అందులో ఎన్ని శుష్క వాగ్దానాలో తెలిసింది. అలాంటి వాటిని ఒక వంద వార్తలని, వంద హామీలని, వంద వాగ్దానాలని ఒక పద్ధతిలో చరిత్ర చదివిన అనుభవంతో పెట్టాను. ఇవన్ని ఎన్ని ఉన్నా మంత్రి నిజ స్వరూపం తెలియాలంటే ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న సమాచారం కావాలి. సమాచార హక్కు (రైట్ టు ఇన్ఫర్మేషన్) చట్టం కింద పది రూపాయలు కడితే ప్రభుత్వం వారు ప్రజలు అడిగిన వివరాలు ఇస్తారని డాక్టర్ చెలికాని రావు గారు చెప్పినట్టూ, ప్రజలందరినీ ఈ చట్టాన్ని చక్కగా మంచి పనులకి వాడుకోమని కోరినట్టూ, వార్తలలో వచ్చిన విషయం గుర్తుంది. 'ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థలకి చెందిన రికార్డులు, డాక్యుమెంట్లు, సర్క్యులర్లు, ఉత్తర్వులు, లాగ్‌బుక్స్, కాంట్రాక్టు రిపోర్టులు మొదలైనవన్నీ ఈ సమాచార హక్కు చట్టం పరిధిలోనికే వస్తాయి' అని చదివాను. నాకు మరో మంచి మార్గం కనిపించింది.

మావూరి మంత్రిగారి ప్రజా సేవ గురించి ఒక పుస్తకం వ్రాస్తున్నానని, అందుకు ఆయన ఇరవై ఏళ్ళ రాజకీయ జీవితంలో మండలంలో, జిల్లాలో, రాష్ట్రంలో ఆయన పేరుతో, సంతకంతో ఉన్న కాగితాలు, అర్జీలు, సిఫారసు పత్రాలు అన్నింటిని నాకు పంపమని వివిధ ప్రభుత్వ విభాగాల వారికి వివరంగా స్వంత ఖర్చుతో అర్జీలు పంపాను. కొద్ది రోజుల్లోనే అడిగిన వివరాల ఫోటో కాపీ ఇవ్వడానికి ఎంత సొమ్ము కట్టాలో తెలిపే వందలకొద్దీ ఉత్తరాలు వచ్చాయి. వెంటనే వాటికి తగిన డబ్బు పంపాను. ప్రభుత్వం నుంచి మంత్రి ఎప్పుడెప్పుడు ఎక్కడెక్కడ పెట్టిన సంతకాలతో, చేసిన శంకుస్థాపనలు, మంత్రి చుట్టూ ఉన్నవారి పేరుతో చేపట్టిన కాంట్రాక్టుల వివరాలు రోజూ రావడం మొదలైంది. వాటన్నింటిని ఒక పద్ధతిలో పెడుతుంటే మంత్రిగారి రహస్యాలు అచ్చులో ప్రభుత్వ ఫైళ్ళల్లో ఇన్నేళ్ళుగా దాగి ఉన్నవి తిరుగులేని సాక్ష్యాలుగా కనిపించాయి. విడివిడిగా ఒక్కొక్క విషయం చూస్తే పెద్ద తప్పుగా కనిపించదు సరికదా ఏదో పెద్ద ప్రజాసేవ చేస్తున్నట్టే అనిపిస్తుంది. ప్రతీ రెండేళ్ళకి కట్టిన బడినే మళ్లీ కడుతూ, వేసిన రోడ్డే వేస్తూ కాగితాలకే పరిమితమైన కట్టడాలు ఒక వరసలో పెడితే బాహాటంగా మంత్రి చేస్తున్న దోపిడీ ప్రభుత్వ ఆధారాలతోనే కనిపిస్తుంది. మంత్రిపై గత ఇరవై ఏళ్ళుగా ప్రతిపక్షాలు ఆధారాలతో చేసిన ఆరోపణలు, ప్రజలు పెట్టుకొన్న అర్జీలపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్న వాస్తవం అచ్చులో చక్కగా కనిపిస్తోంది.

మంత్రిగారి అనుచరులపై పోలీసు స్టేషన్, ఏసీబీలో, విజిలెన్స్ శాఖలో, చివరకు సిబిఐ ఆఫీసులలో ఉన్న సమాచారం కోసం దరఖాస్తు చేశాను. ఫోటో కాపీలు ఇవ్వలేము కాని, కావాలంటే వచ్చి ఆఫీసులోనే కూర్చొని చదువుకోవచ్చని జవాబు వచ్చింది. మా మంత్రి అనుచరుల నేర చరిత్ర వివరాలు మండల పోలీసు స్టేషన్లు, జిల్లా పోలీసు స్టేషన్లలో, హైదరాబాద్‌లో ఎన్నో దొరికాయి. వాటిని జాగ్రత్తగా తీసి రాసుకున్నాను. ఇలా దొరికిన వందల పేజీల సమాచారాన్ని అందరికి సులభంగా అర్థమయ్యే భాషలో ఒక ప్రణాళికతో పద్ధతిగా రాయడానికి నాకు మూడు నెలల కాలం పట్టింది. ఆ పనిలో ఉన్నప్పుడు ఒకరోజు మంత్రిగారి మనిషినని ఒకతను మా ఇంటికి వచ్చాడు.

## గురుదక్షిణ

"మీరు మన మంత్రిగారి గురించి పుస్తకం రాస్తున్నారని తెలిసింది. సాయం ఏమైనా కావాలా?" అని మంత్రిగారు అడగమన్నారని చెప్పాడు.

ఆశ్చర్యపోయాను. మంత్రి బహుశా అతని గొప్పతనం గురించి రాసిన పుస్తకం అచ్చువేయించుకోవాలని ఉబలాటపడుతున్నట్టుంది.

"సహాయం ఏమీ వద్దు. ఇది నా సరదా కోసం రాసుకుంటున్నాను" అన్నాను వినయంగా.

"సరే సరే, పైసలు కావలిస్తే చెప్పండి ఇస్తాం... వందలలో అర్జీలు పెట్టినవంట... శతకం వ్రాస్తున్నారా ఏమిటి?" అన్నాడు.

నిజమే ఒకొక్క విషయానికి కనీసం వందల ఉదాహరణలున్నాయి అనిపించింది.

"అవును, శతకం వ్రాస్తున్నాను" అన్నాను సంతోషంతో.

"రాయి రాయి... కనీసం పదివేల కాపీలు వేయించు. మంత్రిగారు ఖర్చంతా ఇస్తారు. తొందరగా పని పూర్తి కావాలి. ఇంకో రెండు నెలల్లో ఎలక్షన్లు వస్తున్నాయి. కాబట్టి నెలరోజులలో పనంతా పూర్తి అయిపోవాలి. వచ్చే నెల మొదటి ఆదివారం మంత్రిగారికి మన ఊరు వచ్చే ప్రోగ్రాం ఉంది. ఆ రోజు ఇక్కడో ఫంక్షన్ ఉంది. దాన్లో ఈ పుస్తకం ఆవిష్కరణ చేయిద్దాం. మంచి ఐడియా వచ్చింది మీకు, గురూగారు" అన్నాడు నా భుజం తట్టి. తన ప్లానంత పూర్తిగా చెప్పేసి వెళ్ళిపోయాడు. ఆ రోజు నించి రాత్రీ పగలు పనిచేసి 'మా ఊరి మంత్రి శతకం' తయారు చేయడం మొదలు పెట్టాను. మంత్రి చిన్నతనంలో అనుభవించిన బీదతనం, ఎవరి సహాయం ఎలా తీసుకొన్నాడో, ఆ తదుపరి వాళ్ళందరిని ఎలా మరచిపోయాడో, స్వార్థంతో ఎలా రాజకీయాలలో కూరుకు పోయాడో తెలిపే ఒక వంద విషయాలు లభించాయి. ఆయన ఇచ్చి నేరవేర్చని వాగ్దానాలు వంద పైనే ఉన్నాయి.

ఆయన వల్ల ఎన్నో కష్టాలు పడి నష్టపోయిన బాధితుల లిస్టు వందలోను, ఆయన చేసిన ఉత్తుత్తి శంకుస్థాపనలు వంద, ఆయన తెప్పించికొన్న కాంట్రాక్టులు

వంద, ఆయన దేశవిదేశాలలో దాచిన డబ్బు గురించి ప్రతిపక్షాల వాళ్ళు ఋజువులతో సహా ఇచ్చిన వివరాలు వంద, ఆయన అనుచరుల నేర చరిత్రకు సంబంధించిన కేసులు, వాటికి ఋజువులు, ఇలా దాదాపు ఎనిమిది వందల వివరాలతో ఒక పుస్తకం తయారు చేసాను. బెంగుళూరు తీసుకెళ్లి ప్రింటింగ్ చేయించాను. అనుకొన్నట్టే మంత్రిగారి మనిషి చెప్పిన రోజుకి ఒకటి రెండు రోజుల ముందే పుస్తకాలు వచ్చాయి. ఆవిష్కరణకు ముందు రోజు మంత్రి గారి మనిషి వచ్చాడు. ఆవిష్కరణ కోసం మూడు పుస్తకాలు మెరిసిపోతున్న రంగు కాగితాల్లో అందంగా కట్టి పెట్టాడు. మర్నాటి సాయంత్రం సభకి వాటితో పాటు మిగిలిన అన్ని పుస్తకాలు తీసుకురమ్మన్నాడు. అక్కడ అందరికి పంచాలన్నాడు.

“ప్రజలు పుస్తకావిష్కరణ సభకి వస్తారు. కాని ఆ పుస్తకంలో ఏముందో తెలియదు. అందుకే రేపు ఉదయం ఊరిలో అందరి ఇళ్ళకెళ్ళి పంచుదాం. పుస్తకం చదివి సభకు రమ్మని చెపుదాం” అని అన్నాను.

“ఇదేదో కొత్తగా ఉందే. సరే రేపు ఉదయం మా కుర్రాళ్ళని పంపుతాను. వాళ్ళ సాయంతో అన్ని పుస్తకాలు పంచేయాలి” అన్నాడు.

“సంతోషం” అన్నాను.

ఆ సాయంత్రం మా ఆవిడని వాళ్ళ తమ్ముడింటికి పంపడానికి ముందే రిజర్వేషన్ చేసిన రైలు ఎక్కించాను. రైలు కదిలిపోతున్నా ఆమె చేతిలో ఉన్న నా చెయ్యిని తీసుకోకుండా రైలుతో పాటు కదిలి పరుగెత్తగలిగినంత వరకు పరిగెత్తాను. నా వింత ప్రవర్తనకి ఆమె నోట మాట రాలేదు.

ఆ రాత్రి ఊర్లో ఉన్న నలుగురు మిత్రులకి డిన్నరు ఇచ్చాను. అమెరికాలో ఉన్న మా అబ్బాయి, కోడలు, మనవరాలితో చాలాసేపు తీరుబడిగా మాట్లాడాను.

ఆ రాత్రి చాలా నెలల తరువాత హాయిగా నిద్రపోయాను.

***

మర్నాడు ఉదయం పదిమంది కుర్రాళ్ళు వచ్చి పుస్తకాలు ఊరిలో వీధి వీధి తిరిగి ఇంటింటికి పంచడానికి తీసుకెళ్ళారు.

## గురుదక్షిణ

తొందరలోనే ఈ పుస్తకంలో ఉన్న విషయాలు మంత్రిగారి వరకు చేరిపోతాయి. కోపంతో మంత్రి నా ఇంటిమీదకి తన మనుషులని పంపుతాడు. వాళ్ళు తనని బతకనివ్వరు. అందుకు నేనేమి గాభరా పడలేదు. పిరికివాడిలా ఊరినుండి పారిపోలేదు. అరవైరెండేళ్ల జీవితం చాలనుకొన్నాను. మంత్రి శతకం పుస్తకాన్ని మరోసారి చేతిలోకి తీసుకున్నాను. నేను చేసిన ప్రయోగ ఫలితం నాకు ప్రమాదమైనా, ప్రజలకి ఉపయోగపడుతుంది అన్న గట్టి నమ్మకం ఏర్పడింది. ఫలితం ఎలా వున్నా, నేను చెయ్యగలిగినది చేశానన్న తృప్తి ఒక్కసారి ఆపాద మస్తకం పులకింతని కలిగించింది. మధ్యాహ్నం అయింది. భోజనం చేసి పడుకొన్నాను.

దబదబమని తలుపు చప్పుడు. చాలా మంది కలిసి ఒకేసారి కొడుతున్నట్టు తెలుస్తున్నది. 'వాళ్ళు వచ్చారన్న మాట, నేను తయారవ్వాలి' అని నాలో నేను అనుకొన్నాను. నేను మంచం మీద నుంచి లేచి అమ్మానాన్నలని తలుచుకొని వాళ్ల ఫొటోకి దండం పెట్టుకొన్నాను. తలుపు చప్పుడు ఆగలేదు. నాకు ప్రేమతో పాఠాలు చెప్పిన గురువులని మనసులోనే తలుచుకొని నమస్కారం పెట్టుకున్నాను. తలుపు చప్పుడు బాగా పెరిగింది. మా కుటుంబం మాత్రమే ఉన్న ఫొటోని ఆప్యాయంగా చేత్తో తడిమి మళ్లీ దాని స్థానంలో పెట్టాను. అప్పుడు తాపీగా వెళ్లి తలుపు తీసాను. ఒక్కసారిగా ఇరవై ముప్పైమంది ఇంట్లోకి గబగబా వచ్చి లోపల నుంచి తలుపు వేసేశారు. ఒంటిమీద పడబోయే దెబ్బలకి సిద్ధపడి కళ్ళు మూసుకున్నాను. ఆవేశంతో ఉన్న మనుషుల శ్వాస నన్ను చుట్టుముట్టింది.

"మాష్టారూ... మీ పుస్తకం చదివాం... మేమే కాదు ఎంతోమంది చదివారు. ఊరంతా చదివారు. చాలా గొప్ప పని, గొప్ప పని చేసారు మాష్టారు. వందల మంది కోపంతో మంత్రిగారి ఇంటివైపు వెళుతున్నారు... మీకు మంత్రిగారి మనుషుల నుండి ఎలాంటి ఆపద రాకూడదని మేమిలా వచ్చాం" గుక్క తిప్పుకోకుండా ఒకరి తరువాత ఒకరు నన్ను చుట్టుముట్టి చెప్పారు. కళ్ళు విప్పి చూసాను. యువతీ యువకులు ముప్పై నలభైమంది నా చుట్టూ ఉన్నారు. వాళ్ళ కళ్ళ వెలుగులో నా ప్రయోగ ఫలితం స్పష్టంగా కనబడింది. వచ్చినవాళ్ళు అలసిపోయినట్టున్నారు మంచినీళ్ళు ఇచ్చాను.

ముసలి రైతుకి ఇచ్చిన మాట నిలబెట్టుకోబోతున్న క్షణమిది. తృప్తిగా ఉంది. 'ఇన్నాళ్ళు చెప్పిన చరిత్ర ఇవ్వాళ ఆయుధం అయింది' అని మనసులోనే అనుకొన్నాను. కొత్త చరిత్రకు ఊతమిచ్చినందుకు సంతోషించాను. వర్తమాన చరిత్రని దాచుకున్న ఆ పుస్తకాన్ని చేత్తో గుండెలకు అదుముకున్నాను.

చరిత్ర కేవలం పాఠ్యాంశంగా స్థబ్దంగా ఉండకూడదు. అది ఇకనైనా ప్రేరక పదార్థం కావాలి.

దూరంగా మంత్రిగారి రౌడీల చేతుల్లో మారణాయుధాలు. ప్రతి యువకుని చేతిలో ఓ పుస్తకం. రేపు గెలుపు ఎవరిదో చరిత్ర నిర్ణయిస్తుంది. నా వరకు – ఒక ఉపాధ్యాయుడిగా ఎన్నడూ లేనంత తృప్తి – చరిత్ర ఆచరణలోకి వచ్చిన ఆ క్షణాన!

*

## తెలుగు సామాజిక కథకులకు గురువైన

## శ్రీ కాళీపట్నం రామారావు గారికి

## నమస్కరిస్తూ...

# ఆటోమీటర్ – ఆటోమేటిక్

**మ**హానగరంలో ఓ బస్టాప్ అది. మధ్యతరగతి ఆశలా, చెల్లాచెదురుగా నిలబడివున్న మనుషులతో విశాలంగా పరుచుకుని ఉంది. రాని, వచ్చినా ఆగని, ఆగినా ఎక్కడానికి వీలు లేని బస్సులని అరగంట నుండి నిలబడి చూస్తున్నాడు విశ్వం. అతని కోపం క్షణక్షణానికి పెరిగిపోతోంది. బస్సుల మీదకంటే, అక్కడక్కడే తిరుగుతున్న ఆటోల వాళ్ళమీద. అటు ఇటు కదులుతున్న ఆటోవాళ్ళు విశ్వంలాంటి వాళ్ళని ఆటో తీసుకుందామా? వద్దా? అని ఊగిసలాడేలా చేస్తున్నారు.

విశ్వం మెల్లగా నడిచి ఒక ఆటో దగ్గరకు వెళ్ళి నిలబడ్డాడు.

'వస్తావా?' అని అడగకముందే ఆటో డ్రైవర్ "మీటర్ మీద ఎగ్స్ట్రా 10" అన్నాడు. ఇక బేరాలు లేవన్న విషయం స్పష్టం చేస్తూ.

"మీటర్ మీద ఎందుకు రావు?" అన్నాడు కోపాన్ని అణుచుకుంటూ.

"మీటరేస్తా. దానిమీదే 10 అన్నానుగా" అన్నాడు ఆటో డ్రైవరు విసుగు దాచుకోకుండా. అప్పటికే పదిసార్లు లెక్కపెట్టుకున్నాడు విశ్వం. తార్నాకకు బస్సుమీద వెళితే 3 రూపాయలు టిక్కెట్టు. ఆటో మీద మీటరు ప్రకారం 20 రూపాయలు. టాక్సీలో వెళితే ఏ 200 రూపాయలో అవుతుంది. ఇంటి దగ్గర దిగిన తరువాత టాక్సీడ్రైవరుకు కనీసం పది రూపాయలైనా ఇవ్వకపోతే ఏం బాగుంటుంది? కానీ సరిగ్గా ఆ పదిరూపాయలు ఆటో డ్రైవరు మీటరు మీద ఎక్కువ ఇవ్వమని అడిగేసరికి కష్టమనిపిస్తుంది. పదోసారి గుర్తుతెచ్చుకున్నాడు, తన పర్సులో ఉన్న రెండు పది రూపాయల నోట్లను. విశ్వం కోపం విశ్వాన్ని ఆక్రమించి కాళ్ళను వెనక్కి తన్నింది. కానీ కోపం ఆపుకోలేక తల ఆటోవాడివైపు తిప్పి, "మీటరు మీదే తీసుకువెళ్ళాలని తెలీదా నీకు?" అన్నాడు. అక్కడ చుట్టూ ఉన్న అందరికీ ఆటోవాడిని

అదే ప్రశ్న అడగాలని ఉన్నా, విశ్వానికి మద్దతుగా ఏమాత్రం కనిపించినా విశ్వం 'లీడర్' అయిపోతాడేమోనని తగినంత దూరం జరుగుతున్నారు ప్రయత్నపూర్వకంగా.

"తెల్సుసార్ తెల్సు. నాలుగు రోజులు స్ట్రైక్. పూరా ఖాళీ. భర్తీ చెయ్యాల్నా వద్దా? మీటర్‌కే ఊపర్ దస్ బస్" అని అందరివైపు ఒకసారి చూసి, ఇక్కడున్న వాళ్ళు ఎవ్వరు రారని నిశ్చయించుకుని 'ఇవ్వగల' వారికోసం మరింత ముందుకి వెళ్ళాడు.

ఇంతదాకా దాచుకున్న కోపాన్ని బయటపెట్టడానికి విశ్వానికి అవకాశం వచ్చినట్లు భావించి చుట్టూ ఉండి, తనలాంటి పరిస్థితిలోనే ఉండి కూడా మాట సహాయమైనా చేయని వాళ్ళని తిట్టలేక, తిట్టినా వినిపించనంత దూరం వెళ్ళిపోయిన ఆటోవాడిని గట్టిగానే తిట్టడం మొదలుపెట్టాడు.

"ఈ ఆటోవాళ్ళకి బుద్ధిలేదు. ఎంత దొరికితే అంత దోచేద్దామనే. ఒక రూలు పాటిద్దామని అస్సలు ఆలోచన లేదు. ఖాళీగా పోతారు కాని, మీటరు మీద రారు, బుద్ధిలేనివాళ్ళు" అని మరోసారి అన్నాడు. ఇలా రకరకాల మాటల్లో, రకరకాల వాక్యాలలో, ఆగిఆగి అదే అర్థం వచ్చేట్టు పదేపదే అంటున్నాడు.

చుట్టూ ఉన్నవాళ్ళు వినీ విననట్టు మొహం పెట్టి అంతా వింటున్నారు. మాటలు అంటూనే మిగిలిన వాళ్ళంతా వింటున్నట్టు గమనిస్తున్నాడు విశ్వం. అలాంటప్పుడే చెల్లాచెదురుగా ఉన్నవాళ్ళ మధ్యనుండి పంచెకట్టుతో, పండు జుట్టుతో, పదార్ల వయసు దాటినా సడలని వొంటి దారుఢ్యంతో సాయంకాలం ఆహ్లాదంగా వాహ్యాళికి వెళ్ళే తీరున ఒక వ్యక్తి విశ్వం దగ్గరగా వచ్చి "వీళ్ళను ఎవ్వరు ఏమీ చేయరు. వీళ్ళు బాగుపడరు అని అంటున్నారు. ఎవరో ఎందుకు చెయ్యాలి, మీరే ఎందుకు ఆ పని చేయరాదు? ఆ పనికి మీరే ఎందుకు పూనుకోకూడదు" అని సూటిగా స్నేహపూర్వకంగా నవ్వుతూ అడిగాడు.

"నేనా? వీళ్ళనా? నేనేం రాజకీయ నాయకుడిని కాదు. లీడర్ని కాదు. పోలీసాఫీసర్ని కాదు" అన్నాడు పరిసరాలని మరిచిపోయి. సూటిగా, సూదుల్లా సూర్యకిరణాలు కళ్ళల్లో పడ్డప్పుడు రెండు చేతులు అడ్డంపెట్టి కళ్ళు మూసుకుంటున్న కుర్రాడిలా.

"మీరేం చేస్తుంటారు?"

"నేను డిగ్రీ కాలేజీలో లెక్చరర్ని" అన్నాడు విశ్వం.

"ఏం పాఠాలు చెప్తారు?"

"స్టాటిస్టిక్సు"

"ఓహో... అలాగా"

ఇంతలో బస్సు వచ్చింది. "రండి" అని విశ్వంతో అని, ఆయన పరుగులాంటి నడకతో బస్సువైపు కదిలారు. విశ్వం కూడా ఆయన వెనకే వెళ్ళి బస్సు ఎక్కాడు. బస్సు కదిలింది.

***

"చూడండి, ఏదైనా చెయ్యాలనుకుంటే మీరే చెయ్యాలి. వాళ్ళని వీళ్లని తిట్టుకుంటే ప్రయోజనం లేదు. మీకున్న చదువు, అవకాశాలు ఆ ఆటోవాళ్ళకి లేవు కదా!" అంత రద్దీగా ఉన్న బస్సు రొదలో తాపీగా, గట్టిగా విశ్వం చెవికి దగ్గరగా ఆయన మాట్లాడుతున్నాడు.

"కానీ ఈ ఆటోవాళ్ళని మీటరు మీద నడిపించగల అధికారం, బలగం ఉన్న పోలీసువాళ్ళే ఈ పని చెయ్యలేకపోతే నాలాంటి సామాన్యుడు ఏం చెయ్యగలడండి?" అన్నాడు విశ్వం.

"బాగా చదువుకున్న వాళ్ళు, నలుగురికి చదువు చెప్పే మీలాంటివాళ్ళు ఏదో ఓ సమస్యని తీసుకుని, చక్కగా ఆలోచించి, ప్రజలకి పరిష్కార మార్గం చూపించాలి, అటువంటి మీరే 'నేను సామాన్యుణ్ణి' అని ఏమీ చెయ్యకుండా ఉంటే మిగిలినవాళ్ళు ఏం చెయ్యగలరు? బతుకు గాడిలో బండగా, జడంగా జీవితం గడిపేయడం తప్పించి" అన్నాడు మెల్లిగా బోధపరుస్తున్న తీరులో.

"............."

"కనీసం ఏం చెయ్యగలనని ఆలోచన చెయ్యగలరు కదా?"

"అంటే"

"ఆటోవాళ్ళు మీటర్ మీదే ప్రయాణికుల్ని తీసుకువెళ్ళడం వల్ల వాళ్ళకే మంచిదని వాళ్ళకి అర్థం అవ్వాలంటే ఏం చేయాలి అని ఆలోచించండి!"

ఏదో స్టాప్ వచ్చింది. బస్సు ఆగింది. మళ్ళీ ఎక్కేవాళ్ళు దిగేవాళ్ళు. వాళ్ళ కదలికలో విశ్వం ఆయనకు దూరం అయిపోయాడు.

బస్సు కదిలింది. కళ్ళతోనే ఒకళ్ళనొకళ్ళు చూసుకున్నారు. ఈ వయస్సులో కూడా ఈయన బస్సులో చక్కగా ప్రయాణం చేస్తున్నారు, గొప్పే అని అనుకున్నాడు, బస్సుల్లో ఈ రద్దీ భరించలేక వీలయినప్పుడల్లా ఆటోలోనే ప్రయాణం చేసే విశ్వం. ఆలోచించమని ఆయన ఇచ్చిన ఆలోచనకు మరింత ఆశ్చర్యపడ్డాడు.

విశ్వం ఒక డిగ్రీ కాలేజీలో స్టాటిస్టిక్స్ (గణాంక శాస్త్రం) బోధించే లెక్చరర్. అతనికి ఉన్న అనుభవం అంతా ఆ పాఠాలు చెప్పడమే. చదువుకునే రోజులలో కాని, ఇప్పుడు కానీ చదువు తప్ప మరే విషయాలలో పాల్గొన్నవాడు కాదు. లీడర్ అసలు కానే కాదు. తన చదువు, తన ఉద్యోగం, తన సంసారం, అంతే. సమాజంలో మిగిలిన విషయాల గురించి ఏరోజూ ఆలోచించలేదు. బస్సు మరో రెండు స్టాపులలో ఆగి బయలుదేరింది. ఈలోగా తాపీగా విశ్వం దగ్గరకు చేరుకున్నాడు ఆయన.

"నేను మరో రెండు స్టాపుల తరవాత దిగాలి" అన్నాడు.

"అలాగా... నేను మీకంటే ఒక స్టాపు ముందే దిగాలి" అన్నాడు విశ్వం.

"సరే అయితే. నేను మీతోపాటే దిగి, మనం మాట్లాడటం మొదలుపెట్టిన విషయం మాట్లాడటం పూర్తిచేసి, ఆ తరవాత నడిచి మా ఇంటికి వెళతాను. మీకు సమ్మతమేనా?"

"అలాగే దిగుదాం" అన్నాడు విశ్వం.

మరికొద్దిసేపటికి విశ్వం దిగవలసిన స్టాప్‌లో ఇద్దరూ దిగారు. బస్సు దుమ్ము రేపుకుంటూ వెళ్ళిపోయింది.

"ఇప్పుడు చెప్పండి. ఇంత చదువు చదివిన మీకు ఆలోచించవలసిన

బాధ్యత ఉందా? లేదా?" అని అడిగాడు.

'ఉంది' అన్నట్లు బుర్ర ఊపాడు విశ్వం.

"మరైతే మీ కళ్ళ ముందున్న, ఈ ఆటోమీటర్ ప్రకారం నడపబడని విషయం మీకు, మీలా వేలాదిమందికి రోజూ ఉన్న సమస్య కదా. మరి దానికి తగిన పరిష్కారాన్ని ఆలోచించండి"

"ఏదో మాటవరసకి అన్నారనుకున్నాను కానీ... మీరు చెప్తుంటే నిజమే ఏదో ఒకటి చెయ్యాలని ఉంది. ఆలోచిస్తాను" అన్నాడు విశ్వం వినయంగా.

"మీకు స్టాటిస్టిక్సులో ఉన్న ప్రావీణ్యం ఉపయోగించి ఈ సమస్యకు పరిష్కారం చూపించగలరని నాకు నమ్మకం ఉంది"

"మా ఇల్లు ఇక్కడ దగ్గరలోనే, వచ్చి కాఫీ తీసుకుని వెళ్ళండి" అని కోరాడు విశ్వం.

"అబ్బే. ఎందుకు శ్రమ. మరోసారి కలుద్దాం" అన్నారు నవ్వుతూ ముందుకు నడుస్తూ.

"అలాగే" అన్నాడు కలలో ఉన్నవాడిలా తన ఇంటివైపు తిరుగుతూ.

***

"రోజుకి ఒక్క ఆటోకు దాదాపు 200 రూపాయల ఆదాయంతో, సుమారు 50వేల ఆటోలు తిరుగుతున్న ఈ నగరంలో ఈ వ్యాపారం రోజుకి కోటి రూపాయలు దాటిన వ్యవహారం" అన్న లెక్చరర్ విశ్వం మాటలకి, 'ఎవడో ఒక లెక్చరర్ వస్తాడు. ఏదో ఒక పాఠం పాడుకొని పోతాడు' అన్న భావంతో సాధారణంగా అల్లరి చేస్తూ శ్రద్ధ చూపని బికాం ఫైనలియర్ క్లాస్‌లో ఉన్న 24మంది అబ్బాయిలు, 16మంది అమ్మాయిలు ఒక్కసారి ఆశ్చర్యపోయి, నిశ్శబ్దంగా, శ్రద్ధతో లెక్చరర్ మాటలు వినడం మొదలుపెట్టారు.

"సుమారు రోజుకు కోటి రూపాయలు దాటిన ఆటో వ్యాపారంలో కష్టించే వాడికి, కష్టమర్‌కి మధ్య ఉన్న అతి ముఖ్యమైన పాత్ర పోషించవలసినది

'ఆటోమీటర్'. అటువంటి 'ఆటోమీటర్' వేసి ఆటో నడిపి, దాని ప్రకారం డబ్బులు తీసుకోవడం వల్ల ఆటోడ్రైవర్లకి లాభమా? నష్టమా? మీరు నేర్చుకున్న ఎకౌంటింగ్, స్టాటిస్టిక్స్ ఉపయోగించి ఈ ప్రశ్నకి సమాధానం చెప్పగలరా?" అని ఆగిన లెక్చరర్ విశ్వం ప్రశ్నకి క్లాస్ అంతా మరింత ఆశ్చర్యపోయి, మాట రాక నిశ్శబ్దంతో అతడి మొహం చూస్తూ ఉండిపోయారు.

అప్పుడే మొదలైన వర్షం జల్లులు కిటికీకి ఆనుకుని ఉన్న చెట్టు ఆకులపై చేస్తున్న సవ్వడి స్పష్టంగా వినిపిస్తోంది క్లాసులో ఉన్న అందరికి.

మీరు ఈ విషయాన్ని ఒక ప్రాజెక్టుగా తీసుకొని పనిచెయ్యాలని నా ఉద్దేశం. ఎంతమందికి ఈ ప్రాజెక్టు చెయ్యాలని ఉందో చేతులెత్తండి అన్నాడు విశ్వం. ఆశ్చర్యం నుండి తేరుకుంటూ విద్యార్థులు చేతులెత్తారు.

"నేను చేస్తాను సార్", 'నేను చేస్తాను సార్' అని అంటున్న 40మంది మాటలతో ఆ క్లాసంతా నిండిపోయింది.

బయట వర్షం పెరుగుతూ చేస్తున్న చప్పుడు ఇప్పుడు క్లాసులో వినపడడం లేదు. ఊహించనటువంటి ఉత్సాహం చూపుతున్న విద్యార్థులను చూస్తూ విశ్వం, తాము చదివే చదువును మార్కులకే పరిమితం చేయకుండా, చైతన్యదాయకమైన అంశాలకు కూడా విస్తరిస్తున్న లెక్చరర్‌ని ఆనంద సంభ్రమాశ్చర్యాలతో చూస్తూ క్లాసు విద్యార్థులు కొద్ది క్షణాలు తమని తాము మరిచిపోయారు.

తేరుకున్న తర్వాత ఆ పని ఎలా చెయ్యాలి అన్న ఆలోచనలో మునిగిపోయారు. ఒక్కొక్క టీమ్‌లో ఇద్దరేసి చొప్పున 20 టీములు ఏర్పాటుచేశారు. ఒక నెల రోజులలో ప్రతి టీమ్ 60మంది ఆటో డ్రైవర్లతో మాట్లాడి మొత్తం 1200మంది ఆటో డ్రైవర్లని ఒక నెలరోజులపాటు ఈ ప్రాజెక్టులో పాల్గొనడానికి ఒప్పించాలి. అందులో 600మందిని మీటరు వేసి మాత్రమే నడపాలని, మిగిలిన 600మందిని మీటరుతో కాక మీటరు మీద ఇంత ఎక్కువ అని కాని లేదా వారికి తోచినట్లు బేరాలాడి కాని ఆటో ఒక నెలరోజుల పాటు నడపాలని కోరాలి. ఎవరు ఎలా నడిపినా వాళ్ళు ఆటో ఎన్ని మైళ్ళు నడిపింది, ఎంత పెట్రోల్

ఆటోలో పోయించింది, ఎన్ని బేరాలు ఎక్కించుకున్నది, ఏయే బేరంలో ఎంత వచ్చింది, ఎన్ని గంటలు పనిచేసింది వంటి వివరాలు ప్రతిరోజు విధిగా ప్రతి టీము, తమ టీములో ఉన్న 60 మంది వివరాలు సేకరించాలి. అప్పుడప్పుడు తమతమ టీముల్లో ఉన్న ఆటోడ్రైవర్లు ఎవరెవరు ఎంత నిజాయితీగా ఈ ప్రాజెక్టు నియమాలని పాటిస్తున్నారో ప్రతి టీము వారి స్నేహితులు, బంధువుల సహాయంతో పరీక్షించుకోవాలి. ప్రాజెక్టు నియమాలని పాటించని ఆటో డ్రైవర్లని గుర్తించాలి.

ఒక వారం రోజులలో ఏయే టీమ్ ఏయే జంక్షన్లలో పనిచేయాలన్నది నిశ్చయించుకొన్నారు. సేకరించవలసిన విషయాల జాబితా క్షుణ్ణంగా క్లాసులో చర్చించి మరీ నిశ్చయించారు. పదిహేనేళ్ళుగా చదువుతున్న ఆ విద్యార్థులు ఇంత శ్రద్ధగా చేపట్టిన విషయం ఇదే అంటే ఆశ్చర్యపడనక్కరలేని విధంగా ఈ ప్రాజెక్టు మీద శ్రద్ధ చూపిస్తున్నారు. పదిహేనేళ్ళుగా పాఠాలు చెప్తున్నా, గురువుగా విద్యార్థుల గౌరవం పొందింది ఇప్పుడే అనిపించింది లెక్చరర్ విశ్వానికి.

ప్రిన్సిపాల్‌ని ఒప్పించడానికి, ఈ ప్రాజెక్టుకు కావలసిన వివరాలు, కాగితాలు సేకరించడానికి ఒక వారం రోజులు పట్టింది. ఆ తరువాత నగరంలో ఉన్న నాలుగు పెద్ద ఆటో యూనియన్ల లీడర్లని విశ్వంతో పాటు 40మంది విద్యార్థులు రెండు మూడు తడవలు కలిసి ఈ ప్రాజెక్టును వివరించి, వారిని ఒప్పించడానికి మరో మూడు వారాలు పట్టింది. ఆగస్టు పదిహేను నుండి ఈ ప్రాజెక్టు కార్యరూపంలోకి వచ్చింది.

ఈ ప్రాజెక్టులో పాల్గొన్న ఆటోడ్రైవర్లను ప్రతిరోజూ కలిసి సేకరించవలసిన వివరాలన్నీ సేకరించడం మొదలుపెట్టారు విద్యార్థులు. ఆ వివరాలతో పాటు ఆటోడ్రైవర్ల వ్యక్తిగత వివరాలు కూడా తాపీగా తెలియసాగాయి విద్యార్థులకు. బాగా చదువుకున్న వాళ్లలో కూడా కనిపించని మానవత్వాన్ని కొద్దిమంది ఆటోడ్రైవర్లలో చూసి ఆశ్చర్యపోయారు. వాళ్లు వేసే వేషాలు, డబ్బు కోసం చేసే మోసాలు అన్ని తరగతుల వాళ్ళు చేసేలాంటివే అని తెలుసుకున్నారు. కొద్దిమంది డ్రైవర్లతో విద్యార్థులకు మంచి పరిచయాలే ఏర్పడ్డాయి. ఆటోడ్రైవర్ల మీద చాలామందిలాగే వీళ్ళకీ మొదట్లో ఉండే అపోహలు తొలగిపోయాయి. నెల

రోజులలో కావలసిన వివరాలన్నీ జాగ్రత్తగా, పద్ధతి ప్రకారం తీసుకున్నారు. పరిశోధనలో అన్నివిధాలా ప్రాజెక్టు నియమాలని సరిగ్గా పాటించని వాళ్ళు కొంతమందైనా ఉంటారని ముందుగా ఎక్కువ మందిని తీసుకున్నారు. ప్రాజెక్టు నియమాలని సరిగ్గా పాటించనివాళ్ల వివరాలని విశ్లేషణలో చేర్చలేదు. అలా తీసివేయగా మిగిలిన 520 మంది మీటరు మీద నడిపిన వాళ్ల నుంచి, మీటరు ప్రకారం కాకుండా నడిపిన 516మంది నుంచి తీసుకున్న వివరాలన్నింటిని వివిధ ఎకౌంటింగ్, స్టాటిస్టిక్స్ పద్ధతుల్లో క్షుణ్ణంగా పరిశీలించారు. ముందు వేసుకున్న ప్రశ్నలకి వచ్చిన సమాధానాలని వివిధ కోణాలనుండి పరిశీలించారు. యూనివర్సిటీలో ఉన్న ముగ్గురు ప్రొఫెసర్లకు ఈ ప్రాజెక్టుని క్షుణ్ణంగా వివరించారు. వాళ్ళ సహాయంతో ప్రాజెక్టు ఉద్దేశాలని, పద్ధతులని, ఫలితాలని ఇస్తూ, వివరిస్తూ, చర్చించి ఒక చక్కనైన పరిశోధనా పత్రం రాశారు. దానిని భారతదేశంలో పరిశోధనా రంగంలో పేరున్న 'సాంఖ్య' పత్రికకు పంపారు. నెలరోజులలో జవాబు వచ్చింది. దాని సారాంశం ఏమిటంటే, ఇటువంటి సామాజిక ప్రయోజనం ఉన్న పరిశోధన చాలా మెచ్చుకోదగ్గదని దీనిని మాసపత్రికలో ప్రచురించడం ద్వారా మరిన్ని ఇటువంటి పరిశోధనలు జరిగే అవకాశం ఉందని, డిగ్రీ కాలేజీ లెక్చరర్ ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థులు ఇంత చక్కనైన పరిశోధన చేసారంటే ఆశ్చర్యంగా ఉందని పొగుడుతూ కూడా రాశారు.

విశ్వం ఆ ఉత్తరాన్ని ముందు సంప్రదించిన యూనివర్శిటీలో ఉన్న ముగ్గురు ప్రొఫెసర్లకు చూపించాడు. వాళ్లు కూడా మరోసారి అభినందించారు. పత్రికల వాళ్లని పిలిపించారు. విశ్వం ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థులు, విద్యార్థినులు చేసిన పరిశోధన ఫలితాలను అందరికీ అర్థం అయ్యేలా వివరించారు.

***

'మీటరుపై నడిపే ఆటోడ్రైవర్లే ఎక్కువ సంపాదిస్తున్నారు' అన్న శీర్షికతో మర్నాడు అన్ని వార్తాపత్రికలు మొదటి పేజీలోనే పెద్ద అక్షరాలతో ప్రచురించాయి. నగరంలో జరిగిన పరిశోధన గురించి వివరంగా రాసాయి. మీటరు మీద మాత్రమే ఆటో నడిపే డ్రైవర్లు, బేరాలాడే వారికంటే 50 శాతం ఎక్కువ సంపాదిస్తున్నారని, 60 శాతం తక్కువ సమయం పనిచేస్తున్నారని ముఖ్యమైన

విషయంగా గణాంకాలవల్ల తేలిందని రాసాయి. మీటరు మీదే కదా అని ప్రయాణికులు తక్కువ దూరానికి కూడా ఆటో వాడడం ఎక్కువ చేశారని, అలా చేయడం వల్ల తక్కువ దూరాలు తిరగడం వల్ల ఖాళీగా వెనక్కి రావడం బాగా తగ్గి, ఆదాయం పెరగడానికి తోడ్పడిందని, ఏవిధంగా చూసినా బేరాలాడే ఆటోడ్రైవర్ల ఆదాయం రకరకాల కారణాలవల్ల కూడా తక్కువగానే ఉందని, ఈ భేదాలు గణాంక శాస్త్ర లెక్కల ప్రకారం గణనీయమైనవని రుజువైందని, ఈ పరిశోధన శాస్త్రీయంగా చేసింది కాబట్టి ఈ రంగంలో పరిశోధనలని ప్రచురించే 'సాంఖ్య' పత్రిక వల్ల దేశవ్యాప్తంగా నగరంలో జరిగిన ఈ పరిశోధనకి గుర్తింపు కూడా వచ్చిందని రాసాయి.

పరిశోధనలో పాల్గొన్న 1,000 పైబడ్డ ఆటోడ్రైవర్ల నోటిమాటతో అప్పటికే నగరంలో నలుమూలలా మీటర్‌మీద తిరిగే ఆటోల సంఖ్య బాగా పెరిగింది. వార్తాపత్రికలలో ఈ పరిశోధన గురించి రావడం వల్ల నగరంలో మీటర్ మీద మాత్రమే వచ్చే ఆటోల సంఖ్య చాలా ఎక్కువైంది.

ఆటో మీటర్ మీద రావడం ఆటోమేటిక్‌గా జరగడం నగరంలో అన్ని వర్గాలవారిని ఆశ్చర్యపరిచింది. ముఖ్యంగా పోలీస్ వర్గాన్ని ఆలోచింపజేసింది. డజన్లకొద్ది పోలీసులని పెట్టి, చలాన్లు కట్టించి, నానా తిప్పలు పడ్డా నిజమైన మార్పు ఎప్పుడూ రాలేదు. అలాంటిది ఇప్పుడు పైసా ఖర్చు లేకుండా ఇంత పెద్ద మార్పు సులభంగా రావడమంటే పోలీసు వారి పనితీరులోనే ఏదో లోపం ఉందని వారికి, ఆలోచించిన వారందరికి తోచింది.

డిగ్రీకూడా పూర్తికాని వాళ్ళతోనే ఇంత చక్కనైన, ఉపయోగకరమైన పరిశోధన చేయించగలిగితే, పరిశోధనలకై లక్షలు ఖర్చు పెడుతూ పిహెచ్‌డి డిగ్రీల వాళ్లని తయారుచేస్తున్న యూనివర్సిటీలు మరెంత ఎక్కువ ప్రజలకి ఉపయోగకరమైన పరిశోధనలు చెయ్యగలవో కదా అనిపించింది.

ఈ పరిశోధన అంతటికి ముఖ్యమైన వ్యక్తి అయిన విశ్వంని మాత్రం మామూలు స్టాటిస్టిక్స్ లెక్చరర్ అయిన తనని ఇటువంటి పరిశోధనకు పురికొల్పిన ఆ వ్యక్తి మళ్ళీ కనిపించలేదు. మళ్ళీ ఎప్పుడు కనిపిస్తాడు? అతను ఎవరు?

కనిపిస్తే మనకున్న ముఖ్యమైన సమస్యలన్నింటికీ కూడా ఆటోమేటిక్‌గా పరిష్కారం దొరికే మార్గం చూపించగలడా? అతడు మనలోని వ్యక్తా? విశ్వం ఆలోచనల్లో మునిగిపోయాడు. ఎవరైతేనేం? సమస్యను చూసి తిప్పుకుంటూ, నిస్సహాయంగా, నిట్టూర్చే బదులు తనకున్న వనరులతోనే పరిష్కారం కోసం ప్రయత్నించమని మార్గనిర్దేశం చేసిన మహానుభావుడు ప్రేరేపించేది ఎవరైనా, ప్రేరణ ఇచ్చేది ఏదైనా పనిచెయ్యవలసినది మనమే అన్న పాఠం బోధపడిన విద్యార్థిలా విశ్వం ముఖం తేజోమయమయి వెలిగింది.

*

**దేనినైన కథ వస్తువుగా**

**మలచవచ్చని బోధించిన**

**శ్రీ భమిడిపాటి రామగోపాలం గారికి**

**నమస్కరిస్తూ...**

# భార్య విద్యలో బి.ఏ.

"పెద్ద ఆపద వచ్చింది సార్, మిమ్మల్ని ఇప్పుడు వచ్చి కలవచ్చా?"

అవతలి భాష బట్టి తెలుగువాడు, 'సర్' అన్నాడు కాబట్టి కొత్తగా అమెరికా వచ్చినవాడు, ఇప్పుడే వచ్చేస్తాను అంటున్నాడు కాబట్టి ఏదో పెద్ద ఆపదలోనే వున్నవాడు, ఇంటికే వచ్చేస్తానన్నాడు కాబట్టి ఇంతకుముందు ఇంటికి వచ్చినవాడు, అడగడంలో తీవ్రత బట్టి వద్దన్నా వచ్చేసేలా వున్నాడు అనిపించింది. కానీ ఇంతకీ ఇతనెవరు?

"ఇంతకీ మీరు ఎవరు?"

"సార్, నేను నాలుగేళ్ళ క్రితం అమెరికా రాగానే మీ ఇంటికి భోజనానికి వచ్చా సార్, అప్పుడే ఎలా మరిచిపోయారు సార్?"

నాలుగేళ్ళ క్రితం మా ఇంటికి భోజనానికి వచ్చి మళ్ళీ ఇప్పటి దాకా ఫోన్ చెయ్యకుండా, నాకు పేరు కూడా చెప్పకుండా, ముప్ఫై ఏళ్ళ నుండి అమెరికాలో ఉంటున్న నన్ను ఇలా రాత్రి పది గంటలకి తికమక పెట్టేస్తున్నాడంటే, అతనికి వచ్చిన ఆపద పెద్దదైనా అయ్యుండాలి, నామీద అతనికున్న నమ్మకం ఎక్కువైనా అయ్యుండాలి.

"ఎవరండి" అప్పుడే బెడ్ రూమ్‌లోకి వచ్చిన మా ఆవిడ తన నేత్ర నృత్యంతో నా కన్నుల పండుగగా.

ఫోన్ ఒక చేతితో మూసి "ఎవరో పెద్ద ఆపదలో ఉన్నాడట, నామీద చాలా నమ్మకంతో...."

"పెద్ద ఆశతో, ఎంతో నమ్మకంతో వచ్చిన నా సంగతి ఇంకింతేనా?" అంది బుంగమూతితో.

"నీ సంగతి ఫోన్‌కాల్ తరువాత" అని ఫోన్ మీద చెయ్యి తీసి అవతలి వ్యక్తితో "రండి ఎప్పుడొస్తారు" అన్నాను, ఇంకో రోజు వస్తాను అంటాడన్న ఆశతో.

"ఇప్పుడే వస్తాను సార్"

"మరి రాత్రి ఇంటికి దారి..."

"నా ఐఫోన్‌లో మీ ఇంటి అడ్రస్ ఉంది. దానిలోనే జిపిఎస్ కూడా వుంది. అది బ్లూటూత్‌తో నా కార్‌తో కమ్యూనికేట్ చేసి మీ ఇంటికి తీసుకొస్తుంది. నేను కారెక్కడమే తక్కువ, కానీ...." అంటూ కొత్త టెక్నాలజీతో మనిషి తలుచుకోవాలే కాని ఆచరించడానికి మెషిన్స్ రడీ అన్నది నాకు బోధపరుస్తున్నాడు. ఎన్నోఏళ్ళుగా నేను రోబోటిక్స్‌లో ప్రొఫెస్సర్‌ని అని చెప్తే ఏం పాఠాలు చెప్తున్నారు అంటాడు కాబోలు.

"సరే రండి..." అన్నాను ఫోన్ పెట్టి మా ఆవిడ వైపు చూసాను.

"ఫోన్ కాల్ తరువాత అన్నావ్, మళ్ళీ ఎవరినో రమ్మన్నావ్?" నిరాశ నిముషానికి కిలోల్లో అక్షరాల ద్వారా బట్వాడా చేస్తూ "ఎవరో, ఏదో, ఎందుకో... ఆపదలో"

"పేరు తెలియదు, ప్రాబ్లం తెలియదు, ఇప్పుడు పదిగంటలని కూడా నీకు తెలియదు..." మధ్యమావతి, కాఫీ, కన్నడ మిశ్రమ రాగాలని మంద్రంగా పలికిస్తూ...

"మరి నీకు... నాకు... అతను" బఫే భాషలో బ్రేక్‌ఫాస్ట్‌లా.

"నీకు నావల్టి 'ప్రాబ్లమ్' సీకింగ్ జీన్.."

"అంటే...?" మధ్యలో ఆపుతూ అడిగాను.

"ఏదైనా, ఎలాంటిదైనా కొత్తదనంతో వున్నది కావాలి. దీన్ని నావల్టీ సీకింగ్

జీన్ అంటారు. ఇది చాలామందికి ఉంటుంది, కాని నీకు నావల్టి 'ప్రాబ్లమ్' సీకింగ్ జీన్ వుంది!" అంది.

అప్పుడే తన పరిశోధనల ఫలితాలని ప్రపంచ సమ్మేళనంలో పలువురు మేధావుల ముందు ప్రజెంట్ చేసి తానో కొత్త విషయం కనుగొన్నానని చెప్పే శాస్త్రవేత్తలా అంది మా ఆవిడ.

నవ్వి తనకిష్టమైన పుస్తకం ఒకటి తీసిచ్చి "ఇక ఇది చదువుకొని పడుకో" అన్నాను.

అతను వచ్చాడు. రెండు గంటలసేపు ఆపకుండా అతనికి వచ్చిన ఆపద పూర్వాపరాలన్ని చెప్పుకొచ్చాడు. దాని సారాంశం ఏమిటంటే...

అందరి తెలుగు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల లాగే అతను కూడా ఉద్యోగం మీద అమెరికా వచ్చాడు. రాగానే వచ్చిన జీతం అతని సామాన్య జీవితానికి చాలా ఎక్కువని తెలుసుకున్నాడు. జీతంలో కనీసం ఎనభై శాతం వెనకేయాలని నిశ్చయించుకున్నాడు. నలుగురు స్నేహితులను కూడగట్టుకొని రెండు బెడ్‌రూమ్‌ల అపార్ట్‌మెంట్‌లో సర్దుకొని ఉంటూ, గత నాలుగేళ్ళుగా జీవితంలో అన్నిరకాల అమెరికా పొదుపుల్ని పాటిస్తూ ప్రతి నెలా చాలా డాలర్లే జాగ్రత్త చేస్తున్నాడు. అమెరికా అసమర్థ, అనాలోచిత, ఆర్థిక విధానాల వల్ల అనుదినం పడిపోతూ అడుగంటిపోతుందేమో అనిపించే స్టాక్ మార్కెట్‌లో డబ్బులు పెట్టకూడదని నిర్ణయం తీసుకొన్నాడు. ఆ డబ్బుల్ని బేంకుల్లో వేస్తే అతి తక్కువ శాతం వడ్డీ వస్తుందని ఆ పని కూడా చెయ్యలేదు. ఆ డబ్బుని ఏం చేద్దాం అని ఆలోచిస్తున్న సమయంలో సొంతూరిలో వాళ్ళ మామయ్య డిగ్రీ కాలేజీ పెట్టాడు. ఆ కాలేజీలో ఇతను మదుపు పెట్టాడు. అది బాగానే పెరుగుతూ వచ్చింది. దాని పెరుగుదల ఇతని ఆనందాన్ని పెంచుతూ వచ్చింది.

పెరుగుతున్న ఆనందాన్ని పంచుకోవడానికి ఒక తోడు కావలసివచ్చింది. ఆ పనికి మావయ్య కూతురు సిద్ధంగా వుంది. తెలిసి సంతోషించాడు. మామయ్యకి ఒక్కర్తే కూతురన్న ఊహ రాగానే ఆ సంతోషం పదింతలయ్యింది, మావయ్య

పెట్టిన కాలేజీ మొత్తం తనదే అవుతుంది కాబట్టి. ఆ రోజు నుండి గాలిలో నడుస్తున్న భావన. నయం నైకీ ఎయిర్ షూ అనవసరంగా నూటయాభై డాలర్లు పోసి కొన్నాను కాదు, ఈ పాతిక డాలర్ల షులోనే నైకిలో నడుస్తున్న భావన అని అనుకొన్నాడు, మావయ్య కూతురు భావనని తలుచుకుంటూ. ఇంకొక్క ఏడాదిలో ఇండియా వెళ్ళిపోతాను. అప్పటికి కూడబెట్టిన డబ్బు లక్ష డాలర్లు, లక్షణమైన మావయ్య కూతురు, లక్షల్లో లాభాలు తెచ్చిపెడుతున్న డిగ్రీ కాలేజీ కళ్ళముందుకు వస్తున్నాయి. ప్రతిరోజూ అవి గుర్తుకు వచ్చినప్పుడల్లా ఆకలి నిద్ర తెలియని ఒక ఆనంద స్థితికి తీసుకెళ్తున్నాయి.

అలా అమెరికా హైవేలో అడ్డూ ఆపు ఏమీ లేకుండా గంటకి వంద మైళ్ల వేగంతో వెళ్తున్న అతని జీవిత వాహనం హటాత్తుగా నెత్తికి మొట్టికాయలు పెట్టే హైదరాబాద్ మెట్టుగూడ గతుకుల రోడ్ మీద కొచ్చిపడ్డట్టయ్యింది.

దానికి కారణం వాళ్ళ మావయ్య పెట్టిన కాలేజీయే. ఆ కాలేజీలో అతను తనకున్న ఎన్నో ఏళ్ళ అనుభవంతో ఒక కొత్త కోర్సు పెట్టాడు. అదే 'భార్య విద్యలో బి.ఏ., ఇంగ్లీష్‌లో చెప్పాలంటే 'బ్యాచిలర్ ఆఫ్ వైఫ్ స్టడీస్' స్పినిస్టర్ అంటే బ్యాచిలర్‌కు ఆడరూపం కదా అంటే, బి.ఏ. అన్నది మనకి అలవాటు, అలాగే వుండాలన్నారుట బోర్డు ఆఫ్ స్టడీస్ వాళ్ళు.

ఈ భార్య విద్యలో బిఏలో చేరడానికి యూనివర్సిటీ అరవై మందికే సీట్లు ఇచ్చినా మా మావయ్య డిజైన్ చేసిన కోర్సు చూసి రెండో ఏడాది నుండి వంద మంది చేరడానికి రెడీ అయ్యారుట. సీట్లు లేకున్నా మా కుర్చీలు మేం తెచ్చుకొని వేసుకుంటాం సార్, మీరు ఫీజు తీసుకోండి అన్నారుట. అది సరే కాని సర్టిఫికేట్ రాదని చెప్పాడుట. అయినా చేరతామన్నారుట. ఈ కోర్సు మూడేళ్ళు. ఏడాదికి రెండు సెమిస్టర్లు, సెమిస్టర్‌కి నాలుగు సబ్జెక్ట్సు. ఈ కోర్సులో మొత్తం ఇరవై నాలుగు పేపర్లు, వాటికి లాబ్స్, పరీక్షలు, పాస్, ఫెయిల్, గోల్డ్ మెడల్స్, పెళ్ళికి కాంపస్ ఇంటర్వ్యూలు. వంట, శుభ్రత, వ్యాయామం, ఇంగ్లీష్ ప్రతీ ఏడాది వుంటాయి. శృంగారం, షాపింగ్, అకౌంట్స్, సంగీతం, ఇంటీరియర్ డెకరేషన్, పిల్లల పెంపకం వీటితో పాటు ఆయుర్వేదం కూడా పాఠ్యాంశాలే. మొదటి బ్యాచ్ అమ్మాయిలందరికీ

కోర్సు పూర్తి అయిన వారం రోజులలో పెళ్ళి అయిపోయింది. పాస్ అయిన వాళ్ళకే కాక ఫెయిల్ అయిన వాళ్ళకు కూడా పెళ్ళిళ్ళు అయిపోతున్నాయి. ఇది తెలుసుకొని ఆంధ్రప్రదేశ్‌లో నలుమూలల నుండి అమ్మాయిలు చేరడానికి వస్తున్నారు. ఎంట్రెన్సు పెట్టవలసి వచ్చింది. ఆ ఫీజ్‌తోనే కాలేజీకి లాభాలు కనిపిస్తున్నాయి. డొనేషన్, బ్లాకు సీట్లు గట్రా గట్రా మరి చెప్పనక్కర్లేదు. ఈ ఏడాది ఒకమ్మాయి తన సీటు ఏడాదికి లక్ష చొప్పున మూడు లక్షలకి అమ్మేసిందట. అది చూసి అడ్మినిస్ట్రేషన్ వచ్చే ఏడాది నుండి ఫీజు లక్ష రూపాయలు చేస్తుందట. ఆ కోర్సుకై పెడుతున్న ఖర్చు మీద లాభం పదింతలు. ఇది ఇండియన్ కాలేజి అడ్మినిస్ట్రేషన్‌లో సంచలనం.

"అబ్బా... అంతా బాగుంది, ఇక నీకొచ్చిన ఆపద ఏవిటయ్యా" అన్నాను అసహనంగా.

"అదే సార్ పెద్ద ప్రాబ్లం... ఇది మంచి కోర్సు అని ఈనాడు పేపర్‌లో వసుంధర పేజీలో రాసారు సార్..."

"రాస్తే మంచిదే కదా... లక్షల మందికి తెలుస్తుంది" అన్నాను.

"అదే కొంపముంచింది సర్... ఫెమినిస్టులకి తెలిసింది. ఇది అన్యాయం, అమానుషం, పితృస్వామ్య వ్యవస్థ ఆధిపత్యానికి ఉదాహరణ అని, మనువు నుండి మామయ్య దాకా మొలత్రాడు కట్టి నిలబడ్డ ప్రతి మగాడినీ తిట్టి ఈ కోర్సు తీసెయ్యాలని అంటున్నారండి" అన్నాడు.

"ఇది మంచి కోర్సు కాకపోతే మరి అంతమంది ఎందుకు జాయిన్ అవుతారని అడగలేకపోయారా?"

"అలాగే చెప్పబోయాడట సార్, ఇది చెడ్డ కోర్సు, నీకు మాచెడ్డ డబ్బు లొస్తున్నాయి కాబట్టి నడుపుతున్నావ్. ఈ కోర్సు నడపకూడదు. ఇది మార్క్స్ చెప్పినట్లు 'మత్తు మందు' అన్నారుట."

"కార్ల్‌మార్క్స్ 'మతం మత్తుమందు' అన్నాడు కాబోలు, ఈ కోర్సు గురించి అతనికేం తెలియదు కదా..."

"అలా అనేవాళ్ళకి కార్ల్ మార్క్స్ గురించి, అతను అన్నదాని గురించి ఎందుకు సార్... మార్క్స్, గాంధీ ఏమీ అనకపోయినా ఇప్పుడు వాళ్ళు అన్నారంటే మనం ఏమీ చెయ్యలేం కద. ఇదీ అంతే..."

"అవును ఇదంతే. మార్క్స్, గాంధీ కలిసొచ్చినా ఏమీ చెయ్యలేరు..." అన్నాను, ఏమనాలో తోచక.

"మీరు వచ్చే వారం ఇండియా వెళ్తున్నారుట కదా సార్.."

"మీకెలా తెలిసింది..." అన్నాను ఆశ్చర్యంగా, నేను వెళుతున్నది సీక్రెట్ కాదు కాని, నాతో ఏ పరిచయం లేని ఇతనికెలా తెలిసిందన్న కుతూహలంతో.

"మీ ఫ్రెండ్స్ శోభ గారి ఇంటి ప్రక్కనున్న నాగేష్ గారి మేనల్లుడు న్యూ జెర్సీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో చేరడానికి క్రిందటి నెల వచ్చాడుట. అతను తన ఫేవరేట్ షర్టు తెచ్చుకోవడం మర్చిపోయాడుట, మీరు ఎలాగో ఇండియా వస్తున్నారు, తిరిగి ఓ పది రోజులలో న్యూయార్క్ వస్తారని తెలిసి ఆ షర్టు ఇవ్వాలని ఆ అబ్బాయి వాళ్ళు ఫోన్ చేయించారట. ఆ ఫోన్ చేసిన ఆయన వాళ్ళ బావమరిదికి ఈ విషయం చెప్పాడుట. అతను మా ఊరివాడే. అతను మావయ్య కష్టంలో వున్నాడని తెలిసి మీ రాక గురించి చెప్పి, మీవల్ల ఏమైనా అవుతుందేమోనని చెప్పి, ఒక రాయి వెయ్యమన్నాడుట. ..."

'నా ప్రయాణానికి ఇంత ప్రచారం ఉందా...!' అని అనుకుని, "నేను వెళ్ళి ఏం చేస్తానండి?"

"ఏమో సార్ నాకు తెలీదు... వెళ్ళి మావయ్యను కలవండి ప్లీజ్.. ఏదైనా మంచి జరుగుతుంది సార్..."

'మంచి' ఎవరికి? ఎందుకు? ఎలాగో? కూడా తెలియదు, కాని నేను వెళ్ళాలి. నామీద అతనికున్న విశ్వాసానికి ఆశ్చర్యపోయాను.

'ఎందుకింత నమ్మకం' అని అడగబోయి, దానికి మరే కథ చెబుతాడోనని అడగడం మానేసాను.

"సరే ఆలోచించుకొని చెప్తా" అన్నాను ఇక వెళ్ళమన్నట్లు.

"తప్పకుండా వెళ్లండి సార్... ఏర్పాట్లు అన్ని నేను చూసుకుంటాను" అన్నాడు వినయంగా.

***

భార్య విద్యలో బి.ఏ. పెట్టినాయన వచ్చి ఎయిర్‌పోర్ట్‌లో నన్ను రిసీవ్ చేసుకున్నాడు. కారులో వాళ్ళ ఊరు బయలుదేరాం. దార్లో "అసలు మీకు ఈ కోర్సు పెట్టాలన్న ఉద్దేశ్యం ఎలా కలిగింది" అని అడిగాను.

"ఉద్యోగం చేసుకునే అమ్మాయే కట్నం అనుకొని, అందరూ కట్నం లేకుండా పెళ్ళి చేసుకుంటున్నారు. కాని అలా చేసుకున్న అమ్మాయిలు ఇల్లు నడపలేక, నడపడానికి కావలసిన జ్ఞానం లేక, ఎన్నో బాధలు పడుతున్నారు అని గ్రహించి అలాంటి కోర్సు ఒకటి పెడితే ఎలా ఉంటుందన్న ఆలోచన వచ్చిందండి"

"మరి మీకు ఆ విద్యార్థినులు ఎక్కడ నుండి వచ్చారు?"

"ఆడపిల్లల్ని పైవూర్లకు చదువుకు పంపకూడదనుకునేవారు, పిల్లల గొడవతో ఏదో ఒక కోర్సులో చేర్చాలని నిర్ణయించుకున్నవాళ్ళు, వెంటనే పెళ్ళి చేయాలన్న ఉద్దేశ్యం ఉన్నవాళ్ళే మా కాలేజీకి వచ్చారు. ఒకసారి మా కోర్సులో చేరిన అమ్మాయిలలో వచ్చిన మార్పు చూసి పొరుగూళ్ళ వాళ్ళు, ప్రక్క జిల్లాల వాళ్ళు కూడా రావడం మొదలుపెట్టారండి"

ఆయన కాలేజీకి తీసుకువెళ్లారు. భార్య విద్యలో బి.ఏ. చదువుతున్న విద్యార్థినులను కలిసి రోజంతా వాళ్ళతో మాట్లాడి వాళ్ళ కార్యక్రమాలని పరిశీలించాను. చాలా ముచ్చటేసింది. హాయిగా సంసారం చేసుకుంటూ బ్రతకడానికి కావలసిన అన్ని విషయాలు చక్కగా క్లాసురూంలో నేర్చుకుంటున్నారు. వాటిలో వీలయినన్ని ప్రయోగశాలలో ఆచరణలో పెట్టడం నేర్చుకుంటున్నారు. హాయిగా బ్రతకడానికి చదువు ఉపయోగపడాలన్న ఉద్దేశం ప్రకారం చూస్తే ఈ కోర్సు దాన్ని చక్కగా నెరవేరుస్తోందని నాకనిపించింది.

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పోవడంతో, తరతరాలుగా తరగతి అక్కర్లేకుండా

తెలుసుకోవలసిన విషయాల్ని తేలికగా, తెలివిగా తెలియజెప్పే ఒక చక్కని 'జీవిత పాఠశాలకి' తలుపులు మూసేయడం జరిగింది. చిన్న చిన్న కుటుంబాలు ఎన్నెన్నో చేదు అనుభవాల పునాదుల మీద 'హాయిగా' బ్రతకడం నేర్చుకుంటున్నాయి. కొత్తగా పెళ్ళి చేసుకొని సంసారం చేసుకుంటున్న కొన్ని జంటల్ని చూసినప్పుడు – పెరిగిన పెద్ద పిల్లలు పాకుతున్నట్లు, నడవలేక నడుస్తున్నట్టు, పడి దెబ్బలు తగిలించుకుంటున్నట్లు అనిపిస్తుంది.

"రేపు ఫెమినిస్టు సంఘం వాళ్ళు కాలేజీ బంద్ చెయ్యడానికి వస్తున్నారు. మీరు వాళ్ళతో ఒకసారి మాట్లాడితే..."

"సరే అలాగే..." అన్నాను.

కుటుంబ వ్యవస్థ, ఆ వ్యవస్థలో భార్యాభర్తల పాత్రలు కలగాపులగం అయిపోయాయి. సంసారం చెయ్యడం, వంట చెయ్యడం, పిల్లల్ని పెంచడం, సమాజంలో బ్రతకడం ఇవన్నీ ఎవరికివారే, ఎప్పటికప్పుడు ఎలాగో ఒకలా నేర్చుకోవడం నేటి సమాజంలో ఒక వింత సమస్య. అన్ని సమపాళ్ళలో సవ్యంగా తెలుసుకొని ఆచరించి ఆనందించేవాళ్ళు అదృష్టవంతులని అనుకుంటున్నారు. ఈ జీవిత పరుగుపందెంలో దురదృష్టవంతులే ఎక్కువ. హాయిగా బ్రతకడానికి మనిషి వేల సంవత్సరాలుగా చేస్తున్న ప్రయత్నాన్ని, అనుభవాన్ని చాదస్తం పేరుతోనో, మరో దాని పేరుతోనో విమర్శించి, ఎవరి చేతులు వాళ్ళు కాల్చుకొని ఆ పిదప ఆకులు పట్టుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి ఆలోచనలతో కాలేజీ గెస్టహౌస్‌లో ఆ రాత్రి పడుకొన్నాను.

***

ఉదయం నేను కాలేజీకి వచ్చేసరికి ఒక పాతిక మంది స్త్రీలు మధ్య వయస్సు నుండి ముసలితనపు ముడతలు మొహమాటంగా మొహంపై వస్తూ పోతూ ఉన్న వయసువాళ్లు ఉన్నారు. వాళ్ల చేతుల్లో 'నిన్నటి ఆలోచన నిప్పుల్లో వెయ్యాలి!', 'భార్య విద్యని బంద్ చెయ్యాలి!', 'నీలి ఆకాశం నిప్పులు చెరుగుతుంది', 'పైట చింపి పాశం చేస్తాం', 'మగ దురహంకార గాడిదలు డౌన్ డౌన్', 'నేటి నారి విల్లు కాదు గన్ను', 'స్త్రీ యే సృష్టికి మూలం', 'స్త్రీయే సృష్టికి చాలు',

'వీర్యానికి కాలం చెల్లింది', 'మాట వినని మగ జాతి నశిస్తుంది', వగైరా వగైరా వ్రాసి ఉన్న అట్టలు ఉన్నాయి.

వారి నినాదాలతో కాలేజీ ఆవరణ నిండిపోయింది. కాలేజీ అమ్మాయిలు ఇంగ్లీష్ సినిమా చూస్తున్న తెలుగు ప్రేక్షకుల్లా ఎక్కడ ఏ ఎక్స్‌ప్రెషన్స్ ఇవ్వాలో తెలీక, పుస్తకాల వెనుక ఎగసి పడుతున్న గుండెల్ని, గుండె చప్పుళ్ళని అదిమిపెట్టి, రాబోయే పరిణామాలకి ఉత్సుకతతో ఎదురు చూస్తున్నారు.

"దయచేసి లోపలికి రండి మాట్లాడుకుందాం..."

"మనం ఈ విషయాన్ని శాంతియుతంగా చర్చించుకోవాలనా? మీరు మమ్మల్ని చర్చలకి ఆహ్వానిస్తున్నారా'? ప్రశ్నించిందో మహిళ.

"అవునండి..."

"అలా అయితే ఆ భాషలో చెప్పండి. మాట్లాడుకోవడం ఏమిటి? మీరు పేపర్లు చదవరా? టీవిలో న్యూస్ చూడరా?"

"నినాదాలు ఆపండి, మన చర్చలు విజయవంతం అవుతాయి. మన నాయకురాళ్ళతో కాలేజీ యాజమాన్యం భేటీ అవుతున్నారు. చర్చలు విఫలమైతే ఈ ఉద్యమం ఉధృతం అవుతుంది. మనం ఆమరణ నిరాహార దీక్ష వంటి త్యాగాలకు సిద్ధం కావాలి." అని గట్టిగా తమవాళ్ళని ఉద్దేశించి మాట్లాడి, చేతిలో ఉన్న అట్టని ప్రక్కవాళ్ళకి అప్పచెప్పి ఒకావిడ ముందుకు వచ్చింది. ఆమెతో పాటు ఆరుగురు ఆఫీసులోకి వచ్చారు.

"ఈ భార్య విద్యలో బి.ఏ. డిగ్రీ మీరు తీసెయ్యాలి!" అందరూ ఒకేసారి స్లోగన్‌లా అన్నారు. బిక్కమొహంతో కోర్సు పెట్టినాయన నావైపు చూసి అందరినీ కుర్చీలలో కూర్చోమన్నాడు.

"ఈ కోర్సుని మీరు ఎందుకు తీసేయ్యమంటున్నారు?" అడిగాను మెల్లగా.

"ఆడదాని అసలు శక్తి ముందు మగవాడు ఎందుకు పనికిరాడు. ఆకాశంలో సగం మాది, భూమిలో సగం మాది. భూమిలో సగం మందిని తీసేస్తే, పనికిరాని

సగంతో మీరు ఏమీ చెయ్యలేరు. పితృస్వామ్యంలో మమ్మల్ని తరతరాలుగా అణచివేస్తున్నారు, మీ అణచివేత ఆగాలి. దానికి అంతిమ క్షణాలు వచ్చేసాయి."

"వాటిల్లో వేటినీ మేం కాదనడం లేదు. ఈ కోర్సునెందుకు తీసెయ్యాలో చెప్పండి?" అన్నాను ప్రాధేయపడుతూ.

"ఈ కోర్సువల్ల స్త్రీకి అన్యాయం జరుగుతుంది కనుక"

"ఈ కోర్సుని స్త్రీ – మంచి భార్యగా, తల్లిగా, మనిషిగా సమర్థత వున్న వ్యక్తిగా తీర్చిదిద్దుతుందని మా ఉద్దేశ్యం... మా...."

"మొగోడికి భార్యగా తీర్చిదిద్దడం మొగాడి కోసం, మొగాడి మోసం..."

"భార్యాభర్తలు కలిసి హాయిగా సుఖంగా సంసారం చేసుకుంటేనే కదా మనం అభివృద్ధి చెందేది. స్త్రీగా, పురుషుడిగా కాకుండా, మానవులుగా ఆలోచించండి..."

"మాకక్కర్లేదు. స్త్రీ అభివృద్ధి చెందాలంటే మగాళ్ళక్కర్లేదు. మగాడు లేకుండానే పిల్లల్ని కనొచ్చు. క్లోనింగ్‌తో మగ సంబంధం లేకుండానే స్త్రీ జాతి వృద్ధి చెందవచ్చు. ఇరవై ఒకటవ శతాబ్దంలో వున్నాం. వెయ్యేళ్ళ వెనకటి మాటలు మానండి."

"అవన్నీ నిజాలే. మేం ఈ కోర్సు పెట్టి మగాడిని గొప్ప చేయడం లేదు, ఆడదానికి కావలసినవి..."

"మొగాడి కోసమే కాకపోతే, ఆడదాని కోసం మొగాడికి కోర్సు పెట్టండి..."

"ఇది సరియైన పాయింటే.." అన్నాను. ఆ ముక్క అనడంతో నా ఆలోచనలు వెంటనే భర్త విద్యలో బిఏ కోర్సు వైపు పరిగెత్తాయి. "అంటే భర్త విద్యకు బిఏ పెట్టమంటారు అంతేనా" అన్నాను.

"అవును. సంసారం కోసం ఆడదే ఎందుకు చదివి కష్టపడాలి. మగాడు కూడా కష్టపడి చదివి, అన్నీ నేర్చుకుని పెళ్ళికి సిద్ధం కావాలి."

నన్ను తీసుకొచ్చిన ఆయనవైపు చూసాను. ఆయన మొహంలో ఆనందం

కనిపించింది. ఆయనకి ఇప్పుడు మరో కోర్సు, మరో క్లాసు, క్లాసులో అరవైమంది, వాళ్ళ ఫీజులు... ఆ లెక్కలు కళ్ళముందు  సినిమా రీళ్ళలా కదిలిపోతున్నాయి.

"మొగవాళ్లకి కూడా భర్త విద్యలో బిఏ పెడతాం వచ్చే ఏడాది నుండి. మీ సలహాకి కృతజ్ఞతలు" అన్నాడు ఆనందంగా.

"అంతేకాదు మగవాళ్ళ కోర్సులు మరింత కష్టంగా ఉండాలి. గిన్నెలు తోమడం, ఇల్లు కడగడం, బట్టలు ఉతకడం లాంటివి కూడా వుండాలి"

"మగవాళ్ళకి పాస్ మార్కులు అరవై శాతంపైనే వుండాలి"

"అవి బోర్డు ఆఫ్ స్టడీస్ నిర్ణయిస్తారండీ..." అన్నాడు.

"హమ్మయ్య, ఈ విషయంలో చక్కటి పరిష్కార మార్గం దొరికింది" అన్నాను అందరినీ తృప్తిగా చూస్తూ.

"స్త్రీకి బిఏ, మగాడికి బిఏ కుదరదు, మగాడు ఎంఏ చదవాలి" అన్నది ఒకావిడ.

"అంటే మరో రెండేళ్ళు..." అన్నాడు మా కాలేజీ కరస్పాండెంట్ ఆనందం పట్టలేక పైకి చాలా సంతోషంగా – "భర్తకి ఎం.ఏ., భార్యకి బి.ఏ. ఇక అన్ని కాలేజీల్లో... సిలబస్ అడ్మిషన్లు..."

*

**ఏ సమస్యకైన సులభమైన, సున్నితమైన పరిష్కారాలు ఉంటాయని వాటి గురించి ఆలోచించమని నన్ను ప్రోత్సహించిన గురువు శ్రీ గుడిమెట్ల సుబ్బిరెడ్డి గారికి నమస్కరిస్తూ...**

# ఖబడ్దార్ మాష్టారి శిష్యుణ్ణి

**జ**గన్నాథం గారు రిటైరై చాలా కాలమైంది. మా ఊరి చుట్టుప్రక్కల గ్రామాలలో ముప్పైఏళ్ళకు పైగా పాఠాలు బోధించిన మాష్టారు ఆయన. పాఠాలు చెప్పడమే కాకుండా, పల్లెలోని ప్రజలకు ఉత్తరాలు వ్రాసి పెడతారు. కోర్టు కాగితాలు చదివి వివరిస్తారు. ఆయన చుట్టుప్రక్క గ్రామాలలో ఎంతో మందికి ఎన్నో విధాలుగా సహాయం చేస్తూ తన జీవితం సాఫీగా సాగించారు. రిటైర్ అయినా కూడా ఊర్లో, ఊరి చుట్టుప్రక్కల గ్రామాలలో ప్రజలకు ఏదో విధంగా ఉపయోగపడుతూ ఉద్యోగం చేస్తున్నంత బిజీగా ఉంటారు. రోజూ ఉదయం లేచిన దగ్గర నుండి ఇంగ్లీషు పాఠాలు, ప్రభుత్వ కార్యాలయాలకు దరఖాస్తులు, పురపాలక సంఘం వారికి అర్జీలు, రిటైర్ అయిన వాళ్ళకి పింఛన్ విషయాలు, బ్యాంక్ విషయాలు, చదువుకోడానికి పిల్లలకి ప్రభుత్వం ఇచ్చే స్కాలర్‌షిప్‌లు తెప్పించడం, అర్హతలేని అగ్రకులాల బీద పిల్లలకు తనకు వీలయినంత ఆర్థిక సహాయం చేసి, నలుగురి చేత ఇప్పించి వారి చదువు పూర్తయ్యేలా చేస్తారు. చదువు పూర్తయిన వాళ్లకి ఉద్యోగాలకి దరఖాస్తులు ఎలా పెట్టాలో, ఇంటర్వ్యూలకి ఎలా తయారవ్వాలో చెబుతారు. అర్హతలున్న వారికి తనకు తెలిసిన వాళ్ళ ద్వారా ఉద్యోగాలు వేయిస్తారు. ఇలా ఎన్నో రకాల పనులతో ఆయన అందరి మనిషిగా అన్ని పనులు ఆయనవే నన్నట్లు చేస్తారు. ఊర్లో ఎక్కడికి వెళ్ళాలన్నా నడిచే వెళ్ళేవారు. అందువల్ల ఆయనతో దాదాపు అందరికి ముఖ పరిచయం ఉంది.

ఆయన ఉండే వీధి చివరనున్న ఐదు రోడ్ల జంక్షన్లో క్రిష్ణ అనే అతడి కిళ్ళీకొట్టు ఉంది. సాయంత్రం సాధారణంగా చాలామంది అక్కడ నిలబడి కబుర్లు చెప్పుకుంటారు. ఒకరోజు జగన్నాధం గారు అక్కడ నిలబడి కబుర్లాడుతూ సోడా తాగుతున్నారు. మాష్టార్ని చూసి ఆ జంక్షన్‌లోంచి వెళుతున్న మా వూరి ఎమ్మెల్యే కారు, దాని వెనక వస్తున్న మరో రెండు కార్లు హఠాత్తుగా ఆగాయి. కారులోంచి ఎమ్మెల్యే, ఆయన అనుచరులు దిగారు.

"ఒరేయ్ జగన్నాధం మేష్టు..." అని ఎమ్మెల్యే అరిచాడో, పిలిచాడో తెలియనట్లు గట్టిగా అన్నాడు. ట్రాఫిక్ ఆగిపోయింది. మనుషులు కదలకుండా నిలబడిపోయారు. జగన్నాధం గారికి అటూ ఇటూ ఉన్న వ్యక్తులు ఆయనకు దూరంగా జరిగారు. జగన్నాధం గారు ఎక్కడ ఉన్నారో అక్కడే కదలకుండా నిలబడ్డారు. ఎమ్మెల్యే అతని వైపే పెద్ద పెద్ద అంగలతో నడిచి వెళ్ళాడు. గుంపు ఉత్కంఠతో ఏం జరుగుతుందా అని చూస్తున్నారు.

"ముసిలోళ్ళ పింఛన్లని, ఇళ్ళ స్థలాలని నా అపోజిషన్‌లో ఉన్న మాల, మాదిగల చేత అప్లికేషన్లు పెట్టిస్తావుట్రా? నన్నెదిరించాలనుకొంటున్నావా? ఆ నా కొడుకులు వంగి దండం పెట్టేదాకా ఆళ్ళకి ప్రభుత్వం నుండి చీపురు పుల్లకూడా అందదు. కలక్టర్‌కే అర్జీలు పెట్టిస్తావురా? నువ్వు పెట్టించిన దరఖాస్తులన్నీ ఆ కలెక్టర్ గాడి చేత్తోనే చింపించాను. ఏం చేసుకొంటావో చేసుకో. జాగ్రత్త?" అంటూ అందరి వైపు తిరిగి "నాతో పెట్టుకోవద్దు" ఓ వార్నింగు ఇచ్చాడు.

"ఎమ్మెల్యే గారూ! మీ నియోజకవర్గంలో చాలా ఉన్న అన్ని గ్రామాలలో పని చేసాను. ఆ గ్రామాలలో ఉన్న వాళ్ళు అందరూ ఏ కులం వాళ్ళయినా నాకు కావాల్సిన మనుషులే. గవర్నమెంటు పథకాలకి అర్హులైన వారితో అర్జీలు పెట్టిస్తున్నాను. వాళ్ళకి రావాల్సిన పింఛన్లు, లోన్లు, ఇళ్ళస్థలాలు..." జగన్నాధం మాటల్ని లెక్కపెట్టకుండా –

"అవి నా మనుషులైతేనే వస్తాయి. నాకు ఓటేస్తేనే వస్తాయి. నా నియోజకవర్గంలో ఉన్న వాళ్ళంతా నా ప్రజలు. ఎవరికి ఏం చెయ్యాలో, ఎప్పుడు చెయ్యాలో, ఎలా చెయ్యాలో నేను, నా మనుషులు చూసుకొంటాం. నువ్వు నోరుమూసుకొని ఉండు" అన్నాడు ఎమ్మెల్యే ఆవేశంతో ఊగిపోతూ.

"నేను తిరిగి దరఖాస్తు పెట్టించిన వాళ్ళంతా ఏడాదిగా ఎదురుచూస్తున్న వాళ్ళే. వాళ్ళకి..." మళ్ళీ అతని మాటలకి అడ్డు వస్తూ –

"నువ్వు ఏ మాల మాదిగ నా కొడుకులకి సాయం చేయాలనుకుంటున్నావో వాళ్ళచేత నీమీద ఎస్సీ, ఎస్టీ వేధింపుల చట్టం కింద కేసు పెట్టిస్తాను జాగ్రత్త" అని మరింత ఆవేశంతో గట్టిగా అరిచాడు. అందరూ చూస్తూ నిలబడ్డారు. ఒక్కరూ కాలు కదపలేదు. నోరు మెదపలేదు. వాతావరణం అంతా స్తంభించి పోయినట్లుంది.

"ప్రజల్నీ, చట్టాల్నీ పావుల్లా వాడుకునేవాళ్ళు మట్టి కొట్టుకుపోతారు, ఖబడ్దార్!" అని జగన్నాధం మాష్టారు నిర్భయంగా, గట్టిగా, రాజకీయాల్లో ఉన్న అందర్నీ ఉద్దేశించి అన్నట్టు అన్నారు.

"ఏమన్నావురా నాకొడకా...." అంటూ జగన్నాధం మాష్టారివైపు దూసుకువస్తున్న ఎమ్మెల్యే వెనక అతని అనుచరులూ కదిలారు. ఇంతలో ఆవేశం ఎక్కువై కాబోలు భారీ కాయం ఉన్న ఎమ్మెల్యే ఒక్కసారి కుప్పకూలాడు రోడ్డుమీద. కిళ్ళీకొట్టు క్రిష్ణ వాటర్ బాటిల్ ఒకటి తీసుకొని పరుగున వచ్చి ఎమ్మెల్యే మొహం మీద నీళ్ళు చిలకరించాడు. జనంలోంచి ఎవరో జగన్నాధంగారిని గుంపులోంచి బయటకు తీసుకెళ్ళిపోయారు. కిళ్ళీకొట్టు క్రిష్ణ గోలీ సోడాకొట్టి ఎమ్మెల్యే గారి చేత తాగించాడు. కోలుకున్న ఎమ్మెల్యేని ఆయన మనుషులు కారెక్కించి తీసుకెళ్ళిపోయారు.

ఇదంతా చూస్తున్న జనం బొమ్మల్లా నిలబడిపోయారు. అప్పటికే అక్కడికి చేరిన కాలేజీ కుర్రాళ్ళు, స్కూలు పిల్లలు, పెద్దలు ఎమ్మెల్యేని నడిరోడ్డుమీద 'ఖబడ్దార్' అనగలిగిన మొగాణ్ణి చూసినందుకు చాలా గర్వించారు. ఆనందించారు.

పబ్లిక్‌గా గొడవపెట్టుకున్నందుకు ఎమ్మెల్యేని వాళ్ళ నాన్న తిట్టాడు. అందరి దృష్టి ఈ సంఘటన మీద ఉంటుంది. అపోజిషన్ వాళ్ళు దీన్ని పెద్దది చేస్తారు. అందువల్ల ఆ మేష్టర్ని మరేం అనడం కాని, చెయ్యడం కాని మంచిది కాదని అన్నాడు.

అప్పటినుండి మా ఊర్లో అందరూ ఆయన్ని 'ఖబడ్దార్ మాష్టారు' అని పిలుస్తుంటారు.

***

కొంతకాలం తరువాత ప్రజలు ఈ విషయం మరిచిపోయారు.

సమయానికి సోడా అందించాడన్న కృతజ్ఞతతో ఎమ్మెల్యే మనుషులు క్రిష్ణని చేరదీసారు. క్రిష్ణకి కిళ్ళీకొట్టును మించి ఇంకా ఎదగాలన్న ఆశ ఉంది. రాజకీయాల్లో ఎలా చేరాలో సరిగ్గా తెలియలేదు. సరిగ్గా అటువంటి సమయంలో ఇటువంటి అవకాశం రావడం తన దశ తిరిగిపోడానికే అనుకొని రాత్రీ పగలూ రాజకీయాల గురించి ఆలోచించడం, పేపరులో రాజకీయాలు చదవడం, ఎమ్మెల్యేతోనో అతని అనుచరులతోనో వీలైనంత కాలం గడపడం మొదలు పెట్టాడు. దీనివల్ల వచ్చిన కొత్త పలుకుబడి వల్ల కిళ్ళీకొట్టు వ్యాపారం కూడా పెరిగింది.

మూడేళ్ళలో ఎమ్మెల్యేకి దగ్గరయ్యాడు. పార్టీలో చేరాలని నిశ్చయించు కొన్నాడు. ఇంతలో ఎలక్షన్లు వస్తున్నాయన్న వార్త అతనికి మరింత ఆనందం కలిగించింది. ఎలక్షన్ల ముందు ఎంతోమందిని పార్టీలో చేర్చే కార్యక్రమం ఉంటుంది. దాన్ని లాంఛనంగా కిళ్ళీకొట్టు క్రిష్ణతో మొదలుపెట్టాలని ఎమ్మెల్యే కూడా నిర్ణయించుకున్నాడు. ఓ వంద మందిని పార్టీలో చేర్పించమని కిళ్ళీకొట్టు క్రిష్ణకి కబురు పెట్టాడు. క్రిష్ణ చేర్పించబోయే వంద మంది ఒక్కొక్కళ్ళు ఒక వందమందిని వచ్చే రెండు మూడు నెలల్లో చేర్పించేందుకు తగిన పథకాన్ని తయారు చేసాడు క్రిష్ణ.  ఆ విధంగా పార్టీలోకి రాబోతున్న వారందరికి తాను లీడర్ అవుతానన్నది క్రిష్ణకి చాలా గొప్పగా అనిపించింది. ఎమ్మెల్యే కొడుకు చిన్నవాడు. తమ్ముడు వేరే పార్టీలో ఉన్నాడు. అన్నలు వ్యాపారంలో ఉన్నారు. ఇక సరియైన వారసుడు తనేనేమోనన్న గొంతెమ్మ ఆశ క్రిష్ణని రాత్రీ పగలూ ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది.

రాబోతున్న ఎన్నికల హడావిడితో ఎమ్మెల్యే భవంతి కోలాహలంగా ఉంది. ఆ వీధి చివరలో ఉన్న క్రిష్ణ కిళ్ళీకొట్టు మరింత ప్రాముఖ్యాన్ని సంపాదించు కొంది. క్రిష్ణ తమ్ముడిని కిళ్ళీకొట్లో కూర్చోబెట్టాడు. ఇవాళో రేపో ఎమ్మెల్యేకి మళ్ళీ టికెట్టు రాగానే ఇక క్రిష్ణ నేతృత్వంలో కొత్త కార్యకర్తలతో ఊరూరా ప్రచారం మొదలవ్వాలి.

సరిగ్గా అటువంటి సమయంలో హైదరాబాదు నుంచి పిడుగు లాంటి వార్త వచ్చింది, ఎమ్మెల్యేకి వచ్చే ఎలక్షన్‌లో ఈ నియోజకవర్గం నుండి టికెట్టు ఇవ్వడం లేదని. అది విన్న ఎమ్మెల్యే ఆవేశపడి పార్టీలో అందరికి ఫోన్ చేశాడు. ఎవడికి ఇచ్చారో తెలిస్తే వాడి అంతు చూస్తానన్నాడు. హైబీపీ ఉన్నా సరే ఎమ్మెల్యే విశ్రాంతి తీసుకోలేదు. డాక్టర్ల మాట వినకుండా, రెండు రోజుల పాటు రాత్రి పగలు టిక్కెట్టు కోసం చేయరాని ప్రయత్నాలు అన్నీ చేసాడు. తనని రాజకీయాల్లోకి పంపి, వెనుక దన్నుగా ఉన్న తన అన్నకే ఆ టిక్కెట్టు వచ్చింది అని తెలిసి తట్టుకోలేకపోయాడు. తన అండతోనే దొంగ వ్యాపారం చేస్తూ బాగా డబ్బులు సంపాదించిన తన అన్నే తనకి తెలీకుండా టిక్కెట్టు కొట్టేశాడు. ఈసారి పార్టీకోసం పనిచేస్తే, వచ్చే ఎన్నికలకి సీటు ఇస్తామని వాగ్దానం చేసింది పార్టీ. ఇంత మోసం తట్టుకోలేకపోయాడు. గుండెపోటు వచ్చింది. ఐనా చివరి ప్రయత్నంగా హైదరాబాదు పోయాడు. అక్కడే చివరి క్షణలు గడిపాడు.

ఎమ్మెల్యే మరణ వార్త విన్న క్రిష్ణకి కాళ్ళూ చేతులు ఆడలేదు. తన భవిష్యత్ ఏమిటోనన్న ఆలోచన నల్లమేఘాల్లా కమ్మింది. తను చేర్పించిన వందమంది క్రిష్ణకి ధైర్యం చెప్పారు. లేచి చెయ్యవలసిన పనులు చెయ్యమన్నారు. ఎమ్మెల్యే అంత్యక్రియల్లో ముఖ్యమైన పాత్ర తీసుకోమన్నారు. పోయిన ఎమ్మెల్యేకి క్రిష్ణ వారసుడన్నారు. క్రిష్ణకి మళ్లీ బలం వచ్చింది. ఎమ్మెల్యే అంత్యక్రియలకి కుటుంబంలో వ్యక్తిలా ఏర్పాట్లు చెయ్యడం మొదలెట్టాడు. వేలలో జనం వస్తారని దానికి తగిన ఏర్పాట్లు చెయ్యసాగాడు. తన కిళ్ళీకొట్టుకి వచ్చే జనానికి సరిపోయే నీళ్ళ ప్యాకెట్లు, పళ్ళు, బిస్కెట్లు, తినుబండారాలు ఇవ్వవలసి వస్తుందని ముందుగా డబ్బుపెట్టి సరుకు తెచ్చి ఉంచాడు. అంత్యక్రియల రోజు ఉదయం పాడె సిద్ధం చేశాడు. ప్రజలు వచ్చిన తరువాత ఓ ఊరేగింపుగా స్మశానానికి తీసుకెళ్ళాలని నిశ్చయించాడు.

ఎనిమిది గంటలైంది. ఎమ్మెల్యే ఇంటి ముందు పదిపదిహేను మందికంటే మనుషులు లేరు. పదిగంటలైనా పాతిక మందికి మించలేదు. పన్నెండయ్యేసరికి ఉన్న వాళ్ళలో కొంతమంది ఇప్పుడే వస్తామని వెళ్ళారు. క్రిష్ణ ప్రయత్నంతో అతి

కష్టం మీద మధ్యాహ్నం నాలుగు గంటలకి ఓ వందమంది పోగయ్యారు. ఇక క్రిష్ణే ఎమ్మెల్యే వారసుడు, శిష్యుడు అని అంతా అన్నారు. ఎమ్మెల్యే శవయాత్ర అతి సాధారణంగా ముగిసింది. ఇటు మనుషులు రాక, తెప్పించిన సామాను చెల్లుబడి కాక క్రిష్ణ పరిస్థితి అయోమయంగా అయింది. ఆ రాత్రి ఎలాగో అతికష్టం మీద నిద్రపోయాడు.

***

"క్రిష్ణా లే! లే! కొట్టు తియ్యాలి" అంటూ తట్టి లేపుతున్న తల్లి మాటలకి కళ్ళు తెరిచాడు.

"టైం ఎంతైందేంటి?" అన్నాడు మత్తుగా.

"ఏడు గంటలే అయింది. కాని…"

"ఏడేనా?… మరో గంట పడుకోనీ. ఇవాళ లేటుగా తీస్తా కొట్టు" అని ముసుగు పెట్టుకొన్నాడు దుప్పటితో.

"లే… లే…" అని ముసుగు లాగేస్తూ తల్లి "కొట్టుకాడ మనుషులు నీళ్ళ పేకట్ల కోసం చూస్తున్నారు లే!" అన్నది.

"ఇంత ఉదయాన్నా…"

"అవును. ఏమో మరి, కొట్టు తలుపు కొడుతున్నారు అరగంట నుండి" క్రిష్ణ లేచి మొహం కడుక్కొని "అమ్మా, టీ ఇవ్వవే" అని చెప్పి ఇంటిముందు భాగంలో ఉన్న కొట్టువైపు వెళ్ళాడు. అక్కడ అప్పటికే ఓ పాతికమంది నిలబడి ఉన్నారు. వాళ్ళెవరూ రోజూవచ్చే వాళ్ళు కారు. అయినా ఇంత ఉదయం ఎందుకు వచ్చారో అని అనుకొన్నాడు. అదే వాళ్ళని అడిగాడు.

"మా మేష్టారు గారు సనిపోనారండీ…" అన్నాడు ఒక పల్లెటూరి నాయుడు తన ఇంట్లో మనిషి చనిపోయినంత దీనమైన గొంతుతో.

"ఏ మేష్టారు…" క్రిష్ణ తాళం తీస్తూ అడిగాడు.

"అదే మన ఖబడ్దార్ మాష్టారు" అన్నాడు అప్పుడే అక్కడకు చేరిన క్రిష్ణ కొట్లో పనిచేసే కుర్రాడు.

తాళం తీసి తలుపులా అమర్చిన ఒక్కొక్క చెక్క తీసి పక్కన పెడుతున్న క్రిష్ణకి ఎప్పుడో తన కొట్టు ముందు జరిగిన సంఘటన గుర్తుకు వచ్చింది. చెయ్యి జారి చేతిలో చెక్క కాలుమీద పడింది. కాలు జివ్వుమని లాగింది.

అయిదు రోడ్ల జంక్షన్లో ఒకరోడ్డు చివర ఖబడ్దార్ మాష్టారు ఇల్లుంది. అటువైపు తిరిగి చూసాడు. ఆ వీధిలో చాలా మంది మనుషులు గుంపులు గుంపులుగా నిలబడి ఉన్నారు.

కొట్టు, బేరాలు కొట్లో పనిచేసే కుర్రాడికి అప్పచెప్పి క్రిష్ణ ఖబడ్దార్ మాష్టారింటివైపు వెళ్లాడు. రోడ్డు నిండా జనం. ఒక్కొక్కళ్లు ఏవేవో చెప్పుకొంటున్నారు.

"మా కుర్రాడు అయిదరాబదులో ఈ రోజు ఉద్యోగంలో ఉన్నాడంటే ఈ మేష్టారి దయే బాబు" అని ఓ పల్లెటూరి ఆసామి అన్నాడు.

"నా పెనిమిటి పోతే నా మడిసెక్క నాకు మిగిలేలా చేసిందీ బాబే" అని ఓ రైతు భార్య అన్నది

"నాకీ వయసులో ఒక పూటైనా ముద్ద ఉందంటే ఈ బాబు సలవే" రోడ్డు మధ్యలో కూర్చొన్న ఓ వృద్ధుడు గొణిగాడు.

"మా ఊరు బాగుపడిందంటే ఈయన మా స్కూలు హెడ్‌మాష్టార్‌గా ఉన్నందువల్లే" ఓ గ్రామపెద్ద గుర్తుచేసుకున్నాడు.

క్రిష్ణ రోడ్డుమీద ఉన్న మనుషులను తప్పించుకుంటూ వారి మధ్యనుండి వెళుతుంటే ఈ మాటలు వినిపించాయి. ఎంతోమంది కళ్ళు తుడుచుకుంటుంటే చూసాడు. యాంత్రికంగా ఖబడ్దార్ మాష్టారింటివైపు వెళ్ళాడు. ఆయన శవాన్ని ఇంటిముందు పాడెమీద ఏర్పాటు చేశారు. రోడ్డుకు అటువైపు మరింత మంది జనం ఉన్నారు. చిన్న, పెద్ద, ఆడ, మగ, ముసలి వారితో సహా అన్ని వయసుల వాళ్ళు, మంచి బట్ట కట్టుకున్న వాళ్ళు, ఒంటిమీద సరియైన బట్టలు లేని వాళ్ళు, చుట్టుపక్కల పల్లెలనుండి ఆదరాబాదరగా వచ్చినవాళ్ళు, ఆఖరి చూపు చూడాలని ఆతృతతో వచ్చినవాళ్ళు, నలభైఏళ్ళ ఉపాధ్యాయ వృత్తిలో ఆయన తిరిగిన ఎన్నో ఊళ్ళలో ప్రజలు, ఆయన సహాయం అందుకొన్న ప్రజలు, ఏళ్ళ తరబడి ఆయన మంచితనాన్ని గుర్తుంచుకొని ఇవాళ కడసారి చూపుకోసం వచ్చిన

వాళ్ళతో ఆ అయిదు రోడ్ల జంక్షన్‌లోని రోడ్లు నిండిపోయాయి.

దూరం నుండి వచ్చిన వాళ్ళు దాహానికి క్రిష్ణ కిళ్ళీకొట్టులో నీళ్ళ ప్యాకెట్లు కొంటున్నారు.

క్రిష్ణ తిరిగి వచ్చేటప్పటికి కొట్లో పనిచేసే కుర్రాడు ఓ ఏభై ప్యాకెట్లు అమ్మానని చెప్పాడు. క్రిష్ణ మాట్లాడకుండానే చేత్తో ప్యాకెట్లు అమ్మొద్దని చెప్పాడు.

"అదేంటన్నా బేరం జోరుగా సాగుతున్నది. నిన్న తెప్పించినవి ఏవీ అమ్మలేకపోయాం. ఇవాళ అన్నీ ఒక్క గంటలో అమ్మేయొచ్చు...." అంటున్నాడు.

"అమ్మొద్దు... అడిగిన వాళ్లందరికి ఫ్రీగా తలా ఒక నీళ్ల ప్యాకెట్టు ఇయ్యి" అని చెప్పి ప్రక్కన ఉన్న స్కూటర్ తీసి "మరిన్ని పేకట్లు ఆర్డరు పెట్టి వస్తాను" అన్నాడు స్కూటర్ స్టార్టు చేస్తూ.

మధ్యాహ్నానికి క్రిష్ణ కొట్లోనే ఓ వెయ్యి నీళ్ళ ప్యాకెట్లు ఉచితంగా అందించారు. మనుషులు ప్రవాహంలా వస్తున్నారు. పోతున్నారు. సాయంత్రం అయ్యేసరికి వేలమంది జనంతో ఖబడ్దార్ మాష్టారి అంతిమయాత్ర ఘనంగా జరిగింది.

***

మర్నాటి ఉదయం పేపరులో 'ప్రజల మనిషి అస్తమయం' అన్న పెద్ద అక్షరాలతో ఖబడ్దార్ మేష్టారి జీవిత చరిత్ర, ఆయన బతికున్నప్పుడు చేసిన గుప్తదానాల విశేషాలు, ప్రజల అభిప్రాయాలతో కవరేజి వచ్చింది. పేద ప్రజలని ఆదుకునే దయామయుడే పోయాడు. ఈ చుట్టు ప్రక్కల పల్లె ప్రజలని విద్యవైపు ప్రోత్సహించాడనీ, ఎన్నో కుటుంబాలని నిలబెట్టే మరో వ్యక్తి ప్రజలకి మరిలేడు అని పత్రికలన్నీ పొగిడాయి. అదే పేజీలో ఆ ఊరి ఎమ్మెల్యే పోయాడని చిన్న వార్త కూడా వెలువడింది. క్రిష్ణ ఆ రెండింటిని చదివి పేపరు మడిచి పక్కన పెట్టాడు. పది గంటలయింది. ఐదురోడ్ల జంక్షన్ ట్రాఫిక్, మనుషుల హడావిడితో నిండిపోతున్నది. ప్రస్తుతం టికెట్టు వచ్చి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న ఆయన వచ్చారు. కృష్ణ లేచి నిలబడి కిళ్ళీకొట్టులోంచి బయటకు వచ్చాడు.

"కృష్ణా! ఈ రోజు సాయంత్రం పార్టీ కార్యాలయంలో ప్రమాణ కార్యక్రమం ఉంటుంది నువ్వు, మీ వాళ్లు వచ్చేయండి. మినిష్టర్ గారు కూడా వస్తారు..."

అంటున్న ఆయన్ని చూసి–

"అయ్యా! నమస్తే. నేను పార్టీలో చేరడం లేదండి. మిగిలిన వాళ్ళు వస్తే చేర్చుకోండి" అన్నాడు మెల్లగా వినయంతో.

"అదేంటి క్రిష్ణా! నువ్వు మా తమ్ముడి కుడి భుజానివి. నీకు పార్టీలో మంచి భవిష్యత్ ఉంది. చేరడానికి ఏం కావాలో చెప్పు" అంటూ బుజ్జగించ బోయాడు క్రిష్ణని.

"నేను ప్రజలకు సేవ చేద్దాం అనుకొంటున్నానండి..." అన్నాడు మెల్లిగా.

"మరి పార్టీలో చేరకుండా ప్రజలకి ఎలా సేవ చేస్తావ్?" నవ్వుతూ వెటకారంగా అన్నాడు.

"ఖబడ్దార్ మాష్టారి శిష్యుడిగా" అన్నాడు క్రిష్ణ దృఢంగా.

అప్పటికే గుమికూడిన క్రిష్ణ అనుయాయులు అది విని చప్పట్లు కొట్టసాగారు.

ఒక మాష్టారు తన ఆలోచనలతో, ప్రవర్తనతో రాజకీయ నాయకులకి కూడా చెక్ పెట్టగలరు. మంచి మేష్టారెప్పుడూ ప్రజల వైపుంటారు. విద్యాసంస్థల్లో పాఠాలు చెప్పడమే కాదు, తన చదువుని ప్రజలకు వినియోగించడమే విజ్ఞత.

*

**గురువుగా సమాజంలో మంచి పేరు**
**సంపాదించుకొని ఎంతో మంది జీవితాలలో**
**తనదైన ఆలోచన ముద్రలను వేసిన**
**శ్రీ అనపర్తి సుబ్బారావు మాస్టారు గారికి**
**నమస్కరిస్తూ...**

# మీ ఆవిడను కొట్టరా?

**"మీ** ఆవిడని కొట్టరా?" – చుట్టపు చూపుగా ఆ ఊరు వచ్చిన నేను, చుట్టాల సలహాపై గుండె జబ్బు వచ్చిన వాళ్ళాయన్ని పరామర్శించాలని వచ్చిన నన్ను 'ఎవరు మీరు?' అన్న ప్రశ్నకి నేను చెప్పిన జవాబు విని, ఆవిడ రెండో కోడలి తరపు చుట్టం అని గ్రహించిన వెంటనే బిగుసుకుపోయి, బొమ్మైపోయి, వాలుకుర్చీ వేయించి, నన్ను కూర్చోమని "ఆయన లేరు. 'ఆయన' ఆవిడను నేను. నాతో మాట్లాడండి" ఈ విషయం ఇక్కడితో తేల్చిపారేస్తానన్న ధీమాతో జానకమ్మ గారు అనబడే ఒక ఇల్లాలు మా ఇల్లాలి గురించి నన్ను అడిగిన ప్రశ్న అది.

అది వినగానే, ఈ చుట్టపు చూపు అయిపోయిన తరువాత బీచ్‌కు వెళ్ళి పాత జ్ఞాపకాలలో పరవశించి, దసపల్లాలో డిన్నరుకి వెళ్ళి, అక్కడ నుండి సాహితీ మిత్రులతో కిళ్ళీ బిగించి, కళ్ళు మూతలు పడేదాకా కథలు కబుర్లలో కదిలే కాలాన్ని కలకాలం గుర్తుండేలా గడుపుదామనుకున్న నా సాయంత్రం ప్లానంతటినీ ఒక్కసారి ఎవరో 'రబ్బరు'తో తుడిపేసిన భావన కలిగింది.

ఆ ప్రశ్న వేసిన ఆవిడ మొహాన్ని చూద్దామని వాలు కుర్చీలో కూర్చున్న నేను తలెత్తేసరికి వాలుకుర్చీకి ఒక ఐదడుగుల దూరంలో ఆవిడ ఆ హాల్లో నేలమీద చతికిలపడుతున్నది. ఆవిడ చతికిలపడడం పూర్తి అవగానే, నా మొహాన్ని ఆవిడ కళ్ళు 'పొజిషన్' చేస్తున్న సమయంలో, గదిలో వెలుగుతున్న ట్యూబ్‌లైట్ వెలుగులో ఆవిడ మొహం చూశాను.

'ఈ ప్రశ్న అడగడం కోసమే ఇన్నాళ్ళు వేచి ఉన్నాను' అనే భావం ఆమె మొహంలో కనిపించింది. తాను వెయ్యబోయే ప్రశ్నకు నేను భయపడిపోతానేమో నని ముందే ఆలోచించి, వాలుకుర్చీలో కూర్చున్న తరవాతే అడిగిందేమో అనిపించింది.

ఊగడం కోసమే వాలుకుర్చీ ఉందని చిన్నప్పటి నుండి నమ్మి వాలుకుర్చీలో కూర్చోగానే ఊగడం అలవాటున్న నేను, కదిలితే బాంబులు పేలిపోతాయేమోనన్న భయంతో యుద్ధ భూమిలో నిలబడ్డ సైనికుడిలా, ఆ సైనికుడి చేతిలో ఉన్న తుపాకిలా, నడుం నిటారుగా పెట్టుకుని కూర్చొని ఉన్నాను.

ఒంట్లో కొన్నిచోట్ల చల్లగా, మరికొన్ని చోట్ల వేడిగా అనిపించింది. చల్లబడిపోతున్న భాగాలకి రక్తం వెంటనే ప్రసరిస్తే బాగుంటుందనిపించింది. నా గుండె కొట్టుకుంటున్నట్టు నాకే తెలుస్తున్నది. కొద్ది సేపట్లో వినిపిస్తుందేమో ననిపించింది. ఉన్నట్టుండి నా స్నేహితుడు, కార్డియాలజిస్టు అయిన డాక్టర్ శివప్రసాద్ గుర్తుకు వచ్చాడు. 'వెర్రి నాగన్న జడుసుకున్నాడు. దిష్టి తీయండి' అన్న ధైర్యం చెప్పే అమ్మమ్మ ఏ లోకాలకు వెళ్ళిపోయిందో ఆ లోకాల నుండి దిగి వస్తే బావుణ్ణనిపించింది.

'నీకసలు బుద్ధి లేదు. నీలాంటి నిరుపయోగ ఛాందసుల వల్లే ఇలాంటి ప్రశ్నలు 1999లో, ఆపైన 2099లో కూడా ఉంటాయి' అని బాధ, కోపం మేళవించి, సరికొత్త రసాన్ని ప్రసాదించే దీపంలాంటి కళ్లతో మా ఆవిడ అమాంతం గుర్తుకొచ్చింది. 'ఇలాంటివాళ్ళకు ఏం జవాబు చెపుతావో చెప్పు' అన్నట్టు అనిపించింది.

"బాబూ జవాబు చెప్పు" అన్నారు జానకమ్మగారు. "అందరు మొగ వాళ్ళు పెళ్ళాన్ని కొద్దో గొప్పో కొడతారు" అందరూ ఎప్పుడో ఒకప్పుడు వర్షంలో తడుస్తారన్నంత సామాన్యంగా చెబుతోంది.

"అంత మాత్రాన పుట్టింటికి పారిపోతారా? ఇలా అయితే సంసారాలు చేసినట్టే."

"అసలు మా ఆయన నన్ను పెళ్ళి కాకముందునుండి కొట్టేవారు. కాబోయే మొగుడూ పెళ్ళాం అని అందరూ నవ్వేవారు. నేను మాత్రం కళ్ళనీళ్ళతో, సిగ్గుతో అక్కడ నుంచి పారిపోయేదాన్ని. ఆయన కూడా వాళ్ళతో పాటే నవ్వేవారు. ఆ నవ్వు ఆయన పెదాలమీద నుండి చెరిగిపోలేదు" అని ఆగి మెడలో మంగళసూత్రం తీసి కళ్ళకు అద్దుకుని, తలవంచుకొని "శోభనం నాడు గదిలో సిగ్గుపడ్డానని మొట్టికాయ మొట్టారు. తలంతా జివ్వుమంది. నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి."

*'తమకాన తేలించు తలపుల*

*గమకాలు రివ్వు రివ్వుమని*

*తరుణాన తనువంత తేలియాడు*

*గజ్జెలు ఘల్లుఘల్లుమని*

*పూల వర్షమై, పూల పాన్పుపై*

*పవళించ వధువు, నీ మధువు'*

పెళ్లి కానుకగా నా స్నేహితుడు అప్పారావు రాసిచ్చిన కవిత గుర్తుకు వచ్చింది. ప్రస్తుతం దాని మాధుర్యం అంతా వెగటనిపించింది, ఆముదం తాగుతున్నప్పటి బెల్లం ముక్కలా.

"పదహార్రోజుల పండుగనాడు మోటు సరసం మానమని మా పెద్ద నాన్నగారి మూడో అమ్మాయి నాకంటే ఒక ఐదేళ్ళు పెద్దది, ఈయనతో అందని, నన్ను గదిలోకి తీసుకెళ్ళి, 'దానితో ఎందుకు చెప్పావని' అన్నారు.

చెప్పలేదని అంటున్నా వినిపించుకోకుండా, లెంపలు వాయించాడు ఆవిడో నవ్వు నవ్వింది." ఆ నవ్వు మురికివాడలో మెర్సిడిస్ కారు హారన్‌లా వినిపించింది.

"మా వాళ్ళంతా బుగ్గలు ఎర్రగా కందాయని ఏడిపించారు. అయితేనేం మా పెళ్ళి చాలా వైభవంగా జరిగింది అన్నారంతా. గృహప్రవేశం అయిన తరువాత ఒక రోజు బియ్యం ఏరుతూ ఉంటే, మా అత్తగారు అడిగారు అంతా సవ్యంగా

ఉందా అని. 'ఊ!' అని ఊరుకున్నాను. కానీ ఆవిడ మరీ రెట్టించి అడిగితే మొట్టికాయలు, లెంపకాయల గురించి చెప్పాను.

ఆవిడ నవ్వేసి, 'మొగుళ్ళంతా అంతేనే' అన్నారు.

'కానీ మా నాన్నగారు మా అమ్మని కొట్టరే' అన్నాను, మధ్యలో జోక్యం చేసుకుని.

'అందుకే మీ అమ్మ ఆడింది ఆట, పాడింది పాట. మీ నాన్న ఒట్టి మెతక మనిషి. మగాళ్ళంతా అలా ఉండరు. వీడంతా వాళ్ళ నాన్న పోలిక. వట్టి కోపిష్టి, చిన్నప్పటి నుండి అంతే. ఊళ్ళేలవలసిన మగమహారాజు వాడు. నలుగురితో నెగ్గుకుని రావాలి. నాలుగు వ్యవహారాలు చక్కబెట్టుకుని రావాలి. మగాడన్న తరువాత బయట ఎన్నో వ్యవహారాలు, గొడవలు ఉంటాయి. ఉద్యోగం అంటే మాటలా? అయినా ఆడవాళ్ళకేం తెలుస్తాయి? ఇది తెలుసుకోకుండా మనం ప్రవర్తిస్తే ఎవరికి మాత్రం కోపం రాదు? ఎందుకు కొట్టరు?' అన్నారు.

మనవరాలు కోడలని, మా అత్తగారి అత్తగారు కూడా అప్పుడప్పుడు విషయాలు అడిగి తెలుసుకుంటుండే వారు. మా ముందు జీవితం బాగుండాలని ఎన్నో సలహాలు ఇస్తూ ఉండేవారు. ఆవిడ కూడా మొగుడు పెళ్ళాన్ని కొట్టడం ఒక పెద్ద విషయం కాదని, మా ఆయన తాతగారు, అంటే వాళ్ళాయన కూడా అప్పుడప్పుడు కొట్టేవారని చెప్పారు.

అప్పుడనిపించింది పెళ్ళాన్ని కొట్టడం వీళ్ళ వంశంలోనే ఉందని.

ఆ తరువాత ఇరుగు పొరుగులతో మాట్లాడుతుంటే తెలిసింది, సుమారు అన్ని కుటుంబాల్లో ఎంతోకొంత 'పెళ్ళాన్ని కొట్టడం' ఉంటుందని. అంచేత నేను బాధపడాల్సిందేమీ లేదని. 'నిక్షేపంలాంటి సంసారం హాయిగా చేసుకుంటూ, గంపెడు పిల్లల్ని కను' అన్న పెద్దావిడ దీవెనలను, సలహాలను ఇంకా మరిచిపోలేదు. కాకపోతే మొదట్లో ఒంటిమీద దెబ్బపడిన చోట, మనసులో చాలా బాధగా ఉండేది. ఒంటికంటే మనసులోనే బాధ ఎక్కువసేపు ఉండేది. రానురాను అలవాటు అయిపోయింది. ముందు మనసులో బాధ లేకుండా పోయింది. తరువాత ఒంటి బాధ ఓర్చుకోవడం అలవాటయి పోయింది.

ముసిలావిడ పోయేముందొక జాగ్రత్త చెప్పి పోయింది. ఆ రోజు ఏమయిందంటే, ఆయన షర్టు వేసుకుంటున్నారు. నేను పాలవాడికి డబ్బు ఇవ్వాలని అన్నాను, ఎంత అన్నారు, రోజుకు రూపాయి, నెలంతటికి ముప్ఫై అన్నాను.

'ఈ నెలకెన్ని రోజులే?' అన్నారు. ముప్ఫై అన్నాను. చేతిలో ఉన్న హేంగరుతో ఎడాపెడా కొట్టారు వెంటనే. అప్పటికప్పుడు ఏడాదిలో నెలలు, ప్రతి నెలకూ ఎన్ని రోజులో వల్లెవేయించారు.

ఇది చూసిన మా అత్తగారు 'చేతిలోను, చుట్టుపక్కలా వస్తువులేవీ లేకుండా చూసుకో' అని జాగ్రత్త చెప్పారు.

మరోసారి ఇలాగే చిన్నవాడి చేత లెక్కలు చేయిస్తున్నాను. ఏదో తప్పు చెప్పానని, ఎదురుగా టేబుల్ మీదనున్న కంపాక్స్‌బాక్స్ నా మొహం మీదికి విసిరారు. అక్కడితో ఆగక ఎక్కాలు వల్లె వేయించారు కూడా. ఈయనకు లెక్కలంటే మహా ఇష్టం. ఒక్క తప్పు రాకూడదు. వాళ్ళ ఆఫీసరు ఈయనకు లెక్కల్లో ఉన్న తెలివికి మురిసిపోతుంటారుట.

అదే పోలిక మా అబ్బాయిలకు కూడా వచ్చింది. వంశంలో పోలికలు ఎక్కడకు పోతాయి అని ఆగి, "ఏమే కోమలా ఇలారా ఒకసారి" అని కేక వేశారు వంటింటి వైపు తిరిగి.

నిజంగానే కోమలంగా ఉన్న ఒక పాతికేళ్ళ అమ్మాయి వచ్చి, హాలు గుమ్మం దగ్గరే నిలబడిపోయింది.

"రకరకాల చిట్కాలు ఉపయోగించి, మగవాళ్ళని శాంతపరచడమో, దెబ్బపడకుండా చూసుకోవడమో చెయ్యాలిగాని" అని తల వెనకు తిప్పి, "ఇలా ముందుకు రావే" అని పిలిచారు.

"దీనికి బారెడు జుత్తు. అది చూసే మురిసిపోయి దీన్ని చేసుకుంటానన్నాడు మా పెద్దాడు. కట్నం కొద్దిగా తక్కువని మా ఆయన అన్నా సరే, వాడి సరదా కూడా చూడాలని ఆయన్ని ఒప్పించాను. అయితే, వాడికి కోపం వచ్చినప్పుడల్లా

దీని జడ పట్టుకుని లాగుతాడు. ఇది కొంపలంటుకుపోయినట్టు కేకలు, ఏడుపులు. అంచేత దీన్ని ముడేసుకుని తిరగమన్నాను. అప్పటి నుండి వాడి ఆగడం తగ్గింది. ఏమే చెప్పవే" అని  కోడలివైపు చూసి అన్నారు.

నా తల వంగినంత వంగి, ఇంకెప్పటికీ ఎత్తలేనంత కిందకి వంగి పోయినట్టు అనిపించింది. కదలక కాళ్ళేకాదు తలకూడా తిమ్మిరెక్కినట్టయింది. గుండె కొట్టుకోవడమే కాదు, నేను ఊపిరి పీల్చడం కూడా నాకు తెలుస్తున్నది. ఆ వాలు కుర్చీ ఒక నేల నూతిలా అనిపిస్తున్నది.

నాకున్న పరిసర జ్ఞానం అంతా జానకమ్మగారి గొంతుకు, ఆ హాలుకు, ఆ హాలులో వెలుగుతున్న ట్యూబ్‌లైట్‌కు మాత్రమే పరిమితమైపోయింది. సమయం ఆగిపోయినట్లు, నేను రాయినైపోయినట్లు అనిపించింది. ఈ తటస్థ అనిశ్చిత స్థితికి అంతం ఎప్పుడో తెలియడం లేదు. ఉలుకు పలుకు లేకుండా ఆవిడ మాటలు వినడానికి మాత్రమే నా జ్ఞానేంద్రియాలు ఉన్నట్లు, వాటికి జీవం ఇవ్వడానికే నేను ఉన్నట్లు ఉంది అప్పటి నా స్థితి.

అలా ఆవిడ ఆ ఇంట ఏ అడపడుచు, ఏ విధాన వారి వారి భర్తల వల్ల ఏ విధమైన తిట్లు, తన్నులు తిన్నారో, వారింట అది ఎంత సహజమో, వివరంగా, కోర్టులో లాయర్లు సాక్షుల్ని ప్రవేశపెట్టి చెప్పిన తీరులో, ఒక రెండు గంటలపాటు, 'ఆడదానిపై మగవాడి అమానుషత్వం' అన్న విషయాన్ని సోదాహరణంగా, సోషియాలజీ ప్రొఫెసర్‌లా లెక్చరిచ్చారు. ఆ వివరాలు, మగవాడిగా నేను చెప్పలేను, వ్రాయలేను.

దోమలు జోరుగా తిరుగుతున్నాయి. కళ్ళకు కనబడుతున్నాయి. ఆడవాళ్ళ నిస్సహాయ స్థితికి ఆపకుండా ఏడుస్తున్నాయా అన్నట్లు చప్పుడు చేస్తున్నాయి. ఆడవాళ్ళ బాధలన్నింటికి మూలకారణమైన మగ మనిషిని నేను అన్నట్లు నన్ను కసిగా కుడుతున్నాయి. ఎదురుగా ఉన్న ఆడవాళ్ళని కుడుతున్నట్లు నాకని పించలేదు.

దోమలకి ఆడ, మగ మనుషులని పోల్చే శక్తి ఉంటుందా అన్న శాస్త్రీయ పరమైన ప్రశ్న అత్యంత ఆసందర్భమైన సమయంలో నా మెదడుకు తట్టింది.

ఆ ఇంటికి వచ్చిన తరువాత నా మెదడు చేసిన మొట్టమొదటి పని అది. న్యూరో బయాలజీలో పరిశోధనలు చేస్తున్న ఓ నలుగురి మిత్రులకు, డాక్టర్ ఫ్రాన్సిస్‌క్రిక్‌కు ఈ ప్రశ్న వెంటనే ఈ-మెయిల్ ద్వారా పంపాలనిపించింది. అది కాని నిజమైతే, దోమలలో మనుషులని పోల్చుకునే శక్తి కేంద్రాలని పని చేయనివ్వని మందులని తయారు చేయవచ్చునని, దాని వలన మనుషులకి హానిలేని విధంగా, దోమలని చంపకుండానే, దోమల ద్వారా వ్యాపింపబడే మలేరియా, ఫైలేరియా వంటి జబ్బులని అరికట్టవచ్చునని, అలా ఆ పరిసరాలు మరిచిపోయి మెదడు పనిచేసే తీరుమీద ఆ పరిజ్ఞానపు ప్రయోజనాల మీద, నా మెదడు పనిచేయడం మొదలు పెట్టింది.

"కాఫీ పుచ్చుకోండి" అన్న జానకమ్మగారి మాటతో ఆ పరిసరాలకు వచ్చాను.

తల ఎత్తలేదు. నా కళ్ళకు ఎర్రంచు పచ్చ చీర కుచ్చెళ్ళు. ఆ కుచ్చెళ్ళ కిందనున్న పాదాలు, ఆ పాదాలకున్న మెట్టెలు కనిపించాయి. ప్రస్తుతం నాకు ఏ ఆడపిల్లని, ఆడ మనిషిని చూడాలని లేదు.

ఇదంతా నేను చదువుతున్న కథలోనో, నవలలోని సన్నివేశమో అయితే, ఆ నవలని అక్కడికక్కడ టక్కున మూసెయ్యాలని, కల అయితే కళ్ళు తెరిచెయ్యాలని, ఒక్కసారి ఊపిరి పీల్చుకోవాలని, మొహాన్ని చల్లని నీళ్ళతో కడుక్కోవాలని ఉంది. కాని ఇది కథ, నవల, కల కాదు. అంతా కళ్ళముందే జరుగుతున్నది. కాళ్ళు కదపలేని పరిస్థితి. కదలాలని ఉంది. కదలలేను. పారిపోవాలని ఉంది, పారిపోలేను.

విచ్చుకున్న భూమిలోకి వెళ్ళిపోయిన సీతలా, ఎందులోకైనా చొచ్చుకు పోవాలని ఉంది. కానీ నిస్సహాయంగా ఆ వాలు కుర్చీకి అతుక్కుపోయాను. కొన్నేళ్ళ క్రిందట కాల్టెక్స్ క్వార్టర్స్‌లో కేరళ అమ్మాయి కాఫీ అందిస్తూ నా కళ్ళల్లోకి కళ్ళు పెట్టి చూసినప్పుడు కూడా ఇలాగే కుర్చీకి అతుక్కుపోయిన జ్ఞాపకం వచ్చింది. కాని ఈ ఊహ అతి చేదుగా పచ్చికరక్కాయ కొరికినట్టు అనిపించింది. ఆనాటి నుండి ఈనాటి వరకు దాచుకున్న సుకుమారమైన భావం ఒకటి కొలిమిలో పడి కాలిపోయిన పువ్వులా అనిపించింది.

కళ్ళు మాత్రమే ఎత్తి, కనిపించినంత వరకు చూశాను. ఎదురుగా, కొద్దిగా వంగి, సెగలు కక్కుతున్న కాఫీ గ్లాసు పట్టుకొని ఒకామె ఉంది. క్షణాలు గడుస్తున్నాయి. చెమటలు కారుతున్నాయి.

"కాఫీ అక్కడ పెట్టి, విసనకర్ర తెచ్చి విసరవే ఆయనకి" అన్న జానకమ్మ గారి కేకకి ప్రతి చర్యగా, ఆమె మరింత వంగి నేనందుకోని కాఫీ కప్పుని నాకందేంత దగ్గరలో వాలుకుర్చీకి పక్కగా పెట్టింది. అప్పుడు అయిన గాజుల చప్పుడు వేరే ఏ పరిస్థితిలో అయినా విని ఉంటే ఏయే భావాలను కలిగించేదో, ఏయే భాగాలను కదిలించేదో కాని, ఇప్పుడు ఖాళీ గాజు సీసా పగిలినప్పుడు వినిపించే ఆఖరి శబ్దాన్ని మాత్రమే తలపించింది.

విసనకర్రతో విసిరిన గాలి చల్లగా తగిలింది. కాని హాయిని కలిగించలేదు. దెబ్బమీద టించర్ అయోడిన్ వేసి ఊదినట్టనిపించింది.

'చాలు' అన్న ఒకమాట రెండుసార్లు నా నోట నుండి "చాలు చాలు"గా వచ్చింది. మౌనం రాతి విగ్రహమై లేచి నిలబడ్డట్టుగా లేచి నిలబడ్డాను. రాతి విగ్రహాలలో కూడా రమ్యమైన భావాలను చెక్కగల శిల్పులుంటారు. కాని మౌనమే ఘనమైన నా మొహంలో ఏ భావం లేదని, ఎదురుగా ఉన్న అద్దంలో కనిపించిన నా ప్రతిబింబం నిరూపించింది.

అప్పుడు నాకు తల లేకపోతే బావుణ్ణనిపించింది. అప్పుడు తలలేనితనం కావాల్సి వచ్చింది. లక్షలాది సంవత్సరాల ప్రకృతి పరిణామశక్తి వల్ల మెరుగులు దిద్దబడ్డ లక్షణమైన నా తల నాకు నచ్చలేదు. చాలా బాధ కలిగించింది. అసహ్యం కలిగించింది. ఆ తల నేను చెయ్యని తప్పులకు ఎల్లకాలం నాతో ఉండే నా తప్పుడు సాక్షిలా అనిపించింది.

ఎక్కడికి వెళ్ళాలో తెలియదు. కానీ మరమనిషిలా కదిలాను.

అంతలో అమాంతంగా జానకమ్మ గారు నా కాళ్ళను ఆమె రెండు చేతులతో చుట్టి పట్టుకునే ప్రయత్నంలో ముందుకి వంగి, తల ఎత్తి "బాబ్బాబు పెళ్ళాన్ని కొట్టాడని మావాడి మీద కేసు పెట్టకండి. పెద్దదాన్ని కాళ్ళు పట్టుకుని బ్రతిమాలుతున్నాను. ఇలాంటి పిల్లల్ని కన్నందుకు నన్నే జైల్లో పెట్టించండి" అంటున్న ఆవిడ చేతులకు అందకుండా వెనక్కి జరిగి ఆ హాలులోంచి వాకిటిలోకి,

వాకిటిలోంచి వీధిలోకి, వీధిలోంచి బీచ్ రోడ్డు మీదకి, అక్కడి నుండి బీచ్‌లోకి నిద్రలో నడిచి వెళ్ళే మనిషిలా వెళ్ళి కూర్చున్నాను.

కొన్ని గంటల సేపు నన్ను నిశ్చేష్టుణ్ణి చేసిన జానకమ్మ గారి ప్రశ్న మెల్లిగా నాలో ఆలోచనలు రేకెత్తించింది. కొట్టే వాళ్ళని తిరిగి కొట్టడం, కొట్టించడం, కొట్టడానికి తగిన శిక్షణ అందించడం – ఇవేవీ పెళ్ళాన్ని కొట్టడం అనే సాంఘిక సమస్యకు సమాధానాలు కావు. అది ఆవేశం ఇంధనమైన ఆలోచనల ఫలితమే అవుతుంది. కేసు పెట్టవచ్చు. కానీ దానికి కొట్టబడిన ఆడది ధైర్యంగా నిలబడి, అత్తమామలతో, బహుశా తల్లిదండ్రులతో, బంధువులతో తన చుట్టూ ఉన్న సమాజంతో పోరాడుతూ నెగ్గుకు వచ్చి, ఆర్థికంగా తన కాళ్ళమీద తాను నిలబడినప్పుడే అది సాధ్యం. చాలామంది తమకెంత కష్టం ఉన్నా భరిస్తారు కానీ, తమ సంసారాన్ని కోర్టుకు లాగరు. కోర్టు ఇచ్చే తీర్పు 'మనిషి'ని మార్చలేదు. 'మనిషి' ఆలోచనలో మార్పు మాత్రమే ఇటువంటి సాంఘిక సమస్యలకు తగిన పరిష్కారం. ఈ దశలో నా ఆలోచనలు ముందుకి వెనక్కి సాగాయి. ఏ మార్పు వల్ల అయితే ఇటువంటి సమస్యలు సమసిపోతాయో, అటువంటి మార్పు అవసరం నా ఆలోచనలకు కూడా ఉందని తోచింది.

ఆ క్షణం – అడవిలో రాలి నేలపై పడి ఉన్న ఎండుటాకుల్ని చిన్న నిప్పురవ్వ పొగలేకుండా కాల్చిన తీరులో నా ఆలోచనల అడవిని శుభ్రం చేసింది. ఏ వాదాలు, ఉద్యమాలు చెయ్యని పని ఒక్క రోజులో చేసింది. అయితే ఈ మార్పు నా ఒక్కడికే పరిమితం. బహుశా ఈ మార్పు తీరు ఇంతేనేమో. అంచేత మీకు కూడా ఇదే ప్రశ్న వేస్తున్నాను 'మీ ఆవిడను కొట్టేరా?'.

*

**సాంఘిక సమస్యలను అసాధారణ కోణాలలో**

**చూడవచ్చన్న**

**శ్రీ మురళి చందూరి గారికి నమస్కరిస్తూ...**

# పిలుపు

**అ**త్యంత క్లిష్టమైన గుండె జబ్బులను ఎంతో నిపుణతతో నివారించి చావు నిశ్చయం అని అనుకొన్న రోగుల రాతలు మార్చి చిర్నవ్వుతో బ్రతుకు అందించే గుండె జబ్బుల నిపుణుడిగా ప్రపంచ ప్రఖ్యాతి పొందిన డాక్టర్ రావుకి సన్మాన సభ అది. ఆ రోజు షికాగో మహానగరంలో ఎందరో ప్రముఖులు హాజరైన అతి ముఖ్యమైన విందు మరియు సన్మాన సభ అది. డాక్టర్ రావు వైద్యంతో ఐదేళ్ళకు పైగా హాయిగా జీవిస్తున్న ఒక వెయ్యిమంది ప్రపంచం నలుమూలల నుండి వచ్చి తలొక వెయ్యిడాలర్లు ఇచ్చి హాజరైన ఫండ్ రైజింగ్ డిన్నరు అది. డాక్టర్ రావుని వైద్యునిగా మరో ఉన్నత సోపానంపై నిలబెట్టే సభ అది.

అమెరికన్ మెడికల్ ఎసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ నేన్సీ డికీ ముఖ్యఅతిథి. భారతదేశ ప్రతినిధి, షికాగో నగర మేయర్, వివిధ రంగాలలో పేరు పొందిన వ్యక్తులు వక్తలుగా డాక్టర్ రావుని ప్రశంసించి పుష్పగుచ్ఛాలు అందించారు.

'డాక్టర్ రావు రోగిపై పెట్టే ఖర్చుకు రెట్టింపు ఆరోగ్యాన్ని అందిస్తారు' అని ఒక ఆరోగ్య బీమా సంస్థ కొత్త నినాదాన్ని డాక్టర్ రావు గౌరవార్థం ఆ రోజే తమ వ్యాపార ప్రకటనలో విడుదల చేసింది.

వృత్తిపరమైన గౌరవాలను ఎన్నో అందుకున్న డాక్టర్ రావుకు ఈ రోజు అత్యంత ముఖ్యమైన రోజు. అమెరికాలో వైద్యపరమైన గౌరవాలలో ఆఖరి మెట్టు

అని భావించే మెట్టు ఎక్కిన రోజు అది. విరాళాల రూపంలో వచ్చిన మిలియన్ (పది లక్షలు) డాలర్లతో నెలకొల్పబోయే 'కంప్యూటర్ కంట్రోల్డ్ కంప్లీట్ కార్డియాక్ కేర్ సెంటర్'కు డైరెక్టర్‌గా డాక్టర్ రావుని నియమించినట్లు ఆయన పనిచేస్తున్న మెడికల్ సెంటర్ ప్రెసిడెంట్ డాక్టర్ గార్బర్ ప్రకటించారు.

వేదిక మీద కూర్చొని ఉన్న ఆయన ఆలోచనలన్నీ నెలకొల్పబోయే 'సెంటర్' మీదే ఉన్నాయి. రోగికి ఏ మందు ఇచ్చినా, ఆ మందు దాని ముఖ్యమైన చర్యతో పాటు శరీరంలో జరిగే ఎన్నో జీవ రసాయనిక చర్యలపై ఎంతో కొంత ప్రభావం చూపుతుంది. ఆ ప్రభావాలన్నింటి సామూహిక ఫలితమే రోగి పరిస్థితిని నిర్దేశిస్తుంది. మనిషి మనిషికి ఉండే సహజ జన్యు (జనెటిక్) భేదాల వలన మందు పనిచేసే వేగంలో, తీరులో మార్పులు ఉంటాయి. ప్రతి మందు యొక్క వివిధ చర్యలను, ఆ మందు తీసుకున్న రోగి యొక్క రక్త, శ్వాస పరీక్షల ద్వారా నిర్ణయించి, ప్రతి రోగికి ఏ మందు ఏ మోతాదులో వాడాలి అన్న విషయాన్ని నిర్ణయించడంలో మానవ సంబంధమైన పొరపాటు నివారించి కంప్యూటర్ ద్వారా నిర్ణయించే పరిశోధన కేంద్రంగా అది రూపుదిద్దుకోబోతోంది. ఏళ్ల తరబడి మందులు తీసుకోవలసిన కొంతమంది రోగులకు, అప్పుడే గుండె జబ్బు వచ్చిన వారికి కూడా ఇది చాలా ఉపయోగపడుతుంది. తమ సెంటర్‌ను ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైన గుండె జబ్బుల నివారణ కేంద్రంగా రూపొందించాలన్నది ఆయన ధ్యేయం.

తన చుట్టూ ఉన్న వాతావరణంతో సంబంధం లేకుండా తన ధ్యేయం పైనే ప్రతి నిమిషాన్ని వెచ్చించి ఫలితాలను పొందే ఏకాగ్రతే డాక్టర్ రావుని ఈ రోజు ఈ మెట్టుపై నిలబడేలా చేసింది.

***

పుట్టుక వలన డాక్టర్ రావు తెలుగువాడు. మొట్టమొదట తెలుగు పలుకులు పలికినవాడు. తెలుగు నేలపై పెరిగి పరుగెత్తినవాడు. తెలుగులోనే చదువుకుని, అక్కడే తెలివి పెంచుకున్నవాడు. ఆంధ్రా మెడికల్ కాలేజ్‌లో చదువుకున్నవాడు. తనకు తెలియకుండానే తాను పుట్టిన నాటినుండి తెలుగుతనాన్ని తన నిండా నింపుకున్నవాడు.

కాని, అమెరికా గడ్డపై అడుగు పెట్టినప్పటినుండో, అంతకు ముందు నుండో ఆయన అలా భావించడం లేదు. అయినా ఆయన అమెరికాలో ఉన్నత స్థానాలను అందుకుంటున్న ప్రతిమారు, అమెరికాలో తెలుగువారు, ఆంధ్రాలో తెలుగువారు ఆయనను తెలుగువాడు అని గర్వపడ్డారు.

గత ముప్పై ఏళ్ళల్లో అప్పుడప్పుడు ఆంధ్రా వెళ్ళినప్పుడు, తెలుగు మాత్రమే వచ్చిన వాళ్ళు తారసపడి మాట్లాడక తప్పనప్పుడు, తల్లితో మాట్లాడేటప్పుడు మాత్రమే ఆయన తెలుగు మాట్లాడుతారు. అదీ ఎప్పుడో తెలుగు మరచిపోయిన వాడిలాగో, అప్పుడే తెలుగు నేర్చుకున్న వాడిలాగో మాత్రమే.

వివిధ దేశాల నుండి తన దగ్గరకు వైద్యానికి వచ్చేవారిని, వారి వారి మాతృభాషలో 'మీ పేరేమిటి?', 'ఎలా ఉన్నారు?', 'కుశలమా?', వంటి చిన్న చిన్న ప్రశ్నలు వేయడానికి ఎంతో కృషి చేసాడు. ప్రస్తుతం వారు సుమారు ముప్పై ఐదు భాషలలో రోగులను పలకరించగలరు. ఆయనకు జరిగిన సన్మాన సభలో 'డాక్టర్ రావుకు శుభాకాంక్షలు' అన్న పదాల తోరణాలు ఏభైరెండు భాషలలో, తెలుగులో తప్ప, ఆ సభ నాలుగు గోడలపైన అమర్చబడి ఉన్నట్లు గమనించి ఆయన చాలా సంతోషించారు.

***

సన్మాన సభ, విందు పూర్తి అయిన తర్వాత డాక్టర్ రావు ఇల్లు చేరేసరికి పదకొండు గంటలైంది. పర్వతాలు ఎక్కేవాళ్ళు, సముద్రాల లోతులు శోధించే వాళ్ళు, ఎడారులు దాటేవాళ్ళు, గమ్యం చేరిన తరువాత తాము సాధించిన విజయానికి సంతోషపడడానికి కూడా శక్తి లేనంతగా శారీరకంగా అలసిపోతుంటారు. ఇప్పుడు డాక్టర్ రావు కూడా అంతే అలసిపోయారు. కానీ శారీరకంగా కాదు, మానసికంగా.

పిల్లల్ని యూరోప్ వెకేషన్ కోసం ఎయిర్ పోర్టులో దింపడానికి వెళ్ళడం వల్ల సన్మాన సభకు రాలేకపోయిన ఆయన భార్య ఇల్లు చేరగానే ఎదురొచ్చింది. కొద్ది నిమిషాల ముందు ఇండియా నుండి ఫోను ద్వారా తెలుగులో వచ్చిన వార్తను ఇంగ్లీషులోకి అనువదించి చెప్పింది.

కొద్ది రోజులుగా జ్వరంతో మంచాన పడి ఉన్న డాక్టర్ రావు గారి తల్లి మరణవార్త అది. వినగానే పెనుగాలికి రెపరెపలాడే చిరు దీపంలా మనిషి అమాంతం ఊగిపోయి, ఆఖరి గొడ్డలి దెబ్బకి, పెద్ద చప్పుడుతో క్రిందపడే చెట్టులా "అమ్మా" అంటూ క్రిందపడ్డాడు. డాక్టర్ రావు స్పృహలో లేడు. వెంటనే ఎమర్జన్సీ నెంబరు 911కి ఫోన్ చేసింది ఆయన భార్య.

ఐదు నిమిషాలలో వచ్చిన ఎంబులెన్సులో ఎమర్జన్సీ రూమ్‌కు చేరింది భర్తతో. అక్కడ దిగగానే వచ్చీరాని స్పృహలో "అమ్మా... గంగమ్మా, గౌరమ్మా, అమ్మా..." అని, పిలుపు అందుకొని వాళ్ళని పిలిచినట్లు గట్టిగా పిలిచి, మళ్ళీ స్పృహ తప్పిపోయాడు.

***

ఆయన డాక్టర్ రావు అవ్వక ముందు 'బాబు' అని ముద్దుగా అందరిచేత పిలవబడే వాడు. బాబు చూపులో చురుకుగా, చదువులో ముందుగా ఉండేవాడు. హైస్కూలు చదువు పూర్తి అయిన తరువాత జరిగిన పరీక్షలలో ప్రప్రథముడిగా ఉత్తీర్ణుడై ఇంటికి వచ్చిన రోజు అందరూ బాబు ఉజ్వలమైన భవిష్యత్తు కలవాడని, పై చదువులకు వెళ్ళాలని అనుకొన్నారు. ఆ రోజు సాయంత్రం ఇంటి ముందర వసారాలో బాబు తల్లిదండ్రులు, లెఖ్ఖల మాష్టారు కుర్చీలలోను, బాబు తండ్రి ఆఫీసులో పనిచేసే తోటి ఉద్యోగస్తులు ఇద్దరు గోడకు ఆనుకుని ఉన్న బల్ల మీద కూర్చున్నారు. ఆ ఇంటి పాలికాపు రావులు, పురుళ్ళ గంగమ్మ స్తంభానికి ఆనుకుని క్రింద కూర్చున్నారు.

వాళ్ళందరు ఆలోచిస్తున్నది ఒకే విషయం – బాబుని ఏ పై చదువులో చేర్పించాలని.

ప్రతి ఏడాది ఆ తరగతికి కావలసిన పుస్తకాలను ముందుగా కొనిపించు కోవడం, కొన్ననాటి నుండి పెరటి వసారాలో కూర్చొని, మొదట పేజీ నుండి చివరి పేజీ దాకా గట్టిగా అందరికీ వినబడేలా చదవడం, స్కూలుకు సక్రమంగా వెళ్ళడం, తరగతిలో మాష్టార్లు చెప్పే పాఠాలు శ్రద్ధగా వినడం, పరీక్షలలో అన్ని ప్రశ్నలకి పూర్తిగా సమాధానాలు వ్రాయడం, తప్పకుండా క్లాసులో మొదటి

మూడు స్థానాలలో నిలిచి పాస్ అవుతుండడం తప్ప, బాబు ఏ కోర్సు చదవాలి, భవిష్యత్తులో ఏ ఉద్యోగం చెయ్యాలి లాంటి విషయాలు ఎప్పుడూ ఆలోచించలేదు. ఇప్పుడూ ఆలోచించడం లేదు. కానీ అన్నీ వింటున్నాడు.

ఒకరు ఇంజనీరింగ్ అని, మరొకరు డాక్టర్ అని, ఇంకొకరు టీచర్ అని, కలెక్టర్ అవ్వాలని, మిలట్రీకి వెళితే బావుంటుందని, ఎవరికి తోచింది వారంటున్నారు. తండ్రి, లెక్కల మాష్టారు ఏది ఎందుకు మంచిది కాదో, ఎందుకు వీలుపడదో వివరిస్తున్నారు. ఈ చర్చలో వెనక్కీ ముందుకీ వెళుతున్నారు. మిగిలిన అన్ని రకాల చదువుల కంటే డాక్టరా? ఇంజనీరా? అన్న విషయంపై చర్చ ఎక్కువగా సాగింది.

“నాను నాలుగు పుశ్కరాల నుండి పురుళ్ళు పోస్తన్నాను. నాకు తెలిసిన ఒయిద్యం, నాటు ఒయిద్యం అనండి, మరోటనండి, నా అనుభవం అంతా తిరగదోసి సూస్తే, సచ్చిపోయిన పిల్లలంతా సరైన టయానికి సరైన ఒయిద్యం అందకే సచ్చిపోయారని నా నమ్మకం. బాబు డాట్రీ సదవాల. మనూరు రావాల. ఈ గంగమ్మ సచ్చిపోయేలోగా ‘నాను బతికించలేని పురిటి బిడ్డని బతికించాల.’ అప్పుడు నాను సుఖంగా సస్తాను. నేకుంటే, సచ్చేటప్పుడు కూడా ఈ బాధ నన్నొగ్గదు. ఏటంటారు?” అంది పురుళ్ళ గంగమ్మ.

ఎవ్వరూ ఏమనలేదు.

***

బాబు మెడిసిన్‌లో చేరాడు.

మెడికల్ కాలేజీలో తెల్లకోటు వేసుకు తిరగడం, మానవ శరీరం గురించి ప్రొఫెసర్లు చెప్పే పాఠాలు వినడం, డాక్టరైపోయినట్లు ఊహించుకోవడం, కొత్త కొత్త స్నేహాలు బాబుని వేరే లోకాల్లో విహరింపజేసాయి. డాక్టర్ చదువే చాలా గొప్పది, తనకు తగినది అని అనుకున్నాడు. అలాంటప్పుడే బాబుకు ఒక్క క్షణం పాటు గంగమ్మ గుర్తుకు వచ్చేది. శలవలకు ఇంటికి వచ్చినప్పుడు, గంగమ్మ తనతో పాటు పురుళ్ళకు బాబుని రమ్మని పిలిచేది. కానీ తానింకా చాలా చదవాలని చెప్పాడు.

రెండవ సంవత్సరం దసరా సెలవులకు బాబు ఇంటికి వచ్చాడని తెలిసి జ్వరంతో ఉన్న గంగమ్మ చూడడానికి వచ్చింది. ముందు వసారా అరుగు మీద చతికిలపడి, "బాబూ" అని ఎంతో ఆర్తిగా పిలిచింది.

ఎంతోమంది పిల్లల 'తొలి కేక'లను, వైద్య సహాయం అందక పసిపిల్లలు వేసే 'ఆఖరి కేక'లను విన్న పురుళ్ళ గంగమ్మ, తాను విన్న కేకలన్నింటిని ఈ ఒక్క పిలుపులోనే వినిపించింది.

పరుగెత్తుకుని వచ్చిన బాబుని చూసి, దగ్గరకు రమ్మని పిలిచింది. "చలి జ్వరం మూడోసారి వచ్చింది. మరోపాలొస్తే మరింక బతకను. కాని బాబూ నువ్వు పెద్ద డాక్టైౖ, ఒక్క సుట్టు బేగి రా బాబు, బేగి రా. మొదటే చలిజ్వరం రాకుండా చూసే మందు ఒట్టుకురా బాబు. మనూరు రా బాబు" అంది.

జ్వరంతో కాలిపోతున్న ఆమె చెయ్యిని విడిపించుకోగలిగాడే కాని ఆమె మాటలు అతని మెదడులో నాటుకుపోయాయి. అలా మాట తీసుకున్న గంగమ్మ ఎన్నో నెలలుగా వచ్చిపోతున్న మలేరియా జ్వరంతో చనిపోయింది. ఉత్తి మలేరియా జ్వరంతోనే చనిపోయింది అని తెలిసి చాలా ఆశ్చర్యపోయాడు బాబు.

మెడిసిన్ ప్రొఫెసర్‌ని కలసి ఈ విషయం గురించి అడిగాడు.

"ఇదేమంత ఆశ్చర్యపడవలసిన విషయం కాదు. మన దేశంలో, మన దేశం వంటి బీద దేశాలలో ఉత్తి మలేరియా జ్వరంతోనే మనుషులు చనిపోవచ్చు" అన్నారు ఆయన, అది అతి సామాన్యమైన విషయం అన్నట్లు.

"కానీ, డాక్టర్ రోనాల్డ్ మన దేశంలో పరిశోధనలు చేసి, మలేరియా క్రిమి జీవిత చక్రం కనుగొన్నారని, ఈ క్రిమిని వ్యాపింపజేసే దోమలని డి.డి.టి ద్వారా నశింప చేయవచ్చునని పుస్తకాల్లో చదివానే..."

"నిజమే. డాక్టర్ రాస్ పేరు మీద హైదరాబాద్‌లో బేగంపేట విమానాశ్రయం దగ్గర ఓ సంస్థ కూడా ఉంది. మన దేశంలో మలేరియా పరిశోధన సంస్థలు చాలా ఉన్నాయి. అయినా మన దేశంలో మలేరియా ఇంకా ఎక్కువగానే ఉంది" అని వేదాంతిలా నవ్వి, "ప్రజల అశ్రద్ధ, మలేరియా జ్వరానికి కారణమైన

క్రిములని వ్యాపింపజేసే దోమలు పెరగడానికి అనువైన మురికి నీటిని, కాలువలని ఇంటా బయట శుభ్రపరచక అశ్రద్ధతో వదిలివేయడం. ప్రభుత్వాలు, బడుగు దేశాలలోని శాస్త్రజ్ఞులు చూపించే దారుణమైన నిర్లక్ష్యం అతి ముఖ్యమైన కారణం అని గుర్తుంచుకో" నిష్కర్షగా అన్నారు సామాజిక ఆరోగ్య విషయాలపై పాఠాలు చెప్పే ప్రొఫెసర్.

"మలేరియా క్రిమి రకరకాల బాహ్య స్థితులలో వేర్వేరు శరీర భాగాలలో నివాసం ఏర్పాటు చేసుకుంటూ, వివిధ రకాల బాహ్య కవచ ప్రొటీన్లని ఉత్పత్తి చేస్తూ, అందుబాటులో ఉన్న మందులకు, పరిశోధనలలో ఉన్న వేక్సిన్లకు లొంగకుండా జీవించగలడం మనం మలేరియా అరికట్ట లేకపోవడానికి శాస్త్రీయ కారణాలు" అన్నారు బయోకెమిస్ట్రీ ప్రొఫెసర్ నిస్సహాయంగా.

ఎప్పుడూ ప్రయోగశాలలో ఉంటూ వైద్య పరిశోధనలపై ఎక్కువ ఆసక్తి కనబరిచే ఫిజియాలజీ ప్రొఫెసర్‌ని అడిగితే బాబుకి చక్కని మార్గనిర్దేశం చేసారు.

"ఎన్నో కారణాల వల్ల మలేరియా క్రిమి ప్రబలి పోతున్నది. బడుగు దేశాలలో లక్షల కొద్ది ప్రజలను ప్రతి ఏడాది పొట్టన పెట్టుకుంటున్న ఏకైక ఏకకణ జీవి మలేరియా క్రిమి. నువ్వు రోజూ లైబ్రరీలో మలేరియాపై, దోమల గురించి ఉన్న పుస్తకాలు చదువు. సులభంగా, అతి తక్కువ ఖర్చుతో మలేరియాని, లేదా మలేరియాని వ్యాపింపజేసే దోమలనీ నివారించగల మార్గాలని అన్వేషించు" అని సలహా ఇచ్చారు.

ఆ సలహా ప్రకారం బాబు రోజూ ఒకటి, రెండు గంటలు మలేరియా గురించి శ్రద్ధగా చదివేవాడు. మలేరియా క్రిమి కంటికి కనిపించనంత చిన్నదైన ఏకకణ జీవి, అయినా కోటానుకోట్ల కణాలు కలిగిన మనిషి కంటే ఎక్కువ శక్తివంతమైనది ఎలా కాగలదు? కాలేదు. కాని ఈ క్రిమిని అరికట్టలేకపోవడానికి కారణం మన అశ్రద్ధే అని అనుకొన్నాడు బాబు. చదివినకొద్దీ ఈ క్రిమిని అరికట్టడానికి కావలసిన ఎన్నో అవకాశాలు ఉన్నా, అరికట్ట లేకపోతున్నామంటే అది ప్రజలు, ప్రభుత్వం అశ్రద్ధ మాత్రమే అని అనుకొన్నాడు. ఉన్న ఒకే ఒక్క

శక్తివంతమైన మందు క్లోరోక్విన్‌ను సవ్యంగా వాడక ఈ మందుకు లొంగని మలేరియా క్రిముల ఉత్పత్తికి దోహదం చేశారన్న విషయం గ్రహించి మరింత బాధపడ్డాడు. దోమల్ని అరికట్టడానికి మరింత శక్తివంతంగా, సులభంగా పనిచేసే మందులు పరిశోధనల ద్వారా కనుక్కోవాలని అనుకొన్నాడు. ఈ సమయంలోనే రమణ అనే తోటి విద్యార్థితో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ కలసి చదవడం, చర్చించుకోవడం చేస్తుండేవారు. తాము చదివినవి ప్రొఫెసర్లతో చర్చిస్తే, ముందు చదువు పూర్తిచేసి, వైద్య పరిశోధనలు జరిపే సంస్థలలో చేరి పరిశోధనలు చేయమని సలహా ఇచ్చారు.

***

మెడిసిన్ పూర్తి అయింది. హౌస్‌సర్జన్సీ చేస్తున్నప్పుడు రమణతో కలసి ఢిల్లీ వెళ్ళాడు. ఇద్దరూ అక్కడ ఉన్న మలేరియా రీసెర్చి సెంటర్‌కి వెళ్ళి డైరెక్టర్ డాక్టర్ శర్మను కలసి మాట్లాడారు. ఆయన వ్రాసిన పేపర్లు, పుస్తకాలు కొన్ని ఇచ్చి, ఇక్కడ ఇంతకన్నా ఇంకేం చెయ్యలేం, కానీ విదేశాలలో పరిశోధనలకు మంచి మంచి అవకాశాలు ఉంటాయని చెప్పి, ఒక మంచి టీ ఇప్పించి పంపించారు.

హౌస్‌సర్జన్సీ కూడా పూర్తయింది. తనలాంటి చాలామంది ప్రతిభావంతులైన వైద్యులవలే బాబు కూడా అమెరికా వచ్చాడు. రెసిడెన్సీ చేసాడు. మేధావిగా పరిగణించబడ్డాడు. ప్రముఖ వైద్య కేంద్రంలో ఆ రోజుల్లో అమెరికాలో అత్యంత ప్రాముఖ్యం ఉన్న గుండె జబ్బుల (కార్డియాలజీ) విభాగంలో ప్రవేశించాడు. పాశ్చాత్య దేశాలలో అతి ఎక్కువ మరణాలకు మూలకారణమైన గుండె జబ్బుల పరిశోధన వైపు ఆకర్షించబడ్డాడు. అందులో పరిశోధనలు జరపడం ప్రారంభించాడు. లైబ్రరీలో అప్పుడప్పుడు మలేరియా పరిశోధనలకు సంబంధించిన విశేషాలు తారసపడినప్పుడు చదివేవాడు. వీటిలో చాలా ఎక్కువ భాగం మలేరియా ఎక్కువగా లేని దేశాల పరిశోధకులవే అని గ్రహించి మలేరియా బాగా ఎక్కువగా ఉన్న దేశాల పరిశోధకులపై చికాకు పడుతూ ఉండేవాడు.

***

అమెరికా వచ్చిన దగ్గర నుండి ఇంటి పెద్దలు ఉత్తరాలు రాసి రాసి, పెళ్ళి చేసుకోమని కోరగా ఇండియా వచ్చాడు. పద్ధతి ప్రకారం పెళ్ళిచూపులు, ముహూర్తాలు అన్నీ సవ్యంగా జరిగాయి.

పెళ్ళిరోజు ముత్తైదువులు – తల్లి, పినతల్లులు, అత్తయ్యలు తమ చేతులతో బాబు ఒంటికి నలుగుపెట్టి రుద్దుతుంటే, బాబు మెదడు పొరలలో ఎక్కడో దాగి ఉన్న ఒక 'స్పర్శ' యొక్క జ్ఞాపకం ఉప్పెనలా బాబు ఒళ్ళంతా పాకింది. బాబు ఒళ్ళంతా గగుర్పొడిచింది.

అర్ధరాత్రి ఉన్నట్టుండి ఒక్కసారి సూర్యోదయం అయినట్టయింది.

కళ్ళు గట్టిగా మూసుకొని తెరిచాడు. ఎదురుగా తాను చూడాలనుకున్న ఆ 'స్పర్శ'కు మానవ రూపం అయిన గౌరమ్మ కనబడలేదు. తల్లి, పినతల్లులు, అత్తయ్యలు మాత్రమే కనబడ్డారు.

"అమ్మా గౌరమ్మ ఏది?" అని అడిగాడు.

ప్రస్తుతం ఈ పెళ్ళితో, చుట్టూ ఉన్న బంధువులతో సంబంధం లేని ప్రశ్న అది.

ఎన్నో ఏళ్ళ క్రితం, పురుళ్ళ గంగమ్మ అందించిన 'పురిటి పసికందు'ను అందుకొని, ప్రతీరోజూ తన అరచేతులతో ఒళ్ళంతా నూనె రాసి, కాపడం పెట్టి; నలుగు పెట్టి, ఒళ్ళు రుద్ది, నీళ్ళు పోసే గౌరమ్మ చేతి స్పర్శ బాబుకు పదో ఏటి దాకా అనుభవమే.

ఇటువంటి మంగళ సమయంలో, మంగళస్నానం చేయించే ముందు బాబుకు ఆ ఇంటి పనిమనిషి గౌరమ్మ గుర్తుకురావడం బాబు తల్లికి ముందు ఆశ్చర్యం కలిగింది. వెంటనే చికాకు కలిగించింది. ఆ మరుక్షణమే – ముప్ఫై ఏళ్ళకు పైగా తన ఇంటికి కనిపెట్టుకుని, ఇంట్లో మనిషిలా ఇంటిల్లిపాదికి సేవలు చేసి యాభయ్యో పడిలో తరచూ వచ్చే మలేరియా జ్వరాలను తట్టుకోలేక తనువు చాలించిన గౌరమ్మ జ్ఞాపకం ఆమెని కూడా కదిలించింది.

ఆమె మౌనంగా నిశ్చేష్టురాలై నిలబడి ఉండిపోవడాన్ని గమనించిన మిగిలినవాళ్ళు నలుగు పెడుతూనే ఉన్నారు.

తల్లి నుండి సమాధానం ఎదురు చూస్తున్న బాబు “అమ్మా!” అని పిలవడంతో ఆలోచనల నుండి బయటపడింది.

“ఆ మధ్య తరచూ వచ్చే జ్వరాల వల్ల పోయిందిరా” అని మౌనం మాట్లాడినట్లు మాట్లాడి, క్షణంలో మూగతనం వచ్చిన దానిలా కొడుకు మొహం చూస్తూ ఉండిపోయింది.

బాబులో ‘మనిషి’ గౌరమ్మ మీద జాలిపడ్డాడు.

బాబులో ‘డాక్టరు’ బాబు మీద కోపం తెచ్చుకున్నాడు.

బాబులో ‘శాస్త్రజ్ఞుడు’ బాబు మీద అసహనం చూపించాడు.

బాబు మౌనంగా మంగళస్నానం తంతు పూర్తిచేసుకుని, మంగళ వాయిద్యాల మధ్య, పెళ్ళి కూతురు అని పిలవబడుతున్న మంగళకి మర మనిషిలా... మౌనంగా... మంగళసూత్రం కట్టాడు.

రాబోయే భార్య కోసం శోభనం గదిలో ఎదురుచూస్తూ, కిటికీలోంచి పెరటిలోకి చూసాడు.

అంట్లు తోముతున్న గౌరమ్మ, అమెరికా ప్రయాణానికి సిద్ధమవుతున్న బాబుని ‘బాబొక్కసారి పరిచ్చ చెయ్యవా? జొరంగా ఉంది’ అని అడిగిన సంఘటన కళ్ళముందు జరిగినట్లు అనిపించింది. మర్నాడు ఊర్లో ఉన్న తన స్నేహితుడైన డాక్టర్ని చూడమని చెపితే –

‘సరే, కాని బాబు, నువ్వు పెద్ద డాక్ట్రవవుతావుట బాబు, ఈ పాలొచ్చినప్పుడు నాకు మంచి మందియ్యి బాబు, నువ్వే ఇయ్యాల. నిన్ను సిన్నప్పటి నుండి సాకాను. నాను ముసిలైపోతున్నాను. ఈ జొరాలు రాకుండా మంచి మందిచ్చావంటే, నాలుగు కాలాలు బ్రతికి నీ పిల్లల్ని కూడా సాకుతా బాబు. మందొట్టుకుని బేగి తిరిగొచ్చీ బాబు’ అంది.

పెళ్ళికి వచ్చిన డాక్టర్ మిత్రులను మర్నాడు మలేరియా గురించి అడిగితే, 'డిడిటి వాడకం ఆపెయ్యడం వల్ల, ఉన్న మందులు పనిచెయ్యకపోవడం వంటి రకరకాల కారణాల వల్ల మలేరియా పెరిగిపోతుంది. అన్నింటికంటే ముఖ్యంగా ప్రస్తుతం ప్రభుత్వం ముందుకు వచ్చి పటిష్టమైన పథకంతో దోమలని నివారించాలి, శక్తివంతమైన మలేరియా మందులు అందించాలి, ఈ రెండింటికి కావలసిన పరిశోధనలకు ప్రాముఖ్యం ఇవ్వాలి' అని సెలవిచ్చారు.

కొత్త పెళ్ళికూతురుతో అమెరికా వెళ్ళడానికి ఊరు వదలి, పట్నంలోని విమానాశ్రయం వైపు కారులో వెళుతుంటే, ఐదడుగుల ఎనిమిది అంగుళాల పొడవైన గౌరమ్మ, బక్కచిక్కిన శరీరంతో, కారు నల్లని ఒంటిరంగుతో నెరిసీ నెరవని జుత్తుతో, మెరిసే కళ్ళతో, ముక్కుకి నత్తుతో, కాళ్ళకి వెండి కడియాలతో, ఎర్రంచు తెల్లచీరలో, 'ఒక్క పాలి రా బాబు, బేగి రా. బేగొచ్చి నాకీ జొరం పోవడానికి మాతరొ, సూదిమందొ వొట్టుకుని రా బాబు!' అని దీనంగా అడుగుతూ వెంట వస్తున్నట్లు కిటికీ అద్దంలోంచి కనిపించింది.

అమెరికా చేరిన వెంటనే మలేరియా పరిశోధనల గురించి ఆలోచించాలని పదే పదే అనుకుని కళ్ళు మూసుకున్నాడు.

***

ఏళ్ళు గడిచిపోయాయి. డాక్టర్ రావుకి బాబు గుర్తు రావడం లేదు. డాక్టర్ రావు మాత్రమే డాక్టర్ రావుకి తెలిసిన 'తను'.

వలస వచ్చిన అమెరికా సమాజంలో వైద్యుడిగా ప్రతి ఏడాదీ కొత్త మెట్లు ఎక్కుతూనే ఉన్నాడు. ఏ ప్రేరణల వల్ల వైద్య విద్యార్థి అయ్యాడో, ఏ ఉత్సాహం తనని చక్కనైన వైద్యుడిగా తీర్చిదిద్దిందో, ఏ మనుషులు అతడు గొప్ప వైద్యుడు కావాలని కోరుకున్నారో, ఆ ప్రేరణలకు, ఆ పరిస్థితులకు, ఆ మనుషులకు అతన్ని రెట్టింపు దూరం చేసింది – అతను ఎక్కే ప్రతి మెట్టు.

ఏడాది నుండి తల్లికి జ్వరం వస్తూ పోతున్నదని ఉత్తరాలు వస్తున్నాయి. ఫోను ద్వారా పరిస్థితి తెలుసుకుంటూ ఉన్నాడు. 'ఒక్కసారి రా బాబు' అన్న

తల్లిమాటలు తానెప్పుడో మరచిపోయిన 'బాబు'ని పిలిచినట్లు, తనని కాదన్నట్లు తన వృత్తిలో మునిగిపోయాడు.

వృత్తి, దాంతోపాటు వచ్చిన సమాజంలోని మిగిలిన హంగులు, గౌరవాలు, ఆహ్వానాలు, డిన్నర్లు, ఇక్కడ అక్కడ రాజకీయ నాయకులతో పరిచయాలు, మిత్రులకు, సన్నిహితులకు ఇండియాలో ప్రైవేటు, గవర్నమెంటు కాంట్రాక్టులు, వచ్చిపోయే కళాకారులకు, సినిమా నటులకు, ప్రముఖ వ్యాపారస్థులకు, రాజకీయ నాయకులకు విశాలమైన తన భవనంలో విందులు ఇవ్వడంలో – మలేరియా గురించి మరిచిపోయాడు.

***

ఆగస్టు 27వ తారీఖు 1998 'ఈనాడు' దినపత్రికలో మలేరియాపై వచ్చిన వ్యాసాన్ని పంపిస్తూ ఉత్తరం రాసాడు ఇండియా నుండి మెడికల్ కాలేజి నాటి మిత్రుడు డాక్టర్ రమణ. మలేరియా పెరిగి పోతున్నదని, ప్రభుత్వం వెంటనే గట్టి చర్యలు తీసుకోకపోతే పరిస్థితి విషమించి రాష్ట్రం అంతటా కూడా మలేరియా వల్ల ఆరోగ్యపరమైన 'రెడ్ ఎలర్ట్' పెట్టవలసి వస్తుందని వ్రాసాడు. కొద్ది రోజులలో అమెరికా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి మీ ఊరికి వస్తున్నారని, వీలుచేసుకుని, ఆయన్ని కలిసి ప్రముఖ వైద్యుడిగా మలేరియా తీవ్రత గురించి, అధునాతన పరిశోధనలలో మలేరియాని తగ్గించడానికి కాని, దోమలని అరికట్టే విధానాలని గురించి మాట్లాడమని, దీని వలన ఏ చిన్న ఉపయోగకరమైన పని జరిగినా అది లక్షల మందికి ఉపయోగపడుతుందని ఆ ఉత్తరం సారాంశం.

మిత్రుడు రమణ రాసిన ఉత్తరం, 'ఈనాడు'లోని వ్యాసం చదివి ప్రస్తుతం మలేరియా ఇంత ఎక్కువైపోయిందా అని ఆశ్చర్యపడ్డాడు.

మర్నాడు తన దగ్గర పనిచేసే డాక్టర్ మిల్లర్‌ని పిలచి రెండు రోజులలో మలేరియా, దానికి సంబంధించిన ప్రస్తుత పరిశోధనలు గురించిన వివరాలు అన్నీ సేకరించి తనకు ఇమ్మని కోరాడు.

అతడు ఇచ్చిన వివరాలు చదివి, ప్రపంచం మొత్తంలో సుమారు 30–50 కోట్ల మంది మలేరియా పాలవుతున్నారని, ఇండియా గురించిన సమాచారం

పూర్తిగా అందకపోయినా, ఇండియాలో సుమారుగా కొన్ని కోట్ల మంది మలేరియా బారిన పడుతున్నారని, మలేరియా వల్ల ప్రతీ ఏడాది సుమారు 15.27 లక్షల మంది మరణిస్తున్నారని ఇందులో సగం మంది 5 ఏళ్ళలోపు పిల్లలేనన్నది ఆ వివరాల సారాంశం. ఇవి ప్రపంచ ఆరోగ్య సంస్థ 1998లో ప్రకటించిన వివరాలు. ఏడాదిలో పది రోజుల జ్వరం వల్ల పని మానేసిన పెద్దల వల్ల ఎన్నో కోట్ల పనిదినాల నష్టం. ఈ విధంగా ఏటా దేశానికి ఎన్నో వేల కోట్ల రూపాయల నష్టం. మనిషి బ్రతుకుకు విలువ కట్టడం ప్రభుత్వాలకు రాకపోయినా, ఒకేఒక్క ఏక కణజీవి వల్ల భారతదేశానికి మాత్రమే ప్రతి ఏడాది కోట్ల రూపాయల నష్టం. దీనిని ప్రభుత్వం ఎలా నిర్లక్ష్యం చెయ్యగలదు? ఈ లెఖ్ఖలకి ఫైలేరియా వంటి దోమల వలన వచ్చే ఇతర జబ్బులని కూడా చేరిస్తే అసలు దోమలని నశింపజేయడమే ముఖ్యం అనిపిస్తుంది.

అమెరికాలో 1950లలో, 1992లో లిబియాలో స్క్రూ వర్మ్ ఫ్లైని పూర్తిగా నశింపజేసిన పద్ధతిని కూడా చేర్చాడు డాక్టర్ మిల్లర్ మలేరియా ఫైలులో. దానికి పెట్టిన ఖర్చు సుమారు 117 మిలియన్ డాలర్లు. కానీ భారతదేశం ప్రతి ఏడాది వందలకొద్దీ మిలియన్ డాలర్లు మలేరియా వలన దోమలమూలంగా నష్టపోతూ ఉండవచ్చునని ఆశ్చర్యపడి, ముఖ్యమంత్రిని కలిసి ఈ విషయం వివరిస్తే తప్పకుండా తగిన చర్యలు తీసుకుంటారని ఆ ఫైలు మొత్తాన్ని తన ముఖ్యమైన కాగితాలతోపాటు పెట్టుకున్నాడు.

డాక్టర్ రావు ముఖ్యమంత్రిని కలిశాడు. విందులకు కూడా వెళ్లారు. కానీ తగినంత చొరవ తీసుకోలేకపోవడం వల్ల మలేరియా గురించి మాట్లాడలేక పోయాడు. గత రెండు నెలలుగా తెలుగు వైద్యులు కలిసి ఆంధ్రాలో పెట్టబోయే అధునాతన గుండెజబ్బుల కేంద్రానికి డాక్టర్ రావుని చీఫ్ ఎడ్వైజర్గా ఉండమని కోరినందువల్ల దానిమీద ఎక్కువ ధ్యాస పెట్టాడు.

వైద్యునిగా డాక్టర్ రావు తన దేశానికి ఎంతోసేవ చేస్తున్నాడని అమెరికాలో వెలువడే భారతీయ పత్రికలు, ఆంధ్రాలో వెలువడే తెలుగు పత్రికలు పొగుడుతూ వ్యాసాలు వ్రాసాయి.

**గురుదక్షిణ**

'ఒక్క సుట్టు బేగి రా బాబు, బేగి రా' అని పురుళ్ళ గంగమ్మ పిలుస్తున్నట్లు అనిపించింది' షికాగో హాస్పిటల్ బెడ్‌పై అపస్మారక స్థితిలో ఉన్న డాక్టర్ రావుకు. 'ఒక్క పాలి రా బాబు, ఒక్క పాలి రా' అని గౌరమ్మ పిలుస్తున్నట్లు అనిపించింది. ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో అత్యంత అధునాతనమైన వైద్య పరికరాల సహాయంతో ప్రముఖ వైద్య బృందం ప్రత్యేక పర్యవేక్షణలో వచ్చీరాని స్పృహలో ఉన్న బాబుకు. 'ఒక్కసారి రా బాబు' అని తల్లి పిలుస్తున్నట్లు అనిపించింది.

కళ్లు తెరవాలని ప్రయత్నించాడు. తెరవలేక పోయాడు. వర్షంలో చూరునుండి క్రిందపడి కాలువలా పారుతున్న నీటిలో చిన్నప్పుడు వేసిన కాగితపు పడవ, వీధి చివర పెద్దకాలువలో చేరి, ప్రవాహ వేగానికి తట్టుకోలేక, తడిసి ముద్దయి, వడిలిపోయి గిరికీలు కొడుతున్నటువంటి మానసిక స్థితిలో ఉన్న బాబు పూర్తి మెలుకువలోకి వచ్చి,

"అమ్మా, గంగమ్మా, గౌరమ్మా..." అని గట్టిగా అరిచినట్టు పిలిచాడు.

చుట్టూ చేరిన వైద్యులు, నర్సులు అర్థంకాని చూపులతో పరిస్థితి అర్థం చేసుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు.

ఒక్కగానొక్క కొడుకుగా వెంటనే ఇండియా వెళ్ళాలి.

కంప్యూటర్ కంట్రోల్డ్ కంప్లీట్ కార్డియాక్ కేర్ సెంటర్ డైరెక్టర్‌గా బాధ్యత తీసుకోవాలి.

తను అనుకున్న వైద్య పరిశోధనలపై లక్షల కొద్దీ డాలర్లు ఖర్చు పెట్టించి మంచి ఫలితాలను పొందగలిగిన శక్తి గల అతను ఎప్పటినుండో తనని బాధిస్తూ, లక్షల మందిని వేధిస్తున్న మలేరియా గురించి ఆలోచించాలి.

'ఒక్క సుట్టు', 'ఒక్కపాలి', 'ఒక్కసారి...' అని పిలుస్తున్న పిలుపులకి సరియైన బదులు పలుకుతాడా? లేక, "అమ్మా, గంగమ్మా, గౌరమ్మా...." అంటూ పిచ్చివాడైపోయి మానసిక ఆరోగ్య కేంద్రంలో ఏ ప్రేరణల వల్ల వైద్య విద్యార్థి అయ్యాడో, ఏ ఉత్సాహం చక్కనైన వైద్యుడిగా తనని తీర్చిదిద్దిందో, ఆ రెండింటిని మరచి 'మాములు మనిషి' అవ్వడానికి మందు తీసుకొంటాడా?

చివరకు డాక్టర్ రావు ఏమైపోతాడు?!

***

ఈ ప్రశ్నలకు, ఆలోచనలకు అందుబాటులో ఉండి మన అందరి మధ్య ఉన్న వందలాది డాక్టర్ రావులు, అమెరికాలో ఉన్నా, ఆంధ్రాలో ఉన్నా, ఏ రంగంలో ఉన్నా, తమకి తాము ఈ ప్రశ్నలు వేసుకుని, ఆలోచనలకు తావిస్తే, తమలోని 'పిలుపు'కు అవకాశమిచ్చి వినిపించుకోడానికి ప్రయత్నిస్తే, వారిలోని డాక్టర్ రావు 'బాబు' అయితీరుతాడు. లక్షలు సంపాదించలేకపోయినా, లక్షల మందికి ఉపయోగపడే లక్షణమైన మనిషి అవుతాడు.

*

**'నాను బతికించలేని పురిటి బిడ్డని బతికించాల' అని గొప్పగొప్ప డాక్టర్లకంటే గొప్పగా చెప్పిన పురుళ్ల గంగమ్మ, నాకు పురుడు గంగమ్మకి నమస్కరిస్తూ...**

# ఇల్లు అమ్మిపెట్టి చూడు

**"నా**ది బయోటెక్నాలజీ ఫీల్డ్. నేను ఇల్లు అమ్మించే ఏజెంట్‌ని కాదు. మీరు ఏదో తప్పు నెంబరుకి ఫోన్ చేశారు."

"లేదు లేదు. మీ గురించి తెలిసే ఫోన్ చేశాను. కిడంబి రఘునాథ్ గారు చాలా ఏళ్ళ క్రితం మిమ్మల్ని పరిచయం చేసినప్పుడు అభయ టెక్నాలజిస్ట్ అని పరిచయం చేశారు. నాకు బాగా గుర్తు. నేను ఉన్న పరిస్థితులలో మీ వంటి వారి సహాయం చాలా అవసరం. దయచేసి నేను చెప్పేది వినండి" అని మొదలు పెట్టి ఆయన వివరంగా విషయం చెప్పారు.

ఆయన పేరు ప్రభాకరం. న్యూయార్క్ మహానగరంలోని క్వీన్సులో నివాసం. వయసు అరవై ఏళ్ళు. అమెరికా ప్రెసిడెంట్ జార్జి బుష్ అవకతవక ఆర్థిక రాజకీయ విధానాల వల్ల ఏర్పడిన ఆర్థిక సంక్షోభం ఫలితంగా ఆయన పనిచేసే కంపెనీ మూసేసారు. పెన్షన్ డబ్బు కూడా సగానికి సగం పడిపోయింది. పిల్లలు ఎదిగినవాళ్ళే. అయితే ఇంటి మురిపెం తీరిపోయింది. ఇల్లు అమ్మితే వచ్చే డబ్బుతో హాయిగా బ్రతకవచ్చున్న ఆలోచనతో ఆయనకున్న పెద్ద ఇల్లు అమ్ముదామని కొన్ని నెలలుగా ప్రయత్నిస్తున్నారు.

రియల్ ఎస్టేట్ మార్కెట్ బాగా దిగజారడం వల్ల ఇల్లు అమ్మడం చాలా కష్టంగా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో పూర్తి రొక్కం పెట్టి కొనే ఇండియన్ మార్కెట్లో ఉన్నాడుట. అతను హెచ్1 వీసా మీద ఉన్న కుర్రాడుట. వాస్తుపై చాలా పట్టింపులు ఉన్నవాడు. అయితే ప్రభాకరంగారి ఇల్లు 20 ఏళ్ళ క్రిందట

కొన్న ఇల్లు. ఆ రోజుల్లో అమెరికాలో వాస్తు విషయం ఆలోచించేవారు కాదుట. కానీ ఈ రోజుల్లో ఈ హెచ్1 వాళ్ళల్లో చాలా మంది వాస్తు చూసే కొంటున్నారుట. ఆ రోజుల్లో ఇండియా అమెరికాలా ఉంటే బాగుండునని, అమెరికా ఇండియాలా ఉంటే బాగుండునని అనుకునేవారు. కాని ఇలా వాస్తు వంటివి వస్తాయని ఏనాడూ అనుకోలేదుట. నేను ఏదో ఒకలా ఆ హెచ్1 కుర్రాడిని ఒప్పించి ఈ ఇల్లు అమ్మించి పుణ్యం కట్టుకోవాలిట – ఇదీ ఫోను సారాంశం.

***

సదరు హెచ్1 కుర్రాడు – నడిమింటి నాగ సత్య శివ వీర వెంకటసుందర సీతారామ రంగనాథ సంపద శ్రీనివాస ప్రసాదు. ఇంత పేరుతో పిలవలేక ఎవరికి తోచినట్టు వారు పొట్టి పేరు పెట్టి పిలుస్తుంటారు. అది ఇతనికి అలవాటే. చాంతాడు ప్రసాద్, స్వేర్స్ ప్రసాద్, కొందరైతే టెంపుల్ ప్రసాద్ అని అంటారు. ఆఫీసులో లాంగ్‌నేం ప్రసాద్ అంటారు. ఇలా చాలా పేర్లతో చలామణీ అయ్యే ప్రసాద్ ప్రస్తుతం 'వాస్తు ప్రసాద్' అయ్యాడు. గత మూడు నెలలుగా ప్రతి రోజూ ఇల్లు చూడడం, వాస్తు బాగాలేదని మానెయ్యడం అతను చేస్తున్న పని. అతనికి మరో పని లేదు. అది నిజమే. ఎందుకంటే అతనికి ఉద్యోగం లేదు. ఇటువంటి ఆర్థిక సంక్షోభంలో ఉద్యోగాలున్న వాళ్ళకే ఇల్లు నిలబెట్టుకోవడం కష్టమయిపోతుంటే ఉద్యోగం లేకపోయినా ఆయన ఇల్లు కొనడం ఆశ్చర్యమే మరి.

వాస్తు ప్రసాద్ చాలా చాదస్తమున్న కుటుంబంలో పుట్టాడు. అతని పేరే దానికి ఉదాహరణ. సహజంగా కుటుంబంలో సంక్రమించిన చాదస్తం ప్రసాద్ వయసుతో పాటు పెరిగింది. స్కూల్ రోజుల్లో తోటి పిల్లలు అతని చాదస్తాన్ని చూసి వెక్కిరించడం వల్లో, లేదా సహజంగా తల్లిదండ్రుల కంటే భిన్నంగా ఆలోచించాలన్న ఉద్దేశంతోనో, తల్లిదండ్రుల చాదస్తమంటే చికాకు, కోపం, అసహ్యం ఏర్పడి కాలేజీ రోజుల్లో కమ్యూనిస్టుగా మారాడు. పట్టుదల ఉన్నవాడు. బాగా చదువుకున్నాడు. ఇండియాలో ఐఐటి మద్రాసు, అమెరికాలో ఐఐటి (ఇల్లినాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) షికాగో డిగ్రీలు సంపాదించేడు. ముప్ఫయి ఏళ్ళలోపే మంచి ఉద్యోగం కూడా వచ్చింది. పెళ్ళి అయింది. ఉద్యోగంలో

మంచి పేరు కూడా వచ్చింది. గ్రూప్ లీడర్ అయ్యాడు. గ్రూప్ బాగా పనిచెయ్యడం వల్ల ఇతనికి పని తగ్గింది.

ఒకరోజు భార్యని గుడిలో దింపి బయట ఎదురు చూస్తుంటే లోపలున్న బాబాగారు పిలుస్తున్నారని ఆ బాబా గారి భక్తులొకరు వచ్చి చెప్తే ఆశ్చర్యంలో ఆలోచించకుండా వెళ్ళిన కమ్యూనిస్టు ప్రసాద్ కళ్ళు తెరిచి మూసేలోగా బాబా భక్తుడయిపోయాడు. ఆ తరువాత మరో అమ్మ భక్తుడయిపోయాడు. వెంటనే అమెరికాలో ఒక పెద్ద చాదస్తపు సమాజానికి ముఖ్య కార్యకర్త అయిపోయాడు. కల్యాణానికి కక్కు ఏవిధంగా ఫలితమో, బాబా, అమ్మల భక్తికి చాదస్తం ఫలితం కాబోలు. కమ్యూనిస్టు ప్రసాద్ తన తల్లిదండ్రుల కంటే చాదస్తుడిగా తయారయ్యాడు.

స్వంతంగా ఆలోచించే వ్యక్తి అసలు స్వంత ఆలోచనే లేనివాడిలా తయారయ్యాడు. ప్రతి పని చెయ్యడానికి ముందు– ఆఫీసు పని అయితే బాబాకి, ఇంటికి సంబంధించిన పనులయితే అమ్మకి తెలియబరిచి వారు చెప్పినట్టు తు.చ. తప్పక నడుచుకునేవాడు. గ్రూపు లీడరుగా తీసుకోవలసిన నిర్ణయాలలో కూడా బాబాగారి సలహాలు తీసుకోవడం వల్ల ఆఫీసు పనిలో ఇబ్బందులు వచ్చాయి. మారిన పనితీరు ఆఫీసులో అందరికి తెలిసింది. ప్రసాదును ఉద్యోగంలో నుండి తీసేశారు. ఇంతకాలం బాగా పనిచేసినందుకు బోనస్‌గా వచ్చిన కంపెనీ స్టాక్‌ను, తను స్వయంగా కొన్న ఆ కంపెనీ స్టాక్‌కి జతచేసి, అంతా అమ్మి డబ్బు చేసుకొని బ్యాంకులో వేసాడు. అందుచేత ప్రస్తుతం అతనికి బేంక్ లోను తెచ్చుకోకుండా ఇల్లు కొనడానికి కావలసినంత డబ్బుంది.

వాస్తు చూడకుండా ఇల్లు కొనవద్దని అమ్మ ఆదేశం. వాస్తు ప్రకారం వాస్తు గురించి వెబ్‌లో ఉన్నదంతా చదివాడు. తెలిసిన వాళ్ళందరి సలహాలు ఉద్దేశాలు తెలుసుకొన్నాడు. ఏది ఎక్కడ ఎలా ఉండాలో తెలుసుకొన్నాడు. చాలా ఇళ్ళు చూసాడు. వాస్తు ప్రకారం ఒకటి సరిగ్గా ఉంటే మరొకటి ఉండడం లేదు. ఇంటి ఉత్తర దక్షిణ, తూర్పు పడమరలే కాకుండా ఈశాన్యం, ఆగ్నేయం, నైరుతి, వాయువ్యం కూడా అతి జాగ్రత్తగా చూస్తాడు. తనని మోసం చెయ్యాలని,

ఏదో ఒక ఇల్లు అమ్మేయాలని దిక్కులు కూడా సరిగ్గా చెప్పరని దిక్సూచిని కొని వాడుతున్నాడు. దిక్సూచిని మాత్రమే నమ్ముతాడు. దిక్సూచి పెట్టి మరీ చూసుకొని ఇంటి మంచి చెడ్డలు నిర్ణయిస్తాడు. ప్రతి ఇంటికి ఏదో ఒక లోపం కనిపిస్తూనే ఉంది అతనికి. ఇంటి వాస్తు బాగుంటే ఆరోగ్యం మాత్రమే కాదు, ఆస్తీ అంతస్తు, ఉద్యోగం, బిడ్డల సుఖశాంతులు అన్ని బాగుంటాయని వాదిస్తాడు. అతనికి ఇళ్ళు చూపించని రియల్ ఎస్టేట్ ఏజెంట్ ఆ ప్రాంతాల్లో లేరంటే అతిశయోక్తి కాదు. నిజం.

అతనికి తొందరగానే ఇల్లు కొనాలని ఉంది. పూర్తి డబ్బు పెట్టి కొనే వాళ్ళు దొరకడం ఇల్లు అమ్మేవాళ్లకి, రియల్ ఎస్టేట్ వాళ్ళకి గొప్ప అదృష్టం. కాని వాస్తు ప్రసాద్ ఇప్పటిదాకా ఏ ఇంటిని కొనడానికి మాటివ్వలేదు.

ప్రభాకరం గారి ఇల్లు వాస్తు ప్రకారం ఉండే అవకాశం ఎక్కువే. ఆయన దగ్గరుండి గాలీ వెలుతురూ సరిగ్గా వచ్చేటట్టు, విశాలంగా ఇల్లు కట్టించుకొన్నారు. వాస్తు ప్రసాద్‌కి అన్ని సరిపోయేటట్టు ఉన్నాయో లేదో తెలుసుకొని మరీ ఇల్లు చూపించాడు రియల్ ఎస్టేట్ ఏజెంట్. వాస్తు ప్రసాద్ ఇల్లంతా దిక్సూచి పెట్టి చూసి సుమారుగా బాగానే ఉంది అనుకున్నాడు. మళ్ళీ, మళ్ళీ చూసాడు. లివింగ్ రూంలో ప్రాబ్లం ఉందని, అదేదో సరిగ్గా తెలియడం లేదని ఒకసారి ఒకలాగా, మరోసారి మరోలాగా రీడింగ్స్ వస్తున్నాయని, లివింగ్ రూం మధ్యలో ఒక గోడ ఉండాలని, లివింగ్ రూంకి డైనింగ్ రూంకి మధ్య ఉన్న గుమ్మం ఉండవలసిన దానికంటే ఒక మూడు అడుగులు ఎక్కువ ఉందని, గోడ కట్టించడం, గుమ్మం తగ్గించడం విషయంలో మళ్ళీ మరోసారి పరిశీలించి, అమ్మ సలహా తీసుకొని ఒక నిర్ణయానికి వస్తానన్నాడుట.

అమ్మ మరోసారి అన్నీ చెక్ చెయ్యమన్నారని రెండు రోజుల తరువాత ఇల్లు చూడాలని వస్తున్నాడట వాస్తు ప్రసాద్. వాస్తుకి సరిపోయేట్టుగా ఇంటిని ఎలా చూపించడం? ఆ ప్రశ్నతో సతమతమవుతున్న ప్రభాకరం గారికి ఎప్పుడో కిడంబి రఘునాథ్ గారు పరిచయం చేసిన నేను గుర్తుకొచ్చానుట.

***

“వాస్తు ఒక శాస్త్రం. భారతదేశంలో పూర్వీకులు దేవాలయాల నుండి ఇళ్ళ దాకా అన్ని రకాల కట్టడాలకీ కావలసిన సూచనలు తెలియబరిచే శాస్త్రం. దీనిని పూర్తిగా అర్థం చేసుకొన్న వాళ్ళ సలహా మీద చేస్తే మంచి ఫలితాలే వస్తాయి. కాని అన్ని రంగాలలో ఉన్నట్లే ఇందులో కూడా అన్ని రకాల వాళ్ళు ఉన్నారు” అన్నాను ప్రభాకరం గారితో.

“మీకు తెలిసిన వాస్తు చెప్పే వాళ్ళు ఎవరైనా ఉంటే చూసి వాళ్ళతో సంప్రదిస్తే బాగుంటుంది” అన్నారు ప్రభాకరం గారు.

“అలా చెయ్యొచ్చు, కాని ఒకరు చెప్పిన వాస్తుని మరొకరు ఒప్పుకోక పోవచ్చు. ఒకరు చెప్పేది అందరూ ఒప్పుకొనేలా ఈ వాస్తు శాస్త్రం ఉంటే ఎంతో బాగుండేది. అన్ని ఆధునిక శాస్త్రాలలాగే. గాలీ వెలుతురు విషయంలో పెద్ద భేదాలు ఉండకూడదు. కాని వాస్తు శాస్త్రం తమకొక్కరికే తెలిసినట్లు, చిన్న చిన్న విషయాలపై కూడా సరియైన అవగాహన లేక, అసలు వాస్తు విలువని తగ్గించే సలహాలు ఇస్తూ, చివరికి దీన్ని భారతీయ చాదస్తంగా మారుస్తున్నారు” అన్నాను.

“అది సరేనండి, కాని ఒకసారి దిక్సూచితో చూసి అంతా బావుందని, మరోసారి అదే దిక్సూచితో చూసి బాగోలేదేమో అంటే ఎలాగండి?”

“అలా అన్నారా?”

“అవునండి. మా లివింగ్ రూమ్ దివ్యం అని మొదటిసారి అని, గోడలు గుమ్మాలు ఉండవల్సిన చోట లేవని రెండోసారి తెలిసిందంటారు”

“మొదటిసారి సరిగ్గా ఉన్నవి రెండోసారి ఎలా మారుతాయి. దిక్సూచి చూపించడంలో ఏదో మార్పు ఉండి ఉండవచ్చు” అన్నాను.

“అదే అర్థం కావడం లేదండి” అన్నారు ప్రభాకరంగారు విచారంగా. “మీరొక్కసారి వచ్చి మా ఇల్లు చూడండి” అన్నారు అభ్యర్థనగా.

“నాకు వాస్తు తెలియదండి” అన్నాను నిర్మొహమాటంగా.

"అమ్మమ్మ! అలా అనకండి ఒకసారి మా ఇంటికి వచ్చి చూడండి. మీ సలహా పాటిస్తాను. ఈ ఇల్లు ఎలాగైనా అమ్మించండి దయ ఉంచి" అన్నారు ప్రభాకరంగారు వేడుకోలుగా.

అంత పెద్దాయన, అంతలా ప్రాధేయ పడుతుంటే కాదనలేక వస్తానన్నాను, వాస్తు తెలియకపోయినా!

***

మర్నాడు ప్రభాకరంగారి ఇంటికి వెళ్ళాను. ఆయనకి సంగీతం అంటే అభిమానం మాత్రమే కాదు, బాగా నేర్చుకున్నారు. ఇక్కడ సంగీతం నేర్పుతుంటారు. అమెరికాలో సంగీతం నేర్పే గురువులలో మొదటి తరానికి చెందినవారు. వారి అభిరుచికి అద్దం పట్టేటట్లు లివింగ్ రూమ్ ఉంది. చక్కగా అమర్చిన పెద్దపెద్ద స్పీకర్లు రూమ్‌కి అందం ఇస్తున్నాయి.

ఇల్లంతా చూసిన తరువాత లివింగ్ రూంలో సోఫాలో కూర్చొని కాఫీ తాగుతున్నాం.

"ఏమంటారు" అన్నారు ప్రభాకరం గారు.

"ఇల్లు చాలా బావుంది. ఇది వాస్తు ప్రకారం అయినా అవకపోయినా చాలా హాయినిచ్చే ఇల్లులా అనిపిస్తున్నది. కాని నేను మీకేమి సలహా చెప్పలేను" అన్నాను.

"మీరు ఏదో ఒక ఉపాయం చెప్తారని"

"ముందే చెప్పానుగా నాకు వాస్తు తెలియదని" వినయంగా అన్నాను.

"మీరు శాస్త్రజ్ఞులు కదా" అన్నారు. ఈ విషయాన్ని కొంత పరిశోధించ వచ్చుగా అనే ఆలోచన ప్రతిధ్వనిస్తూ.

"ముందు సారి ప్రసాద్ వచ్చినప్పటికి రెండోసారికి ఏమైనా మార్పు ఉందా?" అన్నాను.

ఆయన ఆలోచనలో పడ్డారు.

"ఏమీలేదండి. ముందుసారి ఆయన వచ్చింది శుక్రవారం. రెండోసారి

వచ్చింది ఆదివారం. అన్నారు ప్రభాకరం గారు.

ఉన్నట్టుండి స్పీకర్ల మీద పడింది నా దృష్టి. వెంటనే ఓ ఆలోచన స్ఫురించింది.

'బేస్‌మెంట్‌లో ఈ స్పీకర్లు ఎప్పుడూ ఒకేచోట ఉంటాయా లేక మారుస్తుంటారా?'

"కచేరి అయితే అన్ని స్పీకర్లు వాడతాం. అప్పుడు వీటిని ఈ లివింగ్ రూము అంతా చక్కగా వినిపించేట్లు ఏర్పాటు చేస్తాం. కచేరి లేని రోజు ఉంటాయి. ఏం వాటి గురించి ఎందుకు అడుగుతున్నారు?"

నా ఆలోచనకు బలం వచ్చింది. ఒకసారి ఒకలాగా మరోసారి ఇంకోలాగా వాస్తు ప్రసాద్‌కి అనిపించడానికి అవకాశం ఉండొచ్చని తోచింది. దానికి కారణం స్పీకర్లేనని అయ్యుండవచ్చు.

"ప్రసాద్ వచ్చిన ఆదివారం మీరు కచేరి చేసారా?" అన్నాను.

"అవును చేసాను, మీకు ఎలా తెలిసింది?" అన్నారు ఆశ్చర్యంగా.

ఆయన సమాధానంతో నాకు చిక్కుముడి విడిపోయినట్లయింది.

"ఆదివారం ఈ స్పీకర్ల అమరిక వల్ల వాస్తు ప్రసాద్ దిక్సూచి దిక్కులు మొదటమారు చూసినట్లు తనకి నచ్చినట్లు కాకుండా వేరేలా చూపించింది. ఈసారి అతను వచ్చేటప్పటికి అతని దిక్సూచి అతని వాస్తుకి కావల్సినట్టు చూపిస్తుంది" అని ప్రభాకరం గారికి ఏం చెయ్యాలో చెప్పాను.

***

ఓ నాలుగు రోజుల తర్వాత ప్రభాకరం గారు ఫోను చెయ్యకుండానే ఇంటికి వచ్చారు. తలుపు తియ్యగానే రెండు చేతులు పట్టుకొని "మీరు గొప్ప సహాయం చేసారు. మీరు చెప్పినట్టే ఆ స్పీకర్లను అమర్చాం. వాస్తు ప్రసాద్ వచ్చి చూసుకొని అంతా వాస్తు ప్రకారమే ఉందన్నారు. నచ్చిందన్నారు. కొంటామన్నారు. మా ఇల్లు అమ్మించి పెట్టారు. మీ సహాయం మరువలేను" అన్నారు.

"చాలా సంతోషం, రండి కూర్చోండి" అన్నాను ఆనందంతో.

"మీకు వాస్తు తెలుసు. తెలియదని చాలా వినయంగా అంటారు" అన్నారు ప్రభాకరంగారు.

"నాకు నిజంగా వాస్తు తెలియదండి" అన్నాను నిజాయితీగా.

"అమ్మమ్మ! అలా అనకండి. లేకపోతే ఒక్క సలహాతో అంత సులభంగా ఈ సమస్య ఎలా తేలిపోతుంది?"

"అంతా మీ స్పీకర్ల మహత్యం. స్పీకర్లలో అయస్కాంతం ఉంటుంది. అది దిక్సూచిని ప్రభావితం చేస్తుంది. వాస్తు ప్రసాద్ ముందుసారి వచ్చినప్పుడు స్పీకర్లు లేవు. మరోసారి వచ్చినప్పుడు ఉన్నాయి. కాబట్టి మరోలా చూపించింది. అంతే! ముందుసారి ఆయనకి నచ్చిన తీరులో ఉంది. మళ్ళీ అలా చూపించడానికి మీరు స్పీకర్లని తీసేస్తే సరిపోయింది" అన్నాను మేజిక్ రహస్యం విప్పిచెప్పిన మాంత్రికుడిలా.

"అందుకే కిడంబి రఘునాథ్ గారు మీరు అభయ టెక్నాలజిస్ట్ అని అన్నారు. మీరు మమ్మల్ని ఈ ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించారు."

"సంతోషం" అన్నాను.

***

వంద అబద్ధాలు ఆడి అయినా ఒక పెళ్ళి చెయ్యమన్నారు పూర్వం. ఇటువంటి ఆర్థిక ఇబ్బందులలో వంద ఐడియాలు వాడి అయినా గట్టెక్కడం అత్యాధునిక అవసరం.

*

**పలురకాలుగా తెలుగు వారి ప్రవాసాంధ్ర జీవితానికి గురువువంటి శ్రీ కిడంబి రఘునాథ్ గారికి నమస్కరిస్తూ...**

# రుచి

"అడ్డమైన రాజకీయ నాయకుల దొడ్డిదారి రిజర్వేషన్లు నాకు వద్దు. ఈ రైలు కాకపోతే మరొకటి. విమానం, కారు బస్సు, ఆఖరికి లారీ అయినా ఫరవాలేదు. కానీ ఈ దొంగ ఎమర్జెన్సీ కోటా సీటు నాకు వద్దు" మిట్ట మధ్యాహ్నం ఎండలో నిప్పుకణికల్లాంటి ఈ మాటలు విశాఖపట్నం రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ముందు ఉన్నవాళ్ళని కదలనివ్వకుండా నిలబెట్టాయి.

"అది కాదమ్మా..." బహుశా డ్రైవర్ వినయంగా అంటున్నాడు కారు డోర్ దగ్గర నిలబడి.

"మరేం చెప్పకు. ఆ రికమండేషన్ కాగితం చింపెయ్యి"

ఆ మాటలు అంటున్న ఆమెపైనే అందరి కళ్ళు ఉన్నాయి. ఆమెది ఆమె గొంతు కంటే దృఢమైన దేహం. పొడగరి. ధనిక స్త్రీ అని చూసిన వెంటనే అనిపించే ఠీవి. నల్లకళ్ళద్దాలు ఆమె ఒంటి తెల్లదనాన్ని మరింత పెంచుతున్నాయి. చీరకట్టు ఆమె ప్రౌఢత్వాన్ని ప్రతి కోణం నుండి ప్రస్ఫుటంగా ప్రదర్శిస్తున్నది. సాధారణమైన పొందూరు నేతచీర ఆమె వంటిపై కొత్త అందాన్ని పొంది విరగబూసిన కనకాంబరం పొదలా పొందికగా ఉంది. ఆమె చీరకే కాదు, చేరువగా వున్న దేనికైనా తన అందాన్ని ఆపాదించగల శక్తి కలదని అనిపించేట్టుగా వుంది.

"మేడం..." దీనంగా ఓ యువకుని గొంతు. అందరూ ఆ యువకునివైపు చూసారు. నిటారుగా నిలబడితే ఐదు అడుగుల ఆరంగుళాలు ఉంటాడేమో.

కొత్త తెలుగు సినిమా హీరోల కంటే అందగాడుగా అనిపిస్తాడు. సరైన పోషణ లేక నీరసించి వాడిన అరటి చెట్టులా కనిపించాడు. సమాజంలో కనిపించని అవకతవకలకి ప్రతినిధిలా ఉన్నాడు.

"మేడం... మీకు అటువంటివి ఇష్టం లేకపోతే, ఆ కాగితం చించెయ్యకండి. నాకు ఇవ్వండి. ఓ కుటుంబాన్ని నిలబెట్టిన వాళ్ళవుతారు. నాకు రేపు హైదరాబాద్‌లో ఇంటర్వ్యూ ఉంది. అప్పు దొరకక ఇప్పటిదాకా టికెట్టు కొనుక్కోలేకపోయాను. అప్పు దొరికింది కాని రిజర్వేషన్ లేదు. ప్లీజ్..." యువకుడు ప్రాధేయపడ్డాడు.

"ఛీ!... ఛీ!!.. మీలాంటి యువకులే అడ్డదారిన పైకి వెళ్ళిపోదామనుకుంటే ఈ దేశం ఏమైపోతుంది?"

"చేతనైతే సహాయం చెయ్యండి. లేదంటే మీదారిన మీరుపొండి" బుల్లెట్ల లాంటి మాటలు వినిపించాయి. ఆ మాటలన్న జీన్స్‌పేంట్‌లోని అమ్మాయి, ఏమనాలో తెలియని ఒక బట్టతో పైభాగాన్ని కప్పడానికి ప్రయత్నించింది. ఆమె బట్ట కట్టులో ఎవర్నీ ఖాతరు చెయ్యనన్న భావం కూడా ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. అదే తీరులో ఆమె ఆ గుంపు నుండి తన దారిన తాను వెళ్ళిపోయింది.

నిశ్శబ్దం, ఎండ, ఉక్క వాతావరణాన్ని భరించలేని జనం ఏం మాట్లాడాలో తెలియక నిలుచున్నారు. టీవీ సీరియళ్ళతో విసుగెత్తి పోయి ఉత్కంఠతో లైవ్ చూస్తుంటే కరెంట్ పోయినట్లయ్యింది. ఎవరిమట్టుకు వాళ్ళు, ఎవరిదారిన వారు మెల్లిగా కదిలారు. కారు ఎక్కబోతున్న ఆమె, ప్రాధేయపడుతున్న ఆ యువకుడు ఒకరికొకరు ఎదురెదురుగా మౌనంగా నిలబడ్డారు.

"పోన్లెండి మేడం..." ఆ యువకుడు నిరాశ కమ్ముకున్న క్షమాపణ గొంతుతో అని వెళ్ళిపోవడానికి తిరిగాడు.

"ఏ మిష్టర్... నాతో పాటే రా! ఎక్కడ రిజర్వేషన్ దొరికితే అక్కడ ఇప్పిస్తాను. నేనూ ఈ రాత్రే హైదరాబాద్ వెళ్ళాలి!"

"కానీ నా దగ్గర స్లీపర్ క్లాస్ నాన్ ఏసీకి మాత్రమే సరిపోయే డబ్బులున్నాయి."

"ఫరవాలేదు, డబ్బుల సంగతి  నేను చూసుకొంటాను. డ్రైవర్ బస్సు రిజర్వేషన్ చూడు ఇద్దరికి."

"ఓల్వో ఏసి బస్సులు ఖాళీ లేవు మేడం. మామూలు బస్సులో మీరు వెళ్ళలేరు"

"ఏదైనా ఫరవాలేదు. ముందు బస్టాండుకు తీసుకెళ్ళు"

"ప్రైవేట్ వాళ్ళ ఏసీ స్లీపర్ బస్సులో రెండు బెర్తులు గంట ముందు ఖాళీ ఉన్నాయి మేడం. ప్రయత్నిస్తే దొరకవచ్చు. ఏసిలో పడుకొని హాయిగా ప్రయాణం చెయ్యొచ్చు. కానీ రేటు వెయ్యి" అన్నాడా యువకుడు.

"నిజంగా బస్సులో పడుకొని వెళ్లొచ్చా?"

"నిజం మేడం"

"నాతో పాటే కారెక్కు. ఎక్కడ బెర్తులు దొరుకుతాయో అక్కడికి తీసుకెళ్ళు"

"థాంక్స్ మేడం..." అన్నాడా యువకుడు ఏసీ కార్లో ఆమె పక్కన వినయంగా కూర్చొంటూ. ఆమె మొహంలోకి చూశాడు. ఆమె ఏమీ మాట్లాడలేదు. బయట ఎండవేడి నుండి ఒక్కసారి ఏసి చల్లదనంలోకి రావడం వల్ల కలిగిన తాత్కాలిక అసౌకర్యాన్ని తట్టుకొంటూ నల్ల కళ్లజోడు తీసి చూసింది. ఆ యువకుడు కొద్దిగా కుంచించుకొని కూర్చున్నాడు.

"నేను రమ్మన్నాను కాబట్టి థేంక్స్ అంటున్నావు. లేకపోతే ఆ అమ్మాయిలాగే నన్ను తిట్టుకొనేవాడివేగా?"

"లేదు మేడం..."

"పోనీ ఇప్పుడు నేను ఇక్కడ దింపేస్తే..." అంది కొంటెగా.

"అయినా సరే..."

"ఏం ఎందుకు తిట్టుకోవు? సహాయం చేస్తానని చెయ్యకుండా ఎండలో నడిరోడ్డు మీద దింపి పొమ్మంటే..."

"ఎందుకంటే..."

"ఎందుకంటే?"

"అందకపోయినా...అవసరం తీర్చకపోయినా...అందమైన చందమామపై ఎందుకు కోపం రాదో..."

"అబ్బో కవిత్వమా?"

"అలా అనిపించినా, ఇది నిజం మేడం"

"నేను నీకు చందమామలా కనిపిస్తున్నానా?"

ఆమె సీటులోంచి కదిలి అతని వైపు చూసింది తీక్షణంగా. ఆ యువకుడు బిత్తరపోయి దూరంగా జరుగుతున్నాడు.

"పది నిమిషాల క్రితం కలిసావు..."

"మిమ్మల్ని చూసిన మొదటి నిమిషంలోనే మీరంటే... మీరంటే..."

ఆమె ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసి చూసింది. ఇద్దరు నిశ్శబ్దంగా ఉండిపోయారు. కారు ప్రైవేట్ బస్సు రిజర్వేషన్ ఆఫీసుకు చేరుకుంది. డ్రైవర్ కారు ఆపి డబ్బులు అడిగాడు.

"రెండు బెర్తులు తీసుకో" అని ఆమె డబ్బులు ఇచ్చింది. "నువ్వు కూడా వెళ్ళి టిక్కెట్లు ఎక్కడ తీసుకోవాలో అతనికి చూపించు" అంది ఆ యువకుణ్ణి ఉద్దేశించి. పది నిముషాలలో టిక్కెట్లతో ఇద్దరూ వచ్చారు.

"మేడం, సాయంత్రం బస్సు ఆరున్నరకి బయలుదేరుతుంది. మీరు ఆరుంపావుకే బివికె కాలేజీ దగ్గరకు రండి. రాత్రి బస్సులో తినడానికి మీకు, నాకు సరిపడేంత భోజనం తీసుకొస్తా."

"వద్దు, నేను..."

"అలా అనకండి. మీరు చేస్తున్న సహాయానికి కనీసం...."

"మీ ఆవిడో, మీ అమ్మగారో వండినవి తెస్తావు. అంతేనా?"

"నాకు పెళ్ళి కాలేదు మేడం. మా అమ్మకి అనారోగ్యం. వండలేదు మేడం నేను వండుతా."

"అలాగా... అయ్యో... సారీ"

***

ప్రైవేటు స్లీపర్ బస్ అరగంట లేటుగా బయలుదేరింది. బస్సులోని బెర్తులు రైలు బోగీలోని బెర్తుల మాదిరి అమరి ఉన్నాయి. ప్రతి నాలుగు బెర్తులకు ఒక గదిలాంటి ఏర్పాటు ఉంది. పైన రెండు, కింద రెండు బెర్తులు చిన్నవిగా, పొందిగ్గా, చక్కగా ఒక్క మనిషి పట్టేటట్లు ముచ్చటగా ఉన్నాయి. పడుకొని సినిమా చూసుకొనేందుకు ప్రతి బెర్తుకు ఒక చిన్న స్క్రీన్ కూడా ఉంది. అతడు, ఆమె తమ తమ బెర్తులపై చేరారు. రెండు ప్రక్క ప్రక్కనే ఉన్న కింద బెర్తులు.

అతను చెప్పినట్లే, ఒక సంచిలో ఆ రాత్రి వాళ్ళిద్దరూ తినడానికి కావలసిన భోజన పదార్థాలను తెచ్చాడు. వాటి ఘుమఘుమలు రుచి చూడకముందే వాటి కమ్మదనాన్ని సూచించాయి. ఇంకా ఎవ్వరూ బస్సు ఎక్కలేదు.

"చాలా థేంక్స్ మేడం. ఈమారు ఈ ఇంటర్వ్యూలో నాకు ఉద్యోగం ఎలాగైనా రావాలి మేడం. దానికి మీ సహాయం...."

"ఇందాక మీరంటే... మీరంటే.. అని ఆపేశావు. నేనంటే ఏమిటి?" అని అడిగింది సూటిగా.

"ఎప్పుడు మేడం?"

"ఉదయం"

"చందమామ..."

"కాదు చందమామ విషయం తరవాత. కారు దిగక ముందు మీరంటే.. అని ఆగిపోయావు"

"........"

"నేనంటే ఏమిటి?"

"ఆరాధన. మిమ్మల్ని చూసిన మొదటి క్షణంలోనే కలిగిన ఆరాధన"

"అబ్బా... అంతగా అనిపించిందా? నా వయస్సెంతో తెలుసా! నలభై ఎనిమిది. నీ వయస్సెంత?"

"ఇరవై... ఇరవై నాలుగు" గొణుగుతున్నట్లు అన్నాడు.

"నాకు నీ వయస్సు కొడుకున్నాడు తెలుసా?"

"............."

"ఇప్పుడు ఆరాధన పోయిందా?"

"లేదు మేడం" ఆమె కళ్ళల్లోకి సూటిగా చూస్తూ దృఢంగా అన్నాడు. ఆమె ఆ చూపుకి ఆశ్చర్యచకితురాలైంది.

"ఎంత ధైర్యం?"

"............"

"కాలేజీ రోజుల్లో ఏ మగవాడు నా ఎదురుపడి మాట్లాడలేకపోయేవాడు"

"అది నాలో కలిగిన భావం మేడం. అది మీ వయస్సు, అంతస్తు లాంటి విషయాలకి సంబంధించింది కాదు."

"నేను చిరిగిన చీరతో రోడ్డుపక్కన బిచ్చమెత్తుకుంటున్నా అలాంటి భావం కలుగుతుందా?" వెటకారంగా అంటూ నవ్వింది.

"మాసిపోయిన బట్టలో కట్టినా వజ్రాన్ని వజ్రం అనే అంటాం కదా..."

"సాహిత్యం చదివావా?"

"ఏదో కొద్దిగా మేడం"

"చూడు, నాకు సాహిత్యం ఏ మాత్రం తెలీదు. కానీ నీ ధైర్యం చూస్తే ఆశ్చర్యంగా ఉంది."

"............"

"ఏదో కొంచెం అందంగా కనిపించి, ఆరోగ్యంగా ఉండి, మంచి బట్ట కట్టుకొని, ఏసి కార్లలో తిరుగుతూ ఉంటే కలిగిన ఆకర్షణని ఆరాధన అని పెద్ద పెద్ద మాటలతో ముడిపెట్టెయ్యడమేనా? ఆలోచన ఉండాలయ్యా."

"ఆలోచించి చేసేది వ్యాపారం మేడం"

"ఆహా…"

"సముద్రం మీద సూర్యకాంతి చేసే నృత్యంలో తళుక్కుమనే కాంతిపుంజంలా, పసిపిల్లల గొంతు నుండి ప్రవహించే కేరింతలా, దానంతట అది చెప్పాపెట్టకుండా అడ్డూ ఆపూ లేకుండా రాలే మొదటి వర్షపు చినుకులా కలిగే భావనే మేడం, ఆరాధన అంటే. అది ఈ సామాజిక కట్టుబాట్లకి కాని, కొలబద్దలకి కాని అతీతం. అన్నిటినీ మరిపించే భావనే ఆరాధన"

"ఇంత చక్కని కవిత్వం నేనెప్పుడూ వినలేదు, చదవలేదు. స్టేజ్‌లు ఎక్కి ఏవైనా సన్మానాలు గట్రా చేయించుకొన్నావా?"

"లేదు మేడం"

"ఆంధ్రాలో తెలుగు చచ్చిపోతున్నదని బాధపడే మా ఎన్నారైలందరి చేత నీకు సన్మానం చేయిస్తాను"

"ఇది అంత గొప్ప కవిత్వం కాదు మేడం, ఏదో మామూలుదే"

"మరి గొప్ప కవిత్వం అంటే ఎలా ఉంటుంది?"

"మనసులో కలిగిన ఓ గాఢమైన భావాన్ని సులభంగా, వేగంగా, ఎదుటివారి మనసులో కూడా కలిగించగలిగేది గొప్ప కవిత్వం"

"వావ్! ఎంత సింపుల్‌గా చెప్పావు!"

"వయసు, జాతి, కుల, మత, ప్రాంతాలకి అతీతంగా దేనినైతే చూడగానే మిమ్మల్ని మీరు మరిచిపోయి, పరిసరాలను పట్టించుకోకుండా, కాలాన్ని గమనించకుండా, కదలకుండా ఉండిపోతారో, ఆ క్షణంలో మనిషి అనుభవించేదే ఆరాధనా భావం. ఇవాళ ఉదయం మిమ్మల్ని చూసినప్పుడు నాకు అటువంటి

ఆరాధనే కలిగింది మేడం. దానికి మీ వయసు, హోదా కాదు, మీ వ్యక్తిత్వం మేడం."

"ఆహా..." అంటూ ఆలోచనలోకి జారిపోయింది.

బస్సు వేగంగా హైదరాబాదు వైపు పరుగెడుతోంది. చుట్టూ చీకటి. అక్కడక్కడ పల్లెల్లో చిన్న చిన్న దీపాలు. మధ్యమధ్యలో బస్సు హారన్ వినిపిస్తోంది. ఇద్దరి మధ్య నిశ్శబ్దం. తన జీవితం మొత్తాన్ని కొత్తగా విన్న విషయాలతో కళ్ళు మూసుకొని పరిశీలిస్తోంది.

అమెరికాలో ఉన్న ఆమె భర్త, పిల్లలు, ఉద్యోగం, ఇండియాలో ఆమె చేస్తున్న గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు ఏవీ గుర్తుకురావడం లేదు. తనను తాను మరిచిన క్షణాలు తన జీవితంలో ఎప్పుడు, ఎక్కడ, ఎలా సంభవించాయన్న ఆలోచనలో మునిగిపోయింది.

మూడో క్లాసులో ఎక్కాలు బట్టీ పట్టకుండా కూడికలతో ఎంతవరకైనా వేసెయ్యవచ్చని తనకి తాను తెలుసుకొని ముప్పైరెండో ఎక్కం దాకా వేసిన సంఘటన గుర్తువచ్చింది. ప్రకృతిలో పువ్వుల రెక్కల అమరిక ఒక లెక్క ప్రకారం జరుగుతుందన్న ఊహ వచ్చినప్పటి నుండి పువ్వులన్నింటిలో తనకి అంకెలే నృత్యం చేస్తున్న భావన కలిగిన క్షణం గుర్తొచ్చింది. వయసులో ఉన్న తనకి ఆ పువ్వుల అందం కాదు, వాసన కాదు, ఆకర్షణ కాదు, రెక్కల అమరిక లెక్కే మైమరిపించేది. ఆ రోజులు గుర్తుకొచ్చాయి. ఆలోచనలు అలా సాగుతున్నాయి.

"మేడం... భోజనం చేద్దాం" ఆమె ఆలోచనా ప్రవాహానికి అడ్డుపడింది.

అతడు చిన్న చిన్న డబ్బాలలో చక్కగా అమర్చి తెచ్చినవన్ని పూర్తిగా తిన్నది.

"రుచి అద్భుతం! నువ్వు చేసిన వంటంటే నమ్మలేకపోతున్నాను"

"నిజం మేడం. నేను హోమ్ సైన్సులో డిగ్రీ చేసాను. వంటలు చెయ్యడం నేర్చుకొన్నాను. చేస్తున్నాను. కాని ఈ రుచి ఎప్పుడూ రాలేదు" అని వినయంగా ఓ విద్యార్థి ఉపాధ్యాయిని ప్రశంసకి బదులు పలికినట్లు చెప్పాడు.

"ఎందుకింత రుచి వచ్చిందంటావ్?"

"పాళ్ళు సరిగ్గా కుదిరుంటాయనుకుంటాను మేడం"

"అంత సరిగ్గా ఇవాళే ఎందుకు కుదిరాయంటావ్"

లెక్కల మీద ఆమెకున్న అభిమానంతో ప్రతిదీ ఒక లెక్కకి కాని, తర్కానికి కాని కట్టుబడి ఉండాలన్నది ఆమె విశ్వాసం. అదే ఇక్కడ కూడా అనుసరిస్తూ పదే పదే ప్రశ్నిస్తోంది అతన్ని.

"ఇవాళ వండడానికి, అంతకుముందు వండడానికి భేదం ఏమిటి?"

"ఏమో తెలీడం లేదు మేడం"

"వంటంతా ఎలా చేశావో గుర్తు తెచ్చుకో"

"..........."

"అదేమిటి ఇవాళ ఎలా వండావో గుర్తు రావడం లేదా? కాని ఇంతకుముందు ఎలా వండావో గుర్తుందా?"

"అవును మేడం"

"మరి వండుతున్నప్పుడు ఏమాలోచించావ్?"

"మీ గురించే మేడం"

"నా గురించా? నా గురించి ఏమాలోచించావ్?"

"మీకు రుచిగా చేసి పెట్టాలని. అంతే"

నిజాయితీగా, నిర్వికారంగా, నిశ్చలంగా అతడు ఇచ్చిన సమాధానం విని ఆమె చలించిపోయింది. ఆమెకి శరీరం అంతా ఒక్కసారిగా విద్యుత్ పాకినట్లయింది. ఆ ప్రకంపనల ప్రవాహం ఆమెలోని మనిషినే కాక ఆమె ఆడతనాన్ని కూడా పలకరించినట్లనిపించింది. పులకరింత కలిగింది. పరవశం అన్న పదం ఒక్కసారి మెదడులో మెరిసి మాయమయ్యింది.

'ఎవరీ కుర్రాడు? ఏవిటి ఇతని ప్రభావం? ఎందుకిలా ఇంత వేగంతో చేరువైపోతున్నాడు? నాకు తెలీకుండా నన్నెక్కడికి తీసుకెళ్ళిపోతున్నాడు? పరిచయం అయ్యి పట్టుమని పది గంటలు కాలేదు, నా జీవితాన్ని నాచేతే శోధింపజేస్తున్నాడు. అన్నీ మరిపించి అతని మాటలే ఈ ప్రపంచం అంతా నిండినట్లు అనిపించేలా చేస్తున్నాడు. ఇతని మాటల వలన ఎంత చైతన్యం! ఎందుకిలా జరుగుతోంది?' పున్నమి చంద్రుడు కిటికీలోంచి వెన్నెల ఒలక పోస్తున్నాడు. ఆమె నిశ్చలంగా చంద్రుణ్ణి చూస్తోంది. కళ్ళతో వెన్నెల తాగుతున్నట్లు రెప్పార్పకుండా చూస్తోంది.

"మేడం... మేడం... ఎందుకలా ఉన్నారు?" ఆమెని అడిగాడు.

"ఒంట్లో వెన్నెల ప్రవహిస్తూ ఉంటే ఇంకెలా ఉంటాను?" అతనివైపు తిరిగి ప్రశాంతమైన చూపుతో తేనెలాంటి పలుకుతో అప్యాయంగా అతని చేతిని తాకుతూ అంది ఆమె.

"అర్థం అయ్యింది మేడం, మీరు కూడా కవిత్వం చెప్పగలరు" అతని మొహం వెన్నెలలో మెరిసింది.

"నేను కవిత్వం చెప్పడమేమిటి?" మెలుకువ వచ్చిన దానిలా తుళ్ళిపడి అంది.

"ఒంట్లో వెన్నెల ప్రవహిస్తుంటే అన్న మూడు మాటలతో మీ స్థితి మొత్తం నాకు తెలిసేలా చెప్పారు. నా దృష్టిలో కవిత్వం చెప్పడమంటే ఇదే మేడం"

"ఇదంతా నీ చలవే! చాలా పొద్దు పోయింది. ఇక పడుకో, రేపు నీకు ఇంటర్వ్యూ ఉంది."

***

మర్నాడు ఉదయం బస్సు దిగిన తరువాత ఆమె ఎడ్రసు ఇచ్చి అతనిని ఇంటర్వ్యూ అవగానే ఇంటికి రమ్మంది. అతను మధ్యాహ్నామే ఇంటికి వచ్చాడు. ఆమె మంచి నీళ్ళు అందించింది.

"ఎండలో వచ్చావు. మొహం కందిపోయింది. కాస్సేపు విశ్రాంతి తీసుకో" అని గెస్టురూమ్ చూపించింది.

"ఇది విశ్రాంతితో పోయే అలసట కాదు మేడం. ఆ ఉద్యోగం నాకు రాలేదు. వాళ్ళకి వెజిటేరియన్ వండేవాళ్ళు అక్కర్లేదట" రాసిపోసిన నిరాశ నుండి ఒక్కొక్క అక్షరం బయిటికి వచ్చినట్లుంది.

"సరే ముందు మొహం కడుక్కొని రా, కాఫీ ఇస్తాను" అని ఆమె వంటింట్లోకి వెళ్ళింది.

"వెళ్ళొస్తాను మేడం" అన్నాడు కాఫీ తాగిన తరువాత.

"ఎక్కడికి వెళతావు?"

"హైదరాబాదులో తెలిసిన స్నేహితుల దగ్గర కొన్ని రోజులు ఉండి ఏదో ఒక చిన్న ఉద్యోగం సంపాదించుకోవాలి మేడం. వంటవచ్చు కదా అని, స్టార్ హొటళ్ల వెంట రెండేళ్లుగా తిరుగుతున్నాను. ఇక తిరిగే ఓపిక, ఉద్యోగం దొరక్కపోతే బతికే అవకాశం లేదు"

"అయ్యో అలాగ....సాయంత్రం కొందరు మిత్రుల్ని గ్రాండ్ కాకతీయలో డిన్నర్‌కి పిలిచాను. నువ్వు కూడా నాతో పాటు రా. వాళ్ళకి నిన్ను పరిచయం చేస్తాను. అందులో ఎవరో ఒకరు నీకు ఏదో ఒక ఉద్యోగం ఇవ్వగలరేమో చూద్దాం. నేను గట్టిగా రికమెండ్ చేస్తానులే"

"మీకు రిజర్వేషన్‌లు, రికమండేషన్‌లు నచ్చవేమో మేడం"

"సరే, ఒక బ్రతుకు నిలపడానికి నేను ఏదైనా చెయ్యడానికి సిద్ధం. రెస్టు తీసుకో, సాయంత్రం ఏడుగంటలకి గ్రాండ్ కాకతీయలో డిన్నర్‌కి వెళదాం"

"నా బయోడేటా ఇస్తాను మేడం. మీరు వాళ్ళకి ఇవ్వండి. నేను రేపు మళ్ళీ మీకు ఫోన్ చేస్తాను. ఎవరినైనా వెళ్లి కలవమంటే కలుస్తాను"

"డిన్నర్‌కి రా, అందరికీ పరిచయం చేస్తాను."

"వద్దు మేడం, నిన్న బస్సు టిక్కెట్‌కి ఒక వెయ్యి, మళ్ళీ ఇవాళ డిన్నరుకు కూడా చాలా అవుతుంది. అసలే అది చాలా పెద్ద రెస్టారెంటు. చాలా ఖరీదు."

"సర్లే..." అని అతని మాట కొట్టిపడేసి "నువ్వు సంపాదించిన తరువాత తిరిగి ఇచ్చేద్దువుగానిలే, రెస్టు తీసుకో"

"సరే మేడం" అని గెస్టురూమ్‌లోకి వెళ్ళిపోయాడు.

***

ఖాళీ కాఫీ కప్ కిచెన్‌లో పెడుతూ కిచెన్ అంతా పరిశీలనగా చూసింది. అది ఆమె స్నేహితుల ఇల్లు. వాళ్ళు కూడా ఆమెలాగా అమెరికాలో ఉంటారు. ఖరీదైన ఇల్లు కట్టించుకొని, అన్నీ అమర్చుకొని అప్పుడప్పుడు వచ్చి పోతుంటారు. కిచెన్ అన్ని పరికరాలతో సహా సిద్ధంగా ఉంది. ఉన్నట్టుండి ఆమెకో ఆలోచన వచ్చింది. వెంటనే పరుగు పరుగున గెస్టురూమ్‌కి వెళ్లింది. తలుపు కొట్టి అతన్ని పిలిచింది.

"ఇవాళ పదిమందిని భోజనానికి పిలిచాను. వాళ్ళు ఈ ఊళ్ళోవాళ్ళే. అన్ని రెస్టారెంట్లలో ఇప్పటికే ఎన్నోసార్లు తినే ఉంటారు. కాబట్టి వాళ్లని ఎక్కడికి తీసుకువెళ్లినా కొత్త, వింత, ఏమీ ఉండదు. నిన్న నువ్వు చేసినట్లు మళ్లీ వంట చెయ్యగలవా?" అంది సూటిగా.

"మీరు చెప్తే చేస్తాను. మీరు అనుకొన్నంత బాగా రాకపోతే?"

"ఎందుకు రాదు నిన్న ఎలా చేసావో అలాగే చెయ్యి"

"నిన్న మీ కోసం మాత్రమే చేసాను మేడం"

"సరే అన్నీ మర్చిపోయి మళ్లీ ఇవాళ కూడా నా కోసమే అనుకొని చేయి"

"బాగా రాకపోతే..." గొణిగాడు.

"నేను ముందు రుచి చూస్తాను. బావుంటే సరి. లేకుంటే గ్రాండ్ కాకతీయలో రిజర్వేషన్ ఎలాగు ఉందిగా?"

ఆమె సహాయంతో రెండు గంటల్లో వంట పూర్తి చేసాడు.

"అద్భుతం" అంది ఆమె రుచి చూసి.

"ఇవాళ కూడా నా ఆలోచనంతా మీకు రుచిగా చెయ్యాలనే మేడం"

"ఇది నిజంగా వింతగానే ఉంది. ఓ గంట రెస్టు తీసుకొని తయారయిరా, డిన్నరుకి"

***

వంటరుచిని అందరూ మెచ్చుకొన్నారు. ఆమె అతడిని పరిచయం చేసింది. అందరూ అతన్ని అభినందించారు. ఉద్యోగం గురించి చెప్పింది. మాలో ఎవరికి రెస్టారెంట్లు లేవని, ప్రయత్నిస్తామని, చూద్దామని రకరకాలుగా చెప్పారు.

ఆమెకి చాలా నిరుత్సాహం కలిగింది. అతన్ని కూడా అక్కడే పడుకోమంది. అతనికి జీవనోపాధి ఎలా కలిగించాలా అని ఆ రాత్రి చాలాసేపు ఆలోచించింది. అతన్నే వండమని, మర్నాడు మరో పదిమందిని భోజనానికి పిలిచింది. అతనికి వంటలో సహాయం చేస్తూ గడిపింది. అతనితో కవిత్వం గురించి మాట్లాడటం ఆమెకి ఆనందం కలిగించింది. ఒక వారం రోజులపాటు అతన్ని తనతో ఉండమంది. రోజూ అతని చేత కొత్త కొత్త వంటకాలు చేయించింది. స్నేహితులని పిలిచి విందులు ఇచ్చింది. తిన్నవాళ్ళందరూ మెచ్చుకున్నారు. అతనికి ఏదైనా ఒక ఉద్యోగం ఇవ్వమని అడిగింది.

ప్రతిరోజూ ఏదో ఒకలా ఇద్దరి మాటలు కవిత్వం వైపు మళ్ళేవి. అతను చిన్న చిన్న పదాలతో మామూలు మనుషులు మాట్లాడే భాషలో తనకు తెలిసిన రీతిలో కవిత్వాన్ని ఆమెకు వివరించేవాడు. ఆమె అప్పుడే మాటలు నేర్చుకొంటున్న పిల్లలా తనకు తోచిన పదాలు పేరుస్తూ ఇది కవిత్వం అవుతుందా అని ఆశగా అడుగుతుండేది. ఆమె చెప్పాలనుకున్న భావాన్ని మరింత చిక్కగా, చక్కగా ఒకటి రెండు పదాల మార్పులతో సరిదిద్ది ఇలా అంటే ఎలా ఉంటుందో చూడండి అనేవాడు. ఆమె తిరిగి అతను చెప్పిన దానిని కవిత్వం చదివినట్లు చదివి విని ఆనందిస్తుండేది. ఏదైనా ఒక భావం కలగగానే చప్పున గుర్తొచ్చే రంగుని ఆ భావానికి కలిపి చెప్పమన్నాడొకసారి.

కలిసినప్పుడు మనసు తళుక్ మన్న క్షణం 'పసుపు' అన్నది ఆమె.

తెలిసినప్పుడు చూపు అనువదించిన కన్ను 'ఆకుపచ్చ' అన్నాడు అతను.

నిలవలేక నిలిచి కదలలేక కదిలిన కాలం 'నీలం' అన్నది ఆమె.

ఎదురుచూపు కెదురొచ్చి కలిసిన కళ్ళు 'ఎరుపు' అన్నాడు అతను.

తేలిపోతున్న ఆకాశంలో తెరలుగా వచ్చే తలపు 'తెలుపు' అన్నది ఆమె.

నేలమీద దిగిన విహంగం విహరించేదంతా 'కలనేత' అన్నాడు అతను.

***

రోజులు గడిచాయి కాని ఉద్యోగం ఇవ్వడానికి ఏ ఒక్కరూ ముందుకు రాలేదు. కుర్రాడు తెలివైనవాడే, చదువుకున్నవాడే, కానీ వంటవాడు. వంటవాడికి మా దగ్గర ఉద్యోగం లేదు. ఇంత టాలెంట్ ఉన్నతనికి ఏదో ఒక చిన్న ఉద్యోగం ఇచ్చి చిన్నబుచ్చలేం అని సమాధానాలు చెప్పారు.

'ప్రయత్నించాను కానీ, ఫలితం లేకపోయింది' అని పెదిమ విరిచి చెప్పలేకపోయింది. తన ధైర్యం, ఆదర్శ భావాలు, చొరవ, నలుగురికి సహాయపడే గుణం, వాటిని పొగిడిన వాళ్ళు గుర్తుకొచ్చారు. వారి పొగడ్తలు ఈ నిస్సహాయ స్థితిలో చాలా ఇబ్బంది కలిగించాయి. తను కనీసం ఒక్కరికైనా, అదీ ప్రతిభ ఉన్నవాడికి జీవనోపాధి ఏర్పాటు చెయ్యలేకపోయానన్న విషయం ముందు ఆశ్చర్యాన్ని కలిగించింది. రాత్రి చాలాసేపు నిద్ర రాలేదు. చివరికి ఆమె ఒక నిర్ణయానికి వచ్చింది.

***

ఉదయం కాఫీ తాగుతూ అతనికి తన నిర్ణయం చెప్పింది. దాని సారాంశమేమిటంటే, ఆమె హైదరాబాదులో ఒక రెస్టారెంట్ తెరుస్తుంది. అతడు మనసు పెట్టి రోజూ వంట చెయ్యాలి. ఆదాయాన్ని ఇద్దరూ సమానంగా పంచుకోవాలి. ఆ ప్రతిపాదనకి అతడు చాలా ఆనందించాడు.

"మేడం... మిమ్మల్ని తల్చుకునే రోజూ వంట చేస్తాను. ఈ ఉద్యోగం ఇప్పించండి. నాన్న చేసిన అప్పుల భారంతో, అమ్మ అనారోగ్యంతో కృంగిపోతున్న మా కుటుంబాన్ని నిలబెట్టిన వాళ్ళవుతారు"

"నీకిస్తున్నది ఉద్యోగం కాదు నేస్తం. నీకు తెలియని నీ వంటలోని 'రుచి' మనల్ని కలిపింది. నాకు తెలియని నాలోని 'కవిత్వం' నీ వల్ల వెల్లువై నన్ను ఆపాదమస్తకం తడిపేసింది. ఇది మన సాన్నిహిత్యానికి ప్రతీకగా ఏర్పాటుచేస్తున్న ఒక సంస్థలో భాగస్వామ్యం"

***

'రుచి' రెస్టారెంట్‌లో అతడు రోజూ వెయ్యిమందికి సరిపడే వంటకాలన్ని వండి వడ్డిస్తాడు. వంద మందికి జీవనోపాధి కలగజేస్తున్నాడు. రోజుకో లక్షరూపాయల ఆదాయంతో అత్యంత రుచితో, వైభవంతో ఆ రెస్టారెంట్ నడుస్తున్నది. ప్రతి రోజూ ప్రతి వంటకానికి అదే రుచిని ఎలా కలుగ చేస్తారు అని ఎవరైనా అడిగితే –

"ప్రతిరోజూ ప్రతి వంటకమూ ఆమె కోసమే చేస్తున్నాను కాబట్టి" అంటాడు అతను!

*

**కథకి ప్రేరణ మరెన్నో ఆలోచనలకు**

**గురువువైనటువంటి శ్రీమతి యమున పాఠక్‌కి**

**నమస్కరిస్తూ...**

# సంకల్పం

**'ఇ**ప్పుడు కాకపోతే, మరెప్పుడు? మనం కాకపోతే మరెవ్వరు?'

అమెరికా దేశంలో, మిషిగన్ రాష్ట్రంలో, గేంజస్ అన్న ఊరులో ఉన్న వివేకానంద మొనాస్టరీ ఆవరణలో ఆగస్టు నెల ఆఖరు వారం కలిసిన వంద మంది భారతీయులను రెండు రోజులుగా ఆలోచింపజేస్తున్న ప్రశ్నలవి.

బ్రిటిష్ పాలన నుండి రాజకీయ స్వాతంత్ర్యం సంపాదించుకొని 50 ఏళ్ళు పైబడ్డా, ఎన్నో రకాలుగా వెనకబడి, సుమారు సగానికి సగం జనం నిరక్షరాస్యతతో, కులాల కుమ్ములాటలతో; అధికార దాహంతో, ప్రజాసేవ పేరుతో పదవులెక్కుతున్న రాజకీయ నాయకులతో; దిక్కుతోచని నిస్పృహతో మాతృదేశం కుళ్ళిపోతుంటే సమాజానికి ఉత్తేజం కలిగించే ఉద్యమం కావాలి. అది ఇప్పుడు కాకపోతే మరెప్పుడు?

ఆ దేశంలో పుట్టి, ఆ దేశంలో పెరిగి, ఆ దేశంలోని ఉన్నత విద్యా సౌకర్యాలని పూర్తిగా ఉపయోగించుకొని, పట్టాలు పుచ్చుకుని, విదేశం వచ్చి వివిధ రంగాలలో నిలదొక్కుకొని, కొద్దో గొప్పో పేరు సంపాదించుకొని, ఆ దేశానికి కావలసినది చెయ్యగల స్థితిలో ఉన్న మనం కాకపోతే మరెవ్వరు?

'ఎన్నో వనరులతో, శతాబ్దాలుగా స్వశక్తిపై ఆధారపడి, స్వంత బుద్ధితో, విద్య, వ్యవసాయ వ్యాపార రంగాలలో ముఖ్యమైన దేశంగా నిలబడ్డ భారతదేశం ఈనాడు ఇంత వెనకబడ్డ దేశంగా ఉండనవసరం లేదు. బాధ్యతాయుతమైన భారతీయులుగా దేశం బాగుకై మీ మీ పరిధులలో, మీ మీ శక్తి కొద్దీ, మీరు

చెయ్యగలిగినది చెయ్యండి' అన్న డాక్టర్ భాగవతుల పరమేశ్వర రావు గారి పిలుపునందుకొని సమావేశమైన వాళ్ళ సామూహిక ఆలోచనల సారమిది.

'ఆషా', 'ఎఐడి', 'ఐఎల్‌పి' వంటి సంస్థల సభ్యులు, అమెరికా దేశంలో వివిధ రాష్ట్రాలలో డాక్టర్ పరమేశ్వరరావు గారి సభలకి వచ్చిన ప్రతిభావంతులతో ఆ ప్రదేశం నిండిపోయింది. దేశం బాగుకోసం అంతమంది కలవడం నాకు చాలా ఆనందం కలిగించింది. ఎవరి మొహంలో చూసినా ఉత్సాహం పెల్లుబుకుతున్నది. అందరికీ అందరూ సుమారుగా కొత్తవారే. ఒకరిని ఒకరు పలకరించుకొంటూ, పరిచయాలు పెంచుకుంటున్నారు. చాలా మంది వయస్సులో చిన్నవారే, కానీ అందరూ పెద్ద పెద్ద చదువులు చదివిన వారే. గుంపులు గుంపులుగా, పచ్చిక మీద కూర్చొని, చెట్ల క్రింద నిలబడి రకరకాల విషయాలను తీవ్రంగా చర్చించుకుంటున్నారు. సరిగ్గా అటువంటి సమయంలో నా దృష్టి ఒంటరిగా, అందరికి దూరంగా ఉన్న ఒకతని మీద పడింది. అతన్ని నిన్న మధ్యాహ్నం భోజనాల దగ్గర కలిసాను. 'పేట్' అని పరిచయం చేసుకున్నాడు. అతని పూర్తి పేరు వాయువేగుల పతంజలిట. విష్ణుభొట్ల రామన్నగారితో కలిసి వచ్చాడుట. మద్రాసు ఐఐటిలో ఇంజనీరింగ్, తరువాత స్టేన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో పిహెచ్‌డి, గత ఏడాదిగా న్యూయార్క్‌లో ఉద్యోగం చేస్తున్నాడట. అమెరికా వచ్చి ఐదేళ్ళే అయిందిట. ఎక్కువ మందితో పరిచయం ఉన్నట్లు లేదు. అందుకే ఒంటరిగా ఉన్నాడని దగ్గరికి వెళ్ళి పలకరించాను.

"ఏమిటి ఇలా ఒక్కరే ఉన్నారు" అన్నాను.

"మా గ్రూపు వాళ్ళు లిటరసీ పెంచడంపై డిస్కస్ చేస్తున్నారు. కానీ వాళ్ళ ఆలోచన ప్రకారం లిటరసీ పెంచడం జరగని పని అని నా ఉద్దేశ్యం" అన్నాడు.

"మరి మీ ఆలోచన ఏమిటి?" అన్నాను.

"లిటరసీ పెంచాలి. ప్రస్తుతం ఉన్న 52.11 శాతంతో భారత దేశం అభివృద్ధి సాధించడం జరగని పని. చిన్న చిన్న హెల్పుల వల్ల యూజ్ అట్టే ఉండదు. పెద్దఎత్తున లిటరసీ టేకప్ చెయ్యాలి" అన్నాడు.

“పెద్దఎత్తున అంటే” అన్నాను వివరంగా చెప్పమన్న భావంతో.

“లక్ష డాలర్లు సంపాదించి, ఇండియా వెళ్ళి అక్కడ ఉన్న ఒక ఆర్గనైజేషన్‌తో కలిసి కాని, లేదా ఒక ఆర్గనైజేషన్ పెట్టి, వందల కొద్ది వలంటీర్స్‌ని పెట్టి, వేలకొద్ది ఇల్లిటరేట్సుని లిటరేట్సుగా చెయ్యాలని ఉంది నాకు” అన్నాడు ఆవేశంగా.

“అది మంచి ఉద్దేశ్యమే కానీ, ఇటువంటి విషయాలలో అంటే సంఘసేవలో డబ్బు కోసమో, ఎదుటివారి సాయం కోసమో ఎదురు చూడడం అనవసరం. పైగా ఆ డబ్బు కాని, మనుషులుకాని సమకూరేసరికి పనిచెయ్యడానికి కావలసిన అనుభవం రావాలంటే ఊహ తోచిన నాటినుండి ఎంతలో వీలయితే అంతలో, పనిచేయడం మొదలుపెట్టాలి”

“కానీ రిజల్ట్సు?” అన్నాడు ప్రయోజనం ఉండదన్న భావంతో.

ఈ ప్రశ్నకు సమాధానం ఎలా చెప్పాలని ఆలోచిస్తూ ఉంటే, సమాధానం నా చేతిలోనే ఉందని తోచింది. వెంటనే “మీరు తెలుగు చదువుతారా?” అని అడిగాను

“ఘూర్”

“అయితే నా స్వంత అనుభవాన్ని ఒక కథ రూపంలో రాసాను. ఈ కథ చదవండి. మీ ఆలోచన మారుతుందేమో” అని నేను రాసిన కథ కాపీ అతనికి ఇచ్చాను.

ఇంతలో డాక్టర్ రాణి చింతంగారు రమ్మంటున్నారని నాకు కబురు వచ్చింది. ఆమె ఇక్కడికి వచ్చిన వారందరికి కాఫీ, టీ, భోజనాలన్నింటిని అందించే బాధ్యత తీసుకున్నారు. ఆమెకు సహాయం అందించడానికి నాలాంటి వారు కొద్దిమంది వాలంటీర్లు ఉన్నారు. ఏదో పనుందని పిలిచి ఉంటారు.

“ఒక అరగంట తరవాత వచ్చి కలుస్తాను” అన్నాను.

“చాలా థాంక్సండి ఇప్పుడే చదువుతాను” అని అతను అక్కడే కూర్చొని చదవడం మొదలుపెట్టాడు.

***

**గురుదక్షిణ**

1998 జనవరి మొదటి వారంలో భువనేశ్వర్ వెళ్ళాం నేను, నా భార్య చిత్ర. చిన్నప్పుడు నాతో కలిసి చదువుకుని, పాతికేళ్ళుగా అక్కడ ఉద్యోగం చేస్తున్న కిషోర్, అతని భార్య కమల ఉదయాన్నే రైల్వేస్టేషన్‌కు వచ్చి మమ్మల్ని ఆదరంగా వాళ్లింటికి తీసుకువెళ్లారు.

"కిషోర్, ఈమారు కోణార్క తప్పకుండా వెళ్ళాలిరా" అన్నాను కబుర్లలో.

"తప్పకుండా, కానీ మరీ రెండురోజులే ఉంటానంటే ఎలారా?" అన్నాడు.

"రేపే వెళదాం. మీరిద్దరు కూడా రండి. అందరం కబుర్లు చెప్పుకుంటూ హాయిగా గడుపుదాం" అన్నాను.

"సరే. అయితే ఉదయాన్నే నాలుగు గంటలకి బయలుదేరితే సూర్యోదయానికల్లా కోణార్క చేరుకోవచ్చు. అప్పుడయితే, ప్రశాంతంగా ఆ గుడిని, సూర్యోదయాన్ని చూడవచ్చు. ఆ తరవాత అయితే జనం ఎక్కువై అంతా గాభరా గాభరాగా ఉంటుంది. ఉదయాన్నే కాని, లేదా పౌర్ణమినాడు రాత్రి కాని ప్రాకారం చుట్టూ ఉన్న చెట్ల క్రిందో, నాట్య వేదికల మీదనో కూర్చొని ఆ అందాల్ని ఆస్వాదిస్తే కానీ కోణార్క గొప్పదనం అర్థం కాదు. ఆనందించలేము. ఆ తర్వాత భువనేశ్వర్ విశేషాలు చూడొచ్చు" అన్నాడు కిషోర్ తన్మయత్వంతో.

"సరే, అలాగే" అన్నాను.

ఆ రోజంతా చిన్ననాటి కబుర్లు, అమెరికా విశేషాలు, పిల్లల చదువులు, వాళ్ళ భవిష్యత్‌లు, చెదిరిపోయిన మిత్రుల గురించి, చిన్నప్పటి ఉపాధ్యాయుల గురించి, ఇలా ఎన్నో కబుర్లు చెప్పుకున్నాం, మధ్యాహ్నం భోజనాలు అయ్యేంత వరకు. తరవాత ఓ రెండు గంటలు నిద్రపోయి లేచాము. కమల అందించిన టీ తాగుతూంటే –

"రేపు తెల్లవారుఝామున చాలా చలిగా ఉంటుంది. నువ్వేమైనా స్వెట్టరు గట్రా తెచ్చావా" అని అడిగాడు కిషోర్.

"లేదే" అన్నాను.

"సర్లే. మావి ఇస్తాం" అన్నాడు.

"అసలు ఇండియాలోనే మంచి స్వెట్టర్లు దొరుకుతాయంటారు. ఇక్కడ కొని పట్టుకెళితే బాగుంటుంది కదా" అంది చిత్ర.

"అవును, మంచి ఐడియా కిషోర్, సాయంత్రం అలా ఊరిలో తిరిగి వచ్చినట్లు ఉంటుంది, ఏదైనా స్వెట్టర్లు అమ్మే షాపుకు తీసుకువెళ్ళు" అన్నాను.

"ఇక్కడ 'పరదేశీ బాబు' అన్న పేరుతో ఒక పెద్ద బట్టల షాపు ఉంది. అందులో మంచి స్వెట్టర్లు దొరుకుతాయి" అన్నాడు కిషోర్.

"అదేమిటి ఆ పేరు అలా ఉంది?"

"అవును కొంచెం వింత పేరే. కానీ మంచి పేరున్న షాపు. ఆ పేరు పెట్టడానికి ఏదో ఒక కారణం ఉండి ఉంటుంది. అక్కడ బేరాలు ఉండవు. మంచి నాణ్యమైన బట్టలు. పైగా షాపుకు వచ్చిన వాళ్ళందరిని అభిప్రాయాల్ని వ్రాసి సంతకం పెట్టమంటారు. అలా చేసినందుకు ఓ మంచి పెన్ను గిఫ్ట ఇస్తారు"

ఆరు గంటలకల్లా అందరం తయారై ఊరిమీద పడ్డాం. ఇరవై ఏళ్ళ తరువాత మళ్లీ ఈ ఊరు చూస్తున్నాను. ఇది వరకు విశాలంగా అనిపించిన రోడ్లు ఇప్పుడు, జనాభా పెరుగుదల వలన కాబోలు, ఇరుకుగా అనిపిస్తున్నాయి. ఎక్కడ చూసినా మనుషులే, చిన్న చిన్న దుకాణాలే, ఇరుకు అన్న భావన మనసంతా ఆవరిస్తుంది.

ఒక రెండు గంటలు ఊరంతా తిరిగి, సుమారు ఎనిమిది గంటలకు 'పరదేశీ బాబు' అన్న పేరు పెద్ద పెద్ద అక్షరాలతో, అధునాతన పద్ధతిలో అలంకరించబడి ఉన్న ఒక విశాలమైన షాపులో అడుగు పెట్టాం. అడుగు పెట్టీపెట్టగానే ఒక అందమైన అమ్మాయి ఎదురు వచ్చి వినయంగా ఆహ్వానించింది. ఏ బట్టలు కొనడానికి వచ్చామో అడిగి వాటి కోసం ఎటువైపు వెళ్ళాలో చూపించి, అవి కొనడం అయిన తరవాత షాపు అంతటిని చూడమని కోరింది. కేష్ కౌంటర్లకి ఒక 20 అడుగులకు ముందుగా ఉన్న ఒక టేబుల్ చూపించి, "మీరు వెళ్ళే ముందు మీ అభిప్రాయాలను ఇక్కడ వ్రాసి సంతకం

పెట్టమని 'పరదేశీ బాబు' తరుపున ప్రార్థిస్తున్నాను" అని చక్కనైన ఇంగ్లీషు ఉచ్ఛారణతో భాషా దోషాలు లేకుండా చెప్పింది. అది విని ఆశ్చర్యపోయాను.

"ఇంత మంచి ఇంగ్లీషా!" అన్నాను ఆశ్చర్యంలోంచి తేరుకుంటూ.

"ఈ షాపులో పనిచేసేవాళ్ళు ఒరియాతో పాటు రెండు మూడు భాషలు మాట్లాడుతారు. అందరూ ఇంగ్లీషు మాట్లాడుతారు, అదీ చాలా చక్కగా." అన్నాడు కిషోర్ ప్రశంసాపూర్వకంగా.

కావలసిన స్వెట్టర్లు తీసుకొని, షాపంతా తిరిగి చూసి, బిల్లు చెల్లించడానికి కేష్ కౌంటర్ల వైపు కదిలాం. ఎదురుగా 'ఈ షాపుపై మీ అభిప్రాయాలను తెలియజేయండి' అని 12 భారతీయ భాషల్లో పెద్ద అక్షరాలతో వ్రాసి ఉన్న బోర్డు, దాని పక్కనే ఒక టేబులు, టేబులు వెనక నవ్వు మొహంతో కూర్చున్న అమ్మాయి కనిపించింది. ఆ టేబులు దగ్గరకు రాగానే,

"మీ అభిప్రాయం ఇక్కడ వ్రాసి సంతకం పెట్టండి" అని వినయంగా ఓ పుస్తకాన్ని అందిస్తూ అడిగింది.

"అలాగే" అని 'ఎక్సలెంట్' అని వ్రాసి సంతకం పెట్టాను. నా సంతకం పక్కనే చిత్ర కూడా పెట్టింది. కిషోర్, కమల ఇంతకుముందే రాసాం అని చెప్పారు. ఆ అమ్మాయి వెంటనే రెండు పెన్నులు తీసి నాకు చిత్రకి ఇచ్చింది. అవి తీసుకుని కేష్ కౌంటర్లవైపు వెళ్లాం. క్యూలో నిలబడి, షాపంతా కలయచూసాను. షాపంతా చాలా అందంగా అమర్చారు. అభిప్రాయ సేకరణ టేబుల్ దగ్గర కూర్చున్న అమ్మాయి ఆమె చేతిలో ఉన్న కాగితంలోకి, అభిప్రాయం సేకరించిన పుస్తకంలోకి పదే పదే మార్చి మార్చి చూస్తున్నట్లు గమనించాను. ఉన్నట్టుండి ఆ అమ్మాయి ఒక్క ఉదుటున కుర్చీలోంచి లేచి, పరుగెట్టుకుంటూ షాపులో పై అంతస్తుకు చేరుకుంది. షాపులో ఉన్నవాళ్లందరి దృష్టి పరిగెత్తుతున్న ఆమె మీదే ఉంది. ఆమె పై అంతస్తులో ఉన్న ఒక గది తలుపు తీసుకుని లోపలికెళ్లింది.

కొద్దిక్షణాలు గడిచాయి. ఎవరి పనులు వారు చెయ్యడం మొదలు పెట్టారు. మేం బిల్లు చెల్లించడానికి ముందుకు కదిలాం. కేషియర్ మేమిచ్చిన బిల్లు తీసుకుని,

చెల్లించవలసిన సొమ్ము చెప్పి టకటక ఏదో వ్రాయటం మొదలు పెట్టింది. నేను పర్సు తీసి డబ్బులు లెక్కపెడుతున్నాను. అప్పటి దాకా చకచక పనిచేస్తున్న కేషియర్ ఒక్క ఉదుటన లేచి నిలబడింది.

"ఏమైంది?" అని అడిగాను.

నా ప్రశ్న పట్టించుకోనట్లు నా వెనకవైపు చూస్తూ, "మేడం" అంది.

నేను వెనక్కి తిరిగి చిత్రవైపు చూసేంతలోనే నా పక్కగా నాలుగు అడుగుల దూరంలో ఏ భావం వ్యక్తం చేయకుండా అన్ని భావాలను ఇముడ్చుకుందా అన్నట్లు అనిపించే విశాలమైన మొహంతో, యూనివర్సిటీ రోజులలో ఎన్‌సిసి ఆఫీసర్‌గా ఉన్న అంజలి శర్మని గుర్తుకు తెప్పించే ఒక అమ్మాయి రెండు చేతులు జోడించి నిలబడి నన్ను చూసి "నమస్తే" అంది. ఆమె వెనుక అభిప్రాయాల కౌంటరు అమ్మాయి పుస్తకం పట్టుకుని నిలబడి వుంది. నేను కొద్దిగా తడబడుతూ ప్రతి నమస్కారం చేసాను.

"ఈ సంతకం మీదేనా?" అని ఆ పుస్తకంలో ఉన్న  నా సంతకం వైపు వేలు చూపిస్తూ అడిగింది.

"అవును" అన్నాను మెల్లగా.

"మీరు 20 సంవత్సరాల క్రిందట భువనేశ్వర్ వచ్చారు కదూ?" అని అడిగింది.

"ఆ, ఆ అవును సుమారుగా..."

"ఈ కాగితంపైన ఉన్న సంతకం కూడా మీదేనా?" అని పటం కట్టి ఉన్న నా సంతకం ఫోటో కాపీ కాగితాన్ని చూపింది.

మొదటి నుండి నా సంతకంలో అట్టే మార్పు లేదు. ఆ కాగితం మీదనున్నది నా సంతకమే. సులభంగానే గుర్తుపట్టాను. సంభాషణ అంతా ఇంగ్లీషులోనే సాగుతోంది.

"అవును" అన్నాను నిశ్చయంగా.

"మీరే నా బాబూజీ" ఎంతో ఉద్వేగంతో 'బాబూజీ' అని ఆ షాపు అంతా ప్రతిధ్వనించేలా ఒక్కసారి అరచి, చటుక్కున నా కాళ్ళపై పడి, తన చేతులతో నా రెండు కాళ్ళని చుట్టేసింది. ఆమె ఏదేదో అంటోంది. ఏం జరుగుతున్నదో అర్థమవడం లేదు.

నన్ను ఆశ్చర్యం, ఉద్వేగం ఒక్కసారి ఆవరించి గాభరా పెట్టాయి. ఆ స్థితిలోనే వంగుని, "లేవండి, లేవండి అలా కాళ్ళ మీద పడకూడదు. అసలు విషయమేమిటి? ఏం జరిగింది? నా కోసం ఎందుకు వెతుకుతున్నారు? మీరెవరో నాకు తెలియదు" అన్నాను గాభరాగా.

ఆమె నా కాళ్ళు వదలకుండానే "ఎన్నో ఏళ్ళుగా ఎదురుచూస్తున్నాను. లక్షల సంతకాల తరవాత మీ సంతకం కనిపించింది. మీరు దొరికారు. నేను మిమ్మల్ని వదలలేను. నా తనివి తీరా మనసులో ఇన్నేళ్ళుగా దాచుకున్న నా కృతజ్ఞతని మీకు తెలుపుకోవాలి బాబూజీ, బాబూజీ" అంటూ ఆవేశంగా పరిసరాలని మరిచి, ఒదిలితే ఎక్కడ జారిపోతాయో అన్నంత గట్టిగా నా కాళ్ళను పట్టుకుంది.

నేను నిస్సహాయంగా నిలబడి సహాయం కోసం చిత్రవైపు సాభిప్రాయంగా చూసాను. తనకీ విచిత్రంగా ఉన్న ఈ సన్నివేశంలో చిత్ర నా చూపుని అర్థం చేసుకుని, ముందుకు వచ్చి నా కాళ్ళ దగ్గర ఉన్న ఆ అమ్మాయిని పట్టుకొని లేపింది. ఆ అమ్మాయి ఉద్వేగంతో చిత్ర భుజంపై వాలింది. షాపులో ఉన్న వాళ్ళంతా అప్పటికే మా చుట్టూ మూగి వున్నారు.

ఆ సంతకం నిజానికి నా సంతకమేనా? నా సంతకానికి పటం కట్టి ఉంచడమేమిటి? ఆ సంతకానికి, ఈ అమ్మాయికి సంబంధం ఏమిటి? నాలో ఎడతెగని ప్రశ్నలు రేకెత్తాయి. ఇన్నేళ్ళుగా నా కోసం ఎందుకు ఎదురుచూస్తోంది? నన్ను వెతకడానికేనా ఈ అభిప్రాయ సేకరణ? మనిషిని పోలిన మనిషి ఉంటారంటారు. సంతకాన్ని పోలిన సంతకం ఉండదా? ఇందులో ఏ పొరపాటు లేదుకదా? ఇలాంటి ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నాను.

ఇంతలో ఆ షాపు స్టాఫ్ తేరుకుని, మమ్మల్ని ఆఫీసు గదిలోకి తీసుకువెళ్లారు. ఆ ఆఫీసు గది ముందు అనుపమ పట్నాయక్, ఎం.ఎ., మేనేజింగ్ డైరెక్టర్ అని రాసి ఉన్న బోర్డు ఉంది. లోపల కుర్చీలతో, సోఫాలతో అధునాతన పద్ధతిలో అమర్చిన విశాలమైన ఆఫీసు ఉంది. ఎడమవైపు ఉన్న సోఫాలో మమ్మల్ని కూర్చోమని సూచించారు. ఆ సోఫాకు ఎదురుగా ఉన్న సోఫాలో ఆ అమ్మాయిని కూర్చోబెట్టారు. అంతలోనే మంచినీళ్ళు, వేడి వేడి టీలు వచ్చాయి. ఆమె ముందుగా కొంచెం మంచినీళ్ళు తాగి, తేరుకొని, నావైపు చూస్తూ –

"మీరు ఇరవై ఏళ్ళ క్రిందట భువనేశ్వర్ వచ్చారు గుర్తుందా?" అని నా జ్ఞాపకాలని గుర్తుచెయ్యడానికి ప్రయత్నిస్తూ, "మీరు మా నాయన కూరల దుకాణానికి వచ్చారు..." ఏమేమో చెపుతోంది. ఇరవై ఏళ్ళ క్రిందట భువనేశ్వర్ వచ్చినప్పుడు జరిగిన విశేషాలని గుర్తుకు తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాను నేను.

నేను ఉద్యోగ ప్రయత్నం మీద ఇంటర్వ్యూ కోసం భువనేశ్వర్ వచ్చాను. కిషోర్ ఒక చిన్న గదిలో అద్దెకుండేవాడు. నేను నాలుగు రోజులు ఉందామని కూడా వచ్చాను. అప్పుడు 'మదరాసి' హోటళ్లు లేవు. కిషోర్ ఒరియా భోజనానికి అలవాటు పడ్డా, నా కోసం ఇంట్లోనే వంట చేసేవాడు. ఇంటర్వ్యూ అయిన నాటి రోజు సాయంత్రం సామానులు, కూరలు కొనడానికని బజారుకు వెళ్లాము.

"బాబూజీ! వినండి" గౌరవం, ఆప్యాయత మేళవించిన ఆ పిలుపుతో నా ఆలోచనలు తెగిపోయాయి. "చిన్న వయసులో, చింపిరి తలతో, చీమిడి ముక్కుతో, చిరిగిన బట్టలతో, మట్టికొట్టుకుపోయిన వంటితో, చదవలేక, చదువురాక, చదువుకోమనే దెబ్బలతో, ఏడుపుతో, కన్నీళ్లు నిండిన కళ్లతో ఉన్న నేను గుర్తుకు వచ్చానా?" అని తోర్‌దత్ పొయట్రీ లాంటి భాషలో ఇంగ్లీషులో అడిగింది. మెల్లిమెల్లిగా కూరగాయల తట్టల మధ్య కూర్చున్న ఓ చిన్నపిల్ల నాకు గుర్తు రావడం మొదలయ్యింది. పూర్తిగా గుర్తుకు రాగానే ఎదురుగా కూర్చొని ఉన్న ఆమె కన్నీళ్ళు నిండిన కళ్ళల్లోకి చూసాను.

చక్కని సాంప్రదాయపు కేశాల కూర్పుతో, మిసమిసలాడుతున్న చెంపల మీద, మెరుస్తున్న కన్నీటి తడితో, పసుపు ఎరుపు రంగుల మేలు మేళవింపుతో,

మగ్గాన నేసిన మంచి చీరలో, వయసు తెచ్చే వన్నె వెలుగుతో మెరుస్తున్న మేనుతో, ఈమె చాలా చదివిందేమో అనిపించే భాషా జ్ఞానంతో, భావోద్వేగాన్ని ప్రజ్వరిల్లుతున్న కళ్లతో ఉన్న ఈమె- ఆ పిల్లా? నా కళ్ళముందే అందమైన సీతాకోకచిలుక అప్పుడే రెక్కలు విచ్చుకున్న భ్రాంతి కలిగింది.

మసక వెలుతురులో 30-35 ఏళ్ళ వ్యక్తి, అతనికిఎదురుగా ఒక 6-7 ఏళ్ళ అమ్మాయి, చుట్టూ కూరగాయల తట్టలు, ఒకదాని తరవాత మరొకటి గుర్తుకు వస్తున్నాయి. పిల్ల ఏడుపు వినిపిస్తోంది. ఏడుపు మధ్యలో ఏదేదో ఒరియాలో అంటోంది. అతను తండ్రి కాబోలు కొడుతున్నాడు. కొడుతూ అరుస్తున్నాడు. ఒరియా భాష రాకపోవడం వలన నాకు ఏమీ అర్థం కావడం లేదు. తెలుసుకోవాలని మాత్రం కుతూహలంగా ఉంది. కిషోర్ సామానులు కొనడం పూర్తయిన తరువాత ఆ ఏడుస్తున్న పిల్ల ఉన్న కూరల దుకాణానికి వెళ్ళాం. ఆ పిల్లని, తండ్రిని దగ్గరగా చూడడం కుదిరింది. మేం రాగానే అతను పిల్లను కొట్టడం ఆపి, మావైపు తిరిగి కూరలు ఏరుకునేందుకు తట్ట అందిస్తూ, పిండి తీసుకుని మొహానికి రాసుకున్న తీరులో, నవ్వు తీసుకొని మొహానికి పులుముకున్నట్లు నవ్వాడు ఒక్క క్షణంసేపు.

మేం దగ్గరకు రాగానే ఆ పిల్ల ఆపలేక ఆపలేక ఆపినట్లు ఏడుపు ఆపింది. అయినా మధ్యమధ్యలో బెక్కుతూనే ఒరియాలో ఏదో అప్పచెపుతున్నట్లు చెపుతోంది. విరిగిపోయిన పలక, చిరిగిపోయిన పుస్తకం... ఆ అమ్మాయి ఈమె వర్ణించినట్లే ఉంది.

ఆ తండ్రి నలిగిన బట్టలతో రేగిన జుత్తుతో, ముడతలు పడ్డ నుదురుతో, చాలా కాయకష్టం చేసి రాటుదేరిన చేతులతో, నిర్భాగ్యపు బ్రతుకుకు నకలుగా, నిరాశ ముద్దల లాంటి కళ్ళతో, మాసిన గడ్డంతో, బ్రతుకు మీదో, వ్యాపారం మీదో, పిల్లదాని చదువుమీదో, మనుషుల మీదో, లేక వీటన్నింటి మీదో, ఇదీ అని నిర్దుష్టంగా చెప్పలేని కసి, కోపం అతని మొహమంతా మబ్బులా కమ్మేసింది.

కూరలు కొనడం అయిపోయిన తరువాత రూమ్‌కు వస్తూంటే కిషోర్‌ని అడిగాను “ఆ పిల్ల ఎందుకు ఏడుస్తోంది? ఆ తండ్రి ఎందుకు కొడుతున్నాడు, చదువు కోవడంలేదనేనా?”

"ఆ సుమారుగా అంతేలే. పుస్తకాలు కొనకుండా బడికి రావద్దన్నారని, తనకు స్కూలు పిల్లలు వేసుకునే మంచి బట్టలు కావాలని, ఆ పిల్ల ఎక్కాల పుస్తకం కొన్నా ఇంకా ఎక్కాలు రాలేదని, పుస్తకాలు కొనడానికే డబ్బులు చాలక పోతుంటే, ఇంక మంచి మంచి బట్టలు ఎక్కడ నుండి తేగలనని ఆ తండ్రి అంటున్నాడు. నీకు చదువబ్బదు, నాలాగే నీకూ ఈ కూరల తట్టలే గతి. మన ఇద్దరి బతుకు ఈ కూరల తట్టల మధ్యనే తెల్లరుతాయి, అని తిట్టుకుంటున్నాడు."

ఆ కబుర్లలో రూమ్‌కి వచ్చాం. రాత్రి ఆ పిల్ల ఏడుపు గుర్తుకు వచ్చి మెలుకువ వచ్చింది. ఆ తర్వాత నిద్ర రాలేదు. ఆ పిల్ల మొహం పదే పదే గుర్తుకొచ్చింది. 'చదువంటే డబ్బులని' స్కూల్లోనూ, 'చదువంటే దెబ్బలని' ఇంట్లోనూ ఒక దురభిప్రాయాన్ని ఆ చిన్నారి మనసులో నాటబడుతుంటే నాకు చాలా బాధ కలిగింది. ఆ పిల్లకి ఎలాగైనా చదువుకోవాలనే ఆసక్తి కలిగించా-లనిపించింది. ఆ ఊరిలో ఉండేది ఇంకోరోజు మాత్రమే. మర్నాడు కోణార్క వెళ్లాలని అనుకున్నాను. నాకా ఆ పిల్లతో కాని వాళ్ళ నాన్నతోకాని మాట్లాడడానికి ఒరియా రాదు. ఏం చేసినా అది ప్రోత్సాహకరం అయ్యేదే కానీ ఆ పిల్ల చదువు బాధ్యత మొుత్తం తీసుకోడానికి నేను ఆ ఊర్లో ఎలాగూ ఉండను. నాకా ఉద్యోగం లేదు. మరేం చెయ్యాలి? ఇలా ఆలోచిస్తూ ఎప్పుడో తెల్లవారు ఝూమున నిద్రపోయాను.

మర్నాడు ఉదయం కిషోర్ నిద్రలేపాడు, కోణార్క వెళ్లడానికి ఆలస్యం అయిపోతోందని.

"కోణార్క్ వెళ్ళడం లేదు" అన్నాను.

"అదేం" అన్నాడు.

"మరేం లేదు. నా దగ్గర 200 రూపాయలే ఉన్నాయి. కోణార్క అనుకొన్నాను కాని, అవి పెట్టి ఆ పిల్లకి కావలసిన పుస్తకాలు, బట్టలు కొనిచ్చి చక్కగా చదువుకోమని చెప్పాలనుకుంటున్నాను" అన్నాను.

"ఏ పిల్ల? ఆ కూరగాయల కొట్టతని పిల్లా?"

'అవును' అన్నట్టు తలూపాను.

"మరి నువ్వు ఎప్పటినుంచో చూడాలనుకున్న కోణార్క్..." అన్నాడు కిషోర్.

"చూడ్డం దీనంత ముఖ్యం కాదు. విపరీతంగా వెనకబడి ఉన్న మన దేశానికి అక్షరాస్యత అత్యంత అవసరం. ఆడపిల్లలు చదువుకుంటే ఆమె పిల్లలు నిరక్షరాస్యులు కారు. ఆ కుటుంబం నిరక్షరాస్యత నుండి బయటపడుతుంది. కాబట్టి నేను కోణార్క వెళ్ళడం కన్నా, అదే డబ్బుతో ఆ పిల్ల చదువుకి ఉత్ప్రేరకంగా తోడ్పడడం మంచిదని ఈ నిర్ణయం తీసుకున్నాను" అన్నాను.

కిషోర్ తెల్లబోయాడు.

"నువ్వు ఆఫీసుకు వెళ్ళే దారిలో ఉన్న ఏదైనా ఒక పుస్తకాల షాపులో నన్ను వదిలి వెళ్ళు. ఆ తరవాత అక్కడ దగ్గరలో ఉన్న బట్టల దుకాణానికి వెళ్ళి బట్టలు కూడా కొని సాయంత్రం ఆ పిల్లకు ఇచ్చేద్దాం" అన్నాను.

సాయంత్రం మళ్ళీ ఆ కూరల దుకాణానికి వెళ్ళి ఉదయంకొన్న ఒరియా, ఇంగ్లీష్ పుస్తకాలు, పెన్సిళ్ళు, రెండు పెన్నులు, కొన్ని రబ్బర్లు, బట్టలు ఇచ్చి, 'చదువుకో బాగా చదువుకో, చాలా గొప్పదానివి అవుతావు. నీకు కావల్సినవన్నీ దొరుకుతాయి' అని ఒరియాలో కిషోర్ చేత ఆ పిల్లతో చెప్పించి, అవే మాటలని కిషోర్ చేత ఒరియాలో వ్రాయించి క్రింద నా సంతకం పెట్టి ఇచ్చాను. వాళ్ళు ఒరియాలో అన్న వాటిని, కృతజ్ఞతలని కిషోర్ నాకు తెలుగులో తరవాత చెప్పాడు. ఆ తరవాత ఏం జరిగిందో మరి తెలీదు. ఆ పిల్లే ఈ పిల్లా అని ఆమె మొహంలోకి చూస్తూ "అవును, అప్పుడు కొన్ని పుస్తకాలు ఇచ్చినట్లు గుర్తు" అన్నాను.

"బాబూజీ, ఇవిగో ఆ పుస్తకాలు" అని ఎదురుగా అందంగా నగిషీ చెక్కిన పెట్టెలోంచి తీసి కళ్ళకు అద్దుకొని నా ఎదుట పెట్టింది. "ఆ రోజు మీరిచ్చిన ఈ పుస్తకాలు నాకు వరాలు. అప్పటి నుండి శ్రద్ధగా చదువుకున్నాను. మా నాయన నా హైస్కూల్ చదువు పూర్తి కాగానే బట్టల వ్యాపారం మొదలు పెట్టించాడు. మీ మీది గురితో ఏర్పడ్డ చదువు మీద అభిమానం నన్ను వదలలేదు. ఉదయం వ్యాపారం, సాయంత్రం చదువు. చదువుతున్న కొద్దీ చదువు ఇచ్చే ఆనందాన్ని

ఆస్వాదించసాగేను. వ్యాపారంలో కూడా నా చదువు చాలా ఉపయోగపడడం చూసి మా నాయన నన్ను చదువుకోమని ప్రోత్సహిస్తూ ఉండేవాడు. అలా ఎం.ఎ. దాకా చదివాను" అని లేచి, గోడకు తగిలించిన ఉత్కళ్ యూనివర్సిటీ డిగ్రీ సర్టిఫికెట్‌లను తెచ్చి చూపించింది.

"మిమ్మల్ని లెక్కపెట్టలేనన్నిసార్లు తలుచుకుంటూనే ఉంటాను. పరీక్షలు పాస్ అయినప్పుడల్లా ఇదంతా మీ దయ వలననే అని అనుకుంటూ ఉండేదాన్ని. మీ పట్ల నాకున్న కృతజ్ఞత ఎలా తెలుపుకోవాలా అని చాలా రోజులు ఆలోచించి, ఆఖరుకు మీ కిష్టమైన పనే చేసాను. చూడండి అని ఒక ఆల్బమ్ తెరిచింది. గత 10 ఏళ్ళుగా ఏడాది వారీగా అమర్చిన ఆడపిల్లల గ్రూప్ ఫోటోలని చూపించి ప్రతి ఏడాది సుమారు వంద మంది చదువుకోడానికి స్తోమత లేనివారిని మేము, మా షాపు ద్వారా చదివిస్తున్నాము. వాళ్ళని తిరిగి పెద్దవాళ్ళయ్యాక ప్రత్యుప కారంగా ఒక్కొక్కరూ కనీసం పదిమందిని చదివించమని కోరుతున్నాం. ఇది మీకు ఆనందాన్ని ఇస్తుందనుకుంటాను బాబూజీ"

"నిజంగానే మంచి పని. చాలా ఆనందంగా ఉంది" అన్నాను, చెమర్చిన కళ్ళతో.

"బి.ఎ. పాస్ కాగానే మిమ్మల్ని కలవాలని గాఢంగా అనుకున్నాను. మీ సంతకం ఉందికానీ, మీ పేరు తెలియలేదు. ఒరియా వాళ్ళు కాదని మాత్రం తెలుసు. ఎక్కడ ఉన్నారో తెలియదు. మిగిలిన ఆశ ఒక్కటే. మీరు మళ్ళీ భువనేశ్వర్ వచ్చి మా షాపుకు వచ్చినట్లయితే ఈ సంతకం ద్వారా మిమ్మల్ని కలవచ్చు అని తోచి ఈ సంతకాల పద్ధతి పెట్టాం. మా నాయన కూడా మిమ్మల్ని అడుగుతుండేవాడు. చనిపోయే ముందు కూడా మిమ్మల్ని గుర్తుచేసుకొని ఎప్పుడైనా కలిస్తే తన తరఫున కూడా మీకు పాదాభివందనం చెయ్యమన్నాడు" అని ఉద్వేగంతో నా కాళ్ళకి మరోసారి నమస్కారం పెట్టింది.

నిలువెల్లా ఆనందాశ్చర్యాలతో ముంచెత్తుతున్న ప్రకంపనాలు పదేపదే నాలో ప్రవహిస్తున్నాయి. మాట్లాడాలని ఉందికాని గొంతునిండి మాట రావడం

లేదు. గత ఎన్నో ఏళ్ళుగా విదేశాలలో పనిచేస్తూ సంపాదించిన పురస్కారాలన్నింటి కంటే ఆమె చేసిన నమస్కారం అత్యున్నతమైనదిగా తోచింది. ఆ రోజు చేతిలో ఉన్న 200 రూపాయలు ఆ పిల్ల చదువుకు ఖర్చు చెయ్యడం కంటే మంచిపని నా జీవితంలో ఇంకేమీ లేదేమోననిపించింది. అయితే ఆ అమ్మాయి తన జీవితంలో ఇంత ఎత్తు ఎదగడానికి కారణం నేనని ఆ గొప్పదనం నాకే అపాదించుకోవడం అంత సబబు అనిపించలేదు.

అందుకే నోరు విప్పి "నీ పట్టుదల, కృషి, మేధస్సుతో, విశాల దృక్పథంతో ఈ స్థితికి వచ్చావు. కాని నా పాత్ర ఇందులో ఉత్ప్రేరకంగా పనిచెయ్యడం మాత్రమే. నువ్వు చాలా అభినందనీయురాలివి. ఎంతోమంది ఆడపిల్లలకి నువ్వు మార్గదర్శకురాలివి. అటువంటి నీ అభిమానానికి ఎంతో ఆనందిస్తున్నాను" అన్నాను ప్రతి పదాన్నీ నొక్కి పలుకుతూ.

మేం ఇద్దరం ఇలా మాట్లాడుకుంటూ ఉంటే అంతా మమ్మల్నే చూస్తున్నారు అన్న స్పృహ అప్పుడే కలిగింది.

"బాబూజీ మీరు మా ఇంటికి రావాలి. మాతోనే ఉండాలి. ఇన్నేళ్ళుగా నా మనసులో మీతో చెప్పుకుంటున్న మాటలన్నీ మీకు చెప్పాలి."

"అలాగే" అన్నాను.

"మరి కోణార్క వెళ్ళడమో..." అన్నాడు కిషోర్.

"రేపు కోణార్క వెళ్ళాలనుకున్నారా? మరోసారి వెళ్ళకూడదా?" అని ప్రశ్నలాంటి అభ్యర్థన చేసింది అనుపమ పట్నాయక్.

"అలా అయితే అది 20 ఏళ్ళ క్రితం జరిగిందే మళ్ళీ జరుగుతుంది" అన్నాడు కిషోర్.

"అదేమిటి" అన్న ఆమె ప్రశ్నకు సమాధానంగా 20 ఏళ్ళ క్రిందట నేను కోణార్క వెళ్ళడం ఎందుకు వీలుపడలేదో చెప్పాడు.

అది విని అనుపమ పట్నాయక్ మౌనంగా, నీళ్ళు నిండిన కళ్ళతో ద్విగుణీకృతమైన కృతజ్ఞతతో మరోసారి నావైపు చూసింది.

ఆ రాత్రి అందరం ఆమె అతిథులమయ్యాం.

***

నేను వంటింటిలో చెయ్యవలసిన సహాయం చేసి వచ్చేసరికి పతంజలి నేనిచ్చిన కథ చదవడం పూర్తి చేసి నన్ను చూసి పతంజలి నవ్వుతూ ఎదురొచ్చి "మీ కోసం ఎదురు చూస్తున్నాను" అన్నాడు. నా కథ కాపీ అందిస్తూ. నా ముఖంలోని ప్రశ్నార్థకాన్ని గమనించాడు కాబోలు, "సంకల్పం, ఆచరణ ముఖ్యం" అన్నాడు. "మరి నేను వెళ్ళి మా గ్రూప్‌లో జాయిన్ అవ్వాలి. థేంక్సు" అన్నాడు కరచాలనం చేస్తూ.

"మంచిది" అన్నాను తృప్తిగా.

*

## సామాజిక సేవలో గురువువంటి
## డా॥ భాగవతుల పరమేశ్వరరావు గారికి
## నమస్కరిస్తూ...

# హాచ్...!

**(ఒక దొంగదేవుడు, దొంగదొర, దొంగరాణిల కథ)**

**దే**వుడికి కష్టం వచ్చింది.

దేవుడి పూర్తి పేరు భుజంగ దేవర.

ఆయన తన నియోజకవర్గంలోని ప్రజలకు దేవుడే. దేవుడంటే ఎప్పుడూ వరాలు ఇచ్చేవాడే కాదు. 'దుష్ట శిక్షణ' చేసేవాడు కూడా. పాపులు ఎక్కువైపోయిన ఈ రోజుల్లో భుజంగ దేవర అలియాస్ దేవుడు శిక్షించడానికే అవతారమెత్తిన వాడు. అయితే ఆయన ఎక్కువకాలం హైదరాబాదు, ఢిల్లీల్లో ఉండి 'ప్రజాసేవ' చేస్తుంటారు. కాబట్టి ఆయన నమ్మినబంట్లు ప్రజలను శక్తివంచన లేకుండా శిక్షిస్తూంటారు. ఇప్పటిదాకా దేవుడు ఆ నియోజకవర్గం ఎమ్మెల్యే. ఆయన చాలా ఏళ్ళుగా ఆ నియోజవకర్గం ఎమ్మెల్యేగా ఉంటున్నారు. ఆయన ఎన్నికల్లో 'ప్రజాసేవ కోసం', 'ప్రజల కోరికపై', 'ప్రజల బాగుకై' నిలబడుతూ ఉంటారు. అందుకే ఆయన ఎప్పుడూ ఓడిపోరు.

ఎంత కలికాలం అయినా భరతఖండంలో రానురాను 'ప్రజాసేవ' చెయ్యాలన్న ప్రగాఢమైన కోరిక చాలా చాలా మందికి పుట్టుకొస్తోంది. బస్తాలకొద్దీ డబ్బు ఖర్చుపెట్టి అయినా సరే, ఎన్నికల్లో నిలబడి, గెలిచి 'ప్రజాసేవ' చెయ్యాలన్న వాళ్ళ సంఖ్య పెరిగిపోతోంది. దేవుడులాంటి నాయకులను ఓడించడం మాట అలా ఉంచి అసలు ఎదిరించి నిలబడడమే కష్టం. ఒకవేళ పోటీకి నిలబడ్డా ఓడిపోవడం ఖాయం. అందుకే అలాగే జరిగింది. దేవుడుగారు గెలిచారు.

ఓడిపోయిన అభ్యర్థి అక్కడితో ఊరుకోక దేవుడి గారి మూలాలు వెతికాడు. ఆ నియోజకవర్గం ఎస్టీలకు కేటాయించబడింది. దేవుడు ఎస్టీట. ఓడిపోయిన అభ్యర్థి తీగలాగడం వల్ల దేవుడు గారు ఎస్టీ కాదని తేలింది. దేవుడు గారి ఎన్నిక చెల్లదని కోర్టు ఓ నాలుగేళ్ళ తరువాత తీర్పు ఇచ్చింది. అందుకే దేవుడు మాజీ ఎమ్మెల్యే అయ్యాడు. దొంగ ఎస్టీ సర్టిఫికెట్ పెట్టినందుకు ఆయన్ని ఎవరూ శిక్షించలేదు. ఎందుకంటే ఆ నియోజకవర్గంలో ఎవరినైనా 'శిక్షించేది' ఆయనే కాబట్టి. ఇప్పుడు ఆయన ఎస్టీ కాదని తేలింది కాబట్టి రాబోయే ఎన్నికల్లో నిలబడడానికి వీలుకాదు. అది దేవుడికి ఇప్పుడొచ్చిన కష్టం.

దేవుడి నియోజకవర్గంలో వంగ రాణి ఒక సామాన్య స్త్రీ. ఆమె భర్త చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొంటూ ఎంతో కొంత సంపాదించుకుంటాడు. ఆ సంపాదనని అతి జాగ్రత్తగా, పొదుపుగా ఖర్చుపెడుతూ తమ వీధిలోకెల్లా బాగా ఉన్నవాళ్లు అనిపించేలా సంసారం నడుపుకొస్తున్నది.

అలాంటి వాళ్ళు దేవుడి నియోజకవర్గంలో చాలామంది ఉండొచ్చుకాని, ఆమెకో ప్రత్యేకత ఉంది. ఆమె తండ్రిది నిజమైన ఎస్టీ కులం. ఆమె తల్లి కులం బిసి. ఆమె తండ్రి ఎస్టీ అన్న విషయం ఎక్కడో రికార్డులలో తప్ప ఎవరికీ తెలియదు. అది తెలుసుకున్నారు దేవుడు మనుషులు. తండ్రి ఎస్టీ కాబట్టి వంగ రాణి ఎస్టీ. అంచేత ఆమె పోటీ చెయ్యడానికి అర్హురాలు అని నిశ్చయించి, ఆమె భర్తను ఒప్పించి, చచ్చిపోయిన ఆమె తండ్రిని చాలా గొప్పవాడిని చేసి వంగ రాణిని దేవుడిగారి అభ్యర్థిగా ఎన్నికల్లో నిలబెట్టారు.

దేవుడిగారి మీద కోర్టులో విజయం సాధించిన వ్యక్తికి టికెట్టు ఇస్తే ఈమారు తమ పార్టీ తప్పనిసరిగా గెలుస్తుందని అపోజిషన్ పార్టీ నిశ్చయించింది. అతనికి టికెట్టు ఇచ్చింది. అతని పేరు వీరభద్ర దొర. అతను నిజంగానే ఎస్టీ. ఎస్టీ రిజర్వేషన్ మీద చదువుకున్నాడు. మిగిలిన ఎస్టీలను కూడగట్టుకొని గిరిజన ఉత్పత్తుల వ్యాపారంలో మంచి సంపాదన కలిగి ఉన్నవాడు. ఒకస్థాయి సంపాదన దాటిన తరవాత అధికారం, ఆ అధికారం వల్ల వచ్చే ఎన్నో రెట్ల సంపాదన మీద ఆశ మళ్ళడం లాంటి కారణాల వల్ల వీరభద్ర దొర అతి సౌమ్యుడుగా

కనిపిస్తాడు. మంచి వ్యాపారవేత్త, వ్యవహారకర్త కూడా కాబట్టి రాజకీయాల్లో రాణించడం పెద్ద కష్టం కాలేదు. కాకపోతే దేవుడిని ఓడించడం అతని వల్ల కాలేదు. ఈసారి దేవుడు నిలబెట్టిన వంగ రాణిని ఓడించడం కష్టం కాదనుకొన్నాడు. అయినా సరే, తను ఖర్చు పెట్టవలసిన డబ్బు జాగ్రత్త చేసుకున్నాడు. దేవుడిది దొంగ ఎస్టీ సర్టిఫికెట్ అని కోర్టులో నిరూపించడం ద్వారా కూడా తనకు అనుకూలంగా పనిచేస్తుందనుకొన్నాడు. అతను ఊహించింది ఒకటైతే జనం మధ్యే జరిగింది మరొకటి.

'దొంగ' సర్టిఫికెట్ విషయంలో వివరాలు సగం తెలిసి సగం తెలియక మాట్లాడుకొనే జనం ఇతనిని 'దొంగ దొర' అనడం మొదలుపెట్టారు. ఆకతాయిలు 'దొంగదొర' 'వంగరాణి' అని గోడల మీద రాసారు. అలా ఈమారు ఎన్నికల్లో 'దొంగదొర' 'వంగ రాణి' పోటీలో ఉన్నారు.

ఎన్నికల ప్రచారాలు హోరాహోరీగా సాగుతున్నాయి. వంగ రాణిని ప్రతిరోజూ ఉదయం దేవుడి మనుషులు ఇంటికి వచ్చి కారులో ప్రచారానికి తీసుకొని వెళుతున్నారు. ఆ రోజు కూడా వంగరాణి తన మనుషులతో ఇంటి గుమ్మం దగ్గర ఎదురు చూస్తున్నది రావలసిన కారు కోసం.

వంగ రాణి అత్తగారు ఇవేవీ పట్టనట్టు ఇంటిముందున్న అరుగుమీద చోడి గింజలు ఎండబెట్టుకొంటున్నది. అరుగుకు ఆనుకొని ఉన్న పిట్టగోడ మీద ఒక కోడి నిలబడి చోడి గింజల వైపు ఆశగా చూస్తోంది. పనిలో పనిగా వంగ రాణి అత్తగారి చేతిలో వున్న కర్రవైపు కూడా చూస్తోంది. అత్తగారి చూపు చోడి గింజల నుండి మళ్లి, వెళ్లబోతున్న కోడలివైపు తిరిగింది. ఆ అదును చూసుకొని కోడి చోడి గింజలపైకి దూకబోయింది. సరిగ్గా అదే సమయానికి అత్తగారి ముక్కుమీద ఓ సీతాకోకచిలుక వాలింది. దాని ప్రభావం వల్ల అత్తగారికి తుమ్ము వచ్చింది. "హాచ్!..." అని ఆమె తుమ్మింది. ఆమె తుమ్ము అకస్మాత్తుగా రావడం వల్ల పిట్టగోడ మీద నుండి కిందకి దూకుతున్న కోడి గాబరా పడి రోడ్డువైపు ఎగిరింది. ఎగురుతూ వస్తున్న కోడిని ఆఖరిక్షణంలో చూసిన ఓ మోటర్ సైకిలిస్టు తప్పించుకొనే ప్రయత్నంలో ఎదురుగా వస్తున్న కారును గుద్ది కిందపడ్డాడు. కారు మరోవైపుకు తిరిగి ప్రక్కనే ఉన్న గుంతలో పడి బురదలో కూరుకుపోయింది.

మోటర్ సైకిలిస్టును అందరూ గట్టిగా తిట్టారు. అతని తప్పేమీ లేదని వంగ రాణి చెప్పడంతో అతన్ని వదిలేసారు.

కారు నుండి దిగిన కామయ్య శెట్టిని వంగ రాణి పరామర్శించింది. కారు డ్రైవర్‌కి కానీ, కామయ్యశెట్టికి కానీ పెద్దగా దెబ్బలు తగలలేదు. ఎంత ప్రయత్నించినా కాలువలో పడ్డ కారు మాత్రం బయటకు రాలేదు. బయటకు తియ్యడానికి మనుషుల్ని పిలుచుకొస్తానని డ్రైవర్ వెళ్ళాడు.

కామయ్య శెట్టి, వంగ రాణి కబుర్లు చెప్పుకొంటున్నారు. ఇక్కడ జరిగింది పెద్ద ఏక్సిడెంట్ కాకపోయినా, ఎవరూ కంప్లయింట్ ఇవ్వకపోయినా దారిన పోతూ చూసిన ఓ సైకిల్ కుర్రాడు ముందు జంక్షన్‌లో ఉన్న ట్రాఫిక్ పోలీసుకు చెప్పాడు.

ట్రాఫిక్ పోలీసు పరుగు పరుగున వచ్చి వివరాలడిగాడు. కామయ్యశెట్టి, వంగ రాణి ఆ ట్రాఫిక్ పోలీసును పట్టించుకోకుండా వెళ్లిపొమ్మని కసిరారు. ట్రాఫిక్ పోలీసుకు కోపం వచ్చింది. పోలీస్‌స్టేషన్‌కి ఫోను చేసి ఎస్సైకి ఈ విషయం చెప్పాడు. రాష్ట్రం అంతా ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు పోలీసులు కార్లు చెక్ చేసి అక్రమంగా తరలిస్తున్న డబ్బును పట్టుకొంటున్నారు. వారం రోజులైనా తనకి అలాంటి కేసొక్కటీ తగలలేదని నిరాశలో ఉన్న ఎస్సైకి ఇదో మంచి అవకాశం అనిపించింది. అందులోనూ ఓ వ్యాపారస్థుడు, ఓ అభ్యర్థి ఒకేచోట ఉన్నారు. ఇందులో ఏదో మతలబు ఉండాలి అని హుటాహుటిన వచ్చాడు. కారు చెక్ చేస్తానన్నాడు.

“నీకు మతికాని పోయిందా. నాను ఏపారం చేసుకొనే వాడిని. నాకు ఈ రాజకీయాలు తెలవ్వు” అన్నాడు కామయ్యశెట్టి.

“అయినా సరే, నా డ్యూటీ నాది” అని ఎస్సై కారు తనిఖీ చేసాడు. నిజంగానే ఆ కారులో లక్షరూపాయల కేష్ దొరికింది. ఎస్సై మహదానందంతో ఆ డబ్బు తీసుకొని కామయ్య శెట్టిని కోర్టుకు రమ్మన్నాడు. తమ వ్యాపారానికి ఇంతకన్నా ఎక్కువ డబ్బే రోజూ కారులో తీసుకెళతానని ఎంత వాదించినా వినలేదు. ఏం మాట్లాడితే ఏమవుతుందోనని భయపడిపోయిన వంగ రాణి నోరు విప్పలేదు. కామయ్య శెట్టిని తీసుకొని ఎస్సై పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళిపోయాడు.

కామయ్య శెట్టి వంగ రాణికి ఎలక్షన్‌లో పంచడానికి డబ్బులిస్తూ దొరికిపోయాడని ఊరంతా గుప్పుమంది. దేవుడికి ఈ విషయం తెలిసిన వెంటనే వంగ రాణిని రప్పించి విషయం అడిగారు. నిజం చెప్పమని బెదిరించాడు. ఆ డబ్బుతో నాకేమీ సంబంధం లేదని గట్టిగా చెప్పింది. దేవుడు పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళి "మాకు ఈ డబ్బుతో సంబంధం లేదు" అని ఎస్సైతో చెప్పాడు.

"అయితే రసీదు రాసిస్తాను, తర్వాత వచ్చి డబ్బు తీసుకెళ్ళండి" అన్నాడు ఎస్సై.

తన ఖాతాలో ఒక బోణి ఎలక్షన్ కేసు రాసుకున్నాడు ఎస్సై.

ఈ విషయం ఇటు ప్రజలలో, అటు దేవుడి మనుషుల్లో కల్లోలం రేపింది. 'ఇప్పట్నించే డబ్బులిచ్చేస్తున్నారుట' అని ప్రజలు, 'డబ్బులివ్వడంలో మనం చాలా జాగ్రత్తపడాలి' అని దేవుడు గట్టిగా అనుకున్నారు.

'అమ్మో ఇప్పటినుండే పంచేస్తున్నారా?' అని 'దొంగదొర' ఆశ్చర్యపోయాడు. కానీ ఇప్పటి నుండి పంచడానికి కావలసినంత డబ్బు తనవద్ద లేదని బాధపడ్డాడు. 'పోన్లే. వాళ్ళని ఇప్పటినుండే పంచనీ. నేను చివర్లో పంచుతానులే' అనుకొన్నాడు.

దేవుడు తన మనుషులని పిలిచి ఇచ్చిన డబ్బు చాలా జాగ్రత్తగా పైకి తెలియకుండా పంచమని ఆజ్ఞలు జారీ చేసాడు. గెలిచేది 'వంగరాణి' అయినా, ఆజ్ఞ ఇచ్చేది దేవుడు. దేవుడి మనుషులకు కొత్త కొత్త ఆలోచనలు వస్తున్నాయి. దేవుడు ఇంక ఎప్పటికీ ఇక్కడ పోటీ చెయ్యలేడు కాబట్టి పదవిలోకి రాలేడని నిశ్చయించుకున్నారు. ఇతన్ని అంటిపెట్టుకొని ఇన్నేళ్లు ఉన్నందుకు ఎక్కువగా ఏమీ మిగలలేదు. నియోజకవర్గంలో ఒక్కో అభ్యర్థికి కోటిపైనే ఖర్చు దాటిందని ఆనోటా ఈనోటా, విన్నారు దేవుడి మనుషులు. తమకి పంచమని ఇచ్చిన లక్ష పూర్తిగా పంచకపోతే? అన్న ఆలోచన వచ్చింది. అది కూడా చాలా జాగ్రత్తగా పంచమన్నాడు కదా! మరి జాగ్రత్తగా పంచడం అంటే పైకి తెలియకుండా జరగాలి కదా, ఇందులో సగం నొక్కేస్తేనో అన్న ఆలోచన కూడా వారిలో మొదలైంది.

***

ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. అభ్యర్థుల డబ్బు నీళ్ళలా ఖర్చు అవుతున్నది. దేవుడే వంగ రాణి తరుపున ఖర్చంతా పెడుతున్నాడు. వంగ రాణి బొమ్మలా అతని వెంట తిరుగుతున్నది.

దేవుడి మనుషులు మొదటిసారి ఇచ్చిన డబ్బులో సగం దాచుకొని మిగతాది పంచిపెట్టారు. ప్రచారం జోరులో దేవుడు అంతగా పట్టించుకోలేదు. రాను రాను దేవుడి మనుషులు పంచమని ఇచ్చిన దానిలో పదో వంతు మాత్రమే పంచి మిగిలింది దాచేసుకున్నారు.

అంతా దొంగ సొమ్ము. 'దొంగల తల్లికి ఏడవ భయం' అన్న సామెతలా దేవుడికి కొద్ది కొద్దిగా తెలిసినా ఎన్నికలు అవ్వనీ వీళ్ళ పని పడతానని మనసులో అనుకొని ఎవరితోనూ గొడవ పడలేదు.

***

ఎన్నికలు జరిగాయి. ఫలితాలు వచ్చాయి. వంగ రాణి ఓడిపోయింది. దేవుడు డీలాపడిపోయాడు. తన రాజకీయ జీవితానికి తెర పడినట్లు బాధపడ్డాడు. అసలు ఎందుకిలా జరిగిందని విచారించాడు. నిదానంగా విషయం పూర్తిగా తెలుసుకొంటే కనీసం రాబోయే కాలంలో మరో ఎత్తు వెయ్యొచ్చని అనుకొన్నాడు. తన క్రింద పనిచేసిన వాళ్ళు డబ్బు పంచకపోవడం వల్లే తన అభ్యర్థి వంగ రాణి ఓడిపోయిందన్న విషయం గ్రహించేడు.

కారణాలను వెతికి తెలుసుకొన్నాడు. ఈ డబ్బు వ్యవహారానికంతటికి మూలకారణం కామయ్యశెట్టి, వంగ రాణి మంతనాలు అని అనుకొన్నాడు. వంగ రాణిని పిలిపించాడు. వివరంగా వాళ్ళిద్దరి మధ్యా ఆనాడు జరిగిన విషయం చెప్పమన్నాడు. వంగ రాణి భయపడి, భోరుమని ఏడ్చి దేవుడి మీద ప్రమాణం చేసి చెప్తున్నానని ఇలా మొదలు పెట్టింది. తన అత్తగారి ముక్కుమీద సీతాకోకచిలుక వాలడం ఆమె 'హాచ్!...' అని తుమ్మడం, దానివల్ల కోడి భయపడి ఎగిరి మోటర్ సైకిలిస్టుపై పడడం, వాడు వెళ్ళి కారును గుద్దడం, కారు కాలువలో దిగబడటం, పోలీసు రావడం, పోలీస్ స్టేషన్‌లో దేవుడు వచ్చి సర్దిచెప్పడం దాకా అంతా వివరంగా చెప్పింది మళ్ళీ.

అయితే ఆ సీతాకోక చిలక వంగ రాణి అత్తగారి ముక్కుమీద వాలకపోతే, ఆమె 'హాచ్!...' అని తుమ్మకపోతే, కోడి గాభరాపడి ఎగిరి మోటార్ సైకిల్ వాడిపై పడకపోతే, వాడు కారును గుద్దకపోతే, కారు వెళ్ళి కాలవలో పడకపోతే, పోలీసు రాకుంటే ఈ డబ్బు గొడవ జరిగుండేది కాదు కదా! అని దేముడు వాపోయాడు. ముక్కుమీద రెక్కాడించిన సీతాకోకచిలుకల్ని తన నియోజకవర్గంలో నిషేధించాలని భావించాడు. ఏమనుకున్నాడో ఏమోగాని అప్పటినుండి దేవుడు తన ముందు ఎవరూ 'హాచ్!...' అని తుమ్మడానికి వీలు లేదని శాసించాడు.

*

**ఒక వార్తని కథగా మలచడానికి గురువైన**
**శ్రీ జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు**
**గారికి నమస్కరిస్తూ...**

# అంత్యక్రియకి ఆహ్వానం

**"నీ**ళ్ళ డబ్బావోడు బిల్లిచ్చినాడేటి మనకి?" అని ప్రశ్నలాంటి కంప్లెయింట్ ఇచ్చింది ఎమ్మెల్యే భార్య, అప్పుడే ఊరిమీద పనులన్నీ చూసుకొని ఇంటికొచ్చిన ఎమ్మెల్యేకి. నీళ్ళ డబ్బావాడు అంటే రోజూ మినరల్ వాటర్ తెచ్చువాడని ఆమె ఉద్దేశం.

"తెలియకిచ్చుంటాడులే.." అన్నాడు బట్టలు మార్చుకొంటూ.

"ఏటి? ఇది ఎమ్మెల్యే ఇల్లని తెలవదా? మనం గేసుక్కూడా డబ్బులు కట్టమని తెలవదా? పుచ్చుకోడమే కాని, ఇచ్చుకొనే సెయ్యి మనది కాదని తెలవదా?" అని నవ్వుతూ సరసమాడింది.

"పోన్లేవే సింపిపారెయ్..." అన్నాడు నవ్వుతూ, చిన్నపిల్లల చేష్టల్ని పెద్ద వాళ్ళు పట్టించుకోకూడదన్నట్లు. ఆమె ఆ కాగితాన్ని చింపేసి కిటికీలోంచి బయటకు పారేసింది.

"అద్సరే గాని, ఇదేటో సూడు. మీ భద్రాచలం మేష్టారు వచ్చి ఇచ్చినాడు" అంది ఓ మడతపెట్టి ఉన్న కాగితాన్ని ఎమ్మెల్యేకి అందిస్తూ.

"సదువెహె..." అన్నాడు కుర్చీలో కూర్చొని రెండు కాళ్ళు జాపుకొని.

"సదివినాను. ఏటీ అర్థం కానేదు" అంది చికాకుగా.

"తెమ్మి" అని ఆమె చేతిలోంచి తీసుకొన్నాడు ఎమ్మెల్యే.

## గురుదక్షిణ

రేపు ఉదయం తొమ్మిది గంటలకు మా ఇంటి నుండి బయలుదేరు శవయాత్రకి ప్రతీ ఇంటినుండి కనీసం ఒక్కరినైన పాల్గొనగలరు. ఇట్లు, అంత్యక్రియ కర్త, భద్రాచలం.' నీలిరంగు అక్షరాలకి నల్లటి అంచుతో పావు తావు కాగితంపై ముద్రించి ఉంది.

***

భద్రాచలం గారు అంటే ఆ ఊరిలో అందరికి గౌరవమే. ఆయన లెక్కల మాష్టారు. ఒక పద్ధతి ప్రకారం పోయే మనిషి. అయిన దగ్గర చదువుకున్న వాళ్ళు వాళ్ళ వాళ్ళ శక్తికొద్దీ రకరకాల ఉద్యోగాలలో, వ్యాపారాలలో, వృత్తులలో స్థిరపడినవారే. వారితో పాటు చదువుకొని ఊరి రాజకీయాలలో స్థిరపడ్డవారు కూడా ఉన్నారు. ఎమ్మెల్యేకి కూడా చిన్నప్పుడు పాఠాలు చెప్పారు.

తెల్లటి చొక్కా, తెల్లటి పంట్లాంతో, సైకిల్‌పై వెళుతూ కనిపించే ఆయన ఆ ఊరులో అందరికి పరిచయస్తుడు. క్లాసులోనైనా, ఊరిలోనైనా ఎవరు ఏ ప్రశ్న అడిగినా శ్రద్ధగా సమాధానం చెప్పడం ఆయన అలవాటు. సూటిగా మాట్లాడడం, సాధారణ జీవితం గడపడం ఆయన లక్షణాలు. పిల్లలు ఇద్దరూ బాగా చదువుకొని పై ఊర్లో ఉద్యోగాల్లో స్థిరపడిపోయారు. ఇక ఆయన రెండేళ్ళలో రిటైర్ అవుతారు. ఆయన ఎవరినీ ఏదీ చెయ్యిచాచి అడగలేదు. లంచాలు, రాజకీయాలు, మతాల జోలికి పోలేదు. దాని ఫలితంగా తరుచూ బదిలీలకు గురి అవుతుండేవారు. పదవులలో ఉన్న రాజకీయ నాయకులు చాలామంది ఆయన శిష్యులే. అయినా వారిని ఎప్పుడూ ఏదీ అడగలేదు. ఒకరిద్దరు వచ్చి మీ బదిలీ ఆపేస్తాం, మీకు ప్రమోషన్ వచ్చేలా చేస్తాం అన్నాసరే చిరునవ్వుతో 'అయ్యే బదిలీ అవనీయండి, వచ్చే ప్రమోషన్‌ని దానంతట దాన్ని రానీయండి' అని చెప్పి పంపేసేవారు. స్కూల్లో టీచర్లతో కూడా అతి తక్కువగా మాట్లాడతారు. ఎవరికి ఏ సహాయం కావాల్సి వచ్చినా అడగగానే చేసేవారు. 'బడిపంతులు జీతంతోనే బహు దర్జాగా బ్రతుకుతారు సుమీ!' అని ఆయన్ని ఏళ్ళ తరబడి ఎరిగున్నవాళ్ళు అంటుంటారు.

ఆయన వ్యక్తిత్వమే కాకుండా పేరు కూడా విచిత్రమైనది. భద్రాచలం. ఇంటిపేరు లేదు. ఆయన సర్టిఫికెట్లలో కూడా అలాగే ఉందని సంశయం ఉన్నవాళ్లకి మిగిలిన టీచర్లు చెప్పారు. మీ ఇంటి పేరు అంటే, 'ఇల్లే ఇంకా

కట్టుకోలేదు, అద్దింటికి పేరు ఎలా పెడతాను' అని నవ్వుతూ సమాధానం చెప్పేవారు. ఇక ఆ ప్రశ్న అడగడం మానేసారు. ఊర్లో భద్రాచలం మేష్టారుగా అందరికీ పరిచయం. 'మీరేవిట్లు?' అని అడిగిన వారికి ఆయన కూడా అంతే ఖచ్చితంగా 'గురుకులం' అనేవారు గంభీరంగా. మాటలో స్వచ్ఛత, మొఖంలో వర్ఛస్సు చూసి బ్రాహ్మణులనుకొంటే, ఆయన దేవాలయాలకు వెళ్లినట్లు ఎవరూ చూడలేదు. ఊరిలో చాలామంది బ్రాహ్మణులు వీరిని ఇళ్ళకు పిలవడం కూడా అరుదే. ఎందుకంటే 'మీదే శాఖ?' అని అడిగితే 'గణిత శాఖ' అని సమాధానం ఇచ్చారుట ముక్తసరిగా.

పోతపోసిన విగ్రహంలాంటి శరీరం, తీక్షణమైన చూపు, కవాతు చేసినట్లుండే నడక. ఆయన భార్య ఖమ్మం నుండి వచ్చిందని ఆడవారి ద్వారా తెలుసుకొన్న విషయం. ఇవి అన్నింటి బట్టి ఆయన 'వెలమదొరే' అని నిశ్చయించుకొన్నారు ఆ ఊరి వెలమదొరలు. అదే విషయం ఆయనతో ఎంతో తెలివిగా అంటే 'ప్రజలెప్పుడో దొరల్ని మరిచిపోయారు. ప్రజల్ని మరిచిపోయిన వాళ్ళే ఇప్పుడు దొరలవుతున్నారు. అలాంటి వారితో నన్ను సమానం చెయ్యడం మీకు భావ్యం కాదు' అని మెత్తగా చీవాట్లు పెట్టారు. చిత్తూరు నాయుడుగారు హెడ్ మాస్టర్‌గా ఉన్నప్పుడే ఈయన్ని మాస్టారుగా తీసుకొచ్చారు. నాయుడే అయి ఉంటాడని కొన్నాళ్ళు కొంతమంది వాదించారు. చిత్తూరు నాయుడు గారికి, మీకూ చుట్టరికం ఉందా అని ఆయన కులం కూపీ లాగుదాం అని ప్రయత్నించిన నాయుడు మాస్టారితో 'ఈ స్కూలుని ఎంతో ఆదర్శవంతమైన స్కూలుగా తీర్చిదిద్దిన ఆయనకు కులగజ్జి ఉందని ఊహించడం చాలా తప్పు పని. మీకు గజ్జి ఉంటే మిగిలిన వాళ్ళకి అంటించడం కంటే సరియైన మందు వాడి తగ్గించుకోవడం మంచిదని' మందలించారు. ఆ తరువాత ఆయన కులం గురించి ప్రశ్నలు, చర్చలు ఊర్లో జరగలేదు.

***

భద్రాచలం మాస్టారు ఇంటికి ప్రత్యేకంగా కార్డు పంపారంటే 'ఎవరి అంత్యక్రియలు అయ్యుంటాయి?' "ఆయన భార్యదా?" అన్నాడు పైకే ఆలోచిస్తున్నట్లు.

"నేదునేదు. ఆళ్లింట్లో ఎవరూ సచ్చిపోనేదుట. ఇది చూసిన వెంటనే కవురెట్టి కనుక్కొన్నాను" అంది అతని భార్య. నేను కూడా ఆలోచిస్తున్నాను సుమా అన్న భావం ఉట్టిపడేలా.

"సిత్రంగా ఉందే" అన్నాడు.

"అవును. ఊరందరిని పిలిచారంటే సిత్రమే మరి. ఇట్లా సావుకి పిలుచుకోడం నానెరుగను సుమీ. అయినా దానికింత ఆలోచనేటి పక్కన పడేసి రా తిందువుగాని" అని భోజనానికి పిలిచింది.

కాని భోజనం చేస్తున్నంత సేపు – దాని గురించే ఆలోచించాడు. ఊరందరిని పిలిస్తే తెలుగుదేశం వాళ్ళు, చిరంజీవి పార్టీ వాళ్ళు, చిన్నా చితకా రాజకీయాలు చేసే వాళ్లంతా వస్తారు. వెళ్ళకపోతే మనం లేని లోటు కనిపిస్తుంది అని ఆలోచించి వెళ్ళడానికే నిశ్చయించుకున్నాడు.

***

ఉదయం తొమ్మిది గంటలకి భద్రాచలం మాష్టారింటి ముందు ఏభై అరవైమంది చేరారు. ఇంటి ముందు పాడె ఉంది. పాడె పూర్తి తెల్లటి గుడ్డతో కప్పి ఉంది. మాష్టారు మౌనంగా ఇంటిముందు అరుగు మీద కూర్చొన్నారు.

"మాష్టారూ... ఇంతకీ చనిపోయింది ఎవరు?" అని అడిగాడు అప్పుడే వచ్చిన ఎమ్మెల్యే.

"రావయ్యా రా! నీ కోసమే ఎదురు చూస్తున్నాం. మనందరికి కావలసిన..." అని ఆగి అప్పుడే వచ్చిన హాజి రషీద్‌ని చూసి "నమస్కారం...రండి" అని పిలిచారు. హాజీరషీద్ గారు ప్రతి నమస్కారం చేసి, ఎమ్మెల్యే పార్టీ మనిషి కాబట్టి ఆయనకి కూడా నమస్కారం చేసి ఆయన వెనక నిలబడ్డారు.

"కార్యక్రమం ఏటండి మాష్టారు" అన్నాడు ఎమ్మెల్యే పెద్దరికం వహిస్తూ, అందరిలాగే మౌనంగా ఉంటే తన పెద్దరికం పోతుందేమోనని.

"పాష్టర్ వెంకునాయుడు కూడా రావాలి. ఆయన రాగానే శవయాత్ర మొదలవుతుంది. తూర్పు చెరువు దగ్గర శవదహనం."

"మాష్టారూ... ఇంతకీ చనిపోయింది ఎవరు?" మళ్ళీ అడిగాడు ఎమ్మెల్యే.

"ఎప్పటినుండో మనందరి అవసరాలు తీరుస్తూ తన్ని తాను నిలబెట్టుకోలేక ఇవాళ ఇలా..."

"నమస్కారం మాస్టారు" అప్పుడే వచ్చిన పాస్టర్ వెంకునాయుడి గొంతు విని అతని వైపు తిరిగి నమస్కారం చేసి.

"ఇక బయలుదేరుదామా" అన్నారు ఎమ్మెల్యేని, హాజీని, పాస్టర్ని, ప్రక్కనే నిలబడ్డ మునిసిపల్ కమిషనర్ని చూసి.

అందరూ సరే అని మౌనంగా తలూపారు.

"పాడె ఎత్తండి..." అన్నారు వాళ్ళ నలుగురినీ ఉద్దేశించి.

ఎమ్మెల్యే, హాజీ, పాస్టర్, మునిసిపల్ కమిషనర్ నలుగురూ పాడె ఎత్తారు. పాడె బరువు మరీ ఎక్కువలేదు, అలా అని తక్కువ లేదు. బరువు మొయ్యడం అలవాటు లేకపోయినా సులభంగానే మోయగలం అన్న ధీమా వచ్చింది నలుగురిలో. మాష్టారు ఒక కుండలో దీపం పెట్టి దాన్ని ఉట్టెలో పెట్టి పాడె ముందు నడవసాగేరు.

ఊరిలో ఉన్న వీధులన్నీ తిరిగి తూర్పు చెరువు దగ్గర వైపు వెళుతున్నాం అని చెప్పారు. పాడె కదలగానే ప్రక్కింటి వాళ్ళు పువ్వులు తెచ్చి పాడె మీద వేసారు.

వాళ్ళను చూసి మరో ఇంటి వారు, ఇలా ప్రతి ఇంటి ముందునుండి వెళుతుంటే పువ్వులు వేసి పాడెకి నమస్కారం చేస్తున్నారు. ఒక్కొక్కరు వచ్చి శవయాత్రలో కలిసి నడుస్తున్నారు. తూర్పు చెరువు చేరేసరికి సుమారు ఒక వెయ్యిమంది జనం శవయాత్రలో ఉన్నారు.

తూర్పు చెరువే ఆ ఊరంతటికి పెద్ద చెరువు. కాని ఏళ్ళ తరబడి దానిపై సరైన శ్రద్ధ పెట్టకపోవడం వల్ల గట్టుపడిపోయి చుట్టూ పొదలు పెరిగిపోయాయి. దీనికి తోడుగా ప్రతి ఏడాదీ గణపతి పూజలు జరిపి ఆ బొమ్మలని తెచ్చి ఇక్కడ నిమజ్జనం చెయ్యడంతో చెరువు పూడిపోయింది. గత రెండు మూడేళ్ళుగా ఇళ్ళ

కట్టడాలు ఎక్కువై పాత ఇళ్ల రద్దు కూడా ఇక్కడే పారపోయడంతో చెరువులో నీరు మరింత తగ్గింది. తూర్పు వైపున మాత్రమే కొన్ని నీళ్ళున్నాయి.

ఊరు పెరిగిపోవడం వల్ల, ఊర్లో ఖాళీజాగా తగ్గిపోవడం వల్ల చెరువు చెరువులా కాక ఖాళీ నేలలా అనిపించడం మొదలుపెట్టింది.

కొత్త కమిషనర్ రావడం, ఎమ్మెల్యే కొత్తగా ఎన్నిక అవ్వడం ఒక్కసారే జరిగాయి. ఇద్దరూ కలిసి తీసుకొన్న నిర్ణయం వల్ల ఆ ఊరి చెత్తంతా చెరువు గట్టు మీద పొయ్యడం మొదలుపెట్టారు. ఊరి చెత్తేకాక లారీల చెత్త, బేటరీలు, ఇనుప సామాన్లు, హాస్పిటల్ చెత్తతో సహా అన్ని రకాల చెత్తను తూర్పు చెరువు దాకా తెచ్చి పోస్తున్నారు. రోజురోజుకి నీరు తగ్గిపోయి నేల పెరిగిపోతోంది.

మాష్టారు పాడెని దింపమన్నారు.

"ఇక్కడెందుకండి, ప్రక్కనే ఉన్న శ్మశానానికి తీసుకెళ్ళాలిగా" అన్నారు ఎమ్మెల్యే.

"కాదు. ఈ శవదహనం ఇక్కడే జరగాలి"

"ఇక్కడెలా చేస్తారు. ఇది శ్మశానం కాదు కదా" అన్నారు అందరూ.

"శవం ఇక్కడే ఉంది కాబట్టి" అన్నారు భద్రాచలం గారు గట్టిగా అందరికి వినబడేలా!

"శవం పాడె మీద ఉంది కదండి. పాడెతో శవాన్ని శ్మశానానికి తీసికెళ్ళిపోతే సరిపోతుంది" అని హాజీ ఎమ్మెల్యేకి వత్తాసు పలికాడు.

"మీది ఏ కులమో, మతమో చెప్పలేదు. మాకు తెలియదు. మీరంటే మాకు గౌరవం ఉంది. మీకు హిందూ శ్మశానం మీద నమ్మకం లేకపోతే, మా చర్చి శ్మశానంలో ఖననానికి జాగా ఇస్తాను మాష్టారు" అన్నాడు పాస్టరు.

మాష్టారు పేరు భద్రాచలం కాబట్టి, ఆయన ఆ ఊరి నుండి వచ్చిన వాడేమో. ఊరిపేరు తన పేరుగా పెట్టుకున్నాడేమో. అసలు హిందువు కాదేమో, అందుకే హిందూ శ్మశానానికి వెళ్లలేదు అని చాలామందికి అనుమానం వచ్చింది.

"మా మతంలో మీరు చేరుతానంటే, ఇప్పుడే ఖాజీని పిలిపించి కావలసిన ఏర్పాట్లు చేస్తాను. మసీదు పక్క ఖబర్ స్థాన్‌లో మీ కుటుంబానికి కూడా జాగా ఏర్పాటు చేస్తాను" అన్నాడు హాజీ.

"నామీద మీకున్న అభిమానానికి నేను ఆనందించే స్థితిలో లేను. కృతజ్ఞతలు. కాని మనం అందరం కలిసి ఏర్పాటు చేసిన 'ఈ శ్మశానం'లోనే శవ దహనం జరగాలి" మరింత గంభీరంగా, గట్టిగా అన్నారు భద్రాచలం గారు. కొద్దిగా మిగిలి ఉన్న నీటిని చూపిస్తూ పాడె దింపమని ఆదేశించారు.

అప్పటిదాకా మొయ్యడం వల్ల మోచేతులు అప్పుడే నొప్పి పెట్టడం మొదలవ్వడంతో పాడె మోస్తున్న నలుగురు పాడె దింపారు. భద్రాచలం మాస్టారు కూడా చేతిలో దీపంతో ఉన్న కుండ పాడె ముందు పెట్టారు. పాడె మీద ఉన్న తెల్లబట్ట ఒక చేత్తో తీసారు.

పాడె చుట్టూ ఉన్నవాళ్ళు ఆశ్చర్యపోయారు. పాడెమీద శవం లేదు.

'శవం లేదు', 'శవం లేదు' అన్న ఆశ్చర్యంతో కూడిన గుసగుసలు పాడె కనిపించని వాళ్ళకు కూడా చేరాయి. ఇంతలో ఎవరో తీసుకొచ్చిన మైక్‌లో మాష్టారు మాట్లాడడం మొదలుపెట్టారు.

"నా దు:ఖాన్ని పంచుకునేందుకు వచ్చిన మీ అందరికి నా కృతజ్ఞతలు. ఈ దు:ఖం మనందరిది. ఎందుకంటే ఇప్పుడు చనిపోయింది ఎవరో కాదు మన ఊరి నీరు" అన్నారు మాష్టారు. గుసగుసలు ఆగిపోయాయి. నిశ్శబ్దం.

"అవును మన ఊరి నీరు చనిపోయింది. ఇక్కడ నీరు చనిపోయింది. మా ఇంటి నూతి నీరు చనిపోయి చాలా కాలం అయింది. అందులోని మట్టే ఈ పాడెమీద తల ఆకారంలో ఉన్న మట్టి ముద్ద. మా వీధి బోర్‌వెల్ ఎండిపోయింది. విరిగిపోయిన బోర్‌వెల్ భాగాలే ఈ పాడెమీద ఉన్న శవం మొండెం. ఆ తరువాత మున్సిపల్ పైప్‌లు వచ్చాయి. అవి కూడా తాగడానికి ఉపయోగపడే నీరు ఇవ్వలేక ఖాళీ గొట్టాలుగా మిగిలిపోయాయి. అవే ఈ పాడెమీద ఉన్న శవం చేతులు, కాళ్ళు. గత ఏడాదిగా మనందరి నిర్లక్ష్యం వల్ల,

స్వార్థపరుల దురాశ వల్ల, ఈ అధికారుల స్వార్థపూరిత మూర్ఖత్వం వల్ల ఈ చెరువు, మన ఊరి ఆఖరి మంచినీటి వసతి చచ్చిపోయింది...” అన్నారు మాస్టారు.

నిశ్శబ్దం.

“అందుకే మనందరం పక్క ఊరి ఫ్యాక్టరీలో తయారయ్యే మంచినీరు కొనుక్కొంటున్నాం. ఈ ఊరి చెరువు నీరు చనిపోయిందంటే మీరు నమ్మలేదు, కానీ చూడండి” అని పాడె మీదుగా దీపం ఉన్న కుండని నీళ్ళల్లో విసిరారు.

నీళ్ళల్లో పడ్డ దీపం ఆరిపోకుండా భగ్గుమని మండింది. నీరంటుకుంది. నీరు కాలుతోంది. నీరు శవంలా కాలుతున్నది. నీటితో పాటు ఉన్న చెత్తా చెదారం కూడా అంటుకొని కాలి కమురు వాసన వస్తున్నది. పొగ గాలిలోకి లేస్తున్నది.

ఆ ఊరి చెరువు చచ్చిపోయిందన్నది అప్పుడు అందరికీ అర్థం అయింది.

కాలుతున్న నీరుని చూసి అందరూ చలించిపోయారు. కాలుతున్న చెరువుని చూసి అవాక్కయ్యారు. ఈ చెరువుకి జరిగే దహన సంస్కార దృశ్యం ఈ దేశంలోని ప్రతి ఊరిలో, ప్రతి పల్లెలో జరుగుతున్న నేటి నీటి హత్యని ప్రతిబింబిస్తున్నది.

మనుషులు ఒక్కొక్కరే కన్నీళ్లతో.. నడుస్తున్న శవాల్లా తిరిగి ఊళ్లోకి వస్తున్నారు.

*

**గురువుగా చెరగని ముద్రవేసిన నా రెండవ తరగతి గురువు శ్రీ భద్రాచలం గారికి నమస్కరిస్తూ...**

# తలుపుల రసీదు

**బొ**బ్బిలిలో యూనివర్సిటీ పెట్టే విషయంలో పెద్ద గొడవ జరిగింది. గొడవ బొబ్బిలి వాళ్ళకి, విజయనగరం వాళ్ళకి కాదు. బొబ్బిల్లో ఉన్న బొబ్బిలి వాళ్ళ మధ్యే. యూనివర్సిటీ పేరు పెట్టడంలో పేచీ వచ్చింది. కొందరు వీరబొబ్బిలి యూనివర్సిటీ అనాలని, "కాదహే... రెండొందల ఏభైమంది ఇక్కడ మిగలకుండా చచ్చిపోతే ఈరత్వం ఏడుంటుంది?" అని ప్రశ్నించి "ఉప్పుడు మనం అంతా కేవీస్ కాబట్టి, విబిఎల్ కాదు కెవిబిల్ ఊనివర్సిటీ అని పేరు పెట్టాలి". ఇదీ గొడవ. కేవి అని పెడితే కులం తీసుకొచ్చినట్లవుతుందని కొందరు వాదించారు. యూనివర్సిటీ అత్యున్నత అధికారులను కులపతి, ఉపకులపతి అని అంటారు కదా అని వెంటనే మరొకరన్నారు. కులపతి అంటే ఛాన్సలర్, ఉపకులపతి అంటే వైస్ ఛాన్సలర్ అని బోధపరచి ఎలాగో ఒకలాగా అందరినీ ఒక కొలిక్కి తీసుకొచ్చాను.

బోస్టన్ యూనివర్సిటీని బియు అంటారు. బ్రౌన్ యూనివర్సిటి ఉంది. బర్మింగ్‌హామ్ యూనివర్సిటీ ఉంది. ఇలా 'బి'తో మొదలయ్యే యూనివర్సిటీలు చాలా ఉన్నాయి. మనం కూడా బొబ్బిలి యూనివర్సిటి అని పేరు పెడితే బియు ఆఫ్ ఇండియా అంటారు. వాళ్ళంతా మనతో కలిసి బొబ్బిలి యూనివర్సిటీని అభివృద్ధి చేస్తారు అని రాత్రి పగలు కష్టపడి అందరిని 'బొబ్బిలి యూనివర్సిటీ' పేరుకు ఒప్పించాను.

అందరినీ ఒప్పించాను కాబట్టి, వాళ్ళతో కలిసి పనిచేసి బొబ్బిలి యూనివర్సిటీని నాలుగు డిగ్రీలు ఇచ్చి పదిమందికీ పనికి వచ్చేలా రూపకల్పన చెయ్యమన్నారు.

దేశంలో ఇప్పటికి ఉన్నవాటికంటే ఐదురెట్ల సంఖ్యలో యూనివర్సిటీలు కావాలని అందరూ అంటున్నారు. కాని వాటిని నడపడానికి, పాఠాలు చెప్పడానికి, మంచి రిసెర్చి చెయ్యడానికి కావల్సినంత మంది లేరు. ఇంజినీరింగ్ కాలేజీలకే దిక్కు లేకపోతోంది. మరి యూనివర్సిటీ అంటే మాటలా.

మీరు ఇక్కడ ఉండి ముఖ్యమైన వాళ్ళని ఉద్యోగాల్లోకి తీసుకోండి, అప్పుడు కానీ మీరు వెళ్ళకండి అన్నారు.

'బొబ్బిలి యూనివర్సిటి నడపడానికి ఫలానా అర్హతలుగల ఫలానా ఉద్యోగాలకి కావలెను' అని వివరంగా ప్రపంచవ్యాప్తంగా నెట్ ప్రకటన ఇచ్చాం. వచ్చిన వాళ్ళకి ఇవాళ ఇంటర్వ్యూలు చేస్తున్నాం. ఇప్పటికే ఓ ఇరవై మందిని ఎడ్మినిస్ట్రేషన్‌లో ఒక ముఖ్యమైన ఉద్యోగానికి ఇంటర్వ్యూ చేసాం. దేశదేశాల నుండి వచ్చిన తెలుగు వాళ్ళున్నారు. ఇంకా మరో పదిమందిని ఇంటర్వ్యూ చెయ్యాలి. ఒక పది నిముషాలు విరామం తరువాత మొదలుపెడదాం అను కున్నాం.

నేను ఎలక్ట్రానిక్ పేపరు రెండు చేతుల మధ్య పట్టుకొని చదువుతున్నాను. 'ఈ పేపరు' పూర్వం పేపరు చదివినట్లే విప్పి రెండు చేతులతో పట్టుకొని చదువుకోవచ్చు. పూర్వం లాప్‌టాప్ లాంటి స్క్రీన్‌లో చక్కగా అన్ని రంగులు అచ్చం కాగితం మీద కనిపించినట్లు కనిపిస్తాయి. శాటిలైట్ ద్వారా వచ్చే సంకేతాలతో మొత్తం పేపరంతా చదవొచ్చు. ఈ పరికరంలో ఏ పేపర్ కావాలంటే ఆ పేపరు, ఇంగ్లీషు, తెలుగు, ఏ భాష కావాలంటే ఆ భాషలో చదవొచ్చు. తెలుగు పేపరుని ఇంగ్లీషులో, ఫ్రెంచి పేపరుని తెలుగులో కూడా చదవొచ్చు. అంతా గూగుల్ టెక్నాలజీ మహిమ.

సరిగ్గా అలాంటప్పుడు 'మే ఐ కమిన్... నేను రావచ్చా?' అని రెండు భాషలలో అంటూ పొడవైన ఒక అభ్యర్థి లోపలికి వచ్చాడు. అంటే విరామ సమయం అయిపోయిందన్న మాట. ఈ పేపర్‌ని చుట్టి జేబులో పెన్నులా పెట్టుకొంటూ! 'ఇతన్ని ఎక్కడో చూసాను సుమా' అనుకొన్నాను. అచ్చం మా కనకప్రసాద్ లాంటి మొహం. కళ్ళద్దాలు కూడ అలాగే అనిపించాయి. వయస్సు 55 దాటి ఉంటుంది. ఈ రోజుల్లో కుర్రాళ్ళు ఎవరూ కళ్లద్దాలు పెట్టుకోవడం లేదు. కళ్లకి కావలసిన సర్జరీలు చేయించేసుకొంటున్నారు. ఇదుగో ఇలా ఏభైలు దాటిన వాళ్ళే అలవాటు కొద్ది కళ్లజోళ్ళు పెట్టుకొంటున్నారు.

"మీ పేరు" అని అడిగాను.

"తలుపుల రసీదు" అన్నాడు తెలుగు కొత్తగా నేర్చుకున్నవాడిలా.

"తలుపుల ఇంటి పేరు అయ్యుండాలి రైట్ అన్నాను" నవ్వుతూ.

"అవునండి మాదికూడా బొబ్బిలే" అదో క్వాలిఫికేషన్‌లా అన్నాడు.

"కాని ఈ రసీదు అన్న పేరే ఆశ్చర్యంగా...."

"నా అసలు పేరు రషీద్ అండీ. చాలామంది సరిగ్గా పిలవలేక చివరికి రసీద్, రసీదు అయిపోయిందండి" అన్నాడు కొద్దిగా సిగ్గుపడుతూ.

"సరే, మీరేం చదువుకొన్నారు..." అని బటన్ నొక్కి నా అరచేతిలో ఉన్న గూగుల్ ఆర్గనైజర్‌లో అతని పేరుతో ఉన్న బయోడేటా కోసం వెతుక్కున్నాను. దొరికింది కానీ, ఎక్కడా డిగ్రీ కనిపించలేదు. మిస్సయ్యేనేమోనని మరొకసారి చూసాను. లేదు. 'మీకు ఏ డిగ్రీ లేదా?' అన్నాను ఆశ్చర్యంగా.

"లేదండి..." అన్నాడు వినయంగా.

"మరి ఇంటర్వ్యూలోకి ఎవరు రానిచ్చారు?" అని గట్టిగా అరిచాడు ఇంటర్వ్యూ కమిటీలో మరో సభ్యుడు.

"నన్ను పిలవలేదండి. కానీ ఉద్యోగం తప్పక ఇస్తారన్న ఆశతో నా అంతట నేనే లోపలికి తలుపు తీసుకొచ్చానండి" అని ఓ క్షణం ఆగి "క్షమించండి" అన్నాడు.

"క్షమించాం, వెళ్లండి. పెద్ద పెద్ద క్వాలిఫికేషన్లతో ఎంతోమంది బయట వెయిట్ చేస్తున్నారు" అన్నాను చిరాగ్గా.

"నా బేక్‌గ్రౌండ్..."

"రిజర్వేషన్లంటే లాభం లేదండి. రిజర్వేషన్‌లు పోయి చాలా ఏళ్ళు అయింది. మీరు ముస్లిం అయినా, మరేదయినా నో యూజ్" అన్నాను వెళ్ళమని చెయ్యి చూపిస్తూ.

"నా ఎక్స్పీరియన్స్........"

"ఏంటి మీ ఎక్స్పీరియన్స్...." ఒక కమిటీ సభ్యుడు మర్యాదగా అడిగాడు.

"అమెరికాలో...."

"అమెరికాలో ఎక్స్పీరియన్స్... ఎవడికి కావాలండి...." అన్నాడు ఇంకో కమిటీ మెంబరు.

"అమెరికాలో నేను ఒక పెద్ద సంస్థ నడిపానండి." అన్నాడు ఒక పెద్ద ఫైల్ తీసి టేబుల్‌మీద పెడుతూ.

"ఆ సంస్థ ఏం చేసేది?"

"కంప్యూటర్ల ఆపరేటింగ్ సిస్టమ్స్...ప్రోగ్రామ్‌లు...."

"సరే మరి, అవన్నీ మీరు మాకు పంపారా?"

"పంపానండి"

"మరి మా గూగుల్ ఫోన్ ఆర్గనైజర్ డేటాబేస్‌లో లేవే" అన్నాం అందరం గబగబ మరోసారి వెతికి.

"బహుశా ఫార్మెట్ ప్రాబ్లమ్ అయ్యుంటుందండి... నేను మైక్రోసాఫ్ట్ ఆఫీస్ 2010లో పంపానండి."

"అలా చెప్పండి. గత పదేళ్ళుగా ప్రపంచం గూగుల్ డాక్స్‌లోనే ఉంటే మీరు ఇంకా ఎప్పుడో పాత మైక్రోసాఫ్ట్ పట్టుకుని వేలాడితే ఎలా?" అతను

చెపుతున్న ప్రతి మాటని నేను గూగుల్ 'బ్రెయిన్'లోకి పంపుతున్నాను. కంప్యూటర్‌లు పోయి లేప్‌టాప్‌లు, లేప్‌టాప్‌లు పోయి గూగుల్ బ్రెయిన్‌లు వచ్చేసాయి. నానో టెక్నాలజీ, బయోమెటీరియల్ సైన్స్‌లు బాగా డెవలప్ అయి టెరాబైట్ కంప్యూటర్‌లు చిన్న క్రెడిట్ కార్డు సైజులో దిగిపోయాయి. దాన్ని కూడా అతి పల్చగా తయారు చేస్తున్నారు. దాన్ని విడిగా పట్టుకొని తిరగడం కష్టం కాబట్టి, కావాలనుకొన్న కొంతమంది తల పైభాగంలో ఓ చిన్న సర్జరీతో అమరుస్తారు. దానిని మనుషులు ఆలోచనతో నడుపుతారు. ఆలోచన తీరు, జోరు, ఆ గూగుల్ బ్రెయిన్ కనిపెట్టి అడిగిన వివరాలను అందిస్తుంది. దానికి కావలసిన విషయాలు ఇంటర్‌నెట్ నుండి అపారమైన విజ్ఞానాన్ని, విశేషాలని, వివరాలని పుస్తకాల ద్వారా నానో సెకన్లలో తీసుకొంటుంది. మౌఖికం పోయి తాళపత్రాలు, తాళపత్రాలు పోయి అచ్చుపుస్తకాలు, అచ్చుపుస్తకాలు పోయి కంప్యూటర్లు, కంప్యూటర్లు పోయి గూగుల్ బ్రెయిన్ వచ్చేసింది.

సాధారణంగా మాలాంటి వాళ్ళంతా గూగుల్ బ్రైన్‌తో పని చేస్తున్నాం. అప్పుడప్పుడు మాత్రమే స్వంత బ్రెయిన్ వాడేది. అది కూడా ఏదో ప్రేమగా కబుర్లు చెప్పడానికి మాత్రమే. అనుభూతులు ఇంకా గూగుల్ బ్రెయిన్ పరిధిలోకి రాలేదు, అనుభవాలని మాత్రమే దాస్తున్నది.

మిగిలిన కమిటీ సభ్యులు అతనిని రకరకాల ప్రశ్నలు అడుగుతున్నారు. అతను తాపీగా సమాధానాలు చెప్తున్నాడు. నేను కళ్ళు మూసుకొని అతని సమాధానాలని నా గూగుల్ బ్రెయిన్‌లోకి పంపుతున్నాను. గూగుల్ బ్రెయిన్ ఈ సమాధానాలన్నింటినీ శోధించి అతని గురించిన అసలు వివరాలను ఇమ్మని ఆజ్ఞ ఇచ్చాను. అది ఇచ్చిన సమాధానం విని ఆశ్చర్యంతో లేచి నిలుచున్నాను. నోట మాట రాలేదు. ఏమైందో తెలియక నాతోపాటే అందరూ నిలుచున్నారు. నేను కొద్దిసేపటికి తేరుకొని –

"మీరు బిల్ గేట్సా?" అన్నాను, ఒక్కొక్క అక్షరం వత్తి పలుకుతూ.

"అవును. చిన్నప్పుడే అమెరికా వెళ్ళిపోయాను, మా కుటుంబంతో అసలు పేరు మీద మమకారంతో తలుపుల రసీదు పేరుని బిల్ గేట్స్‌గా మార్చుకొన్నాను, అన్నాడు చిర్నవ్వుతో!"

*

**అక్షరాలతో ఆటలాడుకోవడం అలవాటు నేర్పిన**

**గురువులాంటి స్నేహితుడు**

**డా॥ పెద్దపల్లి అప్పారావుకి నమస్కరిస్తూ...**

# అస్తిత్వం

**స్వీ**డన్ ముఖ్యపట్నం అయిన స్టాక్‌హోమ్ 14 ద్వీపాల నగరం. వాటిలో గమ్లస్టేషన్ ఒక పురాతనమైన ద్వీపం. స్టోర్కిరస్ కారోనేషన్ చర్చికి తూర్పువైపు వున్న సన్నటి వీధిలో ఒక ఎర్ర రంగు ఇల్లు ఉంది. అది సాధారణ స్వీడిష్ మధ్య తరగతి జీవనానికి ప్రతీక. ఆ ఇంటి పెద్ద పెద్ద కిటికీల నుండి శీతాకాలపు ఎండ గదిలో పడుతోంది. ఆ వెలుగుకు గదిలో ఉన్న ఆకుపచ్చని తివాచీ మెరుస్తోంది. ఆ వెలుగులో ఓ చిన్న కుర్రాడు ఆడుకుంటున్నాడు. ఆ కుర్రాడికి ప్రపంచం గురించి తెలిసింది చాలా తక్కువ. తాను చిన్నవాడినని, తాను పెద్దవాడిని అవుతానని తెలుసు. కాని పుట్టుక గురించి కానీ, చావు గురించి కానీ తెలియదు. తనకి నాలుగు సంవత్సరాలని, త్వరలో ఐదు సంవత్సరాలు వస్తాయని తెలుసు. కానీ 'సంవత్సరం' అంటే ఏమిటో తెలియదు. ఆ కుర్రాడి కాలంలో మూడురోజులు ఉన్నాయి– నిన్న, నేడు, రేపు.

"నాన్నా" ఆడుతూ పాడుతూ మధ్యలో పిలిచాడు. తండ్రి అప్పుడే ఉదయపు ఫలహారం తిని, చుట్ట ముట్టించాడు. ఆ రోజు అతనికి అది మొదటి చుట్ట. అతను కాలాన్ని కాల్చిన చుట్టలతో కొలుస్తాడు.

"నిన్న రాత్రి బోల్డు కలలొచ్చాయి నాకు. అన్ని కలల్లో ఈ గది, ఈ గదిలో కుర్చీలు, ఆకుపచ్చని తివాచీ, అద్దాలు, కిటికీలు, గోడ గడియారం, గది తలుపులు, అలమార..." అలా అంటున్నవాడు మాటలాపి, కిటికీ దగ్గరికి వెళ్ళి

పిల్లి మొగ్గలు వెయ్యడం మొదలుపెట్టాడు ఆనందంగా. ఆడుకోడానికి హాయిగా అనిపించే ఆ జాగా ఆ కుర్రాడికి చాలా ఇష్టం.

"ఆహా..." అన్నాడు తండ్రి, తన వార్తాపత్రిక అంచునుండి కులాసాగా కొడుకువైపు ఆప్యాయంగా ఒకచూపు చూసి. ఆ కుర్రాడు తండ్రివైపు తిరిగి హాయిగా నవ్వాడు.

నవ్వు ఇంకా సహజమైన ఆనందాన్ని మాత్రమే తెలిపే వయసు ఆ కుర్రాడిది. క్రిందటి రోజు కిటికీ దగ్గర నిలబడి చంద్రుణ్ణి చూసి ఇలాగే నవ్వాడు. చంద్రుడు వింతగా ఉన్నాడని కాదు, వెలుగు విరజిమ్మే చంద్రబింబం ఆనందాన్ని కలిగించడం వల్ల.

"అన్నింటికంటే ఈ బొమ్మ ఎన్నోసార్లు కలలో కనిపించింది" అన్నాడు, నవ్వడం అయిపోగానే, మోకాళ్ళమీద లేచి, గోడమీద ఉన్న చిత్రంవైపు వేలు చూపించి.

ఆ చిత్రం ఒక ప్రముఖ డచ్ చిత్రకారుడు వేసిన చిత్రానికి ఫోటో అనుకరణ. దాని పేరు 'కాలిపోతున్న ఊరు.'

"ఆహా, దాని గురించి ఏం కలొచ్చింది?" తండ్రి అడిగాడు.

"నాకు తెలియదు"

"ఉహూ, గుర్తు తెచ్చుకోడానికి ప్రయత్నించు"

"ఉ... మంటలున్నాయి. నేనో కుక్కపిల్లని ముట్టుకున్నానుట"

"కానీ నీకు కుక్కలంటే భయం కదూ..."

"అవును, కానీ బొమ్మలో ఉన్న కుక్కపిల్లని కొంచెం ముట్టుకోగలను"

అలా అని తనలో తాను నవ్వుకుంటూ, గెంతుతూ గదంతా తిరుగుతున్నాడు.

అలా తిరుగుతూ తండ్రి దగ్గరికి వచ్చి, ఆగి, "నాన్నా ఆ బొమ్మ గోడమీద నుండి దించు. నిన్న చూపించావుగా అలా ఆ బొమ్మ మళ్ళీ చూపించవా?"

ఆ చిత్రం ఆ గదిలోకి కొత్తగా నిన్ననే వచ్చింది. అంతకు ముందున్న చుట్టాల ఫోటోలన్నీ ఆ కుర్రాడికి బాగా పరిచయం ఉన్నవే. వాటికంటే 'కాలిపోతున్న ఊరు' చిత్రం చాలా విశేషాలతో, జీవం ఉట్టిపడుతూ, ఆకర్షణీయంగా ఉంది. కుర్రాడు అడిగినట్లే తండ్రి ఆ చిత్రాన్ని క్రిందికి దించి కొడుకుతో కలిసి చూస్తున్నాడు.

నదీ ముఖద్వారం సముద్రంలో కలిసే ప్రదేశం నిండా చాలా పడవలు, లాంచీలు ఉన్నాయి. అందంగా వంపు తిరిగి ఉన్న వంతెన, రెండు ప్రక్కల బురుజులు; ఎడమ ఒడ్డున ఒక కాలిపోతున్న ఊరు, చిన్న చిన్న ఇళ్ల వరుసలు, కొన్ని ఇళ్ళ మీద పొట్టి, మరికొన్నింటిమీద పొడవైన పైకప్పులు; మంటలు, వాటి జ్వాలలు గాలిలో ఆకాశం వైపు ఎగురుతూ, వాటిని ఆవరిస్తూ సుళ్ళు తిరుగుతున్న దట్టమైన పొగ మేఘాలు; గోడలకి వేయబడి ఉన్న నిచ్చెనలు, వాలిపోతున్న గుర్రపు బళ్ళు, మంటల నుండి ప్రాణరక్షణకై వంతెనవైపు పరుగెడుతున్న మనుషులు; రేవు గట్టున పీపాలు, సంచులు, రకరకాల కలప; నీటిలో మనుషులు ఎక్కువై మునిగిపోబోతున్న పడవ; వంతెన ముందు ఒకదాన్ని మరొకటి వాసన చూస్తున్న కుక్క పిల్లలు; వంతెనకి అవతలివైపు నదీ ముఖం విశాలమైన సముద్రాన్ని కలిసేచోట, ఎక్కడో ఎత్తులో క్షితిజానికి అతి దగ్గర అనిపించే లాంటి ప్రదేశంలో, ఒక పలుచని పొగ మేఘం వెనుక కాలిపోతున్న ఊరిని, అక్కడి వేదనని చూస్తూ కళ తప్పి, వెలుగులు విరజిమ్మలేని చంద్రుడు.

"నాన్నా, ఈ ఊరెందుకు కాలిపోతోంది?"

"ఎవరో నిప్పుతో అజాగ్రత్తగా ఉండడం వల్ల"

"ఎవరు?"

"ఊ... ఎవరన్నది చెప్పలేం, చాలాకాలం అయిపోయింది కదా"

"ఎంతకాలం అయింది?"

"కొన్ని వందల ఏళ్ళు అయి ఉంటుంది"

ఆ కుర్రాడికి ఈ సమాధానం కొత్తగా ఏమీ తెలియపరచలేదు. ఈ విషయం ఆ తండ్రికి కూడా తెలుసు. కానీ ఏదో ఒక సమాధానం చెప్పాలని చెప్పాడు. నిశ్శబ్దంగా తనలో తాను ఆలోచించుకుంటూ కూర్చున్నాడు ఆ కుర్రాడు కొద్దిసేపు. కొత్త కొత్త ఆలోచనలు, రకరకాల భావాలు పాతవాటి చుట్టూ తిరుగుతూ, రాసుకుంటూ, తోసుకుంటూ, తనకో నిర్దిష్టమైన స్థానం కల్పించుకుంటూ ఆ కుర్రాడి మెదడులో తిరుగుతున్నాయి.

"సరే, కానీ ఈ ఊరు నిన్న కాలిపోతున్నది, ఇవాళ కూడా కాలిపోతున్నది? అవునా?" అని అన్నాడు ఆ చిత్రం వైపు వేలు పెట్టి చూపిస్తూ,

"ఇది నిజమైన ఊరు కాదు, ఇది ఉత్తి బొమ్మే. నిజమైన ఊరు కాలిపోయి చాలా కాలం అయింది. చాలా చాలా కాలం క్రిందట కాలిపోయింది. అది ఇప్పుడు లేదు. అక్కడ పరిగెడుతున్న మనుషులు లేరు. వాళ్లంతా చనిపోయారు. ఇప్పుడు లేరు. ఆ ఇళ్లన్నీ కాలిపోయాయి. గంటల గోపురాలు పడిపోయాయి. ఆ వంతెన కూడా పోయింది."

"ఈ గంటల గోపురాలు కాలి పడిపోయాయా? విరిగి పడిపోయాయా?"

"అవి కాలి, విరిగి పడిపోయాయి"

"ఈ స్టీమర్ల వాళ్ళు కూడా చచ్చిపోయారా?"

"అవును. కానీ అవి స్టీమర్లు కావు, పడవలు. అప్పుడు స్టీమర్లు లేవు."

కింద పెదవి విరిచి, నిశ్శబ్దంగా తనలో తాను ఆలోచించుకుంటూ, విచారంగా కూర్చొన్నాడు ఆ కుర్రాడు కొద్దిసేపు.

"కానీ నాకు స్టీమర్లు కనిపిస్తున్నాయి నాన్నా, ఈ స్టీమర్ పేరేంటి?"

ఆ కుర్రాడి బుద్ధికి ఎంత తోస్తే అంతే. వాడి తండ్రి వాడి ప్రశ్నలకి జవాబులు చెప్పి చెప్పి, ఇక చెప్పలేక విసిగిపోయాడు. కుర్రాడు ఆ బొమ్మలో ఉన్న డచ్ వ్యాపార పడవలపై వేలుపెట్టి చూపిస్తూ, ఇది బార్జ్, ఇది హిల్లరో, ఇది ప్రిన్స్ ఇంగర్బోగ్ అని తనలో తాను మాట్లాడుకుంటున్నాడు.

"నాన్నా ఈ చంద్రుడు కూడా పోయాడా?"

"లేదు, ఆ చంద్రుడు ఇంకా ఉన్నాడు. ఈ బొమ్మ అంతటికీ ఈ చంద్రుడొక్కడే ఇంకా ఉన్నాడు. ఇదే చంద్రుణ్ణి నిన్న నువ్వు ఈ కిటికీలోంచి చూసావు" అన్నాడు ఆ తండ్రి కొత్త ఉత్సాహంతో.

మళ్ళీ ఆ కుర్రాడు నిశ్శబ్దంగా తనలో తాను ఆలోచించుకుంటూ కూర్చున్నాడు కొద్దిసేపు. అప్పుడు మరో ప్రశ్న వచ్చింది.

"నాన్నా, ఈ ఊరు కాలిపోయి చాలా కాలం అయిందా? మనం అంతా కలసి ప్రిన్స్ ఇంగర్బోగ్ స్టీమర్లో తాతగారి ఇంటికి వెళ్ళిన దానికంటే ముందా?"

"అవును, ఇంకా, ఇంకా ముందు, ఆ ఊరు కాలిపోతున్నప్పుడు నువ్వు, నేను, మీ అమ్మ, అమ్మమ్మ ఎవ్వరం లేము."

ఆ కుర్రాడి మొహం ఉన్నట్టుండి గంభీరంగా మారిపోయింది. చాలా విచారంగా ఉన్నాడు.

మళ్ళీ ఆ కుర్రాడు నిశ్శబ్దంగా తనలో తాను ఆలోచించుకుంటూ కూర్చొన్నాడు కొద్దిసేపు. రకరకాల ప్రశ్నలు, ఆలోచనలు వస్తూ పోతున్నాయి. వాటిని ఒక పద్ధతిలో పెట్టలేకపోతున్నాడు.

"నాన్నా ఈ ఊరు కాలిపోతున్నప్పుడు, నేను నువ్వు లేనే లేమా?"

కింద పెదవి విరిచి, నిశ్శబ్దంగా ఉన్న ఆ కుర్రాడి మొహం 'ఇది నేను ఒప్పుకోను' అన్నట్లుంది.

"కానీ నేనెక్కడున్నాను అప్పుడు?" అని అడిగాడు గట్టిగా

"నువ్వసలు లేనే లేవు" అన్నాడు తండ్రి.

ఆ కుర్రాడు తన కళ్ళు విశాలం చేసుకుని తండ్రిని చూసాడు. తన తండ్రి తనని ఆటపట్టించడానికి ఇలా అంటున్నాడని తోచింది. తనని ఆడించే ఆడపిల్లలు కూడా అప్పుడప్పుడు ఇలాగే నమ్మలేని కబుర్లు చెప్పి, నవ్వించి, తరవాత అది నిజం కాదు అంటారు. తండ్రి కూడా ఇప్పుడు అదే చేస్తున్నాడు.

లేకపోతే తను అప్పుడు లేకుండా ఇప్పుడు ఎలా వచ్చాడు. ఇప్పుడుంటే అప్పుడు లేకపోవడం ఏమిటి?

ఒక రాత్రివేళ మెలుకువ వస్తే చుట్టూ చీకటి నాకు ఎలా కనిపిస్తుంది? అందుకే నేనున్నట్టే. ఒక్కసారి ఆ చిత్రం నుండి, తండ్రి నుండి దూరంగా జరిగి కిటికీలోంచి గదిలో ఆకుపచ్చని తివాచీపై పడుతున్న సూర్యకాంతిలో గెంతుతూ, గొంతెత్తి ఆనందంతో, ప్రపంచం అంతటికి తెలియచెప్పాలన్న ఉత్సాహంతో...

"నేనున్నాను, నేనున్నాను, నిజం, నేనున్నాను" అన్నాడు.

*

ఆత్మపరంగా ఆలోచిస్తే ఆ పిల్లాడి ఆలోచన నిజమే అని అనిపిస్తుంది. జన్యుశాస్త్రపరంగా ఆలోచించినా డిఎన్ఎ (జన్యు పదార్థం) అనువంశికత ఆధారంగా చూస్తే పరిణామక్రమంలో 'జీవం' వందల కోట్ల సంవత్సరాలు పైగా ఎడతెగని భౌతిక అభౌతిక అవిభాజ్య సంబంధం కలిగి ఉంది. తర్కానికి కూడా నిలిచే పిల్లాడి ఆలోచన నిజమే అని అనిపిస్తుంది.

ఆత్మ నిత్యత్వం గురించి కానీ, జీవశాస్త్రపరంగా జన్యుపదార్థం గురించి కానీ – ఏమీ తెలియని ఆ పిల్లవాడికి తన అస్తిత్వంపై అంత ప్రగాఢమైన నమ్మకం ఎలా కలిగింది? పుట్టిన ప్రతి జీవికి తన అస్తిత్వంపై అంతటి నమ్మకం ఉండడమే ఈ మానవజాతి మనుగడకి మూలాధారమా?

**పాశ్చాత్య విజ్ఞానం, ఆలోచనలు, జీవనానికి**
**తొలితెర తెరిచిన ప్రథమ పాశ్చాత్య గురువు**
**డా॥ పెడ్రో వార్మెన్**
**గారికి నమస్కరిస్తూ...**

# తైలవర్ణ (వి)చిత్రం

**న్యూ**యార్కు నగరం పొలిమేరలో ఉంది మా ఇల్లు. అందువల్ల అర్ధరాత్రి అయినా సరే మా ఆవిడతో పాటు ఒక రెండు మైళ్లు వాకింగ్‌కు వెళ్లడానికి వీలవుతుంది. ఆకురాలు కాలం ప్రారంభం కాగానే మారీ మారని ఆకులు వివిధ రంగులు సంతరించుకుంటున్న ఒకానొక రోజు రాత్రి తొమ్మిది గంటలకి భోజనం చేసి వాకింగ్‌కి వెళ్లాం. దార్లో ఉన్న ఒక బస్‌స్టాప్‌లో ఒక ఆఫ్రో అమెరికన్ (వాళ్ళని నల్లవాడు అని అనకూడదని మావాడికి స్కూల్లో నేర్పారు. వాడు మాకు ఇంట్లో నేర్పాడు) భుజానికో సంచి, చేతిలో ఒక చిన్న పెట్టెతో ఒంటరిగా సిటీబస్ కోసం ఎదురు చూస్తున్నాడు. మేం మా వాకింగ్ పూర్తి చేసుకొని వెనక్కి వస్తుంటే మళ్ళీ అక్కడే కనిపించాడు, దూరంనుండే.

"ఆఖరి బస్ మిస్సయ్యాడేమో" అంది కరుణ అని పిలవబడే మా ఆవిడ కె. అరుణ.

"అంటే అతన్ని ఇప్పుడు మనింటికి తీసుకెళ్లి ఈ రాత్రి ఉంచాలనా నీ ఉద్దేశ్యం" అన్నాను, భాషకి అందని భావాల్ని పదాల మధ్య 'స్మగ్లింగ్' చేసే మా ఆవిడ తత్వం తెలిసిన నేను.

"వద్దన్నానా?" ఆమె సంక్షిప్త, సాధికార సమాధానం ప్రశ్నగా "ఇప్పటికే ఇల్లు సత్రం చేసానంటున్నావ్...."

"అన్నా అనకపోయినా అయ్యేది అదేగా" అంది నవ్వుతూ. ఇంతలో బస్‌స్టాప్ దగ్గరికి వచ్చాం.

"లాస్ట్‌బస్ మిస్సయ్యారా?" అని అడిగాను ఇంగ్లీషులో.

"లాస్ట్‌బస్ ఎప్పుడు?" అంటూ వచ్చీరాని ఇంగ్లీషులో ఫ్రెంచియాసతో అడిగాడు.

బహుశా పూర్వం ఫ్రెంచి వాళ్ళు పాలించిన ఏ ఆఫ్రికా దేశస్తుడో అయి ఉంటాడని అనుకొని మనకొచ్చిన ఫ్రెంచి భాష వెలగబెట్టడానికి అవకాశం వచ్చింది కదా అని మనసులో సంతోషించి, ఫ్రెంచిలో సంభాషణ సాగించాం.

బస్‌స్టాప్‌లో ఉన్న టైంటేబుల్ చూసాను. "లాస్టు బస్ వెళ్ళిపోయింది. మర్నాడు ఉదయం 5.30 నిముషాలకు మొదటి బస్ ఉంది. ఇక్కడ టాక్సీ దొరకాలంటే ఫోను చెయ్యాలి" అని చెప్పాను.

"ఇక్కడ నుండి మన్‌హటన్‌లో ఉన్న పోర్టు అథారిటీ బస్ టెర్మినస్ (పై ఊర్లు వెళ్ళే బస్ స్టేషన్)కు వెళ్ళాలంటే ఎంతవుతుంది" అని అడిగాడు.

"సుమారు 50 డాలర్లు అవుతుంది"

"చాలా ఎక్కువే" అని తటపటాయించాడు.

మా ఆవిడ నేత్రావధానంతోనే 'మరెందుకు టైమ్ వేస్టు, పిలువు, రాత్రి మనింట్లో ఉండి ఉదయం బస్సులో వెళ్ళమను' అంది. పిలవగానే వెంటనే ఒప్పేసుకొన్నాడు.

కమరూన్ అనే ఆఫ్రికా దేశస్థుడట. విజిటర్‌గా అమెరికా వచ్చాడట. క్వీన్స్‌లో ఉన్న స్నేహితునితో ఉందామని అతని ఎడ్రస్ పట్టుకొని వచ్చాడట. తీరా తన దగ్గర ఉన్న ఎడ్రస్ ప్రకారం వెళితే ఆ ఫ్రెండ్ ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయి చాలా రోజులైందని, ఆ ఇంట్లో వాళ్ళు చెప్పారట. అంచేత ఇప్పుడు మన్‌హాటన్ వెళ్ళి అక్కడ నుండి వాషింగ్‌టన్ డిసి వెళ్ళాలిట. ఈ విషయాలన్నీ చెప్తుండగానే మా ఇల్లు వచ్చేసింది. అతనికో గెస్టు బెడ్‌రూమ్ చూపించి పడుకోమన్నాం.

అలా వచ్చి ఆ రాత్రి ఉన్న వ్యక్తి ఉదయం వెళ్ళిపోతూ మేం చేసిన సహాయానికి కృతజ్ఞతతో ఒక తైలవర్ణ చిత్రం ఇచ్చాడు. అది మోడ్రన్ ఆర్టులా ఉంది. దానిని ఆ రాత్రే మా ఇంట్లోనే వేశాడుట. అది మాకర్థం కాకపోయినా ఇచ్చాడు కదా అని, 'మర్సి' ( ఫ్రెంచ్‌లో కృతజ్ఞతని సూచించే పదం) అని చెప్పి ఆ తైలవర్ణచిత్రం తీసుకొన్నాను. అతను వెళ్ళిపోయాడు. మేం దాన్ని మా లైబ్రరీ గదిలో ఒక మూల పెట్టి దానిగురించి మరిచిపోయాం.

కొన్ని నెలల తరవాత చాలామంది అమెరికన్లలాగే 'స్ప్రింగ్ క్లీనింగ్' అని ఇంట్లో ఉన్న చెత్త అంతా తీసి పారేసే కార్యక్రమంలో ఈ అర్థం కాని మోడ్రన్ ఆర్టుని ఏం చెయ్యాలి అని మా డైనింగ్ టేబుల్ దగ్గర చర్చ జరిగింది. 'మోడ్రన్ ఆర్ట్ ఫ్రం కమరూన్ ఫర్ సేల్' అని 'పెన్నిసేవర్'లో ఎడ్వర్‌టైజ్‌మెంట్ ఇస్తే బెటర్ అన్న మా అబ్బాయి సలహా అమలుపరిచాం. అంతే ఒక పాతిక ఫోన్ కాల్సు వచ్చాయి. ఒక ఆదివారం అందరిని రమ్మని చెప్పాం.

వచ్చినవారి కారును బట్టీ, వారు ఆ తైలవర్ణ చిత్రం చూసిన తీరును బట్టీ, దాన్ని చూడ్డానికి వారు వెచ్చించిన కాలాన్ని బట్టీ మా అమ్మాయి ఆ తైలవర్ణ చిత్రం ధర అతి జాగ్రత్తగా పెంచుకొంటూ పోయింది. సాయంత్రం ఐదయ్యింది.

"ఎంతో కొంతకి అమ్మేయవే, ఇక బయట పార్టీకి వెళ్ళాలి" అని గట్టిగా చెప్పాను. కారుచవకగా అమ్మేస్తున్నానని చెప్తూ ఖరీదైన కారులో వచ్చిన ఒకాయనకి వెయ్యిడాలర్లకి అమ్మేసింది. అతను చెక్ ఇచ్చి చిత్రం తీసుకొని వెళ్ళిపోయాడు.

"పుత్రిక పుట్టంగ కాదు. ఆ పుత్రిక..." అని పుత్రికోత్సాహాన్ని తల్లి ప్రదర్శిస్తుంటే, "ఆ చెక్ ఎన్‌క్యాష్ అయి డబ్బు రానీ" అని కొట్టిపారేశాను.

నిజంగానే ఆ వెయ్యి డాలర్ల చెక్ ఎన్‌క్యాష్ అయిందని తెలియగానే ముందు ఆశ్చర్యపోయాను. తర్వాత 'అయ్యో ఆ చిత్రకారుని చిరునామా తీసుకోలేదే' అని బాధపడ్డాను.

నల్లవాళ్ళని చూస్తే భయం అనేవాళ్ళకి, పక్కవాడికి సహాయం చేస్తే ప్రిస్టేజ్ పోతుందనుకొనేవాళ్ళకి ఈ కథ చెప్పు. దానివల్ల ఏ ఒక్కరిలోనైనా, ఎంతో

కొంతైనా నల్లవాళ్ళమీద మంచి అభిప్రాయం వస్తే, అటు వెయ్యి డాలర్లు ఉత్తినే వచ్చాయే అన్న బాధ ఉండదదంది మా ఆవిడ.

అంచేత ఈ కథ వేసుకొన్న వారికి, చదివిన వారికి, చదివి వినిపించినవారికి, విన్నవారికి, విని మరొకరికి చెప్పిన వారికి, స్వంత తైలం (కాలం గట్రా) కొంత పోయినా ఏదైనా ఒక మంచి విచిత్రం జరుగుతుంది!

*

**నా రచన శక్తిపై ఎంతో నమ్మకంతో నన్ను కథలు రాయమని గురువులా ప్రోత్సాహించిన మిత్రుడు కప్పగంతుల వెంకట రామంకి నమస్కరిస్తూ...**

# చెత్తకు కరువొచ్చింది

**మా** ఊరు సగటు ఊరు అన్న చిరునామాకు సరిపడే ఊరు. లెక్కపెట్టలేనన్ని అన్యాయాలు ఉన్న ఊరు. బడి దగ్గర నుండి గుడి దాకా, ఆస్పత్రి నుండి స్మశానం దాకా, మిగిలిన చాలా వాటి నుండి చాలా వాటి దాకా ఏదీ మునుపటిలా లేదు. అయితే మరి ఊరు ఎలా ఉంది? 'లంచం' అనే 'ఇంధనం'తో ఆ ఊరి 'యంత్రం' నిక్షేపంగా ఉంది. అలాంటి ఊర్లో నిన్న జరిగిన మునిసిపాల్టీ ఎలక్షన్ల ఫలితాలు ఇవాళ ఉదయం తెలిసాయి. అర్థబలం, అంగబలం వ్యర్థం కాలేదు. గెలుపు వాటిదే, ఒక్క కోటీశ్వర్రావు విషయంలో తప్ప రెండు వర్గాల నాయకులు వారివారి వార్డులలో కౌన్సిలర్లుగా నెగ్గారు. ఇక మిగిలింది చైర్మన్ పదవికి పోటీ. ఇరువర్గాల వారు ఎన్ని ఎత్తులు వేసినా, గోడమీద పిల్లి (గోపి)లా ఉన్న కౌన్సిలర్ల వల్ల మెజారిటీ ఎవరిది అన్నది నిశ్చయించుకోలేకపోతున్నారు. ఈ గోపి కౌన్సిలర్ల రేటు గంట గంటకూ పెరిగిపోతోంది. ఇరువర్గాల నాయకులకు ఒకరి మీద ఒకరికి కోపం క్రమంగా తగ్గుతోంది. ఆ కోపం గోపి కౌన్సిలర్ల మీద పెరిగిపోతోంది. సాయంత్రానికి గోపి కౌన్సిలర్ల రేటు చైర్మన్ పదవీ కాలంలో 'సంపాదన' కంటే ఎక్కువైపోయింది. ఈ విషయం ఇరు వర్గాల నాయకులని కలవర పెట్టింది. రాత్రి అయింది. ఇద్దరు నాయకులు విడివిడిగా ఒక నిర్ణయానికి వచ్చారు. అర్ధరాత్రి కనకయ్య సారా కొట్టు వెనక గదిలో కలుసుకున్నారు. బావా అంటే బావా అనుకొన్నారు. గోపి కౌన్సిలర్లకు బాగా బుద్ధి చెప్పాలనుకున్నారు.

మర్నాడు కౌన్సిలర్ కోటీశ్వర్రావు పోటీ లేకుండానే చైర్మన్ అయ్యాడు. గోపి కౌన్సిలర్లు రాత్రి తాగిన విదేశీ మందు మత్తులో కన్న కలలన్నీ కరిగిపోయాయి.

వాళ్ళు గాలిలో కట్టిన మేడలన్నీ అక్కడికక్కడే కూలిపోయాయి. అమెరికా వెళతాడనుకున్న కొడుకు అడ్డరోడ్డు దగ్గర బస్సు దిగి ఉసూరుమంటూ ఊర్లోకి నడిచి వచ్చినట్లుంది వాళ్ళకి.

***

కోటీశ్వర్రావు తన ఊరి మీద అమితమైన ప్రేమతో, మితమైన మిలట్రీ పెన్షన్‌తో ఆ ఊర్లో రెండేళ్ళ క్రితం వచ్చి స్థిరపడ్డాడు. ఒంటివాడు. బాదరబందీలు, బరువు బాధ్యతలు లేనివాడు. సొంత ఇల్లు, ఎకరం పొలం, మిలట్రీ క్రమశిక్షణకి పదిహేనేళ్ళు అలవాటు పడ్డవాడు కాబట్టి సోమరిపోతులా కూర్చునేవాడు కాదు. తనుంటున్న వార్డులో తలలో నాలికలా అందరికి అన్ని పనులలో సహాయపడుతుంటాడు. రెండేళ్ళలో అతని సహాయం పొందని వాళ్ళు ఆ వార్డులో లేరు. కొద్ది మంది స్నేహితుల పట్టుదలని, ఉత్సాహాన్ని కాదనలేక కోటీశ్వర్రావు కౌన్సిలర్ పదవికి నామినేషన్ వేసాడు. ప్రజలే పైసా ఖర్చులేకుండా ప్రచారం చేశారు. పోటీ పడుతున్న పాత కౌన్సిలర్లు ఒకరి మీద ఒకరికి ఉన్న అక్కసు కొద్దీ, ఎదుటివాడు గెలవకుండా ఉండాలని, చాలా గట్టి ప్రయత్నాలు చేసారు. ఆ ప్రయత్నాలలో కోటీశ్వర్రావుని ముందు పట్టించుకోలేదు. తరవాత తమవి కాని ఓట్లని చీల్చడంలో కోటీశ్వర్రావు బాగా పనికి వస్తాడని నమ్మడం వల్ల, కోటీశ్వర్రావుకు వ్యతిరేకంగా ప్రచారం చెయ్యడానికి తగిన విషయాలు ఏమీ లేకపోవడం వల్ల కూడా కోటీశ్వర్రావుని పట్టించుకోలేదు. ఒకర్ని ఒకరు ఓడించుకోవడంలో పాత కౌన్సిలర్లు పూర్తి ఫలితం పొందారు. కోటీశ్వర్రావు కౌన్సిలర్ అయ్యాడు. పైసా పెట్టకుండా, మందు పంచకుండా, చెయ్యి కదపకుండా ఛైర్మన్ అయిపోయాడు కోటీశ్వర్రావు.

ఒక నెల రోజులు కష్టపడి ఆ మున్సిపాలిటీకి ఉన్న 'శకోద' (శతకోటి దరిద్రాలు) పట్టిక తయారు చేసాడు. మరో నెలరోజులు కష్టపడి కొన్ని 'శకోద'లకి తనకి తోచిన 'అకోఉ'లు (అనంత కోటి ఉపాయాలు) ఆలోచించి ఒక పట్టిక తయారు చేశాడు. దానికి నకళ్ళు తయారు చేసి కమిషనర్‌కు, కౌన్సిలర్లకు అందించమని మున్సిపల్ ఆఫీసులో ఉన్న హెడ్ గుమస్తాని పిలిచి చెప్పాడు. అతడు అక్కడికక్కడే ఒక ఐదు నిముషాలలో 'శకోద'లను, 'అకోఉ'లను చదివి,

కళ్లజోడు సర్దుకొని, కోటీశ్వర్రావుని అదోలా చూసి, మళ్ళీ ఆ పట్టికవైపు చూసి, "ఇవి జరగని పనులు. నా 'జరుగుబాటు'కు ముఖ్యమైన పనులు అవతల చాలా ఉన్నాయి. జరిగే పనులేవైనా ఉంటే చెప్పండి. రేపో మాపో వీలున్నప్పుడు చేసిపెడతాను" అని చెప్పాడు. నోట్లో ఉన్న కారాకిళ్ళీని తుపుక్కుమని ఉమ్మేసి, మరోసారి అదోలా చూసి, అదే ఫోర్సుతో చేతిలో ఉన్న కాగితాలని టేబుల్ మీద కొట్టి, కాళ్లజోళ్లు టకటకలాడించుకుంటూ ఆఫీసులోంచి బయటికి వెళ్ళిపోయాడు.

కోటీశ్వర్రావుకు 'అణగారిన' గుమస్తా వర్గపు 'పొజిషన్' అర్థం అయ్యింది. కోటీశ్వర్రావు చైర్మన్ అయినప్పటి నుండి పనిలో పడి ఊరి జనం, ఉద్యోగస్తులు తనని ఎలా చూస్తున్నారో గ్రహించలేదు. కానీ కోటీశ్వర్రావుని అందరూ అదో మాదిరిగా చూస్తున్నారు. 'పాపం' అనుకుంటున్నారు. పూర్వం అమెరికావాడు, రష్యావాడు ఆఫ్గనిస్తాన్‌లో పరోక్షంగా కొట్టుకుంటూ ఉంటే, రెడ్‌క్రాస్ వాడు అటు ఇటు హడావిడిగా తిరుగుతున్నట్లుంది కోటీశ్వర్రావు పని.

తను తయారు చేసిన పట్టిక మరోసారి చూసుకున్నాడు. ఉన్నవన్నీ మంచి పనులే. అవన్నీ జరిగినట్లయితే, ఈ ఊరు బాగుపడి పోతుందని చెప్పడానికి సందేహం ఏమీ లేదనిపించింది. కానీ ఈ పనులు చేస్తే తాము 'బాగుపడాలని', 'నానా బాధలు' పడి కౌన్సిలర్లు అయ్యినవాళ్ళు, 'చచ్చీచెడి' పనిచేస్తున్న మునిసిపాలిటీ ఉద్యోగస్తులూ తదితర సిబ్బంది 'బాగుపడరని' గ్రహించిన గుమస్తా తానిచ్చిన కాగితాలని పక్కన పడేసి వెళ్ళిపోయాడని తొందరలోనే గ్రహించాడు.

ఆలోచించగా, ఆలోచించగా మా ఊరి అసలు సమస్యల విషయంలో తాను చెయ్యగలిగింది ఏమీ లేదని తెలుసుకున్నాడు. అనవసరమైన విషయాలలో కల్పించుకోకుండా పదవిలో పదిలంగా, పరువుగా ఉండమని మిత్రులంతా సలహా ఇచ్చారు. కోటీశ్వర్రావుకు తనమీద తనకే జాలి వేసింది. మనిషి అదోలా అయిపోయాడు. దాదాపు పిచ్చివాడిలా ఊరంతా తిరిగాడు. అలసిపోయి అర్ధరాత్రి ఇంటికి వచ్చి పడుకున్నాడు. కలలో అతనికి ఒక ఊరు కనిపించింది. అది అచ్చం తన ఊరిలా ఉంది. అయితే ఆ కలలో ఊరికి, తన ఊరికి భేదం ఉంది. కలలో కనిపించిన ఊరిలో మచ్చుకైనా ఒక్క పిసరు చెత్త కనిపించలేదు. తన

ఊరిలో మచ్చుకైనా చెత్తలేని జాగా కనిపించదు. అంతే భేదం!

***

మర్నాడు ఆఫీసుకు రాగానే రోడ్లు తుడిచే వాళ్ళ సూపర్‌వైజర్ని పిలిపించాడు. రోడ్లని తుడవద్దన్నాడు. ఊరి చివర చెత్త పోసే జాగాలో ఎప్పటినుండో పడి ఉన్న చెత్తకుప్పలని కాల్చి నేలను దున్ని చదును చేసి, కూరగాయలు పండించి, అమ్మి వచ్చిన డబ్బులని అందరిని పంచుకోమన్నాడు. చెయ్యవలసిన పని చెయ్యకుండా, అతి తక్కువ పని చేసి, డబ్బులు సంపాదించి మునిసిపాలిటీకి చెప్పకుండా పంచుకోమంటున్న చైర్మన్‌ని ఆశ్చర్యంతో చూసి అప్రయత్నంగా “నిజమా?” అన్నాడు.

“నిజంగానే” అన్నాడు కోటీశ్వర్రావు.

సూపర్‌వైజర్ “సరే సార్” అని ‘వినయం’గా వెళ్ళిపోయాడు.

తరవాత ఫ్యూన్‌ని పిలిచి ఒక రిక్షాని తెమ్మని చెప్పాడు కోటీశ్వర్రావు. రిక్షాలో ఓ మైకు పెట్టించి, ఫ్యూన్‌కి ఒక కాగితం ఇచ్చి “ఇందులో రాసింది రాసినట్లుగా ప్రతి వీధిలో చదువు” అని చెప్పాడు.

“ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, రేపటి నుంచి ప్రతిరోజూ ఉదయం వూరికి ఉత్తరంగా ఉన్న సంత తోట ప్రక్కనున్న బంజరు దగ్గరకి బండెడు చెత్త తెచ్చి అప్పగించిన ప్రతివారికి, బండి ఒక్కింటికి వంద రూపాయలు చొప్పున ఇప్పించబడును”

ఆ ప్రకటన విన్న ప్రజలంతా ఆశ్చర్యపోయారు. రాజకీయ నాయకులకి ఇదో పిచ్చి పనిలా అనిపించింది. అధికారులకి దాని అంతరార్థం అర్థం కాలేదు. ‘నాలుగు డబ్బులు’ వెనకేసుకునేందుకు చైర్మన్ పన్నిన పన్నాగమని అంతా అనుకున్నారు. పోనీలే ‘కొత్తవాడు’ అని ఊరుకున్నారు.

మర్నాడు ఉదయం ఆరింటికల్లా సంత తోట ప్రక్కన బంజరు దగ్గర బల్లా కుర్చీలు వేసుకొని కూర్చున్నారు చైర్మన్, అతని గుమస్తా. చెత్త నింపుకుని వచ్చిన బళ్ళ వాళ్లకి డబ్బులివ్వడానికి సిద్ధంగా ఉన్నారు.

రోడ్లు తుడిచే వారు, ఊర్లో వీధుల్లో ఉన్న టీకొట్లో కూర్చొని కబుర్లు చెప్పుకోవడానికి బదులు ఎప్పటినుండో అక్కడ పేరుకుపోయిన చెత్తకుప్పల్ని కాల్చి, శుభ్రం చేసి, నేలను దున్ని చదునుచేసే పనులలో ఉన్నారు.

చెత్త నింపుకుని వచ్చిన పాతిక బళ్లు బారు తీరి ఉన్నాయి. ముందు ప్రకటించినట్లే డబ్బులిచ్చారు.

ఒక్క నెలరోజులకల్లా రోజూ వచ్చే బళ్ళ సంఖ్య తగ్గిపోయింది. ఊరిలో చెత్త మచ్చుకైనా కనిపించడం లేదు. ప్రతి ఇంటివాళ్ళు చెత్త రోడ్డుమీద పొయ్యడం లేదు. ఇంట్లోనే ఓ డబ్బాలో పోసి, దాచి ఉంచి ఆ డబ్బా నిండగానే డబ్బా ఒక్కంటికి రూపాయి ఇచ్చి మరీ చెత్త తీసుకువెళ్ళే బండివాడికి ఇస్తున్నారు.

చెత్త కంపోష్టుగా మారి వ్యవసాయానికి పనికొచ్చింది. కూరగాయలు, వ్యవసాయ పంటల దిగుబడి పెరిగింది. శుభ్రంగా ఉన్న ఊరు ఊరి జనంలో, మున్సిపల్ సిబ్బందిలో ఆలోచనల మార్పుకు నాంది అయ్యింది. అనారోగ్యం దూరమైంది.

ఈ కొత్త రకం చెత్త వ్యాపారంతో కొద్ది మందికి జీవనోపాధి కలిగింది. ఆరు నెలల తరువాత ఈ వ్యాపారం చెయ్యడానికి ముందుకొచ్చిన వాళ్ళకి ఆ ఊరిలో చెత్తకు కరువొచ్చింది.

*

**ఏ సమస్యనైన నేను ఒక ఉపాయంతో**
**సాధించగలనని గుర్తించి, గౌరవించి,**
**గురువులా ప్రోత్సహించిన శ్రీమతి నితా షాకి**
**నమస్కరిస్తూ...**

# వీడియో గేమ్స్ వండర్ కిడ్స్

'**వ**రల్డ్ వీడియో గేమ్స్ వండర్ కిడ్స్' పోటీలో మొదటి స్థానాల్ని గెలుచుకొన్న పిల్లల ఫోటొలు, వివరాలు న్యూయార్క్ టైమ్స్ దినపత్రిక మొదటి పేజీలో ముచ్చటగా ముద్రించారు. అమెరికాలో లాస్ ఏంజలస్సులో 2010లో జరగబోయే 10వ వరల్డ్ సైబర్ గేమ్స్ పోటీలకు వీరందరికి ఆహ్వానం వచ్చిందట. న్యూయార్క్‌లో ఉన్న కొలంబియా యూనివర్సిటీ వారు వీడియో గేముల ఆధారంగా ఏర్పాటు చేసిన 'రహ..రా అల్జీబ్రా' అన్న లెక్కల పోటీలలో అతిథులుగా పాల్గొనడానికి ఈ పిల్లలను న్యూయార్క్ బోర్డు ఆఫ్ ఎడ్యుకేషన్ వారు ఆహ్వానించారు. ఎక్కడో స్పోర్ట్స్ పేజీలో ఒక మూల కాకుండా మొదటి పేజీలో ప్రముఖంగా ఈ వార్త రాయడం అందరిని ఆశ్చర్యపరిచింది. అందుకే ఈ వార్త ప్రపంచం నలుమూలలకు అతి తొందరగా చేరడంతో అందరూ శ్రద్ధగా చదివారు. టీవీలలో చూసారు. గత పదేళ్ళుగా ఈ పోటీలు జరుగుతున్నా, ఇప్పుడే ఇంత ప్రాముఖ్యత రావడానికి కారణం వీడియో గేములు కాదు, ఆ వీడియో గేములు గెలుచుకున్న పిల్లలు. సాధారణంగా కొరియన్ పిల్లలు, అమెరికన్ పిల్లలు, సంపన్న దేశాల పిల్లలు గెలుస్తారు. కాని ఈమారు గెలిచిన వారందరూ భారతీయులే. అందరూ ఐదో తరగతిలోపు పిల్లలే. నార్త్ సౌత్ ఫౌండేషన్ ద్వారా శ్రీ రత్నం చిట్టూరి, శ్రీ మురళి గవిని చేసిన కృషి వల్ల అమెరికాలో స్క్రిప్స్ నేషనల్ స్పెల్లింగ్ బీ పోటీలో తరుచూ మొదటి పది స్థానాలలో ఎక్కువ మంది భారతీయులే ఉండడం సహజం. కాని ఈ పిల్లలు అమెరికాలోని భారతీయుల పిల్లలు కారు. వీరు భారతదేశంలో, ఆంధ్రప్రదేశ్‌లో దోమలపల్లి అన్న ఒక చిన్న పల్లెటూరికి చెందిన పిల్లలు.

దోమలపల్లిలో ఉన్నవారంతా దారిద్ర్య రేఖకి దిగువ ఉన్నవారె. కంప్యూటర్లు లేని వారు వీడియో గేములు కొని ఆడుకునే తాహతు లేనివారు. పైగా అంతా పదేళ్ళ లోపువారే. ఈ పిల్లలు కొరియా, అమెరికా వంటి సంపన్న దేశాల పిల్లల్ని ఎలా ఓడించారు? నెల రోజుల క్రిందట ఢిల్లీలో మొదటిసారి వీడియో గేముల పోటీని చూశారుట. ఆడారుట. అప్పుడే పిసి గేములు, ఎక్స్ బాక్సు గేములు, మొబైల్ గేములు ఎలా ఆడాలో నేర్చుకున్నారుట. మరి అలాంటివారికి ఏళ్ళ తరబడి వీడియో గేములు ఆడుతున్న వాళ్ళకంటే బాగా ఆడడం ఎలా వచ్చింది? ఇలాంటి ప్రశ్నలతో ఎవరికి తోచిన సమాధానాలతో వారు పేపర్లు నింపేసారు.

సహజంగా భారతీయులు లెక్కలలో, సైన్స్‌లో అమెరికన్ పిల్లలకంటే ఒక మెట్టు పైనే ఉంటారు కాబట్టి అమెరికన్ పిల్లల్ని ఓడించినా ఆశ్చర్యం లేదు కానీ, లెక్కల్లో, సైన్స్‌లో బాగా ముందుండే కొరియన్ పిల్లల్ని కూడా ఓడించారంటే ఆశ్చర్యమే మరి. చిన్నవాళ్ళు చిన్నవేళ్ళు కాబట్టి మొబైల్ గేముల్లో అతి చురుకుగా అతి చక్కగా ఆడి అందరిని ఓడించారని వ్రాసారు. మారథాన్ పరుగు పందాలలో గెలిచే వాళ్ళకి ఒక విధమైన జీన్ ఉంటుందని, అది ఉన్న వాళ్ళు మారథాన్ పరుగు పందాలలో గెలిచే అవకాశాలు చాలా ఎక్కువని, ఈ జీను ఆఫ్రికా ఖండంలో ఎక్కువ ఉంటుందని, అందుకే ప్రపంచ పరుగు పందాలలో ఆఫ్రికా వాసులే ఎక్కువగా గెలుపొందుతారని నిరూపించబడింది. అలాగే వీడియో గేములు గెలిచే వాళ్ళలో కూడా ఒక జీన్ ఉండవచ్చని అదే దోమలపల్లి పిల్లల్లో ఉండి ఉంటుందని రకరకాలుగా ఊహాగానాలు చేసారు. కాని అసలు ఈ దోమలపల్లి పిల్లల విజయానికి కారణం దోమలే అని తెలిస్తే మీరు, మీచుట్టూ ఉన్న ప్రపంచం ఆశ్చర్యపోతారు.

***

"నీతో సంసారం చేద్దామని ఈ దోమలపల్లి వచ్చాను. కానీ, దోమలతో సంసారం చేద్దామని కాదు" అని కుండబద్దలు కొట్టినట్టు చెప్పి పెట్టే బేడా (పన్నెండు వేలు) పట్టుకొని దోమలపల్లి ఏకోపాధ్యాయుడిని విడిచిపెట్టి వెళ్ళిపోయింది అతని భార్య. అప్పుడే అందిన జీతం పట్టుకెళ్ళిపోయిందన్న

బాధ కంటే, పది రోజులు కూడా కాపురం చెయ్యకుండా కొత్త పెళ్లికూతురు పుట్టింటికి వెళ్లిపోయిందని బాధపడుతున్నాడు దోమలపల్లి ఉపాధ్యాయుడు. రాక రాక ఉద్యోగం వచ్చింది. వెనకబడిన శ్రీకాకుళం జిల్లాలో, వెనకబడిన మండలాల్లో మొట్టమొదటి స్థానంలో ఉన్న కంచిలి మండలంలో మారుమూల కుగ్రామం దోమలపల్లి. ఉద్యోగం వస్తే పెళ్ళి అవుతుందని ఆశపడుతున్న వాడు కాబట్టి ఇంటికి దూరం, మారుమూల కొండ ప్రాంతం అయినా సరే, మరో ఆలోచన లేకుండా వెంటనే జాయిన్ అయ్యింది పెళ్ళి కోసమే. జాయిన్ అయిన రెండు నెలల్లోపే పెళ్ళి కుదిరింది. కుదిరిన నెలరోజుల్లో పెళ్ళి అయింది, అయిన నెలరోజులకి కాపరానికి వచ్చింది. వచ్చిన పది రోజులలో వదిలి వెళ్ళిపోతే....?! అతనికి అందరి మీద ఒళ్ళు మండింది. తనని తాను తిట్టుకున్నాడు. ఆ బాధలో తనని తాను కొట్టుకోవడం మొదలుపెట్టాడు. దానికి కారణం సాయంత్రం ఆరు గంటలు అవుతున్నది. దోమలు ఇంటిలోకి రావడం మొదలుపెట్టాయి. మాస్టారిని కుడుతున్నాయి. బాధలో ఉన్న మాస్టారు కదలలేదు కాని అసంకల్ప ప్రతీకార చర్య వలన తనని తాను నిరుత్సాహంతో కొట్టుకొంటున్నాడు. బాధలో కదలకుండా ఉన్న మాస్టారిని దోమలు హాయిగా కుడుతున్నాయి. తేనె తుట్టిమీద తేనెటీగల్లా అతని చుట్టూ దోమలు ఆవరించి ఉన్నాయ్. అతని బాధ కోపంగా మారింది. ఆ కోపం వెళ్లిపోయిన పెళ్లాం మీద కొంతసేపు వుంది. తరువాత కుడుతున్న దోమల మీదకు మళ్ళింది. కోపం పెరిగింది. చచ్చిన దోమలకంటే తన చేతితో తనని తాను కొట్టుకున్న దెబ్బలే ఎక్కువ. ఇటు చెయ్యి, అటు వొళ్లు నొప్పిపెట్టడం మొదలు పెట్టాయి. ఇంతలో పొలోమని అరుచుకుంటూ, ఆడుకుంటూ పిల్లలు సాయంత్రం పాఠానికి వచ్చారు.

"ఏటి.... మాస్టారూ అలాగున్నారు?" అంటూ చుట్టూ చేరారు. ఏకోపాధ్యాయుడు అంటే ఐదు తరగతులకు ఒక్కడే మాస్టారు. తరగతికి ఐదు పది మంది కంటే ఎక్కువ లేరు. స్కూల్లో ఉన్న పిల్లలు మొత్తం 30 మంది మాత్రమే. కాపురానికి వచ్చిన పెళ్లానికి పిల్లలంటే ఇష్టం అని చెప్పింది కాబట్టి, బడి పిల్లలని రోజూ సాయంత్రం ఒక గంటసేపు ఇంటికి రమ్మన్నాడు. మొగుడూ పెళ్లాం పిల్లలందరినీ ఆడిస్తూ పాడిస్తూ పాఠాలు చెప్తూ కాలక్షేపం చేస్తుండేవారు.

"దోమలర్రా, దోమలు" అన్నాడు. బయటకు రాబోతున్న ఏడుపుని గొంతులోనే ఆపుకుంటూ.

మాస్టారు బాధలో ఉన్నారని తెలుసుకున్నారు పిల్లలు. రెండు చేతులతో దోమలని చంపడం మొదలుపెట్టారు. దోమలేమిటి, దేన్నైనా కొడతారు. ఎందుకంటే ఆ వయసులో పిల్లలకి మాస్టారంటే అంత ప్రేమ, భక్తి ఉంటాయి మరి. ఆ చిన్న పిల్లల అరచేతుల్లో చచ్చిన దోమల ఎర్రని రక్తం మరకలు గోరింటాకు చుక్కల్లా కనిపిస్తున్నాయి. వాటిని లెక్కపెట్టుకుంటూ ఎవరెన్ని దోమల్ని చంపారో చెప్పుకుంటున్నారు. పిల్లలకి ఆట దొరికింది. చిన్నపిల్లల చప్పట్లతో, కేరింతలతో ఆ ఇల్లు మారుమ్రోగిపోతున్నది.

వెలుగు నీడల ఆ సాయం సంధ్యలో చాలా దిగులుగా ఉన్న మాస్టారు, చాలా ఆనందంలో ఉన్న పిల్లలతో ఆ ఇంటి వాకిలి ప్రకృతిలో పూర్ణత్వానికి ప్రతీకలా ఉంది.

దోమల బాధ తగ్గింది. మాస్టారికి దిగులు తగ్గి, పిల్లలకి పాఠం చెప్పాలని పుస్తకం తీసుకొని రావడానికి లేచి నిలబడ్డాడు. మాస్టారు లేచి నిలబడడంతో పిల్లలు అతనిని చుట్టు ముట్టారు. దోమలని చంపిన చేతుల్లోని రక్తపు మరకలని గెలుచుకున్న బహుమానాల్లా ఒకరిమీద ఒకరు పోటీగా చూపించడం మొదలు పెట్టారు. చిన్న చేతుల మీద ఎర్రటి మరకల్ని చూసిన మాస్టారికి, వెళ్ళిపోయిన భార్య బుగ్గల మీద ఎర్రటి దోమ కాట్లను గుర్తుకుతెచ్చాయి. పరాకుగా చూస్తే పార్శీ వనితా అనిపించే చర్మ సౌందర్యం, ముద్ద నందివర్ధనం పూరెక్కల వంటి తెల్లదనంతో, మృదువుగా ముట్టుకొంటే మాసిపోతుందేమో, పట్టుకొంటే కందిపోతుందేమో అన్నంత సుకుమారంగా ఉన్న ఆమె బుగ్గలు బాగా విరబూచిన ఎర్ర గులాబీ తోటని గుర్తు తెచ్చాయి. బాధ ఒక కెరటంలా మళ్ళీ ఎగసింది. మరిక పిల్లలకి పాఠం చెప్పలేక –

"పిల్లలూ, ఈ రోజు ఇంక పాఠం లేదు, ఇళ్ళకిపొండి" అన్నాడు శక్తినంతా కూడదీసుకొని.

"ఏటి జోరమా మాస్టారూ?" అని పిల్లలు అడిగారు.

"........."

"కాదెహే, అమ్మగారెల్లిపోయారని దీవెట్టుకున్నారు గావాల..." అంది ఒక అమ్మాయి.

"ఒసి, నీకు తెలుసేటమ్మి. పల్లకో... పెద్దా తెలిసిన్దాన్లా..." అన్నాడు ఓ అబ్బాయి.

"కావాలంటే మాస్టారినే అడుగు బావు" అంది

"అమ్మగారెల్లిపోనారా మాస్టారు?"

"............"

"ఎవురైన అలా సెప్పుకుంటారేటి, నీ తెలివి గాని..." వెక్కిరించింది ఆ అమ్మాయి.

వీళ్ళని ఇలా వదిలేస్తే వాళ్ళ ఆలోచనతో, తర్కంతో జరిగినదంతా తెలుసుకొని ఊరు ఊరంతా చాటింపేస్తారని వాళ్ళ సంభాషణని అక్కడితో ఆపించి పంపించేసాడు.

పిల్లల్ని పంపించి గదిలోకి వచ్చాడు. అక్కడ కూర్చోలేకపోయాడు. ఏదైనా తిందామని వంటింట్లోకి వెళ్ళాడు. తినలేకపోయాడు. ఎక్కడా కుదురుగ్గా ఉండలేకపోయాడు. నీరసంగా అనిపించి మంచంమీద వాలిపోయాడు. మగత నిద్రపట్టింది. మధ్యలో మెలుకువ వచ్చింది. వెళ్ళిపోయిన భార్యని ఎలా వెనక్కి తీసుకు రావాలి? దోమల బెడద నుండి తన సంసారాన్ని ఎలా కాపాడుకోవాలి? అనే ఆలోచనలతో ఆ రాత్రి అలా గడిచిపోయింది.

***

ఉదయం లేచాడు. రాత్రి నిద్ర సరిగ్గా పట్టకపోయినా, నిద్ర పట్టకపోవడం దోమల వలన కాదు అని తోచింది. రాత్రి దోమలు అసలు లేవో, లేక చాలా

తక్కువ ఉన్నాయో అర్థం కాలేదు. రాత్రి దోమలు ఎందుకు తక్కువ ఉన్నాయా అని బడిలో కూడా ఆలోచిస్తూనే ఉన్నాడు. మాస్టారు పరధ్యానంగా ఉండడంతో పిల్లల అల్లరి మొదలైంది. ఒకరితో ఒకరు దెబ్బలాడుకోవడంతో పెరిగిన గొడవలు మాస్టారిని ఆలోచనలలోంచి బయట పడేసాయి.

"ఆపండి... ఆపండెహే..." అని, నాలుగు గోడల మధ్య ఉన్న మూడు తరగతులకి, బయట ముందు వెనక ఉన్న రెండు తరగతులకి కలిపి మొత్తం ఐదు తరగతులలో ఉన్న పిల్లలందరికీ వినిపించేలా అరిచాడు ఒంటరి ఉపాధ్యాయుడు. ఒక్కసారి నిశ్శబ్దం ఏర్పడింది. వెంటనే –

"ఈడేమో ఎభైయ్యే సంపి, ఎభై ఐదంటాడండి..."

"సరస్పత్తోడండి..."

మాస్టారికి గొడవేమిటో అర్థం కావడం లేదు.

"మావు నిన్న రగతం మరకలు నెక్కేట్టినావండి..."

"రగతం మరకలు నెక్క ఏభయ్యేనండి, కాని మరో ఐదు సంపినానండి. కాని మరకలు రానేదండి. ఆటికి రగతం నేదు గావాల, కాదండి మాస్టారు. నానేటి సేసేది?" తన లెక్కని సమర్థించుకొంటున్నాడు.

"ఈ రక్తం మరకల గొడవేంటి రా... ఎవరు ఎవర్ని కొట్టారు?" అని గట్టిగా అడిగాడు.

తగువులాడుకుంటున్న ఇద్దరూ మౌనంగా తలవంచుకొన్నారు.

"ఎవురిమి ఎవుర్నీ కొట్టనేదండి. మావు నిన్న మీ ఇంటి కాడ దోమలని కొట్టాం కదేటండి, ఎన్ని రగతం మరకలుంటే అన్ని దోమలని సంపినట్టండి. ఎవరెక్కువ సంపితే ఆళ్లే గొప్ప కదండీ. అందుకే ఈల్లిద్దరూ తగువులాడు కుంటన్నారండి..." అని గొడవంతటిని వివరించింది ఒక అమ్మాయి.

"వీళ్ళిద్దరే దోమలని కొట్టారా? ఇంకా ఎవరైనా కూడా కొట్టారా?" అని అడిగాడు

"మావందరం కూడా కొట్టినావండి. కాని ఆల్లిద్దరే బాగా ఎక్కువ కొట్టినారండి..." అని అందరూ ముక్తకంఠంతో చెప్పారు.

నిన్న సాయంత్రం పిల్లలు తన ఇంటి దగ్గర దోమలని కొట్టడం వల్ల రాత్రి ఇంట్లో దోమలు తగ్గాయా అన్న అనుమానం వచ్చింది మాస్టారికి.

"ఒరే మీ అందరికి ఓ పరీక్ష. సాయంత్రం ఇంటికి రండి. ఎవరు ఎన్ని దోమలని కొట్టి చంపుతారో చూద్దాం. ఫస్ట్ వచ్చిన వాళ్ళకి బహుమానం" అని ఉన్న పిల్లలందరికీ వినబడేలా చెప్పాడు.

"ఏటిస్తారు మాస్టారు? ఏటిస్తారు మాస్టారు?" అంటూ అందరూ మాస్టారి చుట్టూ మూగి కూర్చుని, నిలబడి గోలగోలగా అడగడం మొదలుపెట్టారు.

"ఒసి, మీకు తొందరేటర్ర ఏదో ఒకటిస్తారు గానీ, లెగండి లెగండి, మాస్టారికి గాలి తగలోద్దేటి?" అంది ఒక పిల్ల.

"ఏదో ఒకటి ఇస్తాను కాని, ముందు పాఠాలు వినండి" అని ఐదు గుర్రాల రథాన్ని అదిలించిన రౌతులా ఐదు క్లాసులకి పాఠం చెప్పడం మొదలు పెట్టాడు.

సాయంత్రం పిల్లలంతా పోటీపడి దోమలని రెండు చేతులతో 'టపా, టపా..' మంటూ చంపడం మొదలుపెట్టారు. చేతినిండా రక్తం మరకలు అవ్వగానే మాస్టారి దగ్గరికి వచ్చి లెక్కపెట్టించుకొని, తమ ఖాతాలో వాటిని జమ చేసుకొంటున్నారు. వెంటనే వెళ్లి చేతులు నీళ్లతో కడుక్కొని మళ్లీ మరిన్ని దోమలని చంపడానికి తయారవుతున్నారు. ఒక గంట తరవాత వాళ్ళకి చంపడానికి దోమలు దొరకడం లేదు. అప్పటికే ఎక్కువ దోమలని చంపిన వాళ్ళు తమకింక పోటీ లేదని ఆనందపడుతున్నారు.

"దోమలు కావాలి మేస్టారు, దోమలు కావాలి" అంటూ ఈగల్లా మాస్టారి చుట్టూ చేరారు మిగిలినవాళ్ళు.

దోమలే అతి పెద్ద సమస్య అయి, దోమలు లేకుండా ఉంటే చాలు అనుకున్న మాస్టారికి ఇప్పుడు దోమలు లేకపోవడం సమస్య అయింది.

"రేపు రండి..." మరిన్ని దోమలు ఉంటాయి అని నచ్చచెప్పి పిల్లలని ఇళ్ళకు పంపాడు.

***

"దోమలు లేవు తెలుసా..." అని ఆనందంగా పెళ్ళానికి ఫోను చేసాడు.

"తెలుసు. ఇక్కడ, మా పుట్టింటిలో కూడా దోమలు లేవు. మీరక్కడనుండి ఫోను చేసి చెప్పక్కర్లేదు" అంది వెక్కిరిస్తున్నట్లు.

"ఊ... ఎప్పుడు వస్తావు మరి?" ఆశగా అడిగాడు.

"ఉహు, మీరే ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ చేయించుకొని వచ్చేయండి" అంది ప్రేమగా.

సెలవు పెట్టడానికి కూడా ఎంఇఓని బ్రతిమాలుకోవాలసిన ఏకోపాధ్యాయుడిని నేను, డిస్ట్రిక్ట్‌లు దాటి ట్రాన్స్‌ఫర్ చేయించుకోవడానికి నాకు తాహతు ఎక్కడ అని మనసులో అనుకొని.

"నేనొక్కడినీ ఉండలేను...." అన్నాడు దీనంగా.

"ఉన్నాయిగా బోలెడు దోమలు... వాటితోనే పడుకోండి..." అంది వేళాకోళంగా.

నిరుత్సాహంతో ఫోను పెట్టేసాడు.

మర్నాటి నుండి రోజూ సాయంత్రం పిల్లలు రావడం, దోమల్ని చంపడంలో పోటీలు పడి పావుగంటలో మాస్టారి ఇంటిలోని దోమలన్నింటిని చంపి పక్కింటి కెళ్లి అదే పని చెయ్యడం మొదలు పెట్టారు. వారం రోజుల్లో ఊరిలో ఉన్న అన్ని ఇళ్ళకి పిల్లలు సాయంత్రం మిడతలదండులా వెళ్ళి దోమలన్ని చంపి యుద్ధంలో గెలిచిన సైనికుల్లా గొప్పలు చెప్పుకొంటున్నారు.

"నాను గాల్లో ఎగిరి ఒక్కసారి ఐదు దోమల్ని సంపినాను తెలుసా.." అని ఒకరంటే "ఓసొసి ఒక్క సేత్తో గభాల్న ఏళ్లు మూసి పది సంపినాను తెలుసా

ఒక పాలి..." ఇలా వాళ్ళ గొప్పలు చెప్పుకొంటూ, కొత్త కొత్త పద్ధతులలో ఇంకా వేగంగా, లాఘవంగా దోమలని చంపడం నేర్చుకొంటున్నారు.

పది రోజులలో ఆ ఊరిలోని దోమల బెడద తగ్గింది. 'పిల్లల్లారా' అని గట్టిగా కేకవేస్తే పొలోమని పదిమంది వచ్చి నిముషంలో కనిపించిన ప్రతి దోమని చంపి వెళ్ళిపోతున్నారు. ఆ లెక్కలు పదిలంగా రాసుకొని దాచుకొంటున్నారు. లక్ష అంటే ఎంతో తెలీదు కాని, ప్రతీ ఒక్కరూ లక్ష దోమల్ని చంపాలని గట్టి లక్ష్యం పెట్టుకున్నారు. వందల దాకా కూడా సరిగ్గా అంకెలు వెయ్యడం రానివాళ్ళకి పదిరోజులలో వేలల్లో అంకెలు వెయ్యడం, లక్ష చేరాలంటే ఇంకెన్ని దోమలని చంపాలి, తోటి పిల్లలకంటే ఎంత ఎక్కువలో ఉన్నాం, ఎంత తక్కువలో ఉన్నాం అన్న ఆలోచనల వల్ల అంకెలు, కూడికలు, తీసివేతలు వేలస్థానంలో కూడా రాయక్కర లేకుండా నోటి లెక్కల ద్వారానే చేసేస్తున్నారు సునాయాసంగా.

దోమల్ని 'సిటికలో సంపేస్తానని' ఒకడంటే, 'సిటికేసి సంపేస్తానని' మరొకడు. రకరకాల పద్ధతులతో ఉన్న రెండు చేతులతో, పది వేళ్ళతో ఎన్నెన్ని రకాలుగా దోమల్ని, ఎంత సులభంగా చంపవచ్చో వాళ్ళంతట వాళ్ళే కనిపెడుతున్నారు పిల్లలు ప్రతిరోజూ.

దోమలపల్లిలో దోమలు దొరకడం కష్టమైపోయింది.

***

"దోమలపల్లిలో దోమలు దొరకడం కష్టమైపోయింది" అని పెళ్లానికి ఫోనులో చెప్పాడు. "ఇప్పటికి నువ్వెళ్ళి రెండు వారాలైపోయింది" అని గుర్తుచేసాడు కూడా.

"నాకూ ఇక్కడ కష్టంగా ఉంది..." అంది.

"వెంటనే బయల్దేరి వచ్చేయి..." అన్నాడు ఆనందంగా.

కొత్త పెళ్ళికూతురు కాపరానికి వెళ్ళి పదిరోజులలో వెనక్కి వచ్చేసిందంటే కారణం తెలుసుకోవాలని అందరికీ ఉంటుంది. సరియైన కారణం చెప్పకపోతే చుట్టుపక్కలవాళ్ళు వాళ్ళకి తోచిన కారణాలు వాళ్ళే ఊహించేసి చెప్పుకుంటారు.

విన్న వాళ్ళు చిలవలు పలవలు చేర్చి కొత్త వాళ్ళకి చెప్తారు. ఇవి నాలుగైదు సార్లు విన్న తరువాత, చెప్పిన తరువాత అవి నిజాల లాగే చలామణి అవుతాయి. 'పిల్ల కుందనపు బొమ్మే కాని కాపరానికి పనికిరాదట' అనుకోవడం మొదలైంది. ఇది విన్న మాస్టారి పెళ్ళానికి దోమలున్నా సరే దోమలపల్లికి వెళ్లిపోవాలన్న కోరిక బలంగా మొదలైంది. 'వెంటనే వచ్చేయి...' అని మొగుడు అనడంతో పరుగెత్తి బస్కెక్కి బహుదూరంలో ఉన్న భర్త దగ్గరికి వెళ్ళిపోవాలనిపించింది.

***

"మన కాపురం నిలబెట్టింది ఈ స్కూల్ పిల్లలే" అని తిరిగొచ్చిన భార్యకు చెప్పాడు. చేయి జారిపోయింది అనుకొన్న కొత్త అనుభవాల స్వర్గం మళ్ళీ తన స్వంతం అయిన ఆనందంలో మునిగి తేలుతున్న ఆమెకి దీనికి కారణమైన పిల్లలకి తిరిగి ఏదైనా చెయ్యాలనిపించింది. వాళ్ళకి ఇవ్వడానికి తన దగ్గర ఏమున్నాయి అని ఆలోచించింది. తన అమెరికా మామయ్య ఇచ్చిన పిఎస్పి ఉందని గుర్తుకి వచ్చి, పెట్టెలోంచి దాన్ని తీసి పిల్లల్ని పిలిచి దానితో ఎలా ఆడుకోవాలో చెప్పింది. దానిలో ఉన్న గేముని ఒకరి తరువాత ఒకరు వేగంగా ఆడి సాధించవలసిన అత్యధిక స్కోరు సాధించేసారు. తన దగ్గర ఉన్న మిగిలిన గేములన్నింటిని ఒకదాని తరువాత ఒకటి ఇవ్వడం మొదలు పెట్టింది. అన్నింటిని అందరు పిల్లలు అతి చాకచక్యంతో నిముషాలలో ఆడేసారు. అది చూసిన ఆమె ఆశ్చర్యపోయింది.

అమెరికాలో ఉన్న మామయ్యకి ఫోను చేసి ఈ విషయం చెప్పింది. ఆయన కంప్యూటర్ సైన్స్ వీడియో గేముల విభాగంలో ప్రపంచంలో పేరున్న ప్రొఫెసర్. ఆయన అతి కష్టమైన గేము అని ఇచ్చినదానిని కూడా దోమలపల్లిలో పిల్లలు సునాయాసంగా ఆడి గెలిచేశారు. ఇది విన్న ఆయన నేను రూపొందించిన ఈ గేము ఇప్పటిదాకా ఎవ్వరూ పూర్తిగా ఆడలేదు. అలాంటి దాన్ని గెలవడం అంటే చాలా గొప్ప విషయమే అని ఆశ్చర్యపడ్డారు. ఒక వారం రోజులలో మరిన్ని గేములు పంపారు. వేల వేల దోమల్ని చంపడంలో వచ్చిన అనుభవంతో, దాని వల్ల నేర్చుకొన్న లెక్కలతో, ఎగురుతున్న దోమలని చంపడం అన్న అతి క్లిష్టమైన నిపుణతని, కళ్ళ ముందు సెకండు సెకండుకి మారుతున్న పరిస్థితిని

గమనించి, రాబోయే మార్పుని ఊహించి అప్పటికప్పుడు సరియైన పథకాన్ని ఏర్పరుచుకొని, కావలసిన ఫలితాలని రాబట్టుకొనే వారి తెలివితేటలని దోమలు సానపట్టి తీర్చి దిద్దాయి కాబోలు, గేములు చక్కగా ఆడి గెలిచారు. ఇంత ప్రతిభ ఉన్న పిల్లల్ని జాతీయ, అంతర్జాతీయ వీడియో గేముల పోటీలకి పంపాలని ఆమె మామయ్య అన్ని ఏర్పాట్లు చేసారు. పిల్లలు అన్ని ఊళ్ళు వెళ్ళి రకరకాల వీడియో గేములు ఆడి విజయం సాధించారు. ఇదీ దోమలపల్లి పిల్లల విజయ రహస్యం.

*

**వృత్తిపరంగా, సామాజికంగా, కుటుంబపరంగా,**
**ఎన్నో కష్టనష్టాలకుకోర్చి పల్లెటూళ్ళలో**
**ఉపాధ్యాయులుగా, ఉపాధ్యాయినిలుగా పనిచేస్తున్న**
**గురువులందరకి నమస్కరిస్తూ...**

# తీరం చెమ్మగిల్లింది

**న్యూయార్క్ :**

"**సూ**ర్యంగారూ, మన కుమార్‌గారి విషయం మీకు తెలుసు కదా?"

"తెలుసండి. నేను వెళ్ళి వాళ్ళ కుటుంబ సభ్యులను పలకరించాను. ఇంత అకస్మాత్తుగా ఆయన పోతారనుకోలేదు"

"మీకు ఆయనతో ఎంత పరిచయమో నాకు తెలీదుకాని, ఆయిన చాలా మంచివారండి. అందరినీ కూడగట్టి మన తెలుగు వాళ్ళకి ఏడాది పొడవునా డిన్నర్లు ఇస్తూండేవారు"

"తెలుసండి రామయ్యగారు, నేను కూడా కొన్నిసార్లు వాళ్ళింట విందు భోజనం చేసినవాడినే"

"మీరూ చాలా ఏళ్ళుగా అమెరికాలో ఉంటున్నారు కదా అని ఫోను చేసాను"

"ఏమిటో చెప్పండి?"

"ఆయన చితాభస్మం ఇండియా పంపించాలండి. ఎలా పంపాలో మీకు ఏమైనా తెలుసా? పోస్టులోనా, కొరియర్‌లోనా..."

"చితాభస్మం.... అవును. ఫ్యూనరల్ హెూమ్ వాళ్ళు సీల్ చేసి ఇస్తారు. పోస్టాఫీసులో డెత్ సర్టిఫికెట్ చూపించి రిజిస్టర్డ్ పోస్టులో పంపవచ్చు. ఏ

పోస్టాఫీసులోనైనా వివరాలు ఇస్తారు. చాలా ఏళ్ల క్రిందట నేనొకసారి పంపాను. సవ్యంగానే అందింది”

“కుమార్ గారి బంధువులు హైదరాబాదులో ఉన్నారు. వాళ్ళకి పంపితే చాలుట. ఎన్ని రోజులు పడుతుందో చేరడానికి?”

“నేను విశాఖపట్నం పంపినప్పుడు ఇరవై రోజులు పట్టింది. మరి ఇప్పుడు ఇంకా తక్కువ సమయం పట్టవచ్చు. హైదరాబాద్ అయితే వారం లేదా పది రోజులు పట్టవచ్చు. ఇంకా వేగంగా చేరాలంటే ఫెడెక్స్ లేదా యుపిఎస్ వాళ్ళని అడగమనండి.”

“అవును, అలాగే చెబుతాను.”

“మంచిదండీ.”

**మరో అరగంటలో...**

“సూర్యంగారూ! వాళ్ళకి అంత తొందరేమీ లేదుటండి. అది సరేకానీ, మీరేమైనా ఇండియా వెళుతున్నారా వచ్చే రెండు మూడు వారాల్లో?”

“అవునండి. వచ్చే వారం వెళ్తానేమో. ఇంకా నిశ్చయం కాలేదు.”

“మరింకేం. మీరు ఆ చితాభస్మం తీసుకెళ్ళి వాళ్ళ చుట్టాలకి ఇవ్వగలరా?”

“..... సరే అలాగే”.

“చాలా థేంక్సండీ! ఉదయాన్నే వాళ్ళింటికి వెళ్లాను ఈ విషయాలు మాట్లాడాలని. చితాభస్మం తీసుకొని మరో గంటలో వస్తాను. మీరు ఇంట్లో ఉంటారా?”

“అలాగే”

**మరో గంట తరవాత...**

“సూర్యంగారూ, మీరు చాలా సులభంగా ఈ సమస్యని సాల్వ్ చేశారండి. చితాభస్మం ఈ డబ్బాలో చక్కగా సీల్ చేసి ఇచ్చారు ఫ్యూనరల్ హోమ్ వాళ్ళు. దీన్ని మీరు ఇలాగే తీసుకెళ్ళవచ్చు.”

"సరే చితాభస్మం నాతో తీసుకెళ్ళడానికి ఏ కాగితాలు కావాలో చెప్తాను, ఆ కాగితాలపై వాళ్ళ అబ్బాయితో కానీ ఆయన భార్యతో కానీ సంతకం పెట్టించి ఇమ్మనండి. ఆయన డెత్ సర్టిఫికెట్ కాపీ ఒకటి కూడా ఇమ్మనండి."

"సూర్యంగారూ ఐతే మీకు కావలసిన పర్మిషన్ లెటర్ మీరే డ్రాఫ్ట్ చేసి మెయిల్ చెయ్యండి. వాళ్ళతో దానిపై సంతకం పెట్టించి మీకు పంపమని చెప్తాను. ఇక వెళ్తాను. చితాభస్మం మీరు తీసుకెళ్ళడం పెద్ద సహాయమండి".

**మరో గంట తర్వాత...**

"సూర్యంగారూ! మీరు హైదరాబాదు వెళ్ళడం నిశ్చయం అయిందన్న మెసేజ్ అందింది. మీ ఫ్లైట్ వివరాలు, కాంటాక్టు ఫోను నెంబరు విన్నాను. మీ ఇండియా ఫోను నెంబరు, ఫ్లైట్ నెంబరు వివరాలు అన్నీ వాళ్ళ చుట్టాలకి ఇచ్చి, వాళ్ళ చుట్టాల కాంటాక్టు ఇన్ఫర్మేషన్ మీకు ఇవ్వమంటాను. వాళ్ళ చుట్టాలు ఎయిర్ పోర్టుకు వచ్చి మిమ్మల్ని కలుస్తారు. చితాభస్మం తీసుకొంటారు."

**మరో పావుగంట తర్వాత....**

"వాళ్ళ చుట్టాలు ఎయిర్‌పోర్టుకు రాలేరట. మీరు హైదరాబాద్‌లో ఎక్కడుంటారో చెపితే మర్నాడు వచ్చి తీసుకొంటారుట"

"దాందేముంది, మా డ్రయివర్‌కి ఇచ్చి వాళ్లింటికే పంపుతానులెండి"

"అదికాదండి, వాళ్ళు ఈ చితాభస్మాన్ని బయట లాకర్లోనో, స్టోరేజ్‌లోనో పెట్టాలనుకొంటున్నారుట"

"మీరు హైదరాబాదు చేరిన తరువాత మీ దగ్గరే ఉంచుకొంటే స్టోరేజ్ విషయం నిశ్చయం అవగానే మిమ్మల్ని కలిసి తీసుకొంటామన్నారు. వాళ్ళకి చితాభస్మం ఇంట్లో ఉంచుకోవడం ఇష్టం లేదుట. మంచిది కాదని వారి నమ్మకమట."

"నేను మా తమ్ముడింట్లో ఉంటానండి. మరి వాళ్లేమంటారో?"

"మరి ప్రాబ్లమేనే?"

"ప్రాబ్లెం ఏముందండి? ఇంట్లో ఉంచుకోవాలని లేకపోతే అదే రోజు తీసుకెళ్ళి నిమజ్జనం చేస్తే సరిపోతుంది కదా?"

"....... మళ్ళీ ఫోను చేస్తానండి"

**మరో పది నిముషాలలో....**

"అలా కుదరదటండి. వాళ్ళకి రిజర్వేషన్లు అంత తొందరగా దొరకవుట. రిజర్వేషన్లు దొరికినా శలవు దొరకదుట. కాబట్టి మిమ్మల్నే, మీకు తెలిసిన వాళ్ళ దగ్గరో లేదా ఓ స్టోరేజ్‌లోనో ఉంచి వాళ్ళకి ఇన్ఫర్మేషన్ ఇస్తే, వాళ్ళు వీలున్నప్పుడు నిమజ్జనానికి వెళ్లే ముందు దాన్ని తీసుకొని వెళతారుట."

"అలాగా... కాని నేను మా తమ్ముడింటిలో ఎలా ఉంచగలను. వాళ్లు ఉంచుకోమంటే ఏం చేసేది? సరికదా టెర్రరిస్టుల సమస్య ఉన్న ఈ రోజుల్లో అమెరికా నుంచి వచ్చి స్టోరేజ్‌లో ఓ సీలు చేసిన డబ్బా నేను పెట్టడం, ఇంకెవరో వచ్చి తీసుకోవడం చాలా రిస్క్."

"అవును. అదీ నిజమే. మరి మీరే ఏదో ఒక సలహా ఇవ్వండి"

"పోనీ ఏదో ఏర్పాటు చేశానే అనుకోండి. వాళ్ళ చుట్టాలు పితృకర్మలు నిర్వహించి నిమజ్జనం చేస్తారని మీకు నమ్మకం ఉందా?"

".........."

"ఇన్నిసార్లు వెనక్కి ముందుకు వెళుతున్న సంభాషణ ద్వారా వాళ్ళకి చితాభస్మం నిమజ్జనం చెయ్యడం మీద అంత ఇంట్రస్టు ఉందనుకోను."

".........."

"ఇంతెందుకు కుమార్‌గారి కొడుకుల్లో ఎవరో ఒకరు వెళ్ళి నిమజ్జనం చెయ్యవచ్చుగా"

"వెల్... ఆ పాజిబిలిటీ లేదండి. అందుకే మిమ్మల్ని సలహా అడుగుతున్నాం"

"నన్నా?"

"మీకు వీలయితేనే. మీకు ఇలాంటి పట్టింపులు లేవని మా అందరికి తెలుసు. మీకు అభ్యంతరం లేకపోతేనే..."

"నాకు పట్టింపులు లేవు కాని, అంత ఆస్థి ఉండి, ఉద్యోగాలు చేసుకొంటూ, బాగా సంపాదిస్తున్న పిల్లలుండి...."

"వెల్... మరి వాళ్ళకి ఆ సెంటిమెంట్ లేనట్లే కనిపిస్తున్నది."

"అయితే ఇండియాలో చితాభస్మం నిమజ్జనం చెయ్యాలన్నది ఎవరి ఉద్దేశం?"

"ఉద్దేశం కాదు. కుమార్ గారి కోరిక. తాను దేశం కాని దేశంలో తనువు చాలిస్తే భారతదేశంలో అదీ గోదావరిలో తన అస్థికలు కలపాలని కోరేవారు."

"......రామయ్యగారూ! కుమార్ గారి చితాభస్మం నేనే నిమజ్జనం చేస్తాను"

"మీరు చేసినట్లయితే ఆ కుటుంబానికి పెద్ద సహాయం చేసినవాళ్ళవుతారు. కుమార్ గారి ఆత్మకి శాంతి కలుగుతుంది. ఎంత ఖర్చు అయితే అంతా ఇస్తామంటున్నారు వాళ్ళు. ఒక బ్లాంక్ చెక్ కూడా సంతకం పెట్టి ఇచ్చారు మీకు ఇమ్మని."

"నాకు ఖర్చు ఇవ్వఖ్ఖర్లేదు. కుమార్ గారు నాకూ స్నేహితులే!"

"అలా కాదు. మీరు ఖర్చు తీసుకోవాలి. చితాభస్మం నిమజ్జనం చేసిన ఫలితం పుణ్యం ఏమైనా ఉంటే అది వాళ్ళ కుటుంబానికి, కొడుకులకి దక్కాలి కదా. అందుకని."

"........................."

"హమ్మయ్య! నెలరోజుల నుండి గుండెల మీద ఉన్న భారం తీరింది. కుమార్ గారి చితాభస్మం సవ్యంగా మీ చేతుల మీద గోదావరిలో నిమజ్జనం అయితే ఆయన ఆత్మ శాంతిస్తుంది." నిట్టూర్చారు రామయ్య గారు.

* * *

## నర్సీపట్నం

వెంగమాంబ ఎనభయ్యేళ్ళ వృద్ధురాలు. ఆమె భర్త చనిపోయి పదిహేను రోజులైంది. తన మరణం తరువాత చితాభస్మం అస్థికలను తన వాళ్ళు కాశీలోనో, గోదావరిలోనో కలుపుతారని, అప్పుడే తన ఆత్మకు శాంతి చేకూరుతుందని వెంకటశాస్త్రి గారు అనుకునేవారు. కాని తమ ఆర్థిక పరిస్థితి రానురాను క్షీణిస్తుంటే తన కోరిక నెరవేరుతుందో లేదోనని భార్య వెంగమాంబతో చెప్పి బెంగటిల్లి పోయేవారు. అంత్యక్రియలప్పుడు పురోహితుడు అస్థికలను గోదావరిలో కలపాలని చెప్పినప్పటి నుండి ఎలా జరుగుతుందని వెంగమాంబగారికి బెంగ పట్టుకుంది.

గుమస్తాగా పనిచేసిన భర్త గాంధేయవాది. వారికి పెద్దగా ఆస్తి లేదు. జీవితమంతా గాంధీ మార్గంలోనే నడిచిన వాడు. సత్యాగ్రహ కాలంలో జైళ్ళలో ఉన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని చదువుకు దూరమయ్యారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత సొంత ఊరు నర్సీపట్నంలోనే చిన్న గుమాస్తా ఉద్యోగంలో చేరారు. లంచాలకి దూరంగా, నిజాయితీకి అద్దంగా బ్రతికారు. చాలీచాలని జీతంతో గుట్టుగా సంసారం చేసేవారు. వెంగమాంబ సహాయంతో పిల్లలిద్దరికీ చదువు చెప్పించగలిగారు. అప్పట్లో డొనేషన్లు లేవు కాబట్టి ఒకర్ని ఇంజనీరింగులో, మరొకర్ని మెడిసిన్‌లో చేర్పించారు.

వారిద్దరు తెలివైన పిల్లలు. బాగా చదువుకునే వారు. ఇంజనీరింగ్‌లో చేరినవాడు మొదట కమ్యూనిస్టుల వెంట, ఆ తరువాత మావోయిస్టుల వెంట తిరిగి నక్సలైటై, చివరికి ఏమయ్యాడో తెలియదు. మెడిసిన్‌లో చేరిన కొడుకు చక్కగా చదివి, ప్రాక్టీసు పెట్టి, రెండు చేతులా ఆర్జించాడు. కాని కల్కిభగవాన్ భక్తిలో పడి ప్రాక్టీసు పాడుచేసుకొని, ఉన్న ఆస్తి అంతా పూజలు, పునస్కారాల కోసం, ఆ కల్కిభగవాన్ భక్తులకు కైంకర్యం చేసి వాళ్ళలో కలిసి, ఎక్కడికో పోయాడు.

సమాజాన్ని తూటాతో మార్చి స్వర్గం చేద్దాం అని ఒకడు, బాబాల భక్తితో స్వర్గం పొందాలని మరొకడు స్వార్థపరులై తల్లిదండ్రులను ఒంటరివాళ్ళని

చేసిపోయారు. భార్యాభర్తలిద్దరూ వాళ్ళకొచ్చే అతి కొద్ది పింఛన్‌తో జీవితం వెళ్లబుచ్చుతున్నారు.

వెంగమాంబకి పదో ఏట పెళ్లైంది. డెబ్భై ఏళ్ళ సహచర్యం. భర్త ఆరోగ్యం క్షీణిస్తూ, చనిపోతాడని తెలిసినా ఆమె నిబ్బరంగానే ఉండేది. ఎందుకంటే అతను చనిపోతే తాను బ్రతకలేదు. తాను కూడా అతనితో పాటే చనిపోతానన్న ధీమా ఆమెలో ఉండేది. కాని అతను చనిపోయి పదిహేను రోజులైంది. ఇంకా బ్రతికే ఉంది. వీధిలో ఉన్నవాళ్ళే చెయ్యవలసిన కర్మ అంతా చేసారు. పన్నెండో రోజుతో ఇంక తమపని అయిపోయిందని ఎవ్వరూ కనిపించలేదు.

తాను భర్తతోనే ఎందుకు పోలేదని ఆలోచించింది. మనసుకేమీ తట్టడం లేదు.

పెంకులు రాలిపోతే డబ్బులు లేక పూరికప్పు వేయించుకొన్న ఇంటి మధ్యలో చితాభస్మం, అస్థికలున్న పాత్రని ఒడిలో పెట్టుకుని ఆమె కూర్చొని ఉంది. ఆ పాత్రని ముట్టుకొంటే వేడిగా ఉంది. అది వేసవి ఎండల వల్లో, లేక ఆత్మ చల్లబడని భర్త చితాభస్మం వల్లో తెలియదు.

ఈ అసహనాన్ని భరించలేకుండా ఉంది. డెబ్భైయేళ్ళుగా కలిసి బ్రతికిన వ్యక్తి; ఎన్నో అనుభవాలను పంచుకొన్న వ్యక్తి; ఒక్క చూపుతో మనసులో పూల వానని కురిపించిన భర్త; ఒక్క పిలుపుతో జీవితకాలాన్ని కనురెప్పపాటుగా నడిపించిన సహచరుడు; ఏడడుగుల బంధాన్ని డెబ్భై వసంతాల కావ్యంగా మలిచిన వ్యక్తి; ఆగని అనుభూతుల కెరటాల సముద్రం; అభౌతిక ప్రేమని అతి సాధారణంగా, అందంగా ఆవిష్కరించిన ఆత్మ; ఆ సర్వస్వం ఈ పాత్రలో ఉందని తలుచుకోగానే వెంగమాంబ ఉద్వేగంతో ఆ పాత్రని మరింత గట్టిగా కౌగలించుకొని కన్నీరు కార్చింది.

ఇలా పదేపదే ప్రతిరోజూ జరుగుతుండడం చూసి, ఆత్మ శాంతించాలంటే చితాభస్మాన్ని అస్థికలని గోదావరిలో కలపడమే మార్గమన్నాడు పురోహితుడు. అలా చెయ్యడానికే తాను చనిపోలేదేమో అని అనిపించింది వెంగమాంబకు. పోనీ మనసు గట్టి చేసుకొని చితాభస్మాన్ని గోదావరిలో నిమజ్జనం చెయ్యాలన్నా

వెళ్ళడానికి కావలసిన బస్సు ఛార్జీలు లేవు. అక్కడ కర్మకాండలకి కావలసిన డబ్బులూ లేవు. ఆరోగ్యం చూస్తే ఏ మాత్రం బాగోలేదు. పైగా తనని తీసుకెళ్ళే వారెవరూ లేరు. ఎవరిని అడగాలో తెలీదు. తనతోబాటు వస్తారని నమ్మకం కూడా లేదు. ఇరుగు పొరుగు చెయ్యగలిగినంత సహాయం చేసారు. ఇంకా వాళ్ళని అడగడం బాగుండదు. ఇదే స్థితిలో రోజూ సతమతమవుతోంది వెంగమాంబ. చుట్టుపక్కల వాళ్ళ పిల్లలు వచ్చి కొద్దిసేపు కూర్చొని ఆమె చేత ఇంత తినిపించి వెళుతున్నారు. ఆమె కూడా వాళ్ళని అర్థం చేసుకుంది. తినడానికే వాళ్ళపై ఆధారపడడం వల్ల మరేమీ అడగలేకపోతోంది. కాని నిమజ్జన దృశ్యం ఆమె కళ్ళలో మసకగా కదలాడుతోంది. పిల్లలకి ఆమె కష్టం తెలుసు. వాళ్ళే కొంత డబ్బు పోగుచేసి తెచ్చి ఇచ్చారు. వెంగమాంబని రాజమండ్రి వెళ్లి చెయ్యవలసినది చెయ్యమన్నారు.

* * *

**రాజమండ్రి – కోటిలింగాల రేవు :**

'అస్మత్ మిత్రస్య, సుఖేన, పుణ్యలోకా వ్యాప్త్యర్థం, కోటిలింగ మహాక్షేత్రే, అఖండ గోదావరీ తీరే గంగాం భసి అస్థి నిమజ్జనం కరిష్యే!'

'నా మిత్రుడి సుఖం కోసం, పుణ్యలోకాలు కలగాలని కోటిలింగ మహా క్షేత్రంలో గంగనుండి వచ్చిన అఖండ గోదావరి తీరంలో అస్థికలు నిమజ్జనం చేస్తున్నాను' అని మొదలు పెట్టిన సూర్యం, ఓ రెండు గంటల సేపు కుమార్ గారి చితాభస్మాన్ని ఆయనకి చెయ్యవలసిన ఆఖరిదైన షోడశ (పదహారవ) కర్మ జరిపాడు.

"పరవస్తి మనుష్యాణాం గంగాతో యేషువ తిష్ఠతి తవాత్ వర్ష సహస్రాణి స్వర్గలోకే మహీయతీ.

దాని అర్థం ఏమంటే – ఏ మనుష్యుని యొక్క అస్థికలు గంగలో ఎంతకాలం ఉంటాయో అంతకాలం ఆ వ్యక్తి స్వర్గంలో ఉంటారు అని శాస్త్రం చెపుతున్నది" అంటూ పురోహితుడు ముగించాడు. తనకు పట్టిన చెమటలు

తుడుచుకుంటూ సంభావనల పేరుతో పోగేసిన ధాన్యం, డబ్బు సంచిలో వేసుకున్నాడు.

"అయ్యా మీరు ఇక ఈ చితాభస్మాన్ని తీసుకొని పడవలో వెళ్ళి గోదావరి మధ్యలో కలపాలి" అన్నాడు అపరకర్మ చేసే పురోహితుడు, నీళ్ళలో ఉన్న పడవను చూపిస్తూ.

"అలాగే చేద్దాం" అన్నాడు సూర్యం పడవ వైపు నడుస్తూ.

"అయ్యా నాదో చిన్న మనవి..." సంశయిస్తూ అన్నాడు అంత్యేష్టి నిర్వహించిన పురోహితుడు.

"చెప్పండి"

"అటు చూడండి..." అని మెట్ల మీద కూర్చొని ఉన్న ముసలామెని చూపాడు. "ఆమె ఎనభైఏళ్ళ పైబడ్డ వృద్ధురాలు. పైగా దస్సిపోయింది. భర్త అస్థికలను గోదావరిలో నిమజ్జనం చెయ్యాలని నర్సీపట్నం నుండి ఒంటరిగా వచ్చింది. వచ్చినప్పటి నుండి మంచినీళ్ళు కూడా ముట్టలేదు. ఆమెకి పిల్లలు లేరు. డబ్బులు లేవు. ఇక్కడదాకా ఎలాగో వచ్చింది. ఒంటరిగా ఎలా రాగలిగిందో ఆశ్చర్యమే. నేను అతి తక్కువలో కర్మ ముగించాను. కాని నదిలో అస్థికలు కలపడానికి పడవ ఎక్కాలి. సాధారణంగా ఇందుకోసం పడవవాడు వంద రూపాయలు తీసుకొంటాడు. నేను ఎంత చెప్పినా వాడు నా మాట వినడు. మీరు ఒప్పుకొంటే ఆమెను మనతో పాటు అదే పడవలో తీసుకెళ్ళి ఆమె భర్త అస్థికలను కూడా...." అంటూ ఆమె కథను వివరించాడు.

"అయ్యో! తప్పకుండా. ఆమెని రమ్మనండి...."

అప్పుడే గోదావరిలో స్నానం చేసిన తడి బట్టలతో, నీరు కారుతున్న జుత్తుతో, జీవమంతా కళ్ళలో మాత్రమే మిగిలి ఉన్న ఆ ముదుసలి ఆకులు రాలిన వృక్షంలా అనిపించింది. వణికే చేతులతో చితాభస్మం ఉన్న ఇత్తడి పాత్రని ఆమె తన సర్వస్వంగా పట్టుకొన్నది.

పురోహితుని కేక విని తడబడి, లేచి నిలబడే ప్రయత్నం చేసింది. ఆమెను పడవపైపు నడవమని చేత్తో సూచించాడు. పురోహితుని సహాయంతో వృద్ధురాలు, ఆ తరువాత సూర్యం పడవ ఎక్కారు.

పడవ తీరం నుండి దూరంగా మెల్లిగా సాగుతోంది, పురోహితుని మంత్రాల మధ్య, పడవ వాడు వేసే తెడ్డుతో పడవ గోదావరి మధ్యకు చేరింది. ఆ వృద్ధురాలి చూపు, ఆమె ఆ పాత్రని పట్టుకొన్న తీరు చూస్తే ఆమె భర్త అస్థికల చితాభస్మాన్ని గుండెలకు హత్తుకున్నట్లనిపిస్తుంది.

కుమార్ గారి చితాభస్మాన్ని సూర్యం మొదట గోదావరిలో కలిపాడు. ఆ తదుపరి పురోహితుడు వృద్ధురాలిని ముందుకు తీసుకెళ్ళి ఆమె తెచ్చిన పాత్రలోని చితాభస్మాన్ని, అస్థికలను మంత్రాల మధ్య నిమజ్జనం చేయించాడు.

"ఇంతటితో ఈ నిమజ్జన కర్మ ముగిసింది" అని పురోహితుడు ఇద్దరిని చూసి అన్నాడు. పడవ వాడివైపు తిరిగి "ఒడ్డు చేర్చవోయి" అన్నాడు.

తిరిగొస్తున్న పడవ నిండా నిశ్శబ్దం. గోదావరి మీద గాలి వీస్తున్నది. పడవ నడిపేవాడు తెడ్డు వేస్తున్నాడు. తెడ్డు గోదావరి నీటిని తాకే శబ్దం మాత్రమే స్పష్టంగా వినపడుతున్నది. ఆమె ఎలాంటి కదలిక లేకుండా నిశ్శబ్దంగా ఉంది. ఆమె ముఖంలో సంతృప్తి కనిపిస్తోంది.

"పిల్లలు లేరని మీరు విచారించకండి. అమెరికాలో భార్యాపిల్లలు, డబ్బు అన్నీ ఉన్న ఒకాయన చితాభస్మాన్ని నిమజ్జనం చెయ్యడానికి ఆయన మిత్రుడైన ఈ సూర్యంగారు అక్కడ నుండి ఇక్కడికొచ్చారు..." అని సూర్యం గురించి చెపుతూ ఆమెని ఊరడించే ప్రయత్నం చేస్తున్నాడు.

ఓ మనిషి చనిపోయిన తరువాత, ఆ మనిషి చితాభస్మానికి వారి కుటుంబ సభ్యులు ఎంత గౌరవం ఇస్తారు? ఆ మనిషి ఆత్మకి, అస్థికలకు చెయ్యవలసిన అపరకర్మకి ఎంత ప్రాధాన్యం ఇస్తారు? పుణ్యం, స్వర్గ నరకాల మీద నమ్మకం ఉన్నా లేకపోయినా అప్పటి దాకా కలిసి మెలిసి తిరిగిన వ్యక్తి ఒక్కసారి మాయమైపోయి చితాభస్మంగా మిగిలితే ఆ చితాభస్మం విలువేంటి? – ఇలాంటి ప్రశ్నలతో సూర్యం మనసంతా గందరగోళంగా ఉంది.

మరణించిన వారి చివరి కోర్కె తీర్చడం బతికున్నవాళ్ల మొదటి విధి కావడం ఒక మానవీయ అనుబంధం.

"అమ్మా! మీ ఆయన షోడశకర్మని చేయించారు" అని సూర్యాన్ని చూపిస్తూ "ఈయన దయవల్ల గోదావరీ నిమజ్జనం కూడా అయ్యింది. మీ భర్త ఆత్మ శాంతిస్తుంది, స్వర్గం పొందుతారు. ఇక మీరు ప్రశాంతంగా ఉండండి" అన్నాడు.

పడవ తీరంవైపు సాగుతున్నది. పురోహితుడు మాట్లాడుతూనే ఉన్నాడు.

"ఇన్నేళ్ళ నా అనుభవంలో ఎంతోమందిని చూశాను. మనిషి పుట్టుక నుండి పోయేదాకా జరగవలసిన పదిహేను కర్మలు ఆ తరువాతది ఆఖరిది అయిన ఈ షోడశకర్మతో సహా ఎన్నో కార్యక్రమాలు చేయించాను. కానీ మీవంటి వారిని ఇప్పటి దాకా చూడలేదు. మిమ్మల్ని కలవడం నా భాగ్యం. మనిషి చనిపోయినా ఆత్మ ఉంటుందని, అది వినాశనం పొందదని, దానిని ప్రేమించగలరని, దానితో స్నేహం చెయ్యగలమని నమ్మిన మీ ఇద్దరూ ధర్మశాస్త్రాలను ఆచరించి అనుసరణీయులైనారు" అని చేతులెత్తి నమస్కారం చేసాడు ఇద్దరికి.

ఆమె తలెత్తి సూర్యం కళ్ళల్లోకి చూసింది. ఆమె చూపులతోనే ఏదో చెప్పాలనుకుంది.

సూర్యం ఆమె కళ్ళల్లోకి చూసాడు. సూర్యం ఒళ్ళంతా ఒక్కసారి ఝల్లుమన్నది.

ఆమె వంగి అతనికి నమస్కరించబోయింది. అతను ఆమెను తన రెండు చేతులతో పట్టుకొని వారించాడు. ఆమె శరీర ప్రకంపనలు అతని శరీరంలో ప్రవహించాయి. ఎన్నడూ కలగని ఒక వింత ప్రవాహం ఒళ్ళంతా పాకింది. అది హృదయాన్ని తాకింది. ఒక ఆత్మీయ బంధాన్ని నాటింది. రెండు కన్నీటి చుక్కలు అతని చేతుల మీద పడ్డాయి. అతను చలించిపోయాడు. ఆమెను మరింత దగ్గరగా తీసుకొన్నాడు.

సూర్యం పడవ మధ్యలో ఉన్న బల్లపై కూర్చుంటూ ఆమెని జాగ్రత్తగా పట్టుకొని తన పక్కన కూర్చొనేలా చెయ్యడానికి ఎంతో ప్రయత్నించాడు. చివరికి ఆమె అతడి ఒడిలో ఒరిగిపోయింది.

పడవ తీరంవైపు కదులుతోంది. పురోహితుడు అతడినీ ఆమెనీ చూస్తూ అవాక్కయ్యాడు.

ఆ నలుగురూ పరిసరాల్ని మరిచిపోయారు. ఆ నలుగురూ నాలుగు పాయలుగా విడిపోయి, మళ్లీ కలిసి ప్రవహిస్తున్న ఓ నదిలా, గోదావరిపై సాగుతున్నారు.

పురోహితుని కళ్ళు చెమ్మగిల్లాయి. పడవ నడిపేవాడి కళ్ళు చెమ్మగిల్లాయి. తెడ్డు చెమ్మగిల్లింది.

పడవ చెమ్మగిల్లింది. చెమ్మగిల్లిన పడవ తీరం చేరింది. తీరం చెమ్మగిల్లింది.

*

**మా ప్రవాసాంధ్ర జీవితంలో నాకు గురువు సమనులైన శ్రీ దామ వెంకయ్య గారికి నమస్కరిస్తూ...**